సుందరయ్య శత జయంతి ప్రచురణ

ఇంగ్లీషు వ్యాసాల, ప్రసంగాల అనువాదం

**వి.ఆర్. బొమ్మారెడ్డి**


**కళాజ్యోతి ప్రింటర్స్, హైదరాబాద్**

వారి సౌజన్యంతో ప్రచురణ

**సుందరయ్య విజ్ఞానకేంద్రం**

1-8-1-బి/25/ఎ, బాగ్‌లింగంపల్లి

హైదరాబాద్-500044, ఫోన్ : 040-27667543

ప్రథమ ముద్రణ : ఆగస్టు, 2012

వెల : ₹ 50

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు


# పుచ్చలపల్లి సుందరయ్య

## రచనల సంకలనం

సుందరయ్య విజ్ఞానకేంద్రం

# విషయసూచిక


| | |
|---|---|
| మనవి | 5 |
| **విశాలాంధ్రలో ప్రజారాజ్యం** | |
| మొదటి అధ్యాయం | 9 |
| రెండవ అధ్యాయం | 11 |
| మూడవ అధ్యాయం | 19 |
| నాలుగవ అధ్యాయం | 45 |
| ఐదవ అధ్యాయం | 59 |
| ఆరవ అధ్యాయం | 73 |
| **గ్రామీణ పేదలు - భూపంపకం** | |
| ఉపోద్ఘాతం | 90 |
| జనతా ప్రజాస్వామ్యానికి ఇరుసు వ్యవసాయిక విప్లవం | 93 |
| గ్రామాలలో వర్గ విభజన | 97 |
| కాయకష్టం చేయని చిన్న భూకామందులు భూస్వాములు కారు | 100 |
| భూ పంపకం : దాని కీలక ప్రాముఖ్యత | 103 |
| కౌలు దోపిడీ ఎలా రద్దు అవుతుంది? | 107 |
| వ్యవసాయ కార్మికుల నికృష్ట పరిస్థితి : వారిపై జరిగే దోపిళ్ళు : వారి పోరాట నినాదాలు | 113 |
| భూమిపై హక్కు దున్నేవానిదే - భూస్వామిది కాదు | 123 |
| జమీందారీ యుగం నాటి దోపిడీ పద్ధతులు నేటికీ చాలా ప్రముఖంగానే వున్నాయి | 129 |
| కుల మత భేదాలను అధిగమించి కష్టజీవులంతా ఒకటిగా నిలబడాలి | 135 |
| గ్రామాలలో ప్రజాస్వామ్యం బ్రతకాలంటే భూస్వామ్య విధానం రద్దు కావాలి | 137 |
| భూపోరాటానికి ఐక్య సంఘటన | 139 |





| | |
|---|---|
| **ప్రజారంగాలు - సంఘాలు రాజకీయ, సాంస్కృతిక వ్యాసాలు** | |
| ప్రజా సంఘాలు - పార్టీ నిర్మాణం | 146 |
| యువజనులు - రాజకీయాలు | 161 |
| విప్లవపథంలో విద్యార్థి ఉద్యమం | 181 |
| గంగా - కావేరి కాలువ నిర్మాణ పథకం | 215 |
| ఆంధ్రసాహిత్యంలో కొత్త పోకడలు - విమర్శ | 225 |
| "మాభూమి" నాటకంపై సుందరయ్య | 232 |
| భాషా సమస్యపై | 233 |
| హోంమంత్రి నందా నిందా ప్రచారానికి సుందరయ్యగారి జవాబు | 251 |
| **చట్టసభల్లో ప్రసంగాలు** | 271 |

# మనవి

కమ్యూనిస్టు మహా నాయకుడు, ప్రజా ఉద్యమాల నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ముఖ్య రచనల సంకలనం ఇది. వివిధ విషయాలపై కూలంకషంగా అధ్యయనం చేసిన విజ్ఞానఖని మాత్రమే కాక నిష్కళంక ప్రజా జీవితం గడిపిన విశిష్ట విప్లవకారుడాయన. దేశ రాష్ట్ర భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎలాంటి విధానాలు అనుసరించాలన్న దానిపై ఆయనకు నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. వాటిని సందర్భోచితంగా రచనల ద్వారా, రాజకీయ తరగతుల ద్వారా, ప్రసంగాల ద్వారా తెలియజేశారు. వాటిలో ఎంపిక చేసిన కొన్ని కీలక రచనలు ఇందులో పొందుపర్చబడ్డాయి. గతంలో ఏరిన రచనల పేరుతోనూ, కొన్ని విడిగానూ వెలువడినప్పటికీ అందరూ కోరుకునే కొన్ని ముఖ్యమైన రచనలను ఇందులో ఇచ్చే ప్రయత్నం చేశాము.

* 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' చారిత్రిక ప్రాధాన్యత గల రచన. తెలుగు ప్రజల సర్వతోముఖాభివృద్ధికి, సమైక్యతకు పథ నిర్దేశం చేసిన తొలి సమగ్ర దృక్పథం అందులో చూస్తాం. కమ్యూనిస్టుల సామాజిక దృక్పథం ఎంత లోతైనదో కూడా తెలుస్తుంది. అదే సమయంలో సుందరయ్య అపారమైన అధ్యయనం, దూరదృష్టి కూడా బోధపడతాయి. ప్రాంతాలవారి ఉద్యమాలతో పాలక పక్షాల రాజకీయ క్రీడలు పరాకాష్టకు చేరిన నేటి తరుణంలో ఇది ప్రత్యేకించి పఠనీయం. ఈ పుస్తకం ముఖచిత్రం అప్పట్లో మా. గోఖలే రూపొందించారు.

* 'గ్రామపేదలు – భూ పంపకం' సుందరయ్యకు భూ సమస్యపై గల పట్టును తెల్పుతుంది. స్వయంగా క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి సర్వే జరిపి ఆయన చేసిన ఈ రచన భూ సమస్యపై అవగాహనకు కరదీపిక.



* 'ప్రజా సంఘాలు – పార్టీ నిర్మాణం యువజనలు రాజకీయాలు, విప్లవ పథంలో విద్యార్థి ఉద్యమం' ఇవన్నీ ఆయా తరగతుల ప్రత్యేక సమస్యలనూ అక్కడ పనిచేసేప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను చేపట్టవలసిన అంశాలనూ తెలియజేస్తాయి. నూతన తరాలకు ఉత్తేజ మిస్తాయి. అవిభక్త కమ్యూనిస్టు పార్టీపైన, ఆ తర్వాత కాలంలో సిపిఐ(ఎం) పైన సాగిన విషప్రచారాలను ఆయన శక్తివంతంగా తిప్పికొట్టడం కూడా చూస్తాం.

* 'సాహిత్య రంగం, గంగా కావేరి కాలువ, భాషా సమస్య వ్యాసాలు' ఆయా రంగాలకు సంబంధించిన సాధికారిక అవగాహనకు మార్గదర్శకాలవుతాయి.,

* 'రాజ్యసభలో శాసనసభలో చేసిన ప్రసంగాలు' ఆయన ప్రగాఢమైన అధ్యయనానికి నిదర్శనాలే గాక ఈ సమస్యలను పరిశీలించేందుకు కరదీపికలు కూడా.

ఈ వ్యాసాలలోని లెక్కలు మారినా, జాతీయ అంతర్జాతీయ మార్పులు సంభవించినా ఒకటి రెండు విషయాల్లో సైద్ధాంతిక మార్పులు వున్నా మౌలిక పాఠాలు దాదాపుగా ఇప్పటికీ వర్తించేవే. అనేక రంగాలలో పాలకుల వైఖరులు తలక్రిందులుగా మారాయని, మరికొన్ని రంగాల్లో ఆదినుంచి వస్తున్న విమర్శలను పెడచెవిని పెట్టి వారు అవే అస్తవ్యస్త విధానాలు అమలు చేయడం వల్లనే పరిస్థితులు ఇంతకు దిగజారాయని మనకు స్పష్టమవుతుంది. కొన్ని విషయాల్లో విధాన రూపకల్పనలో కమ్యూనిస్టుల ప్రభావం ప్రేరణ ఎంత బలంగా పనిచేశాయో తెలుస్తుంది. అందుకే ఈ పుస్తకం కేవలం కమ్యూనిస్టు కార్యకర్తలే గాక విషయ పరిజ్ఞానం పెంచుకోవాలనుకునే అధ్యయనశీలులందరికీ అవశ్య పఠనీయం.

వీటిలో పలు వ్యాసాలు, ప్రసంగాలు లోగడ వి.ఆర్. బొమ్మారెడ్డి సంకలనం చేశారు. అవీ, ఇతరమైనవీ కలగలిసిన, సంక్షిప్తపరచిన సరికొత్త రూపమే ప్రస్తుత ప్రచురణ. ఆయన రచనలు మరికొన్ని సులభంగా అందుబాటులోకి తెచ్చే కృషి కొనసాగించగలమని మనవి.

***సుందరయ్య శత జయంతి సందర్భంలో ఇది ఒక వినమ్ర నివాళి***


**– సుందరయ్య విజ్ఞానకేంద్రం**

# విశాలాంధ్రలో ప్రజారాజ్యం



పుచ్చలపల్లి సుందరయ్య





# మొదటి అధ్యాయం

తెలుగు తేజము దీప్తిజెందగ తెలుగు వెలుగులు దిశలనిండగ
తెలుగుతల్లిని గొలువ దీక్షతో తరలిరావోయ్ తమ్ముడా

జీవనదులౌ కృష్ణ గౌతమి శ్రీపినాకిని తుంగభద్రలు
కులనగంబుల పగిది నొప్పెడు నల్లమలలును పాపికొండలు
ఘనవనంబులు గనులు మిక్కిలి గణుతిగాంచిన యోడరేవులు
మేల్మి బంగరు తెనుగు తల్లికి మేని భూషలు తమ్ముడా

శకపురుషుడౌ శాలివాహను, శౌర్య సాహసులు చాళుక్యుల,
కాకతీయుల కదనతలముల కృష్ణరాయల జైత్రయాత్రల
అరిభయంకరులై, నిపుణులై అసమసాహస మెసగ వైరుల
గసిమసంగిన తెలుగు వీరుల ఘనత పాడరా తమ్ముడా

సిద్ధనాగార్జునుని కొండ ప్రసిద్ధి పొందిన బౌద్ధశిల్పము
అమరకీర్తి విరాజితం బమరావతీ స్థూపాల శిల్పము
సరిగమల క్రమమెడలకుండగ స్వరము పలికెడు హంపి శిల్పము
తెలుగు శిల్పకళా ప్రపూర్ణత తెలుపుచున్నవి తమ్ముడా

ఆంధ్రభారత గ్రంథ రచనా పండితుడు తిక్కన కవీంద్రుడు
మేటి తంబురమీటి రాగము లాలపించిన త్యాగరాజును
సరళ పదములజేర్చి ముత్యపు సరులు గూర్చిన అప్పరావును
తెలుగు సాహిత్యంపు పట్టులతేనె జేర్చిరి తమ్ముడా

**- ముక్కామల నాగభూషణం**

ఆంధ్ర ప్రజల చరిత్ర చాలా ప్రాచీనమైనది. 3000 సంవత్సరాల క్రితమే మన ఆంధ్రజాతిని గూర్చి ప్రాచీన పుస్తకాలలో ఉదహరించబడి ఉంది. బుద్ధుడు, అశోక చక్రవర్తుల కాలానికే ఆంధ్రుల రాజ్యం చాలా బలిష్టంగా ఉండేది. కోటగోడలతో కూడిన పట్టణాలు, వర్తక వ్యాపారాలతో అభివృద్ధి చెందుతూ వచ్చాయి. బౌద్ధమతాన్ని, విజ్ఞానాన్ని ఒక్క తెలుగు దేశములోనే గాక ఇండోనేషియా దీవులకు, సయాం, కంబోడియాలకు కూడ తీసుకువెళ్లాం. 1867 సంవత్సరాల క్రితం శాలివాహన చక్రవర్తి కాలంలో మన దేశం మీదికి విరుచుకుపడ్డ శత్రు దాడులను మన ప్రజలు అరికట్టారు. విజయ సూచకంగా శాలివాహన శకాన్ని, మన ఆంధ్ర శకాన్ని సామ్రాజ్యంతోను వర్తక వ్యాపారం ఆంధ్రులము సాగించేవారము. ఆ కాలపు



రోమను నాణ్యములు ఆంధ్రలో అనేక స్థలములలో దొరికాయి. మన ఓడలు మోటుపల్లి, ముఖలింగం మొదలగు రేవుల నుండి బయలుదేరి సముద్రాలను దాటి వర్తక వ్యాపారాన్ని, విజ్ఞానాన్ని యితర దేశాలకు తీసుకువెళ్తూ ఉండేవి. ఆ రోజులలోని ఆంధ్రుల గొప్పతనం, విజ్ఞాన చిహ్నాలు అమరావతి, జగ్గయ్య పేటలలోని బౌద్ధ స్థూపాలలో నేటికీ కనబడుతూవుంది. ఘంటశాల, నాగార్జునుని కొండ, ఎల్లోరా శిల్పాలు, అజంతా చిత్తరువులు మన విజ్ఞానాన్ని, గొప్పతనాన్ని నేటికీ జ్ఞప్తికి తెస్తున్నాయి. 1500 సంవత్సరాల క్రితం పల్లవులు, చాళుక్యుల రాజ్యకాలంలో మన ప్రజల కళా నైపుణ్యాన్ని నెల్లూరు, కంచి, మహాబలిపురం, వేంగి శిల్పాలలో నేటికీ చూడవచ్చు. కాకతీయ శిల్పాలు వరంగల్లులోను, రాయలనాటి శిల్పం హంపీ కట్టడాలలోను నేటికీ విజ్ఞానాన్ని చాటుతున్నాయి.

వేయి సంవత్సరాల క్రితం రాజరాజనరేంద్రుని కాలంలో నన్నయ మహాభారతాన్ని తెలుగులో రాశాడు. తిక్కన పండితుడు నెల్లూరు మనుమసిద్ధి ఆ స్థానంలో నన్నయ్య ముగించని 15 పర్వాలు ముగించాడు. తెలుగు భాష, తెలుగుదేశంలోని వివిధ తెగల భాసల నుండి, ప్రాకృతం నుండి అభివృద్ధి చెందుతూ వచ్చింది. మహాభారతం రాయడానికి ముందే మనభాష చాల అభివృద్ధి చెందినది. కాని భారతావనికి ముందున్న ఆంధ్ర గ్రంథాలు నశించాయి. దొరకడములేదు. ఇప్పుడు మనకు దొరికిన తెలుగు భాషా పుస్తకాలలో మొదటిది, తరువాత మన కవులకు, పండితులకు దారి చూపించింది. మన ప్రజల నిత్య జీవితంలో పారాయణం చేసే ఉద్గ్రంథం గాబట్టి, మహా భారతాన్ని ఆదికావ్య మంటున్నాం. బమ్మెర పోతన భాగవతం నేటికీ ప్రజలను ఆకర్షిస్తూ వుంది. శ్రీనాథుడు, కృష్ణ దేవరాయల ఆస్థాన పండితులు, అల్లసాని పెద్దనలాంటి పండిత కవులు తెలుగుభాషలో ప్రబంధ రచనలను చేశారు. బద్దె భూపాలుడు, పాల్కురికి సోమనాథుడు మొదలు వేమన, వీరబ్రహ్మం వరకు సంఘ సంస్కర్తలు మన ప్రజలలో చైతన్యం కలిగించడానికి ప్రజలకర్ధమయ్యేటట్లు పద్యాలలోను, గేయాలలోను రాసిన ప్రజా సాహిత్యం మనకు కొల్లలుగా ఉంది.

తెలుగు సంగీతమెంతో అభివృద్ధి చెందింది. కర్నాటక సంగీతానికి పునాదులు వేసిన వాడు కాకతీయ కాలపునాటి సొరంగ దేవరాయలు. త్యాగరాజు భక్తిగేయాలు కర్నాటక సంగీతానికి పరిపూర్ణ వికాసం కల్గించాయి. దక్షిణ భారత దేశమంతటా, త్యాగరాజు కీర్తనలు సంగీతానికి ఓనమాలయ్యాయి. మొల్లలాంటి కవయిత్రులు, రుద్రమదేవిలాంటి రాజకీయ పరిపాలనా దక్షులు, మాంచాలలాంటి వీరవనితలు తెలుగు స్త్రీలను ముందుకు నడువ మంటున్నారు. వేలకొలది సంవత్సరాలుగా అభివృద్ధి చెందుతూ వచ్చిన మన తెలుగు ప్రజలు, కాపు, కమ్మ, రెడ్డి, గౌరవకళింగ, శెట్టిబలిజ, గౌడ, యాదవ మొదలగు వ్యవసాయకులు, పద్మశాలీ, దేవాంగ, తొగటి, కర్ణకారీ మొదలగు చేనేత పారిశ్రామికులు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, రజకులు, అగ్నికుల క్షత్రియులు, విశ్వ బ్రాహ్మణులు మొదలగు వృత్తిదారులు, వైశ్యులు, బ్రాహ్మణులు, ఆదిమాంధ్రులము అందరం కలిసి ఒక తెలుగుజాతి అనే చైతన్యంతో ఒక తెలుగు రాజ్యాన్ని ఏర్పరచుకోక ముందే మనదేశం, దాదాపు 200 సంవత్సరాల క్రితం ఇంగ్లీషు సామ్రాజ వాదుల చేతుల్లో పడింది. 1766లో నైజాం నవాబు కోస్తా జిల్లాలను ఇంగ్లీషువారికి వశం చేశాడు. దీనికి ప్రతిఫలంగా మిగిలిన తెలుగుదేశంపైనా, నైజాం క్రింద ఉన్న కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలపైనా, నైజాం నిరంకుశ పరిపాలనాన్ని కాపాడుతామనీ ఇంగ్లీషు ప్రభుత్వం హామీ ఇచ్చింది.

# రెండవ అధ్యాయం

కల్లోల గౌతమీ వెల్లువల కృష్ణమ్మ
తుంగభద్రాతల్లి పొంగి పారిన చాలు
ధాన్యరాసులె పండుదేశాన
కూడు గుడ్డకు కొదువ లేదోయ్

పసిడి పాతరనీది పరుల నోరూరె నోయ్
నీలో నీకే పెట్టి నెత్తి చేయెట్టారు
దేశాన్ని దిగమింగి పోయినారోయ్
మోసాన్ని గుర్తెరిగి కాపాడవోయ్

ఉత్తరాదీ మొదలు దత్తమండల మంత
తెలంగాణ ప్రాంతములో చెలిమి గలిగించాలి
కలసి మెలసి నేడు పోవాలోయ్
కలిమి బలము గూర్చుకోవాలి

ముక్కోటి బలగమోయ్ ఒక్కటై మనముంటే
యిరుగు పొరుగులోన వూరు పేరుంటాది
చేయెత్తి జైకొట్టు తెలుగోడా
జై కొట్టి మేల్కొలుపు తెలుగోడా --

- శ్రీ కృష్ణ



## జన్మభూమి ఛిన్నాభిన్నమైనది

తెలుగుదేశం నేడు ముక్కలు ముక్కలైవుంది. ఇంగ్లీషు ప్రభుత్వం క్రింత మద్రాసు రాజధానిలో కోస్తా, రాయలసీమ జిల్లాలు 11 ఉన్నాయి. వీని వైశాల్యం 67 వేల చదరపు మైళ్ళు. రెండు కోట్ల మంది తెలుగు ప్రజలు నివసిస్తున్నారు. మరి 9 జిల్లాలు నైజాం క్రింద 44 వేలు చదరపు మైళ్లు విస్తీర్ణంతో ఉన్నాయి. దీనినే తెలంగాణా అని అంటాం. దీనిలో 90 లక్షల ప్రజలు నివసిస్తున్నారు. మరికొన్ని లక్షల మంది తెలుగు ప్రజలు మనకు ఆనుకునే మైసూరు సంస్థానంలోను, ఒరిస్సా సరిహద్దులలోన, మధ్య పరగణాలలోను నివసిస్తున్నారు. మన ప్రజలు ఇంగ్లీషు నిరంకుశ పాలన క్రింద, దాని తాబేదారులైన నైజాం నవాబు, మైసూరు మహారాజాల క్రింద నలిగిపోతున్నారు. ఇంగ్లీషు ప్రభుత్వం ఈ నవాబులు, మహారాజులు ప్రజలపై తమ నిరంకుశ ప్రభుత్వాన్ని సాగించడానికి పరస్పర సహాయం చేసుకుంటూ వుంటారు. 1857లో ఇంగ్లీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మన దేశంలో వచ్చిన తిరుగుబాటును అణచివేయడానికి నైజాం సేనలు ఇంగ్లీషు ప్రభుత్వానికెంతో తోడ్పడ్డాయి.

ఇంగ్లీషు ప్రభుత్వం, దాని తాబేదారులైన నైజాము, మైసూరు రాజుల క్రింద గత రెండు వందల సంవత్సరాలుగా మన ప్రజలు బానిసలై ఉంటున్నారు. మన జన్మభూమి ముక్కలు ముక్కలైపోయింది. మన ఆర్థిక సంపదంతా ధ్వంసమైంది. మన రైతులు, కార్మికులు మన ప్రజలంతా దారిద్ర్యంతో కరువు కాటకాలకు గురయ్యారు. తెలుగుదేశములో తిండి దొరకక బర్మా, దక్షిణాఫ్రికాలకు వలసబోయారు. అష్టకష్టాలకు గురి అవుతూ ఉన్నారు. బొంబాయి, కలకత్తా పట్టణాలకు పని వెతుక్కుంటూ వెళ్తున్నారు. అక్షరజ్ఞానం కూడా లేకుండా అజ్ఞానంలో మునిగిఉన్నారు.

## జమీందారీ దోపిడీ

ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు, మన రైతులను తమ గుప్పిటిలో ఉంచుకొని శిస్తులు, పన్నులు గుంజుకోడానికి జమీందారులను తయారు చేశారు. ఇంగ్లీషువాళ్లు రాకముందు పన్నులు వసూలు చేస్తున్న వారినందరినీ, ఇంగ్లీషు ప్రభుత్వం జమీందారులుగా చేసివేసింది. అంతకుముందు రైతుల నుండి పన్ను వసూలు చేసి పైకి పంపడం వీరిపని. భూమిపై వీరికెట్టి అధికారమూ ఉండేది కాదు. భూమిపై సర్వాధికారం రైతులదే. కాని ఇంగ్లీషు ప్రభుత్వం భూమినంతా జమీందారులదిగా లెక్కలేసింది. జమీందారులు తాము వసూలు చేసిన పన్నులో కొంతభాగాన్ని తమకిస్తే చాలు. పొలాన్ని సాగుచేసే రైతాంగంపై జమీందారులు తమకిష్టం వచ్చినంత పన్ను మగతాలు వసూలు చేసుకోడానికి అవకాశమిచ్చింది. ఈ రీతిగా ఈ జమీందారీ తాబేదార్లను, మన ప్రజలపై తన అధికారాన్ని చెలాయించడానికి మద్దతుగా ఇంగ్లీషు ప్రభుత్వం తయారు చేసుకుంది.

ఇంగ్లీషువారి ప్రత్యక్ష పరిపాలనలో ఉన్న కోస్తా జిల్లాలలో 80 మంది జమీందారులే సంవత్సరానికి 85 లక్షల రూపాయల నికరాదాయం రైతుల నుండి శిస్తు రూపంగా వసూలు చేసుకుంటున్నారు. ఈ లెక్కలు వారు చెప్పినవే. దీనికి కనీసం రెండింతలైనా వసూలు చేస్తున్నట్లు అందరికీ తెలిసిన చిదంబర రహస్యమే! ఈ 85 లక్షల రూపాయలలో నూటికి 90 పాళ్లు దాదాపు 76 లక్షల రూపాయలు కేవలం 24 గురు జమీందార్లు భుక్తం చేసుకుంటున్నారు!

ఇంగ్లీషు ప్రభుత్వం లాగే, దాని తాబేదారు నైజాం నవాబు కూడ తన పరిపాలనలోని రైతులపై అధికారం చెలాయించడానికి జాగీరుదార్లు, పాయిగాలకు సర్వాధికారాలిచ్చాడు. రివిన్యూ, సివిలు, క్రిమినలు కోర్టు అధికారాలు కూడా ఈ జాగీర్దార్లకున్నాయి. నైజాం సంస్థానంలోని ఐదింట రెండుపాళ్లు (నూటికి 42 పాళ్లు) భూమి ఈ జాగీర్దార్ల పెత్తనం క్రింద ఉంది. ప్రతి సంవత్సరం 110 మంది జాగీర్దారులు 6 కోట్ల రూపాయలు రైతుల నుండి వసూలు చేస్తూ ఉన్నారు. ఇందులో ఐదున్నర కోట్లు ఒక్క 19 మంది జాగీర్దారులకే పోతుంది. మొత్తం నైజాం ప్రభుత్వానికంతా అన్ని విధాల వచ్చే ఆదాయం యుద్ధానికి ముందు 8 కోట్లయితే, ఈ జాగీర్దారులు ఒక్కరైతాంగం నుండి 6 కోట్లు వసూలు చేస్తున్నారంటే జాగీర్దారులు రైతాంగాన్ని ఎంత పీల్చి పిప్పి చేస్తున్నదీ స్పష్టంగా తెలుస్తుంది. ఈ వరకు పన్ను వసూళ్లు చేస్తున్న దేశముఖ్యులకు ఆ హక్కు నైజాం ప్రభుత్వం కొంతకాలం క్రితం తొలగించింది. కాని దానికి ప్రతిఫలంగా వందలకొలది ఎకరాలు మంచి పొలాలను వీరి సొంతానికిచ్చివేసింది. అదే చాలక కాబోలు! ప్రతి సంవత్సరం 16 లక్షల రూపాయలు పెన్షన్‌లు కూడా ఇస్తూవుంది.

జాగీర్దార్ల అన్యాయం మరీ విపరీతమై రైతులు తిరగబడతారనే భయంతో అక్రమవసూళ్లు చేయకూడదంటూ నైజాం ఒక ఫర్మానా పంపాడు. దానిలో 82 రకాల అక్రమ వసూళ్ల జాబితా ఉంది. అయితే ఫర్మానా వట్టి కాగితపు ముక్కగానే ఉండిపోయింది. లంచగొండి ఉద్యోగస్తుల తోడ్పాటుతో జాగీర్దారులు తమ అక్రమ వసూళ్లు సాగిస్తూనే ఉన్నారు. విసునూరు రామచంద్రారెడ్డి అనే ఒక నిరంకుశ దేశముఖు నల్లగొండ జిల్లా జనగామలో రైతుల పొలాన్ని బలవంతంగా ఆక్రమించుకుంటూనే ఉన్నాడు. తాను పెద్ద భవనం రెండు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కట్టుకొన్నాడు. దానిలో 80 వేల రూపాయలను రైతుల నుండి నిర్బంధించి వసూలు చేశాడు. మూడు రోజుల పసిబిడ్డను ఇంటివద్ద వదలివేసి వచ్చి తన పొలంలో పని చేస్తున్నప్పుడు పసిబిడ్డ పాలులేక చనిపోయింది. ఇటువంటి నిరంకుశ చర్యలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ తీవ్రాందోళన, పోరాటం సాగిస్తూ ఉంది. ఆంధ్రమహాసభ కార్యకర్తలపై నైజాం పోలీసులు ఎన్నో దౌర్జన్యాలు చేస్తున్నారు. ఆ పనులలో కారపుపొడి కొట్టడం, బలవంతాన నోటిలో మూత్రం పోయడం, కొట్టడం సాగిస్తున్నారు. వీనికి జంకక ఆంధ్ర మహాసభ తెలంగాణా తెలుగు ప్రజల ఉద్యమాన్ని బ్రహ్మాండంగా నిర్మిస్తూ ముందుకు పోతూఉంది.



నైజాం నవాబే ఒక పెద్ద జమీందారు. నైజాం ప్రభుత్వ బడ్జెటు నుండి ప్రతి సంవత్సరం నైజాం నవాబుకు, అతని కుటుంబానికి 70 లక్షల రూపాయలిస్తారు. ఇదిగాక నైజాం సొంత పరగణాలంటూ 16 తాలూకాలున్నాయి. వీటి విస్తీర్ణం 8014 చదరపు మైళ్లు. అంటే సంస్థానంలో పదోవంతు భూమి నైజాము సొంత సొత్తు అన్నమాట. సంవత్సరానికి రెండు కోట్ల రూపాయలు యుద్ధానికి ముందు ఈ సొంత పరగణాల నుండి నైజాంకు వచ్చేది. ఇచ్చటి రైతులు సంస్థానంలోని మిగిలిన ప్రదేశాలలో కన్న మరీ నికృష్ట దశలో ఉంటున్నారు.

## మన వ్యవసాయం పాడుపడింది !

నైజాం, ఇంగ్లీషు ప్రభుత్వాలు జమీందారులను ఈ రకంగా పోషిస్తున్నారు. కాని రైతులకు కావలసిన నీటి పారుదల వసతులను ఉపేక్షిస్తూ వచ్చారు. వీరుకాక పూర్వమున్న నీటివనరులు కూడా నిర్లక్ష్యించబడి పాడయ్యాయి. పంటలు పండక క్షామం నిత్యదేవతై మన దేశంలో తాండవమాడసాగింది. 1850-60లో ఇంగ్లీషు ప్రభుత్వం వచ్చిన వంద సంవత్సరాలలో అనేక క్షామాలకు మన ప్రజలు గురైన పిదప కృష్ణా, గోదావరి, పెన్నలకు ఆనకట్టలు కట్టి 25 లక్షల ఎకరాలకు నీటిపారుదల వసతి ఏర్పర్చారు. తరువాత మరొక వంద సంవత్సరాలు గడిచాయి. నేటికి కూడా రాయలసీమ జిల్లాలు, తెలంగాణా జిల్లాలు నీటి సదుపాయాలు లేక క్షామదేవతకు గురి అవుతూనే ఉన్నాయి. కోస్తా జిల్లాలలో పడమటి భాగాలకు కూడా అదేగతి నేటికీ ఉంది.

1780-90 మధ్య 120 సంవత్సరాలలో 30 సంవత్సరాలు క్షామ దేవత తెలుగుదేశంలో ఒక ప్రాంతంలో గాకపోయినా మరో ప్రాంతాన ప్రత్యక్షమవుతూనే వచ్చింది. 1875-78లలో "ధాత" కరువు తెలుగుదేశ మంతటా వ్యాపించింది. 10,00,000 మంది చనిపోయారని ప్రభుత్వపు గుడ్డిలెక్కలే చెప్పుతున్నాయి 1800-1807లో 7 సంవత్సరాలు వరుసగా విడిచిపెట్టక క్షామం తెలుగుదేశంలో చెలరేగింది. రాయలసీమలో 1920-45ల మధ్య, ఈ 25 సంవత్సరాలకు 15 సంవత్సరాలు కరువు సంవత్సరాలు. మద్రాసు ప్రభుత్వ అడ్వైజరు శొంఠి రామమూర్తిగారు తుంగభద్ర ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తూ, ఇంగ్లీషు ప్రభుత్వ హయాంలో దాదాపు 200 కోట్ల కరువు నివారణ కోసం ఖర్చుపెట్టింది కాని రెండున్నర కోట్ల ఖర్చుపెట్టి తుంగభద్రా ప్రాజెక్టును నిర్మించలేకపోయిందని వివరించారు. తుంగభద్రా ప్రాజెక్టును, కృష్ణా సంగమేశ్వర ప్రాజెక్టులను కట్టివుంటే రాయలసీమ జిల్లా ప్రజలూ, నైజాంలోని రాయచూరు, మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లా ప్రజలు కరువులకు గురికాక డెల్టా ప్రజలలాగానే పాడి పంటలను పెంపొందించుకోగల్గి ఉండేవారు.

అయితే ఇంగ్లీషు ప్రభుత్వానికి నైజాం ప్రభుత్వానికి, వీటి ఉద్యోగస్థులకు ప్రజలేమైతే వారికేమి పట్టింది. కృష్ణా, తుంగభద్రా నదులలో నీరు ప్రతి సంవత్సమూ నూటికి 90 పాళ్లు సముద్రంలో పోతూ ఉంది. అయితే ఈ ప్రభుత్వాలు మాత్రం ఈ నీటిలో ఎవరికి ఎంత నీరు

పంచుకోవాలో బేరాలాడుకుంటూ ఒక ఒడంబడికకు రాకుండా దశాబ్దాలు గడిపేశాయి. నేటికీ కృష్ణా ఆనకట్ట కింద 10 లక్షల ఎకరాలకు మించి సాగుచేయరాదు. సాగు చేయాలనుకుంటే నైజాం ప్రభుత్వపు అనుమతి కావాలట. యుద్ధానంతర స్కీములలో కూడ కృష్ణానదిపై సంగమేశ్వర జటపల్లి ప్రాజెక్టుల గూర్చిన ప్రస్తావనే లేదు. గోదావరికి పోలవరం వద్ద ప్రాజెక్టును కట్టడాన్ని గూర్చి గోదావరి నీటి పంపకాన్ని గూర్చి మరల రాయబారాలు, కీచులాటలు జరుగుతున్నాయి. ఎప్పటికి తేలుతుందో ఎవరికీ తెలియదు. ఈ లోపల గోదావరి నదీమతల్లి తన ప్రవాహాలతో ప్రతి సంవత్సరం వేలకొలది ఎకరాలను ముంచెత్తివేస్తుంది. గ్రామాలను తుడిచి పెట్టేస్తూ ఉంది. మన దేశాన్ని ఇంగ్లీషు వాళ్ళు, నైజాం పంచుకుని ఉండబట్టి మన నదులకు ఆనకట్టలు కట్టుకోలేకపోతున్నాం. మన పొలాలకు నీరు మళ్లించలేకపోతున్నాం. మన దేశాన్ని సస్యశ్యామలం గావించి మన ప్రజలను సిరిసంపదలలో తులతూగించలేక పోతున్నాం.

ఇంగ్లీషు ప్రభుత్వం కిందున్న తెలుగు జిల్లాలలో సాగయ్యే 161 లక్షల ఎకరాలలో నాల్గవ వంతుకు మాత్రమే (నూటికి 27 పాళ్లకే) నీటి వనరులున్నాయి. చెరువుల కింద, నూతుల కింద సాగయ్యే పొలాన్ని తీసివేసి కాలువల కింద గ్యారంటీగా నీటిపారుదల గల పొలాలు తీసుకుంటే, అవి నూటికి 15 కన్నా యెక్కువ లేవు. మరొక 109 లక్షల ఎకరాలు, నీటి వనరులు, చెరువులు, ఆధునిక యంత్రాలు లేక సాగుచేయకుండా వదలివేయబడి వుంది.

నైజాం తెలంగాణా జిల్లాలో సాగయ్యే పొలం 102 లక్షల ఎకరాలు ఉంటే అందులో నీటి వనరులు గల పొలాలు యే పదోవంతు మాత్రమే. కాలువనీటి సౌకర్యాలున్న ప్రాంతం నూరవ వంతు మాత్రమే. నీటి సదుపాయాలు, చెరువులు, ఆధునిక యంత్రాలు ఉంటే మరొక 40 లక్షల ఎకరాలు సాగులోనికి తీసుకురావచ్చు.

ఇంగ్లీషు ప్రభుత్వం క్రిందున్న తెలుగు జిల్లాలో ఎకరానికి సంవత్సరానికి 1200 పౌనులు బియ్యం సగటున పండుతుంది. అంటే అయిదుంపాతిక బస్తాలు (బియ్యపు బస్తా 108 శేర్లు కొలత లేక 246 పౌనులు తూనిక) పండుతుంది. నైజాం జిల్లాలలో దీనిలో ముప్పాతికే ఎకరానికి పండుతుంది. ఇంగ్లీషు జిల్లాలలో ఎకరానికి పండే పంటలో జొన్నలు సగం, సజ్జలు నాల్గవవంతు మాత్రమే నైజాం జిల్లాలో పండుతున్నాయి. నీటి వసతులు లేక ఎకరంలో పండించే దానికన్నా నీటి వనరులుంటే వడ్లు రెండురెట్లు, జొన్నలు, సజ్జలు రెండున్నర రెట్లు, ప్రత్తి ఐదురెట్లు పండించవచ్చును.

నైజాంలో వ్యవసాయం ఇంత అధోస్థితిలో ఉన్నప్పటికీ ఇంగ్లీషు ప్రభుత్వం తనకు మద్దతుగా నైజామును బలపరుస్తూ ఉంది. మన తెలుగు ప్రజలను చెల్లాచెదురుగా ఉంచి మన స్వాతంత్ర్య పోరాటాన్ని అణచివేయాలనీ నైజాముకు మద్దతి ఇస్తూ వుంది.



## మన పరిశ్రమలు అభివృద్ధి కాలేదు

ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు మన పరిశ్రమలను, మన ఖనిజ సంపదలను అభివృద్ధి పరచడానికి సుతరాం అంగీకరించరు. వారికి కావలసినదంతా మన ముడి సరుకులు. మన ముడి సరుకులను వాళ్ల దేశానికి తీసుకువెళతారు. దానిని వాళ్ల పరిశ్రమలలో వస్తువులుగా తయారు చేస్తారు. ఆ వస్తువులను తిరిగి తెచ్చి మన దేశంలో విపరీత లాభాలతో అమ్ముకుంటారు. మన చేతి పరిశ్రమలనన్నింటినీ ఈ రకంగా ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు నాశనం చేశారు. నేటికీ మన తెలుగుదేశంలో పొగాకు మీద ఐఎల్‌టిడి కంపెనీకి చెరకు, తాటి బెల్లం, చక్కెర మీద ప్యారీ అండ్ కంపెనీకి, వేరుసెనగ యితర చమురు గింజల మీద ర్యాలీ అండ్ కంపెనీకి, గుత్తాధిపత్యం ఉంది. మన ఖనిజ సంపదను గూర్చి ఎవరూ పరిశీలనలు సరిగా జరిపింది లేదు. మన పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందనివ్వలేదు. నైజాంలోని తెలంగాణాలో కొత్త గూడెం బొగ్గుగనులు మొన్న మొన్నటివరకు ఇంగ్లీషు కంపెనీ వాళ్ల చేతులలోనే ఉంటూవచ్చాయి. మన ఖనిజ సంపద కొంత నైజాంలో, మరికొంత ఇంగ్లీషు ప్రభుత్వం క్రింద ఉండబట్టి వీటిని జతపర్చి ఏ పెద్ద పరిశ్రమను కూడా నిర్మించడానికి అవకాశం లేకుండా పోయింది. మన తెలుగుదేశం పారిశ్రామికంగా ఎంత వెనుకబడివుందో ఈ క్రింది లెక్కల వలన తెలుస్తూంది. ఇంగ్లీషు వారి పాలన కింద వున్న 11 జిల్లాలలో 1941కి 900 ఫ్యాక్టరీలు కేవలం 46 వేల మంది కార్మికులతో పని చేస్తూవున్నాయి. నైజాం తెలంగాణాలో 500 ఫ్యాక్టరీలు కేవలం 28,000 మందితో పని చేస్తున్నాయి.

మన వ్యాపారం కూడా నైజాం తెలంగాణాకు, కోస్తా రాయలసీమ జిల్లాలకు మధ్య సుంకాల వల్ల, ఇతర ఆటంకాల వల్ల అభివృద్ధి చెందడం లేదు. తెలుగు ప్రజలము, మన తెలుగుదేశంలో కడకు మన ముడిసరుకులు, ఆహార పదార్థాలు, నైజాం నుండి ఇచ్చటికి, ఇచ్చటి నుండి నైజాంకు తేలికగా పంపుకోవడానికి, వ్యాపారం సాగించడానికి అవకాశం లేకుండా ఉంది.

## మన విజ్ఞానం కుంటుపడింది

కోస్తా, రాయలసీమ జిల్లాలలో బడులలో (పాఠశాలలలో) ఇంగ్లీషు నిర్బంధం చేయబడింది. ఇంగ్లీషులోనే అందరికీ అన్ని విషయాలు నేర్పుతూ వచ్చారు. ఇప్పటికీ కాలేజీలలో పరాయిభాష అయిన ఇంగ్లీషునే చదువు చెతున్నారు. నైజాం సంస్థానంలో ప్రాథమిక తరగతులలో తప్ప మిగిలిన అన్ని తరగతులలోను ఉర్దూలోనే పాఠాలు బోధిస్తారు. ఉర్దూ నిర్బంధ భాషగా చేశారు. దీని వలన మన ప్రజల చదువు వెనుకబడింది. కోస్తా, రాయలసీమ జిల్లాలలో 5–15 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలలో నూటికి 13 మంది బడికి వెళ్తున్నారు. నైజాం తెలంగాణాలో నూటికి 9 మంది మాత్రమే పోతున్నారు. స్త్రీల చదువు మరింత వెనుకబడి వుంది. కోస్తా రాయలసీమలలో ప్రతి ఇద్దరు బాలురకు

ఒక బాలిక మాత్రం ప్రాథమిక పాఠశాలకు పోతూవుంది. నైజాం తెలంగాణాలో ఆరుగురు బాలురు బడికి వెళ్లితే, ఒక బాలిక మాత్రం పోతూవుంది.

నైజాం సంస్థానంలో పత్రికలు మరీ తక్కువ. వాటిని కొనేవారు కూడా మరింత తక్కువ. అచ్చు ఆఫీసులు కూడా తక్కువే. ఒక కొత్త అచ్చు ఆఫీసు తెరవాలంటే చాలా తతంగం. ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగిన పిదపగాని అనుమతి దొరకదు. అదికూడా చాలా అరుదుగా దొరుకుతుంది.

ఇక వైద్య సహాయం తీసుకుంటే దానికీ ఇదేగతి. ఇంగ్లీషు వారి కిందనున్న ప్రాంతాలు తీసుకుంటే 38,000 జనాభాకు ఒక హాస్పిటలు వుంది. తెలంగాణా తీసుకుంటే 1,10,000 మందికి ఒక హాస్పిటలుంది.

## పౌరసత్వ హక్కులు

పౌరసత్వ హక్కులు చూస్తే నైజాంలోని మధ్యయుగపు నాటి పురాతన జమీందారీ నిరంకుశత్వం మరింత స్పష్టంగా బయటపడుతుంది. హైదరాబాదు సంస్థానంలో ఇంతవరకెట్టి రాజకీయ సంస్కరణలు అమలులో పెట్టలేదు. నామినేటు చేయబడిన కార్యనిర్వాహక వర్గంతో నైజాం నవాబు పూర్తి నిరంకుశాధికారం చెలామణి అవుతూ వుంది. జాగీర్దారులు, దేశ్‌ముఖుల ప్రాబల్యం క్రింద ప్రజలు కుంగిపోతున్నారు. అనేక రకాలైన అక్రమ వసూళ్లతో ప్రజలు ఆలమటిస్తున్నారు.

ముందుగా అనుమతిలేనిదే ఎట్టి సభలూ పెట్టుకోవడానికి వీలులేదు. తాలూకా, జిల్లా కేంద్రాలలో మాత్రం ముందుగా తెలియజేసి పెట్టుకోవచ్చునని కొద్ది రోజుల క్రితమే ఆజ్ఞలు వచ్చాయి. కాని ఏ క్షణమైనా ప్రభుత్వోద్యోగులు వాటిని ఆపివేయవచ్చు. దానికి తిరుగులేదు. ఒక్క రాజకీయ సభలకే కాదు ఈ గతి. కడకు సారస్వత సభలకు కూడా ఇట్టిగతే. హైదాబాదు సంస్థానం పౌరుడు కానివారెవరూ ప్రత్యేక అనుమతి పొందనిదే మాట్లాడడానికి వీలులేదు. ఒకవైపు ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు సంస్థానాధీశుల రక్షణ చట్టం కింద సంస్థానాలలో జరిగే అన్యాయాలగూర్చి ఆందోళన చేయకుండా కట్టుదిట్టాలు చేస్తూ ఉంది. రెండోవైపు నైజాం రాజకీయంగా అభివృద్ధి చెందిన ఇతర ప్రాంతాల నుండి సంస్థానం లోనికి ఎవ్వరినీ రానీయకుండా చేస్తే తన నిరంకుశాధికారం కింద తెలంగాణా, మరాట్వాడా, కర్నాటక ప్రజలను శాశ్వతంగా ఉంచుకోవచ్చునని ఆశిస్తున్నాడు. సంస్థానంలోని తెలుగు, మహారాష్ట్ర, కర్నాటక ప్రజలు సంస్థాన సరిహద్దులానుకొని ఉన్న తమ తోటి జాతీయులతో కలిసిపోతారేమోనని నైజాం కంగారుపడుతూ అనేక నిర్బంధాలు పెట్టుతున్నాడు. మిగిలిన 11 తెలుగు జిల్లాలను కూడ తన నిరంకుశాధికారం కిందికి లాక్కోవాలని చూస్తున్నాడు. ఐదింట రెండుపాళ్లు తెలుగుభూమి, మూడవవంతు తెలుగు ప్రజలు నైజాం నిరంకుశ బానిసత్వం



కింద ఉన్నంతకాలం ఇంగ్లీషు సైనిక సన్నీలతో నైజాం నిరంకుశపాలన సాగుతున్నంతకాలం మనకు స్వాతంత్ర్యం లేదు. ఇంగ్లీషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా మనం సాగించే పోరాటానికి కూడ నైజాం నిరంకుశాధికారం పెద్ద ఆటంకం. ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు, దాని తాబేదారులు నైజాం నవాబు ఈ రెండు ప్రజానిరోధక శక్తులే మన జన్మభూమిని చీల్చాయి. మన ఆర్థిక విధానాన్ని చీల్చి తారుమారు చేశాయి. మనకు చదువులేకుండా అజ్ఞానంలో పెట్టి ఉంచాయి. ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల పరిపాలనను, దాని తాబేదారులైన స్వదేశ సంస్థానాధీశుల పరిపాలనను తొలగించిననాడే మన తెలుగు ప్రజలకు స్వాతంత్ర్యం, శాంతి, అభ్యుదయాలు లభిస్తాయి.

అందుకోసమే తెలుగు ప్రజల మందరమూ, మిగిలిన తోటి భారతీయులతో భుజము భుజమూ కలిపి ఇంగ్లీషు సామ్రాజ్యవాద ప్రభుత్వానికీ, దాని తాబేదారులు సంస్థానాధీశుల పరిపాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటాన్ని సాగిస్తున్నాం. భారతదేశమందలి వివిధ జాతులకు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించడానికి కాంగ్రెసు-లీగు-కమ్యూనిస్టు పార్టీలు కలిసి ఐక్య స్వాతంత్ర్య పోరాటం సాగించాలని కోరుతున్నాం.

కమ్యూనిస్టు పార్టీ స్వతంత్ర భారతదేశంలో ఐక్య విశాలాంధ్ర కావాలంటుంది. విశాలాంధ్ర రాజ్యాంగాన్ని తెలుగుదేశమందలి వయోజనులందరూ ఎన్నుకొన్న ప్రజాపరిషత్తే నిర్ణయించాలని కమ్యూనిస్టు పార్టీ కోరుతుంది. తెలుగు ప్రజలు భారత ప్రజల ఐక్య కూటమిలో కలిసి ఉండటానికి తమ రాజ్యాంగ ప్రజాపరిషత్తులో నిర్ణయం తీసుకోవాలని కోరుతుంది. భరతఖండంలోని వివిధ జాతులు స్వేచ్ఛగా తమ స్వతంత్ర రాజ్యాంగా ప్రజాపరిషత్తుల ద్వారా నిర్ణయించుకొని, స్వతంత్ర భారత సమాఖ్యను (రాజ్యాన్ని) ఏర్పరచడానికి కమ్యూనిస్టు పార్టీ కోరుతుంది. దానికోసం కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుంది.

హైదరాబాదు సంస్థానంలోని ఆంధ్ర, మహారాష్ట్ర, కర్నాటక, తదితర ప్రజలు స్వతంత్ర రాజ్యాంగ పరిషత్తు ద్వారా తమ భవిష్యత్తును నిర్ణయించుకోవాలి. ఈ జన్మహక్కును వీరు సంపాదించుకోవడానికి కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పనిచేస్తుంది.

30 సంవత్సరాల క్రితం ఆంధ్రదేశ భక్తులు, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలంటూ ఆంధ్రోద్యమాన్ని ఆరంభించారు. ఆ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోదాం. ఇంగ్లీషు ప్రభుత్వం కింద ఉన్న తెలుగు జిల్లాలే కావు, తెలుగు గడ్డ అంతా ఒకటి కావాలి. మద్రాసు, మైసూరు, నైజాం మధ్య పరగణా, బస్తరు, ఒరిస్సాలలో ముక్కలు ముక్కలుగా ఉన్న తెలుగు గడ్డ అంతా ఒకటికావాలి. ప్రత్యేక రాష్ట్రం సరిపోదు. తెలుగు జాతి స్వతంత్ర భరత ఖండ సమాఖ్యలో స్వతంత్ర తెలుగు రాజ్యంగా ఉండాలి.

# మూడవ అధ్యాయం

ఒడలు తెలియని పరవశంబున కడలి జేరెడు నదుల జలముల
తెలుగు పొలముల మరలజేసీ, నిలుపుకొందము లక్షినింటను (సా)
పాడరా ఓ తెలుగువాడా! పాడరా ఓ తెలుగు వాడా!
పాడరా మన తెలుగుదేశపు భవ్యచరితపు దివ్యగీతము (పా)

**- కొండేపూడి లక్ష్మీనారాయణ**

## మన గ్రామసీమలు

తెలుగు ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు గ్రామాలలో నివసిస్తున్నారు. కోస్తా రాయలసీమ జిల్లాలలో 16000 గ్రామాలు. 10 వేల జనాభాకు మించిన పట్టణాలు 80 ఉన్నాయి. నూటికి 91 మంది గ్రామాలలో నివసిస్తున్నారు. నూటికి 9 మంది మాత్రమే పట్టణ వాస్తవ్యులు.

గ్రామ ప్రజలలో అత్యధిక మంది తమ జీవనానికి వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. ఈ రెండు వందల సంవత్సరాలుగా ఇంగ్లీషు ప్రభుత్వం కింద మన చేతి పరిశ్రమలు నశించాయి. కొత్త పరిశ్రమలను వాని స్థానాన బయలుదేరనివ్వలేదు. అందుచేత ఎక్కువ మంది ప్రజలు క్రమేణ పొలం మీద తమ జీవితం కోసం ఆధారపడవలసి వచ్చింది. ఏ కొద్దిమందో తప్ప మిగిలిన వారికి పోషణకు సరిపోయేటంత పొలం కూడా లేకుండా పోయింది.

## రైతుకు పొలం లేదు

1931 జనాభా లెక్కల వివరణను బట్టి మన రైతాంగపు స్థితి, ఈ కింది లెక్కలు తెలియజేస్తున్నాయి.

పొలాన్ని స్వంతంగా సాగుచేయని భూస్వాములు కౌలుదార్లు ఎస్టేటు మేనేజర్లు. మొత్తం రైతాంగంలో నూటికి ఐదుగురు.



మొత్తం రైతాంగంలో నూటికి

| | |
|---|---|
| సొంత పొలాన్ని సాగుచేసుకునే రైతులు | 46 మంది |
| పొలాన్ని సొంతంగా సాగుచేసుకునే కౌలుదార్లు | 15 మంది |
| వ్యవసాయ కూలీలు | 34 మంది |

సొంతంగా సాగు చేసుకునే కౌలుదార్లకు సామాన్యంగా పొలం ఉండదు. ఒకవేళ ఉండినా తమ జీవితానికి సరిపోనంతటి తక్కువగా ఉండబట్టే ఇతరుల నుండి ఎక్కువ పొలాన్ని కౌలుకు తీసుకోవలసి వచ్చింది. వీరి ఆదాయం తమ సొంత పొలాన్నుంచి వచ్చే ఆదాయం కన్నా ఎక్కువగా తాము కౌలుకు తీసుకున్న పొలాల నుండి వస్తుంది. అందువల్లనే వీరికి కొద్ది సొంత పొలమున్నా రైతుల కింద లెక్కపెట్టక కౌలుదార్ల కింద చేర్చారు. మన గ్రామసీమలలో పొలం లేని వ్యవసాయ కూలీలు రైతాంగం నూటికి 49 మంది అంటే సగానికి సగం మంది ఉన్నారు. ఇది 1931లో పరిస్థితి. 1931 పిదప మన తెలుగుదేశంలో ఆర్థిక సంక్షోభం వచ్చింది. ధరలు చాలా పడిపోయాయి. అప్పులు చెల్లించుకోవడానికి రైతాంగం తమ పొలాలను అమ్ముకోవలసి వచ్చింది. 1938-45 యుద్ధకాలంలో ధరలు విపరీతంగా పెరిగాయి. మధ్య తరగతి రైతాంగం ధనిక రైతాంగం కొంతవరకు తమ అప్పులను ధాన్యాలను మంచి ధరలు రావడం వల్ల తీర్చుకున్నారు. కాని ఎక్కువ మంది బీద రైతాంగం తమకు కావలసిన గుడ్డ, కిరసనాయిల్, వ్యవసాయపు పనిముట్లు, పశువులు విపరీతంగా ధరలు పెట్టి కొనుక్కోలేక చాలా బాధపడ్డారు. ఈ పరిస్థితులను గూడా మనస్సులో పెట్టుకుంటే పొలంలేని వ్యవసాయ కూలీలు, కౌలుదార్ల సంఖ్య మరింత పెరిగి ఉంటుందని చెప్పవచ్చు. మొత్తం రైతాంగంలో సగానికి పైగానే పొలంలేని వ్యవసాయ కూలీలు కౌలుదార్లు ఉంటారని చెప్పవచ్చు.

సొంత పొలమున్న రైతుల స్థితి చూద్దాం. ప్రభుత్వం ప్రకటించిన 1935, 1941 ల్యాండు రెవెన్యూ సెటిల్మెంటు రిపోర్టును బట్టి ప్రక్కపుటలో వివరాలు లెక్కవేయబడ్డాయి. ఈ లెక్కలలో చాలా లోపాలున్నా ఉజ్జాయింపుగా మన రైతుల స్థితిని తెలియజేస్తుంది. 5 ఎకరాలలోపు రైతాంగం ఈ ఐదు సంవత్సరాలలోనే నూటికి 5 వంతులు పెరిగింది. రైతులు రోజు రోజుకు బీదలైపోతున్నారని తెలుస్తోంది.

ఈ రెండు రకాల లెక్కలను బట్టి చూస్తే నూటికి ఏ పదిమందికో తప్ప మిగిలిన మన గ్రామ ప్రజలకు తమ జీవితానికి సరిపోయేటంత పొలం కనీసం ఐదు ఎకరాలు కూడా లేదని తేలుతూ ఉంది.

## జమీందారీలను రద్దు చేయాలి

మన గ్రామ ప్రజలు, కొద్దికొద్ది పొలాల మీద జీవితం కోసం కష్టపడుతుంటే వీళ్లపై జమీందారీలను ఇంగ్లీషు ప్రభుత్వం తెచ్చిపెట్టింది.

ఇంగ్లీషు ప్రభుత్వం క్రింద ఉన్న 11 తెలుగు జిల్లాలను తీసుకుంటే జమీందారీల కింద 88 లక్షల ఎకరాలు అంటే మొత్తం పొలంలో నూటికి 23 వంతులుంటుంది. ఈనాందార్ల కింద 27 లక్షల ఎకరాలు అంటే మొత్తం పొలంలో నూటికి 7 వంతులుంది. జమీందార్లు, ఈనాం దార్లు వ్యవసాయానికి ఏ రీతిగానూ తోడ్పడకుండా రైతులు పండించే పంటలో భాగాన్ని తీసుకుంటూ సోమరిపోతులై జీవిస్తున్నారు. ఈ సోమరిపోతులను పోషించడానికి మొత్తం మన పొలంలో మూడవ వంతు మీద మన రైతులు వీరికి శిస్తు చెల్లించవలసి వస్తూ ఉంది. జమీందార్లున్న కోస్తా జిల్లాలు చిత్తూరును మాత్రమే తీసుకుంటే జమీందారీ పొలాలు నూటికి 46 వంతులు, ఈనాందార్ల పొలాలు నూటికి 11 వంతులుంది. అంటే ఈ ప్రాంతాలలో ఈ సోమరిపోతులను మేపడానికి ప్రతి ఐదెకరాలకు మూడు ఎకరాల నుండి వీరికి శిస్తు చెల్లించవలసి వస్తూంది.

మొత్తం 448 జమీందారీ ఎస్టేట్లు ఈ జిల్లాలలో ఉన్నాయి. వీరు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పేష్కసు పోను ప్రతి సంవత్సరం 96 లక్షల రూపాయలు నికరం రైతుల నుండి శిస్తు వసూలు చేస్తున్నట్లు ప్రకాశం కమిటీ ముందు 1938లో వాంగ్మూలాలిచ్చారు. కాని వీరు వసూలు చేసే అక్రమ వసూళ్లు, వీళ్లు రైతుల నుండి అన్యాయంగా లాగుకొన్న పొలాల నుండి (సొంత శేరీల నుండి) వచ్చే ఆదాయాన్ని కలుపుకుంటే వీళ్లాదాయం కనీసం రెండు మూడు కోట్లయినా ఉంటుంది.

ఈ 96 లక్షలలోను 76 లక్షల రూపాయలను అంటే నూటికి 80 వంతులు 24 గురు జమీందారులే కాజేస్తున్నారు. దీనిలో కూడ ఈ క్రింది పదిమంది జమీందార్లకు 60 లక్షలు పేష్కసు పోను నికర శిస్తులు వస్తాయి.

| | రూ. |
|---|---|
| 1. విజయనగరం | 16,00,000 |
| 2. వెంకటగిరి | 11,00,000 |
| 3. కార్వేటినగర్ – తిరుపతి | 8,75,000 |
| 4. పిఠాపురం | 5,50,000 |
| 5. బొబ్బిలి | 5,50,000 |
| 6. ఉయ్యూరు | 3,40,000 |
| 7. చల్లపల్లి | 2,70,000 |
| 8. కాళహస్తి | 2,70,000 |
| 9. నారాయణపురం –చెట్టినాడు | 2,60,000 |
| 10. పర్లాకిమిడి | 2,30,000 |
| **మొత్తం** | **60,50,000** |



చల్లపల్లి రాజాకు, శిస్తురూపంగా వచ్చేదిగాక సొంత పొలాలని 17350 ఎకరాలున్నాయి. గత శతాబ్దంలో వచ్చిన ఉప్పెనలో నశించిన రైతు కుటుంబాల పొలాలను భుక్తం చేసుకున్నట్లు అందుచేతనే ఈయనకు ఇన్నివేల ఎకరాలు సొంత శేరీ పొలాలు వచ్చినట్లు రైతులు విరివిగా చెప్పుకుంటారు. ఒకవైపు మన ప్రజలకు తలకు 30–50 రూ. లు సంవత్సరానికి సగటున ఆదాయమైతే మరొకవైపు 10 మంది జమీందార్లకు లక్షల కొలది ఆదాయం. ఈ జమీందార్లు తమ దబ్బును అధికారాన్ని రైతులను అనేక విధాల పీడించడానికి ఉపయోగిస్తున్నారు. అడవుల నుండి ఎండిన కట్టెపుల్లలను, పొలాలను ఆకు సత్తువలను తెచ్చుకోనివ్వకుండా అటకాయిస్తారు. 1940 మందసా రైతులు అడవినుండి కట్టెలు తెచ్చుకుంటూ ఉంటే మందసా జమీందారీ మనుష్యులు, పోలీసులు మద్దతు అయి వారిపై తుపాకులు కాల్చారు. రైతుల పశువులను అడవులకు మేతకు పోనివ్వరు. విపరీతమైన పుల్లరులు అడుగుతారు. వెంకటగిరి జమీందారీలో రైతులు కంచెల పుల్లరి విషయమై 1929 నుండి బ్రహ్మాండమైన ఆందోళన సాగించారు. రైతుల పొలాలను ధ్వంసం చేస్తూ ఉండే అడవి మృగాలను కూడ రైతులు వేటాడకూడదని నిషేధిస్తారు. జమీందార్లు తమకు వచ్చే అత్యధిక ఆదాయంతో తృప్తి చెందక అనేకరకాల అక్రమ వసూళ్లు చేస్తూ ఉంటారు. చెరువులు మరమ్మతు చేయకపోవుటచే రైతుల పొలాలకు నీటి వసతులు లేకుండా పోతూ ఉన్నాయి. కడకు ఇంతటితో ఆగక రైతుల పొలాన్ని, గ్రామ సాముదాయక పొలాలను అనేక కుంటిసాకులు చెప్పి ఆక్రమించుకుంటున్నారు.

బొబ్బిలిరాజా, చల్లపల్లి, పిఠాపురం, వెంకటగిరి రాజాలే మొదటి నుండి కాంగ్రెసును వ్యతిరేకిస్తూ కాంగ్రెసును ధ్వంసం చేయాలని పనిచేస్తూ వచ్చారు. గత ఎన్నికలలో జవహర్‌లాల్ మీటింగుపై బొబ్బిలిరాజా ఏనుగులను తోలించాడు. జమీందారులెప్పుడూ ఇంగ్లీషు ప్రభుత్వానికి తాబేదారులు. ఇంగ్లీషు ప్రభుత్వం ఆడించినట్లు ఆడుతూ ఉంటారు. ఈ రోజు కాంగ్రెసు అధికారానికి రాబోవుతూందని గ్రహించారు. కాంగ్రెసులో చేరితేనేగాని తమ అన్యాయాలను, తమ లాభాలను పెత్తనాలను కొనసాగించుకోడానికి మరో మార్గం లేదని కాంగ్రెసులోకి దూరుతున్నారు. దురదృష్టవశాత్తు కాంగ్రెసు నాయకులు కాంగ్రెసులోకి వీరిని ఆహ్వానిస్తున్నారు.

కమ్యూనిస్టు పార్టీ నినాదం ఇంగ్లీషు ప్రభుత్వం, వారి తాబేదారులైన ఈ జమీందారులు రద్దుకావాలి. మన రైతులు చెమటోడ్చి పండించే పంటలను దోచుకొని తినే ఈ జమీందారులు పోవాలి. విపరీత పన్నులు వేసి అనేక నిర్బంధాలు సాగిస్తున్న ఈ జమీందారీలు రద్దుకావాలి. జమీందారీ విధానం ఉండడం మన వ్యవసాయానికి పెద్ద ఆటంకం. వారి పొలాలను నేడు సాగుచేస్తున్న వ్యవసాయ కూలీలకు, రైతులకు వానిని స్వాధీనం చేయాలి. (జమీందారునకు ఎట్టి పన్నులు చెల్లించకుండా) రైతులు కూలీలు ఆ పొలాలను సాగుచేసుకుంటూ అనుభవించే హక్కు ఇవ్వాలి.

జమీందార్లు మిగిలిన రైతులతో పాటు సాగుచేసుకుని జీవించడానికి 100 ఎకరాలు ఇవ్వబడుతుంది. అంతకుమించి ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వబడదు. 10వేల రూపాయలలోపు సంవత్సరాదాయం గల జమీందారీలకు ఒక సంవత్సర శిస్తు నష్టపరిహారంగా ఇవ్వబడుతుంది. ఆ డబ్బుతో వారు జీవనోపాధికి ఏదైనా వృత్తి చూసుకోడానికి వీలవుతుంది. అయితే పెద్ద జమీందార్లకు, 100 ఎకరాలు పొలం వదలిన జమీందార్లకు మాత్రం ఎట్టి నష్టపరిహారం ఇవ్వవలసిన అవసరం లేదు. వారివద్ద సుఖంగా జీవించడానికి కావలసిన సంపత్తి ఉంది.

జమీందారీ, ఇనాందారీ, ముఠాదారీ పద్ధతులను రద్దు చేయడం వల్ల మన తెలుగు ప్రజలు ఈ 11 జిల్లాలలో మూడవవంతు భూమిపై వీరికి చెల్లించే పన్ను ప్రజల ప్రభుత్వానికి మిగులుతుంది. సంవత్సరానికి జమీందార్లకు వచ్చే 96 లక్షలు, ఇనాందార్లకు వచ్చే 23 లక్షలు మొత్తం కోటి 20 లక్షల రూపాయలు ప్రజా ప్రభుత్వం నీటి వసతులను (ఇరిగేషను ప్రాజెక్టులను) నిర్మించడానికి, జమీందారీ ప్రాంతాలలోని చెరువులు మరమ్మత్తు చేయడానికి మన గ్రామాలలో విద్య వైద్య సదుపాయాలు నెలకొల్పడానికి ఖర్చు పెట్టగలుగుతుంది. మన ప్రజల రాజకీయ, సామాజిక జీవితాల్ని అణగదొక్కుతున్న ఈ అభివృద్ధి నిరోధక జమీందారీ నిరంకుశత్వానికి స్వస్తి చెప్పేస్తాం.

## సాగుచేసుకోక పొలాలను కౌలుకిచ్చే భూస్వామిక విధానాన్ని రద్దుపరచాలి!

మన వ్యవసాయాభివృద్ధికి మరొక ఆటంకం, పొలాలను సొంతంగా సాగుచేసుకోక కౌలుకిచ్చి జీవించే భూస్వాములు. 1931లోనే మొత్తం రైతాంగంలో నూటికి ఐదుగురు తమ పొలాలను సాగుచేయక కౌలుకిచ్చి మగతాల మీద జీవించేవారిని మనం చూశాం. వీళ్లవద్ద పొలాలను కౌలుకు తీసుకుని జీవించే కౌలుదార్లు వీరికి మూడురెట్లు అని, మొత్తం రైతాంగంలో నూటికి 15 మంది అని చూశాం. గత 15 సంవత్సరాలలో 1930–34లలోని ఆర్థిక సంక్షోభ ఫలితంగాను, 1939–45 యుద్ధకాలంలోనూ అనేక మంది రైతులు తమ అప్పులను తీర్చుకోడానికి తమ పొలాలను అమ్ముకోవాల్సివచ్చింది. ధనిక భూస్వాములు పట్టణ షావుకార్ల ఈ పొలాలు చేజిక్కాయి. తక్కువగా వుండే డెల్టా ప్రాంతాలలో పండినపంటలో మూడు వంతులు కౌలుండేది. ఏ పరిస్థితులలోను పండినపంటలో సగానికి తక్కువ కౌలులేదు. పొలాలను కష్టపడి సాగుచేస్తున్న రైతుపై ఈ కౌలుభారాన్ని తొలగించాలి. అందుచేతనే 100 ఎకరాలకు మించిన భూస్వాముల నుండి, 100 ఎకరాలకు పైబడి ఉన్న పొలాన్నంతా న్యాయమైన నష్టపరిహారమిచ్చి ప్రజా ప్రభుత్వం వశపర్చుకోవాలని కమ్యూనిస్టు పార్టీ కోరుతోంది. ఈ 100 ఎకరాల ఆసాములు గూడా సొంతంగా వానిని సాగుచేయాలి కాని కౌలుకిచ్చి కూర్చోరాదని ప్రజా ప్రభుత్వం శాసించాలి. ఈ భూస్వాములు వ్యవసాయ కూలీలకు న్యాయమైన జీతాలిచ్చి వారికి మంచి సదుపాయాలు కల్గించాలని కూడా ప్రజా ప్రభుత్వం శాసించాలి. పొలాలను సాగుచేసుకోడానికి తయారుకానివారు వ్యవసాయం మీద, రైతాంగం మీద మెడగుదిగాకుండా



చేయాలి. అట్టివారికి కొద్దిగా నష్టపరిహారమిచ్చి వారి పొలాలను నేడు సాగుచేస్తున్న కౌలుదార్లకు స్వాధీనం చేసివేయాలి.

పెద్ద భూస్వామి, పట్టణ షావుకారులే పొలాలను సాగుచేసుకోక కౌలుకిచ్చి ఇతరులు కష్టపడి పండిస్తే అనుభవిస్తుంటారు. సామాన్యంగా ఎక్కువ మంది రైతులు తమ పొలాలను కౌలుకివ్వరు. అయితే బీదరైతులు పశువులు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు దొరకక తమకొద్దిపొలాలను సాగుచేసుకోలేక పోతున్నారు. అందుచేత వీరిలో కొంతమంది కౌలుకిచ్చి మరేదో వృత్తి చూసుకోవడం కూడా జరుగుతోంది. మరికొంత మంది బీద రైతాంగం తమకొద్ది పొలం మీద వచ్చే ఆదాయం చాలక, ఆ పొలాన్ని కౌలుకిచ్చి తన ఆదాయం మరికొంచెం పెంచుకోడానికి, మరేదో వృత్తికోసం పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు పోతున్నారు. అట్టి బీదరైతులు తిరిగి వ్యవసాయం ఆరంభించడానికి కావలసిన సౌకర్యం ప్రజా ప్రభుత్వం చేయాలి.

1. వారి చిన్న పొలాలకు మరికొంత పొలం కలిపి, వ్యవసాయం మీద జీవితానికి సరిపోయే ఆదాయం వచ్చేటట్లు చూడాలి.
2. తమ పొలాలను సాగుచేసుకోడానికి కావలసిన పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, అప్పుకూడ ప్రజా ప్రభుత్వం వారికివ్వాలి.

సాగుచేసుకొనే రైతుకే పొలం (దుక్కి దున్నేవాడికే పొలం) ఈ సూత్రాన్ననుసరించి చేస్తేనే వ్యవసాయాభివృద్ధికి అడ్డుతగిలేవాటన్నిటినీ తొలగించి మన ప్రజలకు కావలసిన తిండినంతా తయారు చేసుకోగలం.

## సాగుచేసేవాడికే పొలం

ధనిక భూస్వాముల పొలాలు పంచితే తలకొక అరెకరం కన్న ఎక్కువరాదు. కాబట్టి అలా పంచడం తెలివితక్కువ అని ఆంధ్ర కాంగ్రెసు నాయకులు డాక్టర్ పట్టాభిసీతారామయ్య పంతులుగారు సెలవిచ్చారు. తన ధనిక మిత్ర బృందం ఆస్తులను కాపాడడానికి ఆయన ఆతురత ఇది తెలియజేస్తుందే కాని మరేమీ కాదు. ఈ జమీందారీ, ఈనాందారీ, ముఠాదారీ పద్ధతి, సొంతంగా సాగుచేసుకోని భూస్వామిక పద్ధతి వ్యవసాయాభివృద్ధికి అడ్డుగాబట్టి వీనిని రద్దుగావించాలని కమ్యూనిస్టు పార్టీ కోరుతూ ఉంది. వీటిని రద్దు చేయబట్టి రైతుమీద ఉన్న ఈ పరాన్న భుక్కుల బాధ పోతుంది.

రైతులు నేడు జమీందార్ల నుండి కౌలుకు తీసుకుని చేస్తున్న పొలాలు రైతులకు శాశ్వతంగా చెందాలి. జమీందారుల సొంత కమతాలలో వ్యవసాయ కూలీలు సాగుచేస్తున్న పొలాలు ఆ వ్యవసాయ కూలీలకు శాశ్వతంగా చెందాలి. ఈ రైతులు కూలీలు తాము సాగుచేసి పండించే పంటలో ఏమాత్రం సోమరిపోతులైన, జమీందార్లకు, ఈనాందార్లకు, ముఠాదారులకు చెల్లించనవసరంలేకుండా ప్రజా మంత్రివర్గం ఒక్క సంవత్సరంలోపున చట్టం చేయాలి.

ఇప్పుడు సాగుచేయక బంజరులుగా పెట్టియున్న పొలాలను, బీద రైతులకు, వ్యవసాయ కూలీలకు పంచిపెట్టాలి. ఈ వరకు 15 ఎకరాలకు తక్కువ ఉన్నవారికి కనీసం 5 ఎకరాల పొలం వచ్చేటట్లు పంచిపెట్టాలి. అలా చేస్తేనే వారు తమ భుక్తికి కావలసినంత పండించుకోగలరు. ఏమీ పొలంలేని వ్యవసాయ కూలీలకు వందలకొలది ఎకరాలు బంజరుగా ఉన్న ప్రాంతాలలో కాలనీలు ఏర్పరచి సహకార పద్ధతుల ద్వారా ఆ పొలాన్ని సాగుచేయడానికి ఇవ్వాలి.

ఇలా పొలాన్నంతా సాగుకుతెస్తే మన గ్రామాలలో వ్యవసాయం మీద జీవించే కుటుంబాల కన్నింటికి 5 ఎకరాలకు తగ్గకుండా పొలం ఇవ్వగలం. మద్రాసు ప్రభుత్వపు 1941 రెవెన్యూ సెటిల్మెంటు ద్వారా 5 ఎకరాలలోపు పట్టాదారుల సంఖ్య నూటికి 90 మంది ఉన్నారనీ, వారికి సగటున ఒకటి ముప్పాతిక ఎకరం ఉందని మనమిదివరకే చూశాం. జమీందారీ రైతులలో కూడ ఈ దామాషానే బీదరైతులున్నారని అనుకుందాం. అప్పుడు మన గ్రామ సీమలలో నివసించే 34 లక్షల కుటుంబాలలో 5 ఎకరాలకు తక్కువ ఉన్న కుటుంబాల సంఖ్య 34,000 × 90 = 30,60,000 ఉంటుంది. ఈ 31 లక్షల కుటుంబాలకు సగటున చెరొక మూడుంపాతిక ఎకరాలిస్తే ఐదెకరాలు ప్రతి ఒక్క కుటుంబానికి వస్తుంది. అంటే 31×3.25 లక్షల ఎకరాలు, 10 లక్షల ఎకరాలు అదనంగా సాగుకు తీసుకొనిరావాలి.

ఇంగ్లీషు ప్రభుత్వం క్రిందనున్న "తెలుగు జిల్లాలలో 44 లక్షల ఎకరాలు వెంటనే సాగుకు లాయకు అని, కాని సాగుచేయక భూస్వాములు బంజరుగా పెట్టి ఉన్నారని ప్రభుత్వపు లెక్కలు తెలియజేస్తున్నాయి. వీనిని సాగులోకి తెస్తే ఈ 31 లక్షల కుటుంబాలకు వెంటనే చెరొక ఎకరన్నర ఇవ్వవచ్చు.

మరొక అరవై అయిదు లక్షల ఎకరాలు, లాభసాటి వ్యవసాయానికి పనికిరాని పొలాలుగా ప్రభుత్వపు లెక్కలు తెలియజేస్తున్నాయి. వీనికి కావలసిన నీటి సదుపాయాలు, ఎరువులు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు ఉపయోగిస్తే ఈ పొలాలలో కూడ లాభసాటి పంటలు పండించవచ్చు. ఈ 65 లక్షల ఎకరాలను 31 లక్షల కుటుంబాలకు తలకొక రెండు ఎకరాలు వస్తాయి. అంటే మొత్తం యీ కుటుంబాలకన్నింటికీ ఐదు ఎకరాల చొప్పున పొలం ఇవ్వగలమని తేలుతుంది.

అయితే ఈ పొలాన్ని ఈరీతిగా రైతులకు, వ్యవసాయ కూలీలకు పంచిపెట్టి సాగులోకి తీసుకురాకుండా అడ్డుపడేది ఎవరు? పెద్ద భూస్వాములు, జమీందారులు, ఇంగ్లీషు ప్రభుత్వం, పొలంపై తమకున్న గుత్తాధికారాన్ని వదులుకొని రైతు కూలీలకు పంచిపెట్టడానికి ఇష్టపడక అడ్డు తగులుతున్నారు.

ఇంగ్లీషు ప్రభుత్వం కిందవున్న ఈ జిల్లాలలోని పొలమే కాకుండా తెలంగాణాలో కూడా 40 లక్షల ఎకరాలు సాగుచేయకుండా వున్నాయి. అచ్చటి రైతులకు, కూలీలకు వారు సాగుచేయడానికి కావలసిన పొలం ఇచ్చిన పిదపకూడా ఇతర ప్రాంతాల నుండి మనుష్యులను



తీసుకురాకపోతే సాగుకాని పొలం ఎంతో వుంటుంది. నైజాం నేడు తెలంగాణాలోని పొలాలను బీద రైతులకు, కూలీలకు ఇవ్వక, తనకు జీ హుజూర్‌గా వుండే వాళ్లను సంస్థానంలోకి పిలిచి పొలాలు ఇస్తున్నాడు. ఆ రకంగా ప్రజల మీద తన అధికారాన్ని బలపర్చడానికి ఒక ముఠాను తయారు చేసుకోవాలని చూస్తున్నాడు. మన తెలుగు గడ్డనంతా ఒకటిగా చేయగలిగినప్పుడు తెలంగాణా, రాయలసీమ, కోస్తా జిల్లాల ప్రజలందరికీ కావలసినంత పొలముంటుంది. ఉన్న పొలాన్నంతా ప్రజలందరికీ కావలసిన పంటలు పండించడానికి ప్రజలు వుంటారు.

## పొలాలు సాగుచేయడానికి నీటి వసతులు కావాలి

నైజాం, ఇంగ్లీషు ప్రభుత్వాలు మన ప్రజల సౌకర్యాలను మనస్సులో పెట్టుకోక ఏ రీతిగా మన నీటి వసతులను, ఇరిగేషను ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారో ఇదివరకే చూశాం. ఒకపక్క కృష్ణా, గోదావరీ ప్రవాహాలు వేలకొలది ఎకరాలను ముంచుతూ సముద్రంలోకి వృథాగా వెళ్తున్నాయి. మరొక పక్క నీరులేక రాయలసీమ జిల్లాలు, కోస్తా జిల్లాలలో పడమటి ప్రాంతాలు, తెలంగాణాలోని రాయచూరు, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలు ఏ రీతిగా క్షామానికి గురి అవుతూ వచ్చాయో చూశాం. నీటిపారుదల వసతులు ఎంత తక్కువగా వున్నవో తెలుసుకోవాలంటే అనంతపురం జిల్లాలో సాగయ్యే ప్రతి 100 ఎకరాలకు 9 ఎకరాలకు మాత్రం నీటి వనరులున్నాయి. అవియైనా చెరువులు, నూతులు, ఏటి ఇసుకతెరలలో తవ్విన ఊటకాలువలు అన్నీ కలిపితే 9 పాళ్లయినా సాగవుతున్నాయి. బళ్లారి జిల్లాలో నూటికి 98 పాళ్లకు ఎట్టి నీటి వసతులు లేవు. నీటి సదుపాయాం వుంటే ధాన్యాన్ని రెండురెట్లు, జొన్నలు, సజ్జలు మూడురెట్లు, పత్తిని ఐదురెట్లు పండించగలం. నీరు ఎక్కువగా వున్నప్పుడే ఎక్కువ ఎరువులు వేసి సాగు చేయడానికి వీలవుతుంది.

ఇరిగేషను ప్రాజెక్టులు, మురుగు పోవుటకు కాలువలు, మన వ్యవసాయాభివృద్ధికి పునాదులు. యుద్ధానంతర స్కీములంటూ నైజాం ఇంగ్లీషు ప్రభుత్వాలు కొన్ని తయారు చేశాయి. కాని అవి సమగ్రంగా లేవు. మన ప్రజల అవసరాలన్నింటినీ తీర్చడానికి ఏమాత్రం సరిపోవు. మన నదులన్నింటిని పూర్తిగా ఉపయోగించడానికి సమగ్రమైన స్కీమ్‌లు తయారు చేసి అమలు పెట్టడానికి కమ్యూనిస్టు పార్టీ కోరుతుంది. ఈ స్కీములు వ్యవసాయానికి కావలసిన నీరు వుండేటట్లు, విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయడానికి వీలయ్యేటట్లు వుండాలి. వర్తక వ్యాపారాలను రవాణాకు అనుకూలించే కాలువలతో ఈ స్కీములు తయారు చేయాలి. ప్రవాహాలను అరికట్టేటట్లు, మురుగు నిలువకుండా వుండేటట్లు ఈ స్కీఉములను ఏర్పరచాలి. మురుగు నిలవడం వల్ల పంటలు నష్టమగుటయే గాక మలేరియా జ్వరాలకు దారితీస్తుంది.

(1) గోదావరీ స్కీమును అతిత్వరగా ఆరంభించి పూర్తిచేయాలి. గోదావరి తెలంగాణాలో అదిలాబాదు జిల్లాలోనూ, తూర్పు గోదావరిలో పోలవరం వద్ద రామపాద సాగర ఆనకట్టను కట్టాలి. అదిలాబాదు స్కీము 20 లక్షల ఎకరాలకు, అదిలాబాదు, కరీంనగర్, వరంగల్

జిల్లాలలో నీటిపారుదల కలుగజేస్తుంది. అచ్చట తయారయ్యే విద్యుచ్ఛక్తిద్వారా పెద్ద పెద్ద పరిశ్రమలు కూడా స్థాపించడానికి వీలవుతుంది. పోలవరం ప్రాజెక్టు వలన, విశాఖలోను, ఉభయగోదావరులలోను, కృష్ణా, వరంగల్ జిల్లాలలో 24 లక్షల ఎకరాలకు నీటిపారుదల కలుగుతుంది. పోలవరం, మాచ్‌ఖండ్ ప్రాజెక్టుల వలన పై జిల్లాలలో, ఏజెన్సీ ప్రాంతమంతా విద్యుత్ పరిశ్రమలను అభివృద్ధి చేయవచ్చు.

(2) తుంగభద్ర ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయడంతో పాటు కృష్ణానది మీద సంగమేశ్వరం వద్ద, జటపల్లి వద్ద ప్రాజెక్టులను నిర్మించాలి. వీనిని కృష్ణాకు ఇప్పుడున్న ఆనకట్టలు కలిపి కృష్ణానదీ స్కీమును అభివృద్ధి చేయాలి. ఇది రాయలసీమ జిల్లాలు, గుంటూరు, తెలంగాణాలో మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలను సాగుచేస్తాయి. సంగమేశ్వర ప్రాజెక్టు వలన తయారైన విద్యుచ్ఛక్తి వలన అచ్చట పెద్ద పరిశ్రమలను స్థాపించడానికి వీలవుతుంది.

(3) కృష్ణానదీ స్కీముతో కలుపుతూ పెన్నానదికిప్పుడున్న ఆనకట్టలేగాక నెల్లూరులో సోమశిలవద్ద, కడపలో గండికోట – ప్రాజెక్టును అనంతపూర్‌లో మారుట్ల వేమారు, పెన్నార్ కుముద్వతి ప్రాజెక్టులను నిర్మించాలి.

(4) ఈ పెద్ద నదీ స్కీములతో పాటు, ప్రతి జిల్లాలోను పెద్ద ఇరిగేషన్ స్కీములకు అనుబంధ స్కీములుగా మైనరు ఇరిగేషను, మురుగు నివారణ స్కీములను తొలగించాలి. (వాని జాబితా అధ్యాయం చివర అనుబంధంలో ఉంది) వ్యవసాయానికి అవసమైన చోట్ల లోతుబావులు తీయించాలి. ఆ నీటిని పైకి తోడడానికి విద్యుచ్ఛక్తిని ప్రభుత్వం సరఫరా చేయాలి.

(5) బర్హంపురం నుండి మద్రాసు వరకు (ప్రస్తుతం బకింగ్ హామ్ కాలువతో కలిసి) కోస్తానుండి అదిలాబాదు వరకు, అదిలాబాదు నుండి కర్నూలు, కడప, అనంతపురం వరకు ఆ పిదప మైసూరు కాలువలతో కలిసి పడవల ప్రయాణానికి అనుకూలించే కాలువలు తవ్వించాలి.

## మన ప్రజలకు కావలసిన ఆహారాన్ని తయారుచేసుకుంటాం

ఇంగ్లీషు ప్రభుత్వం కిందఉన్న తెలుగు జిల్లాలలో 2 కోట్ల మంది ప్రజలకు సంవత్సరానికి 50 లక్షల టన్నుల (టన్ను 9 బస్తాల బియ్యం) బియ్యం గాని, సరిపోవు ఇతర ధాన్యాలుగాని కావాలి. అయితే పండే ధాన్యం 38 లక్షల టన్నులు మాత్రమే. 12 లక్షల టన్నులు తక్కువయ్యాయి. కాని ప్రస్తుతం సాగు అవుతున్న పొలాలకన్నిటికీ నీటిపారుదల వసతులుంటే మరొక 15 లక్షల టన్నులు అదనంగా పండించుకోవచ్చు. దానితో కొరత తీరిపోతుంది.

ఇదిగాక ఇప్పుడు వెంటనే సాగుకు లాయకు భూములు 44 లక్షల ఎకరాలను సాగుకు తెస్తే మరొక పదిహేను లక్షల టన్నుల ఆహార ధాన్యాలను పండించవచ్చును. వానికి



నీటి సదుపాయాలు ఏర్పరిస్తే 30 లక్షల టన్నులు పండించవచ్చును. అంటే ప్రస్తుతం సాగవుతున్న పొలాలకన్నిటికి సాగుకు లాయకై బంజరుగా ఉన్న పొలాలకు నీటిపారుదల వసతులేర్పరచి సాగుచేస్తే మనం పండించే ఆహార ధాన్యాలను రెండు రెట్లు చేయవచ్చు. ఎరువులు వేసి జాగ్రత్తగా పైరువేస్తే నాలుగు రెట్లు పండించవచ్చు. వెంటనే సాగుకు లాయకు భూములు, ఇప్పుడు సాగవుతున్న పొలాలను కలిపితే మొత్తం సాగుకు తీసుకురావడానికి వీలున్న పొలాలలో మూడువంతులు మాత్రమేనని జ్ఞాపకముంచుకుంటే మనం ప్రజలకు కావలసినదానికన్నా ఐదురెట్లు పండించుకోవచ్చు. ఇతర ప్రజలకు కూడా కావలసినంత పంపవచ్చు.

ఇంత ఎక్కువ పండించడానికి వీలున్నప్పుడు, దీనినంతా ఏమి చేయడం? ఇంత ఎక్కువగా పండిస్తే రైతుకు ధరలు పడిపోయి నష్టపడక తప్పదు కదా అనే భయం కలుగుతుంది. అది కేవలం నిరాధారమైనది. ఎందుకంటే మనకున్న పొలాన్నంతా ఒక్క ఆహారధాన్యాలు వేస్తూ ఊరుకోము. మనకు కావలసిన చమురు గింజలు, పత్తి, చక్కెర, జ్యూటు ఇతర ముడిపదార్థాలకు చాలా పొలాలలో పైరువేసి పండించవలసి వుంటుంది. మన ప్రజలకు కావలసిన పాలు, వెన్న, గుడ్లు, మాంసం కోసం లక్షకొలది ఎకరాలు, ఆవులు, గొర్రెలు, మేకలు వగైరా పశుసంపదను పెంపొందించడానికి, అట్టేపెట్టవలసి వస్తుంది. అంతేగాక మన జనాభా ప్రతి సంవత్సరమూ పెరిగిపోతూవుంది. వారికి కావలసిన ఆహారానికి కూడా మనం ప్రతి సంవత్సరంమూ కొత్త పొలాలను సాగుచేసి ఎరువులను, శాస్త్ర జ్ఞానాన్ని వినియోగించి ఎక్కువ పంటలు తయారు చేయవలసి వుంటుంది. అంతేగాక రైతులు పండించే పంటలకు కనీసపు ధరలు ప్రజా ప్రభుత్వం గ్యారంటీ చేస్తున్నది. అతనికి వ్యవసాయ ఖర్చులు పోను సుఖంగా జీవించడానికి తగిన ఆదాయం వచ్చేటట్లు ధరలువుండాలి.

ఈ రకంగా వ్యవసాయాన్ని పునర్నిర్మించడానికి ప్రధాన అడ్డంకి ఇంగ్లీషు ప్రభుత్వం, దాని తాబేదారులైన జమీందారులు. వీరి దోపిడీలో రైతులకు తమ వ్యవసాయాన్ని అభివృద్ధిగావించడానికి ఏమీ మిగులుటలేదు.

## బీద రైతులపై పన్నులేదు - ధనిక భూస్వాములపై అధిక పన్నులు

జమీందారీ, ఇనాందారీ రైతుల నుండి 120 లక్షలు నికర శిస్తులు జమీందార్లు, ఇనాందార్లు తీసుకోవడం, అచ్చటి రైతుల దైన్యస్థితిని మనం చూశాం. రైత్వారీప్రాంతాలలో కూడా పన్నుభారం బీదరైతుల మీదనే ఎక్కువగా వుంది.

1941 ల్యాండు రెవెన్యూ సెటిల్మెంటు రిపోర్టు ద్వారా ఈ కింది విషయాలు తెలుస్తున్నాయి. 5 ఎకరాల లోపువున్న రైత్వారీ ప్రాంతపు రైతాంగం 124 లక్షల భూమిశిస్తును 66 లక్షల ఎకరాల మెట్ట మాగాణిమీద ప్రతి సంవత్సరం చెల్లిస్తున్నారు. భూమి శిస్తులో దాదాపు సగం బీదరైతులే చెల్లిస్తున్నారు. తమ కొద్ది పొలం మీద వచ్చేది తమ భుక్తికే చాలదు. అందుచే ఈ చిన్న రైతుల మీద పన్నులు వేయడం అన్యాయం. వందలకొలది ఎకరాలున్న రైతుమీద ఎకరానికి ఒకటే శిస్తు, బీదరైతు భూమిపై కూడా ఒకటే శిస్తు ఇప్పుడు వసూలు

చేస్తున్నారు. ఈ పద్ధతిపోవాలి. 5 ఎకరాలలో వున్న రైతాంగం మీద అసలు పన్ను వేయకూడదు. ధనికరైతుల పొలాలమీద ఎక్కువ పన్నులువేయాలి. ఎక్కువ పొలమున్నవారికి ఎకరానికి ఎక్కువగా పన్నువేయాలి. తక్కువ పొలమున్నవారికి తక్కువ పన్ను. ఐదు ఎకరాలలోపువారికి అసలు పన్నే ఉండకూడదు. ఈ పన్ను పద్ధతికే ఆదాయాభివృద్ధి క్రమం (గ్రేడెడ్‌టాక్స్) అని అంటాం.

ఈ రకంగా ఎక్కువ ఆదాయం వచ్చే భూస్వాముల మీద పన్ను వేస్తే వచ్చినలోటును పూడ్చగలం. ప్రజా మంత్రివర్గాలు తమ నిర్మాణ కార్యక్రమాన్ని, ప్రజోపయోగ పనులను కుంటుపడనీయకుండా కొనసాగించవచ్చును.

## రైతుల పొలాలు అన్యాక్రాంతం కాకూడదు

జమీందారీ ప్రాంతాలలో విపరీత వడ్డీ వ్యాపారాన్ని అరికట్టాలి. కౌలు నిర్భంధాలతోను, రైత్వారీ ప్రాంతాలలో శిస్తుల బాధతోను రైతులు కుంగిపోతున్నారు. రైతువద్ద ఏమి నిల్వలు లేకుండాపోయాయి. విత్తనాలు కొనవలసివచ్చినా, ఎరువులు, పశువులు, పనుముట్లు కొనుక్కోవలసివచ్చినా, పన్నులు, మగతాలు కట్టవలసివచ్చినా, తన యింటికి కావలసిన వస్తువులు కొనుక్కోవలసి వచ్చినా అప్పుకోసం వడ్డీ వ్యాపారస్తుని వద్దకు పరుగెత్తవలసి వస్తూవుంది. వడ్డీ వ్యాపారస్తుడే స్థానిక ధాన్యపు వ్యాపారిగా కూడా ఉంటున్నాడు. తాను ముందు ఇచ్చిన అప్పుల కోసం ధాన్యాన్ని మాసూళ్లలో తక్కువ ధరకు కొలుచుకుంటాడు. రైతుకు డబ్బు ఎంత అవసరమైతే అంత త్వరగా ధాన్యాన్ని అమ్ముకుంటాడు. తాను పండించే ధాన్యానికి తక్కువ ధరలు వస్తాయి. తన అప్పులూ తీరవు. తన అవసరాల కోసం, తిరిగి అప్పుల కోసం వడ్డీ వ్యాపారి వద్దకు పరుగెత్తుక పోవలసివస్తుంది. ఈ విధంగా రైతు క్రమేణా అప్పులలో మునిగిపోతూ ఉంటాడు. అప్పులు తీర్చడానికి తన పొలాలన్నీ అమ్ముకుంటాడు.

గత యుద్ధానంతరం కూడా యుద్ధాన్నుండి తిరిగివచ్చిన సైనికులకు ప్రభుత్వం భూములిచ్చింది. కానివారు వానిని సాగుచేయడానికి కావలసిన పశువులు, పనిముట్లు, పరపతిలేక అమ్ముకోవలసి వచ్చింది. ధనిక భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తులు సాధ్యమైనంత ఎక్కువ పొలాన్ని గుంజుకోడానికి ఎప్పుడూ ఎదురు చూస్తూ ఉంటారు. ఈ విధంగా లాగుకున్న పొలాలను తిరిగి రైతులకు విపరీతమైన కౌలుకిచ్చి లాభాలు గడిస్తారు.

సాగుచేసే రైతునుంచి వడ్డీ వ్యాపారస్తునిచేతిలోకి, ధనిక భూస్వామి చేతిలోకి భూమి పోకుండా చూడాలి. సాగుచేసే వాడివద్దనే భూమి శాశ్వతంగా ఉండేటట్లు చూడాలి. దీనికోసం ప్రజా ప్రభుత్వం పొలాలను ఇతరులకు అమ్మకూడదనీ శాసించాలి. అమ్ముకోదలచినవారు ప్రభుత్వానికే అమ్ముకోవాలి. ప్రభుత్వం ఆ పొలాలను కొని సాగుచేసే రైతుకు, వాని అవసరాల కొద్దీ పంచిపెడుతూ ఉంటుంది.

సామాన్యంగా ఏ రైతుకూడా పొలాన్ని అమ్ముకోవాలని చూడడు. వ్యవసాయానికి తగు సదుపాయాలు లేకనో లేక తన అప్పును తీర్చడానికో అమ్ముకుంటాడు. అందుచే ప్రజా ప్రభుత్వం రైతుల అప్పుబాధను తొలగించాలి. దీనికోసం...



(1) వ్యవసాయ కూలీల, బీదరైతుల అప్పులను ఇక చెల్లించనవసరం లేదని శాసనం ద్వారా రద్దు చేయాలి.

(2) మద్రాసు రుణనివారణ చట్టాన్ని ఈ కింది మార్పులలో రైతుల రుణబాధను తొలగించడానికి అమలు జరపాలి.

(ఎ) ఒక సవరణ, ధనిక భూస్వామికి తన అప్పులు చెల్లించడానికి కావలసిన ఆస్తి ఉన్నప్పుడు అతని అప్పులు కూడా తగ్గించవలసిన అవసరం లేదు.

(బి) వడ్డీరేటు నూటికి సంవత్సరానికి 6-4-0 నుండి 3 రూ.లకు తగ్గించాలి.

(3) 3 రూ.లకు మించిన వడ్డీలను నిషేధిస్తూ శాసనం చేయాలి. వడ్డీ వ్యాపారాన్ని కంట్రోలులో ఉంచడానికి ప్రభుత్వమే మూలమూలల కో-ఆపరేటివ్ బ్యాంకుల నేర్పరచాలి. కో-ఆపరేటివ్ బ్యాంకులు ఏర్పడని చోట ప్రభుత్వ బ్యాంకులేర్పరచి, రైతులకు మూడు రూపాయల వడ్డీతో అప్పులు ఇవ్వాలి.

## సహకార పద్ధతులపై వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తాం

మన వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి బీదరైతులు తమ పొలాలను సాగుచేసుకోడానికి ఈ కింది చర్యలను ప్రజా ప్రభుత్వాలు వెంటనే అమలు జరపాలి.

1. రైతులకు వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, ఇంకా కావలసిన ఇతర సదుపాయాలను, పరపతిని, ప్రభుత్వం సరఫరా చేయాలి. ఈ పనిని వ్యవసాయ డిపార్టుమెంటును మరింత పెంచి రైతు సంఘాల సాయం తీసుకొని పనిచేయాలి.

2. ప్రతి తాలూకాలోను వ్యవసాయాభివృద్ధికి శాస్త్ర పరిశోధనలు సాగించడానికి, చుట్టుపక్కల రైతులకు ఆదర్శంతంగా ప్రదర్శించడానికి వ్యవసాయ క్షేత్రాలు, పరిశోధనా కేంద్రాలు నెలకొల్పాలి. పంటలకు వచ్చే తెగుళ్లను నాశనం చేయడానికి తోడ్పడాలి.

3. ప్రతి తాలూకాలో పశువులపెంచే కేంద్రాన్ని ఏర్పరచాలి. తాలూకా కేంద్రంలో ఒక పెద్ద పశువైద్యశాల, ప్రతి ఫిర్కాకు ఒక టూరింగ్ పశువైద్యుడు ఉండాలి.

4. రైతుల పశువులు అడవులలో మేయడానికి అవకాశాలివ్వాలి. పుల్లరులు చాలా కొద్దిగా వసూలు చేయాలి. ఆకు సత్తువను ప్రోగుచేసుకోడానికి అడ్డుపెట్టరాదు. కట్టెలు చౌకగా కొట్టుకోడానికి అనుమతినివ్వాలి. వ్యవసాయ పనిముట్లు, ఇండ్లకు కావలసిన కలప బీదరైతులకు చౌకగా ఇవ్వాలి. కొండజాతులవారికి, అడవులలో నివసించే జాతులకు, అడవి పండ్లు, తేనె మొదలగునవి ప్రోగుచేసి అమ్ముకోడానికి ఎట్టి రుసుము లేకుండా అనుమతి నివ్వాలి.

వ్యవసాయాభివృద్ధికి, కావలసిన రీతి అటవీ సంపదను అభివృద్ధి పరచాలి. అడవులు పెంచాలి.

5. గ్రామాలలో రైతులందరూ కలిసి సహకార పద్ధతులపై వ్యవసాయం చేసుకోడానికి ప్రోత్సహించాలి. ముఖ్యంగా బీదరైతులు ఆధునిక యంత్రాలు ఉపయోగించి తమ పంటలను, ఆదాయాన్ని ఎక్కువ చేసుకోడానికి సహకార పద్ధతి మీద వ్యవసాయాన్ని కలిసి చేసేటట్లు ప్రోత్సహించాలి. ప్రజా ప్రభుత్వం అటువంటి సహకార వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పడానికి కావలసిన యంత్రాలు, తదితర టెక్నికలు సహకారన్నంతా యిచ్చి ప్రత్యేక కృషి చేయాలి. వెంటనే ప్రజా ప్రభుత్వమే బంజరులను వ్యవసాయ కూలీలకు యిచ్చి సాగుకు తెచ్చేటప్పుడు ఆదర్శప్రాయమైన వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పాలి. వానిని చూసి యితర రైతాంగం కూడా సహకార వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పుతారు. కొత్త పొలాలను సాగుకు తేవడానికి, వ్యవసాయానికి కావలసిన సామాగ్రినంతా అమెరికన్ యుద్ధ సామాగ్రి నుండి ప్రభుత్వం తీసుకోవాలి.

మన దేశంలో చిన్న చిన్న పొలాలను, లక్షల కొలది రైతాంగం నేడు వేరువేరుగా సాగుచేస్తున్నారు. ఈ చిన్నచిన్న పొలాలన్నిటినీ కలిపి విశాల వ్యవసాయ క్షేత్రాలుగా, సహకార పద్ధతుల మీద ఆధునిక యంత్రాలను విరివిగా ఉపయోగించి సాగుచేయాలి. ఈ రకంగా మనం మన వ్యవసాయాన్ని పూర్తిగా పునర్నిర్మించినప్పుడే మన రైతాంగాన్ని దారిద్ర్యాన్నుండి పూర్తిగా తొలగించగలుగుతాం. అప్పుడే మన ప్రజలకు కావలసిన పంటలన్నింటినీ మన వ్యవసాయం ద్వారా పండించుకోగలం. అప్పుడే రైతులు, వృత్తిదారులు, కూలీలు అందరూ ఒకే వ్యవసాయ క్షేత్రంలో ఒకరితో ఒకరు సహకారంతో పనిచేసి వారి శ్రమకు తగిన ఆదాయాన్ని పొందుతారు. ఈ ఐక్య కృషి మీదనే ఆధునిక గ్రామసీమలను ఏర్పరచగలుగుతాం. అయితే ఇలాంటి గ్రామసీమల నిర్మాణం ప్రజా ప్రభుత్వమున్నప్పుడే సాధ్యమవుతుంది. ఈ ప్రజా ప్రభుత్వం ధైర్యంగా ముఖ్య పరిశ్రమలన్నింటినీ, రవాణా సౌకర్యాలను, గనులను, బ్యాంకులను యీ ప్రభుత్వాధీనం చేసుకొని దేశమంతటా పారిశ్రామికాభివృద్ధికి పూనుకోవాలి. ఆ పరిశ్రమాభివృద్ధితో పాటు జమీందారీ పద్ధతి, భూస్వామి, ముఠాదారీ, ఇనాందారీ పద్ధతులను రద్దుచేసి, భూమినంతా ప్రభుత్వ పరం చేసుకొని వ్యవసాయాభివృద్ధికి పూనుకోవాలి. బీద రైతాంగానికి, పొలంలేని వ్యవసాయ కూలీలకు కొత్తగా సాగుకుతెస్తూ వున్న పొలాలను, బంజరు పొలాలను యిచ్చి సహకార పద్ధతులపై వ్యవసాయాభివృద్ధికి కృషిచేయాలి. అప్పుడే కమ్యూనిస్టు పార్టీ కోరిన వ్యవసాయాభివృద్ధి, నూతన గ్రామసీమలు మనం చూడగలుగుతాం.

## రైతుకు గిట్టుబాటయ్యే ధర ఇవ్వాలి ! ప్రజలకు చౌకగా ఆహారాన్ని అందించాలి

గత యుద్ధానంతరం ధాన్యాల ధరలు మూడు సంవత్సరాల పిదప పడిపోసాగాయి. 1930–34లో ఆర్థిక క్షోభ సమయంలో కూడా పంటల ధరలు పూర్తిగా పడిపోయాయి. 1919–21 మధ్యనున్న ధరలలో నూటికి 42 పాళ్లు మాత్రమే 1930–34లలో వుండేవి.



పరిశ్రమాధికారులు, ఆర్థిక సంక్షోభం తమ్మెదుర్కొని తమ లాభాలు తగ్గేట్లున్నప్పుడు తాము తయారు చేసే వస్తువుల ధరలు పడిపోకుండా అనేక కుటిల ప్రయత్నాలు చేస్తారు. ఉత్పత్తిని తగ్గించివేస్తారు. కార్మికులను పనిలో నుండి తీసివేస్తారు. వారి జీతాలను తగ్గిస్తారు. పెట్టుబడిదారులు పరిశ్రమాధికారులు, బ్యాంకుల మీద, పరపతి కరెన్సీ విధానం మీద వ్యాపారం మీద తనకున్న పెత్తనాన్ని పురస్కరించుకొని తమ వస్తువుల ధరలు ఎక్కువగా ఉండేటట్లు, రైతుల నుండి తాము కొనే ముడిసరుకుల ధరలు తక్కువగా వుండేటట్లు అనేక పనులు చేస్తూవుంటారు.

పత్తి, చక్కెర, పొగాకు వేరుశనగ మొదలగు వర్తకపు పంటల ధరలు ప్రపంచ మార్కెట్ ధరలననుసరించి, పెట్టుబడిదారులు సరాసరి కంట్రోలు చేస్తూ వుంటారు. ఆంధ్రలో, రాయలసీమ జిల్లాలలో తయారైన పత్తిని ఈ యుద్ధకాలంలో బొంబాయి మిల్లు యజమానులు కొనలేదు. ఒక కనీసపు ధర నిర్ణయించి అంతకన్న ధరలు పడిపోతే తానే కొంటానని ప్రభుత్వం ప్రకటించింది. కాని అదికూడ కొనలేదు. ఇది జరిగిన రోజులలో మన దేశంలో గుడ్డల కరువు విపరీతంగా వుంది. గుడ్డల ఖరీదులు యుద్ధానికి ముందుకంటే మూడురెట్లు, ఐదురెట్లు వున్నాయి. గుడ్డల మిల్లుల యజమానులు కోట్ల లాభాలు గడిస్తూ వచ్చారు. కాని రైతుల నుండి పత్తిని రైతుకు గిట్టుబాటయ్యే ధర యిచ్చి మన ప్రజలకు కావలసిన గుడ్డను తయారు చేయడానికి మాత్రం యీ మిల్లు యజమానులు నిరాకరించారు.

చెరుకు ధరలు కూడా ప్యారీ కంపెనీలాంటివి నిర్ణయిస్తాయి. ప్రభుత్వం చేత రైతులకు నష్టకరమైన ధరలు నిర్ణయించేటట్లు చూస్తాయి. ఈ తక్కువ ధరలకు చక్కెర ఫ్యాక్టరీలకే అమ్మవలసిందనీ, కడకు బెల్లము కూడా తయారు చేయకూడదని ప్రభుత్వం శాసిస్తున్నది.

రైతులు చెరుకు వేయకుండా ఇతర ధాన్యాలు వేసుకుంటామంటే దానికి నీటి సరఫరా ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరిస్తుంది. పడమట పంపింగ్ ప్రాజెక్టును ఆ రకంగా ఆపివేసింది.

తుమ్మపాల తదితర ప్రాంతాలలో రైతుకు చెరుకు ధర గిట్టుబాటయ్యేటట్లు నిర్ణయించాలని రైతు సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ ప్రతి సంవత్సరమూ ఆందోళన చేసి, కొంతవరకు రైతులకనుకూలంగా నిర్ణయించేటట్లు చేయగలిగాం.

సామర్లకోట చక్కెర ఫ్యాక్టరీ (ప్యారీ కంపెనీ వారిది) 1931–43 మధ్య 45 లక్షల రూపాయలు లాభాలు సంపాదించింది. తాను పెట్టిన పెట్టుబడి 13 లక్షల 64 వేలయితే, దానికి మూడున్నర రెట్లు లాభాలు గడించింది. అయితే రైతులకు మాత్రం గిట్టుబాటయ్యే ధరలివ్వడానికి తయారుకాదు.

వేరుశెనగ ధరలను ర్యాలీ అండ్ కంపెనీ కంట్రోలు చేస్తుంది. ఈ కంపెనీయే తెలుగు జిల్లాల నుండి ఎక్కువ వేరుశెనగను కొని ఎగుమతి చేస్తూ వుంటుంది. పొగాకు ధరలను ఐ.ఎల్.టి.డి. కంపెనీ కంట్రోలు చేస్తుంది. ఇవన్నీ ఇంగ్లీషువారి కంపెనీలు. వ్యాపార పంటలను మన తెలుగుదేశంలో మూడవ వంతు పొలంలో వేస్తున్నారు. అంటే ఇంత పొలంపై యీ పంటలను పండించే రైతాంగమంతా ఇంగ్లీషు పెట్టుబడిదారుల చేతులలో ఇరుక్కొని వున్నారు.

బియ్యం, సజ్జ, జొన్న మొదలగు ఆహార ధాన్యాలను తీసుకుంటాము. ఈ రోజు తిండి కరువు దేశమంతటా వుంది. ప్రజలకు ధాన్యం కావాలి. అయినా ఎక్కువ మంది రైతాంగానికి గిట్టుబాటయ్యే ధరకూడా పోతుంది. ఎందువల్లనో చూద్దాం.

బెంగాల్ కరువు నుండి మనం పాఠాలు నేర్చుకోవాలి. 1943 సంవత్సరం బెంగాల్‌లో ఆహార ధాన్యాలలో కొద్ది కొరత ఏర్పడింది. జమీందారులు, వర్తకులు రైతుల నుండి వసూళ్లలోనే ధాన్యాన్ని ప్రోగుచేసుకొని కూర్చున్నారు. వీరు కరువు నెలలలో విపరీతమైన లాభాలు వేసుకొని అమ్మారు. బస్తా బియ్యం రూ.100–200కు అమ్మారు. కొన్ని స్థలాలలో రూ.300కు కూడా అమ్మారు. దొంగ మార్కెట్‌లో దొంగ వ్యాపారం చేసి 150 కోట్లు లాభాలు గడించారని, 15 లక్షల మంది కరువులో చనిపోయారని ప్రభుత్వపు లెక్కలు తెలిపాయి. అంటే దొంగ వ్యాపారస్తులు తాము గడించిన ప్రతి రూ1000లకు ఒక మనుష్యున్ని బలి తీసుకున్నారన్నమాట!

1943 అక్టోబరు, నవంబరులలో ఇంత విపరీతంగా బెంగాల్‌లో బియ్యపు ధరలు వున్నాయి. కాని కొత్తపంట వచ్చేసరికి ధాన్యాన్ని దాచి వుంచిన వర్తకులు తమ పాత ధాన్యాన్ని మార్కెట్‌లోకి దించి చౌకగా అమ్మసాగారు. కొత్త పంటల ధరలు కూడా కారుచౌకగా రైతులు అమ్ముకోవలసి వచ్చింది. ఈ తక్కువ ధరలకు వర్తకులు కొత్త పంటను చాలావరకు కొనివేశారు. ఆ మాసూళ్లు అయిపోయిన కొన్ని నెలలకు మరల బస్తా బియ్యాన్ని రూ.72 మొదలు రూ.90ల వరకు అమ్మసాగారు. జమీందారులు, దొంగ వ్యాపారస్తులు బియ్యపు వ్యాపారాన్నంతా తమ స్వాధీనంలోకి తెచ్చుకొని, మాసూళ్లలో రైతుకు తక్కువ ధర ఇస్తున్నారు. తదుపరి ప్రజలకు అమ్మే సమయం వచ్చినప్పుడు చాలా ఎక్కువ ధరకు అమ్మడం సాగిస్తున్నారు. రైతాంగం పేదరికం హెచ్చే కొద్దీ నిస్సహాయులై, మాసూళ్లలోనే తమ ధాన్యాన్ని తక్కువ ధరకు జమీందారులకు, పెద్ద భూస్వాములకు, వ్యాపారస్తులకు అమ్ముకోవలసి వస్తుంది.

ఆంధ్రలో కూడ బీద రైతులు, చిన్న రైతులు, తమ ధాన్యాన్ని మాసూళ్లలో 2 మణుగుల బస్తా రూ.10 మొదలు 8 రూపాయలకు కూడ మిల్లు యజమానులకు అమ్ముకోవడం మనం చూస్తున్నాం. మూడు మణుగుల బస్తా బియ్యం రూ.24ల కంట్రోలు ధర ఉన్నప్పుడు న్యాయమైన లాభాలు వేసుకొని రైతుకు బస్తా ధాన్యానికి రూ.11 వరకు ఇవ్వడానికి అవకాశముంది. కాని రెండు మూడు రూపాయలు తగ్గించి వర్తకులు కొంటున్నారంటే రైతాంగాన్ని ఏ విధంగా దోచుకుంటున్నదీ తెలుస్తుంది. ఇంతేగాదు, ఈ వర్తకులు బియ్యాన్ని కంట్రోలు రేటుకు అమ్మడం అరుదు. బస్తా బియ్యాన్ని రూ.27లు మొదలు 36 రూపాయల వరకు అమ్ముతుంటారు. కొరత ప్రాంతాలలోను కరువు ప్రాంతాలలోను మరింత అధికధరలకు అమ్ముతారు. మొన్న ఈ మధ్య తుపాను వచ్చినప్పుడు వచ్చే సంవత్సరానికి పంటలు తగ్గుతాయని అందరికీ తెలిసిందే. వెంటనే మిల్లు యజమానులు, పెద్ద భూస్వాములు, వర్తకులు, తమవద్దనున్న ధాన్యానికి ధరలు పెంచేశారు. కంట్రోలు రేటు రూపాయికి నాలుగు శేర్లు బియ్యం అయినా, రూపాయికి రెండున్నర, మూడు శేర్ల చొప్పున దొంగ మార్కెటులో అమ్మడానికి మొదలుపెట్టారు. దీనిని బట్టి ఆంధ్రలో



కూడ బెంగాలులో వలె బియ్యపు ధరలను కంట్రోలు చేయడానికి జమీందారులు, పెద్ద భూస్వాములు, దొంగ వ్యాపారస్తులు ప్రయత్నిస్తున్నారని తేలుతూ ఉంది. వీరి ఆటలు సాగితే రైతులకు తక్కువ ధరలిచ్చి, ప్రజలకు ఎక్కువ ధరలకు ఆహారాన్ని అమ్ముతారు!

ఈ పరిస్థితులీవిధంగా ఉంటే ప్రభుత్వం ఏమిచేస్తూ ఉందో చూద్దాం. యుద్ధ కాలంలో కోట్ల కొలది రూపాయలు ఖర్చుచేస్తూ వచ్చింది. కాని యుద్ధం పూర్తి అయ్యాక, యుద్ధం నుండి తిరిగివచ్చే సైనికులకూ, యుద్ధ పరిశ్రమలో నుండి పంపించివేయబడే కార్మికులకూ యుద్ధ కాలంలో లాగానే కోట్లు ఖర్చుపెట్టి, పని కల్పించడానికి ప్రభుత్వం పూనుకోవడం లేదు. పెద్ద పరిశ్రమలను, రోడ్లు, రైలు మార్గాలను, ఇరిగ్రేషను ప్రాజెక్టులను నిర్మించడానికి పూనుకోవడం లేదు. కార్మికులను యుద్ధ పరిశ్రమల నుండి తీసేస్తూ ఉంది. దీని ఫలితం మరింత నిరుద్యోగం రోజురోజుకు పెరిగి పోతుంది. ప్రజలు సంపాదించేది రోజురోజుకు తగ్గిపోతుంది. ప్రభుత్వపు ఖర్చు తగ్గేకొద్దీ ప్రజలు సంపాదించి ఖర్చు పెట్టడం కూడ తగ్గినప్పుడు అన్ని వస్తువుల ధరలు పడిపోతాయి. ధరలీరకంగా పడిపోవడానికి ఆరంభించినప్పుడు పెట్టుబడిదారులు, పరిశ్రమాధిపతులు తమ వస్తువుల ధరలు పడిపోకుండా ఆహార పదార్థాలు, పత్తి, పొగాకు, వేరుశనగ, చెరకు మొదలగు ముడి సరుకులకు ధరలు తగ్గించడానికి ప్రయత్నిస్తారు. అందులో కొంతవరకు కృతకృత్యులు కావడానికి కూడా అవకాశముంది. రైతులు పండించే ముడి సరుకుల ధరలు ఫ్యాక్టరీలలో తయారయ్యే వస్తువుల ధరలకన్నా హెచ్చుగా పడిపోతాయి. అందుచే రైతు తానమ్మే వస్తువులకు తక్కువ సంపాదించుకుంటాడు. తాను కొనుక్కోవలసిన వస్తువులకు ఎక్కువ ఇచ్చుకోవలసి వస్తుంది. ప్రజలు తాము కొనుక్కొనే వస్తువులన్నిటికీ, తిండితో సహా ఎక్కువ ధరలు బ్లాకు మార్కెటులో తెచ్చుకోవలసి ఉంటుంది.

అందుచే కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమంలో ముఖ్యాంశం ఇది. భూస్వామి, వడ్డీ వ్యాపారి, దొంగ వ్యాపారస్తుడు ఈ త్రిమూర్తుల బారినుండి రైతును రక్షించడానికి, అమిత లాభాపేక్షులైన దొంగ వ్యాపారస్తుల చేతుల నుండి ధాన్యపు వర్తకాన్నంతా తొలగించివేయాలి. ప్రజా ప్రభుత్వమే ప్రతి గ్రామంలో ధాన్యాన్ని కొని అమ్మే సహకార విక్రయ సంఘాలను (కో–ఆపరేటివ్ స్టోర్సును) ఏర్పాటు చేయాలి. వానిపై తాలూకా కో–ఆపరేటివ్ స్టోర్సు, జిల్లా కో–ఆపరేటివ్ స్టోర్సు, ముఖ్య పట్టణాలలో పట్టణ కో–ఆపరేటివ్ స్టోర్లును ఏర్పరచాలి. కో–ఆపరేటివ్ స్టోర్సు రైతుల నుండి వారికి గిట్టుబాటయ్యే ధరకు మిగులు ధాన్యాన్నంతా కొంటాయి. ప్రజా ప్రభుత్వం గిట్టుబాటయ్యేటట్టు ధరను నిర్ణయిస్తుంది. గ్రామాలలో ఈ ఆహార ధాన్యాలను నిలువచేయడానికి ఏర్పాటు చేస్తాయి. గ్రామాలలో పంటలు లేని ప్రజలకు ఇతర వృత్తిదారులకు చౌకగా న్యాయమైన రేట్లకు అమ్ముతాయి. గ్రామాలకు పోను మిగులు ధాన్యాన్ని జిల్లా, రాష్ట్ర కేంద్ర ధాన్యపు స్టోర్సుకు అమ్ముతాయి. ఆ రకంగా పట్టణ ప్రజలకు కూడ న్యాయమైన చౌక ధరలకు ఆహార ధాన్యాలు దొరుకుతాయి. ఈ సహకార విక్రయ సంఘాలే (కో–ఆపరేటివ్ స్టోర్సు) రైతులకు కావలసిన పనిముట్లు – ఎరువులు, గుడ్డలు, కిరసనాయిల్, చక్కెర, ఉప్పు వగైరా సామగ్రిని కంట్రోలు రేట్లకు అమ్ముతాయి.

ధాన్యాలలోని వ్యాపారమంతా వ్యక్తిగత వర్తకుల చేతుల నుండి తీసివేసి, కో–ఆపరేటివ్ స్టోర్స్ ద్వారా నడపడం వల్ల చిన్న వర్తకులకు, చిల్లర వర్తకులకు జీవనోపాధిపోదు. ఎందుకంటే నేడు వారిస్థితి దొంగ మార్కెటు చేసే పెద్ద వ్యాపారస్తుల కింద ఏజెంట్లు తప్ప మరేమీ కాదు. రేపు ఈ కో–ఆపరేటివ్ స్టోర్స్‌లలో ఉద్యోగులుగా వుంటారు. అప్పుడు దొంగ వ్యాపారస్తులకు లాభం సంపాదించి పెట్టడానికి గాక ప్రజలకు వస్తువులను సక్రమంగా అందించి ప్రజల యెడల తమ కర్తవ్యాన్ని నెరవేర్చుకోడానికి తమ జీవనోపాధిని సంపాదించుకోడానికి తమ అనుభవాన్ని వినియోగిస్తారు. వారు న్యాయమైన వ్యాపారం చేసేటప్పుడు సంపాదించేకన్నా ఏమాత్రం తగ్గకుండా ఈ స్టోర్సులలో వారికి జీతబత్తెములుంటాయి. ఈ స్టోర్సుల వలన నష్టపడేది 1943–45ల మధ్య గుత్తాధికారం సంపాదించిన పెద్దపెద్ద దొంగ వ్యాపారస్తులు మాత్రమే. వారి వ్యాపారము మాత్రమే లేకుండా జేయబడుతుంది.

ఈ స్టోర్సు వలన రైతుకు తాను పండించిన పంటకు గిట్టుబాటయ్యే ధర ఖచ్చితంగా దొరుకుతుంది. గ్రామ, పట్టణ ప్రజలు తమ తిండిని న్యాయమైన ధరలకు కొనుక్కోగల్గుతారు. మిగులు ధాన్యాన్ని గ్రామాలలోను, పట్టణాలలోను సిమెంటు కాంక్రీటు గిడ్డంగులలో నిలువ చేయబడి ఎప్పుడు ఎక్కడికి అవసరమైతే అచ్చటికి పంపించడానికి వీలవుతుంది.

## వ్యవసాయ కూలీలు

మన గ్రామాలలో సగానికి సగం మంది వ్యవసాయ కూలీలను చూశాం. వీరిలో ఎక్కువ మంది ఆదిమాంధ్రులు. తెలుగు ప్రజల మొత్తం జనాభాలో షెడ్యూల్డు క్యాస్టు ప్రజలు (నిమ్నజాతి ప్రజలు) ఐదవ వంతు వున్నారు. వ్యవసాయ కూలీలలో వీరుగాక గౌడ, శెట్టిబలిజ, యాదవ, కాపు, కమ్మ, రెడ్డి కుటుంబాల నుండి కూడ కొద్దిగా వున్నారు.

ఆదిమాంధ్రులు గ్రామాలకు బయట పల్లెలలో నివసిస్తున్నారు. వారి ఇండ్లు మురుగు కూపాలలో చాల అపరిశుభ్ర స్థలాలలో, క్రిక్కిరిసి ఉంటున్నాయి. సాంఘికంగా వారిని అంటుకోరాదని ఇతర కులస్తులు దూరంగా పెట్టారు. వీరిని, గ్రామస్తులందరూ ఉపయోగించే చెరువుల నుండి, నూతుల నుండి నీళ్లు తెచ్చుకోనివ్వరు. కొన్ని గ్రామాలలో వారిని కొన్ని వీధుల గుండా కూడా పోనివ్వరు. గ్రామంలో పాఠశాలలకు ఇతర కులస్తులు వస్తే వీరిని రానివ్వరు. వారికి ప్రత్యేకంగా వారి పల్లెలలో వేరే స్కూళ్లు కొద్దిగా ఏర్పాటు చేశారు.

పాలేరుకు సంవత్సరానికి రూ.100 మొదలు 250 రూపాయల వరకు జీతముంటుంది. దినకూలీకి రోజుకు 4 అణాల నుండి రూపాయి వరకు ఆయా స్థలాన్ని బట్టి, ఫలితాన్ని బట్టి వుంటుంది. స్త్రీలకు పురుషులకన్నా తక్కువ జీతాలిస్తారు. నెలకొక రోజుకూడ పాలేరుకు సెలవు ఉండదు. అతనికి నియమిత గంటలని వుండవు. రాత్రనక, పగలనక ఎప్పుడు పడితే అప్పుడు పనిచేయాల్సి వుంటుంది. కోతలు, ఊడ్పులు (నారువేతలు) మొదలగు పనిరోజులలో ఎక్కువ గంటలు పనిచేయాల్సి వుంటుంది. పనిలేని రోజులలో తక్కువ గంటలు



పనివుంటుంది. జబ్బుపడితేగాని, ఏమైనా ప్రమాదం కల్గినగాని, ముసలితనంలోగాని అతని పోషణకు తగిన ఏర్పాటేమీ లేదు.

1932 నుండి కమ్యూనిస్టు పార్టీ, వ్యవసాయ కూలీ సంఘాలను ఏర్పర్చి పనిచేస్తూవుంది. వీరిలో ఆదిమాంధ్రులు, క్రైస్తవులు లేక ఏ ఇతర కులాలకు చెందినవారినైనా వ్యవసాయ కూలీలనందరినీ కలిపి సంఘాలు ఏర్పాటు చేయడానికి కృషిచేస్తూ వచ్చింది. ఈ వ్యవసాయ కూలీ ఉద్యమం గ్రామాలలో రైతులతో దగ్గరి సంబంధాలు పెట్టుకొంటూ, పరస్పర సహకారంతో అభివృద్ధి అవుతూ వచ్చింది. వ్యవసాయ కూలీల కోర్కెలను, రైతుల కోర్కెలను రెండూ, గ్రామంలో వీరిరువురి ఐక్య ఉద్యమాభివృద్ధి వల్లనే సాధించగలిగాం. బంజరు పొలాలు కావాలన్నా, న్యాయమైన కూలీరేటు కావాలన్నా, పరిశుభ్రమైన ఇండ్లు, విద్యా సౌకర్యాలు, సాంఘిక, ఆర్థిక రక్షణ కావాలన్నా రైతుకూలీ సామరస్యం వల్లనే అవి సాధ్యమవుతాయి. వారిద్దరి ఐక్య ఉద్యమం వల్లనే గ్రామాన్నంతా పీడించుకుంటున్న ఇంగ్లీషు ప్రభుత్వాన్ని దాని తాబేదారులైన జమీందారులు పెద్ద భూస్వాములు, దొంగ వ్యాపారస్తులను ఎదుర్కొని తమ కోర్కెలను నెరవేర్చుకోగలరు. చాలా గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీ వ్యవసాయ కూలీ సమ్మెలను ధనిక భూస్వాములు గావించే అన్యాయాలను వ్యతిరేకిస్తూ నడిపింది. జీతాలు హెచ్చు జేయాలనీ, సక్రమ కొలత పాత్రలతో యివ్వాలనీ, ఇతర సదుపాయాలు కల్గించాలనీ చేసిన ఈ సమ్మెలను తదితర రైతాంగం బలపర్చుతూ వచ్చింది.

ఆదిమాంధ్రులు వేలకొలది సంవత్సరాలుగ సామాజికంగాను, ఆర్థికంగాను అణగదొక్కబడి ఇప్పుడిప్పుడే మేల్కొంటున్నారు. అంటరానితనం పోవాలని కాంగ్రెసు చేస్తూ వచ్చిన ప్రచార ఉద్యమం సరిపోదని, కొన్ని హరిజన హాస్టల్సు, హరిజన విద్యార్థులకు కొంతమందికి చదువుకోడానికి కొంత నెలసరి జీతాలేర్పరచడం యివి సరిపోవని తెలుసుకుంటున్నారు. మొట్టమొదట కాంగ్రెసు ఉద్యమంలో గాంధీజీ నాయకత్వాన వారు మేల్కొన్నారు. గత 25 సంవత్సరాల జాతీయోద్యమం, ఆంధ్రలో గత 15 సంవత్సరాల వ్యవసాయ కూలీ ఉద్యమం వీని ప్రభావం చేత నేడు వారు సమాన ఆర్థిక, రాజకీయ, సామాజిక అధికారాలను కోరుతున్నారు. వారిలో చదువుకున్న యువకులు, ఉపాధ్యాయులు తమకొక సంఘం కావాలంటూ షెడ్యూల్డు క్యాస్టు ఫెడరేషన్ నిర్మించుకుంటున్నారు. షెడ్యూల్డు క్యాస్టు ఫెడరేషన్‌లో ఆదిమాంధ్రులకందరికీ ఏ రాజకీయ పార్టీకి చెందినా శ్రీ అంబేద్కరు అనుయాయులు గాని, కాంగ్రెసుకు చెందినవారు గాని, కమ్యూనిస్టు పార్టీని బలపరిచేవారుగాని, అందరికీ స్థానముండాలని కమ్యూనిస్టులం పనిచేస్తున్నాం. షెడ్యూల్డుక్యాస్టు ఫెడరేషను, ఇతర కులాలలోని వ్యవసాయ కూలీలలోను, క్రైస్తవ షెడ్యూల్డుక్యాస్టు కూలీలలోను కలిసి ఒక ఐక్య వ్యవసాయ కూలీ ఉద్యమాన్ని నిర్వహించడానికి కమ్యూనిస్టులం కృషిచేస్తాం. ఈ ఐక్య వ్యవసాయ కూలీ ఉద్యమం గ్రామాలలో రైతులతోను, పట్టణాలలో అభివృద్ధి కోరే ప్రజలతోను, కాంగ్రెసు, లీగు – కమ్యూనిస్టు పార్టీలతోను కలిసి, ఇంగ్లీషు ప్రభుత్వాన్నుండి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని

సంపాదించుకోడానికి పనిచేస్తుంది. వ్యవసాయ కూలీల ఈ క్రింది కనీసపు కోర్కెల కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం కృషిచేస్తూ వుంటుంది.

1. వ్యవసాయ కూలీలకు బీద రైతులకు బంజరు భూములను ఇప్పించాలి.
2. వ్యవసాయ కూలీల అప్పులను పూర్తిగా రద్దుచేయాలి.
3. కనీసపు కూలీని నిర్ణయిస్తూ చట్టం చేయాలి. ఈరోజు పరిస్థితులలో ఊడ్పులు కోతల కాలంలో బస్తా ధాన్యం (72 శేర్ల బస్తా) ఎన్ని రూపాయలు అమ్ముతుందో అన్ని అణన్నరలకు తక్కువగాకుండా దినకూలీ వుండాలి. మిగిలిన కాలాలలో బస్తా ధాన్యం ఎన్ని రూపాయలు అమ్ముతుందో అన్ని అణాలకు తగ్గకుండా వుండాలి. ప్రస్తుతపు ధరలను బట్టి రోజుకు 10 అణాలకు తగ్గకుండా రూ.1 వరకు దినకూలీగా గ్యారంటీ చేయాలి.

   కూలీ ధాన్య రూపంగా ఇస్తే దబ్బుకు సరిపొయ్యే ధాన్యాన్ని కొలచి ఇవ్వాలి.
4. వెంటనే సంవత్సరానికి కనీసం ఒకనెల రోజులు సెలవులుండాలని చట్టం చేయాలి. క్రమేణ వ్యవసాయాభివృద్ధి జరిగేకొద్ది పారిశ్రామిక కార్మికులకెట్టి శెలవులున్నాయో అట్టి శెలవులే వ్యవసాయ కూలీలకు కూడ యిప్పిస్తూ చట్టం చేయవలసి వుంటుంది.
5. వ్యవసాయ కూలీల యెడ మర్యాదగా ప్రవర్తించాలి. వారిని దూషించరాదు.
6. ప్రభుత్వం, వ్యవసాయ కూలీలు జబ్బు పడినప్పుడు ప్రమాదానికి గురైనప్పుడు, ముసలితనం నిరుద్యోగాలకు గురైనప్పుడు వారికి భీమా పద్ధతిమీద జీవిత భృతి కలిగించాల్సి వుంటుంది. దానికయ్యే ఖర్చంతా ప్రభుత్వమే పెట్టుకోవాలి.
7. వారికి మంచి ఇండ్ల వసతులు కల్పించాలి. దానికోసం కావలసిన భూమిని ఎచ్చటనున్నా తీసుకోవాలి. వారి పల్లెలలో మంచి వీధులు, దీపాలు వెలిగించాలి. తాగడానికి ఎక్కువ నూతులు తవ్వించాలి. ఎక్కువ విద్యా సౌకర్యాలు కల్పించాలి.
8. ఉద్యోగాలలోను జనాభాకు తగినట్లు స్థానాలివ్వాలి. శాసనసభలలోను, పంచాయతీ, జిల్లా బోర్డులలో షెడ్యూలు కాస్టు ప్రతినిధులు వారి జనాభాకు తగినట్లు ఉండాలి. వారు ఆర్థికంగాను, సామాజికంగాను వెనకబడి ఉన్నంతకాలమూ, వారు కావాలంటే, ప్రత్యేక నియోజకవర్గాలద్వారానే వారి ప్రతినిధులను వారు ఎన్నుకోవచ్చు.
9. పబ్లిక్ స్థలాలలో ఉన్న బావులు, చెరువులు, వీధులు, సత్రములు, స్కూళ్లలోకి వారు స్వేచ్ఛగా పోవచ్చు. దీనికి అడ్డంకులు కల్గించడం నేరంగా పరిగణించబడుతుంది. అంటరానితనాన్ని పాటించి వారిని హేయంగా చూడడం కూడా నేరంగానే పరిగణింపబడుతుంది.
10. పొలాలు, వ్యవసాయంలో పని చూపించలేని వ్యవసాయ కూలీలందరికీ కొత్త పరిశ్రమలను నిర్మించడంలోను, పెద్దపెద్ద ఇరిగేషను ప్రాజెక్టులు, రోడ్లు, రైల్వే స్కీములను నిర్మించడంలోను పని కల్పించాలి.



## సైన్యము నుండి తిరిగివచ్చే సైనికులు

ఇంగ్లీషు ప్రభుత్వం నేడు వ్యవసాయ కూలీలు, బీదరైతులు, సాగుచేస్తున్న బంజరు భూములను వారినుండి తీసుకొని సైన్యాన్నుండి తిరిగివచ్చిన వారికివ్వాలని చూస్తూవుంది. అదేవిధంగా రైల్వేలలోను, ఇతర ఫ్యాక్టరీలలోను కార్మికులను ఉద్యోగంలో నుండి తీసివేసి సైన్యంలో నుండి వచ్చినవారికి ఇవ్వాలని ప్రయత్నాలు చేస్తూవుంది. దీనివలన యుద్ధకాలంలో బంజర్లు సాగుచేస్తున్న వ్యవసాయ కూలీలకు యుద్ధకాలంలో సైన్యంలో చేరిన కూలీలకూ మధ్య చీలికలు, తగాదాలు పెట్టడానికి చూస్తూవుంది. అదేరీతిగా పరిశ్రమలలో ఇదివరకు పనిచేస్తూ ఉన్న కార్మికులకు యుద్ధంలో సైనికులుగా చేరి టెక్నికల్‌గా తయారైన కార్మికులకు మధ్య తగాదా పెట్టడానికి చూస్తూవుంది. అంతేకాదు సైన్యంలో నుండి తిరిగి వచ్చేవారికి గ్రామ, పట్టణాలలో వుండే నిరుద్యోగులందరికీ పనికల్పించే మార్గం చూడడం లేదు. పెద్దపెద్ద పరిశ్రమలను, ఇరిగేషను, రైలు, రోడ్లు ప్రాజెక్టులను పెద్దయెత్తున ఆరంభించి నిరుద్యోగం లేకుండా చేయడం లేదు.

ఆంధ్రలో ఒక లక్షమంది సైనికులు సైన్యాన్నుండి తిరిగివస్తారు. దీనికి కొన్ని రెట్ల మంది కూలీలు యుద్ధ పరిశ్రమల నుండి, పనుల నుండి తిరిగివస్తారు. వీరందరికీ పని కల్పించడానికి ప్రభుత్వం 16 వేల ఎకరాల బంజరును మాత్రం ప్రత్యేకించింది.

రైతుల పొలాన్ని, వ్యవసాయకూలీల పొలాన్ని తీసుకోకూడదు. జమీందారుల బంజరు పొలాన్ని, ఇంతవరకు సాగుకు తీసుకురాని ప్రభుత్వపు బంజరు భూములను, సైన్యంలో నుండి తిరిగి వచ్చే వారికివ్వాలని కమ్యూనిస్టు పార్టీ కోరుతోంది. పొలాలు ఇవ్వగా మిగిలిన సైనికులకు పని కల్పించడానికి వెంటనే పరిశ్రమలను, ఇరిగేషను, రైలు, రోడ్డు ప్రాజెక్టులను నిర్మించడానికి పూనుకోవాలి.

## చేపల పరిశ్రమ : అగ్నికుల క్షత్రియులు

వీరిలో అత్యధిక సంఖ్యాకులు సముద్రతీరాన నివసిస్తున్నారు. చేపలు పట్టి తమ జీవితాన్ని గడుపుకుంటారు. కాని చేపలు చాలాకాలం వరకు చెడిపోకుండా భద్రం చేయదానికి కావలసిన సదుపాయాలేమీ లేవు. చేపనూనె తీయడానికి కూడా పరిశ్రమలేమీలేవు.

సముద్రంలో దూరంగా వెళ్లి లోతునీటిలో చేపలు పట్టడానికి వారికి చిన్న పడవలు చాలవు. సముద్రపుటొడ్డుకు సమీపంలో చేపలు సరిగా పడక తిండికి అగచాట్లు పడవలసి వస్తూవుంది. కృష్ణాజిల్లా దివి తాలూకాలో చేపలుపడక ఒక విషపుచేదు కాయతిని మత్తుతో కొన్ని నెలలు జీవితం గడుపుతున్నారు. విశాఖలో 1943 తుపాను వల్ల కోస్తా గ్రామాలలో అగ్నికుల క్షత్రియుల పల్లెలు ధ్వంసమయ్యాయి. అప్పటినుండి వారిలో చాలామంది తిండిలేక, చలి జ్వరానికి గురై మంచానపడ్డారు.

వీళ్ల కష్టాలను తొలగించడానికి, చేపలుపట్టే కో-ఆపరేటివ్ సంఘాలు ప్రభుత్వం కావలసిన డబ్బు పెట్టి ఏర్పాటు చేయాలి. అవి :

1. చేపలు పట్టేవారికి కావలసినంత నూలును వలలు అల్లడానికి సరఫరా చేయాలి.
2. సముద్రంలోకి దూరంగా వెళ్లి లోతు నీటిలో చేపలు పట్టడానికి సరిపోయే పడవలు తయారు చేయాలి.
3. చేపలను పెంచడానికి తగు ఏర్పాట్లు చేయాలి. చేపనూనె పరిశ్రమ స్థాపించాలి. చేపలు ఎక్కువకాలం చెడిపోకుండా చేసి, దూరదూర ప్రాంతాలకు ఎగుమతి ఏర్పాట్లు చేయాలి.

## తాటిబెల్లపు పరిశ్రమ : శెట్టిబలిజ, గౌడ కులస్తులు

శెట్టిబలిజ, గౌడ కులస్థులు చాలామంది తాటి, ఈత, కొబ్బరి చెట్ల గీతమీద జీవిస్తున్నారు. వీరు గీసిన తియ్యకల్లు (చారు)ను బెల్లంగా పండితే, దానిని ప్యారీ అండ్ కంపెనీ చాలా తక్కువ ధరకు కొని, పిప్పరమెంట్లుగా, చాక్లెట్లుగా మార్చి విపరీత లాభాలు సంపాయించుకుంటూ వుంది. ప్యారీ అండ్ కంపెనీని ప్రజా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, ఇంకా అట్టి ఫ్యాక్టరీలను ఎక్కువగా కట్టి ఈ పరిశ్రమను అభివృద్ధి చేసి చెట్లగీత గీసినవారికందరికీ జీవనోపాధి ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు పార్టీ కోరుతోంది. ఈరోజు గ్రామాలలో నిరుద్యోగులుగా వున్న చాలామంది గీత గీసేవారు యీ ఫ్యాక్టరీల వలన తమకు అనుభవమున్న పనిలో జీవనోపాధి కల్గివుంటారు.

## ఆదిమ నివాసులు

తెలుగుదేశంలో ఆదిమనివాసులు, చెంచులు, ఎరుకలు, యానాదులు, దొమ్మరులు, కోయలు, సవరలు, గరబరలు, లంబాడీలు మొదలగు జాతులవారు నివసిస్తున్నారు. ఎరుకలు, ఏనాదులు, దొమ్మరులు, లంబాడీలు తప్ప మిగిలినవారు ఏజెన్సీ ప్రాంతాలలోను, అరణ్య ప్రదేశాలలోను నివసిస్తున్నారు. వీరందరిపై ప్రభుత్వోద్యోగులు అధికారం చెలాయిస్తూ వెట్టి చేయించుకుంటున్నారు. అనేక నిర్బంధాలకు గురిచేస్తున్నారు. క్రిమినల్ ట్రైబ్స్ ఆక్టును వినియోగించి వీరిని బానిసలుగా చేసివేశారు. ఏజెన్సీ ప్రాంతాలను ప్రజా మంత్రివర్గాల కిందకు రానివ్వలేదు గవర్నరు ప్రత్యేకాధికారాలను వినియోగించి వీరిపై పాలన సాగిస్తున్నారు. వీరిపై అధికారులు గావించే అక్రమాలను సహించలేక ఏజెన్సీ ప్రాంతాలలో అనేక పర్యాయాలు తిరుగుబాట్లు, పితూరీలు జరిగాయి. 1923లో అల్లూరి సీతారామరాజు నడిపిన ఆదిమవాసుల పోరాటం రెండేళ్ల పాటు నడిచింది.

వీరి అభివృద్ధికి కమ్యూనిస్టు పార్టీ ఈ క్రింది కార్యక్రమంతో పని చేస్తుంది.

1. ఇప్పుడు గవర్నరు ప్రత్యేకాధికారాల క్రింద వున్న ప్రాంతాలన్నింటినీ ప్రజా ప్రభుత్వం కిందకు తీసుకురావాలి.



2. వీరిపై పెత్తనం చేసే ముఠాదారుల, ప్రభుత్వోద్యోగుల అన్యాయాలను అరికట్టి, వీరు స్వేచ్ఛగా అభివృద్ధి చెందడానికి అవకాశాలు కల్పించాలి.
3. వీరిపై ప్రత్యేకంగా వుపయోగించే నిర్బంధ చట్టాలను రద్దు చేయాలి. క్రిమినల్ ట్రైబ్స్ ఆక్టును రద్దుచేయాలి.
4. వీరు అడవులలో నుండి తెచ్చి అమ్మే సరకులకు న్యాయమైన ఖరీదులు ఇచ్చేటట్లు చూడాలి. అమాయకులు కాబట్టి మోసం చేసి చాలా తక్కువ ఖరీదులకు కొనే పద్ధతి మాన్పించాలి.
5. వెట్టి చేయించుకోడాన్ని నేరంగా శాసించి వెట్టిని ఆపుచేయాలి. న్యాయమైన దినకూలీ ఏర్పరచి వారికిప్పించేటట్లు చూడాలి.
6. వీరికి చదువు, వారి జీవనోపాధికి కావలసిన వృత్తులు ప్రత్యేక శ్రద్ధతో నేర్పాలి. వారి సాంఘికాచారాలను జాగ్రత్తగా పరిశీలించి అందులో వారి అభివృద్ధికి నష్టమైనవారిని నిరుత్సాహపరుస్తూ, అభివృద్ధికరమైన ఆధారాలను ప్రోత్సహిస్తూ, వారు ఆత్మవిశ్వాసంతో ముందుకు పోయేటట్లు పనిచేయాలి.

## ముగింపు

కమ్యూనిస్టు పార్టీ వ్యవసాయాన్ని వృద్ధిచేసి మన ప్రజలకందరికీ తిండిని సమృద్ధిగా తయారు చేయడానికి ఈ క్రింది కార్యక్రమాన్ని ఇస్తూవుంది. దానిని అమలు పెట్టడానికి తీవ్రంగా కృషిచేస్తుంది.

ఏ ప్రజా మంత్రివర్గమైనా తాను అధికారం తీసుకొనిన ఒక సంవత్సరంలోపు మూడు ప్రధాన శాసనాలు గావించాలి :

**ఒకటి భూమి చట్టం :** ఇది జమీందారీ, ఇనాందారీ, ముఠాదారీ పద్ధతిని రద్దుచేసి వారి పొలాలను నేడు సాగుచేస్తున్న రైతు కూలీలకు చెందేటట్లు చేస్తుంది. నూరు ఎకరాలకు మించిన పొలాన్ని నష్టపరిహారమిచ్చి, స్వాధీనం చేసుకొని పొలం లేనివారికి పంచడానికి ప్రభుత్వానికి అధికారమిస్తుంది. కౌలుపద్ధతి లేకుండా చేసి ప్రతిరైతు తన పొలాన్ని సాగుచేసుకునేటట్లు చేస్తుంది. ప్రభుత్వానికి తప్ప, ఇతరులెవరికీ పొలాన్ని అమ్ముకోడానికి వీలులేకుండా చేసి, సాగుచేసే రైతులనుండి పొలము అన్యాక్రాంతముగాకుండా గ్యారంటీ చేస్తుంది. 5 ఎకరాలలోపు రైతుపై భూమిపన్ను లేకుండా చేస్తుంది. ఇతర రైతులపై ఆదాయాభివృద్ధి క్రమానుసారంగా ఎక్కువ పొలమున్నవారికి ఎక్కువ పన్నువేటు, తక్కువ పొలమున్నవారికి తక్కువ పన్నురేటు విధిస్తుంది.

**రెండవ చట్టం :** వడ్డీ వ్యాపారాన్ని నిషేధించే చట్టం. ఇది విపరీత వడ్డీల పద్ధతిని రద్దుచేసి రైతులకు, వృత్తిదారులకు కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా (సహకార పరపతి సంఘాల ద్వారా) గాని, లేక ప్రభుత్వ బ్యాంకుల ద్వారా గాని నూటికి సంవత్సరానికి మూడురూపాయల

రేటును అప్పులు దొరికేటట్లు చేస్తుంది. దీనికి కావలసిన పెట్టుబడిని ప్రస్తుతపు సావుకార్ల నుండి స్వల్ప వడ్డీలనిచ్చి తీసుకుంటుంది. వ్యవసాయ కూలీల, బీద రైతుల అప్పులను రద్దుచేసి, ఇతర రైతుల రుణబాధను తగ్గిస్తుంది.

మూడవ చట్టం (దొంగ మార్కెట్లు వ్యతిరేక చట్టం) : ఇది ప్రజల తిండిమీద, రైతుకు కావలసిన వస్తువుల మీద దొంగ వ్యాపారస్తుల అధికారాన్ని పూర్తిగా తొలగిస్తుంది. ఆ వ్యాపారాన్నంతా సహకార విక్రయ సంఘాల ద్వారా నడుపుతుంది. ఆ సహకార సంఘాలలో ఇప్పుడు వర్తకం చేస్తున్న చిల్లర దుకాణాదారులకు, చిన్న వర్తకులకు పనులు కల్పిస్తుంది.

ఈ చట్టాలను సమగ్రరూపంలో పాసు చేసేలోపల, ప్రజా మంత్రి వర్గాలు వచ్చిన వెంటనే ఈ క్రింది చర్యలు అమలు జరపడానికి ఆర్డినెన్సు ప్రకటించాలి.

1. జమీందారులు, ఇనాందారీ ముఠాదారులు రైతుల నుండి తాము వసూలు చేసుకొన్న శిస్తు ఆదాయాలపై ఆదాయపుపన్ను విధించాలి. రూ.6000 కన్నా మించిన శిస్తు ఆదాయమంతా ప్రజా ప్రభుత్వ ఖజానాకు వచ్చేటట్లు శాసిస్తూ ఆర్డినెన్సు జారీచేయాలి.

2. ఐదు ఎకరాలలోపు వారికి శిస్తు వసూళ్లు ఆపుచేస్తూ ఆర్డినెన్సు.

3. జమీందార్ల బంజరు భూములను, ప్రభుత్వపు బంజరు భూములను పొలం లేని వ్యవసాయ కూలీలకు, బీదరైతులకు ఇస్తూ ఆర్డినెన్సు.

4. కౌలుదార్ల కౌలు మగతాలకు న్యాయంగా ఉండే రకంగా తగ్గిస్తూ కౌలుదార్లను భూమిచట్టం వచ్చేవరకు వారీ రోజు సాగుచేస్తున్న పొలాల నుండి తొలగించకుండా ఆర్డినెన్సు.

5. వ్యవసాయ కూలీలకు కనీసపు జీతాలు నిర్ణయిస్తూ ఆర్డినెన్సు... అంటరానితనాన్ని నిషేధిస్తూ ఆర్డినెన్సు.

6. అప్పులపై మారటోరియం ప్రకటిస్తూ రైతులకు అప్పు ప్రభుత్వ బ్యాంకుల నుండి దొరికేటట్లు ఆర్డినెన్సు.

7. సహకార ఉద్యమాన్ని ప్రజల పలుకుబడి క్రిందికి వచ్చేట్లు చర్యలు తీసుకోవాలి. రైతుకు గిట్టుబాటయ్యే కనీసపు ధరలు నిర్ణయించాలి. ప్రజలకు కావలసిన అత్యవసర వస్తువులకు ధరలను కంట్రోలు చేసి ఇవి అన్నీ కో–ఆపరేటివ్ స్టోర్సు ద్వారా అందించడానికి ఆర్డినెన్సులు ప్రకటించాలి.

8. వ్యవసాయాన్ని శాస్త్ర పద్ధతుల మీద నడపడానికి గ్రామ కో–ఆపరేటివ్ స్టోర్సు, సొసైటీలను నిర్వహించడానికి, పశు ఉత్పత్తిశాలలను నడపడానికి, రైతు యువకులకు తర్ఫీదు ఇచ్చే ఏర్పాట్లు చేస్తూ ఆర్డినెన్సు.



9. కొత్త స్కూళ్లు, ఆస్పత్రులు నెలకొల్పుతూ, కొత్త కాలవలు, రోడ్లు వేస్తూ, చదువుకొన్న గ్రామ యువకులందరికీ పనులు కల్పించడానికి ఆర్డినెన్సు.

10. స్త్రీలకు గ్రామాలలో లెట్రిను సౌకర్యాలు, విద్యా సౌకర్యాలు, ప్రసూతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ ఆర్డినెన్సు. స్త్రీలకు జీతాలలోను, పనులలోను సమానావకాశాలు ఇస్తూ ఆర్డినెన్సు. వ్యవసాయాన్ని ఈ రీతిగా పునర్నిర్మాణం చేస్తేనే మన ప్రజలకు తిండి పెట్టగలం. కరువు కాటకాలు, అంటువ్యాధుల నుండి రక్షించగలం. జమీందారులతోను, పెద్ద ధనిక భూస్వాములతోను, దొంగ వ్యాపారస్తులతోను చేతులు కలపడం వల్ల ఇది సాధ్యం కాదు. గ్రామంలో రైతాంగమంతా ధనిక రైతులు మొదలు వ్యవసాయ కూలీల వరకు తమ రైతు సంఘాలు, కూలీ సంఘాలను బలపర్చుకోవాలి. జమీందారులను, గ్రామాలలో అధికారాన్ని దుర్వినియోగం చేసే పెద్ద ధనిక భూస్వాములను, దొంగ వ్యాపారస్తులను, లంచగొండి ఉద్యోగస్థులను ఎదుర్కొని పనిచేయాలి. ఈ ప్రజా శత్రువులకు వ్యతిరేకంగాను, ఇంగ్లీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగాను రైతు ఉద్యమం, వ్యవసాయ కూలీ ఉద్యమం పట్టణ ప్రజలతోను, కాంగ్రెసు, లీగు, కమ్యూనిస్టు పార్టీలతోను కలసి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించినప్పుడే ఈ పునర్నిర్మాణం సాధ్యమవుతుంది. ఇదివరకే అనేక పోరాటాలలో ఆరితేరిన రైతు సంఘాలు, వ్యవసాయ కూలీ సంఘాలు ముందుండి ఈ ఉద్యమాన్ని నడుపుతాయి.

## అనుబంధం

వివిధ జిల్లాలలో వెంటనే ఆరంభించవలసిన ఇరిగేషను ప్రాజెక్టులు

**విశాఖ జిల్లా :** ఉత్తర విశాఖలో నగరికటకం, హంసరాశి మెలియాపుట్టి ఆక్విడెక్టు, జలంతరలోని పాడిగాం ప్రాజెక్టులు నిర్మించి 15 గ్రామాలకు నీటి సదుపాయాలు కల్పించాలి. నాగావళి, వంశధార ప్రాజెక్టులను నిర్మించాలి.

**పశ్చిమ గోదావరి :** ఎర్రవాగు, తమ్మిలేరు ప్రాజెక్టులను, కానూరు పెండ్యాల స్కీములను నిర్మించాలి.

కొల్లేటి ముంపును తీసివేయడానికి ఉప్పుటేరును వెడల్పు చేయాలి.

**కృష్ణా :** బుడమేరు రిజర్వాయరును నిర్మించి కొల్లేటి ముంపును తగ్గించాలి. పెదలంక, గుండేరు మురుగు స్కీములను త్వరలో ముగించాలి. విజయవాడ ఆనకట్టకు పైనుండి గొల్లపూడి కాలువను నిర్మించాలి.

**గుంటూరు :** బాపట్ల తాలూకాలో రొంపేరు స్కీము. ఇది మురుగు ఇబ్బందిని తొలగించి అచ్చట పొలాలను సాగు చేయడానికి తోడ్పడుతుంది.

గుండ్లకమ్మ, మూసీ ప్రాజెక్టులను పూర్తిచేసి ఒంగోలు ప్రాంతపు పొలాలకు నీటి సరఫరా యివ్వాలి.

వినుకొండ తాలూకాకు సంబంధించిన కంతేరు స్కీమును పూర్తిచేయాలి.

తెనాలి–రేపల్లె తాలూకాలో భట్టిప్రోలు మురుగు కాలువను పూర్తిచేయాలి.

**నెల్లూరు జిల్లా :** గూడూరు తాలూకాలో కళింగ నదికి సూళ్లూరుపేట వద్ద ఆనకట్ట కట్టి రిజర్వాయరు ఏర్పరచాలి. స్వర్ణముఖికి రిజర్వాయరు, కండ్లేరుకు మనుబోలు వద్ద ఆనకట్ట కట్టాలి. వెంకటగిరి వాగుకు అడ్డుకట్ట కట్టాలి.

ఆత్మకూరు తాలూకాలో బొగ్గేరు, నక్కలవాగు, చేబెర్ల కాలువ, కొమ్మలేరులకు అడ్డుకట్టలు కట్టి ఆ నీటిని చెరువులకు మళ్లించాలి.

నెల్లూరు తాలూకా కాలువలను వెడల్పు చేసి ఎక్కువ సాగుచేయడానికి ఉపయోగించాలి.

కావలి తాలూకాలో ఉప్పుటేరు, తాళ్లపాడు ప్రాజెక్టులను నిర్మించాలి. కందుకూరు తాలూకాలో మైపాడు, మాచవరం చెరువులకు మన్నేటి నుండి కాలువ తవ్వించాలి. మన్నేటి డెల్టా కాలువను చుండి చెరువులో కలపాలి. పాలేటికి వెంకనపాలెం వద్ద ఆనకట్ట కట్టాలి. దోర్నపు వాగుకు పోతకమూరువద్ద రిజర్వాయరు.

ఉదయగిరి తాలూకాలో కోడిగుడ్ల పాడువద్ద ఉప్పుటేరుకు ఆనకట్ట.

**చిత్తూరు జిల్లా :** మదనపల్లి తాలూకాలో బాహుదా బేసిన్ స్కీమ్. చెయ్యేరు ప్రాజెక్టు, నిమ్మనపల్లి రిజర్వాయరు.

పలమనీరు తాలూకాలో లోయర్ పాలారు బేసిన్ స్కీము.

పుత్తూరు తాలూకాలో కుశస్థళ బేసిన్ స్కీము.

వాయల్పాడు తాలూకాలో పీలేరు రిజర్వాయరు.

చంద్రగిరి తాలూకాలో చంద్రగిరి నది రిజర్వాయరు.

పుంగనూరు సకుం నది రిజర్వాయరు.

కాళహస్తికి స్వర్ణముఖికి రిజర్వాయరు.

**అనంతపురం :** కళ్యాణదుర్గ, రాయదుర్గ తాలూకాలలో భైరవాని తిప్ప, హగరి, మల్కాపురం, కొత్తకల్లి, కన్నేపల్లి, పిల్లలపల్లి ప్రాజెక్టులు నిర్మించాలి.

పెనుగొండ తాలూకాలో నిడిమోమిడి, కదిరి తాలూకాలో ఈతోడు ప్రాజెక్టులు నిర్మించాలి.



**కడప :** పుల్లంపేట ప్రాజెక్టు, చెయ్యేటికి ఖాదినగడ్డవద్ద ఆనకట్ట పెద్దదాసరిపల్లె చెరువును పునర్నిర్మాణం చేయాలి.

**కర్నూలు :** వెలుగొండ స్కీమును నందికొట్కూరు తాలూకాలో నిర్మించితే 64 వేల ఎకరాలు సాగవుతాయి.

పత్తికొండ తాలూకాలో గాజులదిన్నె, కృష్ణాపురం ప్రాజెక్టులు.

మార్కాపురం తాలూకాలో తీగలేరుకు తోకపల్లె వద్ద ప్రాజెక్టు. గుండ్లకమ్మకు తంగిరాలవద్ద ఆనకట్ట. దువ్వలూరు ప్రాజెక్టులు.

కంభం తాలూకాలో సగిలేరుకు కృష్ణం శెట్టిపల్లె ప్రాజెక్టు. తిప్పాయపాళెం వద్ద రాళ్లవాగు రిజర్వాయరు.

శిరువెళ్ల తాలూకాలో అహోబిళం, చాగలమర్రి ప్రాజెక్టులు.

డోన్ తాలూకాలో ఐంద్రావతి నదికి ఆనకట్ట.

ఇవిగాక ఇంకా చాలా మైనరు ప్రాజెక్టులు, ప్రతి జిల్లాలోనూ రైతు సంఘాలు లేనిచోట్ల స్థానిక ప్రజలకు తెలిసినవి వున్నాయి.

# నాలుగవ అధ్యాయం

పసిడి పండెడు మనదు దేశపు ఖనిజ సంపదలన్ని గూరిచి
భారీ యంత్రాగారములను పాదుగొల్పగ కదలిపోదాం
పాడరా ఓ తెలుగువాడా – పాడరా ఓ తెలుగు వాడా
పాడరా మన తెలుగుదేశపు భవ్యచరితపు దివ్యగీతం

**- కొండేపూడి లక్ష్మీనారాయణ**

## మన పరిశ్రమలు : పట్టణ ప్రజలు

గత 200 సంవత్సరాలుగా ఇంగ్లీషు ప్రభుత్వం మన పరిశ్రమలు అభివృద్ధికాకుండా ఎన్నో అభ్యంతరాలు కలిగిస్తూ వచ్చింది. మన దేశాన్నుండి ముడి సరకులను ఇంగ్లండుకు ఎగుమతి చేయడానికి వర్తకులకు పూర్తిగా ప్రోత్సాహమిచ్చి అనేక సదుపాయాలు కలుగజేసింది. అచ్చట వానిని పారిశ్రామిక వస్తువులుగా తయారుచేసి, మన దేశానికి తిరిగితెచ్చి ఎక్కువ ఖరీదులకు ఎక్కువ లాభాలు వేసుకొని అమ్ముకుంటూ వచ్చింది. మన దేశంలో ఉన్న చేతి పరిశ్రమలు, యంత్ర పరిశ్రమల పోటీకి నిలవలేక నశించాయి. ఇంగ్లీషు ప్రభుత్వం ఈ చేతి పరిశ్రమల స్థానే, యంత్ర పరిశ్రమలు నెలకొల్పలేదు. మన చేతి పనులు చేసుకొనేవారికి పనులు కల్పించడానికి ఏమీచేయలేదు. మన దేశంలో బయలుదేరిన పరిశ్రమలను నాశనం చేయడానికి ఇంగ్లీషు సామ్రాజ్యవాద ప్రభుత్వం అనేక చట్టాలు చేసింది. కాని వాటినన్నిటినీ ప్రజల స్వదేశీ ఉద్యమబలంతో ఎదుర్కోవటంతో పరిశ్రమలు ఇప్పుడున్న కాస్తయినా అభివృద్ధి చెందాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో మన పరిశ్రమలు కొంతవరకు అభివృద్ధి చెందాయి. కాని ఆ యుద్ధం అయిపోయిన వెంటనే తిరిగి అనేక అడ్డంకులను ఇంగ్లీషు ప్రభుత్వం కల్గించింది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఎట్టి ప్రధాన పరిశ్రమను కూడా ప్రారంభించనివ్వకుండా ఇంగ్లీషు ప్రభుత్వం అడ్డుపడుతూ వచ్చింది. యుద్ధానంతరం తమ పరిశ్రమలకు పోటీగా భారతదేశ పరిశ్రమలుండకుండా ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు పనిచేశారు. ఈ యుద్ధకాలంలో ఆస్ట్రేలియా, కెనడాలు ఉక్కు పరిశ్రమను, యంత్రాలను తయారుచేసే పరిశ్రమలను, మోటారు కార్లు, విమానాలు, నౌకా నిర్మాణ పరిశ్రమలను అభివృద్ధి చేసి పారిశ్రామిక దేశాలయ్యాయి. కాని



ఈ ప్రధాన పరిశ్రమలు వేనిని కూడా మన దేశంలో అభివృద్ధి కానివ్వలేదు. యుద్ధానికి కావలసిన వస్తువులను, మరమ్మతులను చేసే తాత్కాలిక ఫ్యాక్టరీలను ఏర్పాటు చేశారు. వానిని నేడు మూసివేస్తున్నారు. లక్షల కొలదీ కార్మికులు నిరుద్యోగులై వీధులవెంట తిరుగుతున్నారు.

## ఆంధ్రలో పరిశ్రమలు మరింత వెనుకబడి వున్నాయి

ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల ఈ నీతి మన తెలుగుదేశంలో మరింతగా పరిశ్రమలను కుంటుపడజేసింది. తమిళనాడు, గుజరాత్, బెంగాలు, బొంబాయి సంయుక్త రాష్ట్రాలతో పోల్చిచూసినా ఆ మాత్రమైనా యిచ్చట పరిశ్రమలు అభివృద్ధి చెందలేదు. మన ఖనిజ సంపత్తి మన అడవులు పూర్తిగా పరిశీలించి మన పరిశ్రమాభివృద్ధికి యేర్పాట్లేమీ జరగలేదు. ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు మన ముడి సరుకులను దోచుకోవడంలో మాత్రం చాలా ఆసక్తి, శ్రద్ధ చూపుతారు గాని, ఇచ్చ పరిశ్రమలు స్థాపించి వానిని ఇచ్చటనే ఉపయోగించడం వారినీతి కాదు.

1941లో ఇంగ్లీషు ప్రభుత్వం కిందనున్న జిల్లాలలో విద్యుత్యంత్రాలుగాని, ఆవిరి లేక నూనె యంత్రాలుగాని ఉపయోగిస్తూ 20 మందిని మించిన కార్మికులు పనిచేస్తున్న ఫ్యాక్టరీలు 888 మాత్రమే. వీనిలో రోజూ 46 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీల స్వభావమేమిటో ఈ క్రింది జాబితాలో ఇస్తున్నాం. దీనిలో ప్రధాన పరిశ్రమ ఒక్కటికూడా లేదనుట స్పష్టమవుతుంది.

| ఫ్యాక్టరీ పరిశ్రమ పేరు | ఫ్యాక్టరీ సంఖ్య | పనిచేసే కార్మికులు |
|---|---|---|
| నేత పరిశ్రమ | 9 | 1,520 |
| జ్యూట్ పరిశ్రమ | 4 | 7,122 |
| పత్తి గింజలు తీసి పత్తిని బేల్సుగా తయారు చేసేవి | 255 | 10,413 |
| వేరుశనగ | 122 | 3331 |
| నూనె మిల్లులు | 88 | 11,792 |
| బియ్యపు మిల్లులు | 362 | |
| చక్కెర ఫ్యాక్టరీలు | 6 | 1,460 |
| పొగాకును బాగు చేసేవి | 8 | 7,433 |
| సిమెంటు | 2 | 434 |
| పెంకు | 2 | 176 |
| పెద్ద అచ్చు ఆఫీసులు | 7 | 178 |
| ఇంజనీరింగు మరమ్మతు ఫ్యాక్టరీలు | 30 | 2,122 |
| **మొత్తం** | **888** | **46,013** |

దీన్నిబట్టి పై ఫ్యాక్టరీలన్నీ వడ్లు, పత్తి, వేరుశెనగ, పొగాకు మొదలగు ముడి పదార్థాలను ఎగుమతి కోసం తయారుచేసేవి కాని అసలు పరిశ్రమ ఒకటి కూడా లేదని స్పష్టమవుతుంది. వేరుశనగను ఎంతో ఎక్కువ ఎగుమతి చేస్తాం. వేరుశనగ నూనెను కూడా తీస్తున్నాం. గాని వనస్పతి (నెయ్యిని) తయారుచేసే ఫ్యాక్టరీలుగాని, సబ్బు ఫ్యాక్టరీలుగాని లేవు. అదే రీతినా రాయలసీమ జిల్లాలలో ఎంతో దూది తయారవుతున్నా, ఆ దూదిని ఉపయోగించి గుడ్డలను తయారుచేసే ఫ్యాక్టరీలను ఏర్పరచలేదు. మన దూది అంతా బొంబాయి, అహ్మదాబాదు మిల్లులకు పంపించాల్సి వస్తుంది. మన రైతులకు సరియైన ధరలు రావడం లేదు. బొంబాయి, అహ్మదాబాదులలో తయారైన గుడ్డ వ్యాపారంలో గుజరాతీ, బొంబాయి వర్తకులదే గుత్తాధికారం. వారు, వారి ఏజెంట్లు దొంగ మార్కెట్‌లో విపరీత లాభాలు వేసుకొని అమ్ముతున్నారు.

## ఇంగ్లీషు కంపెనీల విపరీత లాభాలు

ఈ తెలుగు జిల్లాలలో 500 మంది కార్మికులు పనిచేస్తున్న ఫ్యాక్టరీలు జ్యూటు మిల్లులు నాల్గు, చీరాలలో పొగాకు ఫ్యాక్టరీ, సామర్లకోటలో చక్కెర ఫ్యాక్టరీ, విశాఖ హర్బరు రైలు కంపెనీలు, సింధియా నావిగేషను కంపెనీలు మాత్రమే. నెల్లిమర్ల, చిట్టివలస, చీరాల, సామర్లకోట ఫ్యాక్టరీలు ఇంగ్లీషు పెట్టుబడిదారులవి. చిట్టివలసలోను, చీరాలలోను ఇంగ్లీషు ప్రభుత్వపు ఉద్యోగులు పంపితే, ఇంగ్లీషు యజమానుల హక్కులను కాపాడడానికి పోలీసులు వచ్చి తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న కార్మికులను లాఠీలతో కొట్టి తుపాకులతో కాల్చారు. సామర్లకోటలో కూడా సమ్మె చేస్తున్న కార్మికులను కొట్టి అరెస్టు చేసి కఠిన శిక్షలు విధించారు. నేటికి కూడా 10మంది జైళ్లలో మగ్గుతున్నారు. ఈ ఫ్యాక్టరీలు, వీటి ఇంగ్లీషు యజమానులే మన చెరకు, వేరుశెనగ, పొగాకు వీని ధరలను కంట్రోలు చేస్తున్నారు. రైతులకు తక్కువ ధరలివ్వడం వల్లా, కార్మికులు తక్కువ జీతాలివ్వడం వల్లా ఈ ఫ్యాక్టరీలు విపరీతమైన లాభాలు గడిస్తున్నాయి.

నెల్లిమర్ల జ్యూటు మిల్లుకు పెట్టుబడి (వాటాలుగాని, డిబెంచర్లుగాని) 17 లక్షల 50 వేల రూపాయలైతే 3 సంవత్సరాలలోనే (1941-43ల మధ్య) 21 లక్షల రూపాయలు ఆదాయాన్ని సంపాదించారు.

చిట్టివలస జ్యూటుమిల్లుకు పెట్టుబడి 27 లక్షలైతే 1941-43లలో (మూడేండ్లలో) 39 లక్షల ఆదాయాన్ని సంపాదించారు. ఈ కాలంలోని ఈ ఇంగ్లీషు వారి ఫ్యాక్టరీ కార్మికులు నెలకు యుద్ధభత్యం 8 రూపాయలు చొప్పున ఇమ్మని కోరితే చాలామందిని పనిలో నుండి తొలగించి, అనేక తప్పుడు కేసులు, చిట్టివలస కాంగ్రెసు లేబరు పెట్టించి యూనియన్‌ను భగ్నం గావించడానికి విశ్వప్రయత్నం చేసింది.

సామర్లకోట చక్కెర ఫ్యాక్టరీ 13 లక్షల 64 వేల రూపాయల పెట్టుబడితో ప్యారీ అండ కంపెనీ ప్రారంభించింది. 1931-43ల మధ్య ఈ 13 ఏళ్లలో 45 లక్షల రూపాయలు లాభాలు గడించింది. పెట్టుబడి వాటాలను 23 లక్షల 60 వేల రూపాయలకు తన లాభాల



ఉండి పెంచింది. ఈ ఇంగ్లీషు కంపెనీలో 1940లో సమ్మె చేసిన కార్మికులు నేటికీ జైళ్లలో మగ్గుతున్నారని మనం పైన చూశాం.

## కార్మికుల కష్టాలు : కార్మిక సంఘాల కృషి

ఒకవైపు ఫ్యాక్టరీ యజమానులు లక్షల కొలది లాభాలు గడిస్తూ వస్తే కార్మికులకు వారిచ్చే జీతాలు 1941లో రోజుకు నాలుగు అణాల నుండి రూపాయి వరకు మాత్రమే. చాలా నైపుణ్యంగల టెక్నికల్ కార్మికులకు మాత్రం రోజుకు రెండు మూడు రూపాయలిచ్చేవారు. 1941 నుండి యుద్ధ భృతి అని రూ. 5 నుండి రూ. 15ల వరకు పెంచారు. కాని ఈ హెచ్చింపు యుద్ధకాలంలో ధరలు పెరగడం వల్ల వచ్చే లోటును కూడా పూర్తిచేయడం లేదు. వారి ఇండ్లు చాలా అనారోగ్య ప్రదేశాలలో వుంటున్నాయి. ఇండ్లు చాలినన్ని లేక కిక్కిరిసి నివసించాల్సి వుంది. వీధులలో దీపాలుండవు. కావలసినన్ని నీటి పంపులు వుండక, ఎప్పుడూ కార్మిక స్త్రీలు ఒకే పంపువద్ద గుమిగాడి వుండవలసి వస్తుంది. వారికి చదువుకోడానికి కావలసిన సదుపాయాలు లేవు. వైద్య సహకారం కూడా తక్కువ. ఫ్యాక్టరీ యాక్టు, కార్మిక ప్రమాదాలకు నష్టపరిహార చట్టం, ప్రసూతి సహాయ చట్టం మొదలగు కార్మిక చట్టాల కింద వారికి కలిగిన కొన్ని సదుపాయాలను కూడా సరిగా అమలు జరపడం లేదు. 10 మందికి తక్కువ వున్న పరిశ్రమలను ఫ్యాక్టరీల కింద పరిగణించడం లేదు. మున్సిపల్ కార్మికులు, తోళ్ల కార్మికులు, లాగుడుబండివాళ్లు, ముఠా కార్మికులు, రిక్షా కార్మికులు ఇంకా ఇట్లే ఇటువంటి కార్మికులకు ఫ్యాక్టరీ యాక్టు, యితర కార్మిక చట్టాలు వర్తించవు. వర్తించే ఫ్యాక్టరీలలో కూడా ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లకు లంచాలిచ్చి, ఆ చట్టాలలో నియమాలను యజమానులు భగ్నం చేస్తూనే వున్నారు.

ఆంధ్ర కార్మికులకున్న ఇటువంటి అసౌకర్యాలను, కష్టాలను ఎదుర్కొని 1934 నుండి ఆంధ్రలో కమ్యూనిస్టులు కార్మిక సంఘాలు (ట్రేడ్ యూనియన్‌లను) నిర్మించి పనిచేస్తున్నారు. నేటికి 30,000 మంది కార్మిక సంఘాలలో సభ్యులుగా వున్నారు. ఈ కార్మిక సంఘాల పోరాట ఫలితమే కార్మికుల కష్టాలు కొంతవరకైనా తగ్గించడానికి సాధ్యమైంది. ఇవి కార్మికులకు సెలవులు సంపాదించాయి. రోజు కార్మికులకు కలిగించే అనేక చిన్నచిన్న అసౌకర్యాలను తొలగించాయి. తాము తమ సంఘాలు ఏర్పరచుకుంటే తమ యజమానుల అక్రమాలను ఎదుర్కొనగలమనే చైతన్యాన్ని కలిగించాయి. యుద్ధకాలంలో కూడా అనేక నిర్బంధాలకు గురి అవుతూ వచ్చినా ఎర్రజెండా కింద, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కింద ఈ కార్మిక సంఘాలు కార్మికుల హక్కులను కాపాడుతూ పనిచేస్తూ వచ్చాయి. బియ్యం దొరకక బాధపడుతున్నప్పుడు వారి సంఘాలు చౌక డిపోలు పెట్టించాయి. రేషనింగ్ అమలుజరిపి బియ్యం సక్రమంగా అందేటట్టు కార్మిక సంఘాలు కృషి చేశాయి. గుడ్డలు, కిరసనాయిల్ దొంగ మార్కెట్‌లలో అమ్ముతుంటే కార్మిక సంఘ వాలంటీర్లు పట్టుకొని కార్మికులకు కంట్రోలు రేట్లకు ఇప్పించారు. మిల్లు యజమానులు, వ్యాపారస్తులు బియ్యాన్ని దాచి దొంగ మార్కెట్‌కు మార్చుతూవుంటే కాపలాగాచి పట్టుకొని ప్రజలకు కంట్రోల్ రేట్లకు ఇప్పించారు. ఇనుప

సామాగ్రిని కూడా రైతులకు కంట్రోలు రేట్లకిప్పించడానికి, దొంగ వ్యాపారాన్ని పట్టుకోడానికి కార్మిక వలంటీర్లు పనిచేశారు. కార్మికులు రైలు ఇంజన్లను త్వరత్వరగా తమ (యూనియన్లు) సంఘాలు చెప్పినట్లు మరమ్మత్తు చేసి రైళ్లను నడుపుతూ వచ్చారు. బొగ్గు కరువు వచ్చి రైళ్లు కొన్నింటిని ఇంకా తగ్గించాల్సి వచ్చినప్పుడు బొగ్గును పొదుపుగా వాడి రైలుబండ్లను మరింత తగ్గించకుండా చూశారు. మున్సిపల్ కార్మికులు పట్టణ వీధులను, మురుగు కాలువలను, మరుగుదొడ్లను శుభ్రంగా వుంచి పట్టణ ఆరోగ్యాన్ని కాపాడడానికి కృషి చేశారు.

కాని నేడు యుద్ధం పూర్తి అయ్యాక ఈ కార్మికులను పనులలో నుండి తొలగించడానికి ఇంగ్లీషు ప్రభుత్వం చూస్తూవుంది. ప్రతి పట్టణంలోను, ప్రతి పరిశ్రమలోను కార్మికులను, గుమస్తాలను పనిలో నుండి తీసివేయడానికి యజమానులు ప్రయత్నం చేస్తున్నారు. వారి జీతాలను తగ్గించడానికి ఇది మొదటి ఎత్తు. ఒకవైపు మన ప్రజలకు గుడ్డ, కాగితం, అగ్గిపెట్టెలు మొదలుకొని యంత్రాలవరకు అనేక రకాల సామగ్రి కావలసివుంది. దానిని తయారుచేయక కార్మికులను పనిలోనుండి తీసివేస్తున్నారు.

## ఆంధ్రలో పరిశ్రమాభివృద్ధికి మార్గం

మన ఆంధ్రలో పరిశ్రమలను అభివృద్ధి చేయడంవల్లనే ప్రస్తుతం పనిచేస్తున్న వారికి పని చూపించడమే గాక, సైన్యంలో నుండి తిరిగివచ్చే వారి అందరికీ, మన గ్రామాలలో నిరుద్యోగులుగా వున్న ప్రజలకు కూడా పని చూపించగలం. అయితే లాభాపేక్షులైన పెట్టుబడిదారులకు, ఇంగ్లీషు సామ్రాజ్యవాదులకు వదలివేస్తే మన పరిశ్రమలు అభివృద్ధి చెందవు. మన పారిశ్రామిక సంపత్తి కొద్దిమంది వ్యక్తుల లాభాలకోసం కాక మన ప్రజలందరి అవసరాలను తీర్చడానికి ఉపయోగపడాలి. ఇది జరగాలంటే ఆంధ్రలో ఏర్పడే ప్రజా ప్రభుత్వం ఆంధ్ర పరిశ్రమలను అఖిలభారత పరిశ్రమలతో పాటు అభివృద్ధి చేయడానికి పూనుకోవాలి. భారతదేశపు పారిశ్రామికాభివృద్ధి ప్లానులో ఆంధ్ర పరిశ్రమాభివృద్ధి కూడా ఒక ముఖ్య భాగంగా ఏర్పరచి ప్లానులు వేయాలి. పరిశ్రమాభివృద్ధి కోసం కమ్యూనిస్టు పార్టీ ఈ క్రింది చర్యలు ప్రజా ప్రభుత్వం తీసుకోవాలని కోరుతోంది. దాని కోసం కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తోంది.

1. మనకు బాకీవున్న స్టెర్లింగు తదితర అప్పులలోకి చెల్లింపుగా బ్రిటిషు పెట్టుబడిదారుల పరిశ్రమలను, ఫ్యాక్టరీలను ప్రజా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. ఆంధ్రలో ఐ.ఎల్.టి.డి. పొగాకు కంపెనీలు, ప్యారీ అండ్ కంపెనీని, విశాఖలోని జ్యూట్ మిల్లులను ప్రజా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. వేరుశెనగ, ఇతర ముడి సరకులపై గుత్త వ్యాపారం చేస్తూ మన రైతులను దోచుకుంటూ వున్న ప్యారీ అండ్ కంపెనీ వాల్కార్టు అండ్ కంపెనీలను కూడా ప్రజల ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.
2. భారతీయ పెట్టుబడిదారులు నడుపక మూసివేసియుంచుతున్న ఫ్యాక్టరీలను కూడా ప్రభుత్వం వశపర్చుకోవాలి. రాజమండ్రి పేపరు మిల్సు, స్పిన్నింగ్ మిల్లుల వంటివి ప్రభుత్వం వశపర్చుకొని నడుపవలసివుంటుంది.



3. యుద్ధకాలంలో దొంగ వ్యాపారం చేసి విపరీత లాభాలు ఆర్జించిన పరిశ్రమాధికారులు, వ్యాపారస్థులు, కాంట్రాక్టర్ల లెక్కలు తనిఖీ చేయాలి. వారు అన్యాయంగా దొంగ మార్కెట్ ద్వారా సంపాదించిన లాభాలన్నింటినీ ప్రభుత్వం నష్టపరిహారం మరేమీ ఇవ్వకుండా లాక్కోవాలి.
4. యుద్ధకాలంలో ప్రభుత్వం వసూలు చేసిన అమితలాభాల పన్నును పెట్టుబడిదారులకు తిరిగి ఇచ్చేస్తామంటున్నది. తిరిగి ఇచ్చివేయకుండా ప్రజా ప్రభుత్వమే తీసుకొని పరిశ్రమాభివృద్ధికి ఉపయోగించాలి.
5. బ్యాంకులు, రైలు మార్గాలు, ట్రామ్ కంపెనీలు, విద్యుద్యంత్రాలు, బొగ్గు గనులు, ఉక్కు మొదలగు ప్రధాన పరిశ్రమలన్నింటినీ ప్రభుత్వం స్వాధీనపర్చుకొని నడుపుతుంది.
6. తాను స్వాధీనం చేసుకొనిన ఇతర పరిశ్రమలన్నింటినీ ప్రజా ప్రభుత్వం తన కంట్రోలు కింద నడుపుతుంది. కార్మికులకు న్యాయమైన జీతాలు, ఇతర సదుపాయాలు ఉండేటట్లు చూస్తుంది. ప్రజలకు కావలసిన వస్తువులను తయారు చేసేటట్లు చూస్తుంది. లాభాలకోసం యుద్ధకాలంలో బట్టల మిల్లు యజమానులు కావలసిన చౌకగుడ్డను తయారు చేయడానికి నిరాకరించారు. బొగ్గు గనుల యజమానులు మంచి బొగ్గును తీయకుండా దాచిపెట్టారు. ఇట్టి అవకతవకలు జరుగకుండా ప్రజా ప్రభుత్వం జాగ్రత్త పడుతుంది.
7. కార్మికులు తమ సంఘాలను ఎట్టి ఆటంకాలు లేకుండా స్వతంత్రంగా నిర్మించుకోడానికి అవకాశాలు కల్గించుతుంది. ప్రజా ప్రభుత్వ ప్రతినిధులతోను, ఫ్యాక్టరీ యజమానులతోను కలసి, కార్మిక సంఘ ప్రతినిధులు కూడా ఉత్పత్తిని ఎక్కువ చేయడానికి పని చేస్తారు. ఫ్యాక్టరీలను నడపడంలో కూడా భాగస్వాములుగా వుంటారు.
8. కార్మికుల హక్కులకు భంగం కల్గించే శాసనాలన్నిటినీ రద్దు చేస్తుంది.
9. కార్మికులను పనిలోనుండి తీసివేయడాన్ని వెంటనే ఆపుజేస్తూ వారికి కనీసపు వేతనాన్ని నిర్ణయిస్తూ ఆర్డినెన్సు ప్రజా ప్రభుత్వం వెంటనే చేస్తుంది.
10. కార్మికుల ఈ క్రింది ప్రాథమిక హక్కులను కాపాడుతూ చట్టాలు చేస్తుంది.

1. కార్మికులకు పని ఎప్పుడూ చూపించే బాధ్యత ప్రభుత్వానిది. కార్మికులకు పనిలేనప్పుడు, వారికి పూర్తి జీవిత భృతినివ్వడానికి భీమా పద్ధతిని ఏర్పరచాలి. దీనికయ్యే ఖర్చు ఫ్యాక్టరీ యజమానులు, ప్రభుత్వం పెట్టుకోవాలి.
2. రోజుకు 8 గంటలకు మించి పని ఉండకూడదు. వారానికి 44 గంటలకు మించకూడదు.
3. నెలకు కనీసపు జీతం రూ.50లు ఉండాలి. అప్పులు రద్దు చేయాలి.
4. జబ్బుపడినప్పుడిచ్చే సెలవులు, ఇతర క్యాజువల్ సెలవులు కాక ప్రతి సంవత్సరమూ నిండు జీతంతో ఒకేసారి 15 రోజుల సెలవు ఇవ్వాలి.

5. పరిశుభ్రమైన స్థలాలలో, నీటి సదుపాయాలు, దీపపు ఏర్పాట్లు, మంచి వీధులుండేటట్లు ఇండ్ల వసతులేర్పరచాలి. ప్రభుత్వం, ఫ్యాక్టరీ యజమానులు వీనిని నిర్మించి కార్మికులకు తక్కువ అద్దెలకు ఇవ్వాలి.
6. ప్రమాదాలు కలిగినప్పుడు, జబ్బు చేసినప్పుడు, ముసలితనంలో కార్మికులకు జీవన భృతిని ఏర్పరచాలి.
7. స్త్రీ కార్మికులకు పురుషులతో పాటు సమాన పనికి సమాన జీతాలివ్వాలి.
8. కనడానికి ముందు ఆరువారాలు, కనీస పిదప ఆరువారాలు నిండు జీతంతో స్త్రీ కార్మికులకు సెలవు ఇవ్వాలి. శిశు పోషణకు ప్రత్యేక అలవెన్సు ఇవ్వాలి.

   తల్లులు పనిచేస్తున్నప్పుడు బిడ్డలను సంరక్షించడానికి (క్రెచీలు) శిశుపోషణ భవనాలను తర్ఫీదుచెందిన దాదుల యాజమాన్యాన్ని ఏర్పరచాలి.
9. కార్మికులకు ఉచిత వైద్య సహాయం.
10. కార్మికులకు ఉచిత విద్యా సౌకర్యాలు, రాత్రి పాఠశాలలు ఏర్పరచాలి. వారు పనిచేసే తీరిక సమయాలలో తమ నైపుణ్యాన్ని, శాస్త్ర జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోడానికి ప్రత్యేక పాఠశాలలు ఏర్పరచాలి.

## ఆంధ్రలో అభివృద్ధి చేయడానికి వీలున్న పరిశ్రమలు

అఖిలభారత పారిశ్రామిక ప్రణాళికననుసరించి కార్మికులు, ప్రజా ప్రభుత్వం, దేశభక్తిగల ఫ్యాక్టరీ యజమానులు కలిసి ఆంధ్రలో ఈ క్రింది పరిశ్రమలను నిర్మించడానికి పూనుకోవాలి.

**1. కడప-కర్నూలు బెజవాడలలో ఇనుము-ఉక్కు పరిశ్రమ**

కర్నూలు జిల్లాలో డోన్ తాలూకాలోను, కడపజిల్లాలో పెండ్లిమర్రి ప్రాంతాన ఆధునిక పెద్ద పరిశ్రమను స్థాపించడానికి కావలసినంత ఇనుము దొరుకుతుందని పరిశోధనలు రుజువుచేశాయి. సంగమేశ్వరం, తుంగభద్రా ప్రాజెక్టుల నుండి విద్యుచ్ఛక్తిని, సమీపంలో సాందూరు దగ్గర దొరికే మాంగనీసును వినియోగించి పెద్ద ఇనుము ఉక్కు పరిశ్రమను ఈ ప్రాంతంలో నెలకొల్పవచ్చును.

బెజవాడ ప్రాంతాన క్రోమైటు దొరుకుతూ ఉంది. కొత్తగూడెం ఏజెన్సీ ప్రాంతాలలోని రాక్షసిబొగ్గు, విశాఖ ప్రాంతంలోని మాంగనీసును ఉపయోగించి ఇనుప పరిశ్రమను బెజవాడ ప్రాంతాన స్థాపించడానికి అవకాశముంది.

**2. విశాఖలో మాంగనీసు-అల్యూమినియం-రసాయనిక పరిశ్రమ**

పై లోహాలు విశాఖ జిల్లాలో దొరుకుతున్నాయి. సమీపంలో ఉన్న విశాఖ హార్బరు, రైలు మార్గాల సౌకర్యాలను ఉపయోగించుకుంటూ రసాయనిక పరిశ్రమను, ఇతర ప్రధాన పరిశ్రమలను ఇచ్చన అభివృద్ధి చేయడానికి వీలవుతుంది. (ఎలక్ట్రిసిటీకి) విద్యుచ్ఛక్తికి సంబంధించిన బ్యాటరీలు కూడా తయారు చేయవచ్చును.



**3. నెల్లూరులో అభ్రకం - రాగి విద్యుత్ పనిముట్లు**

నెల్లూరు జిల్లాలో అభ్రకం (మైకా) బాగా దొరుకుతుంది. దానిని త్రవ్వి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. రాగి, తుత్తినాగం కూడా దొరుకుతుంది. వీనితో గొప్ప విద్యుత్ పరిశ్రమను నెల్లూరు జిల్లాలో నెలకొల్పడానికి వీలవుతుంది. మైకా పోలవరం తాలూకాలో కూడా దొరుకుతుంది. మైకానుండి పెద్దపెద్ద భారీ యంత్రాలు అరిగిపోకుండా వుండడానికి కావలసిన కందెన (లూబ్రికంట్స్)ను తయారు చేయవచ్చును.

**4. కర్నూలు - గుంటూరులలో సీసపు పరిశ్రమ**

సీసం కడపలోను, కర్నూలు జిల్లా కంభంలోను, గుంటూరు జిల్లాలో పల్నాడు తాలూకాలోను దొరుకుతుంది. ఇచ్చట పెద్ద సీసపు పరిశ్రమ ఏర్పరచాలి.

**5. బంగారం**

అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకాలో దొరుకుతూ వుంది.

**6. రాయలసీమ జిల్లాలలో ఆస్బెస్టాస్, సిమెంటు పరిశ్రమ**

రాయలసీమ జిల్లాలలో ఆస్బెస్టాస్ ఎక్కువగా దొరుకుతూవుంది. దీనిని పెద్ద పరిశ్రమగా నడుపవచ్చును. బెజవాడ, తాడేపల్లిలో ఇప్పుడున్న సిమెంటు ఫ్యాక్టరీలేగాక రాయలసీమ జిల్లాలలోను, డోన్, మదనపల్లిలోను, గుంటూరు పల్నాడులోను, నెల్లూరు జిల్లా కనిగిరిలోను సిమెంటు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయవలయును.

పల్నాడులో రంగురంగుల చలువరాయి దొరుకుతూ వుంది. మార్కాపురం తాలూకాలో పలకల పరిశ్రమను మరింత అభివృద్ధి చేయాలి.

**7. గ్రాఫైటు పరిశ్రమ**

కృష్ణా, ఉభయ గోదావరులలో గ్రాఫైటు దొరుకుతూ వుంది. దీని నుండి బెజవాడ, రాజమండ్రిలలో పెన్సిలు ఫ్యాక్టరీలు నిర్మించవచ్చును.

**8. పింగాణీ (సిరమిక్) పరిశ్రమ**

రాజమండ్రిలో గ్రాఫైటుతో పాటు పింగాణీ పరిశ్రమకు కావలసిన మట్టి దొరుకుతూ వుంది. అందుచే ఇచ్చట పింగాణీ పరిశ్రమను ఏర్పరచవచ్చును. సిరమిక్ పరిశ్రమ నెల్లూరు, రాయలసీమ జిల్లాలలో కూడా ఏర్పరచడానికి కావలసిన ఖనిజ సముదాయమంతా వుంది.

**9. రంగుల పరిశ్రమ**

రాయలసీమ జిల్లాలలో వివిధ రకాలైన బారైట్సు దొరుకుతున్నాయి. దీనినుండి రంగులు తయారు చేయడానికి వీలవుతుంది.

**10. కాగితపు పరిశ్రమ**

రాజమండ్రిలోనేగాక కర్నూలు జిల్లాలోను, విశాఖలోను కాగితపు ఫ్యాక్టరీలను ఏర్పరచడానికి కావలసిన అడవులున్నాయి.

**11. చందనపు నూనె**

ఇతర అటవీ వృక్షాల నుండి నూనెలు తయారుచేసే పరిశ్రమలు కర్నూలు, విశాఖ ఏజెన్సీ ప్రాంతాలలో ఏర్పరచవచ్చును.

**12. బట్టల మిల్లులు**

అదోని, తాడిపత్రి, గుంతకల్లులో చుట్టుపక్కల తయారవుతున్న పత్తిని వినియోగించి గుడ్డలు తయారు చేయడానికి బట్టల మిల్లులు ఏర్పాటుచేయాలి.

**13. వనస్పతి ఫ్యాక్టరీలు**

విశాఖ, బెజవాడ, గుంటూరు, నంద్యాల, అనంతపురం, మదనపల్లి మొదలైన ప్రాంతాలలో ఈ ఫ్యాక్టరీలను నెలకొల్పి చుట్టుపక్కల తయారయ్యే వేరుశెనగ నుండి వనస్పతిని తయారుచేయాలి.

**14. సిగరెట్ ఫ్యాక్టరీని గుంటూరు జిల్లాలో ఏర్పరచవచ్చును.**

**15. వివిధ జిల్లాలలో తోళ్ల పరిశ్రమలను నెలకొల్పవచ్చును.**

**16. పండ్లు తయారయ్యే ప్రాంతాలలో పండ్ల రసాన్ని జాగ్రత్త పెట్టే కానింగు పరిశ్రమలను ఏర్పరచాలి.**

**17. బెజవాడ, విశాఖ, రాజమండ్రి, రాయలసీమ జిల్లాలలో ఎరువులు తయారుచేసే ఫ్యాక్టరీలకు అవకాశాలున్నాయి.**

## రైలు మార్గాలు

మన తెలుగుదేశంలో చాలా ప్రాంతాలకు రైలు సౌకర్యం లేనేలేదు. ప్రయాణాలకు ఇబ్బంది కలుగుటేగాక అచ్చటి పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి కూడా పెద్ద రైలు మార్గాలు లేకపోవడం పెద్ద అడ్డంకిగా ఉంది. ఇప్పుడు రైల్వే కార్మికులకు కూడా పని కల్పించడానికి కొత్త రైలు మార్గాలు వేయడం వల్ల సాధ్యమవుతుంది. తెలుగుదేశంలో ఈ క్రింది రైలు మార్గాలను వెంటనే వేయడానికి పూనుకోవాలి.

1 (ఎ) విశాఖపట్టణాన్నుండి వరంగల్ వరకు – ఇది తెలంగాణా ప్రాంతం. గోదావరీ నదీ స్కీము పరిసర ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాలు దీని అభివృద్ధికి తోడ్పడుతుంది.

(బి) రాజమండ్రి నుండి భద్రాచలం వరకు అచ్చటి నుండి విశాఖ – వరంగల్ రైలు మార్గంలో కలుపుతూ ఒక రైలు మార్గం వేయాలి.

2. హైదరాబాదు సిటీ, దేవరకొండ, మాచెర్ల, దొనకొండ, పొదిలి, ఒంగోలులకు రైలుమార్గం వేయాలి.

3. ఒంగోలు, అద్దంకి, నర్సరావుపేట, సత్తెనపల్లి, అచ్చంపేటలను కలుపుతూ మరొక రైలుమార్గం.



4. ఒంగోలు, పొదిలి, కనిగిరి, బద్వేలు, కడప, రాయచోటి, మదనపల్లి – బెంగుళూరులకు రైలు.

5. నెల్లూరు, బద్వేలి, మైదుకూరు, పొద్దుటూరు, ఆళ్లగడ్డ, నంద్యాల బండి ఆత్మకూరులకు రైలు.

6. గూడూరు, రావూరు, రాజంపేట, రాయచోటి, కదిరికి రైలు.

7. రాయదుర్గ, కళ్యాణదుర్గ, అనంతపురం, తాడిపత్రి, కోయిలకుంట్ల, నంద్యాలకు రైలు.

8. బళ్లారి, అదోని, కర్నూలు, ఆత్మకూరు, ఎర్రగొండపాలెం, మాచెర్లకు రైలు.

9. కదిరి, పులివెందుల, ఎర్రగుంటల, ప్రొద్దుటూరులకు రైలు.

10. ఖమ్మం మెట్టు, తిరువూరు, చింతలపూడి, జంగారెడ్డి గూడెం, నిడదవోలుకు రైలు.

11. చల్లపల్లి, పామర్రు, గుడివాడ, నూజివీడు, తిరువూరులకు రైలు.

## రేవు పట్టణాలు

విశాఖపట్టణాన్నే గాక కాకినాడ, నర్సాపురం, మచిలీపట్టణం, ఓడరేవు (గుంటూరు జిల్లా), కృష్ణా పట్టణం. (నెల్లూరు)లన్నీ కూడ రేవు పట్టణాలుగా అభివృద్ధి చేయాలి.
మన ముఖ్య పట్టణములకన్నిటికీ విమానాలలో ప్రయాణం చేయడానికి కావలసిన విమానాశ్రయాలు నిర్మించాలి.

## చేనేత పరిశ్రమ

తెలుగుదేశంలో 1,30,000 మగ్గాలున్నాయి. చేనేత కుటుంబాలు ప్రధానంగా దేవాంగ, పద్మశాలి మొదలగు కుటుంబాల నుండి వస్తారు. కొద్దిమంది ముస్లిములు, ఆదిమాంధ్రులు కూడా ఉన్నారు. ఈ వరకు మిల్లుబట్టల పోటీవల్ల వీరి పరిశ్రమ చాలా కుంటుపడింది. ఇప్పుడు గుడ్డ కరువున్నప్పుడు, గుడ్డలు నేయడానికి కావలసిన నూలు దొరకడం లేదు. ఒకవైపు బట్టల మిల్లుల యజమానులు చేనేత పారిశ్రామికుని గుడ్డకు పోటీవచ్చి అతని పరిశ్రమను దెబ్బకొట్టేవారు. కాని చేనేత పరిశ్రమలను ఫ్యాక్టరీలలోకి ఇముడ్చుకోడానికి తగిన ప్రయత్నాలు చేసేవారుకారు. వారికి పనిలేనప్పుడు కావలసిన జీవన భృతి ప్రభుత్వం కలిగించేదికాదు. మరొకపక్క చేనేత పరిశ్రమలోనే మాష్టరు వీవర్సు చేనేత పారిశ్రామికులపై పెత్తనం చేస్తూ వారికీ ఫ్యాక్టరీ పనివారికన్న తక్కువ జీతాలిచ్చి పని చేయించుకుంటున్నారు.

బొంబాయి బట్టల మిల్లులో మగ్గంపై నేసే వ్యక్తికి రూ. 70లు నెలకు వస్తాయి. ఒక చేనేత పారిశ్రామికుడు అతని కుటుంబమంతా పని చేసినా రూ. 50లకు మించి నెలకు ఆదాయం రాదు.

ఈరోజు చేనేత పారిశ్రామికులు అత్యధిక సంఖ్యాకులు, ఏదో ఒక మాష్టరువీవరు కింద జీతం కోసం పనిచేసే వాళ్లుగా తయారయ్యారు. అతనికి సొంత మగ్గమున్నా, తాను నేసిన బట్టను మాష్టరు వీవరు అమ్ముకోక తప్పదు. చేనేత పారిశ్రామికునికి తక్కువ జీతాలిచ్చి నేయించడం వల్ల మాష్టరు వీవరుకు బట్టలు తక్కువ ఖరీదుకు వస్తున్నాయి. వాళ్లు ఆ బట్టలను ఎక్కువ ఖరీదుకు ప్రజలకు అమ్మి ఎక్కువ లాభాలు సంపాదించడానికి చూస్తున్నారు. అందుచేతనే మాష్టరు వీవరు చేనేత గుడ్డకు ధరలు కంట్రోలు చేయవద్దంటున్నాడు. అదే రీతిగ చేనేత పారిశ్రామికునికి ఇవ్వాల్సిన కనీసపు జీతాలను కూడా నిర్ణయించడానికి ఇతడు వ్యతిరేకిస్తున్నాడు. ఎన్‌జి రంగా, ఆయన అనుచరులు మాష్టరు వీవర్ను అన్యాయపు కోర్కెలను బలపరుస్తున్నారు. చేనేత పారిశ్రామికుల దృష్టిని, వారికి అన్యాయం చేస్తున్న ఈ మాష్టరు వీవర్సు, బ్లాకు మార్కెట్టుదారుల నుండి మరలించడానికి, బట్టల మిల్లులవల్లనే వారి పరిస్థితి ఇంత శోచనీయంగా వుందని ఉపన్యాసాలు రంగాగారు కొట్టేస్తుంటారు.

చేనేత పారిశ్రామికుల్ని యుద్ధకాలంలో అత్యంత క్లిష్ట పరిస్థితులెదుర్కొన్నప్పుడు కమ్యూనిస్టు పార్టీ అతనితో కలిసి పనిచేసింది. ఆంధ్ర చేనేత పారిశ్రామికుల సంఘాన్ని నిర్మించడానికి తోడ్పడింది. నూలులో జరిగే దొంగ వ్యాపారాన్ని అరికట్టి అతనికి కావలసిన నూలు రేషను వచ్చేటట్లు కృషి చేసింది. ప్రతి చేనేత పారిశ్రామికునికి కిరసనాయిల్ రేషను వచ్చేటట్లు పనిచేసింది. మాష్టరు వీవర్లు చేనేత పారిశ్రామికునికి రావలసిన నూలు రేషన్‌ను, జీతాలను తగ్గించడానికి చూస్తే ఎదుర్కొని పనిచేసింది.

బట్టల యంత్రాలను తీసేస్తే చేనేత పారిశ్రామికునికి కావలసిన నూలులేదు. అతనికి పనికూడా దొరకదు. తన సంఘాన్ని బలపర్చుకొని నిరంతరం కృషి చేయడం ద్వారానే చేనేత పారిశ్రామికుని ఈ క్రింది కోర్కెలు నెరవేరుతాయి.

1. పనిపోయిన చేనేత పారిశ్రామికులకు కొత్తగా ఏర్పరచే బట్టలు మిల్లులలో పని చూపించాలి. వారికి కనీసం నెలకు 50 రూపాయలకు తగ్గకుండా జీతాలుండాలి.
2. చేనేత సహకార సంఘాలేర్పరచి వాటిద్వారా నూలు సరఫరా చేయాలి.
3. చేనేత పారిశ్రామికునికి మాస్టరు వీవర్సు ఇవ్వాల్సిన కనీసపు రేట్లు నిర్ణయించాలి.
4. కో–ఆపరేటివ్ సొసైటీల ద్వారా, విద్యుచ్ఛక్తి మగ్గాలు సరఫరా చేయాలి. వీని వలన చేనేత పారిశ్రామికుడు ఎక్కువ బట్టను తయారు చేయగలడు. ఇంకా ఎక్కువ ఆదాయం సంపాదించగలడు.
5. చేనేత బట్టకు ధర నిర్ణయించి, ప్రభుత్వం దానిని పూర్తిగా కొని ప్రజలకు అమ్మడానికి ఏర్పాట్లు చేయాలి. దీని వలన మిల్లు బట్టల పోటీ వల్ల చేనేత గుడ్డ విడుదల కాకపోవడం జరుగదు.
6. చేనేత పారిశ్రామిక కుటుంబాలకు అన్ని విధములా ప్రభుత్వం తోడ్పడాలి. వారికి కావలసిన అప్పులు, నూలు వగైరాలు దొరికేటట్లు చూడాలి.



7. చేనేత పారిశ్రామికునికి పని దొరకనప్పుడు అతని జీవితానికి సరిపోయే నిరుద్యోగ భృతిని ఇవ్వాలి.

## ఇత్తడి, కంచు వగైరా చేతిపనులు

వీరి స్థితి చాలా ఘోరంగా వుంది. వీరికి కావలసిన ముడి సరుకు దొరుకుట లేదు. ఎక్కువ గంటలు పనిచేసినా సంపాదించేది చాలా తక్కువ. వస్తువులను తయారు చేయడానికి ఆధునిక యంత్రాలు ఉపయోగించడం లేదు. ఈ వివిధ చేతిపనులను అభివృద్ధి చేయడానికి ఉత్పత్తి సహకార సంఘాలేర్పరచడానికి కృషి చేస్తుంది. వారిద్వారా వీరికి కావలసిన ముడి సరకులు దొరికేటట్లు చూస్తుంది. ఆధునిక యంత్రాలు ఉపయోగించి ఎక్కువ వస్తువులను తయారు చేయడానికి కృషి చేస్తున్నది. ఎక్కువ ఆదాయం ఆ రకంగా సంపాదించడానికి తోడ్పడుతుంది.

## చిన్న దుకాణదారులు, వర్తక గుమాస్తాలు

వర్తకుల క్రింద పనిచేస్తున్న గుమస్తాలు పట్టణాలలో అభివృద్ధి చెందుతూ వున్న కార్మికోద్యమాన్ని చూసి తాముకూడా గుమస్తాల సంఘాలను ఏర్పరచుకున్నారు. వారానికి ఒకరోజు శెలవు, కరువు భత్యం కూడా సంపాదించుకోగలిగారు. పట్టణ మధ్యతరగతి ప్రజాసామాన్యంలో వీరే కార్మికవర్గానికి కొంత దగ్గరగా ఉంటున్నారు.

చిన్న వర్తకుడు, పెద్ద వర్తకుని ప్రాబల్యం కింద ఉన్నాడు. కమ్యూనిస్టులు దొంగ మార్కెటుకు వ్యతిరేకంగా పనిచేస్తూ ఉంటే, కమ్యూనిస్టులు చిన్న వర్తకులకు కూడ వ్యతిరేకమేనని దురభిప్రాయం కలిగిఉన్నాడు. చిన్న వర్తకుడు తాను అమ్మే వస్తువులను దొంగ మార్కెటు నుండి కంట్రోలు రేటుకు మించి కొనుక్కోవలసి వస్తున్నదని అందరికీ తెలిసిన సంగతే. తాను కొన్నదే కంట్రోలు రేటుకు మించి ఉన్నప్పుడు, కొద్ది లాభంతో కలిపి అమ్ముకోకపోతే తన జీవితానికి కావలసిన ఆదాయాన్ని గడించుకోలేడు. కమ్యూనిస్టులు చిన్న వర్తకులు కంట్రోలు రేట్లను మించి కొద్దిపాటి లాభాలను వేసుకొని తన భుక్తికోసం అమ్ముకుంటూ ఉంటే అతనిని దొంగ వ్యాపారస్తుడుగా పరిగణించరు. అయితే ఆ చిన్న వర్తకులకు కమ్యూనిస్టు పార్టీ చేసే విజ్ఞప్తి : మీరందరూ దొంగ వ్యాపారాన్ని అరికట్టడానికి ప్రజలతో కలిసి పనిచెయ్యండి. దాని వలన మీకు కూడా వస్తువులు కంట్రోలు రేట్లకే వస్తాయి. అప్పుడు ప్రజలకు న్యాయమైన లాభాలు వేసుకొని అమ్మి మీరు న్యాయంగా జీవించడానికి వీలు కల్గుతుంది. మీరు పెద్ద దొంగ వ్యాపారస్తులతో కలిసి, అతను చేసే అన్యాయాలను కప్పి పెట్టడానికి పూనుకోవద్దు. అతను పట్టుపడకుండా కాపాడవద్దు. మొదట ఎంత కష్టమని తోచినా న్యాయమైన వర్తకం సాగించడానికి మీరుకూడా ప్రజలతో కలిసి దొంగ మార్కెట్టుకు వ్యతిరేకంగా పనిచేయాలి.

చిన్న దుకాణదారుడు కూడా చిల్లర దుకాణదారుల సంఘాలను ఏర్పరచుకోవాలి. ఈ సంఘాల ద్వారా తనకు కలిగే యిబ్బందులను పోగొట్టుకోవడానికి పనిచేయాలి.

1. ప్రభుత్వ ఉద్యోగస్తులు అనవసరంగా చిన్నచిన్న విషయాలలో జోక్యం కల్గించుకొనకుండా చూడాలి.
2. చిల్లర దుకాణదారుని వ్యాపారం కుంటుపడకుండా కావలసిన సామాగ్రి సరఫరా అయేటట్లు చూడాలి.
3. మంచి సరకును ప్రజలకు న్యాయమైన ధరలకు సకాలంలో అందించడానికి కృషి చేయాలి.
4. కో–ఆపరేటివ్ స్టోర్స్ ఉద్యమం చిల్లర దుకాణదారులకు శత్రువు కాదు. అతనికి అది తోడ్పడుతుంది. ఆ స్టోర్సు ద్వారా అతనికి, ప్రజలకు కావలసిన సరకు కంట్రోల్ రేట్లకు సరఫరా అవుతుంది. లంచగొండి ఉద్యోగస్తుడు, దొంగ వ్యాపారస్తుడు వీరిద్దరి బారినుండి చిన్న దుకాణదారులను రక్షిస్తుందని వారు గుర్తించాలి.
5. చిన్న దుకాణదారులు ప్రజాతంత్ర ఉద్యమాలతో కలిసి పనిచేసేకొద్దీ ఎక్కువగా బలపడతారు. కాంగ్రెసు – కమ్యూనిస్టు ఐక్యతను, కాంగ్రెసు – లీగు ఐక్యతను తేవడానికి కారకులవుతారు.

## పట్టణ మధ్యతరగతి ప్రజలు

యుద్ధకాలంలో ధరలు పెరగడం వల్ల ప్రభుత్వంలోను, స్థానిక సంస్థలలోను, వర్తకుల క్రింద పనిచేస్తూ వున్న తక్కువ జీతపు ఉద్యోగస్తులు చాలా బాధపడ్డారు. వీరికి యుద్ధ భత్యం చాలా కొద్దిగా ఇచ్చారు. అదికూడా చాలా ఆలస్యంగా యిచ్చారు. పట్టణాలలో జన సమ్మర్ధం ఎక్కువై ఇంటి అద్దెలు పెరిగిపోయిన ఈ రోజులలో వీరికి ఇండ్లు దొరకడమే కష్టమైంది. దొరికినా విపరీతమైన అద్దెలు యిచ్చుకోవలసి వస్తుంది. తమ దైనిక జీవితావసరాలకు కావలసిన బియ్యం, ఉప్పు, పప్పు, కిరసనాయిల్, అగ్గిపెట్టెలు, గుడ్డలు, కాగితాలు, మందులు అన్నీ దొంగ మార్కెట్టులో కొనుక్కోవలసి వచ్చి, తమకు ఇచ్చే జీతాలతో తమ సంసారాలను గడుపుకోవడం అసంభవమైంది. వారి జీవిత ప్రమాణం ఎంతో తగ్గించుకోవలసి వచ్చింది. తమ బిడ్డలకు కావలసిన చదువుకు పూర్తి ఏర్పాట్లు చేయలేకపోతున్నారు. తమ బిడ్డలకు, బంధువులకు వచ్చే జబ్బులకు జ్వరములకు తగిన మందులుయిచ్చి చికిత్స చేయించలేకపోతున్నారు. యుద్ధానికి ముందు మధ్యతరగతి చదువుకొన్నవారిలో నిరుద్యోగం ఎక్కువగా వుండేది. యుద్ధం వల్ల తాత్కాలిక పనులలో వారికి పనిదొరికింది. కాని నేడు తిరిగి వారందరికీ పనులుపోయి నిరుద్యోగులవుతున్నారు. తమ జీవితమంతా గాఢాంధకారంగా తిరిగి కన్పడుతూంది.

ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజనీర్లు మొదలగు విద్యావంతులు ఒక్క సంగతి తెలుసుకోవాలి. వారికందరికీ పనులు, సౌఖ్య ప్రదమైన జీవితానికి కావలసిన జీతాలు, ఇతర సౌకర్యాలు స్వతంత్ర విశాలాంధ్రలో ప్రజా ప్రభుత్వం క్రింద, వ్యవసాయిక పారిశ్రామికాభివృద్ధి ఆరంభించినప్పుడే అవి అన్నీ సాధ్యమవుతాయి. అట్టి ప్రజాతంత్రయుత విశాలాంధ్ర రాజ్యాన్ని, ఒక నూతన విజ్ఞానాన్ని, నైతిక జీవితాన్ని సృష్టించాలంటే ఐక్య ప్రజా



వుద్యమం వల్లనే సాధ్యమవుతుంది. మరేమార్గం కూడా లేదు. నూతన ప్రజాతంత్ర ఆంధ్రలోనే, విద్యావంతులందరూ తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని, శక్తి సామర్ధ్యాలను పూర్తిగా వినియోగించి ప్రజలకు కావలసిన నూతన పరిశ్రమలు, ప్రాజెక్టులు, స్కూళ్లు, కాలేజీలు, విజ్ఞాన కేంద్రాలు, కళాకేంద్రాలు నెలకొల్పగలుగుతారు.

## ముస్లిం ప్రజలు

పదకొండు తెలుగు జిల్లాలలో ముస్లిములు నూటికి 5 నుండి 10 మంది వరకు వుంటున్నారు. వీరు ప్రధానంగా పట్టణాలలోను, పెద్ద గ్రామాలలోను ఎక్కువగా నివసిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది బీదలు, చిన్న దుకాణదారులు, జట్కా బండివారు, బీద కార్మికులు, కుట్టుపనివారు. చాలా కొద్దిమంది మాత్రమే కాస్త ఆస్తిపరులగాను, వర్తకులుగాను, ఇతర ఉద్యోగులుగాను ఉంటున్నారు. వీరంతా ముస్లింలీగును బలపరుస్తున్నారు. కాని ప్రతి స్థలంలోను ఇంకా లీగును నిర్మాణ రూపకంగా ఏర్పరచి సరిగా బలపర్చుకోలేదు. ముస్లింలీగు కూడా ముస్లిం బీద ప్రజల ఆర్థిక, సామాజిక హక్కులు తీసుకొని పనిచేయడానికి యింకా ఆరంభించలేదు.

విశాలాంధ్రలో వీరికి న్యాయమైన హక్కులు గ్యారంటీ చేయబడతాయి. వారి మతాన్ని అనుసరించడానికి, విజ్ఞానాన్నభివృద్ధి చేసుకోడానికి పూర్తి స్వాతంత్ర్యం ఉంటుంది. ఉర్దూ భాషలో వారికి చదువు చెప్పబడుతుంది. స్థానిక సంస్థలలోను, శాసన సభలలోను వారి జనాభాకు తగిన ప్రాతినిధ్యం ఉంటుంది. ఆ ప్రతినిధులను వారు ప్రత్యేక నియోజకవర్గాల ద్వారానే ఎన్నుకొని పంపుకోవచ్చు. ప్రత్యేక నియోజకవర్గాలనవసరమని వారే వదులుకొనేవరకు ఈ పద్ధతి ఉంటుంది. ప్రభుత్వోద్యోగాలలో కూడా వారికి జనాభాకు తగిన స్థానాలు ఉంటాయి. ముస్లిం బీద ప్రజలకు పనులు, కనీసపు జీతాలు, సుఖంగా జీవించడానికి కావలసిన ఇతర జీవిత సదుపాయాలు కలుగజేయబడతాయి. ముఖ్యంగా వారు ఆర్థికంగా భద్రంగా జీవించడానికి కావలసిన చర్యలన్నీ తీసుకోబడతాయి.

# ఐదవ అధ్యాయం

దేశమును ప్రేమించుమన్నా,
మంచి అన్నది పెంచుమన్నా.
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్!
గట్టిమేల్ తలపెట్టవోయ్!
పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయ్,
తిండి కలిగితే కండ కలదోయ్,
కండ కలవాడేను మనుషోయ్!
యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్?
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నించవోయ్!
మందగించక ముందు అడుగేయ్.
వెనుకబడితే వెనుకేనోయ్!
దేశమనియెడి దొడ్డ వృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయ్,
నరుల చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయ్!
ఆకులందున అణగిమణగీ
కవితకోయిల పలుకవెనోయ్!
పలుకలను విని దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయ్!

*- కీ.శే. గురజాడ అప్పారావు.*



## ఆంధ్ర ప్రజల నూతన ప్రజాస్వామిక రాజ్యం

నేడు మన తెలుగు ప్రజలు, ఇంగ్లీషు ప్రభుత్వం క్రింద మద్రాసు రాజధానిలో 11 జిల్లాలలోను, నిజాం రాష్ట్రంలో తెలంగాణాలోను, మైసూరు, ఒరిస్సా మధ్య పరగణాలు, బస్తరు సరిహద్దు ప్రాంతాలలోను నివసిస్తున్నారు. వీరినందరినీ కలిపి మన తెలుగు గడ్డనంతా ఒకే రాజ్యాంగంగా చేయాలని మనం కోరుతున్నాం. మద్రాసు రాజధానిలో తమిళ, మలయాళ, తెలుగు సంకర (మిళిత) పరిపాలన వలన, మన రాజకీయ ఆర్థిక సామాజిక జీవితం శిథిలమవుతూ ఉంది. ఈ రోజున శాసనసభలో తెలుగు ప్రతినిధులు మూడవవంతు మాత్రమే ఉన్నారు. అయినా ఈ శాసన సభే తెలుగు ప్రజలకు సంబంధంచిన శాసనాలన్నీ చేస్తున్నది. పైగా ఇంగ్లీషు గవర్నరు అతని వీటో నిరంకుశాధికారం క్రింద ఈ శాసనాలు చేస్తున్నారు.

మనలను ఈరోజు పరిపాలించేది గవర్నరు, అతని ఏజెంట్లు. రాష్ట్రం మీద గవర్నరు, జిల్లాలలో కలెక్టర్లు, తాలూకాలలో తహసీల్దారులు, గ్రామాలలో గ్రామ మునసబులు, స్థానిక స్వపరిపాలన సంస్థలని గ్రామాలలో పంచాయతీలు, జిల్లాకంతకు జిల్లా బోర్డులు, పట్టణాలలో మున్సిపాలిటీలు ఉన్నాయి. కాని వీనిని ప్రజలందరూ ఎన్నుకోరు. యుక్త వయస్సు వచ్చిన వారిలో మూడవ వంతుకు మించని ఓటర్లు మాత్రమే ఎన్నుకుంటారు. మిగిలినవారికి ఓటుహక్కులేదు. వీటికి మన ప్రజల జీవితానికి సంబంధించిన చాలా కొద్ది విషయాలలోనే జోక్యం కల్గించుకొని పనిచేసే అధికారముంది. రోడ్లు వేయడం, విద్య, ఆరోగ్య పరిస్థితులు ఇవి ప్రధాన విషయాలు. పన్నులపైగాని, మన ప్రజల ఆర్థిక పునర్నిర్మాణంపైగాని వీరికి ప్రత్యేక సంబంధమేమీ లేదు. ఈ కొద్ది హక్కులు కూడా బోర్డులను నామినేటు చేసి ప్రభుత్వం రద్దుచేసింది. వీని పరిపాలనాధికారాలను కమీషనర్లను నియమించి మరింత తగ్గించివేసింది. విద్యను, రోడ్లను వీని అధికారాన్నుండి తీసివేసి వీనిని మరింత సంకుచితం చేయడానికి ప్రభుత్వం చూస్తూవుంది.

ప్రజాప్రాతినిధ్యం లేని ఈ నిరంకుశ ప్రభుత్వపు చట్టాలను, ఆజ్ఞలను అమలు జరుపడానికి లంచగొండి నిరంకుశ పోలీసులు, 300 సంవత్సరాలు వెనుకబడి ఉన్న శిక్షాస్మృతి, కోర్టులు వున్నాయి. పై అధికారుల చెప్పుచేతలలో న్యాయవిచారణ జరుగుతూ ఉంటుంది. అరెస్టు చేయడానికి వారంటు చేసిన మేజిస్ట్రేటులే విచారణ చేసే పద్ధతి నేటికీ ఉంది.

## నూతన ప్రజాస్వామిక రాజ్య సూత్రాలు

ప్రస్తుతపు ఈ పరిపాలనా పద్ధతి అంతా పూర్తిగా పోవాలి. 18 సంవత్సరాలు దాటిన ప్రతి పురుషుడు, స్త్రీ ఎన్నుకొనిన ప్రతినిధులతో తెలుగు ప్రజల రాజ్యాంగ ప్రజా పరిషత్తు సమావేశం కావాలి. ఈ ప్రజా పరిషత్తే తెలుగుదేశపు రాజ్యాంగ చట్టాన్ని నిర్ణయిస్తుంది.

ఈ ప్రజా పరిషత్తు మొదట ఇంగ్లీషు ప్రభుత్వం క్రింద ఉన్న తెలుగు జిల్లా ప్రజా ప్రతినిధులతో పని ఆరంభిస్తుంది. తెలంగాణాలోని మన సోదర దేశీయులు, నైజాం నిరంకుశ ప్రభుత్వాన్నుండి బయటపడినప్పుడు మనతో కలుస్తారు. స్వతంత్ర భారతదేశంలో ఐక్య విశాలాంధ్రను తెలంగాణా ప్రతినిధులు, కోస్తా రాయలసీమ ప్రజలు కలిసి నెలకొల్పుదాం. దీనికి కావలసిన రాజ్యాంగాన్ని కలిసి ఏర్పాటు చేసుకుందాం.

ఈ రాజ్యాంగ ప్రజాపరిషత్తు ఈ క్రింది ప్రధాన హక్కులను గ్యారంటీ చేస్తూ రాజ్యాంగ చట్టాన్ని తయారు చేస్తుంది.

1. వాక్సభా సంఘ స్వాతంత్ర్యాలను, పత్రికా స్వాతంత్ర్యాన్ని గుర్తించి వానికి భంగం కలుగకుండా జేస్తుంది. మత స్వాతంత్ర్యాన్ని గుర్తించి ప్రతి ఒక్కరు తమకిష్టము వచ్చిన విధంగా ప్రార్థనలు చేసుకొనే హక్కును కాపాడుతుంది.

2. ఆయుధ చట్టాన్ని రద్దుచేసి ప్రతి ఒక్కనికి ఆయుధాలు తనవెంట ఉంచుకొనే హక్కును కల్గిస్తుంది.

3. విద్యను మాతృభాషల ద్వారా ప్రతి ఒక్కరికీ నేర్పుతుంది.

4. ప్రతి ఒక్కనికీ పని చూపించి, అతని సుఖ జీవితానికి కావలసిన కనీసపు జీతాలు దొరికేటట్లు గ్యారంటీ చేస్తుంది. జబ్బు పడ్డప్పుడు ప్రమాదాలు జరిగినప్పుడు, ముసలితనమందు, స్త్రీలకు ప్రసవసమయమందు, నిండు జీతాలు వచ్చేటట్లు తగిన ఏర్పాట్లు చేసి గ్యారంటీ చేస్తుంది.

5. చదువులోను, పనులు, ఉద్యోగాలలోను, ఆస్తి హక్కులలోను, సాంఘిక హక్కులలోను, విజ్ఞానావకాశాలలోను (స్త్రీలకు పురుషులతో) సమానాధికారాలు, సమాన అవకాశాలు ఉండేటట్లు చూస్తుంది.

6. ఏ కులానికి, ఏ మతానికి, ఏ జాతికి చెందినా ప్రజలందరికి సమాన హక్కులు, సమాన బాధ్యతలు, సమాన అవకాశాలు గ్యారంటీ చేస్తుంది. జాతి, మత, కుల విచక్షతను బట్టి, మరొక కులాన్ని, మతాన్ని, జాతిని నిందించడం, వారియెడల సాంఘికంగా అణగద్రొక్కడానికి చర్యలు తీసుకోవడం, జాతి ద్వేషం కల్గించడం నేరం క్రింద ప్రకటించబడుతుంది. ప్రజల కోసం ఏర్పాటుచేసిన స్థలాలు, పార్కులు, సత్రాలు, ఆఫీసులు, బావులు, స్కూళ్లు, ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, ఎట్టి అడ్డంకులు లేక ఉపయోగించుకోవచ్చు.

7. తాము ఎన్నుకొన్న ప్రతినిధులు, ఉద్యోగస్తులు సంతృప్తికరంగా పనిచేయకపోతే ప్రజలు వారిని నియమితకాలం పూర్తికాక మునుపే తొలగించి క్రొత్తవారిని ఎన్నుకునే హక్కు ఉంటుంది. అంటే, ప్రతినిధులకు ఉద్వాసనమిచ్చే హక్కు ప్రజలకుంటుంది.



## నూతన ఆంధ్ర ప్రజారాజ్యపు నిర్మాణరూపం

1. గ్రామం : ప్రతి గ్రామంలోను 18 సంవత్సరాలు దాటిన ప్రతి స్త్రీ, పురుషుడు రహస్య బ్యాలెట్టు పద్ధతిని ఓటిచ్చి ఒక పంచాయితీ బోర్డును ఎన్నుకుంటారు.

(అ) ఈ పంచాయితీ బోర్డు గ్రామానికి సంబంధించిన అన్ని విషయాలపై అధికారం కలిగి వానిని నడుపుతుంటుంది. ఆర్థిక విషయాలు, విద్య, ప్రజారోగ్యం, ప్రజల విజ్ఞాన సౌకర్యాలు పార్కులు, రేడియోలు, గ్రంథాలయాలు ఆట స్థలాలు, నాటకశాలలు, (థియేటర్సు) మొదలగు వానిపై అధికారం కలిగి ఉంటుంది.

(ఆ) పన్నులు ప్రజల నుండి వసూలు చేసి, పై ప్రజా ప్రభుత్వానికి పంపుతుంది. ఆ పన్నులలో కొంత భాగం గ్రామ సౌభాగ్యం పెంపొందించడానికి, గ్రామ పరిపాలనను సాగించడానికి, గ్రామాలకు ప్రత్యేకించబడుతుంది. గ్రామ మునసబు, కరణం ఇప్పటివలె వంశపారంపర్యంగా నియమించబడరు. గ్రామ పంచాయతీ యాజమాన్యాన ప్రజలచే కొన్ని సంవత్సరాల వరకు ఎన్నుకోబడిన ఉద్యోగస్తులుగా ఉంటారు. వారు సరిగా పనిచేస్తే ప్రజలు వారిని తిరిగి ఎన్నుకుంటారు.

(ఇ) గ్రామంలో శాంతి భద్రతలను కాపాడే బాధ్యత పంచాయితీ బోర్డుది. దానికి కావలసిన ప్రజా రక్షణ దళాన్ని ప్రజల నుండి ఏర్పరుస్తుంది. అంటే పోలీసులపై అధికారం, గ్రామానికి సంబంధించినంతవరకు గ్రామ పంచాయతీ బోర్డుకే వుంటుంది.

(ఈ) గ్రామ పంచాయతీ బోర్డు గ్రామానికి సంబంధించినంతవరకు పై సంఘానికి లోబడి సంపూర్ణాధికారాలు గలిగిన సంస్థ. గ్రామానికి సంబంధించిన ఏ విషయంనైనా గ్రామ పంచాయతీ బోర్డు ద్వారానే పరిష్కరించాలి. చర్య తీసుకోవాలి.

గ్రామ పంచాయతీలు తాలూకా బోర్డుల యాజమాన్యం క్రింద, తాలూకా బోర్డులు జిల్లా బోర్డుల యాజమాన్యం క్రింద, జిల్లా బోర్డులు రాష్ట్ర ప్రజా పరిషత్తు యాజమాన్యం క్రింద పనిచేస్తూ ఉంటాయి.

2. తాలూకా బోర్డులు : ఇప్పుడున్న తాలూకా ఆఫీసులు, తహసీల్దారుల పెత్తనం తీసేసి తాలూకాకు సంబంధించిన సకల విషయాలపై అధికారం వహించి తాలూకా బోర్డులు సడుపుతుంటాయి. వీని క్రిందనే ప్రస్తుతమున్న తహసీల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, తాలూకా పోలీసు ఉద్యోగస్తులు అందరూ పనిచేయవలసి ఉంటుంది. తాలూకా బోర్డులు తమ క్రింది పంచాయతీ బోర్డులు తమ విధులను సరిగ్గా నిర్వర్తించేటట్లు బాధ్యత చూస్తాయి.

ఈ తాలూకా బోర్డులను తాలూకాలోని వయోజన ఓటర్లందరూ రహస్య బ్యాలెట్టు ద్వారా సరాసరి ఎన్నుకుంటారు.

3. పట్టణ మున్సిపల్ బోర్డులు : 10 వేల జనాభాకు మించిన పట్టణాలకు పై రకంగానే సర్వాధికారాలు గలిగిన మున్సిపలు బోర్డులు ఎన్నుకుంటారు.

4. జిల్లాకంతటికీ జిల్లా బోర్డును, జిల్లా ఓటర్లందరూ ఎన్నుకుంటారు. జిల్లా పోలీసు ఉద్యోగస్తులూ, ఇతర జిల్లా కలెక్టర్లు, జిల్లా ఉద్యోగస్తులందరూ జిల్లా బోర్డు క్రింద పనిచేయాలి. జిల్లా బోర్డు జిల్లా పరిపాలనంతా సాగిస్తుంది.

## మన కోర్టులు

1. (అ) అరెస్టు చేసి కేసులు పెట్టి మేజిస్ట్రేటులే విచారించే ప్రస్తుత పద్ధతి తీసివెయ్యాలి. దీనికోసం ప్రతి గ్రామంలోను, పట్టణ వార్డులలోను అచ్చట నున్న వయోజన వోటర్లు అందరూ రహస్య బ్యాలెటు ద్వారా ఎన్నుకొని పంచాయతీ కోర్టులు ఏర్పాటు చేయాలి. వానికి సివిలు, క్రిమినలు కేసులు విచారించడానికి హక్కు వుంటుంది. ప్రస్తుతం సబ్ మేజిస్ట్రేటులు జిల్లా మునసబులు విచారించే కేసులన్నిటినీ ఈ పంచాయతీ కోర్టులు విచారిస్తాయి.

(ఆ) పంచాయతీ కోర్టులపై ప్రతిజిల్లాలోను కొన్ని జిల్లా కోర్టులు సివిలు, క్రిమినలు కేసులు విచారించడానికి ఉంటాయి.

(ఇ) జిల్లా కోర్టుల పైన హైకోర్టు ఒకటి వుంటుంది.

(ఈ) ఈ అన్ని కోర్టులలోను జడ్జీలకు తోడ్పడడానికి ఇప్పుడు జ్యూరర్లు చేసే పని చేయడానికి, ప్రతి సంవత్సరమూ కొంతమందిని ప్రజలు ఎన్నుకుంటారు. సంవత్సరం పూర్తి అయినపిదప వీరి స్థానాలు ఖాళీ అవుతాయి. తిరిగి ఎన్నికలు జరుగుతాయి.

2. ఏ నేరానికైనా లేక అనుమానముండి అరెస్టు చేసినా వెంటనే 24 గంటలు కాకమునుపే పంచాయతీ కోర్టు ముందు ఛార్జిషీటు దాఖలు చేయాలి. ఛార్జిషీటు పెట్టకుండా అరెస్టు చేసి పౌరసత్వ హక్కును భగ్నం గావించే పద్ధతి పోవాలి.

3. శిక్షాస్మృతిని ఆధునిక న్యాయసూత్రాలకు అనుగుణ్యంగా ఉండేటట్లు పూర్తిగా తిరిగి రాయాలి. అలా రాసేటప్పుడు ఈ క్రింది సూత్రాలు పాటించాలి.

(అ) 124 ఎ, 153 ఎ లాంటి రాజద్రోహపు నేరపు సెక్షన్లు, 1818 మూడవ రెగ్యులేషనులాంటి రెగ్యులేషన్లు, పౌరసత్వ హక్కులను భగ్నంగావించే, ఇతర నిర్బంధ చట్టాలు, ప్రెస్సు యాక్టులు, క్రిమినల్ లా సవరణ చట్టాలు మొదలగువానిని రద్దు చేయాలి.



(ఆ) కొన్ని జాతులను దొంగజాతులుగా నిర్వచించే క్రిమినలు ట్రైబ్సు యాక్టును రద్దుచేయాలి. బీద ప్రజలను, తగిన జీవనాధారం లేదని అరెస్టు చేసి జామీను కేసులు పెట్టి శిక్ష విధించడానికి పనికివచ్చే 109, 110 జామీను సెక్షనులు రద్దుచేయాలి. బీద ప్రజలకు అన్యాయం చేసే సెక్షనులనన్నింటినీ సవరించాలి.

(ఇ) యావజ్జీవ ద్వీపాంతర శిక్ష 10 సంవత్సరాలకు మించి ఉండకూడదు.

(ఈ) ఏ శిక్షనైనా శిక్షితులను బాగుచేయడానికే ఉపయోగించాలి. కాని దండించాలనే ధోరణిలో వేయకూడదు. జెయిళ్లు శిక్షితులను సంస్కరించే ఇండ్లుగా ఉండాలిగాని దండించే జెయిళ్లుగా ఉండకూడదు. ప్రతి ఖైదీకి తను కోరిన పుస్తకాలు, పత్రికలు, బయట ప్రజలకు దొరికేవన్నీ ఇవ్వాలి. మంచి ఆహారం ఇవ్వాలి. ప్రతి ఆరు నెలలకు పెరోలు మీద తమ బంధువులను కలుసుకొని రావడానికి సెలవునివ్వాలి. తనకు విధించిన శిక్షను తన ప్రవర్తన వలన సగం వరకు రి మిషనుల వలన తగ్గించుకోవడానికి అవకాశమివ్వాలి. ఖైదీ పనిచేసిన పనికి పూర్తి జీతమివ్వాలి. అతని ఖర్చుకు పోను మిగిలినది అతని పేర జమకట్టివుంచి, అతడు విడుదలయ్యేటప్పుడు అతనికివ్వాలి. లేక అతని కుటుంబానికి పంపుతూ ఉండాలి.

## మన ప్రజలకు కావలసిన సదుపాయాలు

ఈరోజు మన గ్రామాలలో అజ్ఞానం, మూఢ విశ్వాసాలు, కులభేదాలు ఎక్కువగా వుంటున్నాయి. సరిగా గాలి, వెలుతురు రాని ఇండ్లలో నివసిస్తున్నాం. పశువులను మన ఇండ్లకు సమీపంలోనే కట్టేస్తాం. రాయలసీమ గ్రామాలలోను కొన్ని మెట్ట ప్రాంతాలలోను, ఇండ్లలోనే కట్టివేస్తుంటాం. మురుగునీరు పోవడానికి ఎట్టి సదుపాయంలేదు. అందుచే ఇండ్లనుండి వచ్చే మురుగునీరు వీధులలో మురుగు గుంటలు పెట్టుతుంది. వీధులు గడ్డి, దుమ్ముతో నిండివుంటాయి. వర్షాకాలంలో మోకాటిలోతు బురద ఉంటుంది. వీధులలో దీపాలు లేవు. ఇండ్లలో కూడా ఆముదపు దీపాలు లేక గుడ్డి కిరసనాయిలు బుడ్లు దీపాలు, కొంత ఆదాయం ఉన్న వారిండ్లలో లాంతర్లు వున్నాయి. ఆదిమాంధ్ర పల్లెలు మరీ అన్యాయంగా ఉంటాయి. పూరి గుడిసెలు మురికి ప్రదేశాలు, ధనిక రైతుల పశువుల కొట్టాల కన్నా అన్యాయంగా ఉంటాయి. ఇక కళా విజ్ఞానాలు చూస్తే మన ప్రజలకు గ్రామాలలో అవి అందుబాటులో లేనేలేవని చెప్పవచ్చును. గ్రంథాలయాలు, పార్కులు, రేడియోలు, ఆటస్థలాలు నాటకశాలలు ఏమీలేవు.

## గ్రామ ఆరోగ్యం

గ్రామ పారిశుధ్యం చాలా అధ్వాన్నంగా ఉంది. స్త్రీలకు కూడా మరుగుదొడ్లు లేవు. రోడ్లు కాలువగట్టులు మరుగు దొడ్లుగా ఉపయోగిస్తున్నాం. సరిగా ప్లాను వేసుకొని మరుగుదొడ్లు

నిర్మిస్తే ఈ మలమంతా మన పొలాలకు మంచి ఎరువు అవుతుంది. చైనా ప్రజలలాగానే మనం పొలాలకు ఉపయోగించుకుంటూ ఉండవచ్చు. మన గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయి. మన స్త్రీలకు, పురుషులకు చాలా సౌకర్యం కలుగుతుంది.

మనం త్రాగేనీరు ఏదో నూతులున్న కొన్ని గ్రామాలలో తప్ప మిగిలిన వానిలో చెరువుల, కాలువల నీరు. వీనిలో అనేక రకములైన కల్మషాలు చేరివుంటాయి. ఈ నీటిని తాగడం వల్ల అనేక జబ్బులు రావడానికి వీలవుతుంది.

మన గ్రామాలకు కడకు ప్రథమ చికిత్స సదుపాయాలు కూడా లేవు. వైద్యమంటే తెలియని బూటక వైద్యులపైనా, అర్థం లేని ఆకులు మూలికలపైన ఆధారపడవలసి వస్తుంది. ఈ 11 జిల్లాలకు 515 ఆస్పత్రులున్నాయి. దానిలో సగం ఆయుర్వేద ఆస్పత్రులు, మిగిలిన సగమే ఆధునిక వైద్య శాస్త్రాన్ననుసరించి చికిత్స చేసే హాస్పిటల్సు, 130 చదరపు మైళ్లకు ఒక హాస్పిటలు ఉంది. 3800 మంది ప్రజలకు ఒక హాస్పిటలు ఉంది. చిత్తూరు జిల్లాలో 80 వేల మందికి కాని ఒక హాస్పిటలు లేదు. తెలంగాణాలో ఇంకా అధ్వాన్నంగా ఉన్నాయి. మొత్తం 82 హాస్పిటల్సు ఉన్నాయి. అంటే లక్షా పదివేల మందికి ఒక హాస్పిటలుంది.

ఈ 11 జిల్లాలకు స్త్రీల కోసం, బిడ్డల కోసం ప్రత్యేక ఆస్పత్రులు 17 మాత్రమే ఉన్నాయి. ప్రసూతి సౌకర్యం మరీ తక్కువగా ఉంది. 1350 కాన్పులకు ఒక మంత్రసాని ఉంది. నూరు కాన్పులకైనా ఒక మంత్రసాని ఉండనిదే తగిన జాగ్రత్తలు వహించడం అసంభవం. డాక్టరు పరీక్ష క్రింద కాన్పు జరగడానికి హాస్పిటల్సులో యేర్పర్చిన పడకలు చూస్తే, 2800 కాన్పులకు ఒక పడక ఉంది.

స్త్రీల ఆరోగ్యాన్ని ఇంత నిర్లక్ష్యిస్తూ ఉన్నప్పుడు పుట్టిన ప్రతి 1000 మంది బిడ్డలకు 180 మంది ఒక సంవత్సరం వచ్చే లోపలే చనిపోతున్నారంటే ఆశ్చర్యమెందుకు? ప్రతి 1000 కాన్పులకు తొమ్మిదిమంది తల్లులు చనిపోతున్నారు.

200 సంవత్సరాలుగా ఇంగ్లీషు ప్రభుత్వం పరిపాలన లేకుండా, ప్రజా ప్రభుత్వ పాలనే ఉంటే మన ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి ఎంత కృషి చేసి ఉండగల్గేవారమో సోవియటు యూనియనును చూస్తే తెలుస్తుంది. సోవియటు ప్రభుత్వం ఏర్పడి 25 సంవత్సరాలే అయింది. ఈ 25 సంవత్సరాలలోనే సోవియటు పౌరుని ఆరోగ్యం ఎంత పెంపొందినదో ఈ క్రింది లెక్కలు తెలియజేస్తున్నాయి.

మన దేశంలో 10,500 మందికి ఒక డాక్టరుంటే సోవియటు యూనియనులో 1500 మందికి ఒక డాక్టరున్నారు. మన దేశంలో హాస్పిటలులోకి చేర్చుకొని చికిత్స చేయడానికి కావలసిన హాస్పిటలు పడకలు చూస్తే 4800 మందికి ఒక పడక ఉంటే సోవియటు యూనియన్‌లో 250 మందికి ఒకటి ఉంది. అంటే సోవియటు యూనియనులో 20 రెట్లు ఎక్కువ వైద్య సదుపాయం ఉంది.



సోవియట్ యూనియనులో 1920లో పుట్టిన 1000 మంది బిడ్డలలో సంవత్సరం వయస్సు వచ్చే లోపల 224 మంది చనిపోయేవారు. కాని 1940 వచ్చేటప్పటికీ 1000 మంది బిడ్డలలో 58 మంది మాత్రమే చనిపోతున్నారు. మన దేశంలో 1940లో 180 మంది వరకు చనిపోయారు. బాలింత మరణాలు లెక్కలు వేస్తే రెండువేల కాన్పులకు సోవియటు యూనియనులో ముగ్గురు చనిపోతున్నారు. మనదేశంలో రెండు వేల కాన్పులకు 18 మంది చనిపోతున్నారు.

మన దేశంలో వైద్య సహాయం ఇంత అన్యాయంగా ఉన్నప్పుడు కలరా, స్ఫోటకం, ప్లేగు, టైఫాయిడ్, ఇన్‌ఫ్లయంజా, మలేరియా జ్వరాలు వ్యాపిస్తున్నాయంటే ఆశ్చర్యంలేదు. మన దరిద్రంతో పాటు, వైద్య సహాయం కూడా లేకపోవడం వల్ల మన ఆయుర్దాయం సగటున 23 సంవత్సరాల కన్నా లేదు. ఇంగ్లండులో 60 సంవత్సరాలకు పైన సగటున ఆయుర్దాయం.

వైద్య సహకారం వెంటనే ఎక్కువ చేయాలంటే ఈరోజు చికిత్స చేస్తున్న వివిధ వైద్యులకు, ఆధునిక వైద్యశాస్త్ర పద్ధతులననుసరించి కొద్దికాలం ప్రధాన పాఠాలు నేర్పాలి. మన ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు వైద్యశాలలు (ఆస్పత్రులు) దేశమంతటా ఏర్పాటు చేయాలి. ఈ రకంగా తర్ఫీదు చేసిన వైద్యులను, ఇప్పుడున్న వైద్యులను, నర్సులను, కాంపౌండర్లను ప్రభుత్వం రిజిష్టరుగావించి ప్రభుత్వ ఆస్పత్రులలోనే నియమించి ప్రజలకు వైద్య సదుపాయం కల్గించాలి. వారి జీవితానికి కావలసిన కనీసపు జీతాలు ప్రభుత్వమే ఇవ్వాలి. వారికి పని ఎక్కువ గాకుండునట్లు పనిగంటలు, సెలవులు నిర్ణయించాలి. జబ్బుపడినప్పుడు ముసలితనమున జీవిత భృతిని ఏర్పరచాలి.

500 మంది జనాభాగల గ్రామానికి చిన్న ఆస్పత్రి, 10,000 జనాభా గల ప్రాంతాలకు, పట్టణాలకు ప్రసూతి వార్డు, స్త్రీ డాక్టరువున్న పెద్ద హాస్పిటలు, 50,000 జనాభా గల పట్టణానికి పూర్తి సాధన సంపత్తిగల ఆధునిక వైద్యశాలలు ఏర్పాటు చేయాలి.

## మనకున్న విద్యా సౌకర్యాలు

ఈ పదకొండు తెలుగు జిల్లాలలో 7,000 ప్రాథమిక పాఠశాలలు 4 లక్షల 75 వేల మంది బిడ్డలకు చదువు చెబుతూ వున్నాయి. 150 హైస్కూళ్లు మాత్రమున్నాయి. వీనిలో చదువుకొనే విద్యార్థుల సంఖ్య 76 వేలు. గ్రామస్తుల బీదతనం వల్ల తమ బిడ్డలను త్వరగా చదువు మాన్పించి పొలం పనికి, పశువులు మేపడానికి పంపుతున్నారు. పొరుగూరికి బిడ్డలను పంపి, 8వ తరగతి వరకైనా చదివించడానికి శక్తిగల తల్లిదండ్రులు చాలా తక్కువమంది వున్నారు. 8వ తరగతి వరకైనా చదవనిదే క్రింది తరగతులలో చదివింది మరచిపోయి నిష్ప్రయోజనమవుతూంది.

ఉపాధ్యాయులకు గ్రామాలలో రూ. 15-20ల లోపు జీతాలిస్తారు. ఎయిడెడ్ స్కూళ్లలో ఈ మాత్రపు జీతాలు కూడా రావు. అందుచే ఇంత తక్కువ జీతాలు వస్తున్న ఉపాధ్యాయులు, తమ జీవితానికి మరేదో ఉపవృత్తిని వెతుక్కుంటూ వుంటారు. ఫలితం బిడ్డలకు తగిన శ్రద్ధతో చదువు చెప్పడానికి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు లేకుండా పోయారు.

నేడు 5-15 సంవత్సరాల మధ్య వయస్సుగల బాలబాలికలలో నూటికి 14 మంది మాత్రమే స్కూళ్లలో వున్నారు. హైస్కూళ్లలో చదువుతూ ఉండవలసిన 14-17 సంవత్సరాల వయస్సుగల బాలబాలికలలో నూటికి 6 మంది మాత్రమే చదువుకుంటున్నారు.

మన భవిష్యత్ప్రజలను పెంచవలసిన మన స్త్రీలు చదువులో మరింత వెనుకబడి వున్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో చదువుకొనే బాలుర సంఖ్యలో సగం మాత్రమే బాలికలు ఉన్నారు. హైస్కూళ్లలో బాలుర సంఖ్యలో 8వ వంతు మాత్రం స్త్రీలు ఉన్నారు.

మనం మన తెలుగు భాషను సరిగా నేర్చుకోకముందే ఇంగ్లీషును నిర్బంధంగా ప్రతివానికి నేర్పుతున్నారు. కళాశాలలో ప్రతి విషయం ఇంగ్లీషు ద్వారా నేర్పుతున్నారు. మన విద్యావిధానమంతా నేడు స్వతంత్ర జీవనం చేయడానికి తగిన శిక్షణ ఇవ్వడం లేదు.

మన విద్యా విధానమంతా తిరిగి కొత్త పద్ధతులపై పునర్నిర్మాణం చేయాలి. మన ప్రజలందరికీ అక్షర జ్ఞానం కలిగించాలి. మన ప్రజలు వ్యవసాయిక, పారిశ్రామిక జీవితాన్ని వివిధ శాఖోపశాఖలతో నిర్మించడానికి తగిన విజ్ఞానం, శిక్షణను, టెక్నికలు జ్ఞానాన్ని మన విద్యా విధానం ఇచ్చేటట్లు ఏర్పాటు చేయాలి. మన ప్రజలు సుఖంగా, సంతోషంగా, కళా సంపదలతో విజ్ఞానవంతులుగా జీవించడానికి అనుగుణ్యమైన విద్యావిధానముండాలి. దీనికోసం వెనువెంటనే, విశాఖపట్నం, రాజమండ్రిలో, గుంటూరు, బెజవాడలోను, అనంతపురంలోను, తిరుపతిలోను విశ్వవిద్యాలయాలు ఏర్పరచాలి. ఈ విశ్వ విద్యాలయాల క్రింద ఆధునిక శాస్త్రాలన్నీ బోధించే కళాశాలలు పరిశోధనావకాశాలతో ఏర్పరచాలి. ముఖ్యంగా వ్యవసాయ కళాశాలలు, ఇంజనీరింగు కళాశాలలు వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలి. విద్యనంతా మన మాతృభాష తెలుగులో చెప్పాలి.

కనీసం 500 మంది జనాభాగల ప్రతి గ్రామంలో ఒక హయ్యరు ఎలిమెంటరీ పాఠశాలను ఏర్పరచాలి. వెంటనే 5-14 సంవత్సరాల మధ్య వయస్సుగల ప్రతి బాలబాలికకు ఈ బడులలో నిర్బంధంగాను ఉచితంగాను చదువు నేర్పించాలి. త్వరలో 16 సంవత్సరాలు నిండేవరకు ప్రతి బాలుడు, ప్రతి బాలిక చదువుకొనే యేర్పాట్లు చేయాలి.

సరియైన ఆరోగ్య సౌకర్యాలతో, విద్యా సౌకర్యాలతో మన గ్రామసీమలు, పట్టణాలు కొత్తరూపం తీసుకొనేటట్లు కమ్యూనిస్టులు పనిచేస్తారు.



## మన కొత్త గ్రామ సీమలెలా వుంటాయి?

1. గ్రామ వీధులన్నీ కంకర వేయబడి పరిశుభ్రంగా గోతులు మెరక పల్లాలు లేకుండా ఉంటాయి. ప్రతి గ్రామము నుండి ప్రధాన రోడ్డుల వరకు రోడ్లు వేసుకుంటాం.
2. వీధులలో దీపాలు పెట్టుకుంటాం. విద్యుద్దీపాలు ప్రతి వీధిలోనూ ప్రతి ఇంటిలోను వెలుగుతూ ఉంటాయి.
3. పశువుల కొట్టాలు, ఎరువు ప్రోగులు గ్రామం బయట ఉంచడానికి ఏర్పాట్లు చేసుకుంటాం.
4. ఇండ్లలో నుండి వచ్చే మురుగునీరు పెరడులలో చెట్టు మొక్కలు పెంచడానికి ఉపయోగించేటట్లు ఏర్పాట్లు చేసుకుంటాం. ఎక్కువైన నీరు పోవడానికి కావలసిన డ్రెయినేజీ ఏర్పాట్లు చేసుకుంటాం.
5. స్త్రీలకు, పురుషులకు ఇండ్ల పెరడులలో మరుగుదొడ్ల సౌకర్యాలు ఏర్పాటు చేసుకుంటాం. బహిరంగ స్థలాలు సంపాదించి ప్రజలందరి కోసం మరుగు దొడ్లు ఏర్పాటు చేసుకుంటాం. ముఖ్యంగా స్త్రీల కోసం వెంటనే ఏర్పాటు చేయాలి.
6. ఆదిమాంధ్రుల పల్లెలు పరిశుభ్రంగా నిర్మించడానికి కావలసిన ధన సహాయం వెంటనే చేయాలి. ప్రతి ఇంటిచుట్టూ తగినంత స్థలముండేటట్లు ఇండ్ల స్థలం ఇవ్వాలి.
7. తాగడానికి మంచినీటి నూతులు తవ్వించుకుంటాం. మంచి నీటి నూతులు పడని చోట చెరువు నీటిని పరిశుభ్రం చేసి ప్రజలకందించాలి.
8. కనీసం 500 మంది జనాభాగల ప్రతి గ్రామంలోనూ ఒక చిన్న ఆస్పత్రి ఏర్పరచాలి. మూడు మైళ్లలోపున ప్రజా సామాన్యానికి అందుబాటులో ఉండేటట్లు 10 వేల జనాభాకు ఒక పెద్ద ఆస్పత్రి ఏర్పరచాలి. ఆ ఆస్పత్రిలో ప్రసూతి వార్డు స్త్రీల కోసం ప్రత్యేకించి ఏర్పాటు చేయాలి.
9. (అ) 10,000 జనాభా గల ప్రాంతంలో ఒక హైస్కూలు కనీసం ఒక వృత్తి స్కూలు (వొకేషనలు స్కూలు) అందరికీ సమీపంగా ఉండేటట్లు ఏర్పాట్లు చేయాలి. గ్రామ బడుల నుండి వచ్చే వారందరికీ పై చదువుల కోసం గాని, ఏదైనా వృత్తిని నేర్చుకోడానికి గాని అవకాశముంటుంది. ప్రతి 20 వేల జనాభాకు కళలు, శాస్త్రాలు నేర్పే ఒక కళాశాల ఉండాలి.

   (ఆ) వయస్సువారి అక్షరజ్ఞానం లేనివారందరికీ అక్షరజ్ఞానం కల్గించడానికి వయోజన పాఠశాలలు ఏర్పరచాలి.

   (ఇ) బీద విద్యార్థులకు ఉచితంగా భోజనం ఉండటానికి ఇంటి వసతి పుస్తకాలు ఏర్పాటు చేయాలి.

(ఈ) ఉపాధ్యాయులకు గ్రామాలలో కనీసం రూ. 50లు కనీసపు జీతాలివ్వాలి. పట్టణాలలో జీవితావసరాల ఖరీదును బట్టి రూ. 100కు తగ్గకుండా జీతాలివ్వాలి. జబ్బు చేసినప్పుడు, ముసలితనంలోను, పనిలేనప్పుడు జీవిత భృతిని ఏర్పాటు చేయాలి.

9. కనీసం 500 మందిగల గ్రామంలో ఒక హయ్యరు ఎలిమెంటరీ పాఠశాల ఉంటుంది. 10వేల మంది జనాభా గల ప్రాంతాలలో అందరికీ దగ్గరగా వుండేటట్లు ఒక హైస్కూలు, ఒక వృత్తి స్కూలు ఏర్పాటు చేయాలి.

10. (ఏ) కనీసం 500 మంది జనాభా గల గ్రామాలలో ఆట స్థలాలు, పార్కులు, రేడియోలు, గ్రంథాలయాలు, సభలు, నాటకాలు, కళా ప్రదర్శనలు జరుపుకోడానికి నాటకశాలలు నిర్మించాలి.

ప్రతి గ్రామానికి రోజూ తపాలా సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలి. పోస్టుకార్డు ఖరీదు మూడు దమ్మిడీలుండాలి.

## మన పట్టణాలు ఎలాగూ ఉంటాయి?

10వేల జనాభాకు మించిన పట్టణాలన్నిటికీ –

1. చక్కగా కంకర వేయబడిన రోడ్లు ఉంటాయి.
2. విద్యుద్దీపాలు ఉంటాయి.
3. పైన మూసివేసి భూగర్భంలో మురుగు నీటిని తీసుకొని పోయే మురుగు కాలువలు ఉంటాయి.
4. అపరిశుభ్రమైన కూలీ పేటలు బాగుచేసి చక్కని యిండ్లతో పునర్నిర్మించుదాం. ఇండ్లు కార్మికులకు చౌక అద్దెలకు యివ్వబడుతాయి.
5. కావలసినంత నీరు సప్లయి ఆగుటకు ఎక్కువ పంపులు పెట్టాలి.
6. ఒక చక్కని ఆస్పత్రిని, దానిలో ప్రసవ కేసుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేయాలి. 50,000 మందికి మించిన పట్టణాలలో అన్ని రకముల ఆధునిక వైద్య చికిత్సా యంత్రాలతో గూడిన వైద్యశాల ఒకటి ఉండాలి.
7. పదివేలు జనాభా గల పట్టణాలకు ఒక హైస్కూలు, ఒక వృత్తి పాఠశాల ఏర్పాటు చేయాలి. 20 వేలు జనాభా గల పట్టణంలో కళలు, శాస్త్రాలు నేర్పే కాలేజీని ఏర్పాటు చేయాలి.
8. పార్కులు, రేడియోలు, ఆట స్థలాలు, ఈదడానికి చెరువులు, నాటక హాల్సు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి.



9. ఆరోగ్యానికి భంగకరములయ్యే ఫ్యాక్టరీలను పట్టణము బయట ఉండేటట్లు నిర్మించాలి.
10. ప్రతి ఇంటిలో చక్కని మరుగుదొడ్లతో పాటు, అచ్చటచ్చట సరిపోయేటన్ని మరుగుదొడ్లు బహిరంగ (పబ్లిక్) స్థలాలలో ఏర్పరచి పట్టణ పారిశుద్ధ్యాన్ని అభివృద్ధి చేయాలి.
11. పట్టణ ప్రజలందరికీ అందుబాటులో ఉండేటట్లు మార్కెటు స్థలాలు ఏర్పాటు చేయాలి.
12. పెద్ద నగరాలలో బస్సులు, ట్రాముకార్లు ఏర్పరచాలి.

## స్త్రీల కోర్కెలు : హక్కులు

స్త్రీలకు నేడున్న అసౌకర్యాలను తొలగించి నూతనాంధ్ర నిర్మాణంలో స్త్రీలు కూడా పురుషులతో పాటు సమానంగా పాల్గొనాలి. దీనికోసం చదువులోను, పనులు, ఉద్యోగాలలోను, ఆస్తి హక్కులలోను, సాంఘిక హక్కులలోను, విజ్ఞానావకాశాలలోను పురుషునితో పాటు స్త్రీలకు సమానాధికారాలు, సమానావకాశాలు ఉండాలని కమ్యూనిస్టు పార్టీ కోరుతుంది.

1. (అ) 14 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు విద్య నిర్బంధం గాను, ఉచితంగాను నేర్పాలి.

   (ఆ) 11–17 సంవత్సరాల మధ్య బాలికలకు ప్రత్యేక హైస్కూల్సు.

   (ఇ) గోషా స్త్రీలకు పురుషుల కళాశాలల్లో కలిసి చదవడానికి తయారుకాని స్త్రీలకు, ఉన్నత విద్యను బోధించడానికి ప్రత్యేక కళాశాలలు.

   (ఈ) గ్రామ, పట్టణ కేంద్రాలలో స్త్రీలలోని నిరక్షరాస్యతను పోగొట్టడానికి గ్రంథాలయాలు వయోజన పాఠశాలలు.

2. 'హిందూ లా'ను సవరిస్తూ స్త్రీలకు పురుషులతో పాటు సమాన ఆస్తి హక్కులు కల్గిస్తూ సమగ్ర శాసనం వెంటనే చేయాలి.

3. (అ) స్త్రీలకు అన్ని వృత్తులలో ఉద్యోగాలు యివ్వాలి. భూమి క్రింద సొరంగాలలో గనులలోను, స్త్రీల ఆరోగ్యానికి భంగకరమైన మరి అట్టి పరిశ్రమలలో తప్ప మరియే యితర పనులలో స్త్రీలు చేరడానికి ఎట్టి అభ్యంతరం చెప్పరాదు.

   (ఆ) ఒకే పనికి పురుషునితో ఆటు స్త్రీకి సమాన జీతాలు యివ్వాలి. పని ఒక్కటే అయినప్పుడు పురుషునికన్నా స్త్రీకి తక్కువ జీతాలివ్వకూడదు.

   (ఇ) స్త్రీలు కనడానికి ముందు ఆరు వారాలు, తర్వాత కనీసం ఆరు వారాలు నిండు జీతంతో సెలవు ఇవ్వాలి.

(ఈ) ప్రసవించినప్పుడు శిశు పోషణకు, తల్లి ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేకపు అలవెన్సులివ్వాలి. శిశువులకు పాలు ఉచితంగా సప్లయి చేయాలి.

(ఉ) స్త్రీలు పనిచేసేటప్పుడు బిడ్డలను సంరక్షించడానికి క్రెచీలు, శిశు పోషణాలయాలు ఏర్పరచాలి.

(ఊ) స్త్రీలు పనిచేసిన పిదప విశ్రాంతి తీసుకోడానికి తగిన విశ్రాంతి గృహాలు ఏర్పరచాలి.

(రు) స్త్రీలు పనిచేసే ఫ్యాక్టరీలను ప్రతిరోజు స్త్రీ డాక్టరు వచ్చి వారి ఆరోగ్యాన్ని పరిశీలించి వెళ్తూ ఉండాలి.

4 (అ) 18 సంవత్సరాల లోపు బాల్య వివాహాల వలన కలిగే నష్టాన్ని ప్రజలు గుర్తించేటట్లు ప్రచారం చేయాలి. ఈలోపు మొదటి మెట్టుగా 16 సంవత్సరాలకు ముందు బాలికలకు, 18 సంవత్సరాలకు ముందు బాలురకు బాల్య వివాహాలు నిషేధిస్తూ చట్టం చేయాలి. చట్టాన్ని ధిక్కరించి వివాహాలు జరిగితే వానిని చట్టం గుర్తించరాదు.

(అ) విడాకులు ఈ క్రింది పరిస్థితులలో ఇచ్చుకోడానికి హక్కు కలుగజేయాలి.

1. వరుసగా మూడేండ్లు భార్యాభర్తలు ఒకరినొకరు విడిచి వేసినప్పుడు.

2. నపుంసకత్వం, పిచ్చి, అంటువ్యాధులు, నయము చేయడానికి వీలుకాని రోగాలున్నప్పుడు.

3. క్రూరంగా ప్రవర్తించినప్పుడు.

విడాకులిచ్చుకోవడానికి హక్కు ఉంటుంది. విడాకులిస్తే, తల్లి బిడ్డలను తనవద్ద ఉంచుకోడానికి హక్కు కలిగి ఉంటుంది. స్త్రీకి, బిడ్డలకు పోషణకు పురుషుడు భరణం చెల్లించాలి. స్త్రీకి ఆస్తి వున్నప్పుడు లేక స్త్రీ సంపాదిస్తున్నప్పుడు బిడ్డలకయ్యే ఖర్చులు ఇద్దరూ భరించాలి.

5. 10 వేల జనాభా గల ప్రాంతానికి ఒక మంచి హాస్పిటలు, దానిలో ప్రసవ కేసులకు ప్రత్యేక వార్డు, టూరింగు నర్సులు, కనీసం ఒక టూరింగు స్త్రీ డాక్టరు ఉండాలి.

## ఆ నూతన ఆంధ్రను ఎవరు నిర్మిస్తారు?

స్త్రీలకు సమానావకాశాలు గ్రామసీమలలోను, పట్టణ ప్రజలలోను నూతన జీవితం సాధ్యం చేసే ఇటువంటి నూతన ఆంధ్రను తెలుగు ప్రజలమే నిర్మించగలం. ఇతర భారత ప్రజలతో భుజం భుజం కలిపి, ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు, వారి తాబేదారులైన స్వదేశ సంస్థానాధీశులు, జమీందారులను ఎదుర్కొని స్వాతంత్ర్యం కోసం పోరాడుదాం. మన నూతన ఆంధ్ర నిర్మాణానికి ఇది ఒక్కటే మార్గం.



రైతులము, వ్యవసాయ కూలీలము మన స్వతంత్ర రైతుకూలీ సంఘాలు ఏర్పరచుకొంటాం. ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు, జమీందారులు, ధనిక భూస్వాములు, విపరీత మగతాలు వసూలు చేసేవారు. వడ్డీ వ్యాపారస్తులు దొంగ మార్కెట్టుదారులను వ్యతిరేకించి కలిసిపోరాడి మన ప్రజారాజ్యాన్ని స్థాపించుకుందాం. నూతనాంధ్రలో క్రొత్త గ్రామసీమలను నెలకొల్పగల్గడానికి యిది ఒక్కటే మార్గం.

పరిశ్రమలలోని కార్మికులము మేల్కొనాలి. మన స్వతంత్ర కార్మిక సంఘాలను ఏర్పరచుకుందాం. భారతదేశమందలి ఇతర కార్మిక వర్గంతో కలిసి నూతన పారిశ్రామిక భారత దేశ నిర్మాణానికి కృషి చేద్దాం. అప్పుడే నూతన ఆంధ్రలో నూతన పరిశ్రమలను నెలకొల్పగల్గుతాం. కార్మికులకు ఉత్పత్తిని పెంపొందింపజేయడంలోనూ, మన దేశపు పారిశ్రామిక నిర్మాణంలోనూ సమానాధికారం ఉంటుంది. సిరి సంపదలతో, కళా విజ్ఞానాలతో మనమూహించిన క్రొత్త పట్టణాలను నిర్మించుకోడానికి ఇది ఒక్కటే మార్గం.

గ్రామ సీమలలోని రైతు వ్యవసాయ కూలీ ఉద్యమాలలోని వారందరమూ కలిసి పనిచేద్దాం. పట్టణ కార్మికోద్యమం, పట్టణ మధ్యతరగతి ప్రజా ఉద్యమాలలోని వారందరితో కూడా కలిసి పనిచేద్దాం. భారత దేశమంతటా కాంగ్రెసు, లీగు, కమ్యూనిస్టు పార్టీలు కలిసి పనిచేద్దాం. అప్పుడే ఇంగ్లీషు సామ్రాజ్యవాదులను, వారి తాబేదారులైన స్వదేశ సంస్థానాధీశులను, జమీందారులను త్రోసేసి స్వాతంత్రాన్ని సాధిస్తాం. అందరికీ నూతన జీవితం, అందరికీ సిరి సంపదలు, అందరికీ కళా విజ్ఞానాలుండే మన నూతన ఆంధ్ర ప్రజారాజ్యాన్ని స్వతంత్ర భారత ఐక్య సమాఖ్యలో నిర్మించుకోడానికి ఇది ఒక్కటే మార్గం.

# ఆరవ అధ్యాయం

దేశాభిమానం నాకు కద్దని
వొట్టి గొప్పలు చెప్పుకోకోయ్,
పూని ఏదైనాను ఒక మేల్
కూర్చి జనులకు చూపవోయ్!
ఓర్వలేమి పిశాచి దేశం
మూలుగులు పీల్చేసెనోయ్,
ఒరులమేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయ్!
పరుల కలిమికి పొర్లియేడ్చే
పాపి కెక్కడ సుఖం కద్దోయ్ ?
ఒకరి మేల్ తన మేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయ్!
స్వంత లాభము కొంత మానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్!
దేశమంటే మట్టికాదోయ్,
దేశమంటే మనుషులోయ్!
చెట్ట పట్టాల్ పట్టుకొని
దేశస్థులంతా నడువవలెనోయ్,
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్!
మతం వేరైతేను ఏమోయ్?
మనసులొక్కటై మనుషులుంటే
జాతమన్నది లేచి పెరిగీ
లోకమున రాణించునోయ్!

**- కీ.శే. గురజాడ అప్పారావు.**



## ఐక్య ఆంధ్ర ప్రజా ఉద్యమం

తెలుగుదేశంలో నూతనోద్యమాలకు తండ్రి వీరేశలింగం పంతులు. భారత దేశమంతటా ముఖ్యంగా బెంగాలులో బయలుదేరిన నూతన సంఘ సంస్కర్తల ప్రభావం క్రింద వీరేశలింగం పంతులు కూడా తెలుగు ప్రజలలో నూతన జీవిత వికాసానికి దారులేర్పరచారు. తెలుగు ప్రజలకు అర్ధమయ్యే తేలిక వచన భాషలో పుస్తకాలు రాశారు. తన ప్రహసనాలలో కథలలో, పద్యాలలో సాంఘిక దురాచారాలను ఖండించాడు. సరికొత్త జీవితాన్ని, సరికొత్త విజ్ఞానాన్ని, ఒక నూతన ఆంధ్రనే నిర్మించ వలసినదని ఉద్బోధించాడు. స్త్రీల యెడల అన్యాయాలు ఆపి స్త్రీలు కూడా పురుషులతో పాటు సమాజ నిర్మాణానికి పూనుకోవడానికి పునాదులు వేశారు. బాల్య వివాహాలను ఖండిస్తూ, వితంతు వివాహాలను ప్రోత్సహిస్తూ, స్త్రీ విద్య, స్త్రీ విజ్ఞానం కోసం అహర్నిశలు కృషి చేశాడు వీరేశలింగం పంతులు. అతని సమకాలీకులు చిలకమర్తి లక్ష్మీ నరసింహపంతులు, కొమర్రాజు లక్ష్మణ రావు, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి పంతులు తెలుగు ప్రజలకు నూతన విజ్ఞాన పథాలు తొక్కి చూపారు. తెలుగు ప్రజలలో వీరు రగుల్కొల్పిన చైతన్యమే స్వదేశ ఉద్యమానికి, గాంధీ సత్యాగ్రహోద్యమాలకు పునాది అయింది.

## స్వదేశ కాంగ్రెసు ఉద్యమాలు

1907లో తెలుగు ప్రజలలో స్వదేశీ ఝంఝూమారుతం చెలరేగింది. గాడిచర్ల హరిసర్వోత్తమ రావుగారు మూడు సంవత్సరాలు కఠిన జైలు శిక్షను ఇంగ్లీషు ప్రభుత్వాన్ని ధిక్కరించి ఉపన్యసించినందులకు అనుభవించాడు. బందరు నుండి ముట్నూరి కృష్ణారావు గారి కృష్ణా పత్రిక, బొంబాయి నుండి కాశీనాథుని నాగేశ్వరరావు గారి ఆంధ్ర పత్రిక ఆంధ్రులలో నూతన రాజకీయ చైతన్యాన్ని నూరిపోశాయి. ఆంధ్రులకు ఆంధ్ర రాష్ట్రము కావాలంటూ ఆంధ్రోద్యమం 1913 నాటికే వ్రేళ్ళు పాతుకుపోయింది.

1920లో గాంధీ మహాత్ముని నాయకత్వం క్రింద కాంగ్రెసు ఉద్యమం ఆంధ్రుల హృదయాలలో తుపాను లేపింది. పాతిక సంవత్సరాలు గురజాడ అప్పారావు కవి పుంగవుని దేశభక్తి గేయాలతో తెలుగు విద్యార్థులు పెరిగారు. ఆంధ్రలో సంఘసంస్కరణలలోను, పౌరసత్వ విజ్ఞానాలలోను నూతన పోకడలు త్రొక్కి విద్యార్థులు ముందంజ వేస్తూ వచ్చారు. ఆంధ్రోద్యమాన్ని ఆంధ్ర రాష్ట్రం కావాలంటూ నడుపుతూ వచ్చారు. వీరిని కాంగ్రెసు స్వరాజ్య సందేశం పూర్తిగా ఆకర్షించి వేసిందంటే ఆశ్చర్యం లేదు. లాయర్లు తమ న్యాయవాద వృత్తిని మానుకొని ఉద్యమంలోకి దిగారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇంగ్లీషు స్కూళ్లు మూసివేసి జాతీయ కళాశాలలు ఏర్పరిచారు. అనేక మంది జెయిళ్లకు వెళ్లారు. బెజవాడలో జరిగిన

అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశానికి వేలకొలది ప్రజా సామాన్యం హాజరయ్యారు. తిరిగి అంతమంది ప్రజాసామాన్యాన్ని మరి 25 సంవత్సరాల దాకా 1944 అఖిలభారత రైతు సంఘ సమావేశం జరిగే వరకు బెజవాడ చూడలేదు.

విద్యాధికులనే గాక, గ్రామాలలోని రైతాంగాన్ని కూడ 1920 కాంగ్రెసు ఉద్యమం కదిల్చింది. గుంటూరు జిల్లాలోని పెదనందిపాడులోను, పల్నాడు తాలూకాలోను రైతులు కాంగ్రెసు పిలుపువిని పన్నులు చెల్లించడానికి నిరాకరించారు.

పల్నాడు రైతు నాయకుడు కన్నెగంటి హనుమంతు ఆయుధ పోలీసుల దౌర్జన్యానికి గురై చనిపోయాడు. అయినా గాంధీజీ పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని ఉపసంహరించేటంత వరకు రైతులు పన్నులను చెల్లించలేదు. చీరాల - పేరాల ప్రజలు మున్సిపలు పన్నులు చెల్లించడానికి నిరాకరించి 6 మాసాలు పొలాలలో మకాం పెట్టి నివసించారు.

1922లో కాంగ్రెసు ఉద్యమాన్ని ఉపసంహరించిన పిదప ఇంగ్లీషు ప్రభుత్వపు ఉద్యోగస్తులు పెట్టే నిర్బంధాలు సహించలేక మన్యపు ప్రాంత కోయ ప్రజలు తిరగబడ్డారు. అల్లూరి సీతారామరాజు నాయకత్వం క్రింద రెండు సంవత్సరాలు ప్రభుత్వంతో గెరిల్లా యుద్ధాన్ని సాగించారు. ఆంధ్ర యువకులలో నూతనోత్సాహాన్ని కల్గించారు.

1929లో ప్రభుత్వం రైతుల భూములను రీసెటిల్మెంటు చేసి పన్నులను ఎక్కువ చేయడానికి పూనుకుంది. గోదావరి, కృష్ణా, గుంటూరు రైతులు దీనిని వ్యతిరేకిస్తూ ఆందోళన సాగించారు. వెంకటగిరి జమీను రైతులు, కంచెల పుల్లరి, చెరువు మరమ్మతులపై ఆందోళన సాగించారు. ఈ ఆందోళనలు, ఈ పోరాటాలు ఆంధ్రలో రైతు ఉద్యమానికి పునాదులు వేశాయి.

1930–34 ఆర్థిక దుర్భిక్షము ఆంధ్ర రైతాంగాన్ని క్రుంగదీసింది. అదే రోజులలో కాంగ్రెసు ఉప్పు సత్యాగ్రహం, స్వాతంత్ర్యం కోసం గ్రామ గ్రామాలలో వ్యాపించింది. వేలకొలది రైతులు, పట్టణ ప్రజలు పోలీసుల లాఠీఛార్జీలను ఎదుర్కొన్నారు. ఆంధ్రలో అనేక స్థలాలలో పోలీసులు తుపాకులు ప్రేల్చారు. వేలకొలది మంది రైతు యువకులు, పట్టణ ప్రజలు జైళ్లకు వెళ్లాము. ఆంధ్రలో ఇదివరకెప్పుడూ లేనంత రాజకీయ సంక్షోభ సమరం సాగింది.

## ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది

జెయిల్లలో కాంగ్రెసు యువకులం మేము పాల్గొనిన ఉద్యమ ఫలితాలను గూర్చి ఆలోచించసాగాము. సోవియటు ప్రజల విజయాలు, వారి ఆర్థిక రాజకీయ పరిస్థితులను గూర్చి ఎంతో ఆతురతతో చదివాము. గదరు పార్టీ వీరులు, పంజాబు అకాలీ వీరులు, మీరటు కమ్యూనిస్టు వీరులు భారత కమ్యూనిస్టు పార్టీలో చేరినట్లు తెలుసుకున్నాం. బొంబాయి,



కలకత్తాలలోను దక్షిణ ఇండియా రైల్వే కంపెనీ కార్మికులు నడిపిన బ్రహ్మాండ సమ్మె పోరాటాలను గూర్చి అప్పటికే తెలుసుకొన్నాము. భగత్‌సింగ్ సహచరులు కమ్యూనిస్టు సిద్ధాంతాల వైపు మ్రొగ్గడం జైళ్లలో ప్రత్యక్షంగా కాంగ్రెసు యువకులము చూశాం. ఈ విషయాలన్నీ కాంగ్రెసు యువకులను కమ్యూనిస్టు పార్టీలో చేరేటట్లు చేశాయి. ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పూనుకున్నారు. వీరేశలింగం పంతులు కాలం నుండి 1930–34 కాంగ్రెసు ఉద్యమాల వరకు అభివృద్ధి చెందుతూ వచ్చిన ఆంధ్ర ప్రజా ఉద్యమ సాంప్రదాయాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి ఆంధ్ర కమ్యూనిస్టులు కొత్త పంథాలు తొక్కారు. నూతన రైతు, కార్మిక, విద్యార్థి, యువజన, స్త్రీ ఉద్యమాలను నిర్మించారు. ఆంధ్రుల కళా విజ్ఞానాలను ప్రజల పాటలు, బుర్రకథలు, ప్రజా నాట్యాలు, ప్రజానాటకాల ద్వారా ప్రజలలోకి తీసుకువెళ్లారు. కళావిజ్ఞానాలలో ఒక నూతన దశ ఆరంభించారు.

ఇంగ్లీషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడే ఈ నూతన ప్రజా ఉద్యమాలను కూడా ప్రతిబింబించి పోరాడే ఐక్య సంఘటన కాంగ్రెసును అభివృద్ధి చేయడానికి పని చేశారు. 1937 ఎన్నికలలో కాంగ్రెసు అభ్యర్థుల విజయానికి తీవ్రంగా కృషి చేశారు. కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికను గ్రామ గ్రామాలకు తీసుకెళ్లి విశదీకరించారు. ఆంధ్రలో ప్రజా సంఘాలు, అవి చేసిన పని 1937లో ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకున్న తెలుగు జిల్లాలలో 1500 మైళ్ల కాలినడక రైతు యాత్రను నడిపారు. జమీందారీ రైతులలోను, రైత్వారీ రైతులలోను, రాయలసీమ రైతాంగంలోను నూతన చైతన్యాన్ని కలిగించారు. తమ రైతు సంఘాలను ప్రత్యేకంగానూ, స్వతంత్రంగాను నిర్మించుకోడానికి రైతాంగం పూనుకుంది. కాంగ్రెసు ఎన్నికల ఫలితంగాను, రైతు యాత్రల ఫలితంగాను మేల్కొన్న రైతాంగం, ప్రకాశం కమిటీ ముందు జమీందారీ విధానాన్ని రద్దు చేయమంటూ సాక్ష్యమిచ్చింది. ఈ నూతన చైతన్యమే మునగాల, కాశీపట్నం, మందసా రైతులు తమ కష్టాలను పోగొట్టుకోడానికి జమీందారులను ఢీ కొనేటట్లు చేసింది. రైతుయాత్ర నాయకులు కొమ్మారెడ్డి సత్యనారాయణ గారు తమ ఆరోగ్యాన్ని కోల్పోయి తదుపరి చనిపోయారు. వారి సహచరులు, యాత్రలో మొదటి నుండి చివరి వరకు ఉండి నడిపిన కామ్రేడ్ వాసుదేవరావు ఆరోగ్యాన్ని కోల్పోయినా మునగాల పోరాటాన్ని నడిపాడు. నేడు రైతు ఉద్యమాన్ని వాసుదేవరావు, ఇతర సహచరులే ముందుకు తీసుకుపోతున్నారు. విశాఖ కరువు ప్రజల మధ్య అంటువ్యాధుల నివారణ కోసం, కృష్ణాజిల్లా నుండి చిన్న రైతు కుటుంబములో నుండి వచ్చిన కామ్రేడ్ కొండపల్లి రాఘవరెడ్డి వెళ్లాడు. అచ్చట టైఫాయిడ్‌కు తానే గురై చనిపోయాడు. రైతుల వీరపుత్రులు మనకు చూపిన ఈ మహోన్నత ఆదర్శాలను అనుసరించే నేడు రైతు ఉద్యమం ముందుకు పోతున్నది.

1932 నుండి వ్యవసాయ కూలీలను ముఖ్యంగా ఆదిమాంధ్రులను వ్యవసాయ కూలీ సంఘాలలో సంఘటించడానికి కమ్యూనిస్టులు కృషి చేశారు. న్యాయమైన జీతాలిమ్మని,

సరైన కొలత పాత్రలతో జీతాలు కొలవాలని, కూలీలను అగౌరవంగా మాట్లాడకూడదనీ, సాంఘికంగా సమాన సౌకర్యాలు యివ్వాలని, వ్యవసాయ కూలీ సంఘాలు ఆందోళన చేస్తూ వచ్చాయి. కూలీలకు బంజరు పొలాలు, ఇండ్ల వసతులు, విద్యా సౌకర్యాలు కల్గించడానికి పనిచేశాయి. ధనిక భూస్వాములగావించే అన్యాయాలను నిర్భంధాలను వ్యవసాయ కూలీలు తమ సంఘ యాజమాన్యాన తమ పార్టీయగు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన నిలబడి ఎదుర్కొన్నారు. అనేక సమ్మె పోరాటాలను సాగించారు. ఈ సమ్మె పోరాటాలలోనే తూర్పు గోదావరిలో కామ్రేడ్ రాపాక సూర్యనారాయణను పోలీసులు అరెస్టు చేసి పోలీసు లాకప్పులో కొట్టినారు. ఆ దెబ్బలకు కామ్రేడ్ రాపాక తదుపరి చనిపోయాడు. రంగూనులో తెలుగు కార్మికులను సంఘటిస్తూ వచ్చాడు. బర్మాను జపాను ఆక్రమించుకున్నప్పుడు మన దేశానికి తిరిగి వచ్చాడు. తనతోటి వ్యవసాయ కూలీల పోరాటాలు నడుపుతూ తన ప్రాణాలు అర్పించాడు. వ్యవసాయ కూలీలకు ఆదర్శనీయుడయ్యాడు.

వ్యవసాయ కూలీ ఉద్యమాన్ని నిర్మించడానికి 1940-42లో రహస్యంగా పనిచేస్తున్న విద్యార్థి కామ్రేడు పర్వతనేని వెంకటేశ్వరరావు వెంట పోలీసులు తరుముకొని వచ్చారు. అర్ధరాత్రి వేళ కారు చీకటిలో పాడుపడిన బావిలో పడిపోయాడు. తన ప్రాణాలర్పించి తాను పూర్తిచేయక వదిలివేసిన కార్యభారాన్ని ఇతర కామ్రేడ్లు మీద పెట్టి వెళ్లిపోయాడు.

ఆంధ్రలో వివిధ పట్టణాలలో కార్మికోద్యమాన్ని ఎర్రజెండా క్రింద నిర్మించింది కమ్యూనిస్టులే. చిన్న చిన్న ఫ్యాక్టరీలలో చెల్లాచెదురైన ఆంధ్ర కార్మికులను సంఘటితపరచింది కమ్యూనిస్టులే. కార్మికవర్గం నేడు పట్టణ జీవితంలో ప్రముఖ స్థానం వహిస్తూ ఉంది. ప్రజా సేవలోను ప్రజా సంఘ నిర్మాణంలోను ఇతర ప్రజలకు మార్గదర్శియై ఉంది. కార్మికోద్యమానికి ప్రాణాలిచ్చిన ఆదర్శమూర్తి, ఆదర్శనీయుడు కామ్రేడ్ చాపరాల వెంకటేశ్వర రావు. తానూ ప్రెస్సులో పనిచేసే కార్మికుడు. అచ్చు ఆఫీసు కార్మికుల సంఘాన్ని నిర్మించాడు. 1940-42 రహస్య కాలంలో బొంబాయిలో కమ్యూనిస్టు పార్టీ రహస్య అచ్చు ఆఫీసును రహస్యంగా నిర్మించి నడిపాడు. ఆ పనిలో క్షయవ్యాధికి గురై చనిపోయాడు.

ఈ రైతు కార్మిక ఉద్యమాల ప్రభావంతో విద్యార్థి, యువజన, స్త్రీ ఉద్యమాలు పెంపొందాయి. 1937లో కమ్యూనిస్టులు విద్యార్థి ఉద్యమానికి నిర్మాణ రూపమిచ్చారు. వారి సంఘాలనేర్పరచి పని చేయించసాగారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు వేసే జరిమానాలు, బెత్తాలతో కొట్టడం, తిట్లు-వీనిని ఎదుర్కొన్నారు. పబ్లిక్ పరీక్షలకు పోనివ్వకుండా క్లాసు పరీక్షలలో వడపోసే డిటెయిను చేసే పద్ధతిని మాన్పించాలని కృషి చేశారు. విద్యార్థులకు విద్యార్థి సంఘాలు రాజకీయాది విషయాలను చర్చించే కేంద్రాలయ్యాయి. రాజకీయాలలో పాల్గొంటూ అనేక రాజకీయ సమ్మెలను అవి నడిపాయి. యుద్ధ కాలంలో ప్రభుత్వపు నిర్బంధాన్ని ఎదుర్కొని పని



చేశాయి. తర్వాత కాగితం కరువై, కిరసనాయిల్ దొరకక హైస్కూళ్లలో స్థలం దొరకక, హోటల్సులో సరియైన ఆహారం దొరకక చదువుకు అడ్డంకి కలిగినప్పుడు, విద్యార్థి సంఘాలు ఈ సమస్యలను పరిష్కరిస్తూ వచ్చాయి. విద్యార్థుల విద్య యెడల శ్రద్ధ తీసుకుంటున్నాయి. నేడు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు విద్యార్థి తల్లిదండ్రులను దగ్గరకు తెచ్చి పరస్పర విశ్వాసాన్ని నెలకొల్పి, వీరిమధ్య కొత్త సంబంధాలను యేర్పరుస్తున్నాయి.

యువజన సంఘాలు రైతు యువకులకు, కార్మిక యువకులకు పఠనాలయాలు ఏర్పరిచాయి. రాత్రి పాఠశాలలు నడిపి చదువురాని వారికి చదువు చెప్పుతున్నాయి. గ్రామాలలోను, పట్టణ బీద ప్రజలలోను కళారూపాలు ప్రదర్శించి కళా చైతన్యాన్ని కలుగజేస్తున్నాయి. పండుగలు, తీర్థాలప్పుడు ప్రజలకు సౌకర్యాలను ఏర్పాట్లు చేస్తున్నాయి. సామాజిక దురాచారాలను ఎదుర్కొని దసరా, సంక్రాంతి మొదలగు పండుగ రోజులలో విజ్ఞాన ప్రదర్శనాలతో ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నాయి. అంటువ్యాధులు వ్యాపించకుండా ప్రజలకు వైద్య సహాయం, రోగులకు చికిత్స చేస్తున్నాయి. యుద్ధకాలంలో దొంగ వ్యాపారస్తులను ఎదుర్కొని ప్రజలకు తిండి, ఇతర జీవితావసర వస్తువులను కంట్రోలు రేటులకు అందేటట్లు పనిచేశాయి. యువజనోద్యమం ఆటలు పాటలతోను, ప్రజాసేవతోను రోజురోజూ బలపడుతూ వచ్చింది.

ఆంధ్ర స్త్రీలు కాంగ్రెసు పిలుపువిని 1920-30 ఉద్యమాలలో జైళ్లకు వెళ్లారు. విదేశీ గుడ్డల దుకాణాలు, కల్లంగడుల వద్ద, పికెటింగు చేశారు. ప్రభుత్వ గులాములు, తాగుబోతులు వారిని దూషించిన దూషణలన్నింటిని సహించి తమ కర్తవ్యాన్ని నెరవేర్చారు. రైతులలో వచ్చిన ఈ నూతన చైతన్యం రైతు స్త్రీలను కూడా ముందుకు వచ్చేటట్లు చేసింది. రైతు పోరాటాలలో రైతు స్త్రీలు పాల్గొన్నారు. 1938-39లలో మునగాల, కాశీపట్నం, మందసా పోరాటాలలో స్త్రీలు పోలీసు లాఠీఛార్జీలకు, అరెస్టులకు గురయ్యారు. మందసా కాల్పులలో గున్నమ్మ తుపాకీ గుండుకు గురై ప్రాణాలిచ్చింది. ఈ చైతన్యంతో ఆంధ్ర స్త్రీలు జపాను దాడి ప్రమాదం హెచ్చేకొద్దీ తమ ఇండ్లు, తమ బిడ్డల ప్రాణాలు, తమ మాన ప్రాణాలకు రానున్న ముప్పు గుర్తించారు. తమ సంఘాలను ఈ ప్రమాదాన్ని ఎదుర్కోడానికి బలపర్చుకోసాగారు. 20,000 మంది స్త్రీలు సంఘాలలో చేరారు. రెండు మూడు వందల మంది స్త్రీలు శిక్షణ పొంది గ్రామాలలో స్త్రీలకు పఠనకేంద్రాలు ఏర్పరచారు. ప్రసూతి, శిశుపోషణలో అవలంబించాల్సిన ప్రాథమిక చర్యలను బోధించడానికి పూనుకున్నారు. స్త్రీలను రోజూ ఎదుర్కొనే అనేక చిన్న ఇబ్బందులను తీర్చడానికి పనిచేయసాగారు. ఇండ్లలో రోజూ కావలసిన కిరసనాయిలు, రేషను బియ్యం కోసం పనిచేశారు. స్త్రీకి సమానావకాశాలు, సమాన ఆస్తి హక్కులు సంపాదించడానికి, స్త్రీ వివాహపు చట్టాన్ని గూర్చి పనిచేశారు. స్త్రీల సర్వతోముఖాభివృద్ధికి స్త్రీ సంఘాలు పనిచేశాయి.

కళలు, విజ్ఞాన ప్రదర్శనాలు తిరిగి ఆరంభమయ్యాయి. బుర్రకథలు, నాట్యాలు, ప్రజల పాటలు, చిన్న నాటికలు, ఆంధ్ర రైతు కార్మికుల కళాసక్తులను వికసింపజేశాయి. వేలకొలది స్త్రీ పురుషులు రాత్రంతా కూర్చొని కొత్త బుర్ర కథలు, పాటలు వింటూ తమ కర్తవ్యాన్ని తెలుసుకుంటారు. అవి అన్యాయాలను, సాంఘిక దురాచారాలను ఎదుర్కోమని, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడానికి రమ్మని ఉద్బోధిస్తూ ఉంటాయి. ఈ సమావేశాలలో స్త్రీలు విరివిగా వచ్చి పాల్గొంటున్నారు. సమావేశమైనవారిలో మూడవ వంతు స్త్రీలే.

గత మూడేళ్లలో 150 పుస్తకాలు ప్రజాశక్తి ప్రచురణాలయం ప్రకటించింది. వివిధ విషయాలపై సామాన్య స్త్రీ పురుషులకు అర్థమయ్యేటట్టి పుస్తకాలు ప్రకటించింది. రాజకీయంగా కమ్యూనిస్టులను వ్యతిరేకించేవారు సైతం లక్ష్మణరావు గారి విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి తరువాత ప్రజలకు విజ్ఞానాన్ని అందజేసి, దాని సాంప్రదాయాలను ముందుకు తీసుకొని పోయినవారు ఒక్క కమ్యూనిస్టులు, ప్రజాశక్తి ప్రచురణాలయమని అన్నారు.

## తెలంగాణాలో ఆంధ్ర మహాసభ

కాంగ్రెసు ఉద్యమమే సంస్థానాలలోని పీడిత ప్రజలలో గూడా చైతన్యం కల్గించింది. తమ పౌరసత్వ హక్కుల కోసం సంస్థాన ప్రజలు పోరాటాలను ఆరంభించడం కాంగ్రెసు ప్రభావ ఫలితమే. హైదరాబాద్ సంస్థానంలో 1923లో మాడపాటి హనుమంతరావు గారు తదితర విద్యావంతులు ఆంధ్ర మహాసభను ఏర్పాటు చేశారు. 1930 ఉప్పు సత్యాగ్రహంలో నిజాం రాష్ట్రం నుండి చాలామంది యువకులు వచ్చి పాల్గొన్నారు. 1938లో నిజాం రాష్ట్ర కాంగ్రెసును ఏర్పరచి దానిని నిషేధిస్తే సత్యాగ్రహాన్ని నడిపారు. వందల కొలది యువకులు నిజాం జైళ్లలో మగ్గారు. ఈ రకంగా బయలుదేరిన సంస్థాన ప్రజా ఉద్యమాన్ని కోస్తా తెలుగు జిల్లాలలోని రైతుకార్మిక కమ్యూనిస్టు ఉద్యమాలు పూర్తిగా మార్చివేశాయి. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ లంచగొండి ఉద్యోగస్తుల నిర్బంధాలను ఎదుర్కొన్నది. జాగీర్దారులు, దేశముఖుల వెట్టిని, అక్రమ వసూళ్లను, నిర్బంధాలను అరికట్ట సాగింది. వందలకొలది సంవత్సరాలుగా పీడించబడుతూ వచ్చిన రైతులలో నూతన చైతన్యాన్ని, కొత్త బలాన్ని విశ్వాసాన్ని కల్గించింది. ఆంధ్రమహాసభ కమ్యూనిస్టు నాయకత్వం కింద నేడు లక్షకు మించిన సభ్యత్వంతో, 1000 మంది కార్యకర్తలతో నిజాం రాష్ట్ర ఆంధ్ర ప్రజల ఏకైక సంస్థగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించి పనిచేస్తూ ఉంది.

## ఈ కొత్త ప్రజా ఉద్యమాలు : ఆంధ్ర కాంగ్రెసు నాయకులు

కాంగ్రెసే ఆంధ్రప్రజల దేశభక్తిని రగుల్కొల్పింది. దీని ఫలితమే ఆంధ్రలో నేడు మనం చూస్తున్న రైతు, కార్మిక, స్త్రీ, యువజన, విద్యార్థి ఉద్యమాలు. దీని ఫలితమే నిజాం



రాష్ట్రంలో మనం చూస్తున్న ఆంధ్ర మహాసభ ఉద్యమం. ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ కూడా కాంగ్రెసు రగుల్కొల్పిన ఈ దేశభక్తి జ్వాలలనుండే పుట్టింది అని చెప్పుకోడానికి మేము గర్వపడుతున్నాం. కమ్యూనిస్టు పార్టీ ఈ దేశభక్తిని మరింత విశాలమొనర్చింది. గ్రామగ్రామాలకు తీసుకొని వెళ్లింది. రైతు సంఘాలను, వ్యవసాయ కూలీ సంఘాలను, కార్మిక సంఘాలను, యువజన, విద్యార్థి, స్త్రీ సంఘాలను సంస్థాన ప్రజా ఉద్యమాన్ని బలపర్చడం ద్వారా దేశభక్తిని మరింత వ్యాప్తిగావించింది. దేశభక్తికి సంఘటనా బలం చేకూర్చింది. ఐక్య ప్రజాతంత్ర ఉద్యమాన్ని మరింత పెంపొందించింది.

అయితే ఆంధ్రలో కాంగ్రెసు నాయకత్వానికి ఈ అభివృద్ధి నచ్చలేదు. మొదటి నుండి దీనిని వ్యతిరేకిస్తూనే వచ్చారు. డాక్టరు పట్టాభి కృష్ణాజిల్లాలో రాష్ట్ర కాంగ్రెసు ప్రతినిధి ఎన్నికలను 1934లో జరిపాడు. అతివాదులూ, కమ్యూనిస్టులూ విజయం పొందారని మూడు పర్యాయాలు ఎన్నికలను వరుసగా రద్దుచేశారు. 1938–39లలో ఆంధ్ర కాంగ్రెసు నాయకత్వం పట్టాభి అధ్యక్షత క్రింద కాంగ్రెసులో అతివాదులకు స్థానం లేకుండా జేయాలని అనేక అక్రమ చర్యలకు పూనుకుంది. కాంగ్రెసు నియోజక వర్గాలను అడ్డదిడ్డంగా మార్చింది. పోలింగు స్టేషనులు తమ మితవాద అభ్యర్థులకు అనుకూలంగా ఉండేటట్లు వేసింది. కడకు బ్యాలెట్టు పెట్టెలను పగులగొట్టి దొంగఓట్లను కూడా వేయించింది. 34,000 ప్రాథమిక కాంగ్రెసు సభ్యత్వాన్ని పశ్చిమ కృష్ణాలో నిరాకరించింది. కమ్యూనిస్టు పార్టీ సభ్యులకు అహింసయందు నమ్మకం లేదనే సాకుతో కాంగ్రెస్ కమిటీ ఎన్నికలకు అభ్యర్థులుగా నిలబడరాదని కూడా రూలింగు ఇచ్చారు. అయితే అఖిల భారత కాంగ్రెసు వర్కింగ్ కమిటీ ఈ రూలింగ్ అక్రమమని తరువాత తోసిపుచ్చింది.

ఆంధ్ర కాంగ్రెసు నాయకత్వం, ముఖ్యంగా కాళేశ్వరరావు, పట్టాభి, ప్రకాశం పంతులు గార్లు ప్రత్యేక రైతు, కూలీ, విద్యార్థి సంఘాలకు మొదటి నుండీ వ్యతిరేకమే. ఆ రోజులలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి అధ్యక్షుడు అయిన డాక్టరు పట్టాభిగారు, కార్యదర్శి అయిన గొట్టిపాటి బ్రహ్మయ్యగారు, మునగాల రాజా, కాశీపట్నపు జమీందారుల పక్షం వహించి రైతులకు వ్యతిరేకంగా పనిచేశారు. ఈ జమీందారులు అక్రమంగా లాగుకొన్న తమ పొలాలను రైతులు తిరిగి సంపాదించుకోవడానికి సత్యాగ్రహం చేస్తుంటే, రైతులు దురాక్రమణదారులని వీరిద్దరూ తీర్పు ఇచ్చారు. కాంగ్రెసు మంత్రివర్గపు రోజులలో చీరాల, చిట్టివలస కార్మికులపై పోలీసులు లాఠీఛార్జి, తుపాకులు కాల్చడం జరిగింది. దానికి కారకులైన పోలీసు ఉద్యోగస్తులపై కాంగ్రెసు ప్రభుత్వం ఎట్టి చర్యకూడా తీసుకోలేదు.

## రెండవ ప్రపంచ యుద్ధం - కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం

సామ్రాజ్యవాద యుద్ధకాలంలో 1940-42లలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు రహస్యంగా వుండి పనిచేయవలసి వచ్చింది. వీరిని అరెస్టు చేయడానికి ప్రభుత్వం తీవ్రంగా వెతకసాగింది. కాని అనేక రైతు, కార్మిక కుటుంబాలు మమ్ములను సంతోషంతో తమ ఇండ్లలో దాచి కాపాడినాయి. ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల పరిపాలనను తుదముట్టించడానికి స్వాతంత్ర్యోమాన్ని సాగించడానికి పూర్తిగా తోడ్పడ్డారు. ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ ప్రతినెలా స్వతంత్ర భారత్ అనే రహస్య పత్రికను నడుపుతూ వచ్చింది. 3000 ప్రతులను 1000 గ్రామాలకు పైగా పంచుతూ రెండేండ్లు నడిపింది. స్వాతంత్ర్యోమాన్ని అందరికన్నా ముందుండి నడుపుత వచ్చాం. మా పార్టీ నాయకులను అరెస్టు చేస్తే గొప్ప బహుమానాలిస్తామని ప్రకటించింది ప్రభుత్వం. కాని ప్రభుత్వ ప్రయత్నాలన్నీ వృధా అయ్యాయి. మేము తెలుగు ప్రజల విశ్వాసాన్ని, ప్రేమను, గౌరవాన్ని సంపాదించుకున్నాం. కాంగ్రెస్‌వాదులు కూడా ఇంగ్లీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేము చేసే స్వాతంత్ర్య కృషికి మమ్ములను ప్రేమించి తమ ఇండ్లలో సంరక్షించారు.

నాజీలు సోవియట్ యూనియన్‌పై దాడిచేశారు. తూర్పున జపాను యుద్ధంలో దిగి, ఒక దేశం తరువాత మరొక దేశాన్ని ఆక్రమించుకుంటూ మన దేశ సరిహద్దుల మీదికి వచ్చి కూర్చుంది. తూర్పున, పడమట, ఫాసిస్టు ప్రమాదాన్ని మనదేశం ఎదుర్కోవలసి వచ్చింది. ఇక మనదేశంలో చూద్దామా అంటే, ప్రజలు ద్వేషించే ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల చేతిలో మనదేశ సంరక్షణ అంతా వుండిపోయింది. మలయా, బర్మాలలో లాగానే అవసరం వస్తే జపాను ముందు తోకముడిచి మన దేశాన్ని వారికి వదిలివేస్తూ తిరోగమనం చేయడానికి ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు తయారు అయ్యారు. మన ఇండ్లు, మన గ్రామాలు, మన బిడ్డల ప్రాణాలు, మన స్త్రీల మాన ప్రాణాలు చాలా ప్రమాదంలో పడ్డాయి. ఆ పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ దేశభక్తులనందరినీ హెచ్చరించింది. కాంగ్రెసు - లీగులు తమ విభేదాలు పరిష్కరించుకొని, ఇంగ్లీషు సామ్రాజ్యవాదులను కలిసి ఎదుర్కోమని హెచ్చరించింది. జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచి దేశ రక్షణ బాధ్యతను ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల చేతిలో నుండి తామే తీసుకోవాలని కోరింది. ఫాసిస్టు ప్రమాదాన్ని ప్రపంచ ప్రజాశక్తులన్నిటితో కలిసి ఎదుర్కోవాలని హెచ్చరించింది. ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల చేతిలో నుండి మనం స్వాతంత్ర్యాన్ని గుంజుకోడానికి ఇది ఒక్కటే మార్గమని ప్రకటించింది. కాంగ్రెస్ నాయకులు దీనిని పెడచెవిని పెట్టారు. ఒకవైపు ఫాసిస్టు శత్రువులపై మిత్రమండలి విజయం తాముకూడా అభిలషిస్తున్నామని ప్రకటించింది. మరోవైపు ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు మనకు స్వాతంత్ర్యం ఇవ్వకపోతే, పోరాటం తెస్తామని ప్రకటించింది. అలాంటి పోరాటం మిత్రమండలి యుద్ధ ప్రయత్నాలకు నష్టం కల్గించి జపాను ఫాసిజానికి తోడ్పడుతుందని గుర్తించజాలకపోయారు.



ఇంగ్లీషు సామ్రాజ్యవాద ప్రభుత్వం అవకాశం కోసం పొంచి కూర్చుని వుంది. ఈ తీర్మానం కాంగ్రెస్ నాయకులు పాసు చేయగానే కాంగ్రెసు నాయకులను అరెస్టు చేసింది. దేశమంతటా 1857 పిదప కనీవినీ యెరుగని నిర్బంధ విధానాన్ని, సైనిక ప్రదర్శనాన్ని చేసింది. కాంగ్రెసు జపాను అనుకూల సంస్థ అని దుష్ప్రచారం సాగించింది. నాయకుల అరెస్టుతో కోపోద్రిక్తులైన ప్రజలు రైలుకట్టలు, తీగెలు తెంచితే ఈ విధ్వంసక చర్యలను తన దుష్ప్రచారానికి సాక్ష్యంగా చూపసాగింది. ప్రపంచ ప్రజల ముందు తన కుట్రను కప్పి పెట్టుకోడానికి పూనుకుంది. ఆ రోజులలో కమ్యూనిస్టులు మన జాతీయోద్యమంపై జరిగే ఈ దుష్ప్రచారాన్ని ఖండించాం. ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల కుట్రను బయటపెట్టాం. బ్రిటిష్ నాయకులూ ఆమెరీ - చర్చిలు ముఠాయే కాంగ్రెసు నాయకులను అరెస్టు చేసి దేశంలో చిచ్చు పెట్టిందని ప్రపంచానికి ఎలుగెత్తి చాటాం. ఫాసిస్టు దాడిని ఎదుర్కోడానికి భారతదేశంలో వున్న ఒక గ్యారంటీ శక్తి మన జాతీయోద్యమం. దానిని నాశనం చేయడానికి ఆమెరీ తీవ్ర నిర్బంధ విధానాన్ని అవలంబించడం, ఫాసిస్టులకు ఆమెరీయే తోడ్పడుతున్నాడని బట్టబయలు చేశాం. కాంగ్రెసు నాయకులను విడుదల చేసి కాంగ్రెస్ - లీగుల జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచాలని ఆందోళన చేశాం. సోదర దేశభక్తులను విధ్వంసక కార్యాలు జరుపవద్దని ప్రార్థించి ఆపు చేయించడానికి పనిచేశాం. విధ్వంసక కార్యాలు ఒకవైపు ఆమెరీ తప్పుడు ప్రచారాన్ని బలపర్చుతాయి. మరోవైపు జపాను దాడికి తోడ్పడుతాయి. అంతేగాని మన స్వాతంత్ర్యాన్ని దగ్గరకు తేజాలవని నచ్చచెప్పాము. జపాను అనుకూల ప్రచారం, విధ్వంసక కార్యక్రమం, కాంగ్రెసు యొక్క సాంప్రదాయాలకు ఏ రీతిగా వ్యతిరేకమో తెలియజెప్పాం.

కాంగ్రెసు నాయకులు జైళ్లలో ఉన్నప్పుడు, మన ప్రజలు కరువు కాటకాలు, అంటు వ్యాధులకు గురికావలసి వచ్చింది. జీవితావసర వస్తువులన్నీ దొంగ వ్యాపారస్తుల చేతిలో బడ్డాయి. లంచగొండి ఉద్యోగస్తుల తోడ్పాటుతో దొంగ వ్యాపారస్తులు ప్రజలకు విపరీత లాభాలకు ఈ జీవితావసర వస్తువులను అమ్మేవారు. ఆ రోజులలో కమ్యూనిస్టులం రైతు కార్మిక సంఘాల ద్వారా ప్రజలను సమీకరించి దొంగ వ్యాపారస్తులను, లంచగొండి ఉద్యోగస్తుల చర్యను అరికట్టి ప్రజలకు కావలసిన నిత్యావసర వస్తువులు కంట్రోలు రేట్లకు దొరికేటట్లు కృషి చేశాం. 1942-47 రాయలసీమ విశాఖ కరువు నివారణ కోసం పనిచేశాం.

రైతులకు వారు పండించిన ధాన్యాలకు న్యాయమైన ధరలు వచ్చేటట్లు పనిచేశాం. కంట్రోలు రేటులకు ఎరువులు, వ్యవసాయ పనుముట్లు ఇప్పించడానికి పనిచేశాం. కరువు ప్రాంతాలలోని మన సోదర ప్రజల కోసం ఎక్కువ పంటలను పండించి, పండించిన పంటను కంట్రోలు రేట్లకు అమ్మేటట్లు కృషి చేశాం. రైతు తనతోడి గ్రామ నివాసులైన వ్యవసాయ కూలీలకు న్యాయమైన కూలీ. తగిన ఇతర సదుపాయాలు కల్గించి రైతుకూలీ సామరస్యాన్ని నెలకొల్పడానికి కృషి చేశాం. కార్మికులకు యుద్ధ భృతిని యిప్పించడానికి కృషి చేశాం. కార్మికులు

ప్రజలకు కావలసిన వస్తువులను విరివిగా ఉత్పత్తి చేయడానికి, రైలుబండ్లు ఆగకుండా నడుపడానికి కృషి చేయించాం. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచి అంటువ్యాధులు వ్యాపించకుండా మున్సిపల్ కార్మికులు కృషి చేశారు. ఇటువంటి అనేక ప్రజా పోరాటాలు, ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజల ఆత్మవిశ్వాసం కుంటుపడకుండా కాపాడి ప్రజా శత్రువులను ఎదుర్కొంటూ పనిచేశాం. కాంగ్రెసు నాయకులను విడుదలచేసి కాంగ్రెసు లీగుల జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచాలని ఆందోళన చేస్తూ ప్రజా సేవలో బలపడుతూ, ప్రజా ఉద్యమాలు, కమ్యూనిస్టు పార్టీ ముందుకు పోయాయి.

## కమ్యూనిస్టులపై కాంగ్రెస్ నాయకుల నిందలు

మేమీ విధంగా పనిచేస్తూ ఉంటే ఫార్వర్డు బ్లాకువారు, కాంగ్రెసు సోషలిస్టులు, ఎన్.జి. రంగా ముఠావారు మాపై అబద్ధాలు, బూతులు ప్రచారం చేశారు. వారుచేసే జపాను అనుకూల ప్రచారం, విధ్వంసక కార్యక్రమం మన స్వాతంత్ర్య పోరాటానికి నష్టమని మేము వ్యతిరేకించడం వల్లనే వారు మాపై ఇలాంటి అబద్ధ ప్రచారానికి, బూతు ప్రచారానికి దిగారు. స్త్రీలను దుర్భాషలాడినారు. సభలు భగ్నం కావించడానికి ఒకప్పుడు చల్లపల్లి రాజా డబ్బు తీసుకొని కాంగ్రెసును నానా బూతులు తిట్టిన ములుకోలను నేడు ఆది కమ్యూనిస్టులపై చేసే బూతు ప్రచారానికి సంతోషించి కొంతమంది కాంగ్రెస్ వాదులు దానిని పంచుతున్నారు. కమ్యూనిస్టు స్త్రీలను, కమ్యూనిస్టు నాయకులపై పచ్చి అబద్ధాలు, నిందలు ప్రచారం చేస్తూ వెంగమ్మ అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఈ తప్పుడు ప్రచారాన్ని మేము ప్రజల ముందు బట్టబయలు చేశాం. ప్రజాసేవలో మేము రోజుకు రోజు బలపడుతూనే వచ్చాం. 1944లో బెజవాడలో జరిగిన రైతు మహాసభకు లక్షమంది రైతాంగం వచ్చి వీటిని రుజువు చేసింది. రైతుసంఘ సభ్యత్వం 56,000 నుండి 1,70,000 వరకు, వ్యవసాయ కూలీ సంఘాల సభ్యత్వం ఏడెనిమిది వేల నుండి 30,000 వరకు పెరిగింది. విద్యార్థి సంఘాల సభ్యత్వం 6000 నుండి 11,000 వరకు, స్త్రీల సంఘాల సభ్యత్వం 4000 నుండి 20,000 వరకు పెరిగింది. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం ఆంధ్రలో 1942లో 1000 మంది నుండి 1945లో 8000 మందికి పెరిగింది. ఈ పెరుగుదలే ప్రజలు మా కార్యక్రమం దేశభక్త యుత కార్యక్రమంగా గుర్తించినట్లు రుజువుచేసింది.

కాంగ్రెస్ నాయకులు జైళ్లనుండి బయటికి వచ్చి ఈ విధంగా వ్యాపిస్తూ ఉన్న ప్రజా ఉద్యమాన్ని చూసి సంతోషించలేదు. ఇంగ్లీషు సామ్రాజ్యవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా మన స్వాతంత్ర్య పోరాటాన్ని ఇవి బలపరుస్తున్నాయని గుర్తించలేకపోయారు. ఈ ఉద్యమం ముందు ప్రజా చైతన్యం ముందు, జమీందారులు, దొంగ వ్యాపారస్తులు మొదలైన ప్రజా శత్రువులతో



తమకున్న లోగడ సంబంధాలు సాగవని భయపడ్డారు. కాంగ్రెసులో కొత్తగా చేరిన జమీందారులు, దొంగ వ్యాపారస్తులు ప్రజలను పీడించే ధనిక భూస్వాములు – వీరితో కాంగ్రెసు నాయకులు చేతులు కలిపి తిరిగి తమ కమ్యూనిస్టు వ్యతిరేక పాతపాటను మొదలుపెట్టారు.

చల్లపల్లి రాజాతో కలిసి దివి తాలూకా రైతులకు వ్యతిరేకంగా పని చేస్తున్నారు. పిఠాపురం యువరాజును, మహారాజును కాంగ్రెసులోకి ఒకపక్క ఆహ్వానిస్తున్నారు. మరొకపక్క కాంగ్రెసు నుండి కమ్యూనిస్టులను తీసివేస్తున్నారు. గ్రామంలో ప్రజలందరూ ద్వేషించే ధనిక భూస్వామి నిన్నటివరకు కాంగ్రెసుకు వ్యతిరేకంగా పనిచేసినవాడే. అయితే నేడు అతడు కమ్యూనిస్టులపై దాడి చేయడానికి కాంగ్రెసు నాయకులు సంతోషంగా కాంగ్రెసులోకి ఆహ్వానిస్తున్నారు. కాంగ్రెసులోకి దొంగ వ్యాపారస్తులు, జమీందారులు వచ్చి కాంగ్రెసును బలపరచేవారిలాగ ప్రవర్తిస్తున్నారు. వారి అసలు ఉద్దేశం ప్రజలకు వ్యతిరేకంగా తాము గావించిన ద్రోహాలను కాంగ్రెసు పేరుచాటున కప్పిపెట్టకోవాలని కాంగ్రెసులో చేరుతున్నారు. రాబోయే ప్రభుత్వం కాంగ్రెసు ప్రభుత్వం కాబట్టి కాంగ్రెసులో వుంటే తమ పంట పండుతుందని కాంగ్రెసులో చేరుతున్నారు. కమ్యూనిస్టులతో యే దొంగ వ్యాపారిగాని, యే రౌడీగాని ఏ గ్రామంలోనైనా ఘర్షణపడితే వెంటనే అతడు కాంగ్రెసు దేశభక్తుడని కాంగ్రెసు నాయకులు ప్రకటిస్తున్నారు. డాక్టరు పట్టాభి తన కాంగ్రెసు అనుచరులను కమ్యూనిస్టులపై లాఠీలు, ఇతర ఆయుధాలు ఉపయోగించవచ్చుననీ, కాంగ్రెసు అహింస ఒక్క ఇంగ్లీషు ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ ఉన్నప్పుడే అని సలహా యిస్తున్నాడు. ఇంతకుమునుపు రంగా, కాళేశ్వరరావులు ప్రచారం చేస్తున్న ప్రతి అబద్ధాన్ని, బూతును నేడు డాక్టర్ పట్టాభి, ప్రకాశం పంతులుగారు తిరిగి వల్లిస్తున్నారు. గాంధీజీ కామ్రేడ్ జోషీకి రాసిన జాబులో కమ్యూనిస్టులకు ప్రజలు స్వేచ్ఛగా నిచ్చే చందాలవల్ల నేడు డబ్బు వస్తూవుందని రాశాడు. అయినా డాక్టరు పట్టాభి నేటికి కూడా కమ్యూనిస్టులు ప్రభుత్వం నుండి డబ్బు తీసుకున్నారనే తప్పుడు ప్రచారాన్ని సాగిస్తూనే ఉన్నాడు. డాక్టరు పట్టాభి కమ్యూనిస్టులపై బూతులు ప్రచారం చేస్తూనే ఉన్నాడు. దివి తాలూకా కొత్తపల్లిలో కమ్యూనిస్టులు ఒక గంటకోసం, ఐదు నిమిషాల కోసం కంట్రాక్టు పెండ్లిళ్లు చేసుకుంటారని ఉపన్యసించాడు. కాంగ్రెసు నాయకులు ఇంగ్లీషు ప్రభుత్వపు జో హుకుములైన జమీందారులు, ఇతర స్వలాభపరాయణులతో తమ పొత్తును వదులుకోరు. దీనిని తమ్ము అనుసరిస్తూ ఉన్న ప్రజా సామాన్యము నుండి కప్పి పెట్టుకోడానికి, కమ్యూనిస్టులపై ఈ బూతు పంచాంగాన్ని వల్లిస్తున్నారు.

## కమ్యూనిస్టులు : పాకిస్తాన్ నినాదం

కమ్యూనిస్టులం ముస్లిం లీగును, పాకిస్తాన్ నినాదాన్ని బలపర్చి భారత దేశాన్ని ముక్కలు ముక్కలుగావించాలంటున్నామని, కాంగ్రెసు నాయకులు మాపై నిందలు మోపుతున్నారు. మనదేశంలో వివిధ జాతులు నివసిస్తూ ఉన్నాయి. వాని భవిష్యత్తు అవే నిర్ణయించుకోవడం న్యాయమేని కమ్యూనిస్టులం అంటున్నాం. ఈ న్యాయమైన సూత్రాన్ననుసరించే పాకిస్తాన్ కోర్కెలో ఎంతవరకు న్యాయం ఉందో అంతవరకు కమ్యూనిస్టులం బలపర్చుతున్నాం. కాని మేము ముస్లిం లీగు కోరుతున్న ఆరు రాష్ట్రాలు పాకిస్తాన్‌లోకి రావాలన్న అన్యాయపు కోర్కెను అంగీకరించడం లేదు.

ముస్లిం లీగు కాంగ్రెసును నిందిస్తూ, హిందువులను నిందిస్తూ చేసే ప్రచారాన్ని ఖండిస్తున్నాం. అదేరీతిగా కాంగ్రెసు.. ముస్లిం లీగ్‌పై చేసే ప్రచారాన్ని కూడా ఖండిస్తున్నాం. ఎందుకంటే తిరిగి క్రిప్సు రాయబార కాలంలో జరిగినట్లుగాని, లేక మొన్న సిమ్లా సమావేశంలో జరిగినట్లుగాని, కాంగ్రెసు-లీగులు కలిసిరాక ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల ఆట సాగన్విడం నాకిష్టం లేదు. ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు రేపు పిలువబోయే రాజ్యాంగ శాసన పరిషత్తు మన దేశంపై కూఎజిరినీబి ప్లానును రుద్ది తమ పెత్తనం సాగించడానికి వేసిన ఎత్తుతప్ప మరేమీ కాదు. ఈ కుట్రను కాంగ్రెసును-లీగును గుర్తించవలసిందని మేము కోరుతున్నాం. ఈ కుట్రను ఎదుర్కోడానికి కాంగ్రెసు - లీగులు కలిసి పనిచేయాలి. దీనికోసం ఒకరి న్యాయమైన కోర్కెను మరొకరు అంగీకరించాలి.

భారతదేశంలో 17 పెద్ద జాతులున్నాయి. ఇవి పఠానులు, బెలూచీలు, సింధీ, పడమటి పంజాబీ, సిక్కుజాతి, హిందూస్థానీ జాతి, రాజపుతానా జాతి, బీహారీ, బెంగాలీ, అస్సాం, ఓఢ్రజాతి, ఆంధ్ర, తమిళ, మలయాళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాతీ జాతులు. వీని సరిహద్దు నిర్ణయించాలి. ఆ సరిహద్దులలో నివసించే వయోజనులందరూ ఎన్నుకొనిన వేరేవేరు స్వతంత్ర రాజ్యాంగ ప్రజాపరిషత్తులే ఈ వివిధ జాతుల భవిషత్ రాజ్యాంగాన్ని నిర్ణయించడానికి హక్కు కలిగి వుంటాయి. ఈ వివిధ రాజ్యాంగ పరిషత్తుల ప్రతినిధులు కలిసి ఒక రాజ్యాంగ పరిషత్తుగా ఏర్పడి ఇంగ్లీషు సామ్రాజ్య ప్రభుత్వాన్ని "భారతదేశాన్నుండి వెళ్లిపోండి" ఇదిగో సింధి పత్రం ఇచ్చట సంతకం చేయమని" అడగాలి. అది నిరాకరిస్తే అందరమూ కలిసి ఇంగ్లీషు ప్రభుత్వాన్ని సాగనంపడానికి అంతిమ స్వాతంత్ర్య యుద్ధాన్ని ఆరంభిస్తాం. కాంగ్రెస్-లీగులు రెండూ ఈ రీతిన కలిసి పనిచేయాలని కమ్యూనిస్టులం కోరుతున్నాం.

భారతదేశంలోని వివిధ స్వతంత్ర జాతులు తమంతట స్వేచ్ఛగా భారత సమాఖ్యలో చేరడానికి నిర్ణయించుకున్నప్పుడే ఐక్య భారతదేశ రాజ్యాంగం ఏర్పడుతుంది. అంతేగాని జాతుల



స్వాతంత్ర్య హక్కును, వాటి స్వయం నిర్ణయ హక్కును నిరాకరించడం వల్ల ఐక్య భారతదేశ రాజ్యాంగం ఏర్పడజాలదు.

ఆంధ్ర కాంగ్రెసు నాయకులకు ఒక ప్రశ్న. తెలుగు ప్రజలం మూడు కోట్లమంది వున్నాం. ఒకే ప్రాంతంలో నివసిస్తున్నాం. మన చరిత్ర చాలా ప్రాచీనమైనది. ప్రత్యేక భాష, విజ్ఞానం, సాంప్రదాయాలు మనకున్నాయి. మన తెలుగు ప్రజలమంతా ఒకే రాజ్యాంగంగా వుంటేనే మన ఆర్థిక, రాజకీయ భవిష్యత్తు ఉజ్వలంగా వుంటుంది. అట్టి మనం, తెలుగు ప్రజలము ఒక ప్రత్యేక జాతి అని మీరు అంగీకరిస్తున్నారు గదా? మీరు ఇంగ్లీషు ప్రభుత్వం క్రింద వున్న జిల్లాలేగాక, నైజాం నవాబు కింద వున్న తెలంగాణ జిల్లాలు ఇతర తెలుగు ప్రాంతాలు కలిసిన ఐక్య విశాలాంధ్ర భూమిని కోరుతున్నారు గదా. మీరు మన భవిష్యత్తు మనం నిర్ణయించుకునే హక్కుగల స్వతంత్ర ఆంధ్రజాతిగా, స్వేచ్ఛగా స్వతంత్ర భారత సమాఖ్యలో చేరాలని కోరుతున్నారు గదా? మరీవిధంగా తెలుగు జాతిని గూర్చి ఆలోచిస్తున్నప్పుడు పఠాన, సింధీ, పశ్చిమ పంజాబీ, బెంగాలీ జాతులకు కూడా యీ హక్కు వుందని ఎందుకు గుర్తించరు? కమ్యూనిస్టు పార్టీ యీ 17 వివిధ జాతులు భారత సమాఖ్యలో చేరడానికి పనిచేస్తుంది. అయితే అవి చేరేదీ లేనిదీ నిర్ణయించేది ఆ జాతి ప్రజలు కాని మనం కాదు.

ఆంధ్ర కాంగ్రెసు నాయకులు పాకిస్తాన్ నినాదంలో న్యాయమైన వానిని కూడా అంగీకరించక వ్యతిరేకిస్తే దాని అర్థం జాతుల స్వయం నిర్ణయ హక్కును నిరాకరించడమే అవుతుంది. అంటే మనం తెలుగు ప్రజలం ఒకజాతి అని కాంగ్రెసు నాయకులు అంగీకరిండం లేదన్న మాట. తెలుగు గడ్డ నైజాం కిందవున్నా, మైసూరు రాజ కిందవున్నా, యితర రాష్ట్రాలలో వున్నా కలిపి ఒక విశాలాంధ్రను ఏర్పరచడానికి నిరాకరిస్తున్నారన్నమాట. మనం ఒక స్వతంత్ర రాజ్యంగా మన భవిష్యత్తును నిర్ణయించుకోడానికి అంగీకరించలేదన్నమాట.

## ఎవరు స్వాతంత్ర్య ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారు?

కాంగ్రెసు నాయకులు కమ్యూనిస్టులం కాంగ్రెసును విచ్ఛిన్నం చేస్తున్నామని నిందలు ఆరోపిస్తున్నారు. ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల దుష్ప్రచారాన్ని ఎదుర్కొని కాంగ్రెస్ సాంప్రదాయాలను సమర్థించిన మేమా కాంగ్రెస్‌ను విచ్ఛిన్నం చేస్తున్నది? లేక స్త్రీలను స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనమని పిలుపు ఇచ్చిన కాంగ్రెసు సత్సాంప్రదాయాన్నే బుట్టదాఖలు చేసి ఆంధ్ర స్త్రీలపై వారు కమ్యూనిస్టు స్త్రీలనే సాకుతో బూతులు ప్రచారం చేస్తున్న డాక్టర్ పట్టాభి, కాళేశ్వరరావు లాంటి ఆంధ్ర కాంగ్రెసు నాయకులా కాంగ్రెస్‌ను విచ్ఛిన్నం చేస్తున్నది? ఆంధ్ర ప్రజలే నిర్ణయించాలి.

మన ప్రజల ఐక్య స్వాతంత్ర్యోద్యమంగా కాంగ్రెసును అభివృద్ధి పర్చడానికి 15 సంవత్సరాలుగా కాంగ్రెసులో ఉండి పోలీసుల లాఠీలకు, జైళ్లకు గురై పనిచేస్తూ వచ్చిన మమ్ములను కాంగ్రెసు నుండి తొలగించడము కాంగ్రెసున విచ్ఛిన్నం చేయడం కాదట. కాని మన ప్రజల రక్తాన్ని జలగల్లాగ పీల్చుతున్న ఇంగ్లీషు ప్రభుత్వ జో హుకుములతో, జమీందారులు దొంగ వ్యాపారస్తులతో పొత్తు కుదుర్చుకొని, వారిని కాంగ్రెసులోకి ఆహ్వానించడం కాంగ్రెసును బలపర్చడమట. ఏది కాంగ్రెసున విచ్ఛిన్నం చేసేదీ ఆంధ్ర ప్రజలే నిర్ణయించాలి.

కమ్యూనిస్టులు దేశ ద్రోహులని కాంగ్రెసు నాయకులు మమ్ము నిందిస్తున్నారు. సంక్షోభ రోజులలో కాంగ్రెసుపై ఆమెరీ గావించిన దుష్ప్రచారం ఎదుర్కొన్నాం. కాంగ్రెసు నాయకులను విడుదలచేయమని ఆందోళనగావించాం. ప్రజలతో పాటు నిలబడి దొంగ వ్యాపారస్తులను, జమీందారులను, లంచగొండి ఉద్యోగస్తులను ఎదుర్కొని ప్రజల కోసం పనిచేశాం. ఈ పనులు చేస్తున్నామని 300 మంది కమ్యూనిస్టులను ఆ కొద్దిరోజులలో అరెస్టు చేశారు. మేము దేశ ద్రోహులం అవునో కాదో మీరే నిర్ణయించమని కోరుతున్నాం.

మేము భారత కమ్యూనిస్టు పార్టీలో సభ్యులం. ఈ పార్టీలో గల గదర్ పార్టీ వీరులు, బర్బరు అకాలీ వీరులు, భగత్‌సింగ్ సహచరులు, చిట్టగాంగు ఆయుధాగారంపై దాడిచేసిన వీరులు, 1930 పిదప బెంగాలులో జరిగిన ప్రతి బాంబు కుట్రకేసులో శిక్షితులైన ప్రముఖ నాయకులందరూ నేడు సభ్యులుగా ఉన్నారు. మామూలు రైతులు, కార్మికులు ఈ పార్టీలో చేరి రైతు కార్మికుల హక్కుల కోసం, మన ప్రజలందరి స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలర్పించారు. అట్టి కమ్యూనిస్టు పార్టీలో మేము సభ్యులం. మలబారులో ఇంగ్లీషు ప్రభుత్వ నిర్బంధ విధానానికి వ్యతిరేకంగా, రైతు పోరాటాలలో పాల్గొన్నారని ఇంగ్లీషు సామ్రాజ్య ప్రభుత్వం నల్గురికి ఉరిశిక్ష వేసింది. "కమ్యూనిస్టు పార్టీకి జై" అంటూ ఉరికంబాలకెక్కిన కయ్యూరు వీరుల పార్టీలో సభ్యులం మేము. మన తెలుగు ప్రజల మధ్య మీ మధ్య కమ్యూనిస్టులంగా మేము చేసిన పనిని ఒక పర్యాయం జ్ఞప్తికి తెచ్చుకోండి. మేము దేశ ద్రోహులమో లేక స్వాతంత్ర్య సమరంలో అలసట చెందని, వెనకకు అడుగువేయని స్వాతంత్ర్య సైనికులమో ఆంధ్ర ప్రజలే నిర్ణయించాలి.

మన ఆంధ్ర జాతీయోద్యమాన్ని, భారత స్వాతంత్ర్య పోరాటాన్ని విచ్ఛిన్నం చేస్తున్నది మేముకాదు. ఆంధ్ర కాంగ్రెసు నాయకులే. కమ్యూనిస్టులు ఈ సంఘాలలో పనిచేస్తున్నారంటే రైతు, కార్మిక, విద్యార్థి, స్త్రీ ఉద్యమాలకు పోటీ సంఘాలేర్పరచి విచ్ఛిన్నం చేస్తున్నది వారే. ఈ సంఘాలను విచ్ఛిన్నం చేయడం వల్ల జమీందారులను, దొంగ వ్యాపారస్తులను లంచగొండి ఉద్యోగస్తులను ఢీకొని పోరాడే ప్రజా ఉద్యమాలను ఇంగ్లీషు సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని ఢీకొని పోరాడే ప్రజా ఉద్యమాలను ప్రజా సంఘాలను కాంగ్రెసు నాయకులు విచ్ఛిన్నం చేస్తున్నారు.



నైజాం రాష్ట్రంలో జనగామ రైతులను పీడిస్తూ ఉన్న దేశముఖులతో కలిసి ఆంధ్ర మహాసభకు పోటీసభను పెట్టిన మందుముల నర్సింగరావును, రంగా, కాళేశ్వరరావు ప్రభృతులు బలపరుస్తున్నారు. అంటే ఐక్య విశాలాంధ్రకు దారితీయగల్గిన ఏకైక నిజాం రాష్ట్ర తెలుగు ప్రజా ఉద్యమాన్ని ఆంధ్ర కాంగ్రెసు నాయకులు విచ్ఛిన్నం చేస్తున్నారు.

మనలో మనకు దెబ్బలాట వద్దని కమ్యూనిస్టులం విజ్ఞప్తి చేస్తున్నాం. కాంగ్రెసు నాయకత్వం నేడు విచ్ఛిన్నతను రెచ్చగొడుతూ ఉంది. వానిని ఆపుజేద్దాం. సోదరుల మధ్య పోరాటం పనికిరాదు. కాంగ్రెసు, లీగు, కమ్యూనిస్టులం అందరం భుజంభుజం కలిపి ఇంగ్లీషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అంతిమ స్వాతంత్ర్య యుద్ధాన్ని సాగిద్దాం.

ప్రస్తుతం కాంగ్రెసు నాయకత్వం అవలంబిస్తూ ఉన్న విచ్ఛిన్నతా కార్యక్రమాన్ని మీరు అంగీకరించకపోతే మీ ఓటు కమ్యూనిస్టు అభ్యర్థులకు ఇవ్వండి.

కాంగ్రెసు – లీగు – కమ్యూనిస్టు ఐక్యత కావాలనుకుంటే మీ ఓటు కమ్యూనిస్టు అభ్యర్థులకు ఇవ్వండి.

ఇంగ్లీషు సామ్రాజ్య ప్రభుత్వాన్ని తొలగించడానికి ఐక్య స్వాతంత్ర్య పోరాటాన్ని ఆరంభించాలనుకుంటే మీ ఓటు కమ్యూనిస్టు అభ్యర్థులకివ్వండి.

వివిధ స్వతంత్ర జాతులతో కూడిన స్వతంత్ర ఐక్య భారత ప్రజారాజ్యాంగాన్ని ఏర్పరచాలనుకుంటే మీ ఓటు కమ్యూనిస్టు అభ్యర్థులకు ఇవ్వండి.

స్వతంత్ర భారత్‌లో విశాలాంధ్ర ప్రజారాజ్యాన్ని ఏర్పరచాలనుకొంటే మీ ఓటు కమ్యూనిస్టు అభ్యర్థులకు ఇవ్వండి.

# గ్రామీణ పేదలు - భూపంపకం



# ఉపోద్ఘాతం

స్వాతంత్ర్యం వచ్చి 25 ఏండ్లు పూర్తి అయ్యాయి. కాని ఎన్నో వాగ్దానాలు చేస్తూ వచ్చినా, చట్టాలు చేశామంటున్నా, భూస్వామ్య విధానాన్ని రద్దు చేయడం గాని, దున్నేవానికే భూమి యివ్వడం గాని నేటికీ జరగలేదు.

గత 26 ఏండ్లకు పైగా ప్రభుత్వాధికారాన్ని చెలాయిస్తూ వచ్చిన కాంగ్రెస్ పార్టీ, జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన మంత్రి కాలంలో, ఆ తర్వాత లాల్‌బహదూర్ శాస్త్రి కాలంలో, నేడు శ్రీమతి ఇందిరాగాంధీ హయాంలో కూడా భూసంస్కరణలను గూర్చి పదే పదే మాట్లాడుతూ వచ్చారు. కౌలుదారీ చట్టాలు, వ్యవసాయ కార్మికుల కనీస వేతన చట్టాలు, అప్పుల భారాన్ని తగ్గించే చట్టాలు, భూసీలింగ్ చట్టాలు కోకొల్లలుగా చేస్తూ వచ్చారు. సహకార పరపతి సంస్థలు, పంచాయతీ రాజ్య చట్టాలు, కమ్యూనిటీ ప్రాజెక్టులు - ఇలాంటి స్కీములను దేశమంతా అమలు జరిపి, గ్రామ సీమలలోని వ్యవసాయ కార్మికుల, రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరించే తరుణోపాయాలుగా ప్రచారం చేస్తూ వచ్చారు. వేల కోట్ల రూపాయలను వెచ్చించి నీటి పారుదల సౌకర్యాలు చేశామనీ, విద్యుత్ నీటి పంపులు, రసాయనిక ఎరువులు, పంట తెగుళ్ళకు క్రిమి సంహారక మందులు, అమెరికా డబ్బుతో ప్యాకేజీ ప్రాజెక్టులు, ట్రాక్టర్లను "రైతాంగానికి" తాము సరఫరా చేశామనీ అన్నారు. జపాను వరి సాగు విధానమన్నారు. గోధుమలు, వరి ధాన్యాలు, హైబ్రీడు జొన్నలు పంటలను నాలుగైదు రెట్లు అదనంగా పండించే "అద్భుత" విత్తనాలను అభివృద్ధి చేశామని, లక్షల కొలది ఎకరాలలో ఈ నూతన పంటలు పండిస్తున్నామని, గ్రామ సీమలలో నేడు "పచ్చ విప్లవం" (గ్రీన్ రివల్యూషన్) సాగుతూ వుందని పత్రికా, రేడియో ప్రసారాలతో చెవులు గింగురుమనిపిస్తున్నారు.

మన దేశంలోని 60 కోట్ల మంది ప్రజలకు 10 కోట్ల టన్నుల తిండి గింజలు ఉత్పత్తి చేస్తున్నామని, విత్తనాలు, తదితర వ్యవసాయ ఖర్చులకు పోను, నికరంగా తలకు రోజుకు సగటున 400 గ్రాముల తిండిగింజల చొప్పున సరఫరా చేయగల స్థితిలో ఉన్నామని ప్రగల్భాలు పలుకుతున్నారు. మన జనాభాలో నూటికి 70 మందికి బ్రతికి ఉండటానికి కనీసం అవసరమైన 2000 కాలరీల తిండిని కూడా సరఫరా చేయలేక పోతున్నామనే విషయాన్ని కప్పిపెడుతున్నారు. గత 15 ఏండ్లలో తిండిగింజల ధర నాలుగురెట్లు పెరిగిందనే విషయాన్ని దాచిపెడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన ప్రజలకు ఈ మాత్రం తిండి పెట్టడానికి కూడా పండిన పంట చాలక విదేశాల నుండి, ముఖ్యంగా అమెరికా నుండి 11 కోట్ల టన్నులకు పైగా తిండి గింజలకు 6000 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసి దిగుమతి చేసుకొన్న విషయాన్ని చెప్పుకోవడం లేదు.

వారి "పచ్చ విప్లవం" గ్రామ కమ్యూనిటీ వికాస విజయాలు కొద్దిమందిగా వున్న భూస్వాములకు ప్రధానంగానూ, ఆ తర్వాత కొంతవరకు ధనిక రైతులకు లాభించింది. గ్రామ సీమలలోని అత్యధిక సంఖ్యాకులైన నూటికి 85 మందికి పైగా నున్న పేద, మధ్యతరగతి

ప్రజానీకపు స్థితి నికృష్టంగానే ఉంది. భూసంస్కరణలు త్వరగా తీసుకురాకపోతే ఈ "పచ్చవిప్లవం" రక్తవిప్లవంగా మారిపోతుందిన దేశ ఆంతరంగిక మంత్రిత్వశాఖ ఆదుర్దాతో హెచ్చరికలు చేసే స్థితికి వచ్చింది.

ఈ "రక్తవిప్లవం" రాకుండా చేయడానికి ప్రజాందోళనలను, పోరాటాలను, వ్యవసాయ, కార్మిక, రైతాంగ పోరాటాలను రక్తపుటేర్లు ప్రవహింపచేసి అణచివేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇదివరకు వెనుదీయలేదు. నేడూ వెనుదీయడం లేదు. ఆ చరిత్రలోకి, ఆ వివరాలలోకి ఇప్పుడు పోవడం లేదు. భూసంస్కరణలను అమలు జరపడానికి పూనుకున్న నంబూద్రిపాద్ మంత్రివర్గాన్ని కేరళలో 1959లోను, 1969లోను, అదే విధంగా మార్క్సిస్టు పార్టీ నాయకత్వాన ఏర్పడిన బెంగాలు ఐక్య సంఘటనా మంత్రి వర్గాలను 1967 - 69ల లోను శ్రీమతి ఇందిరాగాంధీ రద్దు చేసిన చరిత్రలోకి కూడా ఇచ్చట పోవడం లేదు.

ఇలాంటి ఇందిరా కాంగ్రెస్‌తో కలిస్తేనే దేశాభివృద్ధి ప్రజాతంత్రం ముందుకు సాగుతుందని, భూసంస్కరణలు పూర్తి చేయడం సాధ్యమవుతుందని మితవాద కమ్యూనిస్టులు బాకాలూదుతున్నారు. ఇందిరా కాంగ్రెస్‌తో కలసి ఆమె ప్రభుత్వానికి, కాంగ్రెస్ మంత్రివర్గాలకు కుడిభుజాలుగా పనిచేస్తున్నారు.

ఈ మితవాద కమ్యూనిస్టులు చెప్పేది కాంగ్రెస్ ప్రభుత్వ మిదివరకే భూసంస్కరణలలో చాలా భాగం, ముఖ్య భాగం పూర్తి చేయడం జరిగిందనీ, మిగతాది కొన్ని సవరణ చట్టాలు తెచ్చి పూర్తి చేయాలని ఉందనీ, కొంత ప్రజా ఒత్తిడితో దానిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేత చేయించగలమనే విశ్వాసముందనీ చెబుతారు. భూస్వాముల వద్ద మిగిలివున్న అదనపు భూములను పంచాలనీ, వివిధ రకాలైన బంజర్లు వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు పంచిపెట్టాలని నినాదాలు యిస్తున్నారు. సీలింగ్ లోపు ఉన్న భూమితో సహా భూస్వాముల భూమినంతా తీసుకొని పంచితేనే యీ భూసంస్కరణలు, వ్యవసాయక విప్లవం పూర్తి అవుతుందని, అప్పుడే దున్నేవానికి భూమి దొరుకుతుందని మాత్రం వీరు అంగీకరించారు.

సోషలిజం కావాలనే సోషలిస్టు పార్టీ తదితర పార్టీలు కూడా మితవాద కమ్యూనిస్టులలాగానే నేడున్న చట్టాలలో కొద్దో గొప్పో మార్పులు తేవడంతో ఈ సమస్య పరిష్కారమవుతుందనే ధోరణితోనే వ్యవహరిస్తున్నాయి.

నక్సలైట్లు ఈ భూసమస్యను పరిష్కారం చేయడానికి ఒక చిట్కాను ముందుకు తెచ్చారు. భూసమస్య పరిష్కారం కావాలంటే, నేటి భూస్వామ్య బడా బూర్జువా వర్గాల ప్రభుత్వాన్ని కూల్ద్రోయాలి కాబట్టి వెనువెంటనే ఆయుధాలు తీసుకొని పోరాడాలంటారు. భూసమస్యను పరిష్కరించ డానికీ జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికీ ప్రజలలో ఆ విప్లవ చైతన్యమూ, దానికి తగిన సంఘటనా అవసరమనే మార్క్సిస్టు - లెనినిస్టు సూత్రాలన్నింటినీ, ప్రపంచ విప్లవ అనుభవాలనన్నింటినీ త్రోసిపుచ్చారు. తమ ప్రజాతంత్ర హక్కులను, పోరాడాలను సాయుధ బలగాలతో క్రూర హింసా హత్యాకాండతో ప్రభుత్వం అణచబూను కున్నప్పుడు, ఆత్మరక్షణ తప్పనిసరి అయినప్పుడు ప్రజాసామాన్యం ఆయుధాలు తీసుకొని పోరాడుతారు. అంతేగాని కొందరి ఊహాగానాలతో, ప్రోద్బలంతోనే ప్రజలు సాయుధ పోరాటానికి దిగరు అనే అనుభవాన్ని వీరు త్రోసిపుచ్చారు. ప్రజలలో ఆ చైతన్యం, సంఘటన రావడానికి ఓపికగా సంవత్సరాల కొలది. వారి చిన్న చిన్న జీవిత సమస్యలను, ఆర్థిక రాజకీయ సమస్యలను



తీసుకొని పనిచేయాలి. వివిధ వర్గ సంఘులను, ఒక సుశిక్షిత విప్లవ పార్టీని - మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీని నిర్మించుకోవాలి. కాని వీరికి ఆ ఓపిక, పట్టుదల లేక పెటీ బూర్జువా వర్గానికి గల సహజమైన మనస్తత్వంతో అరాచక దుందుడుకు చర్యలకు దిగజారి చిన్నాభిన్నమయ్యారు.

ఈ పరిస్థితులలో భూ సమస్య మీద సాధ్యమైనంత వరకు సరి అయిన అవగాహన కలుగజేయడానికి ఈ చిన్న పుస్తకంలో ప్రయత్నించాను. ఆంధ్రదేశంలో భూసంబంధాలు ఏ రీతిగా ఉంది, రైతాంగంలో ఏ రీతిగా వర్గ విభజన జరుగుతుందీ ఇందులో వివరించబడ్డది. రెండు గ్రామాలలో చేసిన పరిశీలనానుభవాన్ని, లెక్కలు కూడా. ఈ అవగాహనకు తోడ్పడుతుందని ఇందులో ఉదహరించడం జరిగింది.

గ్రామ సీమలలో నూటికి 70 మందిగా వున్న వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, కూలి, కౌలు, వడ్డీ నాగు వివిధ రకాల పాతకాలపు జమిందారీ దోపిడీ పద్ధతులు మొదలుగా గల దైనందిన ఆర్థిక సమస్యలపై తమ కోర్కెలను ఎలా రూపొందించుకోవాలో ఇందులో వివరించ బడింది. అలాగే ఏ రీతిగా ఆందోళన పోరాటాలు నడుపవలసింది కూడా యీ రచన విశదం చేస్తోంది.

మధ్యతరగతి రైతులను పూర్తిగా నిలకడగానూ, ధనిక రైతును సాధ్యమైన మేరకు కలుపుకొని ఐక్య కార్యాచరణకు పూనుకోవలసిన అవసరం ఎంతైనా వున్నది. ఐక్య కార్యాచరణ ద్వారా క్రమ క్రమంగా జనతా ప్రజా ఐక్య సంఘటన నిర్మించి, జనతా ప్రజాతంత్ర ప్రభుత్వ స్థాపనకు పారిశ్రామిక కార్మికులతో కలసి పోరాడి విజయం సాధించవలసిన అవసరమూ వున్నది. అప్పుడే భూసమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది. దున్నేవానిదే భూమి అనే నినాదం అమలులోకి వస్తుంది. ఇవన్నీ ఏ రీతిని పరిణమించేదీ ఇందులో వివరించడమైనది. జనతా ప్రజాస్వామ్యం ఏర్పాటు చేసిన తర్వాత దున్నేవానికే భూమి దఖలు చేసిన తర్వాత వ్యవసాయ కార్మికులందరూ చిన్న చిన్న రైతులుగా మారినప్పుడు ఆధునిక, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు ట్రాక్టర్లు, ఆధునిక యంత్రాలు వీరికి అందుబాటులో వుండేటట్లు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. రైతాంగమంతా ఒకరికొకరు తోడుగా వెళ్ళి పరస్పరం సహకారంతో ఐచ్ఛికంగా సహకార వ్యవసాయ క్షేత్రాలుగా అభివృద్ధి చేసుకుంటారు. వాటినే సమిష్టి వ్యవసాయ క్షేత్రాలుగా అభివృద్ధి చేసుకుంటారు. అందుమూలంగా తమ జీవిత స్థాయిని పెంపొందించుకుంటారు. జనతా ప్రజాస్వామ్యం సోషలిస్టు సమాజ నిర్మాణం వైపుకు సాగే కొద్దీ, పారిశ్రామికాభివృద్ధి పెరిగే కొద్ది గ్రామాల నుండి లక్షలు, కోట్ల కొలది మంది నూతన పరిశ్రమల్లో ప్రవేశిస్తారు. తమ కౌశల్యాన్ని, నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని, జీవిత స్థాయిని అభివృద్ధి చేసుకుంటారు. సోషలిస్టు సమాజాన్ని అభివృద్ధి చేసుకుంటూ, ప్రతి ఒక్కరూ తన శక్తి కొలదీ పనీ, పని కొద్ది ప్రతిఫలం పొందే సమాజం నుండి, కమ్యూనిస్టు సమాజం నిర్మాణం వైపుకు పయనిస్తారు. పట్టణాలకు, గ్రామాలకు మధ్య నున్న వ్యత్యాసం లేకుండా పోతుంది. కాయకష్టం చేసేవారికి, మెదడుతో పనిచేసేవారికీ మధ్య నేడున్న అంతరం పోతుంది. నూతన మానవులు తయారవుతారు. ప్రతి ఒక్కరూ తన శక్తి కొద్దీ పనీ, అవసరం కొద్దీ ప్రతిఫలం పొందగల మహోన్నత సమాజం ఏర్పడుతుంది. అదే కమ్యూనిస్టు సమాజం.

**- సుందరయ్య**
**(1976 జనవరి)**

# జనతా ప్రజాస్వామ్యానికి ఇరుసు వ్యవసాయక విప్లవం

ఆంధ్రప్రదేశ్‌లో నేటి జనాభా సుమారు 6 కోట్లు. ఇందులో నూటికి 30 మంది గ్రామ సీమలలో నివసిస్తున్నారు. వ్యవసాయం మీద గాని, దానికి అనుబంధమైన వృత్తుల మీద గాని జీవించే వారి సంఖ్య మొత్తం జనాభాలో నూటికి 80 వరకు ఉంది. అనుబంధమైన వృత్తులు అంటే – పండ్ల తోటలు, చేపల పరిశ్రమ, అడవులలో కలప వగైరా పనులు. పశువుల, గొర్రెల పెంపకం, పాల పరిశ్రమ, బట్టలుతకడం, క్షౌరం చేయడం, ఇంటి నౌకరీ, మట్టిపని, ఇటుకల పని, రవాణా, మోత మొదలైన పనులు. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో 4 కోట్ల మంది వ్యవసాయం, దాని ఉప వృత్తుల మీద జీవిస్తున్నారు.

వీరు గాక చేతి వృత్తులలో గ్రామాలలో జీవించే వారు చేనేత పారిశ్రామికులు. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి వగైరా వృత్తులలో పనిచేసేవారు కూడా నూటికి 6 మంది ఉన్నారు. వీరు కూడా వ్యవసాయ పనుల మీద రోజు రోజుకు ఎక్కువగా ఆధారపడవలసి వస్తూ వుంది. తమ వృత్తులలో తగిన ఆదాయం రాక పని ఒత్తిడి వున్న రోజులలో, నాట్లు, కోతల సమయాలలో కూలికి పోవడం సహజమవుతూ ఉంది. అదేగాక వీరిలోను పట్టణాలలో చిన్న చిన్న చేతివృత్తులున్న వారిలోను, ఫ్యాక్టరీలలోను, ఉద్యోగాలలో వున్న వారిలోను చాలామందికి వారికున్న కొద్దిపాటి భూమి మీద నుండి వచ్చే ఆదాయం కూడా ఒక సహాయ ఉపాధిగా వుంటూ వుంది.

అందుచేతనే వ్యవసాయం మీద జీవించే ఈ కోట్లాది ప్రజల జీవిత సమస్య పరిష్కారం గానిదే. వారికి సంవత్సరం పొడుగునా పనిచూపి, వారి కుటుంబ పోషణకు కావలసిన జీవనభృతికి అయినా గ్యారంటీ చేయనిదే దేశంలో పురోభివృద్ధి ఏ రంగంలో కూడా చెప్పుకోదగినంతగా జరగదు.

కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యక్రమంలో ఈ విషయాన్నే ఇలా వివరించడం జరిగింది.

"భూమిని పోగొట్టుకొని దైన్య స్థితిలో వున్న మన రైతాంగం వ్యవసాయం అభివృద్ధి చేసుకొనేందుకు అవసరమైన కనీస వ్యవసాయ పనిముట్లుగాని, ఎరువులుగాని కొనగల స్థితిలో లేరు. కాబట్టే మన వ్యవసాయాన్ని తగినంతగా అభివృద్ధి చేసి దేశానికి అవసరమైన ఆహారాన్ని, ఇతర ముడి సరుకులను ఉత్పత్తి చేసి సరఫరా చేసుకోలేకపోతున్నాం.



"మన దేశ జనాభాలో నూటికి 80 మందిగా వున్న రైతాంగ కనీస సంఖ్యలోనైనా పరిశ్రమలలో తయారైన వస్తువులను కొనగల స్థితిలో లేదు. కాబట్టే మన దేశ పరిశ్రమలను అభివృద్ధి చేయలేకపోతున్నాం. దేశాన్ని పెద్దగా పారిశ్రామికవంతం చేయలేకపోతున్నాం.

"అలాగే దారిద్ర్యపు బాధను భరించలేక ఆకలితో అలమటించుతూ గ్రామ సీమల నుండి వేలాది జనం పట్టణాలకు ఎగబాకుతున్నారు. ఇప్పటికే పట్టణాలలో వున్న నిరుద్యోగుల సంఖ్య ఇందువల్ల మరింతగా పెరుగుతోంది. కూలి రేటు మరింత తగ్గుతోంది. ఆ కారణం వలన కార్మిక వర్గ పరిస్థితులను మనం మెరుగుపరచలేకపోతున్నాం.

"దారిద్ర్యంతో కృంగి కృశించుతూ ఆకలితో అలమటించే రైతాంగమే మన జనాభాలో అత్యధికులు కాబట్టి వారి బిడ్డలకు విద్యాబుద్ధులను చెప్పించుకోగలిగిన ఆర్థిక స్థోమత కలిగి ఉండరు. కాబట్టి మనం త్వరితగతిని, వెనుకబడిన మన సాంస్కృతిక స్థితి నుండి బయట పడలేకపోతున్నాం.

"అందువలన వ్యవసాయ రైతాంగ సమస్యలే మన దేశ జీవితానికి అత్యంత ప్రధానమైనవిగా పరిణమించాయి. అవే నేటి మన జాతీయ సమస్యలలో కెల్లా మొదటి సమస్యగా ముందుకు వచ్చి వున్నాయి."

**భూస్వాములు :** అయితే వ్యవసాయం మీద జీవించే వారంతా భూమి మీద కష్టపడి పనిచేసి జీవించడం లేదు. కొంతమంది భూమి మీద కాయకష్టం చేయకుండానే భూమిని కౌలుకిచ్చి సాగు చేయించుకొని, వచ్చిన కౌలు ఆదాయాన్ని అనుభవిస్తూ జీవిస్తున్నారు. ఈ కౌలు మొత్తం ఫలసాయంలో మొత్తం పండిన పంటలో నూటికి 50 లేక 75 పాళ్ళు ఇంకా అదనంగానే కష్టపడి పనిచేసే రైతు, పని చేయని భూమి యజమానికి ఇచ్చుకోవాల్సి వస్తూ వుంది.

మరికొంత మంది కేవలం అజమాయిషీ మాత్రం చేస్తూ తమ భూములను పాలేర్ల చేత (జీతగాండ్ర చేత) రోజు కూలీల చేత సాగు చేయిస్తూ, వారికి కొద్దిపాటి కూలీ జీతాలు ఇస్తూ, వచ్చిన ఫలసాయాన్నంతా అనుభవిస్తున్నారు.

ఈ విధంగా భూముల మీద అన్ని ముఖ్య వ్యవసాయ పనులలో సంవత్సరం పొడవునా కాయకష్టం చేయని కుటుంబాలను, కేవలం భూములను కౌలుకిచ్చిగాని, లేదా అజమాయిషీ చేస్తూ ముఖ్య వ్యవసాయ పనులన్నింటినీ పాలేర్ల చేత, రోజు కూలీల చేత చేయించుకొని గాని ఫలసాయాన్ని అనుభవించే వారందరినీ భూస్వాములుగా మనం పరిగణించవలసి వుంది.

భూమి మీద అన్ని ముఖ్య వ్యవసాయ పనులలోనూ, సంవత్సరం పొడవునా సొంతంగా కాయకష్టం చేసుకొని గాని వచ్చిన ఫలసాయాన్ని అనుభవించే వారినందరిని మనం రైతులుగా పరిగణిస్తాం.

వీరిలో కూడా తరతమ భేదాలున్నాయి.

**ధనిక రైతు :** సొంత భూముల మీద లేదా కౌలుకు తీసుకున్న భూముల మీద అంటే మొత్తం తమ కమతం మీద అన్ని ముఖ్య పనులలోను కాయకష్టం చేస్తారు. దీనితో పాటు పాలేర్లను లేదా రోజు కూలీలను పెట్టుకుంటారు. ముఖ్యంగా నాటువేతలు, కలుపుతీతలు, కోతలు, నూర్పిళ్ళలో రోజు కూలీలను పెట్టుకోవడం ఎక్కువగా వుంటుంది. తమ కుటుంబంలో ఉన్నవారు సంవత్సరం పొడవునా వ్యవసాయంలో పని చేసే రోజుల కన్నా, ఈ కూలీల చేత, ఈ పాలేర్ల చేత పని చేయించుకొనే రోజులు ఎక్కువగా ఉంటాయి. అంటే వీరు తమ సొంత ఆర్జితాన్నే గాక, కూలీల, పాలేర్ల పని ఫలితాన్నుండి అదనపు విలువలను కూడా భుక్తం చేసుకుంటున్నారు. ఇలాంటి కుటుంబాలను మనం ధనిక రైతులుగా పరిగణించాలి.

కుటుంబ శ్రమ కన్నా (పని రోజుల కన్నా) కూలీల శ్రమ (పనిరోజులు)ను ఎక్కువగా వినియోగిస్తున్న కుటుంబాలను ధనిక రైతు కుటుంబాలుగా పరిగణించాలని లెనిన్ చెప్పాడు.

లెనిన్ సూత్రాలను తమ దేశంలో, గ్రామ సీమలలో వున్న పరిస్థితులకు అన్వయించుకొని చైనా కమ్యూనిస్టు పార్టీ పరిశీలించింది. ఏ కుటుంబానికైనా దాని మొత్తం ఆదాయంలో నూటికి 30 పాళ్ళు ఇతరుల శ్రమ ఫలితంగా వస్తే – అంటే కౌలుగా గాని, వడ్డీ నాగుల మీద గాని, కూలీలు, పాలేర్ల అదనపు విలువ నుండి గాని వస్తే అట్టి కుటుంబాన్ని ధనిక రైతు కుటుంబంగా పరిగణించాలని చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. కాని మనం కూలీల శ్రమ దోపిడీనే దృష్టిలో పెట్టుకొని వర్గీకరణం చేయడం జరిగింది.

పరార్జితం మీద గణనీయంగా ఆధారపడే కుటుంబాల మానసికతత్వం, దోపిడీ వర్గాల మానసికతత్వంగా వుంటుంది. కష్టజీవులతో కలిసి మెలసి పని చేయడానికన్నా, తమకన్నా పైనున్న దోపిడీ వర్గాలతో కలిసి వుండాలనే తత్వం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి ధనిక రైతు కుటుంబాలు తాము పెట్టుకొనే కూలీలకు, పాలేర్లకు న్యాయమయిన కూలీ, జీతాలు ఇవ్వకుండా వారితో ఘర్షణ పడుతూ ఉంటారు. అదే విధంగా తాము ఇచ్చేది అప్పుల మీద ఎక్కువ వడ్డీ రేట్లు, నాములు (నాగులు) రాబట్టుకోడానికి ఒత్తిడి చేస్తూ ఉంటారు. ఇదే రీతిగా తమ భూములలో కొంత భాగాన్ని కౌలుకు ఇచ్చినప్పుడు ఎక్కువ రేటును, విపరీతమయిన కౌలు రేటును కూడా వసూలు చేసుకోడానికి చూస్తారు.

సామాన్యంగా ధనిక రైతుకు తన వ్యవసాయం మీద వచ్చే నికరాదాయం తన మామూలు కుటుంబ జీవితానికి పోను, ఏటేటా మిగులుతూ ఉంటుంది. ఈ మిగిలిన ఆదాయాన్ని అతడు పెట్టుబడిగా వినియోగించుకుంటాడు. తన భూకమతాన్ని అభివృద్ధి చేసుకోడానికిగాని, లేదా వడ్డీ నాములకు ఇచ్చి లాభాలను సంపాదించుకోడానికి గాని, లేక తదితర చిన్న చిన్న సహాయక వృత్తులకు పెట్టుబడిగా ఈ మిగులు ఆదాయాన్ని వినియోగించుకుంటాడు.



వ్యవసాయ పరిస్థితులు గడ్డుగా వున్న ఏ కొద్ది ప్రత్యేక ప్రాంతాలలో కొన్ని కొన్ని సందర్భాలలో వచ్చే ఆదాయంలో మామూలు కుటుంబ ఖర్చులకు పోను మిగలకపోవచ్చు. అయినా అట్టి ప్రాంతాలలో కూడా కుటుంబ ఆర్జితం కన్నా పరార్జితం, మొత్తం ఆదాయంలో ఎక్కువ భాగంలో ఉన్నప్పుడు ఆ కుటుంబాన్ని మనం ధనిక రైతు కుటుంబంగానే పరిగణిస్తాం.

**మధ్య తరగతి రైతు:** తమ సొంత భూమి లేదా కౌలు భూమి మీద అంటే మొత్తం తమ కమతం మీద, తమ కుటుంబం సంవత్సరం పొడువూ అన్ని ముఖ్య పనులలో కాయకష్టం చేసి పంటలు పండిస్తారు. వీరిలో చాలా మంది చిన్న పాలేర్లను, ఇంటి పనుల కోసం, వ్యవసాయ పనులు, గేదెలు తదితర పశువుల కాపరి పని చేయడానికి పెట్టుకుంటారు. ముమ్మరపు పని తరుణాలలో, నారు వేతలు, కోతలలో రోజు కూలీలను కూడా పెట్టుకుంటారు. వీరి కుటుంబ శ్రమ రోజులు కూలీ పని రోజుల కన్న అత్యధికంగా ఉంటాయి. మొత్తం ఆదాయంలో కష్టార్జితం ఎక్కువగా ఉంటుంది. పరార్జితం తక్కువగా ఉంటుంది. వీరికి వ్యవసాయం మీద వచ్చే నికరాదాయం వారి మామూలు కుటుంబ పోషణకు సరిపోతుంది. పంటలు బాగా పండి, అన్నీ సవ్యంగా కలిసి వచ్చిన సంవత్సరంలో పెట్టుబడిగా వినియోగించుకోగల్గిన మోతాదులో మిగులుతుంది. ఇట్టి కుటుంబాలను మధ్య తరగతి కుటుంబాలుగా పరిగణిస్తాం.

**ధనిక రైతు కుటుంబానికి, మధ్య తరగతి కుటుంబానికి మధ్య గీటురాయిః** మధ్య తరగతి రైతు కుటుంబ పని రోజులు కూలీల పని రోజుల కన్న ఎప్పుడూ ఎక్కువగా ఉంటాయి. రెండవది ధనిక రైతు కుటుంబానికి సామాన్యంగా ఏటేటా పెట్టుబడిగా వినియోగించుకోవడానికి వీలయిన మోతాదులో ఆదాయం మిగులుతుంది. మధ్య తరగతి రైతుకు ఈ విధంగా మిగలదు. మంచి సంవత్సరాలలోనే ఆ మోతాదున మిగులుతుంది.

**పేద రైతు:** పేద రైతు కుటుంబానికి తన కమతం మీద వచ్చే నికరాదాయం మామూలుగా కుటుంబ పోషణకు కూడా చాలదు. ఎప్పుడూ లోటుగానే ఉంటుంది. లేదా బొటాబొటిగా సరిపోతుంది. అందుచే ఇతరుల వద్ద కూలీ పనిగాని, లేక ప్రధాన వ్యవసాయాదాయానికి సహాయంగా మరేదైనా తాత్కాలిక ఉపవృత్తులు చూచుకుంటూ జీవితం గడుపుతూ వుంటాడు. పేద రైతు ఇతరులను కూలికి పెట్టుకుని ఆ కూలి శ్రమను దోచుకోడు. ఎప్పుడైనా వ్యవసాయ పరిస్థితిని బట్టి కూలీలను పెట్టుకున్నా తాను కూడా దానికి బదులుగా ఇతరుల క్రింద కూలికిపోతూ వుంటాడు.

**వ్యవసాయ కార్మికులు:** తమ శ్రమశక్తిని అమ్ముకొని కూలి పని మీద ప్రధానంగా జీవిస్తారు. వీరిలో కొంత మందికి కొద్దిపాటి భూమి ఎకరం లేదా అర ఎకరంలోపు ఉన్నా ప్రధాన కుటుంబ ఆదాయం భూమి మీద గాక వ్యవసాయంలో లేక తదితర ఉపవృత్తులలో కూలి చేసుకోవడం వల్ల వస్తుంది. ఇట్టి కుటుంబాలనన్నిటిని మనం వ్యవసాయ కార్మికులుగా పరిగణిస్తాం.

# గ్రామాలలో వర్గ విభజన

గ్రామ సీమలలో ఈ వర్గ విభజన ఏ మేరకు అభివృద్ధి చెందినదీ పరిశీలించి మనం సరైన అవగాహన కలిగి వుండాలి. అదేరీతిగా గ్రామాలలో దోపిడీ ఏ రీతిగా వున్నదీ, ఏ రూపాలలో వున్నదీ తెలుసుకోవాలి. ఈ దోపిడీ విధానాలు వ్యవసాయ కార్మికులను, పేద రైతులను, మధ్య తరగతి రైతులను, ధనిక రైతులను ఏ విధంగా బాధిస్తున్నదీ కూడా మనం తెలుసుకోవాలి. అప్పుడే మనం వారి వారి కోర్కెలేమిటో సరిగా అర్థం చేసుకొని వాటిని తగు రీతిగా రూపొందించగలం. వాటిని సాధించడం కోసం సరైన ఎత్తుగడలతో, భూస్వాములకు వ్యతిరేకంగా వివిధ రైతు వర్గాలను ఆయా సమస్యల మీద ఆయా సందర్భాలలో కలుపుకొని పోరాడడం సాధ్యమవుతుంది.

మనం ఒక సమస్యను తీసుకుని సాధించుకోవడానికి పోరాడబూనుకున్నప్పుడు మనం ఎదుర్కోవలసిన శక్తులు నూటికి ఐదారుగురికి మించకుండా వుండేటట్లు చూసుకోవాలి. మిగిలిన 95 మందిని కలుపుకుని రావడానికి గట్టిగా ప్రయత్నించాలి. ఎందుకంటే, ఏ సమయంలోనైనా, ఏ సందర్భంలోనైనా మన ప్రత్యర్థి బలం, సంఖ్య ఎంత కొద్దిగా వుంటే మనం బలం, మన మిత్ర బృందాల బలం ఎంత ఎక్కువగా వుంటే అంత తేలికగా మనం మన కోర్కెలను విజయవంతంగా సాధించుకోగలం. ఒక విజయం సాధించితే, దాని అనుభవముతో, ఫలితంతో మరింత విశ్వాసంతోనూ, చొరవతోనూ, మరింత అదనంగా కష్టజీవులు కదిలి దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాడటానికి ముందుకు వస్తారు. మరింత పెద్ద కోర్కెలను ఒకదాని తర్వాత మరొకటి సాధించుకుంటూ ముందుకు పోగల్గుతారు.

మన గ్రామ సీమలలో ప్రతి కుటుంబాన్ని పై కొలబద్దతో, పై అవగాహనతో పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఈ దృష్టితో 1974లో వివిధ జిల్లాల్లోని కొన్ని గ్రామాలలో వర్గ విభజన ఏ రీతిగా వుందీ వివరమైన లెక్కలు తీయబడినవి. గుంటూరు జిల్లాలో డెల్టా ప్రాంతమైన తెనాలి తాలూకా అనంతవరం, మెట్ట, మాగాణి కలసివున్న కాజ (గుంటూరు తాలూకా) గ్రామాలలో పరిస్థితి అనుబంధంలో చూపబడింది.



**ఆంధ్రప్రదేశ్ అంతటిలో రైతాంగంలో వర్గ విభజన :** అనుబంధంలో అనంతవరం, కాజ గ్రామాలను గూర్చి వివరించిన రీతిగా మనం ఆయా తాలూకాలలోను, గ్రామాలలోను వర్గ విభజన ఏ రీతిగా ఉందో పరిశీలించాల్సి వుంటుంది. అచ్చటనున్న నీటి పారుదల వసతులు, భూసారం, పండించే పంటల క్రమం, వ్యవసాయ పద్ధతులు, భూ సంబంధాలు వగైరాలను బట్టి వర్గాలకున్న భూపరిమితులు వేరు వేరుగా వుంటాయి. అందుచేత వర్గీకరణ చేయవలసి వచ్చినప్పుడు ప్రతి గ్రామంలోను, ప్రతి కుటుంబ విషయం ప్రత్యేకించి చేయవలసి వుంటుంది.

ఈ శాస్త్రీయ దృక్పథంలో ఆంధ్రప్రదేశానికంతటికీ గాని, ఒకేరకమైన వ్యవసాయిక పరిస్థితులున్న ఆయా ప్రాంతాలు లేక గ్రామాల సముదాయాలకుగాని, వర్గ విభజన వివరాలు సేకరించి వుండలేదు. కాని ప్రభుత్వం ప్రకటించిన సెన్సును లెక్కలనుబట్టి శాంపిలు సర్వేను బట్టి (నమూనా గ్రామాల పరిశీలనా నివేదికలను బట్టి) చాలా స్థూలంగా మన ఆంధ్రప్రదేశ్‌లో, గ్రామ సీమలలో వర్గ విభజన, భూకేంద్రీకరణ ఏ విధంగా వుందీ స్థూలంగా మనం తెలుసుకోవచ్చు.

ఆంధ్రప్రదేశ్ జనాభా నేడు సుమారు 5 కోట్లు వుంది. ఒక కోటి 25 లక్షల కుటుంబాలున్నాయి. వీనిలో గ్రామాలలో నివసించే కుటుంబాలు ఒక కోటి వుంటాయి.

1971 జనాభా లెక్కలను (సెన్సెసును) బట్టి, వ్యవసాయ కార్మికులూ, వ్యవసాయ అనుబంధ వృత్తుల్లోను, గ్రామ నౌకరీ పనులలోను, చేతి వృత్తులలోను కూలీ చేసుకునేవారు నూటికి 50 కుటుంబాలు వంతున వున్నారు. అరఎకరం మాగాణి, ఒకటి రెండు ఎకరాల మెట్ట భూమి వుండి కూడా, ప్రధానంగా కూలి చేసుకునే కుటుంబాలు కూడా ఇందులోనే వున్నాయి. ఆ రీతిగా ఆంధ్రప్రదేశ్‌లో 50 లక్షల కుటుంబాలు వ్యవసాయ కార్మిక కుటుంబాలున్నాయి. వీరికి మొత్తంగా నున్న భూమి 5.6 లక్షల ఎకరాలకు మించదు.

మరోవైపు పదిహేను ఎకరాలు మించిన మాగాణినిగాని లేక 20-30 ఎకరాలకు మించిన మెట్ట భూమినిగాని కల్గిన కుటుంబాలు, ముఖ్యమైన వ్యవసాయ పనులలో కుటుంబంలో ఏ ఒక్కరూ కాయకష్టం చేయరు. అజమాయిషీ చేస్తూ పాలేర్లతోను, రోజుకూలీలతోనూ సాగు చేయించుకుంటారు. లేదా తమ భూములను కౌలుకిస్తారు. ఈ రీతిగా పరార్జిత ఆదాయం మీద జీవించే కుటుంబాలు, భూస్వామి కుటుంబాలు 3 లక్షలు. వీరి సంఖ్య నూటికి 5లోపే వుంటున్నది. అయితే మొత్తం సాగయ్యే భూమిలో 45 పాళ్లు వరకు అంటే మూడు కోట్ల ఎకరాలలో ఒక కోటి 35 లక్షల ఎకరాల వరకు వీరిదే.

ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఎకరం మొదలు రెండు ఎకరాల వరకు మాగాణి గాని లేదా రెండు ఎకరాలు మొదలు 5 ఎకరాల వరకు మెట్ట భూమి గాని కలిగి సాగు చేసుకొంటున్న కుటుంబాలు తమ కుటుంబమంతా కష్టపడి కాయకష్టం చేసినా వీరికి ఆ భూకమతాల నుండి వచ్చే నికరాదాయం కుటుంబ పోషణకు చాలక అప్పులపాలవుతుంటారు. లేదా బొటాబొటీగా సరిపెట్టుకుంటున్నారు. వీరు ఇతరులకు కూలికి వెళ్ళి గాని లేదా ఇతర వృత్తులలో కొద్దిగా సంపాదించుకొంటూ గాని ఏదో విధంగా తమ జీవితాన్ని నికృష్టంగానే గడుపుకొంటున్నారు. ఇలాంటి పేద రైతు కుటుంబాలు నూటికి 20 మంది వంతున మన రాష్ట్రంలో వున్నాయి. సుమారు 20 లక్షల కుటుంబాలు. వీరికి వున్న భూమి 40 లక్షల ఎకరాల లోపే.

వ్యవసాయ కార్మికులు, పేద రైతుల చేతులలో నున్న భూములు మొత్తం భూమిలో 15 శాతం కన్నా మించవు.

రెండు ఎకరాల నుండి ఐదు ఎకరాల వరకు మాగాణి భూమిగాని లేదా ఐదు నుండి పది పన్నెండు ఎకరాలు మెట్ట భూమిగాని కలిగి తమ కుటుంబమంతా కాయకష్టం చేసుకుంటూ కుటుంబపోషణకూ సరిపడా ఫలసాయం పొందుతూ వున్న కుటుంబాలు మధ్య తరగతి రైతు కుటుంబాలుగా మన రాష్ట్రంలో వున్నారు. వీరు చిన్న పశువుల కాపరులను, పని ఒత్తిడి రోజులలో కొద్దిగా రోజుకూలీలను పెట్టుకుంటున్నా తమ కుటుంబ శ్రమ మీదనే ప్రధానంగా ఆధారపడుతూ వుంటారు. నూటికి 15 మంది వరకు ఇలాంటి మధ్య తరగతి కుటుంబాలున్నవి. సుమారు 15 లక్షలు. వీరి చేతులలో నున్న భూమి 45-50 లక్షల ఎకరాలు. అంటే 15 శాతం ఉంటుంది.

మన రాష్ట్రంలో 5-10 ఎకరాల మధ్య మాగాణి భూమిగాని లేదా 10-20 ఎకరాల మధ్య మెట్టగాని కలిగి, కుటుంబంలోని ముఖ్య వ్యవసాయ పనులలో కాయకష్టం చేసుకుంటూనే, పాలేర్లను, రోజుకూలీలను అదనంగా పెట్టుకుంటారు. వచ్చే ఆదాయం కుటుంబపోషణకు పోను ఏటేటా పెట్టుబడిగా వినియోగించుకోడానికి తగినంతగా మిగులుతుంది. ఇలాంటి కుటుంబాలు ధనిక రైతు కుటుంబాలు. నూటికి 10 పాళ్ళు మన రాష్ట్రంలో వున్నాయి. వీరి చేతులలో 75 లక్షల ఎకరాల వరకు భూమిపై (25 శాతం) వుంది.

భూస్వాములు, ధనిక రైతుల చేతులలో వున్న భూమి మొత్తం భూమిలో నూటికి 70 పాళ్ళు.



# కాయకష్టం చేయని చిన్న భూకామందులు భూస్వాములు కారు

**వారియెడల మన వైఖరి:** 5 ఎకరాలలోపు మాగాణి భూమి లేదా 10 ఎకరాలలోపు మెట్టభూమి కల్గి వున్న చిన్న భూకామందులు సొంతంగా కాయకష్టం చేయకుండా కౌలుకివ్వడంగాని, పాలేర్లతోను, రోజుకూలీలతోను వ్యవసాయం చేయించుకోవడం మనం తరచుగా మన గ్రామాలలో చూస్తున్నాం. నేటి ఆర్థిక, సామాజిక పరిస్థితులలో విపరీతమయిన హెచ్చు కౌలు రేట్లు ఇచ్చి అయినా వ్యవసాయ కార్మికులు, పేద రైతులు కౌలుకు తీసుకుంటున్నారు. అదే రీతిగా పనిలేక పస్తులుండే వ్యవసాయ కార్మికులు చాలా తక్కువ కూలిరేట్లకు పని చేయడానికి అత్యధిక సంఖ్యలో ముందుకు వస్తున్నారు. అందుచేత ఎక్కువ కౌలు రేట్లకు భూమిని కౌలుకివ్వడం లేదా తక్కువ కూలిరేట్లకు వచ్చే కూలీలతో వ్యవసాయం చేయించుకోవడం లాభసాటిగా వుంది. కాబట్టి కాయకష్టం చేసి సొంతంగా వ్యవసాయం చేయకుండా ఈ పరార్జిత ఫలసాయం అనుభవించడం జరుగుతూ వుంది. కాని వ్యవసాయ కార్మికుల, కౌలు రైతుల చైతన్యం పెరిగి సంఘటితులై తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడే కొద్ది పైన పేర్కొన్న రైతులలో చాలా మంది సొంతంగా కాయకష్టం చేసుకోవడానికి ముందుకు వస్తారు. వీరిని మనము భూస్వాములుగా పరిగణించకూడదు.

ఈ చిన్న భూకామందులలో అత్యధిక సంఖ్యాకులు తమ భూములలో నుండి వచ్చే ఆదాయం చాలక దానిని కౌలుకిచ్చిగాని, తమ అజమాయిషీ క్రిందగాని, తమ బంధుమిత్రుల అజమాయిషీ క్రిందగాని వ్యవసాయ కూలీలతో సాగు చేయించుకుంటూ తాము ఇతర వృత్తులలోకి పోతున్నారు. ఫ్యాక్టరీలలో పనిచేసి గాని, ప్రభుత్వ ఉద్యోగాలలోగాని గుమాస్తాలుగా, ఉపాధ్యాయులుగా, లేక చిన్న పరిశ్రమలను, చిన్న చిన్న వ్యాపారాలను నడుపుకుంటూ గాని జీవిస్తున్నారు. వీరికి వ్యవసాయం మీద వచ్చే ఆదాయం పరార్జితమయినా వారి జీవనానికి సహాయంగా వుంటున్నది. ఇట్టి వారిని మనం భూస్వాములుగా చూడం.

భూపంపక సమస్య, కౌలు సమస్య, కౌలు భూమి మీద ఎవరికీ పట్టా హక్కు అనే సమస్యలు వచ్చినప్పుడు వీరి యెడల మన వైఖరి ఏ రీతిగా ఉండాలో మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఒక తీర్మానంలో ఈ రీతిగా చెప్పింది:

సీలింగులో (భూస్వామికి ధనిక రైతుకీ మధ్య గీటుగా నిర్ణయించబడిన భూకమతంలో) సగానికి లోపు భూమిని కలిగి వున్న భూకామందులు, ఫ్యాక్టరీలలో పనిచేస్తూ గాని, చిన్న దుకాణాలను పెట్టుకొని గాని, చిన్న ప్రభుత్వ ఉద్యోగాలు చేసుకుంటూ గాని, మామూలు సైనికులుగా గాని, చిన్న సైనిక ఆఫీసర్లుగా గాని లేదా ఇతర వృత్తులలో గాని పనిచేస్తూ తమ జీవితాన్ని వెళ్లబోసుకుంటూ వుంటే వారు తమ భూములను సొంతకాయకష్టంతో సాగు చేసుకోకపోయినా, ఆ భూములను పంచడానికి తీసుకోకూడదు. కాని ఆ భూములను ఇతరులకు కౌలుకిచ్చి వుంటే కౌలు రైతులను ఆ భూముల నుండి తొలగించరాదు. వారు ఈ చిన్న భూకామందులకు న్యాయమైన కౌలు రేట్లు మాత్రం చెల్లిస్తారు. చిన్న భూకామందులు ఇష్టపడి తమ భూములను ప్రభుత్వానికి స్వాధీనం చేయవచ్చు. అప్పుడు ప్రభుత్వం వారికి మార్కెట్టు రేటు ప్రకారం భూమి ఖరీదు చెల్లించాల్సి వుంటుంది.

ఆ చిన్న భూకామందు తాను (తన కుటుంబం) ఆ భూమిని సొంత కాయకష్టంతో సాగు చేసుకోవడానికి కావాలని కోరితే, అప్పుడు అచ్చట ఎన్నుకోబడ్డ రైతు కమిటీలు, కౌలుదారునికి, చిన్న భూకామందులకు, మధ్య న్యాయమైన రీతిగా రాజీ పరిష్కారం చేయాలి. కౌలు రైతుకు చిన్న భూకామందు రాజీ తీర్పు ప్రకారం వదిలి వేయాల్సి వచ్చిన భూమికి ప్రభుత్వం పూర్తి మార్కెట్టు ధర చెల్లించాలని వుంటుంది. కౌలు రైతుకు ఆ భూమి ఉచితంగా ఇవ్వబడుతుంది.

కేరళలోగాని, ఛోటా నాగపూర్ పరగణాలోగాని లేక మరికొన్ని ఇతర రాష్ట్రాలలో, కౌలు రైతులకు చిన్న భూకామందుల భూమి మీద చట్టా హక్కులిచ్చి ఉన్న పరిస్థితిలో, ఆ చిన్న భూకామందులకు పూర్తి మార్కెట్టు ధర ప్రభుత్వం చెల్లించాలని (కౌలు రైతుల నుండి ఎట్టి నష్టపరిహారం వసూలు చేయరాదని) మనం ఆందోళన చేయాలి.

కౌలు రైతు భూకామందుకు చెల్లించవలసిన న్యాయమైన కౌలు రేటు, మొత్తం పంట (ఫలసాయం)లో నాల్గవవంతుకు మించి వుండరాదు.

**1.అర్థసీలింగుకుపైనా, ఒక సీలింగులోపు భూమి వున్న భూకామందులు మరో జీవనోపాధి లేని వారి విషయంలో :** వీరు సొంత కాయకష్టంతో తమ భూములను సాగు చేసుకోకుండా (తాము అజమాయిషీ కూలీల చేత చేయించుకుంటూ వుంటే), వీరికి మరో జీవనోపాధి ఏమీ లేనప్పుడు ఆ భూమినంతా వారు తమ కుటుంబం సొంతంగా కాయకష్టంతో సాగుచేసి తమ జీవన పోషణకు పూనుకుంటే ఆ భూమిని వారికి వదిలివేయాలి. పంపకానికి స్వాధీనం చేసుకోగూడదు.

కాని ఆ భూమిని కౌలుకిచ్చి వుంటే అందులో సగం కౌలు రైతుకు ఉచితంగా ఇచ్చివేయాలి. మిగిలిన సగాన్ని తమ జీవన పోషణ కోసం తమ సొంత కాయకష్టంతో సాగు చేసుకోవడానికి స్వాధీనం చేసుకోవచ్చు. కౌలు రైతుకు ఇచ్చిన సగభూమికి ప్రభుత్వం, ఇలాంటి భూకామందులకు నష్టపరిహారమిస్తుంది. (మార్కెట్ రేటు కాదు)



భూకామందు భూమినంతా కౌలు రైతులకే వదిలివేయడానికి తయారయితే మొత్తం భూమికి ప్రభుత్వమే నష్టపరిహారం ఇస్తుంది (మార్కెట్ రేటు కాదు).

**2. మరో జీవనోపాధి ఉన్న వారి విషయంలో :** ఇలాంటి భూకామందులకు ఇతర జీవనోపాధులున్నప్పుడు వారు తమ భూములను వ్యవసాయ కార్మికుల ద్వారా సాగు చేయించుకుంటూ వుంటే, ఒక సీలింగు భూకమతంలో ఎంత ఆదాయం వస్తుందో, ఆ ఆదాయం మేరకు తనకు ఇతర జీనోపాధి నుండి వస్తున్న ఆదాయాన్ని భర్తీ చేయడానికి అవసరమయిన భూమిని మాత్రం ఉంచుకోవచ్చు. ఏ పరిస్థితిలోను అలా ఉంచుకున్న భూమి సీలింగు కమతంలో సగానికి మించి ఉండరాదు. అంతకుమించి ఉన్న భూమిని ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి పేదలకు పంపకానికి స్వాధీనం చేసుకుంటుంది.

ఆ భూములు కౌలుకు ఇచ్చి వుంటే, ఆ కౌలు రైతులకే భూమి మీద పట్టా హక్కు ఉచితంగా ఇవ్వాలి. ఈ భూకామందులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుంది.

# భూ పంపకం : దాని కీలక ప్రాముఖ్యత

పైన వివరించిన విధంగా 50 లక్షల వ్యవసాయ కార్మిక కుటుంబాల చేతులలో మెట్ట, మాగాణి కలిపి 5, 6 లక్షలెకరాలకు మించి లేదు. సగటున కుటుంబానికి 10 సెంట్లు కూడా లేదు. వీరిలో నూటికి 80 మంది అసలు సెంటు భూమి కూడా లేనివారు. మరో 20 లక్షల పేద రైతుల కుటుంబాలకు 40 లక్షల ఎకరాలున్నాయంటే కుటుంబానికి సగటున రెండెకరాలకన్నా ఎక్కువ లేదు. వ్యవసాయ కార్మిక కుటుంబానికి సంవత్సరానికి 250 రోజులకన్నా పని దొరకడం లేదు. భార్యాభర్తలిద్దరికీ కలిపి సంవత్సరమంతా పూర్తిగా పని వుండాలంటే 600 రోజులయినా పని వుండాలి. అందుకు కావలసిన పరిశ్రమలు, తదితర వృత్తులు కల్పించడానికి వేల కొలది రూపాయలు పెట్టుబడి పెట్టవలసి వుంటుంది. అలాంటి పరిశ్రమలు నిర్మించడానికి దశాబ్దాలు పడతాయి. ఈ లోపల భారతదేశమంతటా కోట్ల కొలది వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, తదితర పేద, మధ్య తరగతి ప్రజలు నిరుద్యోగంతో, పస్తులతో జీవిస్తూ ఉండాలనడం అర్థం లేదు. సహించరాని విషయం.

అంతేకాకుండా దేశమంతటా వున్న ఈకోట్ల కొలది కుటుంబాలలోని వారికి పని చూపనంతకాలం, వీరి శ్రమశక్తిని వినియోగించుకోలేనంత కాలం కొత్త పరిశ్రమలను పెట్టడానికి కావలసిన పెట్టుబడిని, యంత్రాలు, ముడిసరుకులను కూడా ఉత్పత్తి చేయడం సాధ్యంకాదు. కొద్దిగానో, గొప్పగానో నేడు తయారవుతున్న పరిశ్రమలలోని వస్తువులను కూడా కొనుగోలు చేయడానికి తగిన స్తోమతులేకపోయినందువల్లనే (ఈ కోట్లాది మంది నిరుద్యోగులుగా ఉండడమే దీనికి కారణం) చేతివృత్తులు, యంత్ర పరిశ్రమలు సంక్షోభంలోపడి మూసివేయబడుతున్నాయి. అందుచే మొదట సాధించవలసిన పని ఈ కోట్ల కొలది వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు మరింత అదనంగా పని కల్పించి వారి ఆదాయాన్ని వారి కనీస పోషణకు కావలసిన మోతాదులోనయినా పెంపొందించవలసి వుంటుంది.

దీనికి మొట్టమొదటిగా చేయాల్సిన పని నేడు స్వయంగా కాయకష్టం చేయకుండా పరాన్నభుక్తులుగా జీవిస్తున్న భూస్వాముల వద్ద నున్న భూములన్నిటినీ స్వాధీనం చేసుకొని వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు పంచి పెట్టడం. ఇది ఒక్కటే పరిష్కారమార్గం.



**భూస్వామ్య విధానాన్నే రద్దు చేయాలి :** దున్నేవానికే భూమి రావాలంటే భూస్వామ్య విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి. భూకమతాలకు పరిమితిని పెట్టి అదనపు భూములను మాత్రం తీసి పంచిపెట్టడం వలన (సీలింగు చట్టాల వలన) ఇది నెరవేరదు. భూస్వామి కుటుంబాలకు భూమి మీద ఏ మాత్రం పనిచేయని పరాన్న భుక్కులకు పరిమితిలోపు వున్న భూమినయినా వదిలిపెట్టడం అంటే వారిని మేపడం, వారి దోపిడిని ఒక పెద్ద మోతాదులో సంరక్షించడం అవుతుంది. పనిలేక భూమిలేక కటకటలాడే కోట్ల కొలది వ్యవసాయ కార్మికుల, పేద రైతుల నోట మట్టికొట్టడమేగాని మరేమీ కాదు.

కాంగ్రెస్ ప్రభుత్వం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దాదాపు గత మూడు దశాబ్దాలలోను తెచ్చిన అనేక భూసంస్కరణ చట్టాలు, జమీందారీ రద్దు చట్టాలు, కౌలుదారీ రక్షణ చట్టాలు, భూసీలింగు చట్టాలు, కనీస వేతనాల చట్టాలు, రైతుల రుణభారాలను తగ్గించే చట్టాలు వగైరా వగైరాలు, భూస్వామ్య విధానాన్ని రద్దు చేసి దున్నేవానికే భూమిని దక్కించే ఉద్దేశ్యంతో చేయలేదు. జమీందారీ విధానాన్ని కొంత మార్పు చేసి, పాతకాలపు జమీందారీ (ఫ్యూడలు) దోపిడీ విధానాలను కొంత మార్పు చేసి వారిని పెట్టుబడిదారీ భూస్వాములుగా మార్చివేయాలని గ్రామసీమలలో తమకు అండగా మరింత విస్తృత పునాది ఏర్పాటు చేసుకోడానికి, ధనిక రైతాంగవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశం తప్ప మరేమీ కాదు.

కౌలు పద్ధతిలో గాక స్వయం అజమాయిషీ క్రింద వ్యవసాయం సాగిస్తే వ్యవసాయ కార్మికుల చేత పనిచేయిస్తూ పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలతో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తే, పట్టణ ప్రాంతాలకు కావలసిన ఆహార ధాన్యాలను తమ పరిశ్రమలకు కావలసిన ముడిసరుకులను ఉత్పత్తి చేసుకోగలమని ఆశించారు.

అందుచేతనే గత మూడు దశాబ్దాలలో వ్యవసాయోత్పత్తి పెరిగినా, కౌలు దోపిడీ, పాతకాలపు జమిందారీ ఫ్యూడల్ దోపిళ్ళు సాగుతూనే వున్నాయి. దున్నేవానికి భూమి రాలేదు. దివాళా తీస్తున్న రైతులు, ఉత్పత్తిదారులు, వ్యవసాయ కార్మికులుగా తయారవుతున్నారు. వ్యవసాయ కార్మిక కుటుంబాల సంఖ్య 1961-71 మధ్య సెన్ససు లెక్కలను బట్టి మొత్తం జనాభాలో 16 శాతం నుండి 26 శాతంకు పెరిగింది. మరోవైపు కొద్దిమంది చేతులలో భూమి కేంద్రీకరించబడుతూ ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇదివరకు చేసిన సీలింగ్ చట్టాలలో అనేక మినహాయింపులుండటం వల్ల, సీలింగ్ పరిమితి చాలా హెచ్చుగా పెట్టడం వలన అదనపు భూమి పంచడానికి ప్రభుత్వానికి సాధ్యపడలేదట. ఇప్పుడు ఇందిరా కాంగ్రెస్ ప్రభుత్వం ఐదుగురుగా వున్న కుటుంబానికి, రెండు పంటలు పండే భూమి 10-18 ఎకరాలు, ఒక పంట పండే భూమి 27 ఎకరాలు, మెట్టభూమి అయితే 54 ఎకరాలు సీలింగు అని నిర్వచించింది. దీనిప్రకారం భారతదేశమంతటా 30 లక్షల ఎకరాల అదనం భూమి వస్తుందని

అంచనా వేశారు. కాని, ఆచరణలో ఇప్పటికి గత నాలుగేండ్లలోను 3 లక్షల ఎకరాలకు మించి పంచిపెట్టింది లేదు. భూస్వాములు అనేక రూపాలలో తమ భూములు బినామీ మార్పులు చేసి, పంచడానికి ఏమీ మిగల్చడం లేదు.

మన ఆంధ్రప్రదేశ్‌నే చూద్దాం. పది పదిహేను ఎకరాల మాగాణి లేక 20 - 30 ఎకరాల మెట్టకు మించిన భూస్వాముల సంఖ్య 3 లక్షల కుటుంబాలకి పైన చూశాము. వీరివద్ద ఒక కోటి 35 లక్షల ఎకరాల సాగుభూమి కూడా ఉంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన సీలింగ్ చట్టాల ప్రకారం 10 లక్షల ఎకరాలు మాత్రమే అదనంగా ఉన్నాయని, పంచడానికి మిగులుతుందని ప్రభుత్వ అంచనా.

10-15 ఎకరాలు మాగాణి లేదా 20-30 ఎకరాల మెట్టకు మించి వున్నవారు భూస్వాములు. శాంపిల్ సర్వే నివేదికలో చూపబడిన 20 ఎకరాలకు (కొంత మాగాణి, కొంత మెట్ట కలిపిన కమతాలకు) మించిన వారంతా ఈ తరగతి క్రిందకు వస్తారు. ఈ బాపతు 4 లక్షల కుటుంబాలకు, ఒక్కొక్క కుటుంబానికి 20 ఎకరాల వంతున వదిలివేయడం అంటే 80 లక్షల ఎకరాలు వారికి వదిలివేసి 55 లక్షల ఎకరాలను మాత్రమే 70 లక్షల వ్యవసాయ కార్మికులు, పేద రైతు కుటుంబాలకు పంచడానికి తీసుకోవడం జరుగుతుంది. ఈ కుటుంబాలకన్నింటికి భూస్వాముల వద్ద నున్న మొత్తం భూమిని ఒక కోటీ 35 లక్షల ఎకరాలను పంచితే వ్యవసాయ కార్మిక పేద రైతుల వద్దనున్న 45 లక్షల ఎకరాలను కలుపుకొని ఒక్కొక్క కుటుంబానికి రెండున్నర ఎకరం కమతం ఏర్పడుతుంది.

ఈ రెండున్నర ఎకరాల కమతాల మీద మెట్ట సాగు చేసినా వెనువెంటనే ప్రతి కమతానికి 1000 కిలోగ్రాములు 10 క్వింటాల్సు గట్టి గింజలు లేదా ఇంకా విలువ గల పప్పు ధాన్యాలు, నూనెగింజలు, మిరప తదితర వ్యాపార పంటలు కూడా పండించవచ్చు. మంచి విత్తనాలు, ఎరువులు, నీటి పారుదల వసతులు, ఇతర సౌకర్యాలు కలుగజేస్తే ఇదింకా అదనపు పంటలు 20-30 క్వింటాళ్ళు బియ్యము, ఇతర గట్టి గింజలు పండించవచ్చు. వెనువెంటనే ప్రతి వ్యవసాయ కార్మిక పేద రైతు కుటుంబమూ రోజుకు తలకొక అర్ధ శేరు (అర కిలోగ్రాము) బియ్యం గాని, గట్టి గింజలు గాని పండించుకొని ఆకలి తీర్చుకోగలుగుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో భూస్వాముల వద్ద నున్న భూములే గాక సాగుకు లాయకు అయిన బంజర్లు, పచ్చికబీళ్ళు, అడవి పేరుతో నమోదు చేయబడి చెట్లులేని సాగుకు పనికివచ్చే అడవి బంజర్లు, ప్రభుత్వ యాజమాన్యాన మరో రెండు కోట్ల ఎకరాలున్నవి. వీనిని కూడా కొన్ని సంవత్సరాలలో క్రమంగా సాగులోకి తెచ్చే కొద్దీ వ్యవసాయ కార్మిక, పేద రైతు కుటుంబాలకు సగటున ప్రతి కుటుంబానికి మరో రెండు, మూడు ఎకరాల భూమిని అదనంగా పంచిపెట్టడం సాధ్యమవుతుంది.



వివిధ రకాల బంజరు భూములను సాగులోకి తేవడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. వెనువెంటనే సాగుకు తేగల్గినది చాలా కొద్దిగానే వుంటుంది. అదేగాకుండా ఈ బంజరు భూమి కొద్ది ప్రాంతాలలోనే తగిన మోతాదులో ఉంది. అనేక ప్రాంతాలలో లేదు. ఉన్న ప్రాంతాలలో కూడా అచ్చట వున్న పేద కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రెండు మూడు ఎకరాల చొప్పున కొద్దిమందికే సరిపోతుంది. అందుచేత వ్యవసాయ కార్మిక కుటుంబాలనన్నిటినీ, పేద రైతు కుటుంబాల నన్నింటినీ కలిపి పోరాటంలోకి తీసుకురావాలన్నా, వారి సమస్యను ఒక మోతాదులోనయినా పరిష్కరించాలన్నా ప్రతి గ్రామంలోను భూస్వాముల వద్ద నున్న భూములన్నిటిని (సీలింగ్ లోపు ఉన్న భూములను కూడా) స్వాధీనం చేసుకొని పంచుకొనే కార్యక్రమాన్ని చేపట్టాల్సి వుంది. దానికోసం ప్రచార ఆందోళనలతో ఆరంభించి, పోరాటాలు సాగించడమే ప్రధాన సమస్య అవుతుంది.

బంజరు పోరాట సమస్య, కౌలు భూముల సమస్య, కూలిరేట్లు, అప్పులు, తదితర సమస్యలన్నీ ఈ భూపంపకం సమస్యకు అనుబంధించిన ఉప సమస్యలు మాత్రమే. సమగ్ర భూపోరాటానికి తోడ్పడే పాక్షిక సమస్యలు, పాక్షిక పోరాటాలు మాత్రమే. భూస్వాముల పెత్తనాన్ని, వారి గుత్తాధికారాన్ని బ్రద్దలుకొట్టి వారి వద్ద నున్న భూములన్నింటిని పంచుకొనే ఉద్యమం జయప్రదం కానంతవరకు, ఈ పాక్షిక సమస్యలు కూడా పూర్తిగా పరిష్కరించబడవు. పాక్షిక విజయాలను సాధిస్తూ వచ్చినా భూస్వాములు తమ బలాన్ని పుంజుకొని తిరిగి దెబ్బకొట్టడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే వుంటారు. అందుచే భూస్వామ్య విధానాన్ని రద్దు చేయనంత కాలం, దున్నేవానికే భూమి అనే నినాదాన్ని అమలు జరపనంత కాలం ఈ సమస్యలేమీ పూర్తిగా పరిష్కారం కావు.

# కౌలు దోపిడీ ఎలా రద్దు అవుతుంది?

మన గ్రామ సీమలలో నేడు కౌలు వ్యవసాయం ప్రధానం కాదు. భూకామందు తన కుటుంబ శ్రమతో గాని లేదా పాలేర్లను, దిన కూలీలను పెట్టుకొని గాని సాగు చేయడం ప్రధానంగా వుంది. భూకామందులు ప్రభుత్వానికి భూమి శిస్తు, నీటి తీరువా ఏటేటా కడుతున్నారు. మునుపటిలాగ సాగు చేసే రైతుకు, ప్రభుత్వానికి మధ్య ఉండిన జమీందారులు, ఇనాందారులు తదితర దళారీలు లేరు. మునుపటిలాగ జమీందారుల, పెద్ద భూస్వాముల భూముల మీద నిర్బంధంగా వెట్టి వ్యవసాయం, వెట్టి చాకిరీ చేయవలసిన స్థితి చట్టరీత్యా లేదు.

చట్టరీత్యా భూకామందుల భూములను కౌలుకు చేస్తున్నట్లు నమోదు చేయబడిన వారు చాలా కొద్దిమంది. భూములను కౌలుకు చేస్తున్న కౌలు రైతుల రిజిష్టర్లు ప్రభుత్వం తయారు చేసి వారి హక్కులను కాపాడటానికి పూనుకోవడం లేదు. అయితే మన ఆంధ్రప్రదేశ్‌లో సాగుదార్లలో పూర్తిగా కౌలు భూమి మీద జీవించే కౌలుదార్లు నూటికి 15, 20 మంది ఉంటున్నారు. ఈ కౌళ్ళు అత్యధిక భాగం మూజువాణి కౌళ్ళు వీరిలో ముఖ్యంగా వ్యవసాయ కార్మికులు, పేద రైతులు తమ నికృష్ట జీవితాన్ని గడుపుకోవడానికి భూమిని కౌలుకు తీసుకుంటున్నారు. మరికొంతమంది తమకున్న సొంతభూమికి తోడుగా కౌలుకు అదనంగా భూమి తీసుకుని సాగుచేస్తున్నారు.

1961 సెన్సెస్‌లో గ్రామ కుటుంబాలలో నూటికి 12.5 శాతమే కౌలుకు భూమిని తీసుకుంటున్నట్లు, అందులోను పూర్తిగా సాగుభూమినంతా కౌలుకు తీసుకున్నవారు సగం మంది మాత్రమేనని నమోదు చేయబడి వుంది. అనంతరం గ్రామంలో కౌలు పరిస్థితి ఈ క్రింది పట్టికలో ఇవ్వబడింది.



| | కౌలుకిచ్చిన కుటుంబాలు | కౌలుకిచ్చిన భూమి ఎకరాలు | కౌలుకు తీసుకున్న తీసుకున్న కుటుంబాలు | భూమి ఎకరాలు |
|---|---|---|---|---|
| భూమిలేనివారు | - | - | 61 | 71 |
| 1 ఎకరం అంతకులోపు | 31 | 23 | 46 | 32 |
| 1పైగా, 2, 5 వరకు | 26 | 50 | 17 | 24 |
| 2, 5, - 5 వరకు | 9 | 32 | 9 | 34 |
| 5 ఎకరాలకు పైగా | 12 | 154 | 11 | 96 |
| మొత్తం | 78 | 259 | 144 | 263 |

ఇందులో ఒక భూస్వామి 31 ఎకరాలు కవులుకిచ్చి మిగిలిన దానిని తానే అజమాయిషీ చేస్తూ సాగు చేయించుకుంటున్నాడు.

భూమిలేనివారు, ఎకరంలోపు భూమి వున్న పేద రైతులు కలిసి మొత్తం 106 మంది, గ్రామ కుటుంబాలలో 13 శాతం, మధ్యతరగతి స్థాయికి చెందిన 17 మంది (1 - 2.5 ఎకరాల మధ్యనున్నవారు) 2 శాతం, కవులు భూమి మీద పూర్తిగా గాని, కొంతవరకు గాని ఆధారపడి జీవిస్తున్నారు. వీరందరూ కవులకు తీసుకున్న భూమి 133 ఎకరాలు.

5 ఎకరాలు దాటిన భూస్వాములు కౌలుకిస్తున్న భూమి 154 ఎకరాలు. పేద కుటుంబాల చేతులలో వున్న ఈ భూములన్నింటిని వారికి పట్టాలిచ్చినా భూస్వాముల చేతులలో ఇంకా వేయి ఎకరాలు మిగిలే వుంటుంది. ఈ గ్రామంలో వున్న 500 మంది వ్యవసాయ కార్మిక, పేద రైతులు తదితర పేద కుటుంబాలకు భూమి రావాలంటే పది ఎకరాలకు మించిన భూస్వాముల భూములనంతటినీ పంచినప్పుడే సాధ్యమవుతుంది.

ఈ గ్రామంలో 5 ఎకరాల లోపు వున్న భూకామందుల పేద, మధ్య, ధనిక రైతు కుటుంబాలకు చెందిన వారు 105 ఎకరాలు ఇతరులకు కౌలుకిస్తున్నారు. ఆ భూముల మీద దానిని చేస్తున్న వారు కూడా పేద కుటుంబాల వారే అయినా ఈ భూముల మీద వారికి పట్టా హక్కులు ఇవ్వాలని మనం కోరం. ఉభయ పక్షాల వారు కలిసి జనతా ప్రజాస్వామిక పోరాటం విజయవంతం చేసి భూస్వామ్య విధానాన్ని రద్దు చేయాల్సి వుంటుంది. కాబట్టి వారి మధ్య ఈ సమస్యను రాజీ పద్ధతులతో పరిష్కరించాల్సి వుంటుందని ఇదివరకే వివరించడం జరిగింది.

భూస్వాముల భూములను కౌలుకు చేస్తున్న వారికే ఆ భూముల మీద పట్టా హక్కులు ఇవ్వడం జరుగుతుంది. కాని పేద, మధ్యతరగతి, ధనిక రైతుల భూములను కౌలుకు చేస్తున్న వారికి కొన్ని మినహాయింపులుంటాయి. కొంత భూమి మీదనే పట్టాలు వచ్చే హక్కు ఉంటుంది.

పెద్ద కమతాల వారు చిన్న రైతుల నుండి వ్యాపార పంటలు లేదా ఎక్కువ లాభదాయకమైన విస్తృత వ్యవసాయం చేయడానికి, పంటలు పండించడానికి, భూములను కౌలుకు తీసుకొని సాగుచేయడం కూడా జరుగుతూ వుంది. భూస్వాములు, ధనిక రైతులు, చిన్న రైతుల నుండి కౌలుకు తీసుకొని వున్న చోట్ల వారు చిన్న రైతులకు మరింత అదనంగా కౌలు మొత్తాలు చెల్లించాల్సి వుంటుంది. ఆ భూములను చిన్న రైతులు తిరిగి స్వాధీనం చేసుకోవడానికి హక్కు కలిగి వుంటారు.

కాజ గ్రామంలో కూడా భూమిలేని వ్యవసాయ కార్మిక కుటుంబాలు, 3 ఎకరాలలోపు భూమివున్నా చాలక కౌలుకు తీసుకున్న పేద మధ్యతరగతి రైతు కుటుంబాలు మొత్తం సుమారు 240 కుటుంబాలు కౌలు భూముల నుండి తాము మిగుల్చుకొనే ఆదాయం మీద పూర్తిగా గాని లేదా కొంతవరకు గాని ఆధారపడి జీవిస్తున్నారు. వీరు మొత్తం గ్రామ కుటుంబాలలో నాలుగో వంతు (24 శాతం వుంటారు) వీరు కౌలుకు తీసుకున్న భూమి 463 ఎకరాలు. గ్రామాంలో వున్న భూమిలో 3 శాతం. అయితే ఈ గ్రామంలో 7 ఎకరాలకు మించి వున్న వారంతా భూస్వాములు. వీరు కౌలుకిచ్చిన భూములు 190 ఎకరాలు. ఇవి పోను మిగిలిన 173 ఎకరాలు చిన్న భూకామందుల వద్ద నుండి తీసుకున్నవే. అది వీరికి ఇవ్వలేం.

ఈ గ్రామంలో భూమిలేనివారు గాని, ఎకరంలోపు వున్న ఒకటిన్నర ఎకరంలోపు వున్న కుటుంబాలు గాని, వ్యవసాయం మీద ఇతర కూలి పనుల మీద ఆధారపడి జీవించే కుటుంబాలు 500 వరకు వున్నాయి. వీరికి ప్రస్తుతమున్న భూమి 365 ఎకరాలకు తోడుగా భూస్వాముల వద్దనున్న 367 ఎకరాల భూమినంతటినీ తీసి పంచితే ప్రతి కుటుంబానికి సుమారు 1.5 ఎకరం వరకు ఇవ్వడం సాధ్యమవుతుంది. దానివలన కూడా ఈ గ్రామ పేదలందరి జీవిత స్థాయి పెద్దగా పెరగకపోయినా, ఆకలి బాధ నుండి తప్పించడం సాధ్యమవుతుంది.

## కౌలు దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలి

ఆంధ్రప్రదేశ్‌లో కౌలు దోపిడీ ఎంతో విపరీతంగా వుంది. కోస్తా, రాయలసీమ ప్రాంతాలలోని కౌలు రైతులకు తాము కౌలుకు చేస్తున్న భూముల మీద ఎట్టి జిరాయితీ హక్కు లేదు. ఎప్పుడు పడితే అప్పుడు భూస్వాములు కౌలు రైతులను తొలగించి ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకొనే స్థితిలోనే వున్నారు. కొంతవరకు దేవాలయ భూముల మీద పండిన పంటలో సగం కట్టుకుంటూ అనుభవిస్తూ వచ్చిన కౌలుదార్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన



కొత్త చట్టం దేవాలయ భూములను మినహాయించడంతో ఈ హక్కును కూడా లేకుండా చేస్తూ వుంది.

కౌలు రేటు పండిన పంటలో సగం కన్నా ఎక్కువ ఉండకూడదని పాత చట్టంలో వుండేది. కాని అది ఎక్కడా అమలులోనికి రాలేదు. నేడు కొత్త చట్టంలో కౌలు రేటును మెట్ట భూములలో నాల్గవ వంతు, మాగాణి భూములలో 30 శాతం అని నిర్ణయించినా అది ఆచరణలో నిరుపయోగమయింది. కౌలుదార్లను ఆ రీతిగా నమోదు చేసే ప్రభుత్వ రికార్డులేవీ లేవు.

1946–51 మధ్య జరిగిన తెలంగాణా పోరాట ఫలితంగా ఆనాటి ప్రభుత్వం తెలంగాణాలో ఆనాటికున్న కౌలుదార్లను రక్షిత కౌలుదార్లని వారి స్వాధీనంలో వున్న భూములను తక్కువ ధరకు కొనుక్కోవడానికి అవకాశమిస్తూ తక్కువ కౌలు రేట్లు నిర్ణయించి, జిరాయితీ హక్కు కొంతవరకు యిచ్చింది. కాని అది కూడా అమలులోకి వచ్చేటప్పటికి సగం మందికి పైగానే భూమి నుండి తొలగించబడ్డారు.

నేడు ఆంధ్రప్రదేశ్‌లో కౌలు రేటు పండిన పంటలో సగం, నాల్గింట మూడు పాళ్ళకు పైగా వుంటూ వుంది. అనంతవరం గ్రామంలో ఎకరానికి సగటున 14 క్వింటాళ్ళు వరి ధాన్యం, 2 క్వింటాళ్ళు మినుములు పండితే దానిలో 12 క్వింటాళ్ళు ధాన్యాన్ని కౌలుగా యజమానికి కట్టవలసి వుంది. ప్రభుత్వానికి కట్టే శిస్తు తప్ప మిగిలిన వ్యవసాయ ఖర్చులన్నీ కౌలు రైతులే పెట్టుకోవాలి. భూమి తమ స్వంతమయితే ఇతర వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు, ప్రభుత్వ శిస్తు పోను, ఆ భూమి మీద తాను తన కుటుంబం కష్టపడి (ఇతర కూలీలను పెట్టుకోకుండా) తమ శ్రమ ఫలితంగా ఎకరానికి రు. 1400లు మిగుల్చుకోవడానికి సాధ్యమయ్యేది (క్వింటాలు ధాన్యం రూ. 90ల చొప్పున, క్వింటాలు మినుములు రు. 200 లు చొప్పున ధర ఉన్నప్పుడు) భూస్వామికి రు. 1100 విలువచేసే 12 క్వింటాళ్ళ ధాన్యం కట్టవలసి రావడంతో, తనకు మిగిలేది ఎకరానికి రు. 300ల కన్నా ఎక్కువ ఉండటం లేదు.

తనకు కౌలు భూమి అయినా ఉంటే ఎక్కువ రోజులు తప్పకుండా పని దొరుకుతుందని, పరపతి కూడా దినకూలీల కన్నా అదనంగా వుంటుందని, ఇతరుల చుట్టూ పని కోసం ప్రతి రోజూ తిరగనవసరం ఉండదని, పని చేసే రోజులకు దినకూలీ రేట్లు గిట్టుబాటవుతున్నా, భూమి కోసం తహతహపడి పోటీ పడుతూ, విపరీతమైన కౌలురేట్లు యిస్తున్నారు. అసలు భూమి లేనివారు, లేక నామకా చాలా కొద్ది భూమి వున్న కుటుంబాలు, గ్రామాలలో నూటికి 40– 50 మందిగా ఉన్నప్పుడు భూమి వారికి పంచినప్పుడు గాని, మరో వృత్తి చూపి నిరుద్యోగం లేకుండా చేసే వరకు గాని భూస్వాముల దగ్గర, వారి విపరీత కౌలు, కూలి దోపిడీకి లొంగి పనిచేయాల్సిన పరిస్థితి వీరికి తప్పదు. ఎన్ని చట్టాలు చేసినా, ఎంత ఖచ్చితంగా వానిని అమలు జరపడానికి పూనుకున్నా, తాత్కాలికంగా కొంత ఉపశమనం కలగవచ్చుగాని అసలు సమస్య కౌలు దోపిడీ కొనసాగుతూనే వుంటుంది.

భూపంపక పోరాటంలో పాల్గొని విజయవంతం చేసి, తమ భూమి హక్కు సాధించుకోవడానికి మెట్లుగా కౌలు రైతుల చైతన్యాన్ని, సంఘటనను పెంపొందించడానికి కూడా కౌలు రైతుల పాక్షిక సమస్యలను తీసుకొని మనం పని చేయాలి.

మధ్యతరగతి, పేద రైతులు సాగుచేస్తున్న కౌలు భూములను ఏ పరిస్థితులలోను భూస్వాములు స్వాధీనం చేసుకోరాదని, మనం వెనువెంటనే ఉద్యమాన్ని ప్రారంభించాలి. బేదఖళ్ళను వ్యతిరేకిస్తూ పోరాడాలి. కౌలురేటు ఫలసాయంలో నాల్గవవంతుకు మించి ఉండరాదని, కౌలు భూముల మీద సాగుదార్లకు జిరాయితీ హక్కు యిస్తూ చట్టం తేవాలని ఆందోళన జరపాలి. భూస్వాములకు నష్టపరిహారం ఇవ్వరాదనీ, ఒకవేళ నేటి ప్రభుత్వ చట్టాల ప్రకారం యివ్వవలసి వచ్చినా అది నామమాత్రంగా ఉండాలని, దానిని కౌలుదార్ల నుండి వసూలు చేయరాదనీ, ప్రభుత్వమే చెల్లించాలని మనం ఆందోళన చేయాలి. పట్టుబట్టి పోరాడి సాధించాలి.

ఈ కౌలు భూములు చిన్న భూకామందులవి అయితే పేద, మధ్యతరగతి రైతులవి అయితే వారు తిరిగి తామే కాయకష్టం చేసి సొంత సాగు చేసుకోవడానికి వస్తే నేడు కౌలుకు చేస్తున్న పేద, మధ్యతరగతి సాగుదారుకు, ఈ చిన్న భూకామందుకు ఇరువురి మధ్య సామరస్యంగా సమస్యను పరిష్కరించాలి. ఇలాంటి సందర్భాలలో చిన్న భూకామందు భూమిని కౌలు రైతుకు వదిలిపెట్టిన మేరకు, పూర్తి నష్ట పరిహారాన్ని మార్కెట్ ధరను ప్రభుత్వం ఆ చిన్న భూకామందుకు చెల్లించాలి.

ఆంధ్రప్రదేశాన్నంతా దృష్టిలో పెట్టుకున్నప్పుడు 10-15 ఎకరాలు మాగాణికి మించిగాని లేదా 20 -30 ఎకరాల మెట్టకు మించిగాని ఉన్నవారు భూస్వాములుగా ఉన్నారని ఇదే ధనిక రైతుకు భూస్వామికి మధ్య గీటు సీలింగు గుర్తు అని మనం పైన చూశాము. ఈ పరిమితిలో సగానికి లోపు వున్న వారిని మనం చిన్న భూకామందులని, పేద మధ్యతరగతి రైతు స్థాయిలో ఉన్న వారని పరిగణించాలి. సగానికి మించి - సీలింగు వరకున్న వారిని ధనిక రైతుగా పరిగణించవచ్చు. సీలింగు పరిమితి వివిధ ప్రాంతాలలో మారుతూ ఉండవచ్చు.

ఈ కౌలు రైతుల భూమిని కాపాడాలంటే, పైన వివరించిన రీతిగా హక్కులు సాధించాలంటే, కౌలు రైతుల పోరాటాన్ని వ్యవసాయ కార్మికులు, ఇతర పేద మధ్యతరగతి రైతులు బలపరిచేటట్లు మనం సమీకరించవలసి వుంటుంది. కౌలు రైతుల పోరాటం, వ్యవసాయ కార్మికులు పేద రైతులు భూమికోసం, భూస్వాములకు వ్యతిరేకంగా సాగించే పోరాటంలో ఒక భాగం మాత్రమే. కౌలు రైతులకు తాము సాగుచేస్తున్న భూముల మీద హక్కుతో పాటు, మనం భూస్వాముల భూములన్నింటినీ వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు, ఉచితంగా



పంచి పెట్టాలనే ఉద్యమాన్ని కూడా జతచేర్చి ఆందోళన పోరాటానికి పూనుకోవాలి. కౌలు రైతు హక్కును సాధించడం మన భూ పోరాటంలో విజయానికి ఒక మెట్టు అని మనం వీరిలో చైతన్యం కలిగించాలి.

కౌలురేటు నాల్గవవంతు తగ్గాలని మనం చేసే ఆందోళన ఆచరణలో అమలులోకి రావాలంటే కౌలు రైతును భూమి నుండి తొలగించకుండా గ్యారంటీ ఉండాలనీ, ఆ భూమి మీద కౌలు రైతుకు జిరాయితీ హక్కు కల్గించాలనీ పోరాడాలి. ఆ తదుపరి పట్టా హక్కు వచ్చినప్పుడే పూర్తిగా అతని మీద భూస్వామ్య దోపిడీ అంతమవుతుందని, కౌలు రైతు నిశ్చితంగా కనీస జీవిత భృతిని సాధించుకొని జీవించడానికి సాధ్యమవుతుందనే చైతన్యం కూడా మనం కల్గించాలి. కౌలు రైతు పండించిన పంటలో భాగం భూ యాజమాని అనే పేరుతో పరార్జితం అనుభవించడానికి ఎవ్వరికీ హక్కులేదు. "దున్నేవానిదే భూమి" అనే సత్యాన్ని ప్రజల అవగాహనకు తేవాలి.

# వ్యవసాయ కార్మికుల నికృష్ట పరిస్థితి : వారిపై జరిగే దోపిళ్ళు : వారి పోరాట నినాదాలు

వ్యవసాయ కార్మికులకు భూమి ఏమీ లేకపోవడం వలన భూస్వాములు, ధనిక రైతుల వద్ద రోజు కూలికిగాని, పాలేరుగా (జీత గాండ్రుగా)గాని పనిచేస్తున్నారు. ఏ రోజుకారోజు పడే శ్రమ ఫలితంగా జరిగే వస్తూత్పత్తిలో, వారు తయారు చేసే నూతన విలువలో చాలా కొద్దిభాగం మాత్రం వారికిచ్చి,చాలా ఎక్కువ భాగాన్ని భూ యజమాని కాజేస్తున్నారు.

## వ్యవసాయ కార్మికుని శ్రమ దోపిడి ఎంత?

దీనిని తెలుసుకొని, అతనికి న్యాయమైన కూలిరేటు ఎంత ఉండాలో నిర్ణయించడానికి సరియైన పద్ధతి ఈ క్రింద వివరించబడింది.

ఆయా వ్యవసాయ పంటలు పండే ప్రాంతాలలో ఒక సింగిలు కుటుంబం (భార్య భర్తపై ఆధారపడిన చిన్న బిడ్డలు తదితరులు), ఒక నాగలి, ఒక జత ఎడ్లతో లేదా జత దున్నలతో ఎన్ని యెకరాలు సంవత్సరం పొడవూ తమ సొంత కాయకష్టంతోను, ఒత్తిడి పని తరుణాలలో తాముగాక అదనంగా అవసరమయిన మేరకే రోజు కూలీలను పెట్టుకొని సాగు చేయగలడో, దానిని ఒక యూనిట్‌గా తీసుకోవాలి. తన కుటుంబ శ్రమను తన స్థిర పెట్టుబడులను పూర్తిగా వినియోగించుకోగల భూకమతంగా దీనిని పరిగణనలోకి తీసుకోవాలి. ఈ వ్యవసాయ కమతంలో ఎన్ని రకాల పంటలు సంవత్సరంలో పండించేది, ప్రతి ఒక్క పంటకు దానిని దున్ని గట్లు వేసి, చదును చేసి పైరు వేయడానికి తయారు చేయడం, నాటు వేయడం, కలుపు తీత, నీటి పారుదల, కోత నూర్పిడికి మొత్తం ఎన్ని రోజులు పట్టేది లెక్కవేయాలి. వివిధ పంటలలో వచ్చే ఫలసాయం, రైతులకు లభ్యమయ్యే ధరలతో, వాని ఆదాయం, గెదేలు వుంటే పాల మీద వచ్చే ఆదాయం కూరగాయలు ఆ వ్యవసాయానికి అనుబంధంగా వచ్చే ఇతర పనుల నుండి వచ్చే ఆదాయాలు కూడా లెక్కలోకి తీసుకోవాలి.



బండి, నాగలి, తదితర పనిముట్లు, ఎద్దులు ఇవి ఎన్ని ఏండ్లు పని చేస్తాయో చూసి, ఆదామాషాన సంవత్సరానికి ఖర్చు (అరుగుదల ఖర్చుగా) తీసుకోవాలి. దీనికి బదులుగా కొన్ని సందర్భాలలో నాగలి, బండ్లు, ఎడ్లు లేకుండా దుక్కికి బండి తొలుడికి రోజుకు, లేక ఎకరానికి ఇంత అని నిర్ణయించి పని గడువుకంటే దానికయ్యే ఖర్చును లెక్కలోకి తీసుకోవచ్చు. విత్తనాలు, ఎరువులు ఇతర ఖర్చులు మొత్తం ఎంత అయ్యేది లెక్కవేయాలి. వీనిని స్థిర పెట్టుబడి ఖర్చులు అని అంటాము.

కుటుంబ పని రోజులు గాని, పాలేర్ల దిన కూలిపని రోజులుగాని వారికిచ్చే జీతాలు కూలీ ఇందులో కలపకూడదు. ఒక్కొక్క పంటకు, ఎన్నెన్ని పని రోజులు పట్టేది, అన్ని పంటలకు సంవత్సరంలో ఈ వ్యవసాయాంతంలో ఎన్ని పని రోజులు పట్టిందీ వేరుగా లెక్కవేయాలి. మొత్తం ఫలసాయం ఖరీదు నుండి, స్థిర పెట్టుబడి ఖర్చులు పోను మిగిలిన మొత్తం, మొత్తం పని రోజుల ఫలితంగా తయారయిన నూతన విలువగా మనం పరిగణించాలి. ఒక పని రోజుకు ఎంత నూతన ఉత్పత్తి విలువను అది సృష్టిస్తుందో దీనిని బట్టి మనం గుణించవచ్చు.

న్యాయంగా భూమి మీద సాగుకు అందరికి హక్కు వుంటే ప్రతి ఒక్కరికి తన శ్రమ ఫలితంగా పూర్తిగా దక్కేది. ఆ రీతిగా వ్యవసాయ కార్మికునికి అతనికి న్యాయంగా రావలసిన శ్రమ ఫలితాన్ని కూలిరేటుగా ఇవ్వడం లేదు. అందులో కొద్ది భాగం మాత్రమే భూ యజమాని అతనికిస్తున్నాడు. మిగిలినది తాను మిగుల్చుకుంటున్నాడు. ఇలా మిగుల్చుకున్న మొత్తాన్నే మనము అదనపు విలువ లేదా దోపిడి అంటాము. వ్యవసాయ కార్మికునికి శ్రమ ఫలితం నుండే కూలి, జీతం యివ్వగా మిగిలిన అదనపు విలువలో నుండే ప్రభుత్వానికి శిస్తు కట్టడం గాని, వ్యవసాయానికని తాను తెచ్చిన పెట్టుబడి అప్పులకు చెల్లించే వడ్డీగాని కట్టుతున్నాడు. ప్రభుత్వానికి కట్టవలసిన శిస్తుగాని, పెట్టుబడిగా తెచ్చిన మొత్తానికి కట్టవలసిన వడ్డీని కూడా మనం వ్యవసాయం ఖర్చుల క్రింద మినహాయించి, ఒక రోజు శ్రమ ఫలితం చూచినా, నేడు యిస్తున్న రోజు కూలి పాలేర్ల జీతాలు చాలా తక్కువగా ఉన్నాయనేది. ఎక్కువ భాగం భూ యజమాని మిగుల్చుకుంటున్నాడనేది స్పష్టం.

ఉదాహరణకు కృష్ణా, గుంటూరు డెల్టా గ్రామాలలో, ఒక పంట వరి, రెండవ పంట మినుము లేదా పెసర వేసే మంచి మాగాణి భూమి ఒక నాగలి ఒక జత ఎడ్లతో 10 ఎకరాలు సాగు చేయడం జరుగుతూ వుంది. దానిని ఆధారంగా జేసుకుని ఒక ఎకరానికి కావలసిన పని రోజులు, అయ్యే స్థిర పెట్టుబడి, ఖర్చులు వచ్చే ఫలసాయం, ఒక పని రోజుకు తయారయ్యే నూతన ఉత్పత్తి విలువ 1974 జనవరి మార్చి నెలలో ఈ క్రింది విధంగా వుంది.

| | పనిరోజులు |
|---|---|
| గట్టు వేయడానికి చదును చేయడానికి | 5 |
| దుక్కికి | 3 |
| నారు పెంచడానికి | 3 |
| నారు పీకి తిరిగి నాటడానికి | 12 |
| ఎరువు వెదజల్లడానికి | 2 |
| నీరు పెట్టడం కలుపుతీత | 10 |
| కోత కట్టివేత మార్పిడి | 20 |
| వగైరా ఇతర చిల్లర పనులు | 5 |
| చిన్న పశువుల కాపరి | 10 |
| | --- |
| మొత్తం పని రోజులు ఒక ఎకరం వరి పైరుకు | 70 |

**రెండవ పంట :** మినుము పెసర

| | |
|---|---|
| మినుము విత్తనాలు వేయడానికి | 1 |
| క్రిమి సంహారక మందు వెదజల్లడానికి | 1 |
| కలుపుతీత, పీకుడు, పోగు చేయడం, | |
| వేయడం, నూర్పిడి | 13 |
| చిల్లర పనులు | 5 |
| | --- |
| మొత్తం ఎకరానికి పని రోజులు | 90 |
| | --- |

ఇతర పెట్టుబడి ఖర్చులు

| | |
|---|---|
| ఎడ్ల జత 2000 – (10 ఏండ్ల జీవితం) | |
| ఎకరానికి సంవత్సరానికి | 20/- |
| ఎకరానికి సంవత్సరానికి | |
| బండి పనిముట్లు 1500/- (15 ఏండ్లు వస్తాయి) | |
| ఎకరానికి సంవత్సరానికి | 10/- |
| 10 కిలోల వరి విత్తనాలు | 10/- |
| 50 కిలోల సూపర్ ఫాస్పేట్ | |
| యూరియా బస్తాలో నాల్గవవంతు (12.5 కిలోలు) | 100/- |
| తెగుళ్ళకు మందు | 10/- |



| | |
|---|---|
| ఎడ్లకు గడ్డిపోను ఉలవలు వగైరా | 25/- |
| శిస్తు | 40/- |
| ఇతర ఖర్చులు | 5/- |
| | ----- |
| వరి పంటకు మొత్తం ఖర్చు | 220/- |
| మినుములు విత్తనం 15 కిలోలు | 30/- |
| తెగుళ్ళ మందు | 10/- |
| | ----- |
| మొత్తం | 260/- |
| | |
| వచ్చిన పంటల రాబడి ఖరీదు | |
| ఎకరానికి 14 క్వింటాల్సు ధాన్యం | 1200/- |
| | |
| క్వింటాలు రూ. 90 వంతున | |
| ఎకరానికి 2 బస్తాల మినుములు | |
| క్వింటాలు రూ. 200 | 400/- |
| | ----- |
| మొత్తం | 1600 |
| ఒక రోజు పని నూతన ఉత్పత్తి విలువ | 1660-260 |
| | --------- |
| | 90 = రు. 15.5/- |

నేడు పని ఒత్తిడి రోజులలో, నారు వేతలలో, కోతలలో 4 రూ.లు కూలీ యిచ్చినా యితర రోజులలో రెండు రూపాయల కన్న హెచ్చు యివ్వడం లేదు. అందుచేత వ్యవసాయ కార్మికునికి రోజు కూలి ఈ ప్రాంతంలో ఎప్పుడూ 5 రూ.లకు తగ్గకుండా పని ఒత్తిడి రోజులలో 8 రూ. మొదలు 10రూ. వరకూ కూడా మనం అడిగి సాధించుకోవడానికి పోరాడడం న్యాయమే అవుతుంది.

మన వ్యవసాయ కార్మిక సంఘం కనీసం రోజుకు మామూలు పని రోజులలో 6 కిలోలు వరి ధాన్యం గాని లేదా 5 కిలోలు జొన్నలు గట్టి గింజ.లు గాని వానికి ఖరీదు కట్టి రూపాయలలో గాని వ్యవసాయ కార్మికుని అభీష్ట ప్రకారం ఇవ్వాలని డిమాండు పెట్టింది. ముమ్మరమైన పని రోజులలో ఇంతకన్న అదనంగా డిమాండు పెట్టడం న్యాయమైనదేనని

నిర్ణయించింది. ఆందోళనా పోరాటాలు సాగిస్తూ వుంది. ఇంతవరకు ధాన్యంలో యిచ్చే ప్రాంతాలలో కూడా ఇప్పుడు ధాన్యం ఇవ్వకుండా నగదులో తక్కువ కూలిరేటు ఇచ్చి ఆ తర్వాత హెచ్చు ధరలకు పంట గింజలు అమ్ముకొని మరింత లాభాలు గడించాలని భూస్వాములు ఈ మార్పును ప్రవేశపెట్టారు.

అనంతవరం, కాజ గ్రామాలలో రోజు కూలి సగటున రు.2-50 వంతున గిట్టుబాటవుతూంది. ఆ కూలి ఇచ్చిన తర్వాత భూస్వామి ప్రతి వ్యవసాయ కార్మికుని రోజు పని నుండి రు.1300 లు అదనపు విలువ భుక్తం చేసుకొంటూ వున్నారు.

## పనిరోజులు

అనంతవరం, కాజ గ్రామాలలో వ్యవసాయ కార్మికులకు, పేద, మధ్య తరగతి రైతులకు ఆ స్థాయి ఆదాయాలు వచ్చే ఇతర వృత్తులలోనున్న కుటుంబాలకు సంవత్సరానికి కుటుంబానికి పని దొరికే రోజులు యెన్ని పరిశీలిస్తే ఈ క్రింది భోగట్టా వచ్చింది.

| | అనంతవరం గ్రామంలో పని దొరికే | | కాజ గ్రామంలో పని దొరికే | |
|---|---|---|---|---|
| వర్గం | కుటుంబాల సంఖ్య | రోజులు సగటున కుటుంబానికి | కుటుంబాల సంఖ్య | రోజులు సగటున కుటుంబానికి |
| దిన కూలీలు ఆ స్థాయి వృత్తిదారులు | 295 | 242 | 259 | 261 |
| పేద రైతులు | 77 | 190 | 203 | 170 |
| పేద స్థాయి వృత్తిదార్లు | 55 | 311 | 108 | 345 |
| మధ్యతరగతి రైతులు | 65 | 191 | 175 | 205 |
| మధ్యస్థాయి వృత్తిదారులు | 49 | 341 | 86 | 405 |
| పాలేర్లు | 51 | 557 | 16 | 608 |



వ్యవసాయ కార్మికులు, పాలేర్లు, పేదరైతు కుటుంబాలలో ప్రతి కుటుంబంలోనూ భార్యా భర్తలిద్దరూ పనిచేసేవారుగా వుంటున్నారు. కొన్ని కుటుంబాలలో పిల్లలు కూడా పనిచేస్తున్నారు. సగటున కుటుంబానికి ఇద్దరు పనిచేసే వారున్నారు. అనంతవరంలో మధ్యతరగతి రైతు కుటుంబాలలో సగం కుటుంబాలలోనే స్త్రీలు పనిచేస్తున్నారు. కాజ గ్రామంలో మధ్యతరగతి కుటుంబాలలోని స్త్రీలు కూడా పనిచేస్తున్నారు.

వారానికి ఒక రోజు వంతున సెలవు. పండుగ సెలవులు తీసివేస్తే మిగిలిన 300 రోజులలో పనివుంటేనే పూర్తిగా పనిదొరికినట్లు లెక్క. పారిశ్రామిక కార్మికులకు ప్రతి ఆదివారమూ సెలవులే గాక సంవత్సరానికి మరో 30 రోజులు, జబ్బు పడినప్పుడే లేదా ఇతర సందర్భాల్లో నిండు జీతంతో సెలవులు దొరుకుతున్నాయి. వారు 275 రోజులు పనిచేస్తే పూర్తి పని ఉన్నట్లు లెక్క. ప్రభుత్వ ఆఫీసులలో పనిచేసేవారికి మరో నెల రోజులు అదనంగా సెలవులున్నాయి (నిండు జీతంతో).

వ్యవసాయ కార్మికునికి పనిచేసే రోజుకే కూలి ఇస్తారు. జీతమిచ్చే సెలవులిచ్చే సమస్యలేదు. పాలేర్లకు సంవత్సరం మొత్తానికి ఇన్ని బస్తాలు ధాన్యం, ఇంత నగదు అని జీతాలేర్పాటు చేస్తున్నారు కాని సెలవులివ్వడం లేదు. అందుచే వారు 365 రోజులు పని చేయాల్సి వుంటున్నది. జబ్బు పడి మానివేసినా, మరే అవసరం వచ్చి మానివేసినా జీతాన్నుండి ఆ రోజులకు కోతకోస్తారు. అందుచేతనే పాలేర్లకు సంవత్సరానికి వెంటనే 30 రోజులయినా సెలవులివ్వాలని మన వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతూ వుంది.

అందుచే వ్యవసాయ కార్మిక కుటుంబానికి భార్యా భర్తలకు కలిసి 600 రోజులు పని వుండాలని కాని, ఇరువురికి కలసి 240 - 260 రోజుల కన్న పని దొరకడం లేదు. అంటే అర్థపని కూడా దొరకడం లేదు. ఇందులోను పురుషునికి దొరికేపని రోజులలో సగం రోజులే స్త్రీలకు దొరుకుతూ వుంది.

పేద రైతులకు కూడా 170 -200 రోజుల కన్న ఎక్కువ పని దొరకడం లేదు. ఇతర వృత్తులలో పనిచేసేవారికి పేద రైతు స్థాయి ఆదాయం గడించేవారికి 300-350 రోజులు మాత్రమే పని దొరుకుతూ వుంది.

ఒక్క పాలేర్ల కుటుంబాలకు మాత్రం 550 - 600 రోజులు పని దొరుకుతూ వుంది. పాలేర్ల పని దినాలు 365 రోజులు పోను కుటుంబంలోని స్త్రీకి, బిడ్డలకు 190-240 రోజులు మాత్రమే పని దొరుకుతూ వుంది. పాలేర్ల కుటుంబాలకు సంవత్సరం పొడుగునా పని ఉండడం వలన ఆ కుటుంబాలకు రు.1740 లు ఆదాయం వస్తూ వుంది. రోజుకు రు. 2-90 లు గిట్టుబాటు అవుతూ వుంది. కాని దినకూలీలకు కూడా ఇంచుమించు పనిచేసే రోజుకు ఆ రేటే వున్నా వారి పనిరోజులు తక్కువ కాబట్టి సగటు రు.740 లు మాత్రమే వస్తూ వుంది. రు. 1000 లకు మించి ఎవరికీ రావడం లేదు.

పేద, మధ్య తరగతి రైతులకు పని రోజులు తక్కువయినా, తమకున్న భూమి మీదవచ్చే ఆదాయం వల్ల ప్రతి రోజుకు ఎక్కువ గిట్టుబాటయి రు.1000 ల నుండి 1500 రూ. వరకు పేద రైతుకు, రు. 1500 -3000 వరకు మధ్యతరగతి రైతుకు ఆదాయం వస్తూ వుంది. పేద మధ్యతరగతి రైతులకు సంవత్సరం పొడుగూ పనిచేసుకోడానికి సరిపోను భూమి యివ్వడం సాధ్యం కాదు. కాని ఒక పంటకు బదులు రెండు లేదా మూడు పంటలు పండించడానికి కావలసిన సదుపాయాలు, ఇతర ఉపవృత్తులు కలుగజేస్తే వారి ఆదాయం పెరిగి వారి జీవన పరిస్థితి ఎంతో మెరుగవడానికి వీలుపడుతుంది.

పని లేనివారు ఎక్కువయినందున, పోటీ ఎక్కువై భూస్వాములిచ్చే తక్కువ కూలికి పనిచేయవలసి వస్తుంది. సంఘటితపడి సమ్మెలు చేసి కొంత కూలి రేట్లు పెంచుకున్నా తిరిగి, తిరిగి వానిని తగ్గిస్తూనే వుంటారు. కూలిరేట్లకు పెంచుకున్నా భూస్వాములు, ధనిక రైతులు మా వద్ద పనిలేదని తక్కువ రోజులకు పని చూపుతారు.

అందుచేత కూలీ రేట్లు పెంచుకోవడంతో పాటు సంవత్సరం పొడుగూ 300 రోజులు పని చూపించాలని, పని చూపని రోజుకు గ్రామంలోని భూస్వాములు నిరుద్యోగ భృతిగా వ్యవసాయ కార్మికుని కుటుంబానికి రోజుకు ఒకశేరు (కిలో) బియ్యంగాని లేదా ఒక శేరు గట్టి గింజలుగాని ఇవ్వాలని ఆందోళన చేయాలి. పోరాడాలి. భూస్వాముల నుండి వారి దోపిడీ నిలువల నుండి దీనికి సరిపోను ధాన్యాన్ని గట్టి గింజలను ప్రభుత్వం ఎకరాల దామాషాన నిర్బంధంగా వసూలు చేసి పనిలేని కుటుంబాలకు ఉచితంగా పంచిపెట్టాలి.

అలా పని చూపించమని, పనిచూపే లోపు నిరుద్యోగభృతిని ఇవ్వమని ఆందోళన చేస్తూ పోరాడుతూ, అసలు సోమరులయి కాయకష్టం చేసి సొంతంగా సాగుచేయని భూస్వాములకు భూములుండడం న్యాయం కాదని, ఆ భూములను వ్యవసాయ కార్మికులకు, కుటుంబ పోషణకు ఏ మాత్రం చాలని కొద్దిపాటి భూములన్న పేద రైతులకు ఈ భూములను ఉచితంగా పంచిపెట్టాలని ఆందోళన ఉద్యమాన్ని ప్రారంభించాలి.

గ్రామ సీమల్లోని నిరుద్యోగం పోవాలంటే భూమిని పంచాలి. గ్రామీణ ప్రజల జీవనోపాధి భూమి. అది కొద్ది మంది చేతుల్లో కేంద్రీకరించబడి వుంది. అనంతవరం గ్రామంలో 10 శాతం భూస్వామి కుటుంబాల చేతులలో 70 శాతం భూమి వుంది. కాజలో 3 శాతం భూస్వామి కుటుంబాల, చేతులలో 24 శాతం భూమి వుంది. ఆంధ్రప్రదేశ్ మొత్తంగా చూస్తే 5 శాతం భూస్వాముల చేతులలో 45 శాతం భూమి వుంది. ఈ భూమినంతా వ్యవసాయ కార్మికులకు పేద రైతులకు ఉచితంగా పంచినప్పుడే నిరుద్యోగ సమస్య. వీరి జీవన సమస్య పరిష్కారమవుతుంది.

కూలీ రేటును, జీతాలను పెంచుకొనే పోరాటం భూపంపక పోరాటానికి దారితీస్తే ప్రాథమిక పోరాటం మాత్రమే. వ్యవసాయ కార్మికులు ఎప్పుడూ ఇతరుల క్రింద కూలి బానిసలుగా ఆధారపడి బ్రతికే స్థితి నుండి బయటపడాలి. భూమిని దున్నుకొన్న తమ శ్రమ ఫలితాన్ని



పూర్తిగా అనుభవిస్తూ స్వతంత్ర జీవులుగా బ్రతకాలి. దానికోసం జనతా ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకొని, ఆ పైన సోషలిస్టు సమాజాన్ని నిర్మించుకోడానికి పూనుకోవాలి. భూమి కొద్దిమంది వ్యక్తుల చేతులలో వ్యక్తిగత సొంత ఆస్తిగాకుండా, దున్నుకునే వానిదే భూమిగా సమిష్టిగా ప్రజలందరి సొత్తుగా ఆ సమాజంలో వుంటుంది.

ఈ రెండు గ్రామాలలోను వ్యవసాయ కార్మిక కుటుంబాలకు సంవత్సరానికి రూ. 710-730ల కన్నా సగటున రావడం లేదు. తలసరి 60 పైసలు మాత్రమే దినానికి వస్తుంది. వారి ఆదాయ పరిమితులు రు. 600ల నుండి రూ. 900ల వరకు ఉంటూ వుంది. పాలేర్లకు రెండు గ్రామాలలోను సగటున కుటుంబానికి రు. 1730లు వస్తూ వుంది.

పేద రైతులు, ఆ స్థాయిలో ఆదాయం వచ్చే వృత్తిదారుల కుటుంబాలకు రు. 900లు మొదలు రు. 1800 వరకు వస్తూ వుంది. సగటున కాజ గ్రామంలో రు. 1090లు (దినసరి తలకు 83 పైసలు) అనంతవరంలో రు. 1310లు (తలకు 97 పైసలు) వస్తూ వుంది.

మధ్యతరగతి రైతులకు, వృత్తిదారులకు సగటున రు. 2000-2165ల వంతున ఈ గ్రామాలలో వస్తూ వుంది. దినసరి తలకు ఆదాయం 1-24, రు. 1-92ల వరకు వస్తుంది. ఆదాయ పరిమితి రు. 1800-3600 వరకు వుంటుంది.

ధనిక రైతు కుటుంబానికి కాజ గ్రామంలో సంవత్సరానికి రు. 4020లు (దినసరి తలకు రు. 2.30లు) వస్తే అనంతవరంలో రు. 5620లు (దినసరి తలకు రు.3.73లు) వస్తూ వుంది. ధనిక కుటుంబాల ఆదాయ పరిమితి రు. 3600లకు పైగా రు. 900ల వరకూ ఉంటూ వుంది.

భూస్వాములకు సగటున కుటుంబానికి కాజ గ్రామంలో రు. 13370లు వస్తూ వుంటే అనంతవరంలో రు. 18320లు వస్తూ వుంది. రెండు గ్రామాలలోను పెద్ద భూస్వాములకు తక్కువ. ఆదాయం వచ్చే వ్యవసాయ కార్మిక కుటుంబాల కన్నా 60 రెట్లు ఆదాయం వస్తూ వుంది.

ఈ ఆదాయాలను పరిశీలిస్తే మనకు ముఖ్యంగా కనపడేది ఒక రూపాయి లోపు దినసరి తలకు ఆదాయమున్న కుటుంబాలు నూటికి 55-58 వంతున వున్నాయి. రూపాయి-రెండు రూపాయల మధ్య ఆదాయం వచ్చే కుటుంబాలు నూటికి 20-25 వంతున వుంటున్నాయి.

సంవత్సరానికి రూ. 3600లకు మించి ఆదాయం వచ్చే కుటుంబాలు (తలకు దినసరి రు. 2-00, 2-50లకు మించి వచ్చే కుటుంబాలు) కాజ గ్రామంలో 17 శాతం, అనంతవరంలో 25 శాతం వుంటున్నాయి.

కనీస జీవితావసరాలకు సరిపడే జీతాలు : 1955లో ఫ్యాక్టరీ యజమానులు, ప్రభుత్వ ప్రతినిధులు, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు 15వ త్రైపాక్షిక కార్మిక సమావేశంలో కనీస జీవితావసరాలు ఏమిటో విశదీకరించారు. వాటికి సరిపడే జీతాలు ఇవ్వడానికి కృషి చేయాలని అంగీకారానికి వచ్చారు. దాని ప్రకారము ఒక కుటుంబంలో సామాన్యంగా పురుషుడు, అతని భార్య, ఇద్దరు బిడ్డలు వుంటారు. ఆ కుటుంబాన్ని ముగ్గురు పెద్ద తలలున్న (మూడు యూనిట్లు వున్న) కుటుంబంగా పరిగణించాలి. ఆ ముగ్గురు జీవనానికి అవసరమైన జీతమే ఏ ఒక్కరికి పని దొరికినా కనీస జీతంగా ఇవ్వడానికి కృషి చేయాలని విశదీకరించారు.

వారు వివరించిన ఆహారంలో మాంసాహారం తీసివేసి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ శాకాహారాన్ని సూచించింది. దాని మేరకు అయినా గ్రామాలలో 1974 ఆరంభంలో అయ్యే ఖరీదు ఈ క్రింద ఇవ్వబడింది.

2700 కాలరీలు ప్రతి పెద్ద తలకు ఒక యూనిటుకు కావాలి. దాని కోసం మూడు యూనిట్ల కుటుంబానికి రోజుకు రూ. 10 నెలకు రు. 300లు అవుతుంది.

| | | రేటు | కిలో ఖరీదు |
|---|---|---|---|
| బియ్యం, గోధుమలు, జొన్నలు వగైరా | 475 గ్రాములు | 2/- | 95 పైసలు |
| పప్పులు | 70 గ్రాములు | 3/- | 25 పైసలు |
| నూనె | 40 గ్రాములు | 7.5/- | 30 పైసలు |
| చక్కెర లేదా బెల్లం | 40 గ్రాములు | 2.5/- | 10 పైసలు |
| కాయగూరలు | 250 గ్రాములు | 1/- | 25 పైసలు |
| పాలు | 200 గ్రాములు | 1/- | 20 పైసలు |
| ఉప్పు, కారం, మసాలా, కట్టెలు వగైరా | | | 25 పైసలు |
| ఆహారం ఖర్చులు | | | 2.40 పైసలు |
| గుడ్డలు 16 మి.మీ. 3 రూ. వంతున దినానికి | | | 15 పైసలు |
| మందులు, పండుగలు, చదువులు తదితర ఖర్చులు ఇంటి మరమ్మతులు | | | 75 పైసలు |
| మొత్తం ఒక యూనిట్‌కు, ఒక పెద్ద తలకు | | | 3.30 రోజుకు |



అంటే ఈ రెండు గ్రామాలలోను కేవలం ధనిక రైతులు భూస్వాములు మాత్రం కనీస జీవితావసరాలకు కావలసిన ఆదాయం పొందుతున్నారు. మిగిలిన 75.80 శాతం లోటు జీవితం గడుపుతున్నారు.

ఆహారాన్ని కుదించుకుని అంటే పాలు, నూనె, బెల్లం, కాయగూరలు, పప్పు దినుసులు నాల్గింట మూడు పాళ్ళు తగ్గించుకొని ఆహార కాలరీలను రెండు వేల వరకే రోజుకు తీసుకున్నా ఒక్క ఆహారం ఖర్చే రోజుకు పెద్ద తలకు రు. 1.60లు (ఒక్క రూపాయి అరవై పైసలు) అవుతుంది. కుటుంబానికి తిండి ఖర్చే రోజుకు సుమారు 5 రూపాయలు అవుతుంది. సంవత్సరానికి రు. 1800 అవుతుంది. తిండి ఖర్చుకు కూడా లేక జీవితం గడిపేవారిని మాత్రమే దరిద్రులని, ఇందిరగాంధీ ప్రభుత్వం గుర్తిస్తున్నది. ఇలాంటి కటిక దరిద్రులుగా వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, గ్రామాలలోని ఇతర పేదలు, గ్రామ జనాభాలో నూటికి 60 మంది జీవిస్తున్నారని, ఈ గ్రామాల పరిశీలన తెలియజేస్తూ వుంది.

వీరికి కనీస జీవిత స్థాయిని కల్గించాలంటే అదనంగా పని చూపించాలి. ఆ పని చూపే వరకు నిరుద్యోగ భృతి క్రింద తిండి గింజలు భూస్వాములు సరఫరా చేసేటట్లు చూడాలి. అసలు పరిష్కార మార్గం భూస్వాముల భూములన్నిటిని వీరికి ఉచితంగా పంచిపెట్టి శ్రమ ఫలితాన్నంతా దున్ని సాగుచేసుకొనే వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు దక్కేటట్లు చూడటం తప్ప మరో మార్గం లేదు.

# భూమిపై హక్కు దున్నేవానిదే భూస్వామిది కాదు

మన పేద ప్రజలలో భూమి భూస్వాములదని, ధనిక రైతులదని, ఆదిమకాలం నుండి వారికి దేవుడిచ్చినదని, వారి సొంత ఆస్తి అని, దాని జోలికిపోయి తమకూ హక్కు వుందని కోరడం తప్పు. పాపం అని అనుకునేవారున్నారు. తరతరాలుగా పెత్తందార్లు ఇలాంటి ప్రచారం చేస్తూ వచ్చారు. పేదప్రజలలో నరనరాన జీర్ణించుకుపోయేట్లు మతం పేరుతో, శాస్త్రాల పేరుతో ఖర్మ సిద్ధాంతాన్నీ, దోపిడీ సిద్ధాంతాన్ని వీరు ప్రచారం చేస్తూ వచ్చారు. దానిని వ్యతిరేకించి దున్నే వానికే భూమి మీద హక్కు అనే వారిని ఆయా కాలాల నాటి ప్రభుత్వాలు బలప్రయోగంతో అణగద్రొక్కుతూ వచ్చాయి.

అయితే ఇది సహజంగా ఏర్పడినది కాదు. మానవుడు తోటి మానవుణ్ణి కృత్రిమంగా దోచుకోవడానికి పన్నిన పన్నాగాలే ఇవి.

మానవుడు పరిణామం చెందుతూ వచ్చినపుడు మొదట అడవులలో చెట్ల మీద నివసిస్తూ వచ్చాడు. పండ్లు, గింజలు, దుంపలు అతని ప్రధాన ఆహారం. ఆ తర్వాత కాలంలో నిప్పు, దాని ప్రయోజనాన్ని గుర్తించడంలో చేపలు, తదితర నీటి జంతువులను ఆహారంగా తీసుకోవడం ప్రారంభమయింది. దీనితో నదీ తీరాలను ఆధారం చేసుకొని, అడవుల మీదనే ఆధారపడకుండా విస్తృత నివాస స్థలాలకు మానవ జాతి వ్యాపించింది. పాతకాలపు బండరాతి పనిముట్లు ఈ దశకు చెందినవే. బండకొయ్యను, రాతి యీటెలను చేసుకోవడంతో వాటితో జంతువులను వేటాడి నిప్పులో కాల్చుకుని తినడం కూడా మొదలుపెట్టాడు. ఆ తర్వాత దశలో విల్లంబులను తయారుచేసుకున్న తర్వాత, వేటాడి జంతు ఆహారం ఒక నిత్య కార్యక్రమంగా చేసుకున్నాడు. అప్పటికి మట్టి పాత్రలు, కుండలను తయారు చేసుకోలేదు. చిన్న చిన్న గుంపులుగా చిన్న చిన్న గూడేలలో నివసించడం మొదలుపెట్టాడు. కొయ్యపాత్రలు, రెల్లు, సన్నని తీగలతో బుట్టలు, చాపలు చేతితో అల్లడం (మగ్గం ఇంకా తయారు చేసుకోలేదు). పదును చేసిన కొత్తరాతి పనిముట్లు రాతి గొడ్డలి ఉపయోగించడం జరిగింది. (మానులు తొలచి, పడవలను, ఇండ్లు కట్టుకోవడానికి మొద్దులను, పలకలను కూడా చేయడం మొదలుపెట్టాడు).



ఆ తర్వాత యుగం మట్టి కుండలు తయారు చేసుకోవడంతో ప్రారంభమయింది. క్రమంగా పశువులను మచ్చిక చేసుకొని వానిని పాల కోసం, మాంసం కోసం పెంచడం ప్రారంభించారు. అనిశ్చితంగా అడవులలో వెదకి ఏరుకొన్న పండ్లు, గింజలు వేటాడి సాధించిన జంతువుల ఆహారం కన్నా పశువుల మందలను పెంచడం మరింత తేలికగా ఆహారం సంపాదించుకోవడానికి వీలయింది. ఇది ఆసియా యూరప్‌లోని విశాల పచ్చిక బీళ్ళ ప్రాంతాలలో ప్రధానంగా కన్పడుతూ వుంది. అప్పటికి ఇంకా వ్యవసాయం ఆరంభం కాలేదు. పశువులను పెంచడానికి పచ్చిక బీళ్ళను, ఆహార పంట గింజలను మొదలుపెట్టారు. ఆ తర్వాత ఆ పంట గింజలను మానవుడు తన ప్రధాన ఆహారంగా చేసుకున్నాడు.

క్రమంగా రాగి, తగరము కనుక్కోవడం కంచు తయారు చేసుకోవడం, కంచుతో ఆయుధాలు, పనిముట్లు చేసుకోవడం జరిగింది. దీనితో వ్యవసాయం అభివృద్ధి కావడం జరిగింది. ఆ తర్వాత ఇనుమును తయారు చేసుకోవడానికి మరికొన్ని వందల సంవత్సరాలు పట్టింది. ఇనుము, ఇనుప పనిముట్లు తయారు చేసుకోవడంతోనే రాతి పనిముట్లు, కంచు పనిముట్లు పోయాయి. ఇనుముతో ఇనుప నాగలి, నాగలికి పశువులను కట్టి దున్నడం, ఇనుప పారలనే వానితో వ్యవసాయం పెద్ద ఎత్తున సాధ్యమైంది. అడవులకు నిప్పు పెట్టి తగుల వేసి, వ్యవసాయానికి తేవడంతో పాటు, మొద్దులను త్రవ్వడం, నరకడం ఇనుప పనిముట్లతోనే సాధ్యమైంది. ఇనుప యుగంతో పాటు కమ్మరి కొలిమితిత్తులు, కుమ్మరి కుండలు చేసే చక్రం తిరుగలి (Hand Mill) బండ్లు, యుద్ధానికి రథాలు, నౌక నిర్మాణము, గృహ నిర్మాణం, పట్టణ నిర్మాణం అభివృద్ధి చెందాయి. జనాభా కూడా పెద్దగా పెరిగింది.

మానవుని పరిణామము 20 లక్షల ఏండ్లకు పైగా ఈ రీతిలో జరుగుతూ వచ్చినా, మానవుడు పశువులను పెంచడం, కొన్ని తెగలు దీనిని ప్రధాన పనిగా చేసుకోవడం లాంటి ఈ మొదటి సమాజ పని విభజన మానవ జాతిలో పదివేల సంవత్సరాల క్రితం మాత్రమే జరిగింది. వ్యవసాయం ఆ తర్వాత అభివృద్ధి చెందింది.

ఉత్పత్తి సాధనాలు అభివృద్ధి చెందే కొద్ది జనాభా పెరిగే కొద్ది తెగల సమాజం అభివృద్ధి చెందింది. ఒక తెగలో కొన్ని గణాలు, ప్రతి గణంలో కొన్ని కుటుంబాలుండేవి. కుటుంబం అంటే ఒక మాతృస్వామిక కుటుంబం. ఒక తల్లి, ఆమె అక్క చెల్లెండ్రు, వారి సంతానం ఒక కుటుంబం. సాగు చేయబడిన భూమి ఆ మాతృస్వామిక దశలో ఆ తెగకంతా చెందినదే. ఆ తెగలో భూమిని వివిధ గణాల మధ్య, వివిధ గణాలలోని వివిధ కుటుంబాల మధ్య సాగు చేయడానికి విభజించి ఇచ్చేది. ఈ భూ విభజన కూడా గణ సంఖ్య, కుటుంబ సంఖ్య మారే కొద్ది తరచు పునర్విభజన చేసి భాగాలు ఆ తెగ పెద్దలు చేసేవారు. గణాలకు గాని ఒక గణంలోని కుటుంబాలకు గాని ఆ భూమిపై సొంత ఆస్తి హక్కు వుండేది కాదు. వచ్చిన పంటను ఆ గణం తెగ అనుభవించేది.

ఉత్పత్తి అభివృద్ధి అయి, ఒక తెగకు మరొక తెగకు మధ్య మిగులు వస్తువులు మార్పిడి పెరిగే కొద్ది, పశువుల మందలు అభివృద్ధి కావడం, వ్యవసాయం అభివృద్ధి కావడం, చేతి వృత్తులు అభివృద్ధి కావడంతో ఒక గణం, ఒక కుటుంబంలో ప్రతి వ్యక్తి చేయవలసిన పని ఎక్కువయింది. అందుచే ఈ పెరుగుతున్న పని చేయడానికి అదనపు శ్రమ శక్తి, అదనపు మనుష్యులు కావలసి వచ్చింది. ఒక తెగ మరో తెగతో పోరాటాలు చేసేటప్పుడు ఖైదీలుగా పట్టుకున్న వారిని బానిసలుగా చేసి పని చేయించుకోవడం జరిగింది.

ఈ ఉత్పత్తి, బానిసలు పెరిగే కొద్ది మాతృస్వామిక తెగలు, పితృస్వామిక తెగలుగా మార్పు చెందాయి. తల్లి పారంపర్యంగా వచ్చే హక్కు స్థానాన తండ్రి పారంపర్య హక్కు ఏర్పాటు చేయడం జరిగింది. పశువులను మచ్చిక చేసి మందలు పెంచే పని మొదటి నుండీ పురుషులు చేస్తూ వచ్చారు. ఒక తెగతో మరో తెగ తాము నివసించే అడవి ప్రాంతాన్ని కాపాడటానికి, విస్తృతం చేసుకోవడానికి జరిపే యుద్ధాలు పురుషులు చేస్తూ వుండేవారు. అందుచే వారు పట్టుకున్న ఖైదీలు వారికే బానిసలుగా అయ్యారు. ఈ ఆస్తిని తమకు పుట్టిన వారికే దక్కేటట్లు చేయాలంటే ఒక స్త్రీ ఒక పురుషునికే చెందేటట్లు, స్త్రీ పురుషుల సంబంధాలలో వివాహ పద్ధతులలో మార్పు తేవడం జరిగింది. మాతృస్వామిక తెగల సమాజాలు, పితృస్వామిక సమాజాలుగా మారాయి. తెగలు పెరిగే కొద్దీ వానిని కలిపి ఒక విస్తృత ప్రాంతం మీద నడిపి వాని వ్యవహారాలు నడపడానికి, మొదట ఆ తెగకు చెందిన వారందరూ ఎన్నిక చేసుకుంటున్న నాయకుడు క్రమ క్రమంగా వంశపారంపర్య హక్కుతో రాజు అయ్యాడు.

ఉత్పత్తి విధానంలో బానిసలు పెరిగే కొద్ది బానిసలు బానిస యజమానుల క్రింద సమాజం విడిపోయింది. తెగల కుటుంబాలలో కూడా ధనికులు, బీదలు అనే తేడా కూడా పెరిగింది. దీనితో మొత్తం ఆదిమ తెగలన్నింటికి ఉపయోగానికి వ్యవసాయోత్పత్తి చేయడం బదులు ఆ భూమిని కుటుంబాల వారీగా విభజించడం జరిగేది. తొలి దశలో ఆ విభజన కొద్ది సంవత్సరాలకని చేయబడింది. క్రమేణా శాశ్వతంగా విభజించబడింది. వంశపారంపర్యంగా అనుభవించడం ప్రారంభమైంది.

బానిసలచే ఉత్పత్తి చేయించే పద్ధతి కూడా ఒక దశలో మానివేయవలసి వచ్చింది. వారి పోషణకు బాధ్యత యజమానిదే కాబట్టి బానిస ఉత్పత్తి చేసేది తమకంత ఎక్కువగా మిగలడం లేదని, మారకానికి కావలసిన పెద్ద మొత్తాన పంటలు, వస్తువుల ఉత్పత్తి కావడం లేదని, ఆ విధానంలో మార్పు తేవడం జరిగింది. యూరప్ ఖండంలో బానిస యజమానులు, భూమి మీద పనిచేస్తూ వున్న బానిసలకు కొంత భూమిని వారి పోషణకు సాగు చేసుకోమని ఇచ్చేవారు. దానికి ప్రతిగా ఆ యజమానుల తతిమ్మా భూములనన్నిటిని ముందుగా సాగుచేసిపెట్టి ఆ తరువాత తమకిచ్చిన భూములను సాగుచేసుకోవాలి. భూములను వదిలిపెట్టి పోకూడదు.



అలా వదిలిపెట్టి పారిపోయిన వారిని ఎక్కడున్నా తిరిగి బలవంతంగా పట్టుకువచ్చి తమ భూముల మీద పనిచేయించుకునే హక్కు యజమానులకు వుండేది. ఈ రీతిగా బానిస యుగం జమిందారీ యుగంగా మారిపోయింది. ఆనాడు ఆయా దేశాల ప్రభుత్వాలు, ప్రభుత్వ యంత్రాంగాన్నంతా ఉపయోగించి దీనిని అమలు జరిపేవారు. ఆ జమిందారుని ఇంటిలో అనేక రకాల వెట్టి చాకిరీ, అనేక రకాల కట్నాలు, కానుకలు ఉచితంగాను, నిర్బంధంగాను రైతులు చెల్లించుకోవాలని వుండేది. అందుచేతనే ఈ జమిందారీ యుగాన్ని బానిస సమాజమని తర్వాత ఏర్పడిన సమాజాన్ని అర్ధ బానిస సమాజమని, భూమి మీద పనిచేసే పాత బానిసలను ఇప్పుడు అర్ధ బానిసలని పిలవడం జరిగింది.

యూరపు ఖండంలో మరింత ఉత్పత్తి పెరిగే కొలది, నూతన యంత్రాలు చేతి పరికరాల స్థానాన రావడం అరంభించాయి. మారకం దేశదేశాలకు పెరిగింది. వస్తువుల మార్పిడినే ముఖ్యంగా పెట్టుకుంటూ వచ్చిన వర్తకులు, యంత్ర కార్ఖానాలు ఏర్పరచారు. వానిలో పనిచేయడానికి ఈ జమిందారులకు అంటి పెట్టుకోకుండా, స్వేచ్ఛగా తమ కార్ఖానాలో జీతాలకు పనిచేయడానికి అర్ధ బానిస రైతులను భూముల నుండి విడిపించే పోరాటం ప్రారంభించారు. ఈ అర్ధ బానిస రైతులు కూడా జమిందారీ దోపిడీ నుండి బయటపడి, తాము సాగుచేస్తున్న భూములను, జమిందారుల సొంత శేరీ భూములను పూర్తిగా తామే స్వాధీనం చేసుకుని అనుభవించడానికి పోరాటం ప్రారంభించారు. జమిందారీ విధానం భగ్నమై పెట్టుబడిదారీ యుగం ప్రారంభమై అభివృద్ధి చెందినది. భూమి రైతులకు ఇవ్వడం జరిగింది.

అయితే పెట్టుబడిదారీ యుగం పెరిగి అభివృద్ధి అయ్యే కొద్దీ పెద్ద పెద్ద పట్టా రైతులు భూస్వాములు, చిన్న చిన్న రైతులను భూముల నుండి తొలగిస్తూ యంత్రాలను ఉపయోగిస్తూ వ్యవసాయ కార్మికుల చేత సాగు చేయించుకోవడం మొదలుపెట్టారు. సోవియట్ యూనియన్‌లోను, చైనాలోను సోషలిస్టు విప్లవాలు విజయం పొందిన దేశాలన్నింటిలోను భూమి తిరిగి వ్యవసాయ కార్మికులకు, రైతులకు పంచిపెట్టారు. ఆ తరువాత వారందరూ కలసి సమిష్టి వ్యవసాయం ద్వారా జీవిత స్థాయి పెంపొందించుకుంటూ సోషలిస్టు సమాజానికి కావలసిన వ్యవసాయోత్పత్తి చేస్తున్నారు.

కాని భారతదేశంలో పితృస్వామిక తెగల సమాజం నుండి పూర్తిగా బానిస సమాజం ఏర్పడలేదు. భూమి కుటుంబాల సొంత ఆస్తిగా మారలేదు. రాజులు, చక్రవర్తులు వచ్చారు, పరిపాలించారు. కాని గ్రామాలలో స్వయం సంపూర్ణ ఆర్థికోత్పత్తి సాగుతూనే వచ్చింది. పితృస్వామిక తెగలకు చెందిన విధానంలో లాగానే భూములను, వివిధ కుటుంబాలకు విభజిస్తూ వచ్చినా మొత్తం గ్రామ ప్రజలకు పండే పంటలో భాగం ఇచ్చేవారు. వివిధ గ్రామ వృత్తులు చేసేవారు. వివిధ కులాలుగా మారినారు. ఆదిమనివాసులను, అంటరానివారిగా చూసి వారిని

తమ భూములలో అర్ధ బానిసలుగా పనిచేయించుకుంటూ వచ్చినా భూములలో ఏ భాగం వారికివ్వడం జరగలేదు. లేదా మరికొన్ని ఆదిమ తెగలను, మరింత అడవులలోకి, కొండలలోకి తరిమి, వారి భూమిని ఆక్రమించి, కొత్తగా ప్రాబల్యానికి వచ్చిన తెగలు పెత్తనం సాగించేవారు. తరచు మారే రాజులకు, చక్రవర్తులకు, గ్రామం మొత్తం మీద పండిన పంటలలో 6వ వంతు లేదా మరింత అదనంగా గ్రామ పంచాయతీ ద్వారా లేదా గ్రామ పెద్దల ద్వారా చెల్లించేవారు. వెట్టి చాకిరికి పెద్ద ఎత్తున అంటరానివారని తాము అణగద్రొక్కిన వారి చేతనే గాక, వివిధ కులాలలో, వృత్తులలో వున్న వారి చేత కూడా చేయించుకోవడం సర్వసామాన్యమైంది. ఈ విధంగా భారతదేశ గ్రామసీమలలో పితృస్వామిక సమాజం, దాని మీద ఒక మేరకు బానిస దోపిడి, ఈ రెండింటి మీద వెట్టిచాకిరీతో జమిందారీ దోపిడీ సమ్మిళితమైన సమాజ వ్యవస్థ ఏర్పడింది. అది ఇంగ్లీషు వారు పరిపాలనాధికారానికి వచ్చేవరకు సాగింది.

ఇంగ్లీషువారు అధికారానికి రాగానే ఇదివరకు పన్నులు, లేదా పంటలలో భాగాన్ని వసూలు చేసి ప్రభుత్వాలకు కడుతూ వచ్చిన దళారీలతో ఒప్పందం చేసుకొన్నారు. వారు తమకు ఏటేటా కట్టవలసిన నగదును నిర్ణయించి వారిది వరకు వసూలు చేస్తున్న ప్రాంతమంతటి భూములన్నీ వారి సొంత ఆస్తిగా పట్టాలివ్వడం జరిగింది. అదివరకు శిస్తులు వసూలు చేసి కొంత మినహాయించుకొని మిగిలినది రాజులకు, ప్రభుత్వాధినేతలకు కట్టే దళారీలు ఇప్పుడు భూమి మీద సొంతదారులయ్యారు. వారు భూమిని సాగుచేస్తున్న వారి నుండి తమ ఇష్టం వచ్చినట్లు పంటలలో అదనంగా భాగం తీసుకుంటూ అక్రమ వసూళ్లు చేయడం, ఆ సాగుదార్లను తమ ఇష్టం వచ్చినట్లు తొలగించడం, భూమి అంతా తమ సొంత ఆస్తి అయినట్లు ప్రవర్తించసాగారు. దీనికి వ్యతిరేకంగా భూమిని సాగుచేస్తున్న రైతులు ఆందోళన చేస్తే తిరుగుబాటు చేస్తే కొన్ని హక్కులిచ్చారు. కొన్ని ప్రాంతాలలో జిరాయితీ హక్కు కూడా ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ జిల్లాల్లోను, కోస్తా జిల్లాల్లో కొన్ని ప్రాంతాలలోను, అదివరకు పంచాయతీ గ్రామ పెద్దల ద్వారా భూములను సాగుచేస్తున్న కుటుంబాలకు పట్టాలు ఇచ్చి ఇంగ్లీషు ప్రభుత్వం పన్నులు వసూలు చేయడానికి మొదలుపెట్టింది. దీనినే రైతువారీ విధానమని అంటాం. మరికొన్ని ప్రాంతాలలో జమిందారీలకు ఆ ప్రాంతానికి పట్టా కట్టపెట్టడం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జమిందారీ విధానాన్ని అంతం చేసి వారికి పన్ను కట్టే వారికి పట్టా హక్కు ఇచ్చారు. జమిందారులకు కొన్ని వందల కోట్లు భారతదేశమంతటా నష్టపరిహారం చెల్లిస్తున్నారు. అంతేగాక వందల వేల కొలది ఎకరాలు వారి సొంత శేరీలని ఒక్కొక్కరికి సొంత భూమిగా పట్టాలు కూడా ఇవ్వడం జరిగింది.

ఇదివరకు జమిందారుల క్రింద కౌలుదారులుగా వుండి, ఇప్పుడు పట్టా హక్కు పొందిన కొన్ని కుటుంబాలు తాము సొంతంగా చేసుకోక ఆ భూములను తిరిగి మరికొందరికి



విపరీతమైన కౌలు రేటుకు ఇచ్చి దోచుకుంటూనే ఉన్నారు. పంటలు పండించే కౌలు రైతుకు భూమి మీద పట్టా హక్కు ఇవ్వలేదు. వ్యవసాయ కార్మికులకు భూమి మీద ఎలాంటి హక్కు, ఎలాంటి భాగం ఇవ్వలేదు.

ఆంధ్రదేశంలో 60 – 70 ఏండ్ల క్రితం వరకు ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబానికి (హరిజన ఆదిమ తెగలు కుటుంబాలకు మినహాయించినా) పంటలో నాగలి పాలు, ఎద్దు పాలు, కాడి పాలు, మేడి పాలు అని భాగం ఉండేది. వ్యవసాయ అభివృద్ధి అయ్యే కొద్దీ మార్కెట్‌లో పండిన పంటలు అమ్ముకోవడానికి అవకాశాలు పెరిగే కొద్దీ ఈ పాలు విధానాలకు స్వస్తి చెప్పడం జరిగింది. వారంతా భూమి లేని వ్యవసాయ కార్మికులుగా, పేదవారుగా తయారయ్యారు.

అందుచేతనే గ్రామ పేదలంతా ముఖ్యంగా వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, భూమి మీద భూస్వాములకు జన్మ హక్కు ఎప్పుడూ లేదని, అందరూ దానిని సాగు చేసుకొని జీవించే హక్కు ఉండేదని తెలుసుకోవాలి. సమాజ పరిణామంలో కొన్ని దశాబ్దాల క్రితమే మన దేశంలో ఇంగ్లీషు వారి పెత్తనం వచ్చిన తర్వాతనే పూర్తిగా భూమి కొద్ది మంది భూస్వాముల సొంత సొత్తు అయిందని, వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు, సన్నకారు రైతులకు, అదివరకున్న మేరకు, వారికి పని చూపి తిండి పెట్టాల్సిన బాధ్యతను కూడా వదిలివేసి, హక్కులన్నిటిని రద్దు చేయడం జరిగిందని తెలుసుకోవాలి. తిరిగి పోరాడి తన జన్మహక్కును “దున్నే వానికే భూమి” హక్కును సొంతంగా కాయకష్టంతో సాగు చేసే వారికే భూమి మీద పంటనంతను అనుభవించే హక్కును సాధించుకోవాలి.

# జమీందారీ యుగం నాటి దోపిడీ పద్ధతులు నేటికీ చాలా ప్రముఖంగానే వున్నాయి

**కౌలు దోపిడీ :** భూమిని ఇతరులకు కౌలు కిచ్చి పండిన పంటలో భాగాన్ని పంట రూపంలో గాని, లేక నగదు రూపంలో గాని దోచుకొనే పద్ధతిని ఫ్యూడల్ లేదా జమిందారీ దోపిడీ అని అంటాం.

నేటికీ ఆంధ్రప్రదేశ్‌లో ఐదవ వంతు మంది వరకు భూమిని కౌలుకు తీసుకుని విపరీతమైన కౌలు రేటు యిచ్చుకోవలసి వుంటున్నదనీ, ఈ దోపిడీ ఎంత ఎక్కువగా వుందో కూడా పైన చూశాము.

**వెట్టిచాకిరి :** జమీందారీ దోపిడీలో మరో రూపం వెట్టిచాకిరి. ఆంధ్ర కోస్తా, రాయలసీమ జిల్లాలలో 50 ఏడ్ల క్రితం వరకు వెట్టి చాకిరి చాలా పెద్ద ఎత్తునే వుండేది. తెలంగాణలో 1946-51 సాయుధ రైతాంగ పోరాటం సాగే వరకు విపరీతంగా వుండేది. భూస్వాములకు, దేశముఖులకు వర్షాలు పడి భూమి (దుక్కికి) పదును కాగానే ఇంటింటికి ఒక నాగలి చొప్పున వెళ్ళి భూస్వామి భూమిని ముందు దున్ని రావలసి వుండేది. నారువేతలలో, కోతలలో వెళ్ళి వెట్టి చాకిరి చేసి రావలసి వుండేది. తెలంగాణలో నిన్న మొన్నటిదాకా చాలా చోట్ల నాటువేతలు, కోతల సమయాలలో గ్రామంలోని పేదలంతా వెళ్ళి భూస్వాముల భూములలో పనిచేసి భూస్వాములు పెట్టే దోసెడు "భిక్షం"తో తిరిగి వచ్చేవారు. భూస్వాముల ఇండ్లలో ఏ శుభకార్యంగాని, లేదా ఏ అవసరము గాని పడినా గ్రామంలోని రైతులు, వర్తకులు, మంగలి, చాకలి, కమ్మరి, కుమ్మరి, చర్మకార్లు కావలసిన సరుకులు సరఫరా చేసి, కావలసిన పనినంతా ఉచితంగా వెట్టి చేసి రావాలి. ప్రభుత్వ ఉద్యోగస్తులకు కూడా ఇలాంటి వెట్టిపనులు ఎన్నో చేయవలసి వుండేది. ఇప్పటికీ గణనీయంగానే, ఉద్యమం బలహీనంగా వున్న చోట్ల వెట్టి చాకిరీ సాగుతూనే వుంది.

**మేరలు గ్రామ చాకరీలు :** ఒకప్పుడు జమీందారీ యుగంలో భారతదేశ గ్రామాలలో ఆర్థిక స్వయం సమృద్ధికి తోడ్పడినవారు, చేతివృత్తిదారులు, దానికి వారికిచ్చే పంటలలో భాగం, ఇప్పటికీ మేరల పేరుతో సాగుతున్నాయి. నేడు అవి వారికి న్యాయంగా వారి కష్టానికి, వారు తయారుచేసే వస్తువుల విలువకు తగిన ప్రతిఫలంగా లేవు. వారు తయారుచేసే అదనపు విలువను ఇతరులు భుక్తం చేసుకోవడానికి, పాత ఫ్యూడల్ దోపిడీని నిలబెట్టేదిగా తయారయ్యాయి.



చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, కంసాలి, మాదిగ (చర్మకారుడు) ఇలాంటి వృత్తుల వారు గ్రామంలోని ప్రతి ఇంటా "మేరల"ని పరిమిత ధాన్యాన్ని, అన్నాన్ని (కబళాన్ని) తీసుకొని ఆ ఇండ్లలోని గుడ్డలన్నీ ఉతికిపెట్టడం, పిలిచినప్పుడు వెళ్ళి క్షౌరం చేయడం, కావలసిన కుండలు, చెప్పులు, బొక్కెనలు వగైరా సరఫరా చేయడం జరుగుతూ వుంది. వడ్రంగి, కమ్మర్లు వ్యవసాయానికి కావలసిన పనిముట్లు కొయ్యతో, ఇనుముతో చేసి పెట్టడం, నాగళ్ళు, బండ్లు, కర్రులు, కొడవళ్ళు, పనిముట్టులకు మరమ్మతులు చేసిపెట్టడం జరుగుతూ వుంది. గ్రామ నౌకర్లు చాకిరి ఇనాములు తీసుకొని గ్రామ ఉద్యోగస్తులకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు అనేక రూపాలైన వెట్టి చేయాల్సి వుండేది. ఇప్పటికి కొంతమేరకు వెట్టి చాకిరి సాగుతూనే వుంది.

**కూలి రేట్లలో ఫ్యూడల్ దోపిడీ :** కూలి రేట్లను నిర్ణయించడంలో కూడా ఫ్యూడల్ దోపిడీ నేటికీ కనబడుతూ వుంది.

తెలంగాణలో ఒక బస్తా విత్తనాలు చల్లే భూమిలో నాటువేతకు, కోతకు ఇన్ని బస్తాల ధాన్యమని నిర్ణయిస్తూ వచ్చారు. జొన్న కోతకు నాలుగు లేదా ఐదు కట్టలని ఇస్తూ వచ్చారు. తక్కువ జీతాలిచ్చి పనిచేయించుకుంటున్న పాలేర్లకు వరికోతలలో పని అని, వరి మోపు అని, కుప్ప నూర్పిళ్ళలో కళ్ళాలలో గింజలు వదలడమంటూ ఇలాంటి పద్ధతులు అవలంబించి, వారికి న్యాయంగా రావలసిన జీతాలు ఇవ్వడం లేదు. వేరుశెనగ పీకుడు, మిరప కోతకు ఇన్ని బుట్టల కాయకు, ఒక బుట్టెడు వేరుశెనగ, మిరప కాయలు అని ఈ రీతిగా అనేక పద్ధతులను అవలంబిస్తున్నారు.

ఈ పద్ధతులన్నిటిలోను వ్యవసాయ కార్మికుడు తన రోజు పనికి తాను తయారుచేసే నూతన విలువను బట్టి ప్రతిఫలం ఖచ్చితంగా అడిగే హక్కును వదిలివేసి భూస్వామి దయా దాక్షిణ్యాలపై ఆధారపడటం జరుగుతూ వుంది. బాగా పంటలు పండినప్పుడు కట్టలు, బుట్టలు రూపంగా తీసుకుంటే ఎక్కువ గిట్టుబాటు అవుతుందనే ఆశతో భూస్వామి ఇష్టానికి వదిలి వేయడం జరుగుతూ వుంది. ఫ్యూడల్ కాలంలో భూమిని, భూస్వామిని అంటి పెట్టుకుని బ్రతికే స్థితిలో ఈ ఏర్పాట్లు అన్నీ వచ్చినవి. వ్యవసాయ కార్మికుడు స్వేచ్ఛగా ఎక్కువ జీతాలు వచ్చే పనికి అవసరమైన చోటికి వెళ్ళి పని చేసుకొనే హక్కు లేకుండా పోయింది. ఆర్థిక విధానం, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయ్యే కొద్దీ ఈ పద్ధతులు, ఆర్థికాభివృద్ధికి, ఉత్పత్తికీ కూడా ఆటంకాలుగా పరిణమిస్తూ వున్నాయి. భూస్వామి పెట్టుబడిదారీ వ్యవసాయాన్ని అవలంబిస్తూ పనిచేసే వారికి ఫ్యూడల్ పద్ధతులతో తక్కువ జీతాలిచ్చి దోచుకోవడానికి పూనుకుంటున్నారు.

అదేవిధంగా పాలేర్లకు (జీతగాళ్ళకు) ధాన్య రూపంలోను ఏర్పరచుకున్న నెల జీతాలతో పాటు ఒక్క పూట లేదా రెండు పూటలు భోజనం పెట్టడం, గొంగళి, ధోవతులు, చెప్పుల జతలు, పొగాకు వగైరా యివ్వడం అనే సంప్రదాయం కూడా కొనసాగిస్తున్నారు. దీనివలన

పాలేరు తనకు రావలసిన మొత్తం జీతాన్ని పూర్తిగా తీసుకొని తన భార్యా బిడ్డలతో పూర్తిగా అనుభవించడానికి సాధ్యపడటం లేదు. భూస్వామి ఇచ్చే జీతం పాలేరుకు, అతని భార్యా బిడ్డలకు తిండికి కూడా చాలక, పస్తులు ఉండటమో లేక అర్థాకలితోనైనా ఉండవలసి వుంటుంది. అందుచే భార్యాబిడ్డల గతి ఏమైనా పాలేరుకు రెండు పూటలు తిండి పెట్టి ఎక్కువ పని చేయించుకోవడానికి భూస్వామికి ఈ పద్ధతి ఉపయోగపడుతుంది. నాటువేతలలో, కోతలలో ఒక పూట అన్నం పెట్టి ఎక్కువ గంటలు పని చేయించుకోవడం కూడా మనం చూస్తూనే వున్నాం.

ఇలాంటి పద్ధతులన్నీ తమకు రావలసిన న్యాయమైన ఖచ్చితమైన కూలీ, జీతాలు ఇవ్వకుండా తమ్ము మోసగించడానికి, తక్కువ ఇచ్చి, ఎక్కువ పని చేయించుకునే పద్ధతులను వ్యవసాయ కార్మికులకు నచ్చచెప్పి వారి చైతన్యం పెరిగే కొద్ది ఖచ్చితంగా హెచ్చు కూలిరేట్ల కోసం పోరాడేటట్లు మనం కృషి చేయవలసి వుంటుంది. దీనికి ఒక పెద్ద ఆటంకం. పని లేని రోజులు చాలా అధికంగా ఉండటంతో పాటు పాత పద్ధతులతో భూస్వాముల వద్ద పనిచేస్తే నికృష్ట జీవితానికైనా అప్పు సప్పులతోనయినా బతకడానికి వీలుంటుందని ఈ పద్ధతులనే అంటి పెట్టుకోవడం జరుగుతూ వుంది.

అందుచేత పండించే పంట ఫలితాన్ని నూతన విలువను బట్టి న్యాయమైన కూలిరేట్లుగాక ఫ్యూడల్ దోపిడీ ఒత్తిడి ఫలితంగా జీవితానికి, కుటుంబ పోషణకు కూడా చాలని వస్తువులతో కృశించిపోయే వేతనాలివ్వడం జరుగుతూంది. ఫ్యూడల్ దోపిడీని తుదముట్టించి స్వచ్ఛమైన పెట్టుబడిదారీ పద్ధతులలో వ్యవసాయాభివృద్ధి జరుగుతూ వుంటే కూలి రేట్లు కూడా మరింత ఎక్కువగా, మరింత న్యాయంగా వుండేవి. భూపంపకం చేసి, భూస్వామ్య విధానాన్నంతా (ఫ్యూడల్, పెట్టుబడిదారీ భూస్వామ్య విధానాల రెంటినీ) రద్దు చేసి దున్నేవానికి భూమి ఇచ్చినప్పుడే తక్కువ కూలీనిచ్చే ఈ ఫ్యూడల్ దోపిడీని కూడా రద్దు చేయడం సాధ్యమవుతుంది.

**హరిజనులకు ఇతరుల కన్నా తక్కువ కూలిరేటు :** హరిజనులకు, ఇతర కులాల వారికి మధ్య జీతభత్యాలతో తేడా చూపడం జరుగుతూ వుంది. హరిజనులు తదితరులందరూ ఉపయోగించే బావులు, చెరువులు, వీధులు, స్మశానవాటికల నుండి బహిష్కరింపబడుతున్నారు. అంటరానివారని ఇండ్లలోకి రానివ్వకపోవడం అలాంటి ఇతర ఆటంకాలు పెడుతున్నారు. తాము సృష్టించిన ఈ అంటరానితనాన్ని ఒక సాకుగా చూపి ఇతర కులస్తులకు ఇచ్చే జీతాల కన్నా హరిజన పాలేర్లకు తక్కువ జీతాలిస్తున్నారు. పాలేర్లను, కూలీలలోను ఈ కులభేదాలను రెచ్చగొట్టి వారు కలిసి ఐక్యంగా సంఘాలు పెట్టుకొని తమ న్యాయమైన కోర్కెల కోసం పోరాడకుండా చీల్చి ఉంచడానికి భూస్వాములు ఎంతో ప్రయత్నిస్తున్నారు. వ్యవసాయ కార్మికులపైనా పేదరైతులపైనా జరుగుతున్న సాంఘిక అన్యాయాలు, అక్రమాలు ఫ్యూడల్ దోపిడీ పద్ధతులే. వీనికి వ్యతిరేకంగా, అంటరానితనానికి ప్రత్యేకంగా, కులమత ఛాందసత్వాలకు వ్యతిరేకంగా మన వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలు ప్రజాతంత్ర వాదులంతా పోరాడవలసి వుంది.



**స్త్రీలకు తక్కువ కూలి :** అదేవిధంగా స్త్రీ కూలీలకు పురుషుల కన్నా తక్కువ కూలి, సమానమైన పని చేసున్నా తక్కువ ఇవ్వడం జరుగుతూ వుంది. చాలాచోట్ల పాలేర్ల భార్యలు భూస్వామి ఇంటిలో పని వచ్చినప్పుడల్లా వెళ్ళి పని చేయాలి. ఆ పని కోసం ప్రతిఫలంగా ఆ రోజుకో, ఆ పూటకో తిండి పెట్టడం, లేదా తక్కువ కూలి ఇవ్వడం, సంవత్సరాంతంలో మామూలు పెట్టుబడి క్రింద ఒకటి రెండు బస్తాల ధాన్యం ఆ స్త్రీకి ఇవ్వడం నేటికీ జరుగుతూనే వుంది. శ్రీకాకుళం జిల్లా గిరిజన ప్రాంతంలో ఈ మామూలు సంవత్సరానికి 5 రూపాయలు ఉండేది. అచ్చట గిరిజన సంఘాలు పెట్టుకొని కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఆందోళన ఉద్యమం సాగించిన ఫలితంగా సంవత్సరానికి 5 బస్తాల ధాన్యం ఇవ్వడానికి అంగీకారం కుదుర్చుకోగలిగారు.

**చిన్న బిడ్డల చేత పని చేయించుకోవడం :** చిన్న బిడ్డలను 8, 9 సంవత్సరాల వచ్చీ రాకముందే కూలికి పెట్టుకొని తక్కువ కూలి ఇచ్చి దోచుకోవడమో లేదా ఇంటిలో చిల్లర మల్లర పనులన్నిటినీ చేయించి కాస్త తిండి పెట్టి దోచుకోవడమో జరుగుతూ వుంది. ఇందువల్ల వీరికి చదువుకోవడానికి వీలులేక జీవితమంతా కూలి బానిసలుగా నికృష్ట జీవితం గడపాల్సి వస్తూ వుంది. అంతేగాక చిన్న వారిని పనిలో పెట్టుకొని వయస్సు వచ్చిన స్త్రీ పురుషులను పనిలోకి తీసుకోకుండా తక్కువ జీతాలతో తమ వ్యవసాయపు పనులు సాగించుకొని విపరీతమైన లాభాలు సంపాదించుకుంటున్నారు. నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతూనే వుంది.

అందుచేత 15 ఏండ్లలోపు బాలబాలికలచే పని చేయించడం నిషేధించాలని, వారికి చదువుకోవడానికి తగిన సౌకర్యాలన్నీ కల్గించాలని, పాఠశాలలో జీతాలు తీసుకోకపోవడమే గాక ఉచితంగా పుస్తకాలు, రాత పరికరాలు సరఫరా చేయాలని, వయస్సు వచ్చి చదువు పూర్తి అయ్యేవరకు ఉచితంగా భోజన వసతిని ఏర్పాటు చేయాలని తదితర అవసరాలను తీర్చాలని ప్రజా ఉద్యమాన్ని నిరంతరం సాగించాలి.

వ్యవసాయ కార్మికులకు, పేద రైతులందరికీ ఉచిత విద్యా వైద్య సదుపాయాలు కల్గించడానికి కృషి చేయాల్సి వుంటుంది.

**తప్పుడు కొలత పాత్రలు :** నేటికీ గ్రామాలలో చాలామంది తమ కూలీలకు, జీతగాళ్ళకు తక్కువ కొలత పాత్రలతో జీతాలు కొలుస్తున్నారు. వారి నుండి తామిచ్చిన అప్పు గింజలు నాముతో పాటు (నాగుతో పాటు) కొలుచుకునేటప్పుడు పెద్ద కొలత పాత్రలతో కొలిపించుకుంటారు. ఖచ్చితమైన, సరైన కొలత పాత్రలతో జీతభత్యాలు ఇప్పించుకోవడం ఒక కార్యక్రమంగా పెట్టుకొని పనిచేస్తేనే గాని ఈ అక్రమ దోపిడీని, ఫ్యూడల్ దోపిడీని అరికట్టలేము.

ఈ తప్పుడు కొలత పాత్రలను ఉపయోగించడం పేద, మధ్య తరగతి రైతులతోటి లావాదేవీలలో కూడా జరుగుతూనే వుంది. భూస్వాములు, వర్తకులు ఈ చిన్న రైతుల నుండి ధాన్యాన్ని కొనేటప్పుడు పెద్ద కొలత పాత్రలతో కొలుచుకుంటారు. వారికి తాము అప్పుగా

ఇచ్చే గింజలను తక్కువ కొలత పాత్రలతో కొలవడం చాలా చోట్ల జరుగుతూనే వుంది. అదేవిధంగా తూనిక రాళ్ళలో కూడా తప్పుడు రాళ్ళు ఉపయోగించడం జరుగుతూ వుంది.

**పాలేర్లకు విపరీతంగా ఎక్కువ పని గంటలు, పని రోజులు :** పాలేర్ల చేత రోజూ తెల్లవారినప్పటి నుండి రాత్రి చీకటి పడే వరకూ మామూలుగా 14 గంటలు పని చేయించుకుంటారు. కొన్ని పని తరుణాలలో 18 గంటలు కూడా పని చేయించుకుంటారు. రాత్రి పగలు అనక ఎప్పుడు భూస్వామి పిలిస్తే అప్పుడు వెళ్ళి పని చేసే పద్ధతి. సంవత్సరంలో సెలవులు ఏమీ ఇవ్వకపోవడం, జబ్బు పడో లేదా ఇంటిలో అత్యవసర పని వలన ఆగిపోతేనో, ఆ రోజులకు రోజు జీతాన్ని బట్వాడా చేయకుండా కోత కోస్తారు. సంవత్సరాంతమున ఇవ్వవలసిన పెట్టుబడిలో నుండి పని చేయని రోజులని నిలవలు లెక్కగట్టి తగ్గిస్తున్నారు.

రోజు కూలీల చేత 6 మొదలు 8 గంటలకు మించి పని చేయించరాదని, పాలేర్లకు రోజుకు 8 – 10 గంటలకు మించి పని వుండరాదని, అలా కొన్ని తరుణాలలో చేయవలసి వస్తే దానికి బదులు ఇతర రోజులలో తక్కువ గంటలు అదనపు సెలవులు వుండాలని ఉద్యమాన్ని నడపాలి. పాలేర్లకు కనీసం 30 రోజులయినా సెలవులు వెనువెంటనే యివ్వాలని, క్రమేణా వారానికి ఒకరోజు, పండుగ సెలవులు కలిపి సంవత్సరంలో 60 రోజుల వరకు సెలవులు సాధించుకోవాలని ప్రచారాందోళనలు సాగించాలి.

**విపరీతమైన వడ్డీరేట్లు నాగు, జట్టీ తదితరమైన దోపిడీ పద్ధతులు :** వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు అప్పు సౌకర్యాలు లేక విపరీతంగా భూస్వాముల వడ్డీ, వ్యాపారస్తుల దోపిడీకి గురవుతున్నారు. వారికి నెలకు రూపాయికి 6 పైసలు, సంవత్సరానికి నూటికి 75 రూపాయల వంతున వడ్డీ రేటు యిస్తే గాని అప్పులు దొరకడం లేదు.

పనిలేని రోజులలో ఒక బస్తా ధాన్యం అప్పుగా తీసుకుంటే మూడు మాసాలలో పంటల సమయం వచ్చినా ఆ బస్తా ధాన్యానికి సగం బస్తా లేదా బస్తాకు బస్తా అదనంగా వడ్డీ క్రింద (ధాన్యపు వడ్డీనే నాము లేక నాగు అంటారు) చేర్చి చెల్లించాల్సి వుంటుంది.

పని దొరకక పస్తులుండే రోజులలో అప్పు కోసం పోతే ఎకరం కోసి కట్టి వేయడానికి రు. 25–30లకు అంగీకరించి కోతలలో పని చేయడానికి అంగీకరించితేనే అడ్వాన్సుగా ఇస్తారు. ఈ తక్కువ రేటుకే వ్యవసాయ కార్మికులు కోత కోయాలి. పనకట్టి వేయాలి. మామూలు రేటు అయితే 50 రూపాయలు వుంటుంది. తెచ్చుకున్న అప్పుకు మూడు నెలలకు అసలు ఎంతో వడ్డీ అంత కట్టవలసి వస్తే సంవత్సరానికి అది నూటికి 400 రూపాయలు రేటు అవుతూవుంది.

అదేవిధంగా గుడ్డలు తదితర వస్తువులను నెత్తిన మూటలు కట్టుకొని అమ్ముకోవడానికి వచ్చేవారు. ప్రత్యేక వడ్డీ వ్యాపారం చేసేవారు. రు. 100ల విలువ గల గుడ్డలు, వస్తువులు



యిచ్చి లేదా రు. 100లు అప్పు పెట్టి మూడు మాసాల తర్వాత పంటల సమయంలో రు. 150ల వంతున వసూలు చేసుకోవడం సర్వ సామాన్యంగా జరుగుతూ వుంది.

భూస్వాముల వద్ద నుండి వ్యవసాయ కార్మికులు తెచ్చుకున్న అప్పులు విపరీతమైన వడ్డీ రేట్లు, చక్రవడ్డీలతో పెరిగిపోతూ, ఎంత చెల్లించినా తరగక అతను తన యావజ్జీవితమే గాక, ఆ అప్పును వంశపారంపర్యంగా అతని కొడుకు మనుమడు కూడా భూస్వామికి అప్పు బానిసలుగా తయారయి చాకిరీ చేయవలసి వస్తుంది. స్వాతంత్ర్యం వచ్చి 28 ఏండ్లు అయినా ఈ ఫ్యూడల్ అప్పు బానిసత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధించలేదు. 1975 అక్టోబరులో ఒక ఆర్డినెన్స్ ద్వారా నిషేధించింది. ఆ పాత బాకీలన్నీ రద్దు అనీ, అప్పు బానిసత్వం నుండి విముక్తి చేస్తున్నామని ప్రకటించింది. కాని, వీరికి భూమి ఇచ్చి, పని కల్పించకపోతే అవసరమైన రుణ సౌకర్యాలు కల్గించకపోతే తిరిగి ఆ భూస్వాముల చెప్పుచేతలలోనే బానిసలుగా వుండి పాత అప్పులను కూడా చెల్లిస్తూనే వుంటారు. అందుచే ఏ చట్టాన్నయినా అమలు జరిపించుకోవాలంటే బలమైన వ్యవసాయ కార్మిక సంఘాలు, బలమైన ప్రజా ఉద్యమం, భూస్వాములకు వ్యతిరేకంగా సంఘటితపడి పోరాడవలసి వుంటుంది.

అందుచేత వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు యిచ్చిన అప్పులు రొక్క రూపంలో గాని, ధాన్య రూపంలో గాని ఏ రూపంలో యిచ్చినా నూటికి నెలకు ఒక శాతం కన్నా అంటే నెలకు రూపాయికి ఒక పైసా కన్నా ఎక్కువగా వడ్డీ రేటు గాని, నాము రేటుగాని వుండరాదు. ఆ మేరకు ఆ గ్రామంలోని భూస్వామే అప్పు పెట్టాలి. లేదా ప్రభుత్వం అలా అప్పులను యిచ్చే ఏర్పాట్లు చేయాలి. ఈ అప్పును తిరిగి ధాన్యం రూపంలో గాని, రొక్క రూపంలో గాని వ్యవసాయ కార్మికులు, పేద రైతులు తమకు వీలైన రూపంలో చెల్లించడానికి అవకాశం వుండాలి. పేరుకుపోయిన పాత అప్పులు, భూస్వాములకు, వడ్డీ వ్యాపారస్తులకు యివ్వవలసిన వానిని రద్దు చేయాలి. చిన్న రైతులు, మధ్యతరగతి రైతుల నుండి తెచ్చుకొని వున్నట్లయితే ఆ అప్పులను యిద్దరి మధ్యా సామరస్యంగా పరిష్కరించుకోవాలి.

ఇలా వివిధ రూపాలలో ఫ్యూడల్ దోపిడీ సాగుతూనే వుంది. ఒకవైపు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాలు పెరుగుతూ వున్నా అవి పాత ఫ్యూడల్ దోపిడీని రద్దు చేయకుండా, వానిలో పెనవేసుకొనిపోయి వుంది. అందుచేతనే ఈ ఫ్యూడల్ దోపిడీని అంతం చేయాలంటే పెట్టుబడిదారీ భూస్వామ్య విధానాన్ని కూడా పూర్తిగా రద్దు చేసి దున్నేవానికే భూమి పంచాలి.

# కుల మత భేదాలను అధిగమించి కష్టజీవులంతా ఒకటిగా నిలబడాలి

**కు**ల, మతతత్వాలను రెచ్చగొట్టి కష్టజీవులందరూ ఏకం గాకుండా చీల్చడానికి భూస్వాములు ప్రయత్నిస్తారు. దోపిడీ చేసేవాళ్ళకు వ్యతిరేకంగా వారి దోపిడీకి గురి అయ్యేవారంతా ఒక్కటిగా కులమత భేదాలతో నిమిత్తం లేకుండా కలసికట్టుగా నడవాలి.

ఈ సందర్భంలో మన గ్రామాలలోనున్న వాస్తవ పరిస్థితిని కూడా దృష్టిలో పెట్టుకొని తగిన రీతిగా తన ఉద్యమాన్ని నడిపినప్పుడే ఇది సాధ్యమవుతుంది.

అనంతవరం, కాజ గ్రామాలలో పరిశీలన సాగించినప్పుడు ఆర్థిక ప్రాబల్యం గల పై కులాల వారిలో, వెనుకబడిన కులాలలో, షెడ్యూల్డు కులాలు, జాతులలో ఆయా భూకమతాల పరిమితులలో ఈ క్రింది శాతమున్నారు.

| | అనంతవరం | | | కాజ | | |
|---|---|---|---|---|---|---|
| | పై కులాలలో | వెనకబడిన కులాలలో | షెడ్యూల్డు కులాలలో జాతులు | పై కులాలలో | వెనకబడిన కులాలలో | షెడ్యూల్డు కులాలు జాతులలో |
| భూమిలేనివారు | 18 | 50 | 81 | 7.5 | 28.0 | 53 |
| ఎకరం అంతకు లోపు | 21 | 33.5 | 17 | 15.5 | 40.5 | 40 |
| 1-2.5 వరకు | 21 | 11.0 | 2 | 24.0 | 7.8 | 7 |
| 2-5.5 వరకు | 13.7 | 3.5 | - | 37.0 | 22.0 | - |
| 5-10 వరకు | 13.3 | 1.5 | - | 11.0 | 1.4 | - |
| 10-యె. పైగా | 13.0 | 5 | - | 14.0 | 0.3 | - |
| మొత్తం | 100 | 100 | - | 100 | 100 | 100 |
| ఆయా కులాలలో కుటుంబాల సంఖ్య | 300 | 186 | 330 | 264 | 662 | 104 |



అనంతవరం గ్రామంలో షెడ్యూల్డు కులాల జాతుల కుటుంబాలలో నూటికి 98 మంది భూమిలేనివారు లేదా ఎకరంలోపు వున్న వ్యవసాయ కార్మికులు, పేదలు, వెనుకబడిన కులాలలో వీరి శాతం 83.5, పై కులాల వారిలో 39 శాతం ఉన్నారు. 2.5 ఎకరాలకు మించి భూమి వున్న కుటుంబాలలో పై కులాల వారి కుటుంబాలలో నూటికి 40 మంది వుంటే, వెనుకబడిన కులాల కుటుంబాలలో నూటికి 5 మంది మాత్రమే వున్నారు. షెడ్యూల్డు కులాలు, జాతులలో ఒక్కరూ లేరు.

ఇదే పరిస్థితి కాజ గ్రామంలో కూడా వుంది. షెడ్యూల్డు కులాల, జాతుల కుటుంబాలలో నూటికి 93 మంది భూమిలేని వారు లేదా ఎకరం అంతకు లోపు ఉన్నవారు, వెనుకబడిన కులాలలో నుండి 68 శాతం వుంటే పై కులాల నుండి 23 శాతం వున్నారు. 2.5 ఎకరాలకు మించిన కుటుంబాలను పరిశీలిస్తే షెడ్యూల్డు కులాలలో, జాతులలో ఎవరూ లేరు. వెనుకబడిన కులాల వారిలో 24 శాతమున్నారు. పై కులాల కుటుంబాలలో నూటికి 62 మందికి పరిమితి భూములున్నాయి.

అందుచే వ్యవసాయ కార్మికులంటే హరిజనులు లేదా వెనుకబడిన కులాలలో ఒక భాగమని, రైతులంటే పై కులాల వారు భూములున్న వారే అని సర్వసాధారణంగా అనుకోవడానికి ఆస్కారం వుంది. ఈ రెండు గ్రామాలలో 2.5 ఎకరాలు దాటిన (మాగాణి భూమి) కుటుంబాలు ధనిక రైతులు భూస్వాములుగా వుంటున్నారు. వారు పై కులాలలో నూటికి 50 - 60 మంది వరకుంటున్నారు. కాబట్టి పైపైన చేసే వారికి ఈ అవగాహన రావచ్చు.

కాని పై కులాలలో కూడా నూటికి 25-40 పాళ్ళు వ్యవసాయ కార్మికులు, పేద రైతులు వున్నారు. వీరుగాక మధ్యతరగతి రైతులు మరో 20-25 శాతంగా ఆ కులాలలో వుంటున్నారు. అందుకే మనం ప్రత్యేక కృషి చేసి పై కులాలలో వున్న ఈ కష్టజీవులను కలుపుకొని రాకపోతే భూస్వాములు కులం పేరు చెప్పి వీరినందరిని తమ వెంట తీసుకుపోగల్గుతారు. మన ఉద్యమానికి ఎంతో హాని కలుగుతుంది.

షెడ్యూల్డు జాతులలో, కులాలలో నూటికి 95 మంది వ్యవసాయ కార్మికులు కాబట్టి, మన వ్యవసాయ కార్మిక సంఘం ఈ కులాలకే, జాతులకే పరిమితి కారాదు. పై కులాలకు చెందిన వ్యవసాయ కార్మికులను కూడా అందులోకి తీసుకురావాలి.

# గ్రామాలలో ప్రజాస్వామ్యం బ్రతకాలంటే భూస్వామ్య విధానం రద్దు కావాలి

మన గ్రామాలలో పాతకాలపు జమిందారీ యుగపునాటి దోపిడీ పద్ధతులు, కుల భేదాలంటూ, వెనుకబడిన ప్రజలపైనా, ప్రధానంగా హరిజన, గిరిజన ప్రజలపైనా జరుగుతున్న సాంఘిక అత్యాచారాలు, స్త్రీలు వెనుకబడి వుండటం, సమాన హక్కులు, గౌరవం లేకుండా ఉండటం, నిరక్షరాస్యత 85-90 శాతం వరకు ఉండటం, గ్రామ పేదల బిడ్డలు ఐదవ తరగతి వరకు కూడా చదువుకోలేకుండా కడుపు కూటికి ఏ ఆసామి యింటిలోనో చాకిరి చేస్తూ వుండటం, వైద్య సదుపాయాలు అందుబాటులో లేకుండా అనేక జబ్బులకు గురికావడం మనకందరికీ తెలిసిన విషయాలే.

మరో జీవితాధారం లేని వ్యవసాయ కార్మికులు, పేద ప్రజల కూలి, దోపిడి, కౌలు దోపిడి, అప్పుల దోపిడికి గురై భూస్వాముల మీద ఆధారపడి బానిసలలాగా బ్రతకవలసి వున్నందున, గ్రామ పౌర జీవితంలో భూస్వాముల చెప్పుచేతలలో నడవవలసిన పరిస్థితి ఏర్పడుతూ వుంది. పంచాయతీ ఎన్నికలు, సహకార పరపతి సంఘాలు, గ్రామ వికాస సంక్షేమ సంఘాలు వీటి ఎన్నికలలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును కూడా వినియోగించుకోలేకపోతున్నారు. భూస్వాములే ఈ గ్రామ వ్యవస్థలన్నిటి మీద తమ పెత్తనాన్ని చెలాయిస్తున్నారు. ఉద్యోగస్తులను పోలీసులను, న్యాయాధికారులను తమ చేతులలో పెట్టుకొని గ్రామ ప్రజల మీద అనేక అన్యాయాలు గావిస్తున్నారు. గూండా గ్యాంగులను పోషిస్తూ, ప్రజలపై అనేక అత్యాచారాలు సాగిస్తున్నారు. ఈ అత్యాచారాలు, ఈ నిరంకుశ పెత్తనాలు కేవలం గ్రామ పేద ప్రజల మీదనే గాక మధ్యతరగతి సామాన్య ధనిక రైతుల మీద కూడా భూస్వాములు సాగిస్తూనే వున్నారు. స్వతంత్రంగా, గౌరవంగా తమ జీవితాన్ని గడుపుకోదలచుకున్న వారి మీద కాస్త న్యాయం, నీతి నిజాయితీలు గ్రామ జీవితంలో ఉండాలనుకొనే వాళ్ళ మీద,



భూస్వాముల చర్యలను ఏ మాత్రమైనా వ్యతిరేకించే వారందరి మీద ఈ దౌష్ట్యాలు సాగిస్తూనే వున్నారు.

గ్రామ పేదలకు కనీస జీవనోపాధి కలిగించాలంటే భూస్వామ్య విధానాన్ని రద్దు చేసిన భూములను పంచాల్సిన అవసరం పైన వివరించాం. దానితో పాటు గ్రామ ప్రజలు స్వేచ్ఛగా తమ పౌర జీవితం గడుపుకోవాలంటే గ్రామాలో ప్రజాస్వామ్యం బ్రతకాలంటే, గ్రామ జీవితాన్ని కలుషితం చేస్తున్న భూస్వాముల బలాన్ని బ్రద్దలు కొట్టాలంటే వారి భూములనన్నింటిని భూమిలేనివారికి పంచాలి. భూస్వామ్య విధానాన్ని రద్దు చేయాలి.

# భూపోరాటానికి ఐక్య సంఘటన

వ్యవసాయ కార్మికులు, పేద రైతులు తమ నిరుద్యోగాన్ని పోగొట్టుకొని తమ జీవిత సౌకర్యాలను శాశ్వతంగా పెంపొందించుకోవాలంటే భూస్వామ్య విధానాన్ని రద్దు గావించి భూమిని సాధించుకోవాలి. అనేక పాక్షిక సమస్యల మీద కలసి మెలసి పోరాడుతూ తమ చైతన్యాన్ని, సంఘటనను పెంపొందించుకుంటూ విస్తృత, దేశవ్యాప్త పోరాటం చేసి జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది.

వ్యవసాయ కార్మికులను, పేద రైతులను విడదీయరానివారుగా చూడాలి. సాధ్యమైనంత వరకు వారిరువురిని ఒకే సంఘంలో సంఘటిత పరచాలని లెనిన్ చెప్పాడు. వారిలో చీలికలకు దారితీసే ఏ చర్య తీసుకోకూడదని గట్టిగా చెప్పాడు. గ్రామ సీమలలో మన పునాది వ్యవసాయ కార్మికులు, పేద రైతులు.

ఈ పాక్షిక పోరాటాలలోను, అంతిమ భూపోరాటాలలోను విజయం సాధించాలంటే నిరంతరం మధ్యతరగతి రైతులను మనతో చాలా సన్నిహితంగాను, చాలా ఖచ్చితంగాను, స్థిరంగాను నిలబడి ఉండేటట్లు వారిని తప్పనిసరిగా ఐక్య సంఘటనలోకి తీసుకురావాలి.

ధనిక రైతులను కూడా కలుపుకు రావడానికి కృషి చేయాలి. వ్యవసాయ కార్మికులు, పేద రైతులు అనేక సమస్యల మీద వారితో ఘర్షణ పడవలసి వున్నా భూస్వాముల, ప్రభుత్వ అన్యాయాలకు వారు కూడా గురి అవుతూ ఉన్నారు. కాబట్టి వారిని కూడా కొంతవరకు కలుపుకు రావడానికి వీలుంటుంది. కనీసం భూస్వాములతో వారంతా పూర్తిగా కలవకుండా తటస్థంగానయినా ఉండేటట్లు కృషి చేయాలి. భూస్వామ్యవర్గాన్ని ఏకాకిని చేసి మన శత్రు సంఖ్యను తగ్గించి మన పోరాటంలో విజయం సాధించడానికి ఇది అవసరం.

భూస్వామ్య విధానాన్ని రద్దు చేసే అంతిమ భూపోరాటంలో విజయం సాధించడానికి జనతా ప్రజాస్వామ్య ప్రభుత్వ స్థాపనకు కేవలం గ్రామ సీమలలోని మధ్యతరగతి రైతులను ఖచ్చితంగా కలుపుకొని రావడం. ధనిక రైతులను సాధ్యమైనంతవరకు కలుపుకురావడం చాలదు. పట్టణాలలోని కార్మికవర్గంతో అవినాభావ సంబంధాలు ఏర్పరచుకోవాలి. పట్టణాలలోని మధ్యతరగతి ప్రజానీకాన్ని, బుద్ధిజీవులను కూడా కలుపుకురావాలి. జనతా ప్రజాస్వామ్య సంఘటనకు కార్మిక వర్గం ముందుండి భూస్వాముల – పెద్ద పెట్టుబడిదారుల ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి.



అంతిమ భూపోరాటానికి మెట్లుగానే నేడు గ్రామాలలో జరుగుతున్న వివిధ రకాల దోపిళ్ళకు వ్యతిరేకంగా పాక్షిక పోరాటాలు నడపాలి. కూలిరేట్ల పెంపుదల కోసం, కౌలు రేట్ల తగ్గింపు కోసం, కౌలు భూముల మీద జిరాయితీ, పట్టా హక్కుల కోసం, ఇండ్ల స్థలాల కోసం, వివిధ రకాలైన బంజర్ల పంపకం కోసం వానిపై పట్టాల కోసం పోరాడాలి. భూస్వాముల భూములనన్నిటిని స్వాధీనం చేసుకొనే లోపల నేడున్న భూసీలింగ్ చట్టాలలో నున్న లోపాలు, మినహాయింపులు తొలగించి వెనువెంటనే అమలు పరచడాని కోసం, సాంఘిక ఆర్థిక తదితర పాతకాలపు జమిందారీ దోపిళ్ళను రూపుమాపడానికోసం, సాంఘిక, ఆర్థిక తదితర పాతకాలపు జమీందారీ దోపిళ్ళను రూపుమాపడాని కోసం పోరాడాలి. ఏ సమస్యను తీసుకున్నా, ఏ నినాదాన్ని రూపొందించినా, ఏ పోరాట రూపాన్ని అవలంబించినా అవి ఆయా ప్రాంతాలలోని వ్యవసాయ కార్మిక పేద రైతుల చైతన్యస్థాయిని బట్టి, సంఘటన బలాన్ని బట్టి నిర్ణయించవలసి వుంటుంది. ప్రతి సమస్యలోను మధ్యతరగతి రైతును ఖచ్చితంగాను, ధనిక రైతును సాధ్యమైనంత వరకు కలుపుకొని రావడానికి, సమస్యలను తీసుకొనేటప్పుడు గ్రామాలలో విపరీతంగా దోచుకుంటున్న పెద్ద భూస్వాములకు వ్యతిరేకంగా మొదట కేంద్రీకరించి పని చేయాలి.

పేద రైతులు : తమకున్న కొద్దిపాటి భూమి మీద వచ్చే ఆదాయం తమ నికృష్ట జీవితానికి కూడా చాలక వీరిలో ఎక్కువ భాగం ఇతరులకు కూలికి పోవడమో లేదా ఇతర చిన్న వృత్తులలో పనిచేస్తుంటారనీ, వీరెప్పుడూ వ్యవసాయ కార్మికులను కూలికి పెట్టుకొని దోచుకోరనీ పైన చూశాము. వీరు వ్యవసాయ కార్మికుల వలే దాదాపు ఆ మోతాదులోనే భూస్వాముల, వడ్డీ వ్యాపారస్తుల, పెట్టుబడిదారుల దోపిళ్ళకు గురవుతున్నారు. అందుచే వడ్డీ నాము రేట్లు తగ్గించుకోవడానికీ, పాత అప్పులను రద్దు చేయించుకోవడానికి తమకు అవసరమైన అప్పులను, పరపతి సౌకర్యాలను సాధించుకోవడానికి, కౌలు రేట్లు తగ్గించుకోవడానికి, కౌలు భూములు, వివిధ రకాల బంజరు భూములపై జిరాయితీ పట్టా హక్కులు సంపాదించుకోవడానికి, భూస్వాముల భూములను పంచుకోవడానికి ప్రభుత్వం భూస్వాములకు అనుకూలంగా తీసుకుంటున్న చర్యలను, చట్టాలను వ్యతిరేకించడానికి తమ కూలిరేట్లను పెంచుకోవడానికి వ్యవసాయ కార్మికులు సాగించే పోరాటాలన్నీ పేద రైతులకు కూడా లాభించేవే. పేద రైతులు తమకున్న భూములకు, కొత్తగా సాధించుకున్న భూములకు నీటి సదుపాయాలు కలుగజేయాలనీ, ఎరువులు, పనిముట్లు, పశువులు సరఫరా చేయాలనీ, వివిధ పన్నుల నుండి తమ్ము మినహాయించాలనీ జరిపే ఆందోళన పోరాటాలు తమకు వెనువెంటనే మరింత లాభం చేసేవే గాని వ్యవసాయ కార్మికులతో ఘర్షణ పడేవి ఏమీ గావు. ఇరువురూ కలిసి పోరాడితేనే ఉభయ వర్గాలు తమ తమ కోర్కెలను తేలికగా సాధించుకోగలరు.

**మధ్యతరగతి రైతులు :** వీరిలో గణనీయమైన సంఖ్య, రోజు కూలీలను, చిన్న పాలేర్లను, చిల్లర, మల్లర వ్యవసాయ పనులకు గాను, పశువులను కాయుటకు గాను, ఇండ్లలో అనేక పనులు చేయడానికి గాను పెట్టుకుంటున్నారని పైన చూశాం. అదేవిధంగా వీరిలో కొంతమంది పెద్ద మొత్తంలో అప్పులు ఎక్కువ వడ్డీ రేట్లకు, నాము రేట్లకు తమ కన్న పేదలుగా వున్నవారికి పెడుతూ వుంటారు కూడా. ఈ విషయాలలో కొంతవరకు వీరు వ్యవసాయ కార్మికులతోను, పేద రైతులతోను ఘర్షణ పడతారు.

కాని వీరు కూడా నేటి బూర్జువా భూస్వామ్య ప్రభుత్వ విధానాల వల్ల ఈ ప్రభుత్వ చట్టాలు, చర్యల వల్ల అనేక బాధలకు, దోపిళ్ళకు ఎక్కువగానే గురవుతున్నారు. కౌలు దోపిడీ, వడ్డీ దోపిడీ, అధిక పన్నుల బాధకు గురవుతున్నారు. తమ వ్యవసాయానికి కావలసిన నీటి సౌకర్యాలు లేవు. ఎరువులు, పనిముట్లు, మేలు రకమైన విత్తనాలు తేలికగా లభ్యం కావడం లేదు. దొంగ మార్కెట్‌లలో కొనుక్కోవలసి వస్తూ వుంది. ఇవన్నీ ప్రధానంగా భూస్వాముల చేతుల్లోకి, ఆ తర్వాత ధనిక రైతుల చేతుల్లోకి పోతున్నాయి.

ప్రభుత్వం ప్రధానంగా వ్యవసాయోత్పత్తి కోసం భూస్వాములు, ధనిక రైతుల మీదనే ఆధారపడి వారికే తాము ఖర్చు పెట్టే డబ్బులో అత్యధిక భాగం దొరికేటట్లు, తన కమ్యూనిటీ ప్రాజెక్టులు, సహకార పరపతి సంఘాలు, పంచాయతీ రాజ్ సంస్థలను వినియోగిస్తున్నది. వీరు విపరీతమైన పన్నులకు గురవుతున్నారు. పైగా రోజు రోజుకు ఆ పన్నులు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగస్తుల లంచగొండితనానికి, దౌర్జన్యాలకు గురి అవుతున్నారు.

అంతేగాకుండా వీరు పండించే పంటలకు న్యాయమైన ధరలు, గిట్టుబాటు అయ్యే ధరలు కూడా దొరకడం లేదు. మాసూళ్లలో ధరలు బాగా పడిపోతాయి. వీరు తమ వద్ద నున్న పంటను, ఆ తక్కువ ధరలకే అమ్ముకొని తాము తెచ్చుకున్న అప్పులను, ప్రభుత్వ పన్నులను చెల్లించాల్సి వస్తూ వుంది. వానిని కొని నిల్వచేసుకున్న భూస్వాములు, పెద్ద వ్యాపారస్తులు, ఆ తర్వాత రెండు మూడు నెలలకే చాలా ఎక్కువ ధరలకు అమ్ముకొని విపరీత లాభాలు ఆర్జిస్తున్నారు.

వీరు పండించే పంటల కన్నిటికి, మాసూళ్ళలోనే న్యాయమైన ధరలు గ్యారంటీ చేస్తూ వారికి ఆ ధరలు దొరికేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. న్యాయమైన ధరలంటే ఈ సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు కనీస జీవిత స్థాయికి కావలసిన నికరాదాయం, వ్యవసాయ ఖర్చులు పోను వారికి లభ్యమయ్యేటట్లు ఆ ధరలుండాలి.

ఆహార పంటలయితే ప్రజాసామాన్యానికి అందుబాటులో ఉండే రీతిగా చౌకగా ఉండాలి. భూస్వాముల వద్ద నున్న అదనపు ఆహార గింజల నన్నింటిని వారు వ్యవసాయానికి, విత్తనాలకు, వ్యవసాయ కార్మికులకు, పాలేర్లకు ఖర్చు పెట్టే గింజలు, వారి కుటుంబ పోషణకు



కావలసిన గింజలు పోను, మిగిలిన పంటనంతా ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలి. వారికిచ్చే ధరలు వ్యవసాయ ఖర్చులు పోను కొద్దిపాటి లాభాలు మిగిలేటట్లు ఉంటే సరిపోతుంది. ఆ రీతిగా భూస్వాముల ధాన్యాన్నంతా సేకరించడానికి నిర్ణయించిన ధరకన్నా అదనంగా బోనస్ రూపంగా పేద మధ్యతరగతి రైతుల ఆహార పంటలకు యిచ్చి వీరికి కనీస జీవిత స్థాయిని గ్యారంటీ చేయాలి. భూస్వాముల ధాన్యాన్ని సేకరిస్తే (మొత్తం దేశంలో పండే పంటలలో సగం వరకు వీరి చేతులలోనే ఉంది). గ్రామాలలోను, పట్టణాలలోను జనసామాన్యానికంతా, వారికి అందుబాటులో ఉండేటట్లు చౌక ధరలకు సరఫరా చేయడం సాధ్యమవుతుంది. పంట గింజల లెవీ పేద మధ్యతరగతి ధనిక రైతుల నుండి వసూలు చేయకూడదని, భూస్వాముల నుండే మొత్తాన్ని సేకరించాలని మనం డిమాండ్ చేస్తున్నాము.

మధ్యతరగతి రైతు తమ బిడ్డలకు చదువు సంధ్యలు చెప్పించుకొని తగిన ఉద్యోగాలు, వృత్తులు సంపాదించుకోలేక నిరుద్యోగానికి గురవుతూ వీరిలో ఎక్కువ భాగం ఆర్థికంగా క్రమేణా దివాలా తీస్తున్నారు.

అందుచేత ఈ సమస్యలన్నిటి మీద వీరి ఆందోళనా పోరాటాలకు వ్యవసాయ కార్మిక, పేద రైతుల సహకారం, బలం అత్యంత అవసరం. ఈ సమస్యలన్నిటిమీద వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, వారి సంఘాలు చొరవ తీసుకొని మధ్యతరగతి రైతులను బలపరచడానికి ముందుకు రావాలి. దానివలన వీరిని కూడా భూస్వామ్య దోపిడీకి, బడా పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా తమతో కలుపుకురావడం తేలిక అవుతుంది.

అంతేగాక వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, తమ కూలి రేట్లు పెంచుకోవడాని కోసం, కౌలు రేట్లు తగ్గించుకోవడానికి పోరాడేటప్పుడు, భూస్వాములకు వ్యతిరేకంగా తాము జరిపే పోరాటాన్ని బలపర్చుతూ తమతో కలిసి మధ్యతరగతి రైతులు ముందుకు వస్తే వారి నుండి కొంత తక్కువ కూలిరేటు తీసుకోవడానికి, వారికి కొంత అదనంగా కౌలు రేటు ఇవ్వడానికి రాజీకి తయారుగా వుండాలి. భూస్వాముల మీద కేంద్రీకరించి పోరాడేటప్పుడు వీరి సహాయం పొందడానికి ఈ సడలింపులకు వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, వారి సంఘాలు సంసిద్ధత చూపాలి. అదే విధంగా ఈ మధ్యతరగతి రైతులకు చెల్లించాల్సిన అప్పుల విషయంలో కౌలు భూమిని తిరిగి వీరికి సొంత సాగుకు ఎంత వదలాలి అనే తగాదాలలో కూడా ఈ సడలింపులు చూపాలని పైన చెప్పి వున్నాం.

ధనిక రైతులు భూస్వాముల మీదనే పన్నులు వృద్ధి క్రమానుసారంగా వేసుకోవచ్చు గాని మధ్యతరగతి రైతుల మీద పన్నుల భారం పెంచరాదని, తగ్గించాలనీ, వ్యవసాయ కార్మికులు, పేద రైతులు ఆందోళన చేయాలి.

ఇలాంటి మిత్ర వైఖరినే మధ్యతరగతి వృత్తిదారుల యెడల, చిన్న చిన్న పరిశ్రమాధిపతులు, చిన్న చిన్న వ్యాపారస్తుల యెడల కూడా ఆరంభించవలసి వుంటుంది.

**ధనిక రైతులు :** వీరితో కూలిరేట్లు, కౌలు రేట్లు, వడ్డీ రేట్లు, ఇతర వివిధ విషయాలలో వ్యవసాయ కార్మికులు, పేద రైతులు చాలా సందర్భాలలో ఘర్షణ పడవలసి వుంటుంది. అయినా వీరు కూడా తాము పండించే పంటలకు నిలకడైన ధరలు లేక గుత్త పెట్టుబడిదారుల, గుత్త వ్యాపారస్తుల చేతులలో పీడించబడుతూ విపరీతమైన నష్టాలకు గురై, చాలా సందర్భాలలో దివాళా తీసే స్థితికి కూడా వస్తున్నారు. పొగాకు, చెరకు, జ్యూట్, ప్రత్తి, నూనెగింజలు, ఇతర వ్యాపార పంటలు తమకు గిట్టుబాటయ్యే ధరలకు అమ్ముడుపోక దివాళా తీస్తున్నారు. లేదా రావలసిన లాభాలలో ఎక్కువ భాగం, చాలా పెద్ద భాగం పెద్ద భూస్వాములకు, పెద్ద వ్యాపారస్తులకు వదిలివేసి అన్యాయానికి గురికావలసి వస్తూ వుంది. ప్రభుత్వం తాను వేసే పన్నులను భూస్వాముల మీద, పెట్టుబడిదారుల మీద ప్రధానంగా వేయకుండా, వీరి మీద కూడా ఎక్కువగా వేసి వీరి లాభాలను కుదించి వేస్తూ వుంది. ప్రభుత్వం యిచ్చే సౌకర్యాలలో చాలా ఎక్కువ భాగం భూస్వాములకు పోను వీరికి మిగిలేది స్వల్ప భాగమే. నోట్ల ముమ్మరానికి గురై, మార్కెట్ ఒడిదుడుకులలో నిలకడగల ఆదాయం లేకపోవడమే గాక, వీరిలో చాలామంది దివాలా తీసే స్థితికి కూడా తరచు ఏర్పడుతూ వుంది. ప్రభుత్వ ఉద్యోగస్తుల లంచగొండితనానికి, దౌర్జన్యాలకు, అక్రమాలకు కూడా వీరు తీవ్రంగానే గురవుతుంటారు. అందువలన ఈ సమస్యలన్నిటి మీద భూస్వాములకు, గుత్త పెట్టుబడిదారులకు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వీరిని బలపరచవలసి వుంటుంది. ఈ రీతిగా వీరిని జనతా ప్రజాస్వామిక సంఘటనలోకి ఒక మేరకైనా తీసుకురావలసి వుంటుంది.

వ్యవసాయ కార్మికులు, పేద రైతులు ఆంధ్రదేశంలో మొత్తం జనాభాలో 70 శాతం ఉన్నారు. తమ జీవిత సమస్యలను పరిష్కరించుకోవాలంటే సోషలిస్టు సమాజ నిర్మాణానికి ప్రాతిపదికగా ప్రస్తుతమున్న భూస్వామ్య గుత్త పెట్టుబడిదారీ ప్రభుత్వాన్ని కూలద్రోసి జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవడం తప్ప మరో మార్గమేదీ లేదు. అలా జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పరచనిదే దున్నేవానికి భూమి నినాదాన్ని అమలులోకి తేవడం అసంభవం. ప్రభుత్వాన్ని, భూస్వాములను మెడలు వంచి కొంతవరకైనా బంజరు భూములను పంచేలాగ చేయడం వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు బలమైన, శక్తివంతమైన, సుశిక్షితమైన నిర్మాణం వుంటే నేటి సమాజంలో కూడా సాధ్యమే. శక్తివంతమైన ప్రజా పోరాటాల ద్వారా కూలి రేట్లు పెంచుకోవడం, కౌలు వడ్డీ, నాము రేట్లు తగ్గించుకోవడం, తాము సాగు చేసుకొనే భూముల నుండి కౌలుదార్లు బేదఖలు చేయబడకుండా చేయడం, గ్రామీణ పేద ప్రజలకు ఉచితంగా ఇండ్ల స్థలాలు సంపాదించడం కొన్ని పరిమితులలో సాధ్యమే. ఈ విధంగా గుత్త పెట్టుబడిదార్లు, వడ్డీ వ్యాపారస్తులు, టోకు వర్తకులు, జమిందారీ పెట్టుబడిదారీ భూస్వాముల



దోపిళ్ళకు వ్యతిరేకంగా జరిగే ఈ పాక్షిక పోరాటాలు ఆ తర్వాత దశలో విప్లవాత్మకంగా భూస్వాముల భూమినంతా పంచడానికి వీలుగా వ్యవసాయిక విప్లవ శక్తిని బలపరుస్తాయి. జనతా ప్రజాస్వామిక విప్లవ విజయానికి దారితీస్తాయి.

ఈ వ్యవసాయిక విప్లవాన్ని, జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయవలసిన అవసరం, దానికి కావలసిన శక్తి, ఆ కర్తవ్యం వ్యవసాయ కార్మికులు పేద రైతుల మీద ప్రధానంగా ఉంది. ఆ శక్తి వారికే వుంది. దానికోసం మధ్యతరగతి రైతులను ఖచ్చితంగాను, ధనిక రైతులను కూడా సాధ్యమైనంత వరకు కలుపుకు రావలసిన బాధ్యత ప్రధానంగా వీరి మీద వుంది. వారి సంఘాల మీద వుంది. వారి నాయకత్వం మీద వుంది.

నేటి గుత్త పెట్టుబడిదారీ భూస్వామ్య ప్రభుత్వపు బూటకపు వాగ్దానాల మీద, చట్టాల మీద, దాని కోర్టులు, న్యాయాన్యాయ తీర్పుల మీద ఆశలు పెట్టుకుంటూ ఎదురు చూస్తూ ఉండటం నిష్ప్రయోజనం. ధనిక రైతులు పెట్టుబడిదారీ భూస్వాములు "జాతీయ" పెట్టుబడిదారీల వర్గాల మీద వారి ప్రయోజనాలను ప్రతిధ్వనిస్తూ వారితో అవినాభావ సంబంధాలు కల్గిన పార్టీల మీద, వారి వాగ్దానాల మీద ఆధారపడి ఎదురుచూస్తూ ఉండటం నిష్ప్రయోజనం.

వ్యవసాయ కార్మికులు, పేద రైతులు తామే ముందుకు వచ్చి కీలక పారిశ్రామిక కేంద్రాలలోను, కీలక పట్టణ ప్రాంతాలలోను అచ్చట వున్న శ్రామిక వర్గంతో పాటు నిలబడాలి. మధ్యతరగతి రైతు ప్రజానీకాన్ని, పట్టణాలలోని మధ్యతరగతి ప్రజానీకాన్ని బుద్ధిజీవులను కలుపుకుంటూ భూస్వామ్య గుత్త పెట్టుబడిదారీ వర్గాలపై కేంద్రీకరించి నడిచే శ్రామికవర్గ విప్లవ వాహినికి అండదండగా అభేద్యమైన మానవ కంచుకోటను నిర్మిస్తూ నిలబడాలి. శత్రువుల దాడి నుండి ఆత్మరక్షణ చేసుకొంటూ జనతా ప్రజాస్వామిక విప్లవ విజయానికి వ్యవసాయ కార్మికులు, పేద రైతులు నిలబడాలి. అప్పుడే భూస్వామ్యానికి గుత్తపెట్టుబడిదారీ విధానానికి ఆ వర్గాల పార్టీలైన కాంగ్రెస్, జనసంఘం లాంటి పార్టీలకు మన దేశంలో స్థానం లేకుండా చేసి భారతదేశంలో జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని, దానిలో అంతర్భాగంగానే విశాలాంధ్రలో ప్రజారాజ్యాన్ని స్థాపించగలం, సోషలిస్టు సమాజానికి దారి ఏర్పరచగలం.

# ప్రజారంగాలు - సంఘాలు

# రాజకీయ, సాంస్కృతిక వ్యాసాలు



# ప్రజా సంఘాలు - పార్టీ నిర్మాణం

(గుంటూరు జిల్లా, తెనాలి తాలూకా, కొల్లిపరలో 1974 డిసెంబరు 27 నుండి 1975 జనవరి 2 వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ కార్యకర్తల పాఠశాలలో కామ్రేడ్ సుందరయ్య గారి వివరణ)

ప్రజాసంఘాలు వేరు, పార్టీ వేరు. అవి రెండూ విభిన్నమైనవనే విషయాన్నీ, వాటి మధ్యగల తేడాను గుర్తించటం అవసరం. ప్రజా సంఘాలలో రెండు విధాలున్నాయి. (1) వర్గ సంఘాలు, (2) అనుబంధ వర్గ సంఘాలు.

ప్రభుత్వం క్రిందగాని, ఒక యజమాని క్రిందగాని పనిచేసే వారి సంఘాలు కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్లు. ఇవి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం అలాంటి వర్గసంఘాలే. విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు వర్గ సంఘాలుకాదు. వాటిని అనుబంధ వర్గసంఘాలని పిలుస్తాం.

వర్గసంఘానికి – పార్టీకి మధ్యగల తేడాను మనం స్పష్టంగా దృష్టిలో వుంచుకోవాలి. వర్గసంఘంలో ఆ వర్గానికిచెందిన ప్రతివారూ చేరే అవకాశంవుంది. కాగా పార్టీ అలాంటికాదు. వర్గం తరపున రాజకీయాధికారం కోసం, ఆ వర్గంలో బాగా చైతన్యం పొందిన కార్యకర్తలందరినీ అగ్రశ్రేణిని కూడగట్టి ఏర్పరచినదే పార్టీ.

ఉదాహరణకు : కాంగ్రెసు – పెట్టుబడిదారీ, భూస్వామ్యవర్గాలపార్టీ! కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) కార్మికవర్గ పార్టీ.

ఇక వర్గ సంఘాలలో ఆ వర్గానికి చెందిన ప్రాథమిక చైతన్యం వున్న వాళ్ళంతా చేరవచ్చు.

కార్మికులుగాని, వ్యవసాయ కార్మికులుగాని, రైతులుగాని తమ ఆర్థిక కష్టాలను పోగొట్టుకోవాలన్నా, కూలిరేట్లు, కౌలురేట్లు మొదలుగాగల సమస్యలను పరిష్కరించుకోవాలన్నా ఎవరికివారు ఒంటరిగా వుంటే సాధ్యంకాదని, బాధపడే వాళ్ళంతా ఒకటిగా వ్యవహరించేందుకు, సమిష్టిగా పనిచేసేందుకు ఒక సంఘంగా ఏర్పడాలనే గుర్తింపే సంఘ

చైతన్యం. బాధలు పడేకొద్దీ ఆ చైతన్యం రావటం సహజం. దానినే ట్రేడ్ యూనియన్ చైతన్యం అనికూడా అంటాం. ప్రధానంగా ఆర్థిక హక్కులకోసం పోరాడటం వరకే ట్రేడ్ యూనియన్ చైతన్యం పరిమితమై వుంటుంది. కాని కష్టాలు తొలగిపోవాలంటే ఆ చైతన్యమే సరిపోదు. ట్రేడ్ యూనియన్లతోనే చాలదు. సమ్మెలు, ప్రదర్శనలతోనే చాలదు.

యజమానులతో పోరాడటమే చాలదు. ప్రభుత్వంతోకూడా రాజకీయంగా పోరాడాలన్న చైతన్యం కూడా క్రమేణా ఏర్పడుతుంది. ఆ చైతన్యం పెరిగేకొద్దీ అందులోని అగ్రశ్రేణి కార్యకర్తలంతా చేరి ఏర్పరచుకున్నదే పార్టీ.

నా రాజకీయాలను, పార్టీ కార్యక్రమాన్ని అంగీకరిస్తేనే ప్రజాసంఘంలో చేర్చుకుంటాననటం తప్పు. వ్యక్తిగా ఏ రాజకీయాభిప్రాయాలు కలిగివున్నా, ఏ పార్టీకి చెందివున్నా ఒకే సంఘంలో వుండి, యజమానిపై పోరాడేందుకు సిద్ధంగా వుంటే అలాంటి వాళ్ళందరినీ చేర్చుకోవాలి. తమ రాజకీయాలతో నిమిత్తం లేకుండా ఎవరయినా ప్రజా సంఘంలో చేరవచ్చు. రాజకీయాలు వేరుగాబట్టి ప్రజా సంఘంలో చేరననిగాని, చేర్చుకోననిగాని చెప్పటం తప్పు.

పార్టీ విషయంలో అలాకాదు. రాజకీయ పార్టీకి ఒక రాజకీయ కార్యక్రమం వుంటుంది. దానిని అంగీకరించినవాళ్ళే అందులో చేరటానికి అర్హులవుతారు. పార్టీ కార్యక్రమాన్ని అంగీకరించిన వారందరినీ అలా అంగీకరించినంత మాత్రాన్నే పార్టీలో చేర్చుకోవటం కూడా జరగదు. కొన్ని కనీస విధులను నిర్వర్తించడానికి అంగీకరించితేనే చేర్చుకోవడం జరుగుతుంది.

ప్రజా సంఘాలలో రాజకీయ విభేదాలతో నిమిత్తం లేకుండా అందరూ చేరవచ్చునని, ఏ రాజకీయాభిప్రాయాలున్నా ఒక వర్గం వారంతా ఒక సంఘంగా కలిసి వ్యవహరించవచ్చునని చెప్పుకుంటున్నా ఆచరణలో మాత్రం అలాలేదు. మన వ్యవసాయ కార్మిక సంఘంగాక మితవాద కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన మరొక వ్యవసాయ కార్మికసంఘం వుంది. అలాగే మన రైతుసంఘంగాక వారిదీ మరో రైతుసంఘం వుంది. ట్రేడ్ యూనియన్ రంగంలోనూ అంతే. సి.ఐ.టి.యు.కి అనుబంధంగా కొన్ని యూనియన్లు పనిచేస్తుంటే, మరికొన్ని ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధంగావుండి పనిచేస్తున్నాయి. ఒకే పరిశ్రమలో వాళ్ళ యూనియన్, మన యూనియన్ కూడా వున్నాయి. ఇవిగాక ఐ.ఎన్.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్. యూనియన్లున్నాయి. ఆర్.ఎస్.పి., ఎస్.యు.సి., ఫార్వర్డుబ్లాక్, జన సంఘ్ తదితర పార్టీల ఆధ్వర్యాన మరికొన్ని ట్రేడ్ యూనియన్లు నిర్వహణ జరుగుతోంది.

అలాగే విద్యార్థుల మధ్యనా వివిధ సంఘాలేర్పడి పనిచేస్తున్నాయి. నేషనల్ యూనియన్ ఆఫ్ స్టూడెంట్సు లేక విద్యార్థి కాంగ్రెస్, అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్,



డెమోక్రాటిక్ స్టూడెంట్సు యూనియన్, ప్రోగ్రెసివ్ స్టూడెంట్సు యూనియన్ తదితర సంఘాలున్నాయి.

స్త్రీలలో వేర్వేరు సంఘాలు – భారతీయ మహిళల జాతీయ సమాఖ్య (మితవాద కమ్యూనిస్టుల యాజమాన్యాన వుంది), అఖిల భారత మహిళాసభ (కాంగ్రెసు పార్టీ యాజమాన్యాన) మొదలగునవి వున్నాయి.

ఒకే రంగంలో ఒకేసంఘం అందరూ కలిసి పనిజేయటానికి ఉండాలనే అందరూ చెబుతారు. ఒక పరిశ్రమకు ఒకే ట్రేడ్ యూనియన్, ఒక వర్గానికి ఒకే సంఘం వుండాలనే మనమూ కోరుతున్నాం కేవలం అలా చెప్పటమేకాదు. వర్గ సంఘాలలో వారివారి రాజకీయాభిప్రాయాలేమయినా ఆ వర్గానికి చెందిన వారందరూ వుండునట్లుగా ఆచరణలో తగిన ఏర్పాట్లు చేయడంద్వారా అవకాశం కల్పించాలని మనం కోరుతున్నాం.

అందుకుగాను వర్గ సంఘాలలో, కమిటీల ఎన్నికలో దామాషా ఓటింగు పద్ధతి వుండాలని మనం కోరుతున్నాం. అందువల్ల ఆయా ప్రజాసంఘాలలో వుండే వివిధ ధోరణులు గలవారికి వారి బలాబలాల దామాషాన నాయకత్వ సంస్థలలో ప్రాతినిధ్యం లభించుతుంది. అందరినీ కలుపుకుని యజమానికి వ్యతిరేకంగా పోరాడాలి. ఆర్థిక, తక్షణ కోర్కెల సాధనకై కృషిచేసే సందర్భంలో రాజకీయ దృక్పథాలు గలవారిని, వర్గంలోని సాధ్యమైనంత హెచ్చుమందిని కలుపుకొచ్చేందుకు కృషిచేయాలి.

ప్రజా సంఘాల రోజువారీ కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రజలలో పనిచేస్తూ వుంటే – ఆ తరువాత సోషలిజాన్ని సాధించటం అత్యావశ్యకమన్న చైతన్యం ఏర్పడితేనే పార్టీలో చేరటానికి సిద్ధమవుతారు. ప్రజా సంఘాల్లో పనిజేయటాన్ని గూర్చి పరిశీలించిన తర్వాతనే ఎవరినైనా పార్టీలోకి తీసుకుంటాం. ముందుగా ప్రజా సంఘాల్లో చేరి పనిచేసి అనుభవం పొంది, ఆ అనుభవం ద్వారా ఈ రాజకీయ వ్యవస్థ పోవాలన్న చైతన్యం పొందిన తర్వాతనే పార్టీలో సభ్యత్వం పొందటానికి అర్హత ఏర్పడుతుంది.

మొదట ట్రేడ్ యూనియన్ చైతన్యం పొందిన తర్వాతనే పార్టీ చైతన్యం ఏర్పడుతుంది. అయితే అలా చైతన్యాన్ని పెంపొందించటానికి కొంత ప్రయత్నం, కృషి అవసరం.

## ప్రజా సంఘాల ఆవశ్యకత

ప్రజా సంఘాల అవసరమేమిటి? పార్టీ చాలదా? అనే ప్రశ్నలు తరచువేయబడుతూ వుంటాయి.

ఎన్నికలలో పార్టీకి వోటువేసిన వాళ్ళంతా, అభిమానులంతా తాము కమ్యూనిస్టులమనే చెప్పుకుంటారు. అయితే, పార్టీలో కొద్దిమందినిమాత్రమే చేర్చుకోగలం. మిగిలిన వాళ్ళందరినీ కమ్యూనిస్టులు కాదంటే వారికి కోపం కూడా వస్తుంది. అలాగని అందరినీ చేర్చుకొనటం సాధ్యంకాదు. పార్టీ కార్యక్రమాన్ని అంగీకరించి, పార్టీ నిర్మాణానికి కట్టుబడి, క్రమశిక్షణకు కట్టుబడి పనిచేసే చైతన్యం వున్న వారిని మాత్రమే చేర్చుకొనగలం. ఇన్ని నియమ నిబంధనలు పెట్టుకున్నా 1962 నాటికి నాయకుల్లోనే సగంమందికి పైన మార్క్సిజాన్ని విడనాడి పోయారు.

పార్టీ కార్యక్రమాన్ని అంగీకరించినా క్రమశిక్షణకు కట్టుబడజాలమని, నిబంధనలకు లోబడి పనిచేయజాలమని, పార్టీకి వెలుపలనే వుండి పనిచేస్తామనేవారూ వుంటారు.

అలాంటి వారందరినీ ఏమి చేయాలి? వారందరికి ఒక వేదిక, చర్చించుకునే అవకాశం కల్పించాలి. అందుకుగాను సంఘం కావాలి.

అంతేకాదు, కమ్యూనిస్టుపార్టీకి విస్తారమైన ప్రజానీకాన్ని కదిలించే దానికిగాను ప్రజలకు, పార్టీకి మధ్యన ప్రజా సంఘాలు అవసరం. ప్రజాసంఘం ప్రజలను సమీకరించి వారితో చర్చలు నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటూ కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

ప్రజా సంఘాలు లేకుండా కమ్యూనిస్టు పార్టీ లేదు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ప్రజా సంఘాలలోను, వాటి కమిటీలలోను వుండి పనిచేస్తారు.

## వ్యవసాయ కార్మిక సంఘం

పార్టీకి – ప్రజలకూ వుండే అలాంటి సంఘాలలో వ్యవసాయ కార్మిక సంఘం ఒకటి.

వ్యవసాయ కార్మిక సంఘాన్ని యెలా ఏర్పాటు చేయటం అనేదాన్ని గూర్చి స్పష్టమైన అవగాహన వుండాలి.

వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఒక గ్రామంలో యేర్పాటు చేయబూనుకున్నప్పుడు గ్రామంలో వ్యవసాయ కార్మిక సమావేశం ఏర్పాటు చేస్తాం. మనకు ఫలానా కష్టాలున్నాయని, వాటిని తొలగించుకునేందుకుగాను అందరూ కలసి ఒక సంఘం పెట్టుకుని కలిసి పనిచేద్దాం అని చెబుతాం. ఆ సందర్భంగా వచ్చే ప్రశ్నలకు సమాధానాలు చెప్పి నచ్చజెప్పుతాం. ఏ పార్టీకి చెందినా సరే, ఏ కులానికి, ఏ మతానికి చెందినాసరే అందరూ సంఘంలో చేరవచ్చునేది – అలాంటి ప్రశ్న అడిగినప్పుడే చెబుతాం. అంతేకాదు, అందరినీ చేర్చేందుకు



ప్రయత్నించాలి. ఇంటింటికీ తిరిగి, పనిచేసుకునే వాళ్ళందరినీ కలుసుకుని సంఘంలో చేర్పించేందుకు పూనుకోవాలి. గ్రామంలోని వ్యవసాయ కార్మికులందరినీ సంఘంలో చేర్చుకునే ప్రయత్నం చేశామా? అయినా అందరూ ఎందుకని చేరలేదు? ఏమేమి ప్రశ్నలెదురయినాయి? వీటన్నింటిని గూర్చి ఆలోచించుకోవాలి. మగ వాళ్ళు చేరితే చాలునని సరిపుచ్చుకోవటం తగదు. స్త్రీలను కూడా చేర్చుకోవాలి.

మనం పనిచేస్తున్న గ్రామాలలోనే, గ్రామంలోని వ్యవసాయ కార్మికులలో సగం మందిని చేర్పించినా మన సంఘ సభ్యత్వం యిప్పుడున్న దానికంటే ఎంతో హెచ్చుగా వుండవలసింది.

**రెండవ అంశం :** సభ్యత్వం చేర్పించటంతోనే చాలదు. సంఘాన్ని పనిచేయించేట్లు చూడాలి. వారానికొకసారో, 15 రోజులకొకసారో సమావేశాలు జరుపుతూ వుండాలి. గ్రామంలో వ్యవసాయ కార్మికులకెదురయ్యే సమస్యలను చర్చించి నిర్ణయాలు తీసుకొనేందుకొక కమిటీని యేర్పాటు చేయాలి. ఎవరయినా నాయకులొచ్చినప్పుడు మాత్రమే కనబడే సంఘంగా వుండరాదు. కలిసికట్టుగా పనిచేసేందుకు గ్రామ కమిటీ వుండాలి. ప్రతి గ్రామానికీ కాకపోయినా పది గ్రామాలకొకటైనా, కనీసం బ్లాకుకు ఒక్కటయినా ఆఫీసులు పెట్టుకోవాలి.

కమిటీలు సక్రమంగా పనిచేయాలి. వీలయితే గ్రామ స్థాయిలోనే కమిటీలు ఏర్పాటు చేయాలి. అలా వీలుపడనిచోట్ల కొన్ని గ్రామాలకు కలిపి ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవచ్చు. కాని, వీలయితే గ్రామానికే ఒక కమిటీ యేర్పాటు చేసుకొనటం యెక్కువ ప్రయోజనకరంగా వుంటుంది. ఆ కమిటీలు ప్రజాస్వామ్య పద్ధతిలో పనిచేసేట్లు చూడాలి.

**మూడవ అంశం :** ఏదయినా ఒక సమస్య వచ్చినప్పుడు నిర్ణయం ఎలా తీసుకోవాలి? ముందుగా వ్యవసాయ కార్మిక సంఘపు గ్రామ కమిటీ సమావేశమై చర్చించాలి. ఆ తర్వాత గ్రూపులవారీగానూ, అనంతరం గ్రామం అంతటికీ కలిపి సమావేశాలు జరపాలి. ఫలానా విధంగా చేస్తే ఆ సమస్యను పరిష్కరించుకోవచ్చునని కమిటీ అభిప్రాయాన్ని వారికి చెప్పాలి. ఆ సమావేశాలలో దానిపై సూచనలను, అభిప్రాయాలను తీసుకోవాలి. ఆ తర్వాత మరల కమిటీ సమావేశమై వానినన్నింటినీ దృష్టిలో వుంచుకొని చర్చించి నిర్ణయించాలి. మరల ప్రజలకు చెప్పి ఆ నిర్ణయాన్ని అమలు జరపాలి.

ఇక పని నిర్వహణలో కమిటీ సభ్యులేగాక సాధారణ వ్యవసాయ కార్మికులు సైతం చురుకుగా పాల్గొనేటట్లు చేయాలి. నాయకులే చేసిపెడతారనే భావానికి తావులేకుండా పనివిభజన జరిపి పనినిర్వహణ బాధ్యతను అప్పజెప్పాలి. సాధారణ సభ్యులకు, ఎవరికి ఏ మేరకు తీరికవుంటే ఆ మేరకు పనియివ్వాలి.

**నాలుగవ అంశం :** సంఘం అంటే ఏమి పనిచేయాలి? వ్యవసాయ కార్మిక సంఘం చేయవలసింది కూలిరేటు పెంపుదల కోసం పనిచేయటమొక్కటే కాదు, ఇంకా అనేక పనులున్నాయి. ప్రజలకు ఏ బాధ కలిగినా సంఘం ఆదుకోవాలి. బాధల్లోనే కాదు అవసర సమయాల్లో అప్పులు సంపాదించటం మొదలు జీవితావసర వస్తువుల సరఫరా వరకు యెన్నో పనులు చేయవచ్చు. ఇళ్ళ నిర్మాణానికి, పనులు చేసుకొనటానికి సహకార సంఘాలు ఏర్పాటుచేసి నడపవచ్చు. ఇళ్ళ స్థలాలు, వైద్య సౌకర్యాలు కల్పించుకొనటానికి కృషి చేయవచ్చు. ఆస్పత్రులలో మందులున్నాయా లేదా, వైద్య సదుపాయం అందుతున్నదా లేదా? మున్నగు విషయాలను పరిశీలిస్తూ తగు చర్యలు తీసుకుంటుండాలి. పిల్లల చదువులకోసం బడులు ఏర్పాటు చేయబడునట్లు చూడాలి. వాటిలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరుగునట్లు చూడాలి. స్త్రీల ప్రత్యేక సమస్యలను తీసుకొని పనిచేయాలి. పండుగ పబ్బాల సందర్భాలలో కళా ప్రదర్శనలు నిర్వహించవచ్చు. పఠన మందిరాలు, వయోజన విద్యా కేంద్రాలు నిర్వహించవచ్చు. దేశంలో ఏమి జరుగుతున్నదీ వివరించి చెప్పటానికి, పత్రికలు చదివి వినిపించటానికి కేంద్రాలు నడపవచ్చు. గ్రంథాలయాలను ఏర్పాటుచేసి నిర్వహించవచ్చు. తెలంగాణా పోరాట సమయంలో గ్రామాలలో భార్యాభర్తల కీచులాటల విషయంలో సయితం సంఘం తీర్పు చెబుతుండేది.

వ్యవసాయ కార్మికులు ప్రతి సమస్యపైన కోర్టుకు వెళ్ళటంలేదు. పెద్దమనుషుల తీర్పుకు వెళ్తుంటారు. తమకు ఏ సమస్యవచ్చినా సంఘం ముందుకు తీసుకుపోతే న్యాయం కలుగుతుందన్న విశ్వాసం ఏర్పడినకొద్దీ పెద్ద మనుషుల తీర్పులకు, కుల పెద్దల తీర్పులకు పోవటం సన్నగిల్లిపోతుంది.

ఏ నాటినుండో కులాలు ఏర్పడినాయి. అయినా, మన సంఘంలో ఒక్క దళితులనేగాక, అన్ని కులాలకు చెందిన వ్యవసాయ కార్మికులనూ చేర్చుకోవాలి. కుల, మత కట్టుబాట్లను అధిగమించి, వాటి స్థానంలో సంఘ చైతన్యం చోటుజేసుకునేట్లు చూడాలి. ఈ విధంగా పనిచేసేకొద్దీ సంఘం తమ కొరకు నిరంతరం పనిచేస్తుందన్న గుర్తింపు వారిలో కలుగుతుంది.

**ఐదవ అంశం** : సంఘంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన వారినీ చేర్చుకోవచ్చు. అందుకొరకు శ్రద్ధతో కృషిచేయవలసిన అవసరం వుంది. అయినా, వేరువేరు సంఘాలు పెట్టుకొని పనిచేయటం జరగవచ్చు. అలాంటి పరిస్థితిలో ప్రత్యేక సమస్యలపై కలిసి పనిచేయటానికి ఐక్యకార్యాచరణ కమిటీలను ఏర్పాటు చేయాలి. ఐక్యంగా పనిచేద్దాం రమ్మని కోరుతూ నిరంతరం అందుకొరకు కృషిసాగించాలి. పనిద్వారా పోరాటాలద్వారా క్రమక్రమంగా అందరినీ ఒకే సంఘంలో వుండి పనిచేద్దామన్న చైతన్యం కల్పించేందుకు కృషి చేయాలి.



చెల్లాచెదురుగా అక్కడొక గ్రామంలో, ఇక్కడొక గ్రామంలో సంఘం వుండేకంటే, మనం వున్న గ్రామానికి చుట్టుప్రక్కల గ్రామాలకు వ్యాపించాలి. పట్టణ ప్రజలు బలపరిస్తే మనం నడిపే రోజువారీ పోరాటాలు జయప్రదం అయేందుకు అది దోహదపడుతుంది. అందువల్ల పట్టణాలచుట్టూవున్న గ్రామాలలో వుద్యమాన్ని వ్యాపింపచేస్తే పరస్పర సహాయకారిగా వుంటుంది. సమస్య వచ్చినప్పుడు సహకరించి పనిచేయటానికి అనువుగా వుంటుంది.

కీలకమైన పట్టణాలచుట్టూ ఉద్యమ నిర్మాణంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఉద్యమం వున్న గ్రామానికి చుట్టుప్రక్కల గ్రామాలలోకి విస్తరించడానికి దూరంగా వున్న వుద్యమ ప్రాంతాలతో కలిపేందుకు అనువుగా మధ్యలోవున్న వుద్యమ నిర్మాణానికే కృషిచేయటం అవసరం.

సంఘానికి విస్తృత సభ్యత్వం అవసరం. అన్ని కులాలకుజెందిన వారినుండి, అన్ని రాజకీయాభిప్రాయాలు గల వారినుండి సంఘంలో సభ్యులను చేర్పించాలి. ఐక్య కార్యాచరణకై నిరంతరం కృషిసాగించాలి. నిత్య జీవితావసర వస్తువుల సరఫరా, ఆర్థిక సమస్యలు, సహకార సంఘాలు, గ్రామ పంచాయితీలు, సాంస్కృతిక కార్యకలాపాలు, ఆటపాటలు, స్త్రీల సమస్యలు, పాఠశాలలు, సంక్షేమ కార్యక్రమాలు, వైద్య, ఆరోగ్యవసతులు, పత్రికాపఠనం, అక్షరాస్యత కల్పించటంకోసం కృషి, ప్రపంచ విజ్ఞానం మొదలగు అన్ని సమస్యల కొరకు వ్యవసాయ కార్మిక సంఘం పనిచేయాలి. ప్రజలతో నిత్య సంబంధాలు, నిత్య కార్యాచరణ అత్యంత అవశ్యకం. వాటివల్లనే సంఘంలో చేరవలసిన ఆవశ్యకతను వారు గుర్తిస్తారు.

విస్తృత ప్రాంతంలో ఒక గ్రామానికి ఆనుకుని మరియొక గ్రామంలో, కీలకపట్టణానికి ఆనుకునివున్న ప్రాంతంలో బలమైన వుద్యమం వుండునట్లు చూడవలసిన ఆవశ్యకతను దృష్టిలో బెట్టుకుని సంఘ నిర్మాణం చేయాలి.

వ్యవసాయ కార్మిక కుటుంబాలనుండి వచ్చిన యువకులకు ఆటలు, పాటలు, నాటకాలు మున్నగు కార్యకలాపాలు నిర్వహించాలి. వ్యవసాయ కార్మిక సంఘానికి అనుబంధంగా ప్రత్యేకంగా యువజన సంఘం లేదా యువజన శాఖ, అలానేమహిళాశాఖ ఏర్పాటుచేయాలి. ఇతర వర్గాలలోకూడా పలుకుబడివుంటే, వాళ్ళతోకూడా కలిసి గ్రామ మహిళాసంఘం, గ్రామ యువజన సంఘంవంటి అనుబంధ సంఘాలను ఏర్పాటుచేసే బాధ్యతను వ్యవసాయ కార్మిక, రైతుసంఘాలు చేపట్టాలి. ముందుగా మన వర్గసంఘంలోని యువజనులను, మహిళలను-యువజన మహిళాసంఘాలుగా సమీకరించాలి. వాటిద్వారా యువజనులకు కర్రసాము, ఈత మొదలగునవి నేర్పవచ్చు. మూఢవిశ్వాసాలు పోగొట్టేందుకు కృషిసాగించాలి. మంచి అలవాట్లు నేర్పాలి. పోరాటంలో పాల్గొనేందుకుగాను దేహానికి, మనసుకు తర్ఫీదు యివ్వాలి.

మహిళా సంఘానికి ఎంతో ప్రాధాన్యత వుంది. ఏ పోరాటం జరిగినా శతృదాడి నుండి తప్పుకునేందుకుగాను ఇళ్ళు విడిచిపోవటం జరుగుతుంది. అలాంటప్పుడు స్త్రీలు ఇళ్ళల్లోన వుంటారు. వారు పోలీసుల దెబ్బలకు, అవమానాలకు ఎర అవుతుంటారు. కరువు కాటకాలు వచ్చినా ఎక్కువ బాధలకు లోనయ్యేది స్త్రీలు, బిడ్డలే. అందువల్ల వారందరినీ సంఘాలలో చేర్చి, వారి చైతన్యాన్ని పెంపొందించనిదే అలాంటి సమయాలలో వారు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించజాలరు. అలా చైతన్యవంతులనుగా చేయకపోతే భూస్వాములు, మత గురువులు నూరిపోసే బోధలను వంటపట్టించుకుని, తమ కుటుంబాలలోని మగవాళ్ళను వెనుకకు లాగుతారు.

అనుబంధసంఘాలుగా యువజన, మహిళా సంఘాలను నిర్మించి, నిర్వహించే బాధ్యతను మన కార్యకర్తలు మొట్ట మొదట్లో నిర్వర్తించలేకపోవచ్చు. కాని మన సంఘంలోకి ఎక్కువమంది వచ్చేకొలదీ ఆ పని సాధ్యమవుతుంది.

మన విద్యార్థులు కాలేజీల, హైస్కూళ్ళ సెలవుల్లో యిళ్ళకొచ్చినప్పుడు వాళ్ళకు తగు చైతన్యం కల్పించేందుకు కృషిచేయాలి వాళ్ళు విద్యార్థి సంఘంలో చేరారా లేదా అనే విషయం తెలుసుకోవాలి. అలా చేరేందుకు వారిని ప్రోత్సహించాలి. అలానే యువజన, మహిళా సంఘాల విషయంలోనూ శ్రద్ధవహించాలి.

## ఐక్య కార్యాచరణ

ఆయా సమస్యలపై యితర వ్యవసాయ కార్మిక సంఘాలతో ఐక్య కార్యాచరణకై కృషిచేయాలి. అంతకంటే ముఖ్యమైనది మిత్రవర్గాలతో మైత్రీ సంబంధాలు నెలకొల్పుకొనడం, పేద, మధ్యతరగతి రైతు మనకు మిత్రుడుగా ఉంటాడు. ధనిక రైతు కొన్ని సందర్భాలలో ప్రభుత్వంతో ఘర్షణ పడుతుంటాడు. అందువల్ల మనం ముఖ్యంగా పేద, మధ్యతరగతి రైతులతో సమైక్యత కోసం కృషిచేయాలి.

ఇక వ్యవసాయ కార్మికులు కేవలం కూలిపని మీదనే జీవనం సాగిస్తున్నారు. మన సంఘానికి పేద రైతుతో నిమిత్తం లేదనే భావం వుంది. వెనుకబడిన కులాలలోను, పై కులాలలోనూ కూడా కూలీలు, పేదరైతులు వున్నారు. వాళ్ళందరినీ సమీకరించేందుకు కృషిచేయాలి. వ్యవసాయ కార్మికులు, పేదరైతులు అవినాభావంగా కలసిమెలసి వుండాలని లెనిన్ పదేపదే చెప్పాడు. వారందరినీ కలిపి గ్రామ పేదలని ఆయన పిలిచాడు. వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు మధ్య వైరుధ్యమేమీ లేదు. వ్యవసాయ కార్మికసంఘం కేవలం షెడ్యూల్డు కులాలకు మాత్రమే చెందినదన్న భావం కొన్ని చోట్ల వుంటే వుండవచ్చు. కాని ఏ కులానికి చెందినా, ఏ మతానికి చెందినా వ్యవసాయ కార్మికులందరినీ సంఘంలో చేర్చుకోవాలి.



షెడ్యూల్డు కులాలకు జెందిన మధ్యతరగతి రైతులు సైతం వ్యవసాయ కార్మిక సంఘంలోనే చేరగోరుతారు. మరోవైపున పై కులాలలోని వ్యవసాయ కార్మికులు కూడా రైతు సంఘంలో చేరతామంటారు.

మనం మాత్రం వ్యవసాయ కార్మికులను, పేద రైతులను ఒకటిగానే చూడాలి. ఏమైనా ఈ పేదలంతా ఒకటిగా నిలిచేందుకు కృషి చేయాలి.

మన సంఘం, వ్యవసాయ కూలిమీద జీవించే వారితో కూడిన సంఘంగానే వున్నా మనం వారి సమస్యలవరకే పరిమితమై వుండరాదు.

## మనకు పోయిందేమీ లేదు సంకెళ్ళు తప్ప

గ్రామాల్లో పేద, మధ్యతరగతి రైతుల సమస్యలను కూడా తీసుకుని మనం ముందుండి కృషిచేయాలి. జనతా ప్రజాస్వామికం మన గ్రామాల్లో బలిష్టంగా నిలవాలన్నా వ్యవసాయ కార్మికులే ముందు నిలవాలి. మిగతావాళ్ళకంటే యెక్కువ లాభిస్తారు గనుక, సంఖ్యాబలాన్ని బట్టి కూడా అలా నిలవటం అవసరం. మన విముక్తిని మనమే సాధించుకోవాలి. దోపిడి అనేదే లేకుండాచేయాలి. ఇందుకు మనం సాగించే పోరాటంలో 'మనకు పోయేదేమీలేదు సంకెళ్ళు తప్ప'.

సోషలిస్టు సమాజం పాత తరహా సమాజం కాదు. గతంలో ఒక దోపిడి సమాజం నుండి మరొక దోపిడి సమాజానికి పయనించటం మాత్రమే జరిగేది. సోషలిజం అలాకాదు. దోపిడీని సమూలంగా నాశనం చేసిన సమాజం అది. అలాంటి విముక్తితోనే అందరికి పూర్తిపని, చదువు, ఉచిత వైద్య సదుపాయాలు, సామాజిక భీమా లభ్యమవుతాయి. ఆ సమాజాన్ని నిర్మించుకునేందుకు కృషి సల్పాలి.

వ్యవసాయ కార్మిక సంఘం చొరవ తీసుకుని పనిచేయాలి. పేద రైతు మనలో ఒక భాగం.

మనమే మధ్యతరగతి రైతులను కూడా కలుపుకు రావాలి. వాళ్ళను పీడించే భూస్వాములకు వ్యతిరేకంగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా, కర్కోటకులైన అధికారులకు వ్యతిరేకంగా, పోలీసులకు వ్యతిరేకంగా వాళ్ళను నిలబెట్టేందుకు మనమే చొరవ తీసుకొని పనిచేయాలి. వ్యవసాయ కార్మిక సంఘం కేవలం వాళ్ళ కూలి కోసం పనిచేసేది మాత్రమే కాదని, గ్రామంలోని కష్టపడే వాళ్ళందరి సమస్యల కోసం పనిచేస్తుందన్న పేరు సంపాదించుకోవాలి. ఎక్కడ అన్యాయం జరిగినా మనం అన్యాయానికి గురైన వారి తరపున నిలబడి పనిచేయాలి. వ్యవసాయ కార్మిక సంఘ కార్యకర్తలు యీ చైతన్యంతో కృషిచేయాలి. ఎవరో కొందరు వ్యక్తులు ఏదో సాధించి పెడతారనిగాక, మన హక్కుల కోసం మనం పోరాడి, సాధించుకోవాలనే చైతన్యం కలిగించేందుకు కృషిచేయాలి.

మిత్రవర్గాలను కలుపుకొచ్చేందుకు మనమే చొరవతో పనిచేయాలి. వాళ్ళ సమస్యలు తీసుకొని చైతన్యంతో కృషిచేయాలి. అయితే ఆ చైతన్యం అమాంతంగా ఒక్క రోజునే వస్తుందనుకోరాదు. ఓపికతో అందుకు కృషిచేయాలి. అంతకుమినహా వేరే మార్గం లేదు. యువతరాన్ని అందుకోసం తయారుచేసుకోవాలి.

వర్గ సంఘంలోనూ అందరూ ఒకే స్థాయిలో వుండరు. కొందరు వెనుకబడి వుంటారు. మన రాజ్యాన్ని, మన ప్రపంచాన్ని, మన భూమిని సాధించుకోవాలని వ్యవసాయ కార్మికులను సన్నద్ధం చేయాలి. కర్మ సిద్ధాంతం, కుల, మత తత్వాలు అందుకు ఆటంకంగా నిలుస్తాయి. వాటన్నిటినీ అధిగమించి పురోగమించాలి.

ప్రధానంగా మధ్యతరగతి రైతులతో ధనిక రైతులనుకూడా కలుపుకుని రైతు సంఘం యేర్పాటు చేయాలి. ఆ రైతు సంఘం మనతో సహకరించి పని చేయాలి. వ్యవసాయ కార్మిక సంఘ కార్యకర్తలే అభివృద్ధిచెంది అవసరమైతే తామ కార్యకర్తలై రైతుల మధ్య పనిచేయాలి. రైతు సంఘాలను నిర్మించడానికి తోడ్పడాలి. అప్పుడే భూస్వాములకు వ్యతిరేకంగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా జయప్రదంగా పనిచేయగలుగుతాం.

## పార్టీ సంగతేమిటి?

ప్రజా సంఘాలు ప్రధానంగా ఆర్థిక సమస్యలు తీసుకుంటాయి. కొన్ని సామాన్య రాజకీయ హక్కుల కోసం పనిచేస్తాయి. ఆర్థిక యిబ్బందులను పోగొట్టుకోవాలన్న ఆకాంక్షతో ప్రారంభమవుతాయి. కాని భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగాను, ప్రజాతంత్ర ప్రభుత్వం కోసం కృషి చేయటానికి క్రమేణా పూనుకుంటాయి. అయితే ఆ చైతన్యం, ఆ దృక్పథం ఏర్పడదు. బాగా చైతన్యం పొందిన కొద్దిమంది మాత్రమే ఆ స్థితికి చేరుకుంటారు. అలాంటివాళ్ళే రాజకీయ పార్టీలలో సభ్యులుగా చేరుతారు. వ్యవసాయ కార్మిక, పేదరైతు, మధ్య తరగతి రైతులనుండి బాగా రాజకీయ చైతన్యం పొందిన వారిని చేర్చుకుని, అలాంటి కార్యకర్తలతో కమ్యూనిస్టు పార్టీని ఏర్పరచితేనే తప్ప మన ఉద్యమం ముందుకుపోదు. సరైన నాయకత్వం యిచ్చి మార్క్సు, ఎంగెల్సు, లెనిన్‌ల మార్గాన నడపాలనే శాస్త్రీయ విజ్ఞానం కలిగిన కార్యకర్తలతో కూడినదే కమ్యూనిస్టు పార్టీ.

కమ్యూనిస్టుపార్టీ అలా పని చేయటం ద్వారా ప్రజాసంఘాల కార్యకర్తలను తర్ఫీదు చేస్తుంది. ప్రజా సంఘాలను విస్తృతం చేస్తుంది. ప్రజాసంఘం పెరిగే కొద్దీ పార్టీ, పార్టీ పెరిగేకొద్దీ ప్రజాసంఘం పెంపొందుతాయి.

బొంబాయిలో 1926-29లలో ఆరు లక్షల మంది కార్మికులు సమ్మె చేశారు. ఆ సమ్మె కార్యకర్తలను పార్టీలో యిముడ్చుకోలేకపోయినందున ఉద్యమం యింకా పెరగకపోగా కుదించుకుపోయింది.



గ్రామాల్లో పని దొరకకపోవటంవల్ల అనేకమంది నగరాలకొచ్చి కార్మికుల్లో చేరుతారు. కార్మికుల సంఖ్య అధికమవుతూ వుంటుంది. దానితో వాళ్ళది పైచేయి అవుతుంది. అలాంటి వాళ్ళను ఎప్పటికప్పుడు ఉద్యమంలో యిముడ్చుకోలేకపోతే వెనుకబడిపోవలసి వస్తుంది.

తెలంగాణాలో 50 వేలమంది నిర్బంధానికి గురయినారు. పదివేల మంది రెండు, మూడేళ్ళపాటు జైళ్ళలో మగ్గారు. రెండు, మూడు లక్షల మంది దెబ్బలు తిన్నారు. ఇలా దెబ్బలుతిన్నవాళ్ళు తమను కొట్టించిన ప్రభుత్వాన్ని ప్రేమిస్తారా?

ఆంధ్ర మహాసభ సభ్యత్వం 1944లో ఒక లక్షకు మించింది. అందులో 60-70 వేల మంది ఒక్క ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు చెందిన వారే. అలాంటిది యీనాడు మన ప్రజాసంఘాల పరిస్థితేమిటి? ఆనాడున్న మూడువేల గ్రామాలనుండి మూడువందల గ్రామాలలో కొచ్చాము.

కొత్తతరం వచ్చింది. గ్రామంలో యెవరు భూస్వామి? ఎవరిని తటస్థం జేసుకోవాలి? అనే విషయాలను అంచనా వేసుకోవాలి. గీతపనివాళ్ళ వంటివారిని కలుపుకు వచ్చేందుకు కృషి చేయవలసిన అవసరం వుంది. అందుకు అనుగుణమైన ఎత్తుగడలు వేసుకోవాలి. కార్యకర్తలను యెలా తయారు చేసుకోవలసిందీ ఒక కార్యక్రమం రూపొందించుకోవాలి. ఎవరు పరమ కర్కోటకుడు? అతనికి వ్యతిరేకంగా ఎవరిని కలుపుకోవాలి? అనే ఎత్తుగడలు వేసుకోవాలి.

ఇవన్నీ చేయాలంటే పార్టీ పెరగాలి. 'ట్రేడ్ యూనియన్ కమ్యూనిస్టుకు శిక్షణ గరిపే పాఠశాల' అని మార్క్స్ చెప్పాడు. వర్గ సంఘాలలో పనిచేసిన అనుభవం ద్వారానే కమ్యూనిస్టులు తయారవుతారు. పార్టీ సభ్యులుగా యెందరు తయారయ్యారు? వారి చైతన్యం ఎంత? అనే విషయాలను పరిశీలించాలి. ప్రజా సంఘాలలో పనిజేస్తూ అభివృద్ధిచెంది, అందులో బాగా ముందుండి పనిచేసేవారిని పార్టీలోకి యిముడ్చుకోవాలి.

మార్క్సిజం - లెనినిజం పునాదిగా గల పార్టీ లేకపోతే, ఎన్ని లక్షల సభ్యత్వమున్నా, ఎన్ని ఆర్థిక కోర్కెలు సాధించుకున్నా, ఎన్నికల్లో ఎంత బలం సంపాదించుకున్నా - పార్టీ నిర్మాణబలం పెరగనిదే ప్రయోజనంలేదు.

## ప్రజాసంఘాలు పెరగటానికి పార్టీ పెరగటం అవసరం

కమ్యూనిస్టు పార్టీ కార్మికవర్గం యొక్క అగ్రగామిదళం. కార్మిక వర్గానికి ముందుండి నడిచేభాగం. మార్క్సు-ఎంగెల్సులు, ఆ తర్వాత లెనిన్ చెప్పిన సూత్రాలకు, స్టాలిన్‌చే క్రోడీకరించబడిన సూత్రాలకు అనుగుణంగా నడిచే పార్టీ. అయితే అలా కార్మికవర్గం నుండి వచ్చినవాళ్ళుతప్ప వేరెవరూ కమ్యూనిస్టుపార్టీలో చేరకూడదని పెడర్థాలు చెబుతుంటారు. వాస్తవమదికాదు. కార్మికవర్గంకోసం అంకితమయిపోయి, మార్క్సిస్టు - లెనినిస్టు దృక్పథంతో

పనిచేసేవారు ఏ వర్గం నుండి వచ్చినా సరే కమ్యూనిస్టు పార్టీలో చేరవచ్చు. తన పాత అలవాట్లను వదులుకొని అభివృద్ధిజెందాలి కార్మికవర్గపు సుశిక్షిత, సంఘటిత దళం కమ్యూనిస్టుపార్టీ. కమ్యూనిస్టుపార్టీ సభ్యుడు ఏదో ఒక పార్టీ యూనిట్‌లో సభ్యుడుగా వుంటేతప్ప, జనరల్‌గా కమ్యూనిస్టుపార్టీలో వున్నానంటే లాభంలేదు. ఒక శాఖలోవుండి ఆ శాఖ నిర్ణయానుసారం పనిచేయాలి. అలా కాకపోతే పార్టీలో వున్నట్లుకాదు.

ప్రతి కమ్యూనిస్టు మార్క్సిస్టు – లెనినిస్టు సిద్ధాంతాన్ని ఆకళింపు చేసుకుంటూ, విజ్ఞానాన్ని పెంపొందించుకొంటూ, ఆ చైతన్యంతో ప్రజాసంఘాలను నిర్మించటానికి కృషి చేయాలి. ప్రతి సభ్యుడూ మార్క్సిస్టు మూలసూత్రాలను తెలుసుకోవాలి. ఆ సూత్రాలననుసరించి పనిచేయాలి. జీవితాంతం అధ్యయనం, నిరంతరకృషి సాగిస్తుండాలి. కేవలం పుస్తకాలు చదివితేచాలదు. ఆకళింపు చేసుకోవాలి. అవగాహనను పెంపొందించుకోవాలి.

మన వర్గంలో ముందుండి, సుసంఘటిత శిక్షణ గలిగి ఒక శాఖలో వుండి, మార్క్సిస్టు – లెనినిస్టు సూత్రాలను ఆకళింపు చేసుకొని పనిజేసే సభ్యులే మన పార్టీకి పునాది.

పార్టీ నిర్మాణం సుసంఘటితంగా వుండటం అంటే ఉక్కు శిక్షణ గలిగి వుండాలన్న మాట. ఉక్కు శిక్షణ అంటే పై నాయకుడు చెప్పినట్లు చేయటంకాదు. అలాగని నాయకులు చెప్పినదాన్ని ధిక్కరించమనీ కాదు.

పై కమిటీలు చెప్పినట్లు క్రింది కమిటీలు పనిచేయాలి. క్రింది కమిటీల అనుభవాన్ని బట్టి చర్చించి సూచనలు చేయాలి. వాటినన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించి పై కమిటీలు నిర్ణయాలు తీసుకోవాలి. ఆ నిర్ణయాలను క్రింది కమిటీలకు రిపోర్టు చేస్తాయి. అనుభవం ద్వారా నేర్చుకోవాలి. మైనారిటీ, మెజార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తుంది. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం వుంటుంది. నిర్భయంగా అభిప్రాయాలు చెప్పవచ్చు. పై కమిటీలకు తెలియజేయవచ్చు. ఈ లోగా పై కమిటీ నిర్ణయాన్ననుసరిస్తూ పనిచేస్తూ వుండాలి.

అంతర్గత పార్టీ చర్చల్లో విమర్శ, ఆత్మవిమర్శలు సాగించవచ్చు. ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలి. నిర్ణయాలను అమలు జరిపేందుకు ఎంతవరకు కృషిచేసిందీ చెప్పి, ఆ సందర్భంగా ఆ నిర్ణయంలోని తప్పొప్పులను గూర్చి చెప్పాలి. అంతేకాని, తప్పు ఒప్పు అనేది బుర్రలో పుట్టిన అభిప్రాయాన్ని బట్టికాదు.

ముందు ఆత్మవిమర్శతో ప్రారంభించితేనే విమర్శనాహక్కు జయప్రదమవుతుంది.

పార్టీయే అత్యున్నత నిర్మాణరూపం. వివిధ ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి వాటిద్వారా పార్టీ పనిచేస్తుంది. ప్రజాసంఘాలలో పనిచేసే పార్టీ సభ్యులు పార్టీ కమిటీ ఆదేశానుసారం ఆ ప్రజాసంఘాలలో అత్యధిక సంఖ్య ఆమోదించి పనిచేసేటట్లు కృషి చేస్తారు. ప్రతి ప్రజా సంఘానికి పార్టీ నాయకత్వం వహించదానికి కృషిచేస్తుంది. ఒక్కొక్కప్పుడు ప్రజా సంఘాలలో మన పార్టీ బలహీనంగా ఉన్నప్పుడు మనం కోరిన నిర్ణయాలను అవి



చేయకపోవచ్చు. మెజారిటీ నిర్ణయాన్ని అనుసరించి పార్టీ సభ్యులు పనిచేస్తూ అనుభవం ద్వారా ప్రజాసంఘాలు మనపార్టీ సభ్యులు చెప్పినదే సరియయినదని తెలుసుకొనేటట్లు కృషిచేస్తారు. పార్టీ ప్రజా సంఘాలకు నాయకత్వం వహించి నడపడానికి కృషిచేస్తూ వుంటుంది.

ప్రజా సంఘాలు లేనిదే పార్టీ బ్రతకదు. ప్రజా సంఘంలో ఒకస్థాయి కలిగిన వారితో పార్టీ కమిటీయే పార్టీ ఫ్రాక్షన్‌ను ఏర్పాటుచేస్తుంది. పార్టీ అలాంటి పాత్ర నిర్వర్తించాలంటే పార్టీ తన అనుభవంతో సంఘ కార్యకర్తలకు నచ్చజెప్పే రీతిగా పనిచేయాలి. పార్టీ నాయకత్వం వహించి నడపగలదన్న విశ్వాసం ప్రజాసంఘంలో ఏర్పడాలి.

## పార్టీలో చేరేందుకు అర్హతలు

కార్మికవర్గం అగ్రభాగాన బాగా ముందుండి పనిచేసేదే కమ్యూనిస్టుపార్టీ. మార్క్సిస్టు – లెనినిస్టు సూత్రాలననుసరించి పనిచేసేదే కమ్యూనిస్టు పార్టీ. అందులో ఉండేవారు సుసంఘటితంగా క్రమశిక్షణకు కట్టుబడి పనిచేయాలి. ప్రతి సభ్యుడూ ఏదో ఒక శాఖలో వుండాలి. కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ననుసరించి పనిచేయాలి. ఏ ప్రజా సంఘంలో వున్నా కార్మికవర్గ చైతన్యంతో పనిచేయాలి.

పై వాటన్నిటితోపాటు కమ్యూనిస్టుపార్టీ ప్రజలలో వేరూనుకొనిపోయి, ప్రజలలో వుండి, ప్రజల విశ్వాసం పొందుతూ, ప్రజలకు నాయకత్వం వహిస్తూ వుండాలి. ప్రతి పార్టీ సభ్యుడూ ఏదో ఒక ప్రజాసంఘంలో వుండి పనిచేయాలి. ప్రజల్లో పునాది వుండాలి. అది లేకపోతే ఎంత త్యాగం చేసినా ప్రయోజనంలేదు. సిద్ధాంతాలను వల్లించటంతో పనితీరిపోదు.

కమ్యూనిస్టుపార్టీ కార్మికవర్గం యొక్క అగ్రగామిదళం, సుసంఘటిత బృందం, కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల ననుసరించి పనిచేస్తుంది. కమ్యూనిస్టు పార్టీ కార్మికవర్గం యొక్క అత్యున్నత నిర్మాణరూపం.

## పార్టీ సభ్యుల విధులు

కమ్యూనిస్టుపార్టీ సభ్యులలో ప్రతిఒక్కరూ ఏదో ఒక పార్టీశాఖలో సభ్యుడుగా వుండాలి. ప్రతి సంవత్సరం సభ్యత్వ రుసుము చెల్లించి తన సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొంటుండాలి. తమకువచ్చే ఆదాయంలో నిర్ణీత భాగాన్ని పార్టీకి లెవీ చెల్లించాలి. ఏదో ఒక ప్రజాసంఘంలో చేరి పనిచేస్తుండాలి.

కమ్యూనిస్టు పార్టీలో పనిచేయకుండా ఉండేవారెవరూ సభ్యులుగా వుండతగరని లెనిన్ చెప్పాడు. ఏటేటా సభ్యత్వాని రెన్యూ చేసే సందర్భంలో ఆయా సభ్యులు ఏ మేరకు పనిచేసిందీ చెకప్‌చేసి సంతృప్తికరంగా పనిచేసినప్పుడే రెన్యూచేయాలి. పార్టీ సభ్యుడు యూనిట్ సమావేశాలకు హాజరవుతుండాలి. ప్రజా సంఘాలలో వుండి, ఆ ప్రజాసంఘ కార్యక్రమంలో పార్టీ చెప్పిన మేరకు పనిచేయాలి.

ప్రతి పార్టీ సభ్యుడూ పార్టీ పత్రిక చదవాలి. మార్క్సిస్టు – లెనినిస్టు పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సదా కృషిచేయాలి. నిరంతర అధ్యయనం చేస్తూ వుండాలి. సిద్ధాంత, రాజకీయ గ్రంథాల పఠనం ఒక అలవాటుగా చేసుకోవాలి.

కనీసం యీ మూడు కర్తవ్యాలను నిర్వర్తించకపోతే పార్టీ సభ్యుడుగా వుండే అర్హతను కోల్పోతాడు.

పార్టీ కార్యక్రమాన్ని, నిబంధనావళిని అంగీకరించితే, ఆ కార్యకర్తను యిద్దరు పార్టీ సభ్యులు రికమెండ్ చేస్తే శాఖ చర్చించి పై కమిటీకి సిఫార్సు చేయాలి. పై కమిటీ ఆ నివేదికను పరిశీలించి క్యాండిడేట్ సభ్యత్వం యివ్వవచ్చు. ఒక సంవత్సరంపాటు క్యాండిడేట్ సభ్యుడుగా వుండాలి. ఆ కాలంలో వోటింగు హక్కు మాత్రం వుండదు. అప్పటి పని సంతృప్తికరంగా వుంటే పూర్తి సభ్యత్వం యివ్వటం జరుగుతుంది. సంవత్సరాల తరబడి పనిచేస్తూ వుంటేనే అనుభవంద్వారా నేర్చుకోవటం, ఉక్కుశిక్షణ పొందటం సాధ్యమవుతుంది. ఒక సంవత్సరం సభ్యుడుగా చేరకపోయినా ప్రజాసంఘంలో సభ్యత్వానికి అనర్హతరాదు. కాని పార్టీలో అలాకాదు.

పార్టీ శాఖకు ఒక కార్యదర్శి వుండాలి. కనీసం పదిహేను రోజులకొకసారి లేదా సమస్య వచ్చినప్పుడు అంతకంటె తక్కువ వ్యవధిలో శాఖ సమావేశం జరుపుతూ వుండాలి. శాఖ సమావేశంలో నిర్ణయం తీసుకుని, ప్రజా సంఘాలకు తెలియజేసి వాటిద్వారా పని చేయించాలి.

శాఖ సమావేశం, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు పరచటంలో ఆయా సభ్యులు తీసుకున్న కోటాల మేరకు పనిచేయటంలో ఏ మేరకు పనిచేసిందీ, ఆయా సభ్యులు పనిచేసిన తీరు, చేయలేకపోయినా ప్రయత్నాన్ని గూర్చిన వివరణ–తదితర విషయాలను గూర్చి చర్చించాలి. ఆ విధంగా ఆయా సభ్యుల పనిని చెకప్ చేయాలి. పై కమిటీల నుండి యివ్వబడిన కార్యక్రమాల అమలుకు పని విభజన చేసుకోవాలి. తాజా పరిస్థితిని బట్టి ఎప్పటికప్పుడు మరల కార్యక్రమం తీసుకుంటుండాలి.

ప్రతి సమావేశంలోను ఒక కార్యక్రమంగా పెట్టుకుని రాజకీయ పరిస్థితిని గూర్చి చర్చించాలి. పై కమిటీల నుండి వచ్చిన రాజకీయ రిపోర్టులను అధ్యయనం చేయాలి. ఇతరులు చేస్తున్న దుష్ప్రచారాన్నెదుర్కొనేందుకు కర్తవ్యాలను నిర్ణయించాలి. ఆ రీతిగా శాఖ అభివృద్ధి చెందాలి.

ప్రజలకు నాయకత్వం వహించేది పార్టీ శాఖ. అందువల్ల శాఖ ఆవిధంగా శ్రద్ధ తీసుకుని లోతుగా ఆలోచించాలి.

పార్టీ నిర్మాణం ఉన్నత నిర్మాణ రూపమనేదాన్ని ఆచరణలో రుజువు చేయాలి. ఇప్పుడు లీగల్‌గా పనిచేయటానికి అవకాశం వుంది గనుక ఆఫీసు పెట్టుకోవచ్చు. ఫలానా



ఆయన కమ్యూనిస్టు అని తెలిసి, సమస్యల పరిష్కారానికై సలహాలు కోరుతూ యితరులు మనవద్దకు వస్తుంటారు. శాఖయే ప్రజా సంఘాలను నడపాలి. ఆ నాయకత్వ పాత్ర వహించేందుకు అనువుగా తన చైతన్యాన్ని పెంపొందించుకోవాలి. దాన్ని నిత్యజీవితంలో ఒక భాగంగా తీర్చిదిద్దుకోవాలి.

## శాఖ యొక్క బాధ్యతలు

సభ్యులు రోజురోజూ అభివృద్ధి చెందుతున్నారా? వాళ్ళ కుటుంబ పరిస్థితులు, కుటుంబంలో వస్తున్న యిబ్బందులు – మొదలగు విషయాలను శాఖ పరిశీలిస్తుండాలి. తన కుటుంబ జీవితంలోనూ, ప్రజలతోగల సంబంధాలలోనూ ఆదర్శప్రాయంగా వ్యవహరిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తూ, శాఖ కార్యదర్శి సభ్యులకు సహాయపడాలి. అవసరమైతే పై కమిటీల తోడ్పాటుపొందాలి.

భార్యను కొట్టటం, జాతరలలో పాల్గొనటం, దేవుణ్ణి నమ్మి పూజా పునస్కారాలు చేయటం, వుపవాసాలు, నోములు మొదలయిన అవలక్షణాలు లేకుండా వుండాలి. కుటుంబ సభ్యులను పార్టీ రాజకీయాలకు అనుకూలంగా తయారు చేసుకోవాలి. కుటుంబాలలో పొరపాటు భావాలను, సనాతనాభిప్రాయాలను పోగొట్టేందుకు కృషి చేయాలి.

శాఖ చాకచక్యంతో, నైపుణ్యంతో వ్యవహరించాలి. లోపాలను దిద్దటానికి శాఖా కార్యదర్శికి చాలా అనుభవం, నేర్పు వుండాలి.

నిత్యజీవితం చూసుకుంటూ, వోపిక కొద్దీ పార్టీ పనిచేస్తూ వుండాలి. పార్టీ సభ్యులందరూ పూర్తికాలం పనిచేస్తామన్నా పార్టీ అందరినీ పోషించజాలదు. పార్టీ సభ్యులందరూ హోల్‌టైమర్స్ కావటం అసంభవం. అసలా అవసరమూ లేదు. వాళ్ళ కుటుంబాలకు కనీసం తిండి, గుడ్డ, చదువు కల్పించేందుకు పార్టీ బాధ్యత వహించడం కష్టంతో కూడిన పని.

ప్రజల నుండి వసూలుచేసే సొమ్ములో ప్రతిపైసాను జాగ్రత్తగా ఖర్చు బెట్టవలసివుంది. కనీస అవసరాల మేరకే హోల్‌టైమర్లను యివ్వగలుగుతాం. పెండ్లి లేకుండా ఒంటరిగా వుండి పనిచేయాలని కమ్యూనిస్టుపార్టీ కోరదు. కుటుంబం పరిమితంగా తక్కువమంది బిడ్డలకే పరిమితం చేసుకోవాలని, ఖర్చు అలవాట్లను యెక్కువ చేసుకోరాదని, నిరాడంబరంగా జీవించాలని, ప్రజలచే ఆ విధంగా గుర్తింపు పొందాలని పార్టీ కోరుతోంది. కుటుంబ బాగోగులు పట్టించుకోకపోతే కమ్యూనిస్టులని అనిపించుకోవటానికే అర్హులుకారు.

# యువజనులు - రాజకీయాలు

(హైద్రాబాద్‌లో 1973లో "యువత" గోష్టి నొకదానిని హైద్రాబాద్‌లో ఏర్పాటుచేసి, యువజనులకు సంబంధించిన 24 అంశాలపై కొంతమంది రచయితలను వ్యాసాలనురాసి పంపవలసిందిగా ఆహ్వానించారు. ఆ సందర్భంగా "యువజనులు – రాజకీయాలు" అనే పేరిట పంపిన వ్యాసం ఇది.)

**ఒ**కానొక దశలో, ప్రపంచ మానవసమాజంలో లేదా ఒకదేశంలోని సామాజిక వ్యవస్థలో ఎలాంటి ఉత్పత్తి శక్తులమీద ఆర్థిక వ్యవస్థ ఏర్పడివుందీ, వివిధ వర్గాలు ఆ ఆర్థిక ఉత్పత్తి విధానంలో ఏ యే పాత్ర వహిస్తూ ఉన్నవీ, అందులో ఏ వర్గం ఉత్పత్తి శక్తులమీద, ఆర్థికవ్యవస్థమీద ఆధిపత్యమూ, యాజమాన్యమూ వహిస్తూ ఉందీ – వీటన్నింటిపై ఆనాటి రాజ్యాధికారం, రాజకీయాలు ఆధారపడి ఉంటాయి.

సమాజంలో ఆనాటి ఆర్థికవ్యవస్థపై యాజమాన్యం వహిస్తున్నట్టి, ఉత్పత్తి శక్తులను స్వాదీనంలో ఉంచుకున్నట్టి వర్గం తన ప్రయోజనాలను రక్షించుకోవడానికి ఏర్పరచుకున్న సంఘటిత నిర్బంధ యంత్రాంగమే రాజకీయాధికారమూ, రాజ్యాంగచట్టమూనూ.

తన ఆర్థిక ప్రాభవాన్ని, రాజకీయాధికారాన్ని కాపాడుకోడానికి, దానికి వ్యతిరేకంగా తిరుగుబాటురాకుండా జేసుకోడానికి ఆ వ్యవస్థను సమర్థించేటట్లు నీతులను, ధర్మశాస్త్రాలను, మతాన్ని, సారస్వత, కళా, శాస్త్రీయ విజ్ఞానాన్నీ, సాంఘిక ఆచారాలను, కుటుంబ వ్యక్తిగత జీవిత సిద్ధాంతాలను దానికి అనుగుణ్యంగా నిర్ణయిస్తుంది. వానిని అమలుజరపడానికి కూడా అవసరమయితే ఈ నిర్బంధయంత్రాంగాన్నీ, రాజకీయాధికారాన్ని పాలకవర్గం నిస్సంకోచంగా ఉపయోగిస్తుంది.

ఒకవర్గం యొక్క రాజకీయాధికారాన్ని, ఆర్థికాధికారాన్ని కూలద్రోసి దానిస్థానే అంతవరకు దానిచేత దోపిడీచేయబడుతూ, అణచివేయబడుతూ వచ్చిన వర్గం లేదా వర్గాలు రాజకీయాధికారాన్ని కైవసం చేసుకొని, నూతన ఆర్థికవ్యవస్థను, నూతన రాజకీయ సామాజిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరణ చేయడమే రాజకీయాలు.



అందుచే ప్రతిదశలోను రాజకీయాలు రెండుగా ఉంటాయి. ఒకటి అధికారంలోని వర్గంయొక్క ఆర్థికరాజకీయాధికారాన్నీ, దాని సాంఘికసైద్ధాంతిక సౌధాన్నీ బలపర్చే రాజకీయాలు. రెండవది అధికారవర్గ రాజకీయార్థిక అధికారాన్ని, దాని సాంఘిక సైద్ధాంతిక సౌధాన్ని కూలద్రోయడానికి కృషిచేస్తున్న అణచబడిన వర్గాలకు తోడ్పడే సిద్ధాంతాలు, అందుకు కృషిచేసే పార్టీలు, వాటి రాజకీయాలు.

యువకులు స్థూలంగా ఏ వర్గంలో నుండి వస్తారో సామాన్యంగా ఆ వర్గ రాజకీయాలనే అవలంబిస్తారు. ఆ వర్గంలోని వయోవృద్ధులతో, పై తరం వారితో చేతులు కలిపి పనిచేస్తూ వుంటారు.

కాని కొలదిమంది యువకులు పై వర్గాలనుండి వచ్చినా, దోపిడీ వర్గాల నుండి వచ్చినా, తమ చుట్టుప్రక్కలనున్న పరిస్థితుల ప్రభావము వలన పీడిత వర్గాలతో నిలబడటం జరుగుతుంది. సమాజములోని తీవ్ర తారతమ్యాలు, తీవ్ర సంఘర్షణలు క్రమక్రమేణా మరింత పెరుగుతూ వుండటం తప్ప పరిష్కార మార్గం కనబడకుండా ఉన్నప్పుడు, అణచబడిన వర్గాలకు అనుకూలమయిన నూతన సామాజిక ఆర్థిక రాజకీయ సిద్ధాంతాలతో, కృషితో ప్రభావితులయి, తమ సహజవర్గ ధోరణులను వదులుకొని పీడిత వర్గాలతో నిలబడగలుగుతారు.

ముఖ్యంగా యువకులు దోపిడీవర్గాల అభివృద్ధి నిరోధక అలవాట్లకు, మూఢాచారాలకు, సిద్ధాంతాలకు పూర్తిగా లోనయి, వానిలో కూరుకుపోకముందే తమ చిన్న వయస్సులో తమ చదువు, తదితర పరిసర ప్రభావాలవలన ఎక్కువగా పీడితవర్గాలవైపు మ్రొగ్గటానికి అవకాశముంటుంది.

అందుచే యువజనుల రాజకీయాలువేరు, వయోవృద్ధుల రాజకీయాలు వేరు అని చూడడం తప్పు. లేదా యువజనులు ఒక ప్రత్యేక వర్గమనీ, వయోవృద్ధులంతా మరోవర్గానికి చెందిన వారనీ, వీరికి ప్రత్యేక ఆర్థిక, రాజకీయ, సాంఘిక సిద్ధాంత అవగాహనలుంటాయనీ ఊహించి ఆ కృత్రిమ పునాదిమీద సమస్యా పరిష్కారానికి పూనుకోవడం వృధా ప్రయాస తప్ప మరేమీకాదు. వయోవృద్ధుల అనుభవాన్ని, పరిజ్ఞానాన్ని యువతరానికిగల చొరవ, ఉత్సాహము, ప్రత్యక్ష కార్యాచరణకు వున్న శక్తినీ, దూకుడును సమన్వయపర్చి అన్ని రంగాలలో రాజకీయ దృక్పథంతో ముందుకు సాగవలసి వుంటుంది.

నేడు ప్రపంచంలో రెండు వ్యవస్థలు పోటీపడుతున్నాయి. సోషలిస్టు వ్యవస్థ మూడవవంతు జనాభా, నాల్గవవంతు భూభాగంమీద వుంది. అచ్చట ఉన్నది భూస్వాములు పెట్టుబడిదార్లు లేని సమాజం. కార్మికులు (ఫ్యాక్టరీలలో, ఆఫీసులలో పనిచేసేవారు), రైతులు

(భూములమీద పనిచేసేవారు) కలసి రాజకీయాధికారం చెలాయిస్తున్న సమాజమది. ఉత్పత్తి సాధనాలన్నిటిని తమ ప్రభుత్వాధీనం చేసుకుని, ఒక మానవుడిని మరో మానవుడు దోచుకోడానికి వీలులేని ఒక నూతన సమాజం–సోషలిస్టు సమాజం అది. ఇప్పుడు ఈ దశలో ప్రతి ఒక్కరికి పని, పని కొలది ప్రతిఫలం (వేతనం), ప్రతి ఒక్కరికి, విద్య, వైద్యం, గృహవసతి, అవసరమయినప్పుడల్లా సాంఘిక సంరక్షణ భీమా గ్యారంటీగావున్న సమాజం. దీని ఉన్నతదశ ప్రతి ఒక్కరూ తమ శక్తికొలది పనిచేయడం, తన అవసరం కొద్దీ మాత్రమే ప్రతిఫలం తీసుకునే మానవసమాజం. దానినే కమ్యూనిస్టు సమాజమంటారు. దానిని అందుకోడానికి కృషి జరుపవలసి వుంటుంది. అట్లాంటిక్ మహా సాగరం నుండి పసిఫిక్ మహాసముద్రం వరకు సోవియట్ యూనియన్, చైనా, వీని పరిసర దేశాలు, అమెరికా భూఖండంలోని క్యూబా సోషలిస్టు దేశాలు.

మిగిలిన ప్రపంచం అంతా పెట్టుబడిదారీ ప్రపంచం. ఇందులో అమెరికా, బ్రిటన్, పశ్చిమ జర్మనీ, ఫ్రాన్సు, జపాను బలిష్టమయిన సామ్రాజ్యవాద దేశాలు. వీని ఆర్థిక ప్రాబల్యం క్రిందనే మిగిలిన పెట్టుబడిదారీ దేశాలు, ఇటీవల వరకు ఆధీన వలస దేశాలుగా వుండి, రాజకీయాధికారాన్ని సాధించుకున్న వెనుకబడిన దేశాలు వున్నాయి. వీనిలో అనేక దేశాలలో భూస్వామిక విధానం (ప్యూడలు విధానం), అంతకు పూర్వపు సామాజిక (బానిస, ఆదిమ తెగల సమాజకాలపు) అవశేషాలతో సమ్మిళితమయిన ఆర్థిక విధానాలున్నాయి.

## భారతదేశంలో రాజకీయ వ్యవస్థ

స్వాతంత్ర్యానికి పూర్వం – అంటే 1947 ఆగస్టు 15కు పూర్వం బ్రిటిషు సామ్రాజ్యవాదుల పరిపాలనకు వ్యతిరేకంగా మన దేశంలోని వివిధ వర్గాలు – బడా పెట్టుబడిదారులనుండి, పట్టణ కార్మికులు, గ్రామ రైతాంగము వరకూ కలసి పోరాడుతూ వచ్చారు. జమీందారీ – జాగీర్దారీ వర్గం, సంస్థానాధీశులు బ్రిటిషు వారితో చేతులు కలిపి ఈ పోరాటాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. స్వాతంత్ర్యాన్ని సత్వరంగా సాధించడానికి అవలంభించవలసిన పద్ధతులమీద, ఏ కార్యక్రమం మీద ప్రజా బహుళ్యాన్ని సమీకరించాలన్న విషయం మీద, స్వాతంత్ర్య సముపార్జన తర్వాత ఎలాంటి సమాజ నిర్మాణానికి, ఎలాంటి కార్యక్రమాన్ని అమలు జరపాలన్న అంశంలో చాలా భేదాలుంటూ వచ్చాయి. ఏమయినా, బ్రిటిషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సాగించే స్వాతంత్ర్య పోరాటంలో అన్ని శక్తులు ముందుకు నడుస్తూనే వచ్చాయి. ఆనాడు కాంగ్రెసు నాయకత్వాన – చివరకు మహాత్మాగాంధి, జవహర్‌లాల్ నెహ్రూల నాయకత్వం క్రింద, బడా పెట్టుబడిదారీ వర్గ ప్రాబల్యము క్రింద ఆ పోరాటం విజయవంతమయింది. రాజకీయాధికారాన్ని, రాజకీయ స్వాతంత్ర్యాన్ని భారత ప్రజలు సాధించుకోగలిగారు.



కాని బ్రిటీషు ఆర్థిక ప్రాబల్యం, భూస్వామిక దోపిడీ భారతదేశంలో ప్రగాఢంగా నిలబడి పోయాయి. స్వాతంత్ర్యానంతరం రాజకీయాధికారం స్వీకరించిన కాంగ్రెసు నాయకత్వం విదేశీ సామ్రాజ్య వాదులతో రాజీపడి రాజ్యమేలసాగింది. బడా పెట్టుబడిదారుల, భూస్వాముల అస్థిత్వాన్ని కాపాడుతూ దేశాభివృద్ధిని పెట్టుబడిదారీ పంథాన సాధించడానికి పూనుకుంది. సోషలిస్టు సమాజాన్ని నిర్మించడమే మా ధ్యేయమని పార్లమెంటుచేత ప్రకటింపజేసినా ఆచరణలో బడా పెట్టుబడిదారుల ప్రాబల్యం, గ్రామసీమలలో భూస్వాముల ప్రాబల్యం మరింత పెరిగిపోయింది. విదేశీ పెట్టుబడులు, విదేశీ ఋణాలు, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదుల ప్రాబల్యం విపరీతంగా పెరిగిపోయింది.

దున్నేవానికి భూమి, ప్రతి ఒక్కరికీ పని, నిరుద్యోగ నిర్మూలన ప్రాథమిక, మాధ్యమిక (సెకండరీ) విద్యాబోధన, 7–10 సంవత్సరాల మధ్య పిల్లలకు కనీస సార్వజనీన విద్యాశిక్షణ, ప్రజల సంక్షేమ సంరక్షణ, భీమాపథకాలు ఆచరణలో సున్నా అయ్యాయి. సోషలిజానికి ప్రాతిపదికగా భూమి గుత్త యాజమాన్యాన్ని, పరాన్నభుక్త అయిన భూస్వామిక విధానాన్ని అన్ని రూపాలలోను రద్దుచేసి దున్నేవానికి భూమి హస్తగతం చేయలేదు. బడా పెట్టుబడిదార్ల, విదేశీ సామ్రాజ్యవాదుల పారిశ్రామిక వాణిజ్య పెట్టుబడులను స్వాదీనపరచుకోలేదు. విదేశీ వ్యాపారాన్ని ప్రభుత్వాధీనం చేసుకోలేదు.

వీని ఫలితంగా స్వాతంత్ర్యం తమకష్టాలన్నింటిని పోగొట్టుతుందని విశ్వసిస్తూ వచ్చిన ప్రజానీకానికి తీరని ఆశాభంగం కలిగింది. సోషలిస్టు సమాజం నిర్మిస్తాము. భూములు పంచుతాము, పారిశ్రామికాభివృద్ధిని పెంపొందించి నిరుద్యోగాన్ని పోగొట్టుతాము. బడా పెట్టుబడిదారుల, విదేశీ సామ్రాజ్యవాదుల ప్రాబల్యాన్ని త్రోసివేసి స్వయంపోషక ఆర్థిక విధానం అమలుపరుచుతామనే వాగ్దానాలు మెండుగా చేశారు. కాని తీసుకున్న చర్యలు కొద్ది మాత్రమే. వాగ్దానాలతో ఆశలు పెంచుతూ వచ్చినా యువజనులలో ముఖ్యంగా పీడిత వర్గాలలో, మధ్య తరగతి ప్రజానీకంలో విద్యనభ్యసించి పట్టభద్రులయినా పనిదొరకక, ఆకలికి, అవమానానికి గురి అవుతూవున్న యువకులలో అసంతృప్తి, నైరాశ్యము పెరిగింది.

స్వాతంత్ర్యం సాధించిన తర్వాత సుమారు ఒక 20 సంవత్సరాలు యువజనులు ఆశలతో, భ్రమలతో రాజకీయరంగంలోకి ప్రముఖంగా ముందుకి రాలేదు. తమ ఆశలు వమ్ముకావడంతో కాంగ్రెసు నాయకత్వం మీద, ప్రభుత్వ విధానాలమీద భ్రమలు చిన్నాభిన్నమయ్యే కొద్దీ, అనేక అడ్డదిడ్డ మార్గాలలో తిరుగుబాటులు జరుగుతున్నాయి. పీడిత ప్రజల ఉద్యమాలు, సంఘాలు వారిలో పనిచేస్తూ వచ్చిన రాజకీయ పార్టీలు బలహీనంగా ఉండబట్టి ఈ యువజనులను సరియయిన మార్గంలోకి ఆకర్షించగలిగిన కార్యక్రమాన్ని అవలంభించలేక పోయాయి.

నిన్నటితరం స్వాతంత్ర్య సాధనను ఆశయంగా పెట్టుకొని రాజకీయాలలో ప్రవేశించింది. నేటితరం నిజమయిన సోషలిస్టు సమాజ నిర్మాణం తమ ఆశయంగా పెట్టుకొని ముందుకు రావలసివుంది అప్పుడే యువజనులకు ఒక నిర్దిష్ట ఆశయం, ప్రగతిశీల రాజకీయాలు, ప్రజామోదం పొందగల్గిన కార్యాచరణ, దానిని అమలు జరపడానికి కావలసిన సుశిక్షిత, త్యాగపూరిత వ్యక్తిగత జీవిత విధానం మానవుని యెడల గౌరవం, అభిమానం పెరగడంతో నూతన సమాజ నిర్మాణానికి సమైక్య కార్యాచరణ పెరుగుతుంది. అది నూతన జీవిత విధానంగా స్థిరపడిపోతుంది.

యువజనుల ముందు నవసమాజ నిర్మాణం, సోషలిస్టు సమాజ నిర్మాణం ఆశయంగా ఉండాలి. దానిని సాధించడం కోసం అహర్నిశలు కృషి గావించాలి. సరియయిన రాజకీయాలు తనకు, ప్రజలకు జీవితాన్ని సరైన మార్గంలో నడుపుకోవడానికి కూడా ఉపయోగపడే పంథా అని మనం పైన చూశాము. అందుచే దైనందిన జీవిత సమస్యలను ప్రతి ఒక్క దానిని పూర్తిగాగాని, పాక్షికంగా గాని పరిష్కరించుకోడానికి తీసుకోవలసిన కార్యాచరణ, దానికి ప్రజా సమీకరణ, ఆందోళన, పోరాటం ఇవన్నీ రాజకీయాలే. ఇలాంటి నిరంతర రాజకీయ కార్యాచరణ పర్యవసానంగానే అనేక దైనందిన జీవిత సమస్యలను పరిష్కరించుకోవడంలో వివిధ వర్గాలు, పార్టీలు, ప్రభుత్వ యంత్రాంగం తీసుకుంటున్న చర్యల ప్రత్యక్ష అనుభవం ద్వారానే ప్రజాబాహుళ్యం రాజకీయ పరిపక్వతను సాధించుకొని, పోరాటాలు తీవ్రతరం చేసుకొని తమ ఆశయాన్ని సాధించుకోవడం సాధ్యమవుతుంది.

ప్రతి వ్యక్తి జీవితంలో ప్రతి ఒక్క సమస్య కూడా రాజకీయాలతో ముడివడి వుంటుంది. విడదీసి వేరుగా పరిశీలించడం సాధ్యమూగాదు. అలా ప్రయత్నించడం కూడా నిష్ప్రయోజనం. వాస్తవాన్ని దాచడానికి పూనుకోవటం తప్ప మరేమీకాదు. అయితే ప్రతి వ్యక్తి, ప్రతి యువకుడు తన దైనందిన జీవిత సమస్య ఏ రకంగా రాజకీయాలతో ముడిపడివుందో తెలుసుకోలేకుండా ఉండవచ్చు.

ఈ గోష్టి కార్యక్రమంలో తీసుకోబడుతున్న అనేక విషయాలు ఏరీతిగా ఈ దైనందిన జీవిత సమస్యలతో దైనందిన రాజకీయాలతో ముడిపడి ఉందీ పరిశీలిస్తే ఇది మరింత ప్రస్ఫుటమవుతుంది. ఆ విషయాలన్నింటి మీద ఇతర అభిజ్ఞులు వివరంగా తమ తమ రాజకీయ దృక్కోణాల నుండి వివరిస్తారు. నేను ఇచ్చట పీడితవర్గాల, సోషలిస్టు దృక్కోణాల నుండి వారి రాజకీయ వైఖరి ఎలా వుండాలో సూచనప్రాయంగా తెలియజేస్తాను.



## ఆర్థిక రంగం

ప్రతి యువకుడు తన జీవితం హాయిగా గడిచిపోతే చాలు అనుకోవడం సర్వసామాన్యమైన విషయం. కాయకష్టంతో సంబంధంలేని వైటు కాలర్ (గుమస్తాగిరి లేదా కలం గీటులతో జీవితం తేలికగా నడుపుకోడానికి పనికివచ్చే) ఉద్యోగాలను సంపాదించి నగరాలలో ఉండిపోవాలనుకోవడానికి కారణం కాయకష్టం చేయాల్సిన పనులలో వచ్చే జీతాలు నికృష్ట జీవితానికికూడా సరిపడకపోవడమే. పొలాలలో, ఫ్యాక్టరీలలో, పరిశ్రమలలో, గనులలో కష్టంచేసే వారికంటే కలంగీత పనివారికి లేదా ఏ పనీచేయని సోమరులకు ప్రతిఫలము, హోదా హెచ్చు. నేటివరకు అన్ని దోపిడీ సమాజాలలోను ఇదే పద్ధతి కొనసాగుతూ వచ్చింది. కాయకష్టంచేసి పండించే, ఉత్పత్తిచేసే కష్టజీవులకు జీతాలలో, హోదాలో, ప్రతిపత్తిలోన ప్రాధాన్యత ఇచ్చే సమాజం రానంతకాలం పై ఈ ధోరణిలో, ఈ పాతకాలపు భావాలలో యువకులు ముఖ్యంగా పైవర్గాలవారు కొట్టుకుపోవడం సహజమే.

కాని తమ జీవితం హాయిగా గడిచిపోతేచాలు అనుకునేవారు తమ అనుభవంలో నేటి సమాజంలో అది సాధ్యంకాదని, కడకు ఆత్మాభిమానంతో ఆత్మహత్యలకు దిగుతున్నారు. బ్రతుకుబరువును దింపుకోడానికి ఈ ఆత్మాభిమానాన్ని చంపుకొని చాలీచాలని జీతాలతో ఏ వృత్తినైనా చేపట్టడానికి యువతరం తయారుకావడంలేదు. తిరుగుబాటు చేస్తూవుంది. దురదృష్టవశాత్తూ ఈ తిరుగుబాటు తగినంత విస్తృతంగా, తగినంత ఉవ్వేత్తుగా యువతరంలోకి ఇంకా రావడంలేదు.

నేడు యువతరాన్ని – పీడితవర్గాల, మధ్యతరగతి వర్గాల యువజనులను ఎదుర్కొంటున్న నగ్నసమస్య నిరుద్యోగం. ప్రతి ఒక్కరికీ – ప్రతి పురుషునికి, ప్రతి స్త్రీకి కావలసింది పని, వృత్తి. ఆ పనిలో జీవితానికి అవసరమయిన జీవన భృతి దొరకాలి. కూడు, గుడ్డ, కొంప దొరకాలి. జీవితావసర వస్తువులు చౌక ధరలకు లభ్యంకావాలి.

ఇవి కావాలంటే భూస్వామిక విధానాన్ని రద్దుచేసి, భూములను దున్నుకొనేవారికే – వ్యవసాయ కార్మిక, పేదప్రజలకు, యువకులకు స్వాధీనం చేయాలి. బడా పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల చేతులలోని పరిశ్రమలు, గనులు, వ్యాపారాన్ని ప్రభుత్వం స్వాధీనంచేసుకొని వానిని కార్మికుల, ప్రజల సహకారంతో వారి ప్రతినిధులతో ఏర్పడిన కమిటీల యాజమాన్యాన నిర్వహించాలి. ఆదాయాలలో తారతమ్యాలు బాగా తగ్గించివేయాలి. ఒకటికి 10 రెట్లు లేదా అవసరమయితే ముందు ముందు ఒకటికి 5 రెట్లకు తగ్గించాలి. కనీస జీవనభృతి ప్రతి ఒక్కరికీ గ్యారంటీ చేయాలి. ఆదాయాలకు గరిష్ట పరిమితిని (సీలింగు) నిర్దేశించాలి.

అలాచేయక నేటి సామాజిక వ్యవస్థలో పనిచేసే వారొకరు, అనుభవించేవారు మరొకరు. పనిచేయని భూస్వాములు, బ్యాంకు కూపన్లు కత్తిరించుకొని పరిశ్రమ వాణిజ్యాలలో వచ్చే లాభాలను భుక్తం చేసుకొనే బడా పెట్టుబడిదారులు, దొంగమార్కెటుదారులు, లంచగొండి ఉద్యోగులు రాజకీయాధికారాన్ని చెలాయిస్తూ లంచాలతో, అవినీతితో లక్షలు, కోట్లు తమ లక్ష్యంగా పెట్టుకున్న ప్రబుద్ధులే అనేక తప్పుడు ఆరోపణలను కష్టజీవులమీద, యువకులమీద మోపుతున్నారు. నేటి తరానికి నిజాయితీలేదనీ, కష్టపడే ఓపికలేదనీ, హక్కులు, హోదాలమీద మోజు ఎక్కువనీ, బాధ్యతలపట్ల ఆసక్తి తక్కువనీ, ఉత్పత్తిని తగ్గుముఖంపట్టిస్తారనీ, స్వాతంత్ర్యానంతరం వచ్చిన స్వేచ్ఛా జీవనాన్ని దుర్వినియోగంచేస్తూ విశృంఖలంగా వ్యవహరిస్తున్నారనీ ప్రచారం సాగిస్తున్నారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ, సహకార రంగ, వ్యవసాయ రంగంలో వచ్చిన పచ్చ విప్లవం – ఇవి అన్నీ పై వర్గాలలోని వారికి చెందినవే. ఆ వర్గాలకు చెందిన యువకులకు లాభించింది. కాని యువజన బాహుళ్యానికి ఇవి అన్నీ దూరపుకొండలు, ఆశలు మాత్రమే.

## విద్యా రంగం

ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య (సెకండరీ విద్య) బాలబాలికల జన్మహక్కు. ఉన్నత (కళాశాల) విద్యాభ్యాసానికి అందరికీ అవకాశముండాలి. బ్రిటిషు పరిపాలనా కాలంలో తమ పరిపాలనా సౌలభ్యం కోసం అవసరమయిన ఉద్యోగస్తులను తర్ఫీదు చేసుకోవడానికి ఇంగ్లీషు అధికార భాషగా పరిమిత విద్యా సౌకర్యాలు ఏర్పరచడం జరిగింది. స్వాతంత్ర్య సముపార్జనానంతరం వచ్చిన ప్రభుత్వం తన పెట్టుబడిదారీ, భూస్వామిక వ్యవస్థను కొనసాగించడానికి, దానికి అవసరమయిన ఆర్థికాభివృద్ధికి, శాస్త్రీయ విజ్ఞానానికి, పరిపాలనా యంత్రాంగానికి కావలసిన ఉద్యోగ బృందాన్ని సమకూర్చుకోడానికి అంతకుమునుపువున్న విద్యా విధానాన్నే విస్తృతం చేయడం జరిగింది. ఇంగ్లీషుస్థానే హిందీ భాషను రాష్ట్ర భాషగానూ, ఉన్నత విద్యకు బోధనా భాషగా ఇంగ్లీషును చేయ సమకట్టింది. భారత జాతీయ సమైక్యానికి ఇది అవసరమనీ ప్రతి ఒక్కరూ మూడు భాషలు–మాతృభాష, రాష్ట్రభాష హిందీ, ఇంగ్లీషు నేర్చుకోవాలనే పథకం చేపట్టింది. ప్రజాబాహుళ్యం ఆశలను కాదనలేక పదేండ్లలో ప్రాథమిక విద్యను 8 సంవత్సరాల లోపు బాలబాలికలందరికీ ఉచితంగా, నిర్బంధముగా సర్వవ్యాప్తంగా అందచేస్తానన్నది.

ఆచరణలో ఈ ప్రాథమిక విద్య స్వాతంత్ర్యం వచ్చి యిప్పటికి 30 సంవత్సరాలు దరిదాపు కావస్తున్నప్పటికీ 20 మందికి మాత్రమే ఆవయస్సులోనివారికి లభ్యమయింది. అందరికీ మరో 10–15 సంవత్సరాలలో అందజేస్తానని ప్రభుత్వం ప్రకటిస్తూ వుందిగాని,



అది వేస్తున్న పథకాలను చూస్తే మరో రెండు మూడు దశాబ్దాలకయినా పూర్తి చేయకలుగుతుందనే నమ్మకంలేదు.

నిరక్షరాస్యులు దేశంలో నూటికి 70 మంది. కళాశాల విద్యార్థుల సంఖ్య 30 లక్షల వరకు పెరిగింది. కాని నిరుద్యోగులుగా రిజిష్టరులలో నమోదు చేసుకొన్న 72 లక్షలలో సగం మంది మాధ్యమిక విద్య, స్కూలు ఫైనల్ పూర్తి చేసిన వారు, పట్టభద్రులు అయివున్నారు.

అందుచేతనే చదువుల ఆశయం ఏదో ఒక వృత్తి, ఏదో ఒక పని లభ్యం కావాలి. దానిలో నైపుణ్యానికి చదువు, శిక్షణ తోడ్పడాలి. ఈ ప్రప్రథమ ఉద్దేశాన్ని పూర్తి చేసుకొని, తన జీవిత కాలంలో మరింత ఆదాయాన్నిచ్చేది, తన ఇష్టానికి అనుగుణ్యమైనది అయిన వృత్తికి తర్ఫీదు అవసరమయిన ఉన్నత శిక్షణకు కావలసిన పునాది ఏర్పరచవలసి ఉంటుంది. జీవితాంతము వరకు నిరంతరం తన విజ్ఞానాన్ని పెంపొందించుకొనే ఆసక్తి, అవకాశం కల్గించాలి. దేశ విదేశ పరిణామాలను అవగాహన చేసుకొంటూ తన విద్యుక్త ధర్మాన్ని ప్రజా బాహుళ్యంతో కలసి నిర్వహించడానికి తోడ్పడాలి. దానికి కావలసిన శీలత, శిక్షణ అలవర్చుకోడానికి విద్య తోడ్పడాలి.

అయితే సామాజిక స్వరూపం, ఆశయాలు మారనిదే విద్య ఈ లక్ష్యాలను సాధించలేదు.

వెనువెంటనే ప్రాథమిక విద్యను, మరో 10 సంవత్సరాలలో మాధ్యమిక విద్యను అందరికీ ఉచితంగా నేర్పడానికి తగినన్ని పాఠశాలలను, ఉపాధ్యాయులను ఏర్పరచాలి. ఆర్థిక స్తోమత లేనివారికి ప్రభుత్వమే పూర్తిగా ఖర్చులు భరించాలి. ప్రతి విద్యాదశానంతరం ఏదో వృత్తికి, పనికి పోదలచుకున్న వారికి ఆ ఉపాధి వృత్తి గ్యారంటీ చేయాలి. వృత్తి చేసుకుంటూనే పై అంతస్థు విద్యా శిక్షణా పరిజ్ఞానం, అవసరమైన డిగ్రీలు పొందడానికి అవకాశాలు పూర్తిగా వుండాలి. కళాశాలలో ఆర్థిక వ్యవస్థకు అవసరమయిన, వివిధ శాఖలలోకి అవసరమైన వరకే విద్యార్థుల ప్రతిభను బట్టి చేర్చుకోవాలి. వృత్తులలో పని చేసుకుంటూ వున్నవారి అనుభవం, నైపుణ్యాన్ని బట్టి వారికి ప్రాధాన్యతనిచ్చి ముందుగా చేర్చుకోవాలి. ఒక అంతస్థులో ఆరితేరిన యువకునికి, అంతకు పై అంతస్థున ఉత్తీర్ణుడైన యువకునికి దొరికే వృత్తులలో ఆదాయ తారతమ్యాలు విపరీతంగా ఉండరాదు. ఉద్యోగం, వృత్తి వివిధ అంతస్థులలో గ్యారంటీ చేయబడిననాడు, విపరీత తారతమ్యాలు లేకపోయినపుడు విద్యావిధానం మీద తలమునక బరువులేకుండా అందరికీ విద్య, అందరికీ వృత్తి లభ్యమౌతుంది.

కానీ నేటి విద్యావిధానం వృత్తిని, జీవిత భృతిని గ్యారంటీ చేయడం లేదు. పరీక్షలలో అవినీతి, ధనం, అధికార ప్రాబల్యం పెరిగిపోతూవుంది. నిజాయితీగా వున్న వారికి రావలసిన స్థానం రాకుండా, చదవని వారికీ, డబ్బు, అధికారం, ప్రాబల్యం వున్న వారికి రావడంతో పరీక్షలలో కాపీగొట్టడం, ఇతర అవినీతి పద్ధతులు ప్రబలుతున్నాయి. దీనికి కారకులైన పెద్దలను, సమాజాన్ని సరిదిద్దాలి. అయితే యువజనులు తమకున్న చదువుకొనే ఈ కొద్ది అవకాశాన్ని కూడా పోగొట్టుకోకుండా ఈ అవినీతి పద్ధతులకు వ్యతిరేకంగా తామే తమసంఘాల ద్వారా ఎదుర్కోవలసి వుంటుంది. ఉపాధ్యాయులు చక్కగా శ్రమపడి తమకు పాఠాలను వివరించాలని, ప్రతి పరీక్ష ప్రతి ఏటా ఉత్తీర్ణుడయ్యేటట్లు శ్రద్ధ తీసుకొని బోధించాలని పట్టు పట్టాలి. చదవకుండా మొండిగా, విచ్చలవిడిగా తిరిగే అరాచక విద్యార్థులను తామే అదుపులో పెట్టడానికి విద్యార్థులే ముందుకు రావాలి. అదే విధంగా ఉద్యోగాలిస్తున్న సందర్భాలలో పలుకుబడి, రికమండేషన్స్, సిఫార్సులతోగాక తమ విద్యా నైపుణ్యాలను, తమ ప్రతిభను మాత్రమే ఆధారంగా తీసుకోవాలని పట్టుపట్టాలి. అందరికీ ఉద్యోగాలు, వృత్తులు ఏర్పరచాలని పట్టుపట్టాలి.

ప్రభుత్వ యంత్రాంగంలోనూ, పారిశ్రామిక రంగాలలోనూ కావలసిన కొద్దిమందిని, అంటే కొన్ని లక్షల మందిని తయారు చేసుకోవడానికైతే ఏ పరాయి భాషలోనైనా అలాంటి వారిని తయారు చేసుకోవచ్చు. కాని ప్రజా బాహుళ్యాన్ని విద్యావంతులను గావించాలంటే వారివారి మాతృభాషలోనే అత్యంత ఉన్నత విద్యను, శిక్షణను యివ్వవలసి వుంటుంది. కొన్ని విషయాలలో అవసరమైనప్పుడు విదేశీ భాషలలో వున్న గ్రంథాలను అధ్యయనం చేయడానికి, ఆయా భాషలను ఆయా పాఠ్యాంశములుగా చేర్చవచ్చు అంతేగాని ఇంగ్లీషులోనే ఉన్నత విద్య అనడం అవివేకం.

దేశ సమైక్యతకు హిందీని నిర్బంధంగా చదవమనడం దేశ విచ్ఛిన్నతకే దారితీస్తుంది. దేశంలో వాణిజ్యరీత్యాను, పారిశ్రామికంగాను ఒక ప్రాంతం వారు మరో ప్రాంతానికి పోనారంభించినప్పుడు అవసరమైన మేరకు ఆయా భాషలను, హిందీనికూడా వారే ఇచ్ఛికంగా నేర్చుకుంటారు. వివిధ భాషా రాష్ట్రాలకు ప్రభుత్వ ఉద్యోగులను ఆయా భాషలలో విద్యాభ్యాసము చేసిన వారినుండే తీసుకోవచ్చు. కేంద్రంలో వివిధ రాష్ట్రాలనుండి జనాభా నిష్పత్తిలో, అవసరమైన ఉన్నతోద్యోగులను నియమించవచ్చు. వారు తప్పనిసరిగా మరో భాషను హిందీగాని, ఇంగ్లీషుగాని పరిపాలనా సౌలభ్యం కోసం నేర్చుకోవాలి. కాని ప్రజలకు సంబంధించిన అన్ని చట్టాలు, శాసనాలు, ప్రకటనలు, రిపోర్టులు, వ్యవహారాన్నీ అన్ని రాష్ట్రాల భాషలలోనే జరుపుతూ వుండాలి.



సాహిత్యము, లలితకళలు, నాటకరంగము, సినిమాలు, పత్రికా ప్రపంచము – ఇవి అన్నీ కూడా యువతరాన్ని, భూస్వామిక పెట్టుబడిదారీ విధాన దోపిడీకి వ్యతిరేకంగా నూతన సోషలిస్టు సమాజ నిర్మాణ పంథాన నడపడానికి తోడ్పడే విధంగా వుండాలి. ఈ కళారూపాలలో యెక్కువ సమర్థత కలిగిన కళాకారులు ఈ రూపాలను ప్రజాబాహుళ్యానికి అనుకూలంగా ఉపయోగిస్తే ఎక్కువగా తోడ్పడగలరు. కాని, వారే అధికార దోపిడీ వర్గాలకు అనుకూలంగా వీనిని ఉపయోగిస్తే అంత ఎక్కువగాను కీడును కలుగజేయగలరు. పీడిత ప్రజా బాహుళ్యానికి అనుకూలంగా వుండేవారిని అభ్యుదయ కళాకారులుగా యువజనం భావిస్తుంది. దోపిడీ వర్గాలకు అనుకూలంగా వుండేవారిని అభివృద్ధి నిరోధకులుగా పరిగణిస్తుంది.

## యువతీ యువకులు

మానవ సమాజంలో ఆదిమ తెగల సమాజ కాలంనుండి నేటివరకు స్త్రీ పురుష సంబంధాలు ఏ రీతిగా మారుతూ వచ్చిందీ, ఆర్థిక స్వాతంత్ర్యం పోవడంతో స్త్రీ ఏ రీతిగా పురుషునికి అధీనవస్తువుగా, ఆస్తిగా తయారయిందీ, స్త్రీకి పురుషునితోపాటు సమానహోదా, సమాన హక్కులు నూతన సోషలిస్టు సమాజంలోనే లభ్యమయ్యేదీ ఎంగెల్సు తన ఉద్గ్రంథమైన "కుటుంబం-వ్యక్తిగత ఆస్తి-రాజ్యాంగాల పుట్టుక"లో వివరించారు.

స్త్రీ పురుషులు పరస్పర గౌరవంతో, ఆదరాభిమానాలతో ఒకరికొకరు తోడునీడగా జీవించినప్పుడే తమ వైవాహిక జీవితంలో, తమ కుటుంబ జీవితంలో తమ సంతానాన్ని సరియైన పౌరులుగా సరిదిద్ది శిక్షణ గరపడంలో, సమాజంలో ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, నైతికరంగాలలో తమ పాత్రను నిర్వహించడంలో జయప్రదమవుతారు.

యువతీ యువకులు ఒకరినొకరు ఆకర్షిస్తారు. తమ సంబంధం జీవిత పర్యంతం కొనసాగాలని కోరుకుంటారు. తమ బిడ్డలను ఇరువురూ కలసి ప్రేమ-ఆదరాభిమానాలతో అభివృద్ధి చేయాలనుకుంటారు. కాని ఈ ఆకాంక్షలను పూర్తి చేసుకోడానికి పాత సామాజిక పరిస్థితులు తోడ్పడడంలేదనేది వాస్తవం.

ఒక కులంలోనే, ఒక తెగలోనే, ఒక మతంలోనే లేదా ఆర్థికంగా ఒక అంతస్థులోనే వివాహ సంబంధాలేర్పరచుకోవాలనేది ఆయా కాలంలో, ఆయా దేశాలలో ఏర్పడిన నిబంధనలు, వివాహబంధం వున్నప్పటికీ, ఒకరిపై ఒకరికి ఆకర్షణతగ్గి, గౌరవ ఆదరాలుతగ్గి మరోవ్యక్తితో సంబంధాలేర్పరచుకోవడం పారంపర్యంగా వస్తూనేవుంది. పురుషుడు ఈ పనిచేస్తే సంఘం చూసీచూడకుండా ఉంటుంది. స్త్రీ చేస్తే అది తప్పుగా, పాపంగా, చెడిపోయిందిగా సంఘం నిరసిస్తూ వచ్చింది.

ఈ నియమం, ఈ ఆచరణ, నీతి అని, మతం అని అమలు జరపడానికి పూనుకొనే ప్రయత్నాలకు విరుద్ధంగా స్త్రీ ఆర్థికంగా తన జీవితాన్ని తానే గడుపుకోగల్గిన స్థితి వచ్చేకొద్దీ భగ్నమైపోతున్నాయి. వరకట్నాలు, తల్లిదండ్రులు ఎంచి ఏర్పాటుచేసే వివాహాలు, ఒకే వర్ణంలో పెండ్లి జరగాలనే ఆచారాలు, స్త్రీ జాతికి ఆర్థిక స్వాతంత్ర్యం, తగిన విద్య వీనితోపాటు స్వతంత్ర వ్యక్తిత్వం పెరిగేకొద్దీ మటుమాయమవుతున్నాయి. పరస్పర పరిచయంతో, పరస్పర ఆదరాభిమానాలు, గౌరవంలో వైవాహిక సంబంధాలేర్పరచుకుంటారు.

అయినా అలా జరిగిన వివాహాలు కూడా కలిసి జీవించేటప్పుడు, ఆర్థిక హక్కులతోగానీ, కలసి మెలసి నివసించడంలో పరస్పర సహకారం, తోడ్పాటు, గౌరవం, ఆదరం లోపించినప్పుడుగాని భగ్నమవుతున్నాయి. అప్పుడు ఐచ్ఛికంగా విడిపోవడం, విడాకులు ఇచ్చుకోవడమే నిజమయిన నీతి. ఒక పర్యాయము వివాహం విచ్ఛిన్నమయితే మరోసారి తిరిగి వైవాహిక సంబంధాలు మరొకరితో పెట్టుకోవడం సహజమని చూడాలి. స్త్రీ అలాచేస్తే పాపమని, తప్పని అనుకొనే మూఢాచారంపోవాలి.

తాత్కాలిక ఆకర్షణలకు లోనయిన యువతీ యువకులుగాని, స్త్రీపురుషులుగాని సంబంధాలు పెట్టుకోవచ్చు. అంతమాత్రాన స్త్రీ చెడిపోయిందనీ, అలాంటి సంబంధాలకు లోనయిన స్త్రీ, పురుషులు నీతి బాహ్యులని అనుకోవడంకూడా తప్పే. అలాంటి సంబంధాలనే పదేపదే తాత్కాలింగా పెట్టుకునేవారు, పదే పదే తాత్కాలిక ఆకర్షణలకు లోబడేవారు మాత్రం తమ వ్యక్తిగత జీవితాన్నిగాని, సామాజిక జీవితాన్నిగాని ఉపయోగప్రదంగా నడుపుకోలేని తేలిక మనుష్యులుగా చూడబడతారు. లోతు, శిక్షణ, కట్టుబాటులేని మనుష్యులుగా పరిగణింపబడతారు.

అయితే, జీవితం గడువక తన దేహాన్ని డబ్బుకు అమ్ముకోవలసివచ్చే స్త్రీలు, క్రమక్రమంగా దానికి అలవాటు పడిపోయే స్త్రీలు వున్నారు. సమాజంలో పూర్తి మార్పు తీసుకునిరానిదే వారిని సరియయిన మార్గంలో పెట్టలేము.

స్త్రీ శారీరక స్వభావాన్ని బట్టి పురుషుడు బలాత్కారం చేయడం సాధ్యమవుతుంది. దాని పర్యవసానంగా గర్భవతులు కావడం కూడా జరుగుతుంది. అలాంటివారిని – స్త్రీలను బలాత్కరించేవారిని కఠినంగా శిక్షించాలి. ఏ ఆర్థిక రాజకీయ దృక్కోణమునుండి అయితేనేమీ, సమాజం వివిధ దశలలోను దీనిని తీవ్రనేరంగా పరిగణిస్తూవచ్చింది. అలాంటి స్త్రీలు తమకిష్టములేని గర్భాన్ని తీసివేయించుకోడానికి పూర్తి స్వేచ్ఛ గలిగివుండాలి.

స్త్రీకి వివాహబంధంతో నిమిత్తంలేకుండా సంతానం కలిగినా దానిని నేరంగా, పాపంగా భావించరాదు. ఆమె బిడ్డకు సర్వసాధారణ సమానహక్కులుండాలి. ఏ స్త్రీ అయినా తనకిష్టంవచ్చిన పురుషునితో సంబంధం పెట్టుకుంటే ఆ తర్వాత త్వరలోనే తన భ్రమలు, ఆశలు భగ్నమయి విడిపోయినా యిక జీవితమంతా చెడిపోయిందనే అభిప్రాయానికి



తావుయివ్వక తన జీవితాన్ని సంతోష ప్రదంగా, ఉపయోగప్రదంగా నడుపుకోడానికి తిరిగి కృషిచేయాలి. సమాజం – పురుషులు ముఖ్యంగా యువకులు దానికి తగిన అవకాశం కలిగించాలి. పురుషుని యెడల చూపే ఔదార్యం, సహనత, న్యాయం స్త్రీపట్లకూడా చూపాలి.

బాలబాలికలు 12 సంవత్సరాలు పూర్తి అయ్యేటప్పటికి పరస్పర ఆకర్షితులై దేహసంబంధాలు పెట్టుకోవడం సాధ్యమవుతూ వున్నప్పుడు, దాని ఫలాఫలితాలు, దాని పర్యవసానాలు వారికి అర్థమయ్యేటట్లు లైంగిక విజ్ఞానాన్ని, సెక్సు విజ్ఞానాన్ని – శాస్త్రీయంగా పాఠశాలల్లోనూ, యిండ్లలో తల్లిదండ్రులద్వారాను వివరించడం సరియయినది, ఉపయోగకరమయినది. తమంతట తాము తప్పుల తడకగా విషయజ్ఞానం పొందడానికన్నా యిదే సరియయిన మార్గం. ఆ విజ్ఞానంతో అవసరమయినరీతిగా తమ జీవితాన్ని సరిదిద్దుకోవడానికి ఆస్కారమేర్పడుతుంది.

అలాగే కుటుంబ నియంత్రణ పద్ధతులు. పరిమిత కుటుంబం వల్ల స్త్రీ ఆరోగ్యానికి, కుటుంబం ఆర్థికంగా సుఖంగా జీవించడానికి తగిన అవకాశము కలుగుతుంది. తక్కువమంది బిడ్డలయితే తగిన విద్యా శిక్షణ, ఉపాధులు కలిగించడం సాధ్యమవుతుంది. వీనిని గూర్చికూడా బోధించాల్సి వుంటుంది.

స్త్రీ పురుషులు సమాన గౌరవాదరణలతో, పరస్పర అభిమానాలతో నివసించాలంటే యిరువురూ ఆర్థికంగా స్వయం పోషకంగా ఉండటానికి కావలసిన వృత్తులు, ఉద్యోగాలు చేసుకోవడానికి అలవాటు పడాలి. కుటుంబ జీవితం ఆర్థికంగా సవ్యంగా, తేలికగా జరగడానికి ఒక ఆర్జనమీద కన్నా యిరువురి ఆర్జనవల్ల తేలిక అవుతుంది. నేటి పరిస్థితులలో యిరువురు ఆర్జించటం అత్యవసరమవుతుందనేగాక పరస్పర గౌరవం, సమాన హోదాతో కుటుంబం నడవడానికి కూడా యిది అవసరం. పైగా స్త్రీ పురుషులిరువురూ ఆర్జించడంవల్ల, మొత్తం దేశ ఆర్థికోత్పత్తి పెరిగి సమాజమంతా త్వరత్వరగా అన్ని విధాల అభివృద్ధి పొందడానికి తోడ్పడుతుంది. సోషలిస్టు దేశాలన్నింటిలోనూ స్త్రీ పురుషులందరూ పనిచేసే అవకాశాలుండబట్టే అచ్చట స్త్రీ సమాన కుటుంబభారాన్ని కలిగివుండి, పెట్టుబడిదారీ దేశాలకన్నా సున్నితంగా ముందుకుపోతూ వుంటుంది.

భార్యభర్తలిద్దరూ ఉద్యోగాలలో, వృత్తులలో చేరితే బిడ్డలపోషణ, సంరక్షణ, ఇంటిపనులు – వీనిని నిర్వహించడంలో యిబ్బందులు వుండవచ్చు. కాని యిద్దరూ కలిసి ఒకరికొకరు సహాయంచేసుకుంటూ, ఇరువురూ ఆ పనులనన్నింటిని పంచుకొని ఓపికగా చేసుకోవాలి. ఇప్పటిలాగే స్త్రీయే యింటి పనులన్నింటినీ చూడాలనడం సరికాదు. ఇతర బాధ్యతలతోపాటు తమ తమ ఉద్యోగాలు వృత్తులతోపాటు, యింటిపనులన్నిటినీ కూడా

తాముకూడా పంచుకొని చేయాలి. తమ స్త్రీలమీద బరువును తగ్గించాలనే ధోరణి పురుషులలో ముఖ్యంగా యువకులలో రావాలి.

సహవిద్య, యువతీ యువకులు కలసి మెలసి ఆటలు, పాటలు, సామాజిక చర్యలు – వీనిని ప్రోత్సహించాలి. అవి తప్పుదారులకు, తాత్కాలిక ప్రలోభాలకు దారితీస్తాయనే భయంతో, తలుపులు బిగించి నీతి నియమాలు పాటింపజేయడం అసంభవం. స్త్రీ ఒక ఆటవస్తువుకాదు. స్త్రీ కూడా ఒక మనిషే. పురుషునివలె ఆత్మాభిమానాలు గలిగి తన బాగోగులు చూచుకోగల మనిషి అనే అవగాహన వుండాలి. పురుషునికి వర్తింపజేసే ప్రమాణాలే స్త్రీ యెడల కూడా వర్తింపజేస్తే యీ భయాలుండవు. అయితే స్త్రీకి వున్న ప్రత్యేక దేహ లక్షణాలు, బిడ్డలు కనడమన్న విశిష్ట బాధ్యతను అవకాశంగా తీసుకొని ఆమెను అణచిపెట్టకుండా వుండటానికి తగిన అదనపు రక్షణలు, సౌకర్యాలు ఆమెకు కలుగజేయాల్సి వుంటుంది.

అయితే యివి అన్నీ సోషలిస్టు సమాజంలో అదికూడా బాగా అభివృద్ధి చెందిన దశలోనే పూర్తిగా సాధ్యమవుతాయి. అలాంటి సమాజాన్ని నిర్మించేవరకు యువజనులు ముఖ్యంగా యువకులు తమ వ్యక్తి జీవితాన్ని, స్త్రీల యెడల తమ ప్రవర్తనను తాము చదువుకునే కాలంలోను, తమ వైవాహిక జీవితంలోను, కుటుంబ జీవితంలోను యీ దృక్కోణంతో, ఈ ఆశయంతో మలచుకోవాలి.

అప్పుడే వారు కోరుకునే నూతన రాజకీయాల కోసం నేటి దోపిడీ సమాజంలోని కుళ్ళు రాజకీయాలను, నీతినియమాలను అధిగమించి పనిచేయగలుగుతారు.

## జాతీయ సమైక్యత

ఒక సమాజంలోని అంతర్గత లోపాలు హద్దులు దాటి ఆనాటి సమాజ గీటురాళ్ళకు, ప్రమాణాలకు కూడా మించి బయటపడినపుడు వానికి వ్యతిరేకంగా ఆ సమాజంలోని శాసనకర్తలు దూరదృష్టిగల విజ్ఞులు వీనికి వ్యతిరేకంగా ప్రచారం – చర్యలు తీసుకుంటారు. నేటి సమాజంలోని లోపాలు, అది వ్యక్తమవుతున్న రూపాలకు వ్యతిరేకంగా నూతన సమాజ నిర్మాతలయిన అణచబడుచున్న వర్గాల తరపున విజ్ఞులు మొదట ప్రచారం ప్రారంభిస్తారు. ఈ ప్రచారమూ యీ చర్యలన్నీ సంఘంలోని, సమాజంలోని బహిర్గత లోపాలను దిద్దడానికి జరిపే ప్రయత్నాలే. ఈ ప్రయత్నాలు చేసేవారంతా సంఘ సంస్కర్తలు. వీరి ప్రయత్నాలు వివిధ రంగాలలో సాగినా, వాని విజయాలు పరిమితంగానే వుంటాయి. లోతుగా అసలు రోగానికి చికిత్సగాక పైపై జ్వర చిహ్నాలుగా, తాత్కాలిక చిట్కాలుగా మాత్రమే యివి తోడ్పడతాయి. అయినా అభివృద్ధి కాముకులంతా వీనిని బలపరుచుతారు. ఏ మేరకు సాధించినా ఆ మేరకు ఉద్యమం ముందుకు పోయి అసలు యీ సామాజిక రుగ్మతలకుగల



కారణాలను రూపుమాపి నవసమాజ నిర్మాణం వైపుకే ప్రజా ఉద్యమ వెల్లువ మరల్చడం తేలిక అవుతుంది. నేటి సమాజాన్ని సమూలంగా మార్చివేసి దానిస్థానే నవసమాజ నిర్మాణం చేసినప్పుడే, పూర్తిగా సంఘసంస్కరణలు జయప్రదమవుతాయి. రాజకీయాలతో సంబంధం లేకుండా పాక్షిక సంస్కరణలు కూడా విస్తృతంగా జయప్రదంకావు.

కులమత భేదాలు – వానివలన గలిగే స్పర్థలు, అస్పృశ్యతా నివారణ, వర్ణాంతర వివాహాలు, వరకట్నాలు, బాల్యవివాహాలు, స్త్రీల హక్కులు ఇలాంటివి ఎన్నెన్నో ఉదహరించవచ్చు. ప్రభుత్వం శాసనాలు చేసినా అవి పరిమితంగానే అమలులోకి వస్తున్నాయి. సమాజాన్ని పూర్తిగా మార్పు చేయనిదే మార్పుచేసిన తర్వాతకూడా చాలా సంవత్సరాలు పాతకాలపు భావప్రపంచాన్ని తొలగించి నూతన భావప్రపంచాన్ని ఏర్పరచనంతవరకూ ఇవి విజయవంతం కాజాలవు.

కులతత్వాలు, మతతత్వాలు, ప్రాంతీయతత్వాలు నిన్నటి తరంవారు తెచ్చినవికావు. పాత సమాజాల నిర్మాణ సిద్ధాంతం కొనసాగించే ఈ విచ్ఛిన్న విధానాలు విదేశాలలో పెట్టుబడిదారీ సమాజం అభివృద్ధి చెందేకొద్దీ వీనిని ఈ వికృతరూపంలో లేకుండా చేయగలిగింది. సర్వసాధారణంగా దేశీయత, జాతీయతత్వం ప్రబలింది. కాని వాని స్థానాన రంగు భేదం, వలన దోపిడీ, కార్మిక వర్గ దోపిడీ ఇవి క్రొత్తగా రావడమో లేదా అదివరకు ఉన్నవే మరింత పెరగడమో జరిగింది.

మన భారతదేశంలో కూడా స్వాతంత్ర్యానంతరం, పాతకాలపు సమాజ అవశిష్టాలు వేరూనికొనిపోయి కొనసాగుతూనే ఉన్నాయి. ఆదిమ తెగల సమాజ కాలపునాటి తెగలు నేడు కులాల రూపంలో బానిస భూస్వామిక సామాజిక కాలాల నాటి అస్పృశ్యత, వెట్టిచాకిరీ, వ్యవసాయ కార్మికులకిచ్చే నికృష్ట జీతాలు, విపరీత వడ్డీనాములు, భూస్వామిక పెత్తందారీతనము, కౌలుదోపిడీ, వీనితోపాటు దేశీయ పెట్టుబడిదారీ దోపిడీ, విదేశీ దోపిడి – ఇవన్నీ మిశ్రితమయిన సమాజం మన భారత దేశ సామాజిక వ్యవస్థ.

పాశ్చాత్య దేశాలలో పెట్టుబడిదారీ విధానం పెంపొందే కొద్దీ ఒక భాషను మాట్లాడుతూ, ఒక భూఖండంలో ఆర్థిక సంబంధాలు పెనవేసుకొని అభివృద్ధి చెందిన చారిత్రాత్మకంగా ఒక కళావిజ్ఞాన మనోభావ ప్రపంచంగల ఒక జాతిగా ఆయా దేశాలలో రాజ్యాలు యేర్పడ్డాయి. మొదటి ప్రపంచ యుద్ధానంతరం యీ పరిణామం పూర్తి అయింది. కాని దీనికి కొన్ని మినహాయింపులు వున్నాయి. సోవియట్ యూనియన్‌లో వివిధ భాషలు మాట్లాడే వివిధ జాతుల రాజ్యసమ్మేళనం – సోషలిస్టు యూనియన్‌గా అభివృద్ధి చెందుతూ వుంది.

కాని భారతదేశంలో బ్రిటిషు పరిపాలన ఫలితంగా భాషారాష్ట్రాలు యేర్పడలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ పరిపక్వం పొందలేదు. పాతకాలపు భేదాలు, కులాలు, మతాలకు ప్రాముఖ్యతనిస్తూ, బ్రిటిషు సామ్రాజ్యవాదులు విభజించి పాలిస్తూ వచ్చారు. ఆ తర్వాత స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా కాంగ్రెసు ప్రభుత్వం భాషా ప్రయుక్త రాష్ట్రాల నేర్పరచటానికి మరో 10 ఏండ్లు తీసుకుంది. దీని అవశేషాలు రాష్ట్ర సరిహద్దు తగాదాలుగా నేటికీ బ్రద్దలవుతూనే వున్నాయి.

వెనుకబడిన కులాలు, మతాలు, ముస్లిం మైనారిటీ సమస్యలు, షెడ్యూల్డు కులాలు, హరిజనులు, తదితరులు, షెడ్యూల్డు ఆదిమ తెగలు, వెనుకబడిన రాష్ట్రాలు, రాష్ట్రాలలోనే వెనుకబడిన ప్రాంతాలు – ఇవి అన్నీ సమస్యలుగా స్వతంత్ర భారతం పరిష్కరించాల్సిన స్థితే ఏర్పడింది. రాష్ట్రాలకు, కేంద్రానికి వుండవలసిన సంబంధాలు, రాష్ట్ర స్వపరిపాలనా అధికారాలు ఏ మేరకు వుండాలి? అనే సమస్యలు ముఖ్యంగా ముందుకు వచ్చాయి.

భూస్వామిక విధానాన్ని రద్దుచేసి, పారిశ్రామికాభివృద్ధిని అన్ని రాష్ట్రాలలోను, అన్ని ప్రాంతాలలోను సాధించినప్పుడే అందరికీ పని, అందరికీ జీవిత భృతి గ్యారంటీ చేసిప్పుడే ఈ సమస్యలకు పూర్తి పరిష్కారం సాధ్యమౌతుంది. ఈ లోపల యీ తేడాలను, వెనుకబాటును, నిరుద్యోగ పరిస్థితిని ఆధారం చేసుకుని, వివిధ విచ్ఛిన్న పోకడలను అభివృద్ధి నిరోధక భూస్వామిక పెట్టుబడిదారీ దోపిడీ శక్తులు, పార్టీలు పెంపొందిస్తున్నాయి, దేశ విచ్ఛిత్తికి దారితీస్తున్నాయి. పాలకవర్గ పార్టీలు కూడా ఈ సమస్యలను ప్రజాతంత్ర మార్గాల ద్వారా గాక వివిధ దోపిడీ వర్గాల మధ్య రాజీ బేరాలాడి యిరువురినీ సంతృప్తి పరచాలంటూ యీ తగాదాలను వాయిదాలమీద వాయిదాలు వేస్తూ గడిపివేస్తున్నాయి. అణగద్రొక్కబడుతున్న షెడ్యూల్డు కులాలు, జాతులు, వెనుకబడిన కులాలు, ముస్లిం మైనారిటీలు, భాషా మైనారిటీలకు, వెనుకబడిన ప్రాంతాలలోని ప్రజలకు యిచ్చిన హామీలను, రాజ్యాంగ చట్టంలో గ్యారంటీ చేయబడిన హక్కులను ప్రభుత్వం అమలు జరుపకుండా ఈ అన్యాయాలను, వెనుకబాటుతనాన్ని మరింత పెంచి పోషిస్తూ వుంది.

అందరికీ పని, వృత్తులు, జీవనభృతి గ్యారంటీ చేసేలోపల వున్న ఉద్యోగాలలో, వున్న పనులలో, వున్న విద్యా వసతులలో మైనారిటీ వర్గాలకు, వెనుకబడిన వర్గాలకు, వెనుకబడిన ప్రాంత ప్రజలకు జనాభా నిష్పత్తి మేరకు అయినా కేటాయించాలి.

పరిపాలనా యంత్రాంగంలో అన్ని స్థాయిలలో దామాషా ప్రాతినిధ్యం అన్ని రంగాలలోను ప్రవేశపెట్టి వీరికి తగిన స్థానం కలుగచేసి ప్రజాతంత్ర పద్ధతులలో ప్రజాభిప్రాయానికనుకూలంగా పరిపాలనను సాగించాలి. భాషా సమస్యపైనా, విద్యాభ్యాసం



గురించి యిదివరకే నివేదించడం జరిగింది. కేంద్ర వ్యవహారాలకు కావలసిన ఉద్యోగస్తుల విషయం కూడా పైన వివరించాము. ఆలిండియా సర్వీసులను రాష్ట్రాలమీద రుద్దరాదు.

భాషా రాష్ట్రాల ప్రాతిపదికగా, నిజమైన ప్రజాతంత్ర పద్ధతులలో పరిపాలన సాగిస్తూ, దేశరక్షణ, విదేశాంగ వ్యవహారాలు, విదేశాంగ వాణిజ్యాల, కరెన్సీ, దేశ రక్షణకు కావలసిన రవాణా సౌకర్యాలు గాక మిగిలిన విషయాలన్నీ ఈ భాషా రాష్ట్రాలకు వదిలివేయాలి. వాని ఆర్థిక ప్లానింగు, భారీపరిశ్రమలు ఒక రాష్ట్రానికే పరిమితంగాని ఏ సమస్యపైనైనా తగాదా వచ్చినప్పుడు సమన్వయ పరిచే అధికారం కేంద్రానికుండాలి. వివిధ రాష్ట్రాలకు ఉమ్మడిగా సంబంధించిన నదీజలాశయాలు, ఇరిగేషను, విద్యుచ్ఛక్తి, ఫ్యాక్టరీలు, పరిశ్రమలు, వాణిజ్య రవాణా సౌకర్యాలు, పన్నులు యివన్నీ కేంద్రం నిర్వహిస్తూ వుండాలి. కేంద్రం వసూలు చేసే పన్నులు, ఆదాయంలో మూడుపాళ్ళు రాష్ట్రాలకు ఆర్థిక స్వయం సమృద్ధి కోసం యివ్వాలి. రాష్ట్రాలకు పూర్తిపరిపాలనా ప్రజాతంత్ర హక్కుల పునాది మీద కేంద్రంలో బలీయమైన ప్రభుత్వం ఏర్పడాలని అభివృద్ధి కాముకులు, నూతన సమాజ నిర్మాణాభిలాషులు కోరుతారు. ఇది ఒక్కటే జాతీయ సమైక్యానికి దారితీసే పథకం.

హిందీ భాషనే దేశానికంతటికీ పరిపాలనా భాషగా ప్రవేశపెట్టే ప్రయత్నం, త్రిభాషా పథకం, భాషారాష్ట్రాలలో కూడా మైనారిటీ భాషలకు తగిన రక్షణ యివ్వకపోవడం, మాతృ భాషలను ఉన్నత విద్యలో విశ్వవిద్యాలయాలలో బోధనా భాషగా అమలు జరపడానికి నిరాకరించడం – ఇవి భాషా దురహంకారానికి నగ్న రూపాలు. ఒకే భాషగా దేశమంతటా ఉన్నతవిద్యనభ్యసించడంవల్ల మేధావి వర్గం పరస్పరం సంప్రదించుకొనే అవకాశాలు ఎక్కువవుతుందనే వాదన దేశ జనాభాలో నూటికి ఐదుగురికి మాత్రమే వర్తిస్తుంది. అన్ని రంగాలలో వారికే పెత్తనం. అదొక ప్రత్యేకవర్గం. మిగిలిన 95 మందిపై పెత్తనం చేయడానికి అది పనికి వస్తుందేమో కాని వారు జనబాహుళ్యంతో సంబంధాలులేని వారవుతారు. అలా చేస్తే ఉన్నత విద్య, ఉన్నతాధికార పదవులు ప్రజా బాహుళ్యానికి అందుబాటులో లేకుండా చేయడమవుతుంది. పరస్పర సంబంధాలు, దేశ విదేశ వ్యవహారాలలో పాల్గొనడం అవసరమని భావించేవారు మరో భాషను నేర్చుకుంటారు. దుబాసీల ద్వారా పని గడుపుకోవచ్చు. అంతేగాని పరాయిభాషలో ఉన్నత విద్యనభ్యసించాలనడం అర్థవిహీనమయిన వాదన. ప్రపంచంలో మరెచ్చటా ఈ వాదన, ఈ ఆచరణలేదు.

నేడు వెనుకబడివున్న ప్రజలు – ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలలో వీరి సంఖ్య మరింత అధికంగావుంది. తమకు పని, జీవితభృతి కావాలని అసంతృప్తి వెల్లడిస్తూ పోరాడుతూ

వున్నవారు నేటి స్థితికి కారణభూతమయిన భూస్వామిక విధానానికి పెట్టుబడిదారీ పారిశ్రామిక విధానానికి, నేటి పరిపాలనా యంత్రాంగానికి వ్యతిరేకంగా అన్ని కులాలు, మతాలవారు, అన్ని ప్రాంతాలలోని వెనుకబడిన వారంతా కలసి పోరాడాలి. అభ్యుదయ కాముకులంతా, యువజనులంతా యిందుకు కృషిచేయాలి. ఐక్యం కానివ్వకుండా భూస్వామిక, బడా పెట్టుబడిదారీ శక్తులు వారిలో చీలికలను పెంపొందించడానికి తప్పుడు వాదనలు, నినాదాలు తెస్తున్నారు. ప్రజలను అణచివేయడానికి, తమ స్వంత సేనలను తయారుచేస్తున్నారు. ఒక ప్రాంతం వెనకబడి ఉండడానికి కారణం మరో ప్రాంతపు వాసులని, ఒక కులంవారు, ఒక భాషవారు వెనకబడి వుండటానికి కారణం మరో కులం వారని, మరో భాషవారని చెపుతూ అసలు కారకులను, దోపిడీదారులను కప్పిపెట్టుతూ పెడదోవల త్రొక్కిస్తున్నారు. అందుచే ఈ దోపిడీదారుల ఎత్తుగడలను విచ్ఛిన్నం చేయడానికే వున్న మేరకు వెనకబడిన కులాలకు, వెనుకబడిన ప్రాంతాలకు, వెనుకబడిన రాష్ట్రాలకు చదువు విషయంలో, ఉద్యోగాల విషయంలో, వ్యాపార – పారిశ్రామిక వ్యవసాయ వృద్ధిలో ప్రాధాన్యత నివ్వాలనీ, జనాభా నిష్పత్తిలో వారి స్థానాలను, హక్కులను కాపాడాలని అభ్యుదయ కాముకులు పట్టుబడుతున్నారు. దోపిడీ విధానాన్ని సమూలంగా నాశనం గావించితేనే ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించగలమని అందుకై ప్రజలను సమాయత్తం చేస్తున్నారు. ప్రజల ఈ సమస్యలను ఆయాభాషా రాష్ట్రాల – ఆయా జాతుల పరిమితుల్లో పరిష్కరించడానికి అభ్యుదయ కాముకులు ప్రయత్నిస్తారు. ఒకే భాష మాట్లాడే ప్రజలను సమీకరించడానికి, సంఘటితపర్చడానికి ప్రజాతంత్ర హక్కులను, స్వపరిపాలనాధికారాన్ని సాధించుకోడానికి, తమ సమస్యలన్నిటిని పరిష్కరిండంలో ఒకరికొకరు అర్ధమయ్యే ఒకే భాష సాధనంగా ఈ పని సాధ్యమవుతుంది. ఈ భాషా రాష్ట్రాలు ఎంత పెద్దవయితే అంత ఎక్కువగా సమస్యలను పరిష్కరించుకోడానికి, ఆర్థికాభివృద్ధితో ముందుకు పోవడానికి సాధ్యమవుతుంది. దోపిడీ వర్గాలు పెంపొందిస్తున్న కుల, మత, సంకుచిత ప్రాంతీయ తత్వాలను, ఒక భాషా జాతికి – మరో భాషా జాతికి వైషమ్యాలను పెంచే కార్యక్రమాలను అరికట్టడానికికూడ తోడ్పడుతుంది.

భాషా రాష్ట్రాలలో, ప్రజాతంత్ర స్వపరిపాలనాధికారాలకోసం పోరాడుతూ వివిధ భాషా రాష్ట్రాలు, రాష్ట్ర ప్రజలు భారతదేశ సమైక్యతను పటిష్టం గావించడానికి పెంపొందించడానికి కలసి కృషిచేయవలసివుంటుంది. భారతదేశమంతటా ప్రజాతంత్రం, ప్రజాభ్యుదయం, దోపిడీదారుల పెత్తనంలేని నూతన సమాజమేర్పడిన కొలదీ వసుధైక కుటుంబంకోసం మన పాత్రను మనం నిర్వహించగలుగుతాము. అంతర్జాతీయత, జాతీయత, భాషా రాష్ట్రాల (జాతులు) స్వపరిపాలన – ఇవి పరస్పర విరుద్ధమయిన పోకడలుకావు. అవినాభావ సంబంధం కలవి. అంతర్జాతీయ సౌభ్రాతృత్వం దేశీయ చట్రంలోనూ, దేశ ఐక్యతనూ, దేశీయతను భాషా రాష్ట్రాల చట్రంలోనూ అభివృద్ధిచేయగలం.

ఈ మహోన్నత ఆశయ సాధనకోసం, యువతరం తమతమ పరిసర ప్రాంతాలలోని పీడిత ప్రజలతో కలసి, వారి పోరాటాలను నడపడానికి ముందుకు రావాలి. అది వారి కర్తవ్యం. వారిభవిష్యత్తు, దేశ భవిష్యత్తు, మానవజాతి భవిష్యత్తు దానిపై ఆధారపడివుంది.

## యువజనులలో చైతన్యం

యువజనులను నేడు ఎదుర్కొంటున్న ప్రతి ముఖ్యవిషయాన్ని దైనందిన జీవితంలో ఎదుర్కొనే ప్రతి సమస్యను పరిష్కరించుకోవాలంటే రాజకీయాలలో యువజనులు చైతన్యయుతంగా పాల్గొనవలసి వుందనేది పై వివరణలను స్థూలంగా చూచినా స్పష్టమవుతుంది.

అయితే రాజకీయాలలో ప్రతి ఒక్కరు పాల్గొంటూనే ఉన్నారు. యువజనులు చైతన్యయుతంగా రాజకీయాలలో పాల్గొనవలసిన అవసరాన్ని గుర్తించినా రాజ్యాంగం ప్రసాదించిన పోరాట పద్ధతిలో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాట పద్ధతిని యువతరం యెందుకు అవలంభించలేకపోతున్నది? శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ అశాంతికరమైన పరిస్థితులను యెందుకు చేబడుతున్నారు? క్రమ శిక్షణారాహిత్యం, హింసా ప్రవృత్తి ఎందుకు? రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను ఎందుకు వినియోగించుకోవడంలేదు? అనే ప్రశ్నలు వస్తున్నాయి.

రాజ్యాంగ చట్టము నేడు దేశంలోనున్న పెట్టుబడిదారీ, భూస్వామిక దోపిడీ విధానాన్ని రక్షించడానికి ఏర్పరచుకున్న ఉక్కు చట్రం తప్ప మరేమీ కాదు. ప్రజా బాహుళ్యానికి జీవన్మరణ సమస్యలయిన ప్రతి ఒక్కరికీ పని హక్కు, జీవన భృతి హక్కు, సాంఘిక సంక్షేమ హక్కు ఉచితమైన ప్రాథమిక హక్కులుగా నిర్దేశించబడలేదు. ఇవి ఆశయాలని, ఆశలని ఒక ప్రత్యేక అధ్యాయంలో చేర్చారు. ఆస్థిహక్కు, వాణిజ్య పారిశ్రామిక స్వేచ్ఛాహక్కు ఆస్థిపరులకు గ్యారంటీ చేశారు.

వాక్సభా, పత్రికా, సంఘటనా స్వాతంత్ర్యాలను ప్రాథమిక పౌరసత్వ హక్కులుగా నిర్దేశించినా, వారంటు లేకుండా అరెస్టు, విచారణ లేకుండా నిర్బంధించడం, మరణదండన వేయడం నిషేధించినా వీనికి పెట్టిన మినహాయింపుల ద్వారా ఈ హక్కులను శూన్యం చేశారు. పీడిత వర్గాల మీద తీవ్ర పోలీసు నిర్బంధం, విచ్చలవిడి అరెస్టులు, విచారణ

లేకుండానే, నేరము ఆరోపించకుండానే చిత్రవధలు గత 25 సంవత్సరాలలో కోకొల్లలుగా జరిగాయి.

ఓటు హక్కు, ప్రజా ప్రతినిధులతో ఎన్నుకొన్న శాసనసభల ద్వారా పరిపాలన జరగాలన్న హక్కు ధనాధిపతుల ముందు, అధికార బృందం ముందు పాలకపార్టీ విశృంఖల వ్యవహారంతో గవర్నర్ల, ప్రెసిడెంటు పరిపాలనతో నామమాత్రం చేశారు. ఎన్నికల ఫలితాలు తమకు వ్యతిరేకమవుతాయనుకున్నప్పుడు ఎన్నికలను అవినీతి, దౌర్జన్య పద్ధతులతో ఓటు చీటీలను చించి పెట్టెలను నింపి తారుమారు చేస్తున్నారు. అధికారబృందం, మంత్రులు, చివరకు న్యాయాధీశులుకూడా అవినీతికి అలవాటుపడి దోపిడీ వర్గాలకు, చివరకు తమ వ్యక్తిగత లాభాలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక జీవితాన్ని కలుషితం చేస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో యువజనులు ఏ ప్రజాతంత్ర పద్ధతులు అవలంభించగలరు? నిరంతరం దోపిడీవర్గాల పాలక యంత్రాంగపు హింసా దౌర్జన్యానికి గురి అవుతున్న ప్రజలు, యువజనులు హింసాపద్ధతులు అవలంభిస్తున్నారని నేరమాపాదించడంవల్ల ప్రయోజనమేమిటి?

యువజనులలో వస్తున్న ఈ తిరుగుబాటు న్యాయమైనది, అవసరమయినది. కాని చాలా సందర్భాలలో పెడదారులుబట్టుతూ వుంటుంది. ఇది దురదృష్టకరం. దీనికి కారణాలను, కారకులనుచూస్తే ఈ పెడదారులు ప్రధానంగా కలిమి బలిమిగల వర్గం నుండి వచ్చిన వారిలోనే ప్రధానంగా ప్రస్ఫుటమవుతున్నది. సరియయిన నిర్దిష్ట ఆశయంలేక దానిని చేరడానికి తగిన కార్యక్రమము, పంథా లేక తిరుగుబాటే స్వర్గం, ఏదో ఒరగబెడుతుందనే అరాచక ఆలోచన, తాత్కాలిక భావోద్వేగం దీనికి దారితీయవచ్చు.

అందుచేతనే ప్రజా అభ్యుదయకాముకులందరూ యువజనుల ముందు పీడిత ప్రజల విముక్తిని, నూతన సమాజ నిర్మాణాన్ని, సోషలిస్టు సమాజ నిర్మాణాన్ని నిజమయిన ఆశయముగా, కర్తవ్యముగా పెట్టాలి. ప్రస్తుత పెట్టుబడిదారీ భూస్వామిక దోపిడీ సమాజాన్ని కూలద్రోసి నవసమాజం నిర్మించడానికి పట్టణ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, భూమిమీద కష్టించి పండించే రైతులు, మధ్య తరగతి రైతులు, మేధావులు ముందుకు రావలసివుంటుంది. చివరకు చిన్న, మధ్య పారిశ్రామికులను, వర్తక, వాణిజ్య వర్గాలను కూడా కలుపుకొని విశాల ప్రజా సంఘటన ద్వారానే దీనిని సాధించగలము. కొలదిమంది యువకులు ఎన్ని త్యాగాలు చేసినా, ప్రాణాలు బలిపెట్టినా అంతమాత్రానే దీన్ని విజయవంతం చేయలేము.

ఈ ప్రజా సమీకరణక ఓపికతో అనేక అష్టకష్టాలుపడుతూ, ఒడుదుడుకులకు



గురి అవుతూ పనిచేయాల్సి వుంటుంది. వేలకొలదికాదు లక్షల కొలది యువతీ యువకులు తమ జీవితాన్నంతా దీనికై వినియోగించడానికి ముందుకు రావాలి. ఈ దోపిడీ సమాజములో అవకాశమున్న మేరకు చదువులలో, ఆటలలో, వ్యాయామ క్రీడలలో పాల్గొని, తన దేహదారుఢ్యాన్ని పెంపొందించుకోడానికి, తన విజ్ఞానాన్ని పెంపొందించుకొని పదిమందిలో ప్రథమ శ్రేణిలో వచ్చి ప్రజలకు అన్ని సమస్యలను వివరించగల స్తోమతను సాధించుకోవాలి. ప్రతికూల సిద్ధాంతాలను చీల్చి చెండాడడంతోపాటు ప్రజలముందు సరియైన సిద్ధాంతాలకు ఆదర్శంగా నిలచి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలి. శత్రువు యెడల ద్వేషం, పీడిత ప్రజలపట్ల వినయ నమ్రతలు, గౌరవాభిమానాలూ వుండాలి. వారి నుండి నేర్చుకోడానికి ఎల్లప్పుడూ కృషి చేయాలి. తన జీవితము నిరాడంబరంగా గడుపుకుంటూ, తన ప్రవర్తన అన్ని విషయాలలో ఆదర్శప్రాయంగా, ప్రజాబాహుళ్యం బలపరచే రీతిగా వుండేలా చూచుకోవాలి. ఎట్టి త్యాగానికైనా తయారై వుండాలి. క్రమశిక్షణతో, ఉక్కుశిక్షణతో మెలగాలి, జీవితానికి ప్రజాశ్రేయస్సే గీటురాయిగా పెట్టుకొని జీవిత పర్యంతం కృషి చేయాల్సి వుంటుంది. అప్పుడే యువతరం విజయం సాధించగలుగుతుంది. అభ్యుదయాన్ని, సోషలిస్టు సమాజాన్ని సాధించగలుగుతుంది.

# విప్లవపథంలో విద్యార్థి ఉద్యమం

(1974 జనవరి 2 నుండి 6వ తేదీవరకూ కలకత్తాలో జరిగిన భారత విద్యార్థి ఫెడరేషన్ (యస్.యఫ్.ఐ.) ద్వితీయ మహాసభలో సుందరయ్యగారు చేసిన ప్రారంభోపన్యాసం భాగాలు)

మీ సంస్థ అయిన భారత విద్యార్థి ఫెడరేషన్ ద్వితీయ మహాసభను ప్రారంభించే అవకాశం నాకు లభించడం ఒక అదృష్టంగా భావించి నేను ఎంతగానో సంతోషిస్తున్నాను. మీ ప్రథమ మహాసభకు కూడా హాజరై మీ చర్చలను విన్నాను. ఆ విధంగా యువతరాన్ని, విద్యావంతులనూ, మన దేశంలోకల్లా సుసంఘటితమైన విద్యార్థులను - వారి సమస్యలను అర్థంచేసుకోవడానికి నాకు అవకాశం లభించింది. గత మూడు సంవత్సరాలుగా మీరు సాగించుతున్న కార్యక్రమాలను గురించిన నివేదికను మీ సంస్థ ఆర్గనైజర్లు నాకు అందించారు. అలాగే మీరు ఎదుర్కొంటున్న సమస్యలు - విద్యార్థులను ఎదుర్కొంటున్న సమస్యలేగాక, మొత్తం ప్రపంచాన్ని ముఖ్యంగా మన దేశాన్ని ఎదుర్కొంటున్న ప్రజాతంత్ర సమస్యలను గురించిన రిపోర్టును కూడా వారు నాకిచ్చారు. అంతేకాకుండా, ఈ మహాసభలో మీరు చర్చించనున్న ముసాయిదా తీర్మానాలను కూడా నాకు అందచేశారు. వీటన్నింటినీ దృష్టిలో వుంచుకొని ప్రపంచానికీ, మన దేశానికి సంబంధించిన ప్రజాతంత్ర ఉద్యమంపైనా - ముఖ్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) దృక్పథాన్ని గురించీ కొన్ని విషయాలను మీ ముందు వుంచదలచుకొన్నాను. మన దేశంలో విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించుకోవడానికి, మన భారత ప్రజలు నిర్వహించవలసిన మహత్తరమైన విప్లవకర్తవ్యాలలో తమవంతు పాత్రను చేబట్టేందుకు మన యువతరానికీ, విద్యావంతుల తరానికీ సహాయపడగలవనే ఆశాభావంతో నే నీ విషయాలను చెప్పుతున్నాను.

## ప్రజా సేవకై అంకితమై జీవితాంతం పోరాడిన మహాయోధులు

గత మూడేళ్ళలో తమ జీవితాల నర్పించిన విద్యార్థి కామ్రేడ్స్‌కు జోహార్లనర్పించుతూ ఇప్పుడే మీరు ఒక తీర్మానాన్ని ఆమోదించారు. అలాగే కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్‌కు, కామ్రేడ్ సతీష్ పక్రాషీకి మీరు విప్లవ జోహార్లనర్పించారు. వారుభయులూ మృతిచెందారు.



కామ్రేడ్ ముజఫర్ వయస్సు 85 సంవత్సరాలు. కాగా కామ్రేడ్ సతీష్ పక్రాషీకి 82 సంవత్సరాలు. 50-70 సంవత్సరాల పాటు అపారమైన త్యాగాలుచేసి, మనకు విప్లవ పంథాను చూపెట్టిన పాతతరం వెళ్ళిపోతున్నది. ఇంక యిప్పుడు ఆ విప్లవ పతాకాన్ని ఆ విప్లవ మహాయోధులు తీసుకొని వెళ్ళిన పద్ధతుల్లో ముందుకు తీసుకొని వెళ్ళవలసిన బాధ్యత మనపైన, యువతరంపైన వుంది. అయితే మీలాగా నేను యువతరానికి చెందినవాడిని కాదనుకోండి!

ఇంతకీ కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్, కామ్రేడ్ సతీష్ పక్రాషీ మనకు చూపెట్టినదేమిటి? కామ్రేడ్ ముజఫర్ తన చిన్న వయస్సులోనే జాతీయ రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. 1921-22లో ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక భాగంగా మన భారత ఉపఖండంలో మొదటగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఆరంభించాడు. ఆనాటినుండీ యాభై యేళ్ళకుపైగా కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన అగ్రశ్రేణిలో నిలబడి పనిచేశాడు. నూతన ప్రజాస్వామ్యం కోసం, జనతా ప్రజాతంత్రం కోసం, సోషలిజం కోసం విద్యావంతుల్లో కూడా ఆయన పనిచేశాడు. ఆరంభదినాల్లో ఆయన జీవితం ఎలా వుండేదో ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోండి. అలాగేమానవ జాతికి నూతన మార్గాన్ని అందజేసిన కామ్రేడ్ లెనిన్ నాయకత్వాన జరిగిన అక్టోబరు మహావిప్లవం సంగతి గుర్తుకు తెచ్చుకోండి. ఆ రోజుల నుండి మన భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ బీజాలు ఏర్పడినాయి. ఆనాటినుండి ముజఫర్ అహమ్మద్ ఆ ఉద్యమంలో అగ్రభాగంలోనే వున్నారు. కాన్పూర్, మీరట్ కమ్యూనిస్టు కుట్ర కేసుల సందర్భంలో ఆయనకు శిక్షపడి జైళ్ళలో వున్నారు. ఆయన జైలు జీవితం కూడా గుర్తుంచుకోవలసిన విషయమే. ఇదంతా జరిగిన తర్వాత కూడా 75 ఏండ్ల వయస్సువచ్చిన తరువాత కూడా 1962-1964ల్లో - స్వాతంత్ర్యంవచ్చిన తరువాత కూడా 75 సంవత్సరాల వయస్సులోవున్న కామ్రేడ్ ముజఫర్‌ను, కామ్రేడ్ సతీష్ పక్రాషీని జైలులో బంధించవలసిన అవసరం వుందని యీ కాంగ్రెసు బూర్జువా - భూస్వామ్య ప్రభుత్వం భావించినదంటే ఆ విషయాన్ని గురించి మీరు ఆలోచించండి. కామ్రేడ్ సతీష్ తన 14వ యేటనే 1900లో స్వదేశీ ఉద్యమ సందర్భంగా విప్లవోద్యమంలో చేరాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని నాశనం చేయాలనే తలంపుతో ఆయన విప్లవోద్యమం అని భావించిన టెర్రరిస్టు ఉద్యమంలో చేరాడు. 1911లో మొదటిసారిగా ఆయన అరెస్టు చేయబడ్డాడు. 32 సంవత్సరాలపాటు జైలు జీవితాన్నీ, 11 ఏండ్లపాటు ప్రభుత్వానికి పట్టుబడకుండా అజ్ఞాతవాసాన్ని గడిపారు. ఇక్కడ ప్రతినిధులుగా హాజరైన మీలో ఏ ఒక్కరి వయస్సుకంటే హెచ్చుకాలం ఆయన జైలులో గడిపారు. 70 సంవత్సరాలపాటు ఒక కామ్రేడ్ అనేక ఆశాభంగాలను ఎదుర్కొంటూ కూడా విప్లవ లక్ష్యం కోసం, వ్యక్తిగత విప్లవ కార్యకలాపాల కోసం నిలబడి పని చేశాడంటే ఆయన విప్లవదీక్ష ఎంత అకుంఠితమైనదో మీరు వూహించండి! ఆ విధంగా ఆయన తన స్వంత అనుభవం

ద్వారానే ఒక మార్క్సిస్టు నాయకుడుగా అభివృద్ధి కాగలిగాడు. ఇది ఏదో సులభమైన విషయంగా మనం భావించరాదు. ఒకసారి మీరు వ్యక్తిగత విప్లవోద్యమంలో చిన్న వయస్సులోనే చేరివుంటే ఆ తరువాత సరియైన శాస్త్రీయమైన విప్లవపంథాను కనుగొని, దానికే కట్టుబడి వుండటం అంతతేలికైన విషయమేమీకాదు.

ఈ కామ్రేడ్స్ చిట్టచివరివరకూ మార్క్సిజం – లెనినిజం సిద్ధాంతాలకోసం దృఢంగా నిలబడి పనిచేశారు. మార్క్సిజం–లెనినిజం సూత్రాలకు కట్టుబడి వాటిని మన పరిస్థితులకు వర్తింపజేయడానికి ప్రయత్నించుతూ దృఢంగా నిలబడగలగడం ఎంత కష్టతరమయిన విషయమో మన యువతరం అర్థం చేసుకోవలసి వుంటుంది. ఒక సంవత్సరం, రెండు సంవత్సరాలపాటు కాదు వారు నిలబడింది; 50–70 సంవత్సరాలపాటు – అంటే ఒక జీవిత కాలమంతా వారు తమ విశ్వాసాలకు బద్ధులై నిలబడగలిగారు!

ఈ విప్లవ లక్ష్యాల కోసం వారు ఎంతదృఢంగా నిలబడినారో కూడా నేను నేటి యువతరం దృష్టికి తీసుకొనిరాదలచాను. మేము, మా కంటే చాలా ముందు నుండి ముజఫర్ అహమ్మద్, సతీష్ పక్రాషీలు కమ్యూనిజం వైపుకు ఆకర్షించబడ్డారు. రష్యన్ విప్లవంతోనూ కామ్రేడ్స్ లెనిన్, స్టాలిన్, తదితరుల జీవితాదర్శాలతోనూ వారు ప్రభావితులయ్యారు. మన దేశంలో కూడా సోషలిజం నిర్మించాలని వారు వాంఛించారు. వారేకాదు; మా తరంలోని మేము కూడా రష్యన్, చైనా విప్లవాల వలన ప్రభావితులయ్యాం. చైనా మనకు చాలా దగ్గరగా వుంది. భౌగోళికంగా సమీపంలో వుండటమేగాక అదొక ఆసియా దేశంకూడా. అయితే మామూలుగానైతే కమ్యూనిస్టులెవరికీ ఆసియాదేశాలనీ, యూరోపియన్ దేశాలనీ వివక్షతవుండదు. కాని అణచబడివున్న ఆసియా ప్రజలంతా ఆసియాకు చెందిన ఒక దేశ ప్రజలు తమ విప్లవోద్యమంలో జయప్రదమై సోషలిజాన్ని నెలకొల్పుకున్నారంటే మరింతగా ఆనందపడతారు. పాతిక సంవత్సరాలుగా కామ్రేడ్ మావో నాయకత్వాన చైనా విప్లవం ఏ విధంగా అభివృద్ధి చెందినదో మేము చూశాం. అనేక అంతర్యుద్ధాలు సాగించి, చివరికి 80 కోట్ల ప్రజలుగల దేశంలో వారు విజయాన్ని సాధించుకోగలిగారు. మానవజాతి విముక్తిగాగల సమయం ఆసన్నమైనదని కామ్రేడ్ లెనిన్ చెప్పిన విషయం ఆచరణలో నిజం కావటం చూస్తున్నాం. ఎందువల్లనంటే రష్యన్ ప్రజలు, చైనా ప్రజలు, భారతీయ ప్రజలు కలిస్తే మొత్తం ప్రపంచాన్ని మార్చివేయవచ్చు.

నిజమే. మన దేశంలో ఇంకా మనం విప్లవాన్ని సాధించుకోలేపోయిన మాట వాస్తవమే. కాని సోవియట్, చైనా ప్రజలు తమ విప్లవాలను సాధించుకోగలిగారు. ఆ మహోజ్వల రోజుల్లో కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్, కామ్రేడ్ సతీష్ పక్రాషీ ఇంకా అనేకమంది రష్యా, చైనా విప్లవాల మహోజ్వల విజయాల ప్రాతిపదికననుసరించి – తమ జీవితాలను, తమ మొత్తం విప్లవ కార్యకలాపాలను తీర్చిదిద్దుకున్నారు. అయితే వారు వృద్ధాప్యంలో వుండగా కామ్రేడ్ లెనిన్ నాయకత్వాన, ఆ తర్వాత కామ్రేడ్ స్టాలిన్ సారథ్యంలో నిర్మించబడి, మహోన్నతంగా పురోగమించిన సోవియట్ కమ్యూనిస్టుపార్టీ మార్క్సిజం – లెనినిజం సూత్రాల నుండి వైదొలగి, పెడమార్గానపడి, మన పార్టీపై దాడిచేస్తూవుంటే, సహజంగానే వారికి



ఎంతగానో బాధకలిగి వుంటుంది. ఒకప్పుడు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించి నడిపిన సోవియట్ పార్టీతో తెగతెంపులు చేసుకొని స్వతంత్ర వైఖరిని తెసుకోగలగడం వారికి ఎంతకష్టమైన విషయమో కూడా మీరు వూహించుకోవచ్చు.

ఆ తరువాత మరల చైనా కమ్యూనిస్టుపార్టీ కూడా మార్క్సిజం – లెనినిజం నుండి పెడత్రోవపట్టి, అతివాద అవకాశవాద వైఖరిని చేబట్టి, మన పార్టీపై దాడిచేయడం ప్రారంభించగానే కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్, కామ్రేడ్ సతీష్ పక్రాషీ గార్లు దృఢంగా నిలబడి చైనా పార్టీ విధానం సరియైనదికాదని చెప్పారు. మేము మార్క్సిజం – లెనినిజంనే అనుసరించి, దానిని మా దేశ పరిస్థితులకు వర్తింపచేసుకొంటామని స్పష్టపరచారు. వారు తమ జీవిత కాలంలోనే ఒక పెద్ద కమ్యూనిస్టుపార్టీనేగాక మరో పెద్ద కమ్యూనిస్టు పార్టీని కూడా కాదని సత్యం కోసం నిలబడవలసి వచ్చింది. మన కమ్యూనిస్టు ఉద్యమానికి చెందిన ఈ విప్లవ మహాయోధులు మార్క్సిజం – లెనినిజంకు విధేయులుగా నిలబడిన తీరు ఇదీ. మార్క్సిజం – లెనినిజంకు విధేయులుగా వుండటమంటే శ్రామికవర్గ ప్రజానీకానికి విధేయులుగా వుండటమే మన దేశ శ్రామిక జనావళిపట్ల భక్తివిశ్వాసాలతో నిలబడ్డారు. వారికే తమ జీవితాలను అంకితం చేశారు. మనదేశాన్ని సోషలిజం వైపుకు తీసుకొని వెళ్ళడానికి మార్క్సిజం–లెనినిజం ఒక్కటే మార్గమని వారు విశ్వసించారు. అందువల్లనే తమ జీవితాన్నంతటినీ ప్రభావితం చేసిన సోవియట్ పార్టీ నాయకత్వమూ, చైనా పార్టీ నాయకత్వమూ సరియైన విధానాల నుండి వేరుపడినప్పుడు తాము మాత్రం మార్క్సిజం – లెనినిజంకే దృఢంగా నిలబడి, మన దేశ, ప్రపంచ శ్రామికుల ఆశయాలకు విధేయులుగా వ్యవహరించగలిగారు. వారి యీ పటుతర దీక్షనే మనం అర్థం చేసుకోవాలి. దీనిని గురించే మన యువతరం ఆలోచించాలి. వారి మహోన్నతమైన దీక్షనే మనం అలవరచుకోవాలి. ఇది ఏ కొద్ది కాలంలోనో అలవడేదేమీకాదు. మన దేశ శ్రామిక ప్రజల ఆశయాలకు మనం అంకితమై, జీవితాంతం పోరాటం ద్వారానే వారి మహత్తర దీక్షను మనం కూడా అలవరచుకోగలుగుతాం. మన దేశ పరిస్థితులకు మార్క్సిజం – లెనినిజంను అన్వయించుకొని మన దేశంలో విప్లవాన్ని సాధించినప్పుడే మన అంతర్జాతీయ బాధ్యతను మనం నెరవేర్చగలం. ప్రపంచ విప్లవ విజయానికి మన వంతు బాధ్యతను నిర్వహించగలం. ఈ మహాయోధులు మనకు విడిచిపెట్టి వెళ్ళిన కర్తవ్యం ఇదే.

మనం ఏదైనా క్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవలసివచ్చినప్పుడు ఈ విప్లవం జయం పొందడానికి ఇంకా ఎంతకాలం పడుతుందని నిస్పృహ ఏర్పడినప్పుడు మనదీక్షా సంకల్పం సడలిపోవచ్చు; ఇదేమీ అసహజమైన విషయంకాదు. ఎందువల్లనంటే మనకు ఎప్పుడూ విజయాలే లభించవు. అపజయాలను కూడా ఎదుర్కోనవలసివస్తుంది. అలాంటప్పుడు నిరాశపడటం, హృదయ దౌర్బల్యానికి లోనుకావడం సంభవించవచ్చు. అలాంటి సమయాల్లో ఈ మహావీరుల జీవితాలను స్మరించుకుంటే అవి మనలను ఉత్తేజపరచగలవు. కామ్రేడ్

సతీష్ పక్రాషీ 70 యేళ్లపాటు పని చేయగలిగాడు. మాబోటి వాళ్ళం ఎంతకాలం నుండి పనిచేశాం? మహా అయితే 30-40 సంవత్సరాల నుండి పనిచేస్తున్నాం. కామ్రేడ్ సతీష్ పక్రాషీకి నిజమైన సహచరులమని రుజువు చేసుకోవాలంటే మరో 30 ఏండ్లు మేము పని చేయవలసి వుంటుంది. కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్‌కు చనిపోయే నాటికి 85 ఏండ్లు. మనం యిప్పటికి 65 సంవత్సరాలు కూడా పూర్తిచేయలేదు. అందువలన మనం నిస్పృహపడవలసిన అవసరమేమీలేదు.

కామ్రేడ్ చీమా, కామ్రేడ్ సోహన్‌సింగ్ భాక్నా, కామ్రేడ్ భాగ్‌సింగ్ కెనడియన్‌లాంటి పంజాబు విప్లవయోధుల ఉదాహరణను తీసుకోండి. చీమా తన 102వ యేట మరణించాడు. భాగ్‌సింగ్ 100 ఏండ్లకు, సోహన్‌సింగ్ భాక్నా 97 ఏండ్లకు కాలంచేశారు. వారు 1910-11 సంవత్సరంలోనే విప్లవోద్యమంలో చేరారు. అంతకుముందు వారు అమెరికాలోనూ, ఇతరచోట్లా గదర్ ఉద్యమాన్ని నిర్మించారు. కామ్రేడ్ సతీష్ పక్రాషీలాగానే వారు కూడా మొదట దేశభక్తి ఉద్యమమైన స్వదేశీ ఉద్యమంలో చేరి బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని కూలదోయాలనుకొన్నారు. సాయుధ పోరాటాన్ని నమ్మి వారు ఆయుధాలతో పోరాడారు. అది విఫలమైంది. అంతటితో వారు నిస్పృహచెందలేదు. ఆనాటినుండీ వారు భారతీయ ప్రజానీకాన్ని - శ్రామికులను ఉత్తేజపరచి, వారందరినీ పోరాటంలోకి తీసుకొనిరానిదే విప్లవం జయప్రదం కాజాలదనే అభిప్రాయానికి వచ్చారు. ఇంక దానితో వారు శ్రామిక ప్రజానీకంలో పనిచేయడం ప్రారంభించారు. 102 సంవత్సరాల వయస్సు వచ్చినా వారు పనిచేస్తూనే వున్నారు. భారత విప్లవానికి తమ జీవితాలను అంకితం చేశారు. అందువలన మనకు ఎప్పుడయినా నిరాశా నిస్పృహలు ఏర్పడినప్పుడు ఒక్కొక్కరూ యాభై డెబ్బై యేళ్ళపాటు తమ జీవితాలను భారత విప్లవం కోసం అంకితంచేసి తదేక దీక్షతో కృషిచేసిన ఈ మహాయోధులను జ్ఞాపకం తెచ్చుకొని తిరిగి ఉత్తేజాన్ని పొందడానికి మనం ప్రయత్నించాలి. వారు మనకు విడిచిపెట్టివెళ్ళిన మహత్తరమయిన వారసత్వం ఇది. నేటి యువతరం వారి నుండి నేర్చుకొని వారి జీవితాలను అనుసరించడానికి ప్రయత్నించాలి. నిజమే, మేము మీ అంత చిన్న వారమేమీకాదు. కాని ఆ మహాయోధులకంటే మేము చిన్నవారమే. ఈ విప్లవ మహావీరులు నిర్వహించిన పాత్రను గురించీ, వారుచేసిన మహత్తర త్యాగాలను గురించీ, అనుభవాలను గురించీ మీకు యిప్పటివరకూ అందజేయలేకపోయాం. ఈ విప్లవ యోధుల జీవిత చరిత్రలను క్లుప్తంగానయినా ప్రచురించి మీకు అందజేయడానికి మేము ప్రయత్నించుతాం. ఆ విధంగా నేటి యువతరానికి విప్లవ విజ్ఞానాన్ని అందజేస్తాం. ఇందువలన నేటి తరమేగాక, భవిష్యత్తు తరాల వారు కూడా అతి కష్టమైనదే అయినప్పటికీ, ఆనందదాయకమైన, ఉజ్వలమైన, విప్లవకరమైన ఆ మార్క్సిస్టు - లెనినిస్టు పంథాను, అకుంఠిత విశ్వాసంతో చేపట్టేందుకు ఉత్తేజం పొందగలుగుతారు.



వియత్నాం ప్రజల పోరాటాన్ని గురించి మన ప్రజల్లో ప్రచారం చేయడానికి భారత విద్యార్థి ఫెడరేషన్ ఎంతగానో కృషిచేసింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో మీరు సభలు జరపడమేగాక, నిధులను కూడా వసూలు చేశారు. రక్తాన్ని కూడా విరాళంగా యిచ్చారు. అసలు వారి వునికేలేకుండా అంతంచేయడానికి రాక్షసబాంబింగులతో ప్రయత్నించిన అమెరికా సామ్రాజ్యవాదులపై మూడు దశాబ్దాలకు పైగా పోరాడి వియత్నాం వీరులు దిగ్విజయం పొందారు. ఆ వివరాలన్నింటిలోకి నేను పోదలచలేదు. లాసర్ బాంబులు, ఏరియల్ బాంబులు, విషవాయువులు, పంటలను సర్వనాశనంచేసే విషబాంబులు వగైరాలన్నీ వియత్నాంలో ఉపయోగించబడ్డాయి. వియత్నాం ప్రజలు సొరంగాలు త్రవ్వుకొని అందులో జీవించవలసివచ్చింది. అయినా వారిని నాశనం చేయడానికి అమెరికన్‌లు ఆ సొరంగాల్లోకి కూడా విషవాయువులను, సంహారక రసాయనిక పదార్థాలను పంపించారు. ఇన్ని జరిగినా చివరికి అమెరికా సామ్రాజ్యవాదులు తమ దేశాన్నుండి వైదొలగేటట్లు వియత్నాం ప్రజలు చేయగలిగారు. అయినప్పటికీ సామ్రాజ్యవాదులు తమ తైనాతీల ద్వారా నేటికీ తమ దుర్మార్గాలను సాగించుతూనే వున్నారు.

## సోషలిజం ఒక్కటే మార్గం

1962-63 సంవత్సరంలో జరిగిన ఒక సంఘటనను గురించి మీకు తెలుపుతాను. నేనప్పుడు జైలులో వున్నాను. చైనాతో ఇండియా యుద్ధం చేయడం ద్వారాగాక లేదా చైనా 150 మైళ్ళ వరకూ మనదేశంలోకి చొచ్చుకొని (ఆ తరువాత వెనక్కి వెళ్ళిపోయారనుకోండి) రావడంద్వారాగాక స్నేహపూరితమైన సంప్రదింపుల ద్వారా భారత-చైనా సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోవాలని కోరినందులకే మమ్ములను ఆనాడు జైళ్ళలో బంధించారు. ఆనాడు పరిపాలనా వాస్తవికతను ప్రాతిపదికను ఆధారం చేసుకొని సరిహద్దు సమస్య పరిష్కారం కావాలని ఆనాటి ఐక్య కమ్యూనిస్టు ఉద్యమం సూచించింది. లడక్ చైనా పరిపాలన కింద వుంది. మక్ మహన్ రేఖ భారత పరిపాలనా ప్రాంతంలో వుంది. ఈ వాస్తవాన్ని అంగీకరించడంద్వారా ఉభయులు సంప్రదింపులు జరుపుకొని వివాదాన్ని పరిష్కరించుకోవడం సముచితమని తెలిపాము. అందుకు భారత ప్రభుత్వం సిద్ధపడలేదు. కాని చైనా అందుకు తన సంసిద్ధతను చూపింది. చౌ-ఎన్-లై భారతదేశానికి వచ్చి అందుకు అంగీకారం తెలిపారు. కాని దాన్ని ఆనాడు గోవిందవల్లభ్‌పంత్, కేంద్ర మంత్రి వర్గమూ నిరాకరించింది. దాన్నలా వుంచండి. ఇక్కడ ప్రధానమయిన అంశమేమంటే భారత - చైనా సరిహద్దు వివాదం స్నేహపూర్వకమైన సంప్రదింపుల ద్వారా మాత్రమే పరిష్కారం కావాలి. మేము మార్క్సిజం - లెనినిజంకు కట్టుబడి వున్నాం గాబట్టి మన శ్రామిక ప్రజల ప్రయోజనాలకోసం, మొత్తం మనదేశ ప్రజల ప్రయోజనాలకోసం మేము దృఢంగా నిలబడ్డాం గాబట్టి కాంగ్రెసు ప్రభుత్వంమమ్ములను జైళ్ళలో బంధించింది. ఒక్కొక్కరినేకాదు, ఇంతకుముందే మీకు చెప్పినట్లు కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్, కామ్రేడ్ సతీష్ పక్రాషీ తదితరులను కూడా అరెస్టు చేశారు. మార్క్సిజం - లెనినిజంకు విధేయులుగావున్న వారందరినీ జైలులో పెట్టారు.

## మన దేశంలో పరిస్థితి

ఇంక ఇప్పుడు మన దేశ పరిస్థితిని గురించి చెప్పుకొందాం. కొన్ని ముఖ్యమైన అంశాలను మాత్రమే ప్రస్తావించడానికి నేను ప్రయత్నించుతాను.

మీ కార్యవర్గం మీ ముందు ప్రవేశపెట్టిన తీర్మానంలో సాధ్యమైనంత సులభ శైలిలో జరిగిన కొన్ని ఘటనలను గురించీ, అవి ఎలా జరిగాయి, అలా ఎందుకు జరిగాయి అన్న విషయాన్ని గురించి తెలపడానికి ప్రయత్నించారు. ప్రాధమికంగా మనం దృష్టిలో వుంచుకోవలసిన విషయమేమంటే, మనం రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించుకొన్నప్పుడే, విదేశీ సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించడంతోపాటు దురదృష్టవశాత్తూ భూస్వాముల, పెట్టుబడిదారుల పరిపాలనను కూడా నిర్మూలించుకోలేకపోయాం. జాతీయ ఉద్యమం అభివృద్ధి అయిన సందర్భంలో కార్మికవర్గమూ, దాని మిత్రవర్గాలైన శ్రామిక ప్రజానీకమూ, రైతాంగమూ, పట్టణ, పేద ప్రజలు ఆ ఉద్యమంలో ముందుభాగాన లేరు. పట్టణం, పల్లె ప్రాంతాల్లోని బూర్జువా వర్గమూ, ముఖ్యంగా బడాబూర్జువావర్గమూ యీ ఉద్యమానికి నాయకత్వం వహించారు. జనావళి వెల్లువనూ, ప్రపంచ సోషలిస్టు శిబిరంవున్న పరిస్థితినీ, సామ్రాజ్యవాద బలహీనతనూ ఆధారంగా చేసుకొని వారు బేరమాడి అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకోగలిగారు. ఆవిధంగా సాధించబడిన యీ రాజకీయ స్వాతంత్ర్యాన్ని వారు తమ పరిపాలనను బలపరచుకొనేందుకూ, పెట్టుబడిదారీ విధానాన్నీ, భూస్వామ్య విధానాన్ని బలపరచుకొనేందుకు వినియోగించుకుంటున్నారు. భూస్వాములతో ఏకమై, విదేశ సామ్రాజ్యవాదులతో మిలాఖత్ అయి మనదేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించడానికి ప్రయత్నించుతున్నారు. మన దేశ ఆంతరంగికపరిస్థితిలో వున్న మూలమైన విషయమిది.

## కమ్యూనిస్టు ఉద్యమ పాత్ర

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి యిప్పటికి 27 ఏండ్లు గడిచాయి. బ్రిటిష్‌వారిని మన దేశాన్నుండి తరిమివేసిన తరువాత యీక్రింది కర్తవ్యాలను నెరవేరుస్తామని మన జాతీయ ఉద్యమం తరపున వాగ్దానం చేశారు.

అందరికీ ఉపాధులను, ఉద్యోగాలనుకల్పించే ప్రభుత్వాన్ని నెలకొల్పుతాం, మన దేశాన్ని పారిశ్రామికవంతం చేస్తాం, దున్నేవాడికే భూమినిస్తాం – ఆనాడు చేసిన వాగ్దానాలు యివీ.

ఈ సందర్భంగా నాకు ఒక విషయం జ్ఞప్తికివస్తుంది. 1930లో కమ్యూనిస్టుగా నేను కాంగ్రెసులో చేరినప్పుడు ఆంధ్రలోని హరిజనులు కాంగ్రెసులో లేరు. దానికి వారు వ్యతిరేకంగా వున్నారు. ఒక ప్రఖ్యాత కవి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక శక్తివంతమైన పాట రాశాడు. "మాకొద్దీ తెల్ల దొరతనం" అని. అప్పుడు హరిజనులు ఇలా పాడారు : "ఈ నల్ల దొరలు మాకు అవసరంలేదు" పైకులాలవారూ; భూస్వాములూ తమపై నిత్యమూ జరిపే అత్యాచారాలను గురించి ఆ పాట ఎంతో శక్తివంతంగా వర్ణించింది. మాకు తెల్ల దొరలూ వద్దు, నల్ల దొరలు వద్దు, నల్ల దొరలపాలన అంటే నేడున్న పరిస్థితులే. అలాగే మనదేశంలోని వివిధ ప్రాంతాల్లోని పీడితులూ, శ్రామికులూ కూడా జాతీయ ఉద్యమంతో మమేకంకాలేకపోయారు. స్వాతంత్ర్య పోరాటం తమదేననీ, ఈ దేశాన్నుండి బ్రిటిషువారు వైదొలగనిదే తమకు సాంఘిక విముక్తి సాధ్యంకాదని శ్రామిక ప్రజలకు నచ్చజెప్పడంలో కమ్యూనిస్టు ఉద్యమం చాలా పెద్ద పాత్రను నిర్వహించింది.



గాంధీజీ నిర్వహించిన గొప్పపాత్ర ఏమిటంటే, ఆయన జాతీయ ఉద్యమాన్ని కాన్ఫరెన్సు హాలులనుండి – అంటే కొద్దిమంది పైవర్గాల వారినుండి ప్రజాసామాన్యం వద్దకు తీసుకొనివెళ్ళారు. అయితే ఆయన యీపని తనధోరణిలోనే చేశారనుకోండి. కాని సోషలిజం కోసంగాని, సాంఘిక విముక్తి కోసంగాని ఆయన కార్యక్రమం ఉద్దేశించలేదు. కమ్యూనిస్టులు జాతీయ విముక్తి ఉద్యమానికి ద్రోహం చేశారని ఈనాడు కాంగ్రెసు నాయకులు చెపుతారు. జాతీయ విముక్తి ఉద్యమానికి కమ్యూనిస్టులుచేసిన మహత్తరమైన సేవ జాతీయ ఉద్యమంలోకి శ్రామిక ప్రజలను తీసుకొని రావడమే. వారంతా జాతీయ ఉద్యమంలో పాల్గొనడం వల్లనే సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం జయప్రదమైంది. అందువల్లనే జాతీయ ఉద్యమం కేవలం బూర్జువా వర్గంయొక్క లేదా కాంగ్రెసువారి స్వంత ఆస్తిగా వుండిపోలేదు. మన రైతులు, కార్మికులూ జాతీయ ఉద్యమంలో చేరి స్వాతంత్ర్యం కోసం పోరాడారు. అయితే అప్పుడు మనం స్వల్ప శక్తిగానే వుండటంవలన, ఉద్యమానికి నాయకత్వం వహించలేకపోయాం. అదివేరే విషయమనుకోండి. అయితే అంతమాత్రాన జాతీయ ఉద్యమంలోకి కార్మిక, కర్షకులను తీసుకొని రావడంలో కమ్యూనిస్టు ఉద్యమం నిర్వహించిన కృషిని మాత్రం మనం తక్కువ అంచనా వేయరాదు.

నేటి దేశ పరిస్థితి ఏమిటి? మొట్టమొదటగా కొట్టవచ్చేటట్లు కనిపించే విషయమేమంటే : నిత్య జీవితావసరానికి సంబంధించిన ప్రతి ఒక్కవస్తువు ధర విపరీతంగా పెరిగిపోవడం. తిండిగింజలు, ఉదాహరణకు బియ్యం కిలో రూపాయిన్నరకు ప్రభుత్వం అమ్ముతోంది. కలకత్తా, లేదా కేరళలో వెయ్యి గ్రాములు బియ్యమూ, మరో వెయ్యి గ్రాములు గోధుమలూ ఇస్తున్నారు. అంటే రోజుకు తలకొకరికి ఎంత? దాదాపు 300 గ్రాములు. ఈ విధంగా కలకత్తాలోను, కేరళలోనూ మన ప్రజలను ఈ మాత్రం తిండిగింజలతో జీవించి పనిచేయమంటుంది మన ప్రభుత్వం. మనిషి జీవించడానికి కాలరీన్ రూపంలో కనీసం 500 గ్రాములైనా వుండాలని ప్రభుత్వమే చెప్తుతున్నదిగదా! 250–300 గ్రాములు మాత్రంయిచ్చి, తతిమ్మా వాటికోసం బ్లాక్ మార్కెట్టు కెళ్ళి కిలో మూడు రూపాయలు చొప్పున కొనుక్కోమంటున్నారు. ఇదీ ప్రభుత్వం చేస్తున్నపని. ఈ విధంగా కాంగ్రెసు ప్రభుత్వం భిక్షం పెడుతున్నట్లుగా వుంది. లేదా కేరళ కామ్రేడ్స్ అన్నట్లు కోళ్ళకు వేసినట్లు వేస్తున్నది. ప్రభుత్వం యిచ్చే బియ్యం ఒకకోడి పెట్టను పెంచడానికి కూడా సరిపోదు.

ఇంక నూనెలు సంగతి చూడండి, ముఖ్యంగా వంట నూనెలు. కిలో ఆరేడు రూపాయలకు అమ్ముతానంటున్నది. కాని మార్కెట్టులో పదిపదిహేను రూపాయలకు తక్కువ రావడంలేదు. పంచదార రేటును ప్రభుత్వం రెండు రూపాయలుగా నిర్ణయించింది. కాని మార్కెట్టులో నాలుగున్నర - అయిదు రూపాయలకు గాని దొరకదు. ఇదంతా ఎందుకు జరుగుతున్నట్లు? ప్రభుత్వం బ్లాక్ మార్కెటీర్లకూ, మిల్లు యజమానులకూ, భూస్వాములకూ పూర్తి స్వేచ్ఛనిచ్చింది. వాళ్ళు వేలాదికోట్ల రూపాయలను ఆర్జించుకోవడానికి సంపూర్ణమైన స్వేచ్ఛవుంది. అందువల్లనే ఇప్పుడు అదనంగా మరో వెయ్యికోట్ల రూపాయలమేరకు భూస్వాములకు లభించే పంచదార, కిరోసిన్-ఇలాంటి అత్యవసర వస్తువులను ప్రభుత్వం మనకు అందించలేకపోతున్నది. ఇందులో ఏవీకూడా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మనకు లభ్యంకావు.

ఒక లక్ష గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ విద్యుచ్ఛక్తి వున్న మాట వాస్తవమే. కాని ఆ లక్ష గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ నివసించే ప్రజల్లో నూటికి 95 మంది యిండ్లకు విద్యుద్దీపాలు లేవు. విద్యుచ్ఛక్తి సంగతి అలా వుంచండి. ఆ గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ మామూలు కిరసనాయిలు బుడ్లుకూడా లేవు. ఎందువల్లనంటే కిరోసిన్ లీటర్ ఒక రూపాయి చొప్పున అమ్ముతున్నారు. కనుక ఆ పొగ దీపాలు కూడా లభ్యం కావడం లేదు. ఇదీ నేడున్న పరిస్థితి. మొట్టమొదటి విషయంగా మనం గమనించవలసిందేమంటే, నిత్యజీవితావసర వస్తువులేవీ సామన్య ప్రజలకు అందుబాటులోలేవు. ఎక్కడ చూసినా విపరీతమయిన బ్లాక్ మార్కెట్టు తాండవిస్తున్నది. అది బహిరంగ మార్కెట్టే కావచ్చు. కాని మన ప్రజలందరికీ సంబంధించి మాత్రం అది బ్లాక్ మార్కెట్టు.

మరీ కొట్టవచ్చేటట్లు కనిపించే రెండో విషయమేమంటే నిరుద్యోగ సమస్య. మన పట్టణ పల్లె ప్రాంతాల్లో పనిచేయగలిగిన 25 కోట్ల వయోజనుల్లోనూ ఇప్పుడు అయిదుకోట్ల మంది నిరుద్యోగులుగా వున్నారు! ప్రభుత్వ ఎంప్లాయిమెంటు ఎంక్చేంజిలలో ఉద్యోగాలకోసం తమ పేర్లను నమోదుచేసుకున్న వారి సంఖ్య కూడా 1971లో 51 లక్షలు, 1972లో 69 లక్షలు, 1973 అక్టోబరులో 82 లక్షలు ఈ రోజు జనవరి రెండో తేదీన 90 లక్షలూ, లేదా దాదాపు ఒక కోటి కావచ్చు. మన దేశంలో నిరుద్యోగ సమస్య విషయంలో చెప్పుకోదగ్గ మరో విశేషమేమంటే, ఉద్యోగాలకోసం తమ పేర్లను నమోదుచేసుకొన్న నిరుద్యోగులలో మెట్రిక్, గ్రాడ్యుయేట్ కోర్సులను పూర్తిచేసినవారు సగంమంది వుంటారు. ఈ నిరుద్యోగులందరికీ - కనీసం విద్యావంతులయిన నిరుద్యోగులకయినా ఉద్యోగాలు లభించగలవనే ఆశ ఏ మాత్రమయినా వుందా?

ప్రతిరోజూ మనం పత్రికల్లో చూస్తూనే వున్నాం. కొద్దివేల ఉద్యోగాల కోసం కొన్ని లక్షలమంది దరఖాస్తులను పెట్టడం. ప్రతి ఒక్క ఉద్యోగానికీ వందల, వేలు దరఖాస్తులు వచ్చిపడుతున్నాయి. మనదేశంలో నేటిపరిస్థితి ఇలావుంది! మన యువతరానికి అన్నింటికంటే



వినాశకరమైనదేమంటే శరవేగంతో పెరిగిపోతున్న నిరుద్యోగమే. కాంగ్రెసు ప్రభుత్వం - ఈ బూర్జువా - భూస్వామ్య ప్రభుత్వమే దీనంతటికీ కారణం. వారేమి చెపుతున్నప్పటికీ, కాంగ్రెసు పాలకులు తమ నేటి విధానాలనే కొనసాగించితే మాత్రం వారు ఈ సమస్యను ఏ మాత్రం పరిష్కరించలేరు.

## దున్నేవానికే భూమి

నిరుద్యోగాన్ని నిర్మూలించాలనే చిత్తశుద్ధి పాలకులకు నిజంగానే వుంటే అందుకు సులభమైన పరిష్కార మార్గమే వుంది. ఉదాహరణకు గ్రామీణ ప్రాంతాల్లో నాలుగుకోట్ల నిరుద్యోగులున్నారు. భూస్వాములవద్దనున్న భూములను స్వాధీనం చేసుకొని యేడాదికి సగటున 180 రోజులు కూడా పనిదొరకని వ్యవసాయ కార్మికులకూ, పేద రైతులకు ఇచ్చివేయండి. వారి కుటుంబాలకు బ్రతకడానికి అవసరమైన వేతనంలో సగమైన - అంటే అయిదు వందలనుండి ఆరువందలరూపాయల వరకూ కూడా రాదు. ఇద్దరు పెద్దలూ, ఇద్దరు పిల్లలూ గలిగిన కుటుంబానికి కనీసం వేతనం - అంటే జీవించడానికి అవసరమైన వేతనం నెలకు వందరూపాయలను కొంటే - నేను అవసరాల ప్రాతిపదికపై వేతనాన్ని గురించి మాట్లాడటంలేదు రోజుకు వయోజనుడికి ఒక రూపాయి చొప్పున వేతనాన్నిగురించి మాత్రమే ప్రస్తావించుతున్నాను - ఒక వ్యవసాయ కార్మిక కుటుంబం ఒక యేడాది అంతా కష్టపడితే 500 రూపాయలకంటే ఎక్కువ ఆదాయం రావడంలేదు. అందువలన ఒక విధంగా వారికి ఉపాధి కల్పించడమంటే వారికి భూమినివ్వడమే పరిష్కారమార్గం. అది వారికి పూర్తిగా పని యివ్వకపోవచ్చు. వారికి అవసరాల ప్రాతిపదికపై కనీస వేతనం కూడా లభించకపోవచ్చు. జీవించడానికి అవసరమైన వేతనం కూడా అది కాకపోవచ్చు. కాని ఆ భూమి వారికి ఆదాయాన్ని ఇచ్చే మార్గంగానైనా వుండగలదు. అది కూడా చేయకపోతే నిరుద్యోగ సమస్య పరిష్కారము కాదు. అది లేకుండా పట్టణాల్లోని ప్రజలకు తిండి కూడా వుండదు.

అయిదుశాతంగావున్న భూస్వాములు మొత్తం భూమిలో 40 శాతాన్ని కంట్రోలు చేస్తున్నారు. గ్రామాల్లో ఏమి జరుగుతున్నదో మనకు తెలుసు. భూసంస్కరణలనుతెచ్చే ఉద్దేశంలేకుండానే కాంగ్రెసువారుచేసే బూటకవాగ్దానాలవల్లనూ, సీలింగ్ చట్టాలు వస్తాయని అదేపనిగా వారు టముకువేసి చెప్పడంవల్లనూ - ప్రతి ఒక్కరూ తన భూమిని తనవారి మధ్యనే పంచివేస్తున్నప్పుడు, వంద ఎకరాల భూస్వామి ఇప్పుడు నలుగురుగా మారుతున్నారు - ఒక్కొక్కరికి 20, 30 ఎకరాలుండేలా. ఈ ప్రాతిపదికపైననే గ్రామీణ ప్రాంతాల్లోని 5 శాతం చేతుల్లో 40 శాతం భూమి వుంటున్నది. నిజానికి భూకేంద్రీకరణ ఇంకా ఎక్కువే. ఈ భూస్వాములు తమ భూములను కౌలుకైన ఇస్తారు, లేదా వ్యవసాయ కార్మికులతోనైనా సాగుచేయించుకొంటారు. తాము మాత్రం ఏమీ చేయరు భూమి మీద వారు పనేచేయరు. పరాన్న భుక్కులకు పదినుండి ఇరవై యకరాల భూమి వుండనివ్వడమా లేదా అన్న

సమస్యకాదిది. అసలు పరాన్నభుక్కుల చేతుల్లో ఏ మాత్రం భూమి వుండనీయరాదు. వారి భూములన్నింటినీ స్వాధీనం చేసుకొని వ్యవసాయ కార్మికులకూ, పేద రైతాంగానికి పంచి పెట్టవలసిందే.

ఇంక నేటి యువతరం ఒక ప్రశ్న అడుగుతుంది. ఒక యువకునితండ్రి గుమాస్తాగానో, ఫ్యాక్టరీ కార్మికుడుగానో లేదా ఒక లాయరుగానో వుండవచ్చు. అప్పుడా యువకుడు మా భూమినికూడా తీసుకొంటారా? అయితే నా గతేమికాను అని ప్రశ్నించుతాడు. ఇప్పటికే నాకడుపు కాలుతున్నదికదా అంటాడు. చిన్న చిన్న గుమాస్తాలు, ఫ్యాక్టరీ కార్మికులు, తక్కువ జీతాల ఉపాధ్యాయులు, చిన్న చిన్న పరిశ్రమదారులు, లేదా వ్యాపారస్తులు – ఈ కోవకు చెందిన వారినందరినీ కలుపుకొన్నా వీరిచేతుల్లో 10 శాతం భూమికంటే ఎక్కువవుండదు. అందువలన వీరి వద్దగల భూమిని స్వాధీనం చేసుకోనవసరంలేదు. ఆ భూమి అంటే వారికంత మమకారంవుంటే వారినే వుంచుకోనీయండి. స్వయంగా సాగుచేయకుండా పది యకరాలకు పైగా మంచి మాగాణి భూమి గల పెద్ద భూస్వాములను గురించే మనం పరిగణనలోకి తీసుకొంటాం. వారివద్దనున్న భూమినీ, సాగుకులాయకీగా వున్న పదికొట్ల యకరాల బంజరు భూమిని కలుపుకొంటే – దీనంతటినీ పంచగలిగితే మన గ్రామసీమల్లోని పేదలకు అవసరమైన భూమి, ఉపాధి లభించగలదు. ఆ విధంగానైనా వారికి కనీసభృతి ఏర్పడగలదు. మరి ఈ పనిని ప్రభుత్వం చేస్తుందా?

కాని ప్రభుత్వం హరిజనులకూ, వ్యవసాయ కార్మికులకు, షెడ్యూల్డు తరగతులవారికి, వెనుకబడిన కులాలకు చెందిన పేదలకూ భూమినివ్వడానికి నిరాకరించుతున్నది. ఈ తరగతులకు చెందిన పేద ప్రజలు భూమికోసం ప్రయత్నంచితే – తమకున్న కౌలుహక్కులను గురించి పట్టుబడితే, అప్పుడు యీ భూస్వాములు కాంగ్రెసు ప్రభుత్వం మద్దతుతో వారిమీద విరుచుకు పడతారు, చావబాదుతారు, వారి స్త్రీలను చెరుస్తారు, వారి ఇండ్లను కాల్చివేస్తారు, వారిని చిత్రహింసలు పెడతారు. ఇంత జరిగినా ప్రభుత్వం వారిపై ఎలాంటి చర్యా తీసుకోదు. ఇదీ నేడు జరుగుతున్నది!

శ్రీకాకుళంలో గిరిజనులు మేల్కొని తమ హక్కులకోసం పోరాడారంటే – నక్సలైట్ల నాయకత్వానే కానీయండి – వారి భూములను భూస్వాములు, కాంట్రాక్టర్లు, పచ్చి లంచగొండులయిన ప్రభుత్వాధికారులూ ఘోరాతి ఘోరంగా ఆక్రమించుకున్నందువల్లనే. విప్లవం ఎలా సాధ్యమవుతుంది? ఎలాంటి ఎత్తుగడలను చేబట్టాలి అనే విషయాలను గురించి వారు ఆలోచించరు. తమ కోపోద్రేకంలో, సహజంగా వచ్చిన ఆవేశంలో ఎవరైతే తమ ముందుకొచ్చి తాము ఈ ప్రభుత్వం మీద, భూస్వాములమీద పోరాడుతామంటారో వారినే అనుసరించుతారు పేదలు, అయినప్పటికీ ప్రభుత్వం భూమిని పంచదు.



## ఇంకా ఎక్కువ ఉపాధ్యాయులు, డాక్టర్లు కావాలి

ఇంకా విద్యావంతులైన నిరుద్యోగుల సంగతి తీసుకోండి. వారంతా స్వయం ఉపాధులను కల్పించుకోవడం కోసం ఏడాదికి 50 కోట్ల రూపాయలనో, మరో విధమైన తోడ్పాటునో యిస్తానని ప్రభుత్వం అంటున్నది. విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు లభింపచేయడానికి ఇదేనా మార్గం? మన ప్రభుత్వంవద్ద అత్యంత తమాషా అయిన పథకాలుంటాయి!

“బ్యాంకులు కొంతరుణం యిస్తాయి. ఆ సహాయంతో వుపాధిని మీరు కల్పంచుకోండి” అని అంటారు. ఈ స్వయం వుపాధి అంటే యిదీ : వుత్పత్తి సాధనాలను నా చేతికివ్వు. దాన్ని సాధించడానికి నేను ప్రయత్నించుతాను. కాని నీవు నాకు వుత్పత్తి సాధనాల నివ్వవు. మార్కెట్టుకు గ్యారంటీ యివ్వవు. నాకు దేన్నీ సప్లయిచేయవు. నేను కాని మరొకరుగాని భూమిలేకుండా, వుత్పత్తిసాధనాలు లేకుండా, రుణ సౌకర్యాలు లేకుండా, ముడివస్తువులు లేకుండా స్వయం వుపాధిని ఎలా కల్పించుకోగలం?

అందువలన నిరుద్యోగ సమస్య పరిష్కారానికి బహుసులభమైన మార్గాన్ని మేము సూచించుతున్నాం.

ఇప్పుడు 40 లక్షలమంది విద్యావంతులైన నిరుద్యోగులు వున్నారు. గత 30 సంవత్సరాలుగా 14 ఏండ్ల వయస్సుగల అబ్బాయిలకు, అమ్మాయిలకు పది సంవత్సరాల్లో ప్రాథమికవిద్యను గరుపుతామని మీరువాగ్దానంచేస్తూ వస్తున్నారు. 1960 గడిచిపోయింది. 1970 కూడా అయిపోయింది. ఇంక ఇప్పుడు అయిదవ పంచవర్ష ప్రణాళిక దానిని గురించి ఏమీ చెపుతుంది? 1980 కల్లా 6–11 మధ్య వయస్సుగల బాలబాలిక లందరికీ నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెడతామని. మరి 11 నుండి 14 వరకూ వయస్సుగల అబ్బాయిలు, అమ్మాయిల సంగతి ఏమిటి? అది 1985–86కు పూర్తి అవుతుందట! కాని వారు యీనాడు చేస్తున్న పనిని పరిశీలించి నిజమాలోచించితే 6–11 ఏండ్ల వయస్సుగల పిల్లలకు కూడా ప్రాథమిక నిర్బంధ విద్యను ప్రవేశపెట్టే కార్యక్రమాన్ని 1984 నాటికికూడా పూర్తి చేయలేరు. ఎందువల్లనంటే ; ముసాయిదా ప్రణాళిక స్పష్టంగా చెపుతున్న దానినిబట్టే 80 శాతం అమ్మాయిలను మాత్రం 6–11 మధ్య వయస్సు గలవారిని ప్రాథమిక తరగతుల్లోకి 1980 నాటికి జేర్చుకోగలరు. ఇంక మిగిలిన 20 శాతం అమ్మాయిల సంగతి ఏమవుతుంది? 20 శాతం అమ్మాయిలను సహితం అయిదేండ్ల స్కూళ్ళలో జేర్చుకోలేకపోతే, 1980 కల్లా 6–11 మధ్యవయస్సు గల వారందరికీ విద్య నెలా అందించగలుగుతారు?

**ఇంక రెండో విషయం :** కనీసం అయిదేండ్లపాటు చదువైన లేకపోతే వారిని అక్షరాస్యులుగా పరిగణించడానికి వీలులేదు. కాని "గొప్ప అభ్యుదయకాముకుడని" కొనియాడబడే మన కేంద్ర విద్యామంత్రి నూరుల్ హుస్సేన్ చెప్పిన దానిని బట్టి ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులలో అయిదవ తరగతికి చేరుకోనేసరికి అందులో 60 శాతం విద్యార్థులు తగ్గిపోతారు. ఇది వారి దారిద్రం వల్లనే. వారి తల్లిదండ్రులకు తమ బిడ్డలకు విద్య చెప్పించే స్తోమత లేకపోయినందునేనని ఆయన చెపుతారు. ఒకటవ తరగతిలో వందమందిని జేర్చుకుంటారు. అయిదవ తరగతి చేరుకున్నప్పటికి మాత్రమే వారు అక్షరాస్యులు కాజాలరు. కాని అప్పటికి 60 శాతం జారిపోతున్నారు. వారికి అయిదేండ్లు విద్య గరిపే బాధ్యత మీది కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించుచున్నాను.

తిరువనంతపురంలో విద్యార్థి ఫెడరేషన్ మహాసభ జరిగినప్పుడు ప్రతి ఒక్క ప్రాథమిక పాఠశాల కనీసం ఏడేండ్ల కోర్సును కలిగివుండాలనీ, అయిదేండ్ల వయస్సుగల బిడ్డలను జేర్చుకోవాలని కోరుతూ మీరు తీర్మానం చేశారు. పోనీ పశ్చిమ దేశాల పద్ధతిని మనదేశంవరకూ వదిలిపెట్టండి. మనదేశ సాంప్రదాయాన్ని బట్టే అయిదేండ్ల వయస్సుగల పిల్లలను జేర్చుకొని వారికి ఏడేండ్ల స్కూలు కోర్సును పూర్తి చేయండి సోషలిజం వస్తే, అప్పుడు మన వనరులు యింకా ఎక్కువ వుంటాయి. గాబట్టి మూడేళ్ళ వయస్సుగల బాలబాలికలకు కిండర్ గార్డెన్‌లనూ, నర్సరీలను ప్రారంభించవచ్చు. కాని ఇప్పుడు అయిదేండ్ల వయస్సుతో విద్యను ప్రారంభించి, ఏడేండ్ల స్కూలింగును పూర్తిచేయవచ్చు.

ప్రతి ఒక్క వెయ్యిమంది జనాభాకూ ఏడుతరగతులుగల ఒక స్కూలును నెలకొల్పండి. ఒక్కొక్క స్కూలుకు 10 మంది ఉపాధ్యాయులను నియమించండి. అప్పుడు 1979 నాటికి మనకు 60 లక్షలమంది ప్రాథమిక ఉపాధ్యాయులు కావలసి వస్తారు. కాని యిప్పుడు మనకు 13 లక్షలకంటే ఎక్కువ టీచర్లులేరు. కనుక మీరు వెంటనే 44 లక్షలమందిని ఉద్యోగాల్లోకి తీసుకోవచ్చు. మనకు నేడున్న విద్యావంతులయిన నిరుద్యోగులు 40 లక్షల మందే. ఈవిధంగా విద్యావంతులయిన నిరుద్యోగులందరికీ ఉద్యోగాలివ్వవచ్చు. మెట్రిక్యులేషన్ పాసైన ప్రతిఒక్కరూ తన మాతృభాషలో చిన్న పిల్లలకు విద్య గరపలేడా? కాని మన ప్రభుత్వం యీ పని చేయడానికి సిద్ధంగాలేదు.

అలాగే వైద్యుల సంగతిని చూడండి. మనకు చాలామంది సామాన్యమైన డాక్టర్లు అవసరం వుంది. ఆరుమాసాలపాటు, ఒక యేడాదిపాటూ శిక్షణను యిచ్చి చైనా డాక్టర్లను తయారుచేసి తమ గ్రామసీమల్లో వైద్యం చేయడానికి వారిని పంపిస్తున్నది. అలాంటివారు మనకు లక్షలు కావలసి వున్నారు. కాని మన ప్రభుత్వం ఆ పని చేయదు.

మీరు భూమినిచ్చి, ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించి, ఎరువుల ఫ్యాక్టరీలను స్థాపించి, రవాణా సౌకర్యాలను కలుగజేస్తే, విద్యుత్ కేంద్రాలను నిర్మించితే అన్ని పనులు సాగుతాయి.



కాల్వలను త్రవ్వవచ్చు, వ్యవసాయ కార్మికులూ, రైతులూ, వారి కొడుకులూ అంతా పనిచేస్తారు. వారంతా చేసే పనితో వారు ఉపాధ్యాయులను, వైద్యులను తప్పకుండా పోషించుకోగలరు. కాని ప్రభుత్వం ఈ పని చేయడానికి సిద్ధంగా లేదు.

## భూమినిస్తే వారూ పనిచేస్తారు - చూడండి!

1953–54లో జరిగిన ఒక సంఘటనను గురించి జ్ఞప్తికి తెస్తాను. డాక్టర్ కె.ఎల్. రావు అప్పుడు మంత్రికాదు. ఇంజనీరు మాత్రమే. ఆయన చైనా వెళ్ళి వచ్చారు. కలుసుకొన్నప్పుడు ఆయన నన్నిలా అడిగారు : చైనాలో లక్షలాది ప్రజలు రాత్రింబవళ్ళు ప్రాజెక్టుల నిర్మాణానికి దీక్షగా పనిచేస్తున్నారు. కొద్ది వారాల్లోనే వారు రెండువందల మూడువందల కిలోమీటర్ల పొడవుగల పెద్ద కాలువను తవ్వారు. ఇది మహోజ్వలమయిన విషయం కాదా? చైనా ప్రజలు ఇంత ఉత్సాహంతో స్వచ్ఛందంగా పనిచేస్తున్నారు. మనదేశంలో ప్రాజెక్టుల కోసం వచ్చి పనిచేయమంటే కూలిని డిమాండ్ చేస్తారు. ఏమిటి విచిత్రం? ఆయనకు నేనిలా సమాధానమిచ్చాను : "అక్కడ వారికి భూమి యిచ్చారు. అది వారి స్వంత భూమి అయింది. తమ భూమిని సాగుచేసుకొనేందుకే ప్రాజెక్టుల నిర్మాణానికి ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ఇక్కడేమో మరొకరి భూమికోసం పనిచేయవలసిందిగా వారిని కోరుతున్నారు. వారెందుకొస్తారు?" మన వ్యవసాయ కార్మికులు ఎంతటి దుర్భరపరిస్థితుల్లో వున్నాదీ ఏమాత్రం పరిచయంవున్నావారికైనా తెలుస్తుంది. వారు తమ బిడ్డలకే తిండి పెట్టలేక వారిని అదేపనిగా తిడుతూవుంటారు. పనుల్లేని రోజుల్లో అయితే మరీకష్టం. పిల్లలు ఆడుకోవడానికి అటూ యిటూ పరుగెత్తుతారు. అప్పుడు పిల్లలతో తల్లిదండ్రులు ఏమంటారో తెలుసునా? "ఏమిటి మీరు చేస్తున్నది? మీకు మేము తిండి పెట్టలేము, ఇలాగే మీరు ఆటలాడుతూ పరుగులెత్తుతూవుంటే మీకు యింకా ఆకలై ఎక్కువతిండి అవసరమవుతుంది. మీకు మేము తిండి పెట్టలేము. మెదలకుండా ఇంటిలో పడుకోండి."

ఈ విధంగా తమ పిల్లల ఆకలిని తీర్చలేరుగాబట్టి తండ్రులు వారిని ఆడుకోవద్దంటారు. హుషారుగా గంతులెయ్యవద్దంటారు. మెదలకుండా పడుకుంటేవున్న శక్తినికాస్తా మరికొన్ని రోజులవరకూ వుపయోగించుకోవచ్చునేది వారి భావం. మన వ్యవసాయకార్మికులు జీవించుతున్న పరిస్థితులు ఈవిధంగావున్నాయి. అలాంటి నికృష్ట పరిస్థితుల్లోవున్న మన వ్యవసాయ కార్మికులు ఎందుకు పని చేయాలి? ఎవరికోసం పనిచేయాలి? ఈ విషయం అతి సామాన్యమైన విషయం. సులభంగా అర్థం చేసుకోగలిగిన విషయంకూడా. కాని మన 'గొప్ప పరిపాలకులు' మేధావులు, ఇంజనీర్లు దీనిని అర్థంచేసుకోలేరు. సోషలిస్టు చైనాలో, సోవియట్ యూనియన్‌లో ప్రజలు ఎందుకు అంత ఉత్సాహంతో పనిచేస్తారో, మరి మన భారతదేశంలో వారు ఎందుకు పనిచేయరో వారికి అర్థంకాదు.

ఇలాంటి వుదాహరణలను నేను ఎన్నింటినైనా ఇవ్వగలను. స్థలాలు యిచ్చి, మురికి గుడిసెలలో నివసించేవారిని ఇండ్లుకట్టుకోమనండి. ఈ స్థలాలు మీ స్వంతమేనని చెప్పండి. మీ గృహాల నిర్మాణానికి కావలసిన సాంకేతిక సలహాలను, ఆర్థికసాయాన్ని, తదితర పరికరాలను సరఫరా చేస్తామని చెప్పండి. కట్టుకున్న తరువాత ఈ ఇండ్లు మీ స్వంతమవుతాయని చెప్పండి. అప్పుడు ఎంత ఉత్సాహంగా గృహాలు నిర్మాణం కాగలవో చూడండి. చైనాలో ప్రజలు పనిచేసి తమ యిండ్లను తామే నిర్మించుకొంటారు. ఈ విధంగా మనం ఎన్ని పనులైనా చేయవచ్చు. కాని వున్న అవరోధమంతా ఏమిటి? భూమి యాజమాన్యం, వుత్పత్తి సాధనాల యాజమాన్యం, ఫ్యాక్టరీల యాజమాన్యం – ఇవన్నీ కొద్దిమంది స్వాధీనంలో వుండటమే.

ఇందిరాగాంధీ రాత్రి అనక పగలనక ఒకటే గొడవ – రేడియోల ద్వారానూ, పత్రికల ద్వారానూకూడా – 'మన మిప్పుడు చాలా క్లిష్టపరిస్థితిల్లో వున్నాం మన ప్రజలు నేడు అత్యంత విషమ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో సమ్మెలు చేయడం చాలా తప్పు. మీరు పనిచేసి ఎక్కువ ఉత్పత్తి చేయాలి.' అయితే ఆమె ఈ క్రింది విధంగా చెప్పడం మాత్రం నేనెప్పుడూ వినలేదు. మనదేశం నేడు చాలా కష్టపరిస్థితుల్లో వుంది. ప్రజలకు తిండి లభ్యం కావడంలేదు. అందువలన మన ప్రజలకు తిండి లభ్యమయ్యేంతవరకూ, మన సమస్యలు పరిష్కారమయ్యేంతవరకూ, ఏ ఒక్క భూస్వామికి విపరీతమైన ధరలు చెల్లించరాదు. బడా ఫ్యాక్టరీ యజమానులు లాభాలను తీసుకోవడానికి వీలులేదు. కాని ఆమె భూస్వాములకుగాని, పెట్టుబడిదారులకుగాని ఇలా చెప్పదు. "మీ లాభాలేకాదు, మీ సంపదను కూడా తీసుకొంటాం." అలాగే "మా దేశ పరిస్థితి బాగుపడేంతవరకూ విదేశ రుణాలపై ఎలాంటి వడ్డీని చెల్లించదలచలేదు." అని ఆమె చెప్పడానికి సిద్ధపడటం లేదు. కాని చాలీచాలని జీతం డబ్బులకోసం, కనీసపు బ్రతుకుకై కష్టపడి పనిచేసే కార్మికవర్గానికి మాత్రం సమ్మెలు చేయవలదు; ఉత్పత్తిని ఎక్కువ చేయండి అని ధర్మపన్నాలు పలుకుతుంది. పెట్టుబడిదారులకూ, భూస్వాములకూ ఆమె యిలా ఎందుకు చెప్పదు? మన దేశం పరిస్థితి బాగుపడేంతవరకూ కార్లు వాడవద్దు, పెద్ద పెద్ద భవంతులు కట్టుకోవద్దు, లాభాలు తీసుకోవద్దు – ఇలా ఆమె వారికి ఎందుకు చెప్పదు?

చూడండి! తాతాలు, బిర్లాలు, ఇతర బడా గుత్త పెట్టుబడిదారులు ఎలా విపరీతంగా సంపదను, ఆస్తులను పెంచుకుంటున్నారో చూడండి. వారి ఆస్తులు 1951లో 40–50 కోట్ల రూపాయలవరకూ వున్నాయి. ఇప్పుడు ఒక్కొక్కరి ఆస్తులే 750 కోట్ల వరకూ పెరిగాయి. భూమిమీద అసలు పనేచేయని భూస్వాములకు వారిచ్చే ధాన్యానికి టన్నుకు రెండు వందల రూపాయలు అదనంగా యిస్తామని ప్రభుత్వం చెపుతున్నది. గ్రామసీమల్లో నూటికి అయిదు మందిగా మాత్రమే వున్న ఈ భూస్వాములవద్ద అయిదుకోట్ల టన్నుల తిండిగింజలున్నాయి. ఈ విధంగా ప్రభుత్వం వారికి వెయ్యికోట్ల రూపాయలను సమర్పించుతోంది. కాని కష్టపడి పనిచేసే రైతుకు మాత్రం తాను ఉత్పత్తి చేసే ధాన్యానికి ధరను మాత్రం గ్యారంటీ చేయదు ఈ ప్రభుత్వం. ఇలాంటివి అనేకం జరుగుతున్నాయి. ఆ వివరాల్లోకి నేను వెళ్ళదలచలేదు.



## ఆర్థిక స్వావలంబన సమస్య

ఇప్పుడు మరో సమస్య వుంది. అదే ఆర్థిక స్వాలంబన సమస్య ఈ ప్రభుత్వం స్వతంత్రమైన ఆర్థిక స్వాలంబనను నిర్మించగలదా? భారతదేశానికి 8500 కోట్ల రూపాయల మేరకు విదేశీ రుణాలున్నాయి. యింక మనదేశంలో విదేశ ప్రయివేటు పెట్టుబడులు అధికార లెక్కల ప్రకారమే స్వాతంత్ర్యం వచ్చినప్పుడు 256 కోట్ల రూపాయలుండగా ఇప్పుడు దాదాపు రెండువేలకోట్ల రూపాయలకు పెరిగినాయి. గత రెండు మూడు సంత్సరాలుగా ప్రభుత్వం అందుకు సంబంధించిన వివరాలను ప్రకటించడంలేదు. ఇదీ మన స్వాతంత్ర్యం!

మన దేశంలో ఉక్కు పరిశ్రమ ఏ మాత్రమైనా అభివృద్ధి చెందినదంటే అదంతా సోషలిస్టు ప్రపంచం నుండి భారత ప్రభుత్వం తీసుకున్న సహాయం మూలంగానే. సోవియట్ నుండి ఈ సహాయాన్ని స్వీకరించడం వలన భారతదేశం సోవియట్‌పై ఆధారపడే దేశంగా తయారవుతుందని కొన్ని రాజకీయ పార్టీలు భావించుతున్నాయి. ఇండియా సోవియట్ యూనియన్‌కు వలసదేశంగా తయారయినదని చైనా అంటున్నది వాస్తవమేమంటే ఇండియా సోవియట్ యూనియన్‌పై ఆధారపడటం లేదు. పైపెచ్చు రోజురోజుకు భారతదేశం అమెరికా సామ్రాజ్యవాదంపై ఎక్కువగా ఆధారపడుతోంది. భారత ప్రభుత్వం సోవియట్ యూనియన్‌నుండీ, తదితర సోషలిస్టు దేశాలనుండీ సహాయాన్ని స్వీకరించడానికి నిరాకరించుతూ ఆర్థిక స్వాలంబన నిర్మించుకోవడం లేదనేదే మా విమర్శ.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అయిదేండ్ల వరకూ సోవియట్ సహాయాన్ని స్వీకరించడానికి భారత ప్రభుత్వం నిరాకరించింది. ఆ తర్వాత సహాయాన్ని తీసుకున్నారు. యంత్ర నిర్మాణ పరిశ్రమలు, మందులు, చమురు , నౌకానిర్మాణం – ఇలా ప్రతి ముఖ్యమైన పరిశ్రమ నిర్మాణంలోనూ సోషలిస్టు ప్రపంచంనుండి సహాయాన్ని తీసుకోవడాన్ని నిరాకరించారు. సోషలిస్టు ప్రపంచానికి సన్నిహితం కావడం వారి కిష్టంలేకనే వారావిధంగా వ్యవహరించారు. సామ్రాజ్యవాదులు సహాయపడటానికి నిరాకరించినప్పుడు మాత్రమే సోషలిస్టు శిబిరంనుండి సహాయాన్ని తీసుకొనేందుకు వారు సిద్ధపడ్డారు. ఈ పరిపాలనను తుడుచి పెట్టివేసే విప్లవ పోరాటం జయప్రదంకానిదే భారత ప్రభుత్వమూ, భారత పాలకవర్గాలూ అమెరికా సహాయాన్ని నిరాకరించడం జరగదు. ఒక వైపున సోవియట్ యూనియన్, తదితర సోషలిష్టు దేశాలతోనూ, మరొకవైపున సామ్రాజ్యవాదంతోనూ వారు బేరమాడతారు.

ఏది ఏమైనప్పటికీ నేడు మన ప్రజలు ఆకలితో అలమటించుతున్నారు. భూస్వాములూ, బడా గుత్త పెట్టుబడిదారులూ కోట్లాది డబ్బును సంపాదించుకొంటున్నారు. విదేశీ సామ్రాజ్యవాదులు తమ దోపిడీని విచ్చలవిడిగా సాగించుతున్నారు. ఇంక దీనిని ప్రజలు సహించేస్థితిలోలేరు. ప్రజలు పోరాడుతున్నారు. కార్మికవర్గమూ పోరాడుతున్నది.

గ్రామీణ పేద ప్రజలు, వ్యవసాయ కార్మికులు అంతా పోరాడుతూనే వున్నారు. అయితే మనం ఏ మేరకు వాంఛించుచున్నామో ఆ మేర వరకూ వారు పోరాడలేకపోవచ్చు. విద్యార్థులు, మేధావులూ కూడా పోరాడుతూనేవున్నారు. విద్యార్థులు సాగించిన కొన్ని పోరాటాలు మీరిచ్చిన నివేదికల్లో పొందుపరచబడినాయి. మన ఉద్యమాన్ని తప్పనిసరిగా యింకా ముందుకు తీసుకొని వెళ్ళవలసివుందని మాత్రం నేను గట్టిగా చెప్పదలచాను. ఐతే వివిధ ప్రాంతాల్లో జరిగిన పోరాటాల వివరాల్లోకి నేను వెళ్ళదలచలేదు. వాటినిగురించి చర్చించేప్పుడు మీరు వివరాల్లోకి వెళ్ళవచ్చు. మీ అనుభవాలను కూడా చెప్పవచ్చు. విద్యార్థి పోరాటాలను కేవలం మీ విద్యార్థి సంస్థ ఒక్కటే నిర్వహించడంలేదు. సోషలిస్టు ఎస్.వై.ఎస్. మితవాద కమ్యూనిష్టు పార్టీకి చెందిన ఎ.ఐ.ఎస్.ఎఫ్, ఇతర వామపక్షాలకు అనుబంధించివున్న ఇతర విద్యార్థి సంస్థలు కూడా పోరాటాలను నిర్వహించుతున్నాయి. చివరికి జన సంఘానికి చెందిన విద్యార్థి పరిషత్ వగైరా అభివృద్ధి నిరోధక సంస్థలు కూడా పోరాటాలు సాగించాయి. ఈ పోరాటాలను అవి తమ ప్రయోజనాలకోసం ఉపయోగించుకోవడానికి ప్రయత్నం చేయవచ్చు. కాని ప్రధాన విషయమేమంటే : విద్యార్థులు అనేక సందర్భాల్లో ప్రజాతంత్ర సమస్యలపైననే పోరాటాలు సాగించారు.

## నిరక్షరాస్యత నిర్మూలన

ఇంక ఇప్పుడు నేను మన విద్యార్థులు విద్యారంగంలో తీసుకోవలసిన కర్తవ్యాలను గురించి ప్రస్తావించుతాను. విద్యార్థిరంగంలో మన బాధ్యతలేమిటి? తిరువనంతపురంలో జరిగిన మహాసభలోనూ, భారత విద్యార్థి ఫెడరేషన్ చేసిన ఇతర తీర్మానాల్లోనూ మనదేశంలోని నిరక్షరాస్యత సమస్యను గురించి ప్రధానంగా తీసుకోవడం జరిగింది. పసివారినికూడా లెక్కలోకి తీసుకొంటే మనదేశంలో 30 శాతం అక్షరాస్యులుగా వున్నారు. అయితే పుట్టగానే ఎవ్వరూ అక్షరాస్యులు కారు గదా! ఒకటి నాలుగు సంవత్సరాలలోపు పిల్లలు అక్షరాస్యులు కాకపోతే ఈ బూర్జువా ప్రభుత్వాన్ని మనం నిందించవసరంలేదు. కాని ఏడేండ్ల వయస్సు వచ్చినప్పటికి పిల్లలు నిరాక్షరాస్యులుగావుంటే అది ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టంగా చెప్పవలసి వుంటుంది.

అయితే, నాలుగు సంవత్సరాల వయస్సుగల పిల్లలను మినహాయించితే, నిరక్షరాస్యుల శాతం 33 అని ప్రభుత్వం ఈసారి తెలివిగా చెపుతున్నది. నాలుగేండ్ల వయస్సేకాదు. ఏడేండ్ల వయస్సుగల పిల్లలనుకూడా మినహాయించడానికి నేను సంసిద్ధమే. రెండు మూడు సంవత్సరాలు అటూ ఇటూ అయినా ఫరవాలేదు. అయితే నేను చెప్పేదేమంటే, అయిదేండ్ల వయస్సులో పిల్లలకు విద్యాభ్యాసం ప్రారంభమై ఏడేండ్లపాటు వరుసగా విద్యను గరపాలి. మన జనాభాలో 65 శాతం నిరక్షరాస్యులు.

అందువలన నిరక్షరాస్యతామచ్చను తుడిచివేయడం ప్రజాతంత్ర ఉద్యమం, జాతీయ



ఉద్యమం, మన విద్యార్థి ఉద్యమం ముందున్న అత్యంత ముఖ్యమైన బాధ్యత. నిరక్షరాస్యతను నిర్మూలించడంలో పాలకవర్గాలు అంతగా ఆసక్తిని చూపించడంలేదు. వారెన్ని వాగ్దానాలు చేసినప్పటికీ ఈ వ్యవస్థలో అది అసలు నిరక్షరాస్యతను నిర్మూలించలేదు. అందువల్లనే ఈ వ్యవస్థను అంటే పెట్టుబడిదారీ వ్యవస్థను త్రోసిపుచ్చి, జనతా ప్రజాస్వామికాన్ని, సోషలిజాన్ని నెలకొల్పుకోవడం ద్వారా మనం ఈ నిరక్షరాస్యతను సమూలంగా నిర్మూలించుకోవలసివుంది.

నూతన సమాజంలో అక్షరాస్యతలేకుండా మనం పురోగమించలేము. నిరక్షరాస్యత ప్రధానంగా వున్నంతవరకూ ప్రజాస్వామ్యాన్ని ఉన్నతదశకు తీసుకొని వెళ్ళడం సాధ్యం కానేకాదు. అందువలన ఈ నిరక్షరాస్యతాపాపాన్ని ముందు తుడిచిపెట్టివేయాలి. కాని ఈ భూస్వాములకు, పాలకవర్గాలకూ ఇందులో ఆసక్తిలేదని ముందుగానే నేను చెప్పాను. పాలకవర్గాలకు కావలసినదల్లా పై వర్గాలలోని అయిదు - పదిశాతం వరకూ విద్యావకాశాలువుంటే సరిపోతుంది. తతిమ్మా ప్రజలంతా ఏమైనా వారు పట్టించుకోరు.

బానిస సమాజంలో, ఫ్యూడల్ సమాజంలో ఏదోవిధంగా జీవించడానికి గ్యారంటీవుండేది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లోకూడా ఇంతకుపూర్వం జీవనోపాధి కొంతవరకు గ్యారంటీ చేయబడేది. కాని భారతదేశంలో పెట్టుబడిదారీ విధానం క్షీణించిపోతున్న దశలో ఎంతమంది ప్రజలు చచ్చిపోతున్నా పాలకవర్గాలు పట్టించుకోవడం లేదు! వారు ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో జీవించుతున్నారో అన్న విషయాన్ని కూడా గురించి వారు బాధపడరు. వారు నిరక్షరాస్యులైనా ఫరవాలేదు. వారు కేవలం జంతువులుగా బ్రతికినా ఫరవాలేదు. వారికి కావలసినదల్లా తమకు ఉపయోగపడే విధంగా వూడిగం చేస్తేచాలు. ఒక జంతువుకంటే మానవుడే వారికి కారుచౌకగా లభ్యమవుతున్నాడు.

## విద్యారంగంలో సమస్యలు

కనుక పాలకవర్గాల దృష్టిలో తమకు ఎవరు చౌకగా చాకిరీచేయగలరనేదే ప్రధాన సమస్య. అంతకు మినహా వారికి ఇతర విషయాలు అట్టేపట్టవు. కాని ప్రజాస్వామ్యవాది అయినవాడు, ఒక విద్యార్థి, ఒక యువకుడు ఇలాంటి దారుణపరిస్థితిని సహించలేడు. మనమొక నూతన సమాజాన్ని నిర్మించుకోవాలంటే దీనికి వ్యతిరేకంగా మనం పోరాడవలసిందే. అయితే నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు మనం నిజంగా ఏమిచేయాలి అన్న విషయాన్ని గురించి పరిశీలించుకోవాలి.

తమ ఆర్థిక, విద్యాసంబంధమైన కోర్కెలకోసం విద్యార్థులు పోరాడుతున్నారు. విద్యాసంబంధమైన మన డిమాండ్లు ఏమై వుండాలి? ప్రాథమిక క్లాసులు, సెకండరీ క్లాసులు, యూనివర్శిటీ క్లాసులు, హాస్టల్ సౌకర్యాలు, మంచి ట్యూషన్, ట్యూషన్ ఫీజులేకుండా వుండటం, ఉత్తమ బోధనా పద్ధతులు, ప్రజాతంత్ర హక్కులు, స్కూళ్ళ మేనేజిమెంటులో విద్యార్థులకు భాగస్వామ్యం, హాస్టళ్ళ నిర్వహణలో విద్యార్థులకు పాత్ర, అలాగే విద్యావిధానాలను

రూపొందించడంతో విద్యార్థులకు స్థానాన్ని కల్పించడం, విద్యాభ్యాసంలో వారికి తగిన సహాయాన్ని – కోచింగ్‌ను ఏలా ఇవ్వాలి. చదువులు బాగా జరిగేందుకు విద్యార్థులకు కల్పించవలసిన సౌకర్యాలు – ఇవన్నీ విద్యార్థులకు సంబంధించిన సమస్యలు. ఇవన్నీ కూడా విద్యార్థుల ఆర్థిక, అకడమిక్, ప్రజాతంత్ర హక్కులకు సంబంధించిన విషయాల్లో ఒక భాగమే. మన విద్యార్థి ఉద్యమం వీటిని పునాదిగా వుంచుకొని పనిచేయవలసి వుంది.

## ఒంటరి పోరాటంవల్ల విజయం సాధ్యంకాదు

అయితే మన ప్రజల్లోని ఇతర తరగతులవారి డిమాండ్ల కోసం పోరాడకుండా విద్యార్థులు తమ ఆర్థిక, అకడమిక్ డిమాండ్లను సహితం సాధించుకోలేరు. స్కూళ్ళలో, కాలేజీల్లో ప్రవేశాన్ని ఎలా సంపాదించడం, ఉద్యోగాలను ఎలా సంపాదించడం, మొదట విద్య, ఆ తరువాత ఉద్యోగాలు – వీటిని గురించి మాత్రమే తమకు సంబంధంగలదని విద్యార్థులు భావించితే వారు దేనినీ సాధించలేరు. విద్యార్థులను సమీకరించడానికి ఇవి ప్రధానమైన డిమాండ్లుగా వుంచుకోవలసిందే. అయితే, ఈ డిమాండ్లను మీరు ఒంటరిగా సాధించుకోలేరు. మీ తండ్రులతో, తల్లులతో, అన్నదమ్ములతో, అక్కచెల్లెండ్రతో కలిసి పోరాడినప్పుడే మీ కోర్కెలు మీరు సాధించుకోగలుగుతారు. వర్గదృష్టితో కార్మిక, కర్షకుల డిమాండ్లను మీరు సమర్థించినప్పుడే, వారితో దృఢంగా నిలబడి ఐక్యతను సాధించినప్పుడే మీ డిమాండ్లను సాధించుకోగలరుగాని, మీ అంతట మీరు ఒంటరిగా పోరాడితే సాధించుకోలేరు. ఈ విషయాన్ని మీరు సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఇంక అప్పుడు మీరు చదువుకొంటున్నా, ఆడుకొంటున్నా వుద్యోగాలకోసం ప్రయత్నించుతున్నా, ప్రజాసంస్థలపట్ల మనవైఖరి ఎలా వుండాలి, తల్లిదండ్రులపట్ల మన వైఖరి ఎలా వుండాలి, వుపాధ్యాయులపట్ల ఎలా వుండాలి – ఈ సమస్యలన్నింటినీ మీ దృష్టిలో వుంచుకోవాలి. అందువల్లనే మన విద్యార్థి సంఘాన్ని, విద్యార్థి కేడరును, ముఖ్యంగా అత్యంత సమరశీల సంస్థగావున్న భారత విద్యార్థి ఫెడరేషన్ సభ్యులను, అగ్రశ్రేణిలో నిలబడే విద్యార్థులను నేను కోరేదేమంటే, మీ జీవితాలను మార్క్సిజం – లెనినిజంకు సంబంధించిన సరియైన విప్లవ సూత్రాలననుసరించి సరిదిద్దుకోమని. మన ప్రజల్లో ఇతర తరగతులకు చెందినవారి డిమాండ్ల సాధనకైకూడా పోరాడకుండా మీరు మీస్వంత డిమాండ్లను సాధించుకోలేరు. ప్రజాస్వామ్యం కోసం మొత్తం విద్యా వ్యవస్థను పునర్నిర్మించుకోవడం కోసం మనం దృఢంగా నిలబడి పోరాడాలి.

ఈ సందర్భంగానే మరో విషయాన్ని కూడా మీ ముందు నేను వుంచదలచాను. మనలో ఒక ధోరణివుంది అదేమంటే ప్రభుత్వాన్ని, ఈ విద్యావ్యవస్థను తెగతిట్టేవరకూ మనకు పూర్తిగా సంతృప్తి వుండదు. అయితే ఈ విషయంలో మీతోపాటు నేనూ వుంటాననుకోండి. ముఖ్యంగా మీరు ఏమీ చేయలేనప్పుడు ఇష్టమొచ్చినట్లు బూతులు తిట్టడం కంటే మరేమీ



వుండదు. తిడతారు, బాగానే వుంది. మరి ఆ తరువాత ఏమిటి? కేవలం కోపోద్రేకాన్ని వెల్లడించడంతో మనం సంతృప్తి పడకూడదు. ఈ ప్రభుత్వాన్ని, ఈ వ్యవస్థనూ నానాకూతలు కూసి వూరుకుంటే ప్రయోజనం వుండదు. అలాగే ఈ ప్రభుత్వాన్ని నాశనంచేసి, సోషలిస్టు ప్రభుత్వం అధికారంలోకి వస్తేనేగాని జరిగేదేమీ వుండదని అనుకుంటేకూడా సరిపోదు. నిజమే, ఈ విషయంలో మీతో నేనూ ఏకీభవించుతాను. ఈ ప్రభుత్వాన్ని నాశనంచేసి సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పుకోనిదే తీవ్రమైన మార్పులనేమీ తీసుకొని రాలేనిమాట వాస్తవమే. అయితే అంతమాత్రాన ఈ ప్రభుత్వం వున్నంతవరకూ మనం ఏమీ చేయలేమనుకోవడం పొరపాటు. అది మనం ఏమీ చేయజాలం, అంతా దైవనిర్ణయం అనే భావానికి దారితీసే కర్మవాదం అవుతుంది.

పాలకవర్గం మనమీద అర్ధఫాసిస్టు భీభత్సచర్యలను ప్రయోగించవచ్చు. ఇంకా ఏమైనా చేయవచ్చు. కాని ఈ ప్రభుత్వంవలన బాధలుపడేవారందరినీ మనం సమీకరించవలసి వుంటుంది. ముందు చిన్న చిన్న కోర్కెలకోసం పోరాడాలి. ఆ తరువాత ఒక అడుగు తరువాత మరొక అడుగువేయాలి. అదే మనలను భవిష్యత్తువైపుకు తీసుకొని వెడుతుంది. ఈ ప్రభుత్వం పోతేగాని మనం ఏమీ చేయలేమని చెప్పి, పోరాటాన్ని విరమించరాదు. అలా జరిగితే మన పరిస్థితులు ఏమాత్రం మెరుగవవు. ఫాసిస్టు నిర్బంధకాండ మరింత అధికమవుతుంది. నిరుద్యోగం మరింతగా పెరుగుతుంది. ఆకలిబాధతో మన ప్రజలు మరింతగా బాధపడటమూ, చచ్చిపోవడాలు మరింతగా ఎక్కువవుతాయి. ఇలా పరిస్థితులు మరింత దారుణంగా దిగజారిపోవడానికి భారత విద్యార్థి ఫెడరేషన్ ఎలా అంగీకరించగలదు? ప్రజాతంత్ర ప్రజలుకూడా అందుకు ఆమోదింపజాలరు. ఎన్ని అవరోధాలున్నప్పటికీ ఈ వ్యవస్థపై మనం పోరాడవలసిందే. ఏవో కొన్ని సౌకర్యాలను సాధించుకోవలసిందే. ఒక సమస్య తరువాత మరొక సమస్య. అలాగే ఒకడిమాండు తరువాత మరో డిమాండుకోసం పోరాడుతూ వుండవలసిందే. ఈ పోరాట పరిణామక్రమంలో మన సంస్థను మనం బలపరచుకోగలుగుతాం. చివరికి ఈ వ్యవస్థనే నాశనం చేయగలుగుతాం. అందువలన ఈ ప్రభుత్వం వున్నంతకాలం మనం ఏమీ చేయజాలమనే ధోరణిలో మనం వుండరాదు. అలాంటి వైఖరిని మనం ఎన్నడూ తీసుకోరాదు.

## విద్యావిధానాన్ని పునర్వ్యవస్థీకరించాలి

ఇంక ఇప్పుడు నేను మన విద్యావిధానాన్ని పునర్వ్యవస్థీకరించవలసిన ఆవశ్యకతను గురించి కొద్దిగా చెప్పదలచాను. మనకు ఎలాంటి విద్యావిధానంకావాలి? ఈ సమస్యను గురించి మన విద్యార్థి ప్రతినిధులు తిరువనంతపురం మహాసభలో పదే పదే లేవనెత్తారు.

ఇప్పుడున్న విద్యావిధానం పనికిమాలినదని మనం చెపుతున్నాం. మనకు శాస్త్రీయ విద్యావిధానం కావాలి. విజ్ఞానాన్ని సముపార్జించుకునేందుకూ, మనదేశంలో ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించుకోవడంలో తగు పాత్రను నిర్వహించడానికి సహాయపడే విద్యావిధానం మనకు కావాలి. ఈ సూత్రాలన్నీ బాగానేవున్నాయి.

మనకు కావలసిన పనులు చేసుకోవాలంటే మనమూ విప్లవాలను సాధించుకోవలసి వుంటుంది. అయితే విప్లవాన్ని తేవాలంటేకూడా జనసామాన్యంవద్దకు మనం ఎలా వెళ్ళాలి, ఏ భావాలతో వెళ్ళాలి, అందుకు ఎలాంటి చర్యలను తీసుకోవాలి? ఈ సమస్యలన్నింటినీ జనానుకూలంగా మలచుకొన్నప్పుడే ప్రజానీకం మిమ్మలను బలపరుస్తుంది. ప్రజల కోర్కెలను మీరు బలపరచవచ్చు. అప్పుడే అందరం కలసి ముందుకు సాగిపోగలం. ఇదీ కీలక సమస్య.

## కొన్ని మార్గదర్శక సూత్రాలవసరం

అందువలన తిరువనంతపురం మహాసభలోనే మీ విద్యార్థిసంస్థ కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. అయితే బూర్జువా – భూస్వామ్య ప్రభుత్వాన్ని కూలద్రోసి, మనం అధికారాన్ని కైవసం చేసుకున్న తరువాత, సోషలిజం వచ్చిన తరవాత రూపొందించవలసిన విద్యావిధానానికి సంబంధించిన మార్గదర్శక సూత్రాలుకావవి. వెనువెంటనే మనం సాధించవలసిన దేమిటనేదే మనముందున్న సమస్య. నిరక్షరాస్యతకు వ్యతిరేకంగా మనం పోరాడాలని మనం అక్కడ సరిగానే చెప్పుకొన్నాం. అది అందరి కర్తవ్యం. అది మన విద్యావిధాన లక్ష్యం. అది మన సాంఘిక లక్ష్యం. అది ఒక రాజకీయ లక్ష్యం. ప్రజాతంత్ర లక్ష్యం కూడా. ఈ నిరక్షరాస్యత నిర్మూలనకై చర్యలను తీసుకోవడంలో మీ విద్యార్థులకేగాక, మొత్తం ప్రజాతంత్ర ఉద్యమానికంతటికీ ఆసక్తి వుంది. ఈ సందర్భంగా కార్మికులకూ, కర్షకులకూ, తదితరులకు రాత్రిస్కూళ్ళ ద్వారా లేదా వయోజన విద్యాలయాలను ఏర్పాటు చేయడంద్వారా మీ తీరిక సమయంలో మీ పాత్రను మీరు నిర్వహించవలసి వుంటుంది.

దీనితోపాటు, విద్యావిధానాన్నే పునర్వ్యవస్థీకరించవలసి వుంది. ఒక విషయాన్ని నొక్కి చెప్తాను. అదేమంటే; భారతదేశంలో 1980 నాటికల్లా ఏడేళ్ళ ప్రాథమిక విద్యను బాలబాలికలందరికి నిర్బంధం చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలి. ఇది పదేళ్ళపాటు అందరికీ నిర్బంధంగా విద్యను గరపాలనే లక్ష్యానికి నాంది మాత్రమే. అంటే అయిదేళ్ళ వయస్సుగల బాలబాలికలందరికి ఏడేండ్లపాటు విద్యను నిర్బంధంగా విద్యను గరపటం కనీసం 1980 నాటికల్లా ప్రారంభించితీరాలి. దానిని మన డిమాండ్‌గా పెట్టుకొని దానికోసం పోరాడాలి. ఇందుకై ఇతర ప్రజాతంత్ర సంస్థలతో మనం చేతులు కలపవలసివుంటుంది. దానిపైన మనదృష్టినంతటినీ కేంద్రీకరించి పనిచేయాలి; దానిని సాధించాలి; సాధించి తీరగలంకూడా అయితే ఇందుకు ఏమి చేయాలనేది ఒక సమస్య. ఆ సమస్యనుగురించి ఇతర ప్రజాతంత్ర సంస్థల నాయకులతో, రాజకీయపార్టీల నాయకులతో మనం చర్చించాలి.



ఇందుకు నేను ఒక సూచన చేస్తాను. ప్రభుత్వం ఏమైతేనేమి చాలాచోట్ల ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పింది. ఎక్కడైతే ప్రజాతంత్ర వుద్యమం వుంటుందో, ఎక్కడైతే రాజకీయ పార్టీలుంటాయో అక్కడల్లా బాలబాలికలకు వుచితంగా విద్యగరపమని డిమాండుచేద్దాం. ఇందుకై రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల వద్దకు యాత్రలను జరుపుదాం. అక్కడకువెళ్ళి మంత్రులను ఇందుకోసం డిమాండ్ చేద్దాం. వారిని ఘెరావ్ చేద్దాం. అయితే ఈ లోపున పోరాటం కొనసాగవలసిందే. 7వ తరగతి వరకూ ఉచిత విద్యను ప్రవేశపెట్టే సమస్య మన విద్యార్థులు, మన ఉపాధ్యాయులు, మన ప్రజాసంస్థలు వెంటనే అమలు జరిగేటట్లు చూడాలి, అలాంటిదేదో జరగాలి. అయితే ఇది ఆచరణలో జరగడం ఎలా అన్నది ప్రజాతంత్ర సంస్థలూ, రాజకీయపార్టీలు ఆలోచించి కార్యక్రమాన్ని రూపొందించుకోవలసి వుంటుంది. డిమాండ్ చేయడం, కొంత ఆందోళన సాగించడంతో, కొన్ని బహిరంగ సభలను పెట్టడంతో, మెమొరాండంలను సమర్పించడంతో తృప్తి పడరాదు, బాగానేవుంది. మీ మెమోరాండంను గురించి మేము పరిశీలించుతాం. అప్పుడప్పుడు మీరు ధర్నాలు చేయవచ్చు, అని ప్రభుత్వం అంటుంది. మరి ఆ తరువాత జరగవలసినదేమిటి? అందుకనే మనం ప్రత్యక్షంగా స్కూళ్ళకేవెళ్ళి మన డిమాండ్లను ప్రభుత్వం ఆచరణలో పెట్టేందుకు ఏదో ఒక చర్యను తీసుకోవలసి వుంటుంది.

## మన ప్రధాన కేంద్రీకరణ

మరో అంశాన్ని కూడా లేవదీయవచ్చు. బాలబాలికలకు రెండు మూడు సంవత్సరాల వయస్సు వున్నప్పుడే వారి భావాలు రూపొందుతూ వుంటాయి. అందువలన మూడేళ్ళ వయస్సు వున్నప్పుడే వారికి ఆదర్శవంతమైన విద్యను చెప్పించడం, శిక్షణలో పెట్టడం అవసరం. అంతేకాదు; మన సోషలిస్టు సూత్రాలను పాటించితే మార్క్సు, లెనిన్‌ల ఉపదేశాలను అనుసరించితే; మూడేళ్ళ వయస్సులోనేకాదు, పిల్లలు చైతన్యమేర్పడినప్పటి నుండీ బిడ్డలకు ఎలా శిక్షణ ఇవ్వాలి, వారిని ఉత్తమ పౌరులుగా అభివృద్ధి చేయడానికి ఏమిచేయాలి, ఉత్తమ మానవుడుగా రూపొందడానికి ఎలాంటి చర్యలను తీసుకోవాలి, బిడ్డల అలవాట్లను ఎలా తీర్చిదిద్దాలి, మొదలుగాగల విషయాలను పరిశీలించవలసిందే. అవన్నీ మన సోషలిస్టు వ్యవస్థలో చూసుకోవచ్చు. మూడేళ్ళ వయస్సులోపు బిడ్డలకు నర్సరీ స్కూళ్ళను, కిండర్ గార్డెన్‌లను ప్రారంభించవచ్చు. వీటన్నింటినీ మనం వాంఛించుతాం. అయితే వాటిని గురించి నేడు మనం నొక్కిచెప్పం. ఎందువల్లనంటే కొద్దిపాటిగావున్న ధనికవర్గాల కోసం వాటిని ప్రారంభించేందుకు మనం ప్రభుత్వానికి అవకాశం యిచ్చిన వారమవుతాం. జనసామాన్యానికి అవేమీ ఉపయోగపడవు.

అందువల్లనే మనమిప్పుడు కనీసం అయిదేండ్ల వయస్సున్న బిడ్డలందరికీ నిర్బంధ ఉచిత విద్యను ప్రవేశపెట్టవలసిందిగా డిమాండ్ చేస్తాం. అయితే ఫ్యాక్టరీలలోనూ, ఇతర సంస్థలలోనూ పనిచేసే తల్లులున్నారనుకోండి. వారికి బిడ్డలుంటే, వాళ్ళ సంరక్షణ చూసేందుకు అమ్మమ్మలు, నాయనమ్మలూ లేనిపక్షంలో వారికోసం క్రెచెస్ ఏర్పాటు చేయాలని డిమాండ్

చేయవలసిందే. అయితే మనం నేడు ప్రధానంగా అయిదేండ్ల బాలబాలికలకు నిర్బంధోచిత విద్యను గరపాలనే సమస్యపైననే కేంద్రీకరించి పనిచేస్తాం. మొదట దీనిని మనం సాధించాలి. ఆ తరువాత పదేండ్ల స్కూలు విద్యను నిర్బంధోచితం చేయడానికి పోరాడాలి. నేను మీకు ముఖ్యంగా చెప్పదలచినదేమంటే ముందు దీనిని సాధించండి. ఇది జరిగితే ఆ తరువాత సంగతిని చూద్దాం. మొదట అనుకున్నవి మొదట సాధించాలి. ఇదీ మనం అనుసరించవలసిన పద్ధతి.

## ప్రతి ఒక్క దశలోనూ ఉపాధి కల్పన

ఇంక రెండో విషయం : ప్రతి ఒక్కదశలోనూ, అంటే ఏడేండ్ల స్కూలు కోర్సు పూర్తి అయిన తరువాత అంటే 12 ఏండ్లు వయస్సు వచ్చినప్పుడూ, లేదా ఐదేండ్లు స్కూలు కోర్సు పూర్తి అయిన తరువాత, ఇంటర్మీడియట్ దశలో, లేదా హయ్యర్ సెకండరీ దశ, లేదా యూనివర్శిటీ దశ – ఏ దశను పూర్తిచేసినా ఆ విద్యార్థి ఇంక పై దశకు వెళ్ళలేకపోయినప్పుడు అతనికి ఆ దశకు తగినట్లు ఉద్యోగాన్ని గ్యారంటీ చేయాలి. అయితే ఏడేండ్ల స్కూలు కోర్సును పూర్తిచేసి 12 ఏండ్ల వయస్సు వచ్చిన దశలో పిల్లలు ఉద్యోగం చేయడాన్ని మనం ఆమోదించ జాలం. అందువలన అలాంటి వారిని మరో మూడేండ్లపాటు – అంటే 15 సంవత్సరాల వయస్సు వచ్చేంతవరకూ ఏదో ఒక వృత్తి విద్యాలయంలో ప్రవేశపెట్టాలి. అక్కడ అతడు పనిచేస్తూ నేర్చుకోవచ్చు. ఆ కాలంలో అతడు తల్లిదండ్రులపై ఆధారపడనవసరం లేకుండా కొంత అలవెన్సును చెల్లించాలి. వృత్తి స్కూలులో విద్య పూర్తికాగానే అతనికి ఉద్యోగం యివ్వాలి. అప్పటికి అతడు శిక్షణ పొందుతాడుగాబట్టి ముందుకు పోగలడు.

ప్రతి ఒక్క దశలోనూ ఉద్యోగం గ్యారంటీలేని పక్షంలో ఏ విద్యా విధానమూ ఎన్నటికీ జయప్రదం కాజాలదు. మనకు మరికొన్ని యూనివర్శిటీలను, మరి కొన్ని స్కూళ్ళను నెలకొల్పవచ్చు. ఎక్కువ స్కూళ్ళు, ఎక్కువ యూనివర్శిటీలు ఉన్నంత మాత్రాన విద్యా సమస్యలు పరిష్కారం కావు. ప్రతి ఒక్క దశలోనూ ఉద్యోగాన్ని గ్యారంటీ చేయకుండా కేవలం ఎక్కువ కాలేజీలు, ఎక్కువ స్కూళ్ళు వుండటం వల్లనే భారతీయ విద్యావిధానానికి పరిష్కారం దొరకదు. అందువలన యూనివర్శిటీల్లో, సెకండరీ స్కూలు స్థాయిలో హెచ్చు విద్యా సౌకర్యాల కోసం పోరాడుతూనే, ఉద్యోగాల గ్యారంటీ కోసం కూడా మనం పోరాడవలసివుంది.

కనుక మనం డిమాండ్ చేస్తున్న విద్యావిధానం యిది. అందరికీ అక్షరాస్యత; అయిదేండ్ల వయస్సు వచ్చిన పిల్లలందరికీ ఏడేండ్ల స్కూలు కోర్సును నిర్బంధంగానూ, వుచితంగానూ వెనువెంటనే ప్రవేశపెట్టాలి. 15వ సంవత్సరం వచ్చేంతవరకూ వృత్తిస్కూళ్ళు, ప్రతి ఒక్క దశలోనూ ఉద్యోగం గ్యారంటీ, ఒకసారి ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా తన విద్యా నైపుణ్యాన్ని పెంపొందించుకొనేందుకు అవకాశం కల్పించాలి. పై చదువులకెళ్ళి తననైపుణ్యాన్ని పెంపొందించుకొనేందుకు ప్రతి ఒక్కరికీ అవకాశం వుండాలి.



మీ తిరువనంతపురం మహాసభలో యీ స్కీమునే ఆధారం చేసుకొని చర్చలు జరిపారు. అయితే అది ఇప్పటివరకూ ప్రజానినాదంగా తయారు కాలేదు. నినాదాన్ని ఇంతవరకూ ఆచరణలో చేబట్టలేదు. ఈ స్కీమును ప్రభుత్వం అంత సులభంగా అంగీకరించుతుందని కూడా నేననుకోవడంలేదు. అందువలన మన కార్యాచరణ ద్వారా శక్తివంతమైన ఆయుధాన్ని చేబట్టినప్పుడే ప్రభుత్వంచే ఈ స్కీమును అమలు జరిపించగలం.

## విద్యా విధాన లక్ష్యాలు ఎలావుండాలి?

విద్యా విధాన లక్ష్యాలలో ఒకటి జాతీయ ఆర్థిక వ్యవస్థలో నా స్థానాన్ని నిర్ణయించగలగాలి. నాకు తగిన వుద్యోగం కల్పించబడాలి. పూర్తిపనితో ఈ ఆర్థిక వ్యవస్థలో నాకు స్థానం కల్పించబడాలి. విద్యకుండవలసిన రెండో లక్ష్యమేమంటే; నేను స్కూలులో నేర్చుకున్న దానినిబట్టి ఇంకా నేర్చుకోవాలన్న ఆసక్తి నాలో పెరగాలి. అదే విద్యయొక్క ప్రయోజనంగావుండాలి. కామ్రేడ్స్ మీరు చైతన్యం గలిగి, బాగా సంఘటితపడిన తరగతికి చెందిన విద్యార్థులు. ఏడేళ్ళ తరువాత, లేదా 10 ఏండ్ల తరువాత లేదా కాలేజీ చదువు పూర్తి అయిన తరువాత విద్యాభ్యాసం పూర్తి అయిపోతుందని మీరు భావించరాదు. వాస్తవం చెప్పాలంటే మనం చనిపోయేంతవరకూ విద్యాభ్యాసం కొనసాగుతుందనేదే నా అభిప్రాయం. 80 ఏండ్ల వంద ఏండ్ల వయస్సు వచ్చినా మనం విజ్ఞానాన్ని సమకూర్చుకోవలసిందే. లేని పక్షంలో మనం అజ్ఞానులుగానే వుండిపోతాం. అజ్ఞానమంటే అక్షరాల అజ్ఞానం కాదనుకోండి. కాని మన విజ్ఞాన సముపార్జన ఆగిపోతే, ఇంకా పెంపొందుతున్న విజ్ఞాన శాస్త్రాలను, చివరికి మనం పనిచేస్తున్న రంగానికి సంబంధించిన విషయాలను కూడా అర్థం చేసుకొనగల శక్తిలేకుండా పోవచ్చు. అందువలన విజ్ఞాన సముపార్జన అనేది ఎల్లప్పుడు కొనసాగవలసిన విషయమే.

నా చిన్న తనంలో ఏ పుస్తకాలు చదవాలో ఏమి చేయాలో నాకు సలహా యిచ్చే వారెవరూలేరు. అందుకు యిప్పటికీ నేను విచారిస్తూ వుంటాను. అనవసరమైన పనికిమాలిన పుస్తకాలను నేను నా చిన్నతనంలో ఎన్నో చదివాను. ఒక మంచి పుస్తకం చదివితే కనీసం 20 పుస్తకాలయినా పనికిరానివి చదివివుంటాను. నేటి మన యువతరం కూడా అలాంటి తప్పుడుపద్ధతినే అనుసరించాలా? అనవసరమైన పుస్తకాలన్నీ చదివి కాలాన్ని వృధాపుచ్చవద్దు. మంచి పుస్తకాలు చదివితేనే ఉపయోగం ఉంటుంది. మీ తెలివితేటలను, మీ శక్తి సామర్థ్యాలను వృద్ధి చేసుకోగలరు. మీ జీవితమంతా నేర్చుకొనే పద్ధతిని అలవరచుకోండి. మనం ఆ పద్ధతినే సదా అలవరచుకోవాలి. మన విద్యావిధానం అలాంటి చొరవను, అలాంటి వాంఛను, జీవితాంతం నేర్చుకోవాలనే మంచి అలవాటును ప్రతివారిలో సృష్టించగలిగేదిగా వుండాలి.

## సోషలిజానికై పోరాటం ! అందుకు శిక్షణ

మన విద్యావిధాన మూడోలక్ష్యం : ప్రజాతంత్ర సమాజంకోసం, ఒక నూతన సమాజ నిర్మాణంకోసం జరిగే పోరాటంలో ఖచ్చితమైన పాత్రను నిర్వహించేందుకు మన విద్యార్థులకు అవకాశం కల్పించే విధంగా మన విద్యావిధానం వుండాలి. రాజకీయాల్లో విద్యార్థులూ, అధ్యాపకులూ పాల్గొనవలదని "కార్మిక మహా నాయకుడు" వి.వి. గిరి సలహా యిచ్చినట్లు ఈ వేళ ఉదయమే నేను రేడియోలో విన్నాను. అంతకంటే చెత్తవాగుడు మరొకటి వుండబోదు. ప్రతి ఒక్క విద్యార్థీ, ప్రతి ఒక్క అధ్యాపకుడు రాజకీయాల్లో ఆసక్తిని కలిగి వుండటమేగాక, రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని కూడా మనం కోరతాం. అంటే పాలకవర్గ రాజకీయాల్లో కాదు; శ్రామిక ప్రజల రాజకీయాల్లో. అందువలన నేను చెప్పదలచినదేమంటే ప్రజాస్వామ్యానికీ, శ్రామిక జనావళికీ సేవ చేయడానికీ, సోషలిజం కోసం పోరాడేందుకూ మన విద్యావిధానం తోడ్పడేదిగా వుండాలి.

ఇంక నాలుగవ లక్ష్యం : మన అధ్యాపకులపట్ల, మన తల్లిదండ్రులపట్ల విద్యార్థుల సంబంధాలు ఎలా వుండాలి? అలాగే ప్రజల్లో ఇతర తరగతుల వారిపట్ల మన సంబంధాలు ఏవిధంగా వుండాలి? దురదృష్టవశాత్తూ మన విద్యార్థులు రైల్వే ఉద్యోగులతో, బస్సు రవాణా ఉద్యోగులు వగైరాలతోనూ సంఘర్షణ పడుతున్నారు. ఈ విషయాన్ని గత మహాసభలోకూడా మీ దృష్టికి తీసుకొని రావడం జరిగింది. ఫ్యాక్టరీలలోనూ, ఇతర సంస్థలలోనూ, స్కూళ్ళలోనూ పనిచేసే వారితో విద్యార్థులు ఘర్షణపడేలా ఛాత్రపరిషత్తును ఉద్దేశ్యపూర్వకంగానే కాంగ్రెస్ ప్రోత్సహించుతున్నది.

ఉపాధ్యాయులపట్ల, మన తల్లిదండ్రులపట్ల మనం ఏ ప్రజలమధ్య జీవించుతూ, ఎవరితో కలిసి పనిచేస్తున్నామో, ఆ జనసామాన్యంపట్ల ఎలా ప్రవర్తించాలో మన విద్యార్థులను తీర్చిదిద్దేదిగా వుండాలి మన విద్యావిధానం. నేడు మనలో ఆవరించిన నిస్పృహను ఎవరైనా అర్థం చేసుకోగలరు. మీలో ఎంతగానో శక్తి వుంది. దాన్ని వినియోగించాలనే ఆదుర్దా, ఆవేశం మీలో వుండటం సహజమే. అయితే యీ శక్తితో ఉత్తమ పౌరుడుగా, సాటి ప్రజలకు సహాయపడే మానవుడుగా తయారుకావాలేగాని వినాశకర వ్యవహారాలకు వినియోగపడరాదు. చక్కని జీవితాన్ని అనుభవించడానికి మీ శక్తి సామర్థ్యాలను వినియోగించుకోవడానికి బదులు మీరు పాలక వర్గాలకు సులభంగా సాధనాలుగా తయారై, అన్ని రకాల సంఘ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే, అదేమీ వుపయోగంలేదు. అందువలన కమ్యూనిస్టు నైతిక సూత్రాలు మీకు నేర్పేదేమంటే : మీరు శ్రామిక జన సామాన్యంతో నిలబడితే మీ ఉపాధ్యాయులపట్ల, ప్రజలపట్ల మీ వైఖరి, మీ ప్రవర్తన వేరువిధంగా ఖచ్చితంగా వుండగలదు.

ఇది సర్వసాధారణంగా జరుగుతున్న విషయమో కాదో నాకు తెలియదు కాని, నేనొక సంఘటనను గురించి మీకు చెపుతాను. దాన్ని తలచుకుంటే నా రక్తం వుడుకెత్తుతుంది.



నేను ఆంధ్రయూనివర్శిటీ సెనేట్ సభ్యుడుగా వుంటున్నప్పుడు, సెనేటు సమావేశంలో పాల్గొనేందుకు విశాఖపట్టణం వెళ్ళాను. నా ముందు ఒక లారీనిండా ఇంజనీరింగు విద్యార్థులు వెళ్ళడం చూశాను. నలుగురైదుగురు అమ్మాయిలు హాస్టల్ నుండి తమ కాలేజీకి నడిచి వెడుతున్నారు. వారిని చూసిన ఇంజనీరింగు విద్యార్థులు వారినుద్దేశించి అసభ్యమైన కేకలు వేయడం చూశాను. పాపం ఆ అమ్మాయిలు ఇంజనీరింగు విద్యార్థుల ప్రవర్తనకు ఎంతగానో సిగ్గుపడి తలలువొంచుకుని మెల్లగా వెళ్ళిపోయారు. మన విద్యార్థులు ఎందుకలా తయారైనట్లు? ఆ లారీలోవున్న విద్యార్థుల్లాగానే మన విద్యార్థిలోకమంతా వుంటుందని నేననను. కాని అలాంటి అసభ్య ప్రవర్తన ఎందుకు జరగాలి? ఇలాంటివాటిని పాలకవర్గాలు ప్రోత్సహించుతాయని నాకు తెలుసు. నేడున్న సాంఘిక వ్యవస్థకూడా ఇలాంటి పనులను ప్రోత్సహించుతుందని కూడా నాకు తెలుసును. అయితే అంత మాత్రాన ఇలాంటి అసభ్యకర ప్రవర్తనపట్ల మన నిరసనను గట్టిగా వ్యక్తపరచవలదా? అలాంటివి జరగకుండా నివారించేందుకు మనం పోరాడవలదా?

అలాగే పరీక్షలను గురించి, అక్కడ జరిగే తప్పుడు పద్ధతలను గురించి అనేక రిపోర్టులను వింటున్నాం. ఈ అవకతవక పనులన్నింటినీ సరిచేసేందుకు మనం పోరాడవలసిందే. మానవ సభ్యత కోసం, నూతన సమాజ నిర్మాణం కోసమూ నిలబడి మన యువతరం ఎక్కడుంటే అక్కడ కృషిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మార్క్సు, లెనిన్ మహాశయులు చూపిన మహోజ్వలమార్గాన్ని అనుసరించడానికి బదులుగా పాలకవర్గాల అసభ్యతా ప్రవర్తనలను అలవాటు చేసుకుంటే మీరు నిరుపయోగమవుతారు. కారల్‌మార్క్సు జీవితాన్ని చదవండి, లెనిన్ మహాశయుని జీవితాన్ని అధ్యయనం చేయండి. లేదా మార్క్సు, లెనిన్‌లను కాకపోయినా కనీసం కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్, కామ్రేడ్ సతీష్ పక్రాషీ తదితర విప్లవకారుల జీవితాలను చూడండి. వారి జీవితాల్లో ఏ ఒక్క దశలోనయినా వారలా అసభ్యంగా ప్రవర్తించారా? నిరాడంబర జీవితం, దృఢ విశ్వాసాలు, ఉక్కులాంటి క్రమశిక్షణ – ఇవి మీ వ్యక్తిగత జీవితానికి ఆదర్శం కావాలి. మన వ్యక్తిగత జీవితపు అలవాట్ల ప్రభావం తప్పనిసరిగా విద్యార్థులుగా మీ కార్యకలాపాలపైనా, మీ సాంఘిక ప్రవర్తనపైన పడుతుంది. కనుక మన విద్యావిధానం మనలను ఉత్తమ మానవులుగా తీర్చిదిద్దేదిగా వుండాలి.

## ప్రజాతంత్ర అధ్యాపకుల బాధ్యత

ఈ సందర్భంగా మన ఉపాధ్యాయ కామ్రేడ్స్ కూడా కొన్ని కర్తవ్యాలను నిర్వహించవలసిందిగా కోరుతున్నాను. వారు ఎదుర్కొనే ఇబ్బందులను నేను అర్థం చేసుకోగలను. విద్యార్థి జనసామాన్యంతో నిత్య సంబంధాలను కలిగివుండేది ఉపాధ్యాయులేకదా. అందువలన వారు తమవిజ్ఞానాన్నంతటినీ, తమ వోర్మిని – అన్నింటినీ తమతో నిత్య సంబంధాలు కలిగివుండే యువతరానికి బోధించాలి. వారి జీవితాలను తీర్చిదిద్దటానికి ఉపాధ్యాయులే ప్రయత్నించకపోతే మరెవరు చేయగలరు? అయితే నేడు

సమాజం యీ విధంగా వుందిగాబట్టి విద్యార్థులందరి జీవితాలను వారు సక్రమంగా తీర్చిదిద్దలేకపోవచ్చు. కాని ప్రతి ఒక్క తరగతిలోనూ, ప్రజాతంత్ర విలువలకోసం నిలబడుతూ, పొరపాటు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడే చిన్నదైన – ఒక శక్తివంతమైన గ్రూపును మన ఉపాధ్యాయ కామ్రేడ్స్ తయారుచేయవలదా?

సాంఘిక వ్యవస్థ ఇలా వున్నప్పుడు, ప్రభుత్వం ఇలా వున్నప్పుడు, యువతరంలో యింతటి నిరుత్సాహ నిస్పృహ వాతావరణం వున్నప్పుడు, నేనే చాలీచాలని తిండితో జీవితం గడపవలసినప్పుడు, నేనెలా యీ కర్తవ్యాన్ని నిర్వహించగలనని ఉపాధ్యాయులనవచ్చు. అవును, మీరు చెప్పిన దానంతటితోనూ నేను అంగీకరించుతాను. కాని ఇవన్నీ ఇలా వున్నాయిగాబట్టి, నూతన సమాజాన్ని నిర్మించవలసిన యువతరాన్ని సరైన పద్ధతిలో తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులుగా మీరు విస్మరించవచ్చునా? ప్రతి ఒక్క ఉపాధ్యాయుడూ 40 మందో లేక 200 మందో వుండే ఒక్కో తరగతిలో కనీసం 10 శాతం విద్యార్థులనైనా యీ పొరపాటు ధోరణులకు వ్యతిరేకంగా నిలబడేటట్లు చేయగలిగితే ఎలాంటి చక్కని వాతావరణాన్ని విద్యార్థిలోకంలో సృష్టించగలరో వూహించండి. వీటన్నింటికీ ప్రభుత్వాన్ని నిందించి ప్రయోజనంలేదు. మన ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఈ ప్రభుత్వం ఎంతటి దుర్మార్గాన్ని తలపెడుతున్నప్పటికీ వ్యతిరేకంగా మనం పోరాడుతూనే మన యువతరాన్ని సరియైన ధోరణిలో విజ్ఞానవంతులను చేసుకొంటూ, ముందుకు సాగిపోవాలి.

ఇంక ఇప్పుడు యీ సందర్భంగా మన పెద్దలకు, ముఖ్యంగా మన ఉపాధ్యాయులకూ, ప్రజా సంస్థల నాయకులకూ మరోసారి విజ్ఞప్తి చేయతలచుకొన్నాను. తిరువనంతపురం మహాసభలో శ్రమకూ, అధ్యయానికి ఒక ఎర్రబాడ్జీని బహుకరించే పద్ధతిని నెలకొల్పాలని మన విద్యార్థి కామ్రేడ్స్ అనుకొన్నారు. కాని దాన్ని అమలు జరపలేకపోయారు. ఇందులోవున్న భావమేమిటంటే; క్రీడలు, సంస్కృతి మొదలుగాగల జీవితానికి సంబంధించిన మంచి విషయాల్లో మన విద్యార్థులకు ఆసక్తిని కలుగజేసేందుకు శిక్షణ యివ్వాలి; ఆ విధంగా పోరాటాలను కొనసాగించేందుకు వారిని మానసికంగానూ, శారీరకంగా సంసిద్ధంచేయాలి. వారు దైనందిన తమ కార్యకలాపాలను సవ్యంగా నెరవేర్చడమేగాక, అవసరమైతే ప్రజాసైన్యంలో చేరి పోరాడేందుకు కూడా సంసిద్ధం చేయవలసివుంది.

ఆ దశ వచ్చిననాడు నేర్చుకోవడం ప్రారంభించుతాననుకోవడం సరికాదు. ఇప్పటినుండీ – అంటే చిన్నతనంనుండి కూడా శరీరాన్ని, చైతన్యాన్ని అందుకు సంసిద్ధం చేసుకొనకపోతే నీవు ప్రజాసైన్య యోధుడివి కాజాలవు. ఇవన్నీ ప్రాథమిక విషయాలు.



## విప్లవ జీవితానికి అంకితమవండి

ఏమైనప్పటికీ మన విప్లవకారుల నుండి నేను నేర్చుకొన్న విషయమిది. నా చిన్న తనంలో, నాకు పదేళ్ళ వయస్సున్నప్పుడే మన విప్లవకారుల జీవితాలను గురించి చదివాను. విపరీతమైన చలినీ, భయంకరమైన వేడిని తట్టుకొనేందుకు వారు అలవాటు చేసుకొనేవారు. అలాగే తుపాకితో కాల్చడం, నదులను దాటడం, మైళ్ళతరబడి నడవడం – వీటన్నింటికీ అలవాటు పడటానికీ శిక్షణ పొందారు. చిన్న యువకుడుగా ఇవన్నీ నన్ను ఎంతగానో ఆకర్షించేవి. అప్పటికి నేనింకా కమ్యూనిస్టును కాను. అందువలన విప్లవానికి మీ జీవితాన్ని అంకితం చేయదలిస్తే, అలాంటి కష్టాలతో కూడిన విప్లవకారునిలా జీవించడానికి ఇప్పటినుండీ తయారుకావాలి. అందుకు మీరంతా ప్రయత్నించాలి. ఉపాధ్యాయులు కూడా ఇందుకు తోడ్పడాలి.

మరో విషయం : అధ్యయనానికి అరుణపతాకం బహూకరణ! మన సాహిత్యాన్ని మనం మరచిపోతున్నాం. అభ్యుదయ సాహిత్యం ఏమి వస్తున్నది? ఏదైనా మంచి సాహిత్యం లభ్యమైతే కేవలం మన ఆనందం కోసమేగాక, యువతరం అభివృద్ధికోసం చదవాలి. మన భారతదేశంలో పంద్రెండు, పదిహేను వరకూ ప్రధాన భాషలున్నాయి. అందులో మంచి సారస్వతం వుంది. మన యువతరం తమ తమ మాతృభాషలద్వారా విజ్ఞానం పొందాలి. యువతరం ఏమి పుస్తకాలు చదవాలి? ఏ గీతాలు, ఏ నవలలు, ఏ కథలు, ఏ జీవితకథలు, ఏ చరిత్రలు, ఏ రాజకీయ గ్రంథాలు చదవాలో చూసుకోవాలి. మన భాషల్లో రాయబడినదంతా నిరుపయోగమైనదేనని తలచరాదు. అందువలన భాషల్లో ప్రచురింపబడిన మంచి పుస్తకాలను చదివేందుకు మన యువతరానికి సూచించాలి. ఆ విధంగా మాత్రమే వారిని సరియైన విజ్ఞానవంతులను చేసిన వారమవుతాం. మన వివిధ భాషల్లోని సాహిత్యంతోనూ, మన ప్రజల పరిస్థితులతోనూ బాగా సన్నిహిత పరిచయంవున్న మన ఉపాధ్యాయ కామ్రేడ్స్, మన సీనియర్ కామ్రేడ్స్ ఈ పని చేయాలి. ఆ విధంగా మన యువతరం విజ్ఞానవంతం అయ్యేటట్లు మనం యత్నించాలి. మీ పెద్దల నుండి, మీ ఉపాధ్యాయులనుండి ఈ రకమైన సహాయం కోసం యువతరమైన మీరు డిమాండ్ చేయాలి.

## మాతృభాష ద్వారా విద్య : త్రిభాషా పథకం కూడదు

ఈ సందర్భంలో త్రిభాషా పథకం మన విద్యార్థులకు సుతరాం పనికిరాదని నేను చెప్పదలచాను. మాపార్టీ అయిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) చెప్పుతున్నందున నేనీ విషయాన్ని చెప్పడంలేదు. అసలు మనకు త్రిభాషా పథకం ఎందుకో వివరించవలసిందిగా

మన విద్యావేత్తలను నేను కోరుతున్నాను. నా మాతృ భాష అయిన ఒక్క భాషనే నేను సరిగా నేర్చుకోలేకపోతున్నాను. నా భాషలో సైతం నా భావాలను సరిగా వ్యక్తం చేయలేకపోతున్నాను. నా మాతృభాషలోనే ఒక చిన్న వివరణను సవ్యంగా చిత్రించగలిగిన స్థితిలోలేను. అలాంటప్పుడు ఇంగ్లీషునుగాని, హిందీనిగాని, లేదా రష్యన్‌నుగాని, మరి ఏ ఇతర భాషనైనా నేను ఎందుకు నేర్చుకోవాలి? విజ్ఞానాన్నంతటినీ నా మాతృభాషద్వారా నాకు ఎందుకు నేర్పరు? నా పసితనాన్నుండీ నా మాతృభాషను నేను నేర్చుకుంటాను : నా మాతృభాషనే నేను సరీగా నేర్చుకోలేకపోతే, నా భాషనే నేను అభివృద్ధి చేసుకొనలేకపోతే, మూడు భాషలను నేర్చుకొని ఆలిండియా నాయకుడనో, అంతర్జాతీయ నాయకుడనో కావాలని అనుకోవడంలో అర్థమేముంది?

మొదట మీ మాతృభాషను బాగా నేర్చుకోండి. అందువల్లనే ఒకేభాషను నేర్పాలని మేము డిమాండ్ చేస్తున్నాం. విద్యనంతా మాతృభాషద్వారానే నేర్పాలి. కనుకనే 12 ఏండ్ల వయసువరకూ ఏ ఒక్కరికి మాతృభాష మినహా మరో భాషను నేర్పడానికి ప్రయత్నించరాదని మేము పదేపదే చెపుతున్నాం. అదెంత మైనార్టీ భాష అయినా కానీయండి. విద్యాబోధన మాత్రం మాతృభాష ద్వారానే జరగాలి. రెంతో భాషను ఐచ్ఛికంగా మాత్రమే నేర్పాలి. అయితే ఆ రెండో భాష మామూలు పాఠ్యాంశాలకు నష్టదాయకంగా వుండరాదు. ఏది ఏమైనా త్రిభాషా పథకాన్ని మాత్రం ప్రవేశపెట్టరాదు. నాకు అరడజను భాషలను నేర్చుకోవాలనే ఆసక్తి వుండవచ్చు, అప్పుడు వాడిని నా స్వంత బాధ్యతపై నేర్చుకొంటాను. అంతేకాని వాటిని నిర్బంధంగా మాత్రం ఎవరూ నేర్పరాదు. మాతృభాషద్వారా మాత్రమే విద్యాబోధన జరగాలన్న ఈ చిన్న సమస్యపై కూడా మనం ప్రజాతంత్ర్య ఉద్యమాన్ని నిర్మించడం లేదు.

మీరు పదిలక్షలమంది, లేదా ఇరవై లక్షలమందికి ఇంగ్లీషులో విద్య నేర్పండి. వారు గుమస్తాలుగా, లేదా యితర పరిపాలనా సిబ్బందిగా తయారు కావచ్చు. బ్రిటీషువారు ఇలాగే ప్రజల్లో ఒక తరగతికి ఇంగ్లీషు నేర్పి తమ పబ్బం గడుపుకొన్నారు. అలాగే ఇప్పుడు కాంగ్రెసు ప్రభుత్వం కూడా హిందీనో మరో భాషనో ప్రజలపై రుద్దజూస్తున్నది. శ్రామిక జన సామాన్యం ప్రయోజనాలే మీ దృష్టిలోవుంటే, వారినే విజ్ఞానవంతులను చేయదలుచుకొంటే, వారు తమ హక్కుల కోసం పోరాడేటట్లు చేయాలంటే, అది ఒక్క మాతృభాషద్వారా మాత్రమే చేయడం సాధ్యమవుతుంది.

## యువతరాన్ని తర్ఫీదు చేయండి

ఇవన్నీ చెప్పిన తరువాత, రాజకీయ పార్టీల సంగతలా వుంచండి, మన ప్రజా సంస్థల నాయకులకు ఒక విషయాన్ని గుర్తించవలసిందిగా నేను గట్టిగా చెప్పదలచాను. అదేమంటే; విద్యార్థి సంస్థలను నిర్మించే సమస్యలను తీసుకోకుండా, పెద్ద ఎత్తున విద్యార్థులను విజ్ఞానవంతులను చేసి, వారికి తర్ఫీదునిచ్చే ప్రధాన కర్తవ్యాన్ని నిర్వహించకుండా, మనం



ప్రజాతంత్ర ఉద్యమాన్ని, ప్రజా ఉద్యమాన్ని, ప్రజా సంస్థలను నిర్మించలేము. అదే జరగకపోతే శక్తివంతమైన దేశవ్యాపితమైన ప్రజా ఉద్యమాన్ని గాని, లేదా ఒక విప్లవోద్యమాన్ని గాని మనం ఎన్నటికీ అభివృద్ధి చేయజాలం. ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తించవలసిందిగా నేను మిమ్ములను కోరుతున్నాను.

ప్రజాతంత్ర ఉద్యమమూ, విప్లవోద్యమమూ బలంగా వున్న పశ్చిమబెంగాల్‌లో మనం ఈ మహాసభను జరుపుకొంటున్నాం. బాగానేవుంది. మీలో అత్యధికులు మార్క్సిజం – లెనినిజంను దృఢంగా విశ్వాసించుతున్నారు. మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజం – లెనినిజం వర్తింపజేయడం ఎలాగో మనం నేర్చుకొంటున్నాం. ఇందుకు మార్క్సిస్టు పార్టీ గర్వపడుతోంది. పశ్చిమ బెంగాల్‌లో నాయకత్వంలో వున్న అనేకమంది కామ్రేడ్స్, ప్రజా సంస్థల నాయకులు, పార్టీ నాయకులు ఈ మహాసభకు సౌహార్ద ప్రతినిధులుగా హాజరవుతున్నారు. మీ మహాసభ కార్యకలాపాలను పరిశీలించుతూ మన యువతరం ఏమి వాఛించుతున్నదో, ఏ విధంగా ఆలోచించుతున్నదో అవగాహన చేసుకునేందుకు వారు యత్నించుతున్నారు. ఇందుకు వారిని నేను అభినందించుతున్నాను. అలాగే మీరు కూడా ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుంచకోవాలి. ఇతర ప్రజాసంస్థల, ప్రజానాయకుల, రాజకీయ నాయకుల సహకారం లేకుండా మన విద్యార్థి ఉద్యమం అభివృద్ధి చెందజాలదు. మన యువతరాన్ని సరియైన దృక్పథంలో విద్యావంతం చేసుకొని, వారిని పిన్నవయస్సులోనే రిక్రూట్‌చేసి, విప్లవ కేడరుగా తర్ఫీదు చేసుకోనిదే చైతన్యపూరితమైన ప్రజా సంస్థలను, ప్రజా ఉద్యమాలను, లేదా ప్రజాతంత్ర విప్లవోద్యమాన్ని నిర్మించుకోలేము. ఈ విషయాన్ని గట్టిగా మీ దృష్టికి తీసుకొనిరాదలచాను. ఉద్యమం దానంతటదే రావచ్చు; ఉవ్వెత్తుగా ఒకసారి రావచ్చు, ఆగి ఆగి రావచ్చు. కాని విప్లవ కేడరును తర్ఫీదు చేసుకొని దాన్ని అందుకోలేకపోతే, అది వెనక్కి పోతుంది. ఉద్యమాన్ని కొనసాగించాలన్నా, దాన్ని యింకా ముందుకు తీసుకొనిపోవాలన్నా యువతరానికి శిక్షణ ఇచ్చుకొని తీరాలి.

మళ్ళీ మళ్ళీ అదేపనిగా ఈ విషయాలు నా మనస్సులోకి వస్తూ వుంటాయి. పంజాబు గదర్ నాయకులు గతించారు. కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్, కామ్రేడ్ సతీష్ పక్రాషీలు వెళ్ళిపోయారు. మాలో చాలామందికి వయస్సు మల్లుతోంది. మేము ఇంకా ఎంతకాలం పనిచేయగలం? మాలాంటివాళ్ళం ఇంకో పది ఏండ్లు పనిచేయవచ్చు. నాకు ఇప్పుడు 61వ సంవత్సరం వచ్చింది. ఇంకో 30–40 సంవత్సరాలపాటు నేను పనిచేయగలనని మీరు అనుకుంటున్నారా? అదేమీ లాభం లేదు. ఈ విధంగా మనం పురోగమించలేము. అందువల్లనే నేను ప్రధానంగా మన ట్రేడ్ యూనియన్ నాయకులకు, కిసాన్ నాయకులకు, రాజకీయనాయకులకు, గట్టిగా చెప్పేదేమంటే, యువతరాన్ని రిక్రూట్ చేయండి. వారికి శిక్షణ యివ్వండి. ఇందుకు తగినంత ప్రాధాన్యతనివ్వండి. యువతరాన్నుండి ఒక్కొక్కరు ఒక్కరిని

రిక్రూట్ చేయగలిగినా, మరో 40 ఏండ్లకుపైగా అతను వుద్యమానికి పనిచేయగలడు. ఇదే అందరి ధ్యేయంగా వుండాలి. మనం అలా చేయకపోతే మనముందున్న విప్లవ కర్తవ్యాలను ముందుకు తీసుకొనిపోజాలం.

## కేవలం వాంఛతోనే విప్లవంరాదు

నేను నిరాశావాదినికాదు. విప్లవం అతిదగ్గరలోనే వున్నదని భావించవద్దు. విప్లవం రెండేళ్ళలోనో, అయిదేండ్లలోనోవస్తే అప్పుడు మన సమస్యలన్నీ పరిష్కారంకాగలవు. అయితే, అలాంటి వాగ్దానాలకు నేను గతంలో మన యువ కామ్రేడ్స్‌కు చాలాసార్లు చేసివున్నాను. విప్లవం ఎప్పుడు వస్తుందని అడిగేవారు. అయిదేళ్ళకని, పదేళ్ళకని చెప్పేవాడిని. అయిదేండ్లు గడిచాయి. పదేండ్లూ గడిచిపోయాయి. ఇంక ఎప్పుడు విప్లవం వచ్చేదని కామ్రేడ్స్ అడుగుతున్నారు. 1949లో చైనాలో విప్లవం జయప్రదమైనప్పుడు మనకూ పదేండ్లలో విప్లవం రాగలదని చెప్పాం. ఇప్పటికి 20 ఏండ్లు గడిచిపోయాయి. ఇంక ఇప్పుడు మనం విప్లవాన్ని సాధించడానికి ఇంకా ఎన్ని ఏండ్లు పడతాయి? అని కామ్రేడ్స్ అడుగుతున్నారు. ఇంక ఇప్పుడు మూడేళ్ళలో వస్తుందని నేను చెప్పను. మీ కర్తవ్యాన్ని మీరు నిర్వహించండి. సమయమాసన్నమైనప్పుడు మానకూ విప్లవం రాగలదు. అసలు వాస్తవమేమంటే విప్లవం రావడానికి మనం పోరాడవలసివుంది. అంతర్జాతీయ పరిస్థితులను, జాతీయ పరిస్థితులను పరిశీలనలోకి తీసుకోవలసి వుంటుంది.

వియత్నాం ప్రజలూ, లేదా చైనా ప్రజలు 30 ఏండ్లపాటు అంతర్యుద్ధం సాగించవలసి వుంటుందనుకున్నారా? చైనా విప్లవం సాధించేటప్పటికి అయిదుకోట్ల మందిని త్యాగం చేయవలసి వచ్చింది. చిన్నదైనప్పటికీ వియత్నాం వీరోచితంగా పోరాడి, 20 లక్షల మందికి పైగా తన పోరాటంలో బలిపెట్టితే తప్ప విజయాన్ని సాధించలేకపోయింది. సామ్రాజ్యవాదమూ, ప్రపంచ వ్యవస్థ ఆ రీతిలో వున్నందువల్లనే వియత్నాం ప్రజలు 30 ఏండ్లపాటు అంతర్యుద్ధాన్ని సాగించవలసివచ్చింది. అనేక బాంబులకు గురికావలసి వచ్చింది. అపారమైన కష్టనష్టాలను భరించవలసివచ్చింది. మరి ఈనాటికీ వారు పోరాడవలసి వస్తున్నది. అందువలన ఇవన్నీ కేవలం మనం వాంఛించినంత మాత్రాన జరిగేవికాదు.

## లెనిన్ చెప్పిన విషయం

వాస్తవిక పరిస్థితులను గమనంలోకి తీసుకొని మనం పోరాటాన్ని నిర్వహించాలి. విప్లవాన్ని జయప్రదంగా సాధించుకొన్న తరువాత కూడా నూతన తరం సోషలిజాన్ని నిర్మించుకోవడానికి పోరాడవలసి వుంటుంది. సోవియట్ యూనియన్, చైనాల అనుభవాల నుండి కూడా సోషలిజాన్ని నిర్మించుకోగలగడం అంత సులభమైన విషయమేమీకాదు. ఈ



సందర్భంలో మార్క్సు మహనీయుడు చేసిన హెచ్చరికను గుర్తుకు తెచ్చుకోవడం అవసరం. బూర్జువా వర్గాన్ని అధికారాన్నుండి కూలద్రోసి, రాజ్యాధికారాన్ని కార్మికవర్గం చేబట్టిన తర్వాత కూడా ఒక నూతన సమాజాన్ని నిర్మించుకోవడానికి, ఒక నూతన మానవుణ్ణి తయారు చేసుకోవడానికి చాలా కాలం పట్టవచ్చు. కొన్ని శతాబ్దాలు పట్టవచ్చునని మావో చెప్పారనుకోండి. ఎంతకాలం పడుతుందనేది వేరే విషయం. కామ్రేడ్ లెనిన్ మాత్రం ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాడు. కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించుకొనేంతవరకూ శ్రామికవర్గ నియంతృత్వం కొనసాగవలసిందేనని ఖచ్చితంగా చెప్పాడు. సోషలిజాన్ని సాధించేంతవరకు మాత్రమే శ్రామికవర్గ నియంతృత్వం కొనసాగగలదని ఆయన చెప్పలేదు.

ఇంక ఇప్పుడు విద్యార్థులందరికి నేను మరోసారి ఒక విజ్ఞప్తి చేయదలచాను. మనకు అపారమైన శక్తి సామర్థ్యాలున్నాయి. వాటితోపాటు మనకు అపారమైన బాధ్యతలు కూడా వున్నాయి. మనం చాలా కష్టాలను ఎదుర్కొనవలసి ఉంది. కష్టాలున్నాయన్న సాకుతో మనపైనున్న కర్తవ్యాలను, బాధ్యతలను నిర్వర్తించడాన్ని విస్మరించరాదు. పాలకవర్గాలు మనకు ఎన్ని అవరోధాలను కల్పించినా, పరీక్షలలో, స్కూళ్ళలో, మన చదువుల్లో మనకు ఎన్ని ఇబ్బందులు ఏర్పడినప్పటికీ మన డిమాండ్ల సాధన కోసం, విద్యా విధానాన్ని పునర్వ్యవస్థీకరించడం కోసం పోరాడుతూనే, మరోవైపు మనకుగల అవకాశాల్లోనే, మనకు నేర్పినంతవరకే ఈ విద్యా విధానాన్నుండి సాధ్యమైనంత ఎక్కువ లాభాన్ని పొందేందుకు మనం ప్రయత్నించాలి. ఇందుకు విధిగా కృషిచేయాలి. అందువలన మన విద్యార్థి సంఘ కార్యకర్తలు మొత్తం మీద మన విద్యార్థులంతా ఈ క్రింది విధంగా ఆలోచించాలి: నా క్లాసులో నాకు ఫస్టుమార్కులు రాకపోయినా కనీసం సగటు మార్కులనైనా నేను తెచ్చుకోగలగాలి. ఉన్న పరిస్థితుల్లోనే ఎక్కువెక్కువగా నేర్చుకునేందుకు నేను ప్రయత్నించాలి. లేకపోతే సిగ్గుపడి తలవంచుకోవలసి వుంటుందని భావించాలి. ఉపాధ్యాయుణ్ని నిందించి ప్రయోజనంలేదు; ఈ తప్పుడు ప్రభుత్వాన్ని, ఈ వ్యవస్థను నానాబూతులుతిట్టి ప్రయోజనంలేదు. ఉన్న దుష్టవ్యవస్థను కాదనలేము. ఆ వ్యవస్థపై పోరాడవలసిందే. అందుకు మార్గాంతరంలేదు. అయితే ఈవ్యవస్థకు బానిసకారాదు. ఇలాంటి వ్యవస్థ వుందిగాబట్టి నేను అజ్ఞానిగా వున్నాననీ, ఈ వ్యవస్థ మూలంగానే నాకు సున్నా మార్కులు వచ్చాయనీ, లేకపోతే ప్రతి క్లాసులోనూ నాకు ఫస్టు మార్కులు వచ్చివుండేవని సంతృప్తిపడి కూర్చుంటే ప్రయోజనంలేదు. ఈ సాంఘిక వ్యవస్థ ఇలాంటిది కాబట్టి నాకు సరియైన అవకాశాలులేవు; ఉపాధ్యాయుడు నాకు సరిగా శిక్షణ యివ్వడంలేదు; నాకు ఇతర సౌకర్యాలులేవు, ఆహారం సరిగా లేక కడుపు కాలిపోతున్నది, చదువుకొనేందుకు నా గుడిసెలో లాంతరులేదు – ఇలా సాకులు చెప్పుకొంటే లాభంలేదు. ఈ ఇబ్బందులన్నీ ఉన్నప్పటికీ, నేను వీటన్నింటినీ అధిగమించగలను నేను సమాజానికి ఉపయోగపడే పౌరుడుగా తయారుకావాలి. నా శక్తి సామర్థ్యాలన్నీ సంపూర్ణంగా ఉపయోగపడేలా చూడాలి. ఇలాంటి దృఢ సంకల్పంతో, ఇలాంటి

దీక్షతో మన సంఘటిత విద్యార్థులూ, వుద్యమంలో వున్న విద్యార్థులూ, అగ్రగామిగావున్న మన విద్యార్థులు పని చేయాలి.

## పదండి! ముందుకు పదండి!!

మన విద్యార్థులు ముందుకు మునుముందుకే సాగిపోవాలని నేను కోరుతున్నాను. మీ ఆర్థిక కోర్కెల కోసం పోరాడండి. మీ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోండి. పోరాటానికి సన్నద్ధమవ్వండి. ఇతర ప్రజాతంత్ర విద్యార్థి సంఘాలతో చేతులు కలపండి. అలాగే తోటి విద్యార్థులతో మమేకంకండి. నేడు సోషలిస్టుల, మితవాద కమ్యూనిస్టుల, కాంగ్రెసు తదితర రాజకీయ పార్టీల ఆధ్వర్యానగల విద్యార్థులందరితో ఏకంకండి. వారంతా ప్రజాతంత్ర జీవితపద్ధతులకూ, హేతువాద దృష్టికి, శాస్త్రీయ దృక్పథంతో కూడిన జీవితానికీ మత ప్రసక్తిలేని సెక్యులర్ జీవిత లక్ష్యానికి ఆకర్షించబడేట్లు చూడండి. ఇందులో మన విద్యార్థి సంస్థ ముందుభాగాన నిలబడి పనిచేయాలి. భవిష్యత్తులో పనిచేసే కేడరుగా యువతరాన్ని తర్ఫీదుచేయండి.

పాత తరానికి చెందిన మేము మా అనుభవాన్ని మీకు అందజేయలేకపోతున్నాము. నిజమే! ఈ విషయాన్ని మరోసారి మీకు చెప్పదలచాను. 50–70 సంవత్సరాలపాటు విప్లవానికి తమ జీవితాలను అంకితంచేసి పోరాడిన మన విప్లవ మహాయోధుల అమూల్యమైన సాంప్రదాయాల్లో యువ కామ్రేడ్స్‌కు మేము శిక్షణ యివ్వలేకపోతున్నాము. అలాగే విద్యార్థి కేడరును అభివృద్ధి చేసుకోవడంలో కూడా తగినంత శ్రద్ధ తీసుకోవడంలేదు. విద్యార్థి కేడరు అని నేనన్నప్పుడు మామూలుగా వారంతా మేధావులనీ, పై తరగతులకు చెందినవారనే భావం మొత్తంమీద వుంది. అది సరికాదు. అదంతా పాత విషయం. నేడు చాలామంది విద్యార్థులు కార్మికవర్గం నుండి, రైతాంగం నుండి, శ్రామిక మధ్యతరగతుల నుండి వస్తున్నారు. విద్యార్థులు పై వర్గాల నుండి వస్తేమాత్రం తప్పేముంది? అదృష్టమనండి, దురదృష్టమనండి, నేను పుట్టేముందే నా తల్లిదండ్రులుగా ఎవరుండాలో ఎన్నిక చేసే అవకాశం నాకు లేదు కదా! ఇంక పుట్టిన తరువాత నేను శ్రామిక ప్రజల పక్షాన నిలబడాలో, లేక దోపిడీదార్లకు మద్దతుగా నిలబడాలో నిర్ణయించుకునే అవకాశం వుందికదా. అందువలన విద్యావంతులైన విద్యార్థులంతా ముందుకొచ్చి శ్రామిక ప్రజల ప్రయోజనాలకోసం, స్వాతంత్ర్యంకోసం, ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం పోరాడేందుకు సిద్ధం కావాలి.

నేను ఇంకెంతమాత్రం మీ సమయాన్ని తీసుకోదలచలేదు. తీర్మానాలు మీ ముందున్నాయి. వాటిని మీరు చర్చించండి. అందువలన ఎలాంటి విద్యా విధానం కావాలి?



ఎలాంటి పరీక్షావిధానం వుండాలి? ఎలాంటి డిమాండ్లను రూపొందించాలి? మొదలుగాగల వివరాల్లోకి నేను వెళ్ళను.

## చివరి మాట

చిట్టచివరికి మరోసారి మీకు నా విజ్ఞప్తి ఏమంటే; మన కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్, కామ్రేడ్ సతీష్ పక్రాషీ, కామ్రేడ్ చీమా తదితర విప్లవ యోధుల జీవితాలను సదా మీ మనస్సులో వుంచుకోండి. ప్రతి రాష్ట్రంలోను విప్లవకారులున్నారు. వారి ఆదర్శప్రాయమైన విప్లవ జీవితాలను మననం చేసుకుంటూ వుండండి. ఎన్ని ఇబ్బందులైనా ఎదురవనీయండి, ఆశాభంగాలు కలుగనీయండి, ఏమైనప్పటికీ మీ ఆదర్శానికి కట్టుబడే వుండండి. ఆ విప్లవ మహాయోధుల వ్యక్తిగత జీవితాలను, జైళ్ళలో వున్నప్పుడు వారు ఎలా ప్రవర్తించిందీ, అలాగే ఆ కామ్రేడ్స్ చిరునవ్వులతో వురికంబాలను ఎక్కిన మహత్తర ఘటనలను – అలా యీ విప్లవకారులందరినీ సదా మీ దృష్టిలో వుంచుకోండి. వారేమీ ఆకాశాన్నుండి వూడిపడిన అసాధారణ శక్తులుగల మనుష్యులేమీకాదు. మనందరివలే వారంతా సాధారణమైన మనష్యులే. వారి జీవిత చరిత్రలను చదవండి. వారెలా పోరాడారో, ఎన్నిబాధలు పడుతూ ముందుకు సాగిపోయారో – వాటన్నింటినీ తెలుసుకొని వుత్తేజం పొందండి. వారు అంత దీక్షతోను, అంత ధైర్యసాహసాలతోనూ పోరాడారంటే, మనమూ పోరాడగలం. అయితే ఒక నూతన సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యం మన మనస్సుల్లో వుంచుకొంటే మనకూ ఆశక్తికలుగుతుంది. తమ జీవితాలను శ్రామికుల రాజ్యస్థాపనకై అంకితంచేసిన మనవృద్ధ విప్లవ యోధులైన ముజఫర్, పక్రాషీ, చీమాలను మనం అనుసరించుదాం. ఈ లక్ష్యాలు మీ ముందుంచుకొని, మీ జీవితాలను తీర్చిదిద్దుకోవాలనీ, అందుకనుగుణ్యంగా మీ కార్యకలాపాలని సరిదిద్దుకోవాలని పదే పదే మిమ్ములను కోరుతున్నాను.

# గంగా - కావేరి కాలువ నిర్మాణ పథకం

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గత పాతిక సంవత్సరాలుగా భారత ప్రభుత్వం, దేశంలోని నీటి వనరులను దారుణంగా నిర్లక్ష్యం జేస్తూవుంది. తత్ఫలితంగా దేశంలోని విశాలమైన ప్రాంతాలు కరువు కాటకాలకు లోనవుతున్నాయి. కోట్లాది ప్రజలు కరువు వాతబడుతున్నారు ఆకలి చావులు సంభవిస్తున్నాయి. ఈ విషయంలో దారుణమైన తన నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకొనడం కోసం అధికార కాంగ్రెస్ ఈనాడు దేశంలో పెద్ద ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది.

"మన దేశ విస్తీర్ణంలో మూడోవంతు అనావృష్టికి గురైంద"ని కాంగ్రెస్ పాలకులు యిప్పుడంటున్నారు. అందులో 88 జిల్లాలు, జిల్లాల భాగాలూ వున్నాయి. ఒకకోటి యాభై లక్షల మంది ప్రజలు పదేపదే కరువు కాటకాలకు ఎర అవుతున్నారు. ఈ కాటకాలను అరికట్టటంకోసం ఈ శతాబ్దం చివరకు అనగా మరొక ముప్పై సంవత్సరాల నాటికి గంగా–కావేరి కాలువతో కూడిన "జాతీయ జలగ్రిడ్"ను ఏర్పాటు జేయటాన్ని గూర్చి పెద్ద పెద్ద కబుర్లు చెపుతున్నారు.

ఈ గంగా–కావేరి నదులను కలిపే పథకానికి సుమారు మూడువేల కోట్ల రూపాయల వ్యయమవుతుందని శ్రీ కె.ఎల్. రావుగారంటున్నారు. పాట్నా వద్ద గంగా జలాన్ని 150 అడుగుల నుండి 13 వందల అడుగుల ఎత్తువరకు పైకి పంప్‌చేసి నర్మదానది రిజర్వాయరులోకి పంపేందుకుగాను ఏడువేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి కూడా అవసరమవుతుంది. ఆ ప్రాజెక్టుకవసరమైన విద్యుచ్ఛక్తి వ్యయాన్ని ఆ ప్రాజెక్టు వ్యయంలో చేర్చలేదు. గంగా – కావేరీ కాలవ పథకానికవసరమయ్యే విద్యుచ్ఛక్తి క్రింద ఏడువేలకోట్ల రూపాయలు వ్యయమవుతుందని ఆయన సహచరుడగు మరొక ప్రముఖ ఇంజనీరు శ్రీ జి.ఎ. నరసింహా రావు అంచనా వేశారు. అసలు ఈ పథకాన్ని అమలు జరపటానికంటూ పూనుకుంటే, అది పూర్తయ్యేనాటికి వాస్తవ వ్యయం ఈ అంచనాకు కనీసం మూడు రెట్లయినా అవుతుంది.

## సాధ్యంకానిదేదీ లేదు, అయితే...

ఈ గంగా కావేరి కాలువ సాంకేతికంగా ఆచరణసాధ్యమే. అయితే, దానిపై యింకా అధ్యయనం చేయవలసిన అవసరం, దానిని తీర్చిదిద్దవలసిన అవసరం వుంది. జలాధారాలు,



సాంకేతిక లక్షణాల ఫలితంగా తలెత్తే అవసరాలు, నీటిని పంప్ చేయటం కోసం చవుకగా విద్యుచ్ఛక్తి అందుబాటులో వుండటం మొదలగు వాటిని గూర్చి సమగ్రమైన దర్యాప్తు జరిపిన మీదటనే ఆ పథకం ఆర్థికంగా ఆచరణ సాధ్యమవునా కాదా అనే విషయాన్ని నిర్ణయించవచ్చు" అని ఐ.రా.స.కు సంబంధించిన నిపుణుల బృందం అభిప్రాయం వెలిబుచ్చింది.

అధునాతన ఇంజనీరింగు పరిజ్ఞానంతో యెలాంటి పథకమైనా ఆచరణ సాధ్యమేనని మాదృఢమైన అభిప్రాయం. ఆర్థికంగా అవెంతటి వ్యయప్రయాసలతో కూడుకున్నవైనా సాధారణ వాడకానికి, వ్యవసాయానికీ, పరిశ్రమలకూ, యితర ప్రజావసరాలకూ ప్రాధాన్యత నివ్వవలసివుంది.

ఈ ప్రాజెక్టుపై మా విమర్శ మరో దృక్కోణం నుండి వుంది. అదేమంటే వ్యవసాయానికి, ప్రజల యొక్క యితర అవసరాలు తీర్చటానికి నీటి సరఫరాకు గూర్చి యీ ప్రభుత్వానికి పట్టదు. చేతిలోవున్న పథకాలను సైతం నిర్లక్ష్యంజేస్తూ, బ్రహ్మాండమైన పథకాలను గూర్చి పెద్దపెద్ద కబుర్లు చెబుతోంది. బృహత్తర పథకాలను గూర్చి ఈ విధంగా వొట్టి కబుర్లు చెప్పి ప్రజలను మోసగించే బదులు, నిర్మాణంలోవున్న ప్రాజెక్టులను పూర్తిచేయటానికి చర్యలు తీసుకుంటే ప్రజలలో దాని పరపతి పెరుగుతుంది.

గంగానది నుండి మూడువేల కిలోమీటర్ల దూరానగల కావేరికి జలాలను తరలించే ప్రతిపాదన చేపట్టేముందు – మన దేశంలోని ఒక్కొక్క ప్రాంతంలోని అన్ని నదుల జలాలను, లేదా ఒక్కొక్క నదీలోయ ప్రాంతంలోని పారుదల నీటిని, భూగర్భజలాన్ని వినియోగానికి తెచ్చే పథకాలన్నింటినీ ప్రభుత్వంచేబట్టడం అవసరం. తమకు అవసరమైన నీరు లేకుండా చేసి, ఎక్కడో దూరాన వున్న వాళ్ళ కోసం అందజేయబోతున్నారన్న అనుమానాలు ఆయా నదీలోయ ప్రాంతాల్లో నివసించే ప్రజలలో రేకెత్తించటానికే యిలాంటి పనిలేని పథకాలను గూర్చిన కబుర్లు దారితీస్తాయి.

ఈ విషయంలో ప్రభుత్వం ఆచరణలను పరిశీలిద్దాం.

సింధునదీ జలాల వినియోగం విషయమై పాకిస్తాన్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం, రావి, బియాస్, సట్లెజ్ ఉపనదుల జలాలను పూర్తిగా ఉపయోగించుకునేందుకు భారత ప్రభుత్వానికి పూర్తి హక్కులున్నాయి. అయినా అందుకవసరమైన ప్రాజెక్టుల నిర్మాణం జరగలేదు. రావినదిపై వందకోట్ల రూపాయల వ్యయంతో నిర్మించవచ్చునని అంచనా వేయబడిన థీయిన్ ఆనకట్టను గత ఇరవై సంవత్సరాలుగా ప్రారంభించనయినా లేదు. కాని ఆ ఒప్పందం ప్రకారం పాకిస్తాన్ తన ప్రాజెక్టులు పూర్తిచేసుకొనటానికి తోడ్పడే నిమిత్తం భారత ప్రభుత్వం నూటయాభైకోట్ల రూపాయలు చెల్లించింది. రూ. 350 కోట్ల వ్యయంతో ముప్పై లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కల్పించగలదని అంచనా వేయబడిన

బియాన్ – సట్లెజ్ లింక్సు 1961లో ప్రారంభించబడినప్పటికీ 1980 చివరనో, ఆ తర్వాతనోగాని పూర్తయ్యేటట్లులేదు.

## నేడున్న ప్రాజెక్టుల గతి

రాజస్థాన్‌లో నిరంతరం అనావృష్టికి గురవుతున్న ప్రాంతాలకు జెందిన దాదాపు ముప్ఫై లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కల్పించగలదని అంచనా వేయబడిన రాజస్థాన్ కాలువను 1958లో ప్రారంభించారు. అయినా దాని ప్రథమ దశ 1990లో మాత్రమే పూర్తవుతుందని ఆశిస్తున్నారు. ఇక రెండవ దశ బహుశా ఈ శతాబ్దం అంతానికేమయినా పూర్తవుతుందేమో!

బీహారులో కోసీ ప్రాజెక్టు, దాని కాలువల నిర్మాణం 1957లో ప్రారంభమైంది. దానివల్ల కోసీ వరదలను అదుపులో పెట్టవచ్చుననీ, 25 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కల్పించవచ్చుననీ భావించబడింది. ఆ ప్రాజెక్టు రూ. 75 కోట్లకు పైగా వ్యయం అవుతుందని అంచనా వేయబడింది. అయినా ఆ ప్రాజెక్టు, దాని క్రింద కాలువలు యింకా పూర్తికాలేదు. రూ. 160 కోట్ల వ్యయంతో 35 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కల్పించవచ్చునని అంచనా వేయబడిన గండక్ ప్రాజెక్టు 1960లో ప్రారంభించబడింది. అయినా 1980 తర్వాత ఎప్పుడో పూర్తవుతుందని భావించబడుతున్నది.

గుజరాత్‌లో తాపీ నదిపై కాక్రవరా, ఉకయ్ ప్రాజెక్టులు 1949లో ప్రారంభమైనాయి. రూ. 125 కోట్ల వ్యయంతో నిర్మించవచ్చునని, పది లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కలుగుతుందని అంచనావేయబడిన ఈ ప్రాజెక్టులు 1980లో పూర్తవుతాయని ఆశించబడుతున్నది. మహీ ప్రాజెక్టు రెండు దశలూ పూర్తయితే ఏడులక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కలుగుతుందనీ, అందుకు రూ. 50 కోట్లకు పైగా వ్యయమవుతుందనీ అంచనా వేయబడింది. ఈ ప్రాజెక్టు 1948లో ప్రారంభించబడింది. 1975లో పూర్తవుతుందని ఆశిస్తున్నారు.

గత రెండు దశాబ్దాలుగా గుజరాత్, మధ్యప్రదేశ్‌ల మధ్య వివాదంలో వున్న నర్మదా నదిపై ప్రాజెక్టును దేనినీ చేపట్టటమే జరగలేదు. రూ. 15–200 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేయబడిన నవగామ్ ప్రాజెక్టు ఒక్కటే 20 లక్షల ఎకరాలకు నీరందించగలదని తలచబడుతున్నది. రూ. 40 కోట్ల వ్యయంతో 8 లక్షల ఎకరాలకు నీరందించే తావా పథకం 1962లో ప్రారంభించబడింది. అది 1975లో పూర్తవుతుందని ఆశించబడుతోంది.

మహారాష్ట్రలో మొత్తం పంట భూమిలో నూరింట ఎనిమిది వంతులకు మాత్రమే నీటిపారుదల సౌకర్యాలున్నాయి. ఆ రాష్ట్రంలో ప్రజలు ఈనాడు భీకరమయిన కరువుకు గురవుతున్నారు. అలాంటిచోట రూ. 175 కోట్ల వ్యయంతో, 15 లక్షల ఎకరాలకు నీటి



పారుదల సౌకర్యం కలుగజేయగల ప్రాజెక్టులు 1964లో చేపట్టబడినా 1980 నాటికి పూర్తికాగలదని ఆశిస్తున్నారు.

చాలా జిల్లాలు అనావృష్టితో అవస్థపడుతున్న మరొకరాష్ట్రం మైసూర్. ఆ రాష్ట్రంలో 1945లో ప్రారంభించబడిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తికాలేదు. ఈ ప్రాజెక్టుల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం కలుగుతుంది. రూ. 130 కోట్ల వ్యయం కాగల ఈ ప్రాజెక్టు వల్ల మైసూర్‌లో 9 లక్షల ఎకరాలకు ఆంధ్రప్రదేశ్‌లో 4 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది. అదే విధంగా 1949లో ప్రారంభించబడిన రూ. 55 కోట్ల ఘప్రభ ప్రాజెక్టు 1947లో ప్రారంభించబడినా రూ. 35 కోట్ల భాద్రా ప్రాజెక్టు ఇంకా పూర్తికాలేదు. అవి పూర్తయితే వాటివల్ల 2 1/2 లక్షల ఎకరాలకు లాభం చేకూరుతుంది. రూ. 70 కోట్లు వ్యయమయ్యే మలా ప్రభ ప్రాజెక్టువల్ల మూడు లక్షల ఎకరాలకు, రూ 75 కోట్లు వ్యయమయ్యే ఎగువ కృష్ణా ప్రాజెక్టు మొదటి దశవల్ల ఆరు లక్షల ఎకరాలకు ప్రయోజనం కలుగుతుంది. వాటిని 1964లోగాని ప్రారంభించలేదు. అందులో మలాప్రభ ప్రాజెక్టు 1980లో పూర్తవుతుందని భావింపబడుతున్నది. రెండోది ఎప్పుడు పూర్తయ్యేది ఎవరికీ తెలియదు. ఎగువకృష్ణా ప్రాజెక్టును మొత్తంగా చేపట్టి పూర్తిజేసేట్లయితే 22 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం లభించగలదని ఆశించబడుతున్నది.

## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుల పరిస్థితి

ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు 1955లో ప్రారంభించబడింది. అయినా దాని మొదటిదశ 1980లోగాని పూర్తిగాదు. రెండవ దశ, మూడవదశ మంజూరైనా కాలేదు. ఈ ఒక్క ప్రాజెక్టువల్లనే 35 లక్షల ఎకరాలకు నీరు లభిస్తుంది. రూ. 250 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేయబడుతున్నది. తూర్పుగోదావరి నదిపైనగల రామపాదసాగర్, ఇచ్చంపల్లి, బృహత్తర పోచంపాడు ప్రాజెక్టులకు నదీజలాల విషయంలో రాష్ట్రాల మధ్య వివాదం ఫలితంగా ఆటంకం కలిగింది.

ఒరిస్సాలో హిరాకుడ్ ప్రాజెక్టు 1948లో ప్రారంభించారు. ఐనా అది యింకా పూర్తికాలేదు. రూ. 70 కోట్ల వ్యయంతో 17 లక్షల ఎకరాలకు నీరందించే మహానది డెల్టా కాలువల వ్యవస్థ నిర్మాణాన్ని 1955లో ప్రారంభించినా అది ఇంకనూ పూర్తికాలేదు.

దృష్టిలో వుంచుకోవలసిన మరొక ప్రధానాంశమేమంటే, ఇవన్నీ కూడా ప్రధానమైన ఆనకట్టలకు కాలువలకు సంబంధించినవే. పొలాలలో కాలువలుత్రవ్వి, ఆ ప్రాజెక్టుల జలాలను పూర్తిగా ఉపయోగించుకొని ఆయకట్టును అభివృద్ధి జేయటానికి మరో పది నుండి యిరవై సంవత్సరాల వరకూ పడుతుందని అధికారులు చెబుతున్నారు.

1974లో నాలుగో ప్రణాళిక అంతమయ్యే నాటికి ప్రభుత్వం పెద్దతరహా, మధ్యతరహా, చిన్నతరహా ప్రాజెక్టులపై రూ. 4300 కోట్లు ఖర్చుచేసి వుండవలసిందని, అందువల్ల 1950-51లో నీటిపారుదల సౌకర్యం గలిగియున్న ఐదున్నర కోట్ల ఎకరాలకు తోడు మరో 2 1/2 కోట్ల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం లభించేదని ప్రభుత్వం ఇరిగేషన్ కమిషన్ 1972లో తన నివేదికలో పేర్కొన్నది.

నాలుగవ ప్రణాళికకు ముందు ప్రారంభించబడిన ప్రాజెక్టులకు మరో రూ. 1200 కోట్లు అవసరమని, అవన్నీ 1980 నాటికి పూర్తవుతాయని, నాలుగవ ప్రణాళికలోను, ఆ తర్వాత ప్రణాళికలోనూ కొత్త ప్రాజెక్టులనేకం చేబడుతున్నామని కూడా అదే నివేదికలో పేర్కొనబడి వుంది.

అయితే మొత్తం సాగులోవున్న భూమి 35 కోట్ల ఎకరాలుకాగా అందులో 21 శాతానికి మాత్రమే నీటి పారుదల సౌకర్యం కలదని కూడా అందులో పేర్కొన్నారు. అందులో రాష్ట్రాల వారీగా, నదీలోయలవారీగా ఇరిగేషన్ ప్రాజెక్టుల జాబితా ఒకటిచ్చింది. ఈ శతాబ్దం అంతమయ్యే లోగానయినా వాటిని పూర్తిజేయడంపట్ల ప్రభుత్వం శ్రద్ధ వహించాలని కోరింది. వాటిని పూర్తి చేసేట్లయితే దేశం మొత్తం మీద సాగులోవున్న భూమిలో సగభాగానికి నీటిపారుదల సౌకర్యాలు లభించగలవనీ, అప్పటికీ ఎప్పుడూ వర్షాభావం వుండే ప్రాంతాలలోగల సాగుభూమిలో నాలుగోవంతుకు మాత్రమే నీటిపారుదల సౌకర్యం లభిస్తుందని కూడా ఇరిగేషన్ కమిషన్ పేర్కొన్నది. ప్రస్తుత ధరవరల ప్రకారం ఈ ప్రాజెక్టులన్నింటికీ కలసి పదివేల కోట్ల రూపాయల వ్యయమవుతుందని కమిషన్ అంచనావేసింది.

కమిషన్ ఈ ప్రాజెక్టుల జాబితాలో గంగా – కావేరీ పథకాన్నిగాని జాతీయ జలగ్రిడ్‌కు చెందిన యితర లింకు కాలువలనుగాని చేర్చలేదు. అయితే అది ఆ పథకాలను, ఆ గ్రిడ్‌లో భాగంగా సూచించబడిన లింకప్ కాలువలను ప్రశంసించింది.

అయితే గొట్టపుబావుల ద్వారాను, తదితర అనేక పథకాలద్వారాను భూగర్భజలాలను వినియోగించుకోవలసిన ఆవశ్యకతనుగూర్చి కమిషన్ నొక్కిచెప్పింది. ఈ గొట్టపుబావులకు విద్యుచ్ఛక్తి సరఫరాచేయడం కోసం గ్రామాలకు పెద్ద ఎత్తున విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి, గ్రామాలలోని రైతులకు వారి పొలాలలో విద్యుచ్ఛక్తిని అందజేయటానికి అయ్యే వ్యయాన్ని పై అంచనాలో చేర్చలేదు.



## ప్రజల దృష్టిని మరల్చే ఎత్తుగడ

స్వాతంత్ర్యం వచ్చిన పాతిక సంవత్సరాల తర్వాత పరిస్థితి ఇలావుంది. ఇరవై ముప్పైకోట్లు వ్యయమయ్యే ప్రాజెక్టును సయితం యీ ప్రభుత్వం రెండు దశాబ్దాలలోపు కాలంలో పూర్తిచేయలేకపోయింది. కరువుప్రాంతాలలో అత్యవసరమైన ప్రాజెక్టులను సయితం అది నిర్లక్ష్యం చేసింది. నదీజలాల విషయంలో రాష్ట్రాలమధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించలేకపోయింది. ఒక నదీలోయకో, ఒక రాష్ట్రానికో పరిమితమైన ప్రాజెక్టులనే చేపట్టలేకపోయింది. అలాంటి ప్రభుత్వం జాతీయ జలగ్రిడ్‌ను గూర్చి మాట్లాడటం పదివేల కోట్ల రూపాయల వ్యయంతో మరో ముప్పై సంవత్సరాలకుగాని పూర్తిజెయ్యటానికి సాధ్యంకాని గంగా-కావేరి కాలువ వంటి పథకాలను గూర్చి కబుర్లుచెప్పటం త్రాగటానికీ, వ్యవసాయానికీ అత్యవసరమైన నీటి సరఫరాకోసం తక్షణమే అవసరమైన, ఆచరణ యోగ్యమైన ప్రాజెక్టులనుండి ప్రజల దృష్టిని మరల్చటానికుద్దేశించిన ఎత్తుగడ తప్ప మరేమీకాదు.

దిగువ గంగానదీ లోయప్రాంత ప్రజలకు నీళ్ళు లేకుండా చేయబోతున్నారని, ఆ ప్రాంతమంతా ఎందుకూ కొరగాకుండా చేయపోతున్నారనీ యిప్పటికే ఆందోళన ప్రారంభమైంది. దిగువ గంగా ప్రాంతంలోని పట్టణాలు, నగరాలు, కలకత్తాతోసహా నీటికొరతనెదుర్కొనవలసి వస్తుంది.

## అప్పుడే వస్తున్న ప్రశ్నలు

గంగా – కావేరి పథకానికి తమ సమ్మతి తెలుపటానికి ముందే, తమతమ రాష్ట్రాలకు ఎంత నీరు అందించగలిగేది స్పష్టం చేయవలసిందిగా మైసూరు, తమిళనాడు కోరాయి.

గంగానదిలో నీరు అదనంగా వుంటే దాన్ని దక్షిణాదికి తరలించవలసిన అవసరమేమిటి? రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతాలను సాగుజేయడానికి ఆ నీటినెందుకు ఉపయోగించకూడదు? గంగానదిలోని మిగులు నీటినంతటినీ గంగానది లోయలోనో వివిధ రిజర్వాయర్లలో ఎందుకు నిల్వచేయకూడదు? గంగానది లోయలోని పశ్చిమ భాగానికి నీటిని పంప్‌చేసి మొత్తం గంగానది లోయకంతకూ సంవత్సరం పొడవునా నీటినందించటంగాని, కనీసం ఒక్కపంటకయినా నీటినందించటంగాని ఎందుకు చేయగూడదు? బ్రహ్మపుత్ర – గంగా, కృష్ణా – గోదావరి వంటి దగ్గర దగ్గర నదులను కలిపే పథకాలనెందుకు చేపట్టకూడదు? ఋతుపవనాలవల్ల కురిసే వర్షాధారంగా గల నదులకు జూన్-సెప్టెంబరు మధ్య కాలంలో నీటిని అందజేయడంకోసం, పడమటి కనుమలలో నీటిని నిల్వజేసే రిజర్వాయర్ల నెందుకు

ఏర్పాటు జేయగూడదు? సాగుచేయడంకోసం. చవుడుబారిపోకుండా అరికట్టటంకోసం అవసరమైనమేరకు పశ్చిమ తీరానికి మిగిల్చి మిగతానీటిని కృష్ణా లోయలోని వర్షాభావ ప్రాంతాలకు ఎందుకు పంపించగూడదు? ఈ ప్రాజెక్టులను, ఈలింకులను పూర్తిజేయకముందే గంగా–కావేరీ కాలువవంటి దీర్ఘకాలిక పథకాలను గూర్చి మాట్లాడటమెందుకు? – మొదలుగాగల పలు అభ్యంతరాలు లేవనెత్తబడుతున్నాయి.

కాంగ్రెసు ప్రభుత్వం స్వార్ధపర వర్గాలతో ముడిపెట్టుకుని వుంది. అందువల్ల ప్రజానీకంలోని అత్యధిక సంఖ్యాకులయిన 90 శాతం ప్రజల ప్రయోజనాలకు అనుగుణమైన ఆర్థిక ప్రణాళికను మొత్తం దేశ ప్రయోజనాల దృష్టితోగాని; పరిశ్రమలు, విద్యుచ్ఛక్తి, ఇరిగేషన్, విద్య, ఆరోగ్యం, సాంఘిక సేవలవంటి వాటిని ఏ ఒక్క రంగంలోగాని రూపొందించజాలదు. దాని ప్రణాళిక అత్యంత శక్తివంతమైన స్వార్ధపర వర్గాల ప్రయోజనాల కనుగుణంగా వుంటుంది. అందువల్ల వారి ప్రణాళికలు నాలుగూ గుత్త పెట్టుబడిదారీ శక్తులు మరింత పెరగటానికి, ప్రాంతీయ అసమానతలు మరింత అధికమవటానికి, ప్రాంతీయ విద్వేషాలను మరింత వుధృతం జేయటానికి దోహదపడ్డాయి. నీటిపారుదల సౌకర్యాల విషయంలో కూడా ఇది కొట్టవచ్చినట్లు కనిపించుతోంది.

## వృధా అయిపోతున్న జలసంపద

1. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పాతిక సంవత్సరాలుగా నదీజలాల విషయంలో రాష్ట్రానికి–రాష్ట్రానికి మధ్య సాగుతున్న వివాదాలను పరిష్కరించటానికి ఈ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయింది. నదీజలాల కేటాయింపు విషయంలో ఎవరికి ప్రాధాన్యత నివ్వాలనే విషయంలో ఎలాంటి సూత్రాన్ని నిర్దేశించలేదు. అందువల్ల, వివిధ నదీలోయల వారీగా పథకాలనది చేపట్టజాలదు! ఈలోగా ఒక రాష్ట్రానికి – మరొక రాష్ట్రానికి, మధ్య ఒక ప్రాంతానికి – మరో ప్రాంతానికి, ఒక జిల్లాకు – మరో జిల్లాకు మధ్య విద్వేషాలు వుధృతమవుతాయి. కోట్లాది ఎకరాల నేలకు, కోటానుకోట్ల ప్రజలకూ నీరు లభ్యంగాక అవస్థపడుతుండగా, ఆకలిదప్పులతో అలమటిస్తుండగా నదీజలం సముద్రం పాలైపోతున్నది.

2. నదీజలాల వినియోగం విషయంలో ముందువెనకలకు నిర్ణయించడం ఈ ప్రభుత్వం వల్లకాదు. విస్తారమైన ప్రాంతాలలో ఒక్క పంటకైనా నీరందజేయటానికి, కొన్ని ప్రాంతాలలో రెండవ పంటకు నీరందజేయడానికి కనీసంగా అవసరమైన ఇరిగేషన్ ప్రాజెక్టులు లేకుండాజేసి, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి పేరుతో నీటిని వృధాగా సముద్రంపాలు గావిస్తున్నది. నీటిని యెక్కువగా వినియోగించుకునే వరి, చెఱకు వంటి పంటలకు నీటిని వాడుకోనిస్తోంది.



అదే ప్రాజెక్టుల క్రింద విస్తారమైన ప్రాంతాలలో తక్కువ నీటితో సరిపెట్టుకునే స్వల్పకాలిక పంటలకైనా నూనెగింజలు, తృణధాన్యాలవంటి పంటలకైనా నీరు లభించటంలేదు. అనావృష్టి బారినుండి వెసులుబాటు కల్పించే పథకాలకుగాని, మెట్ట ప్రాంతాల్లో నీటిపారుదల సౌకర్యాలు కల్పించటానికిగాని ప్రాధాన్యత నివ్వటంలేదు. కాలువలకు లైనింగ్ వేయటం ద్వారా, టన్నెలింగ్ వేయటం ద్వారా నీరు వృధాగాకుండా అరికట్టేందుకు డబ్బు ఖర్చుచేయటానికి సిద్ధంగా లేదు.

అవసరమైన మరమ్మత్తులు చేయటం ద్వారా, తగినంతగా మురుగునీటి పారుదల సౌకర్యాలు ఏర్పాటు చేయటం ద్వారా నీటిపారుదల సౌకర్యం వున్న ప్రాంతానికి రక్షణ కల్పించటానికిగాని, వరదల నరికట్టటానికిగాని అవసరమైన ప్రాధాన్యత నివ్వటంలేదు.

బలవంతులైన స్వార్ధపర వర్గాల ఒత్తిడికి మోకరిల్లటమే దీనికంతటికీ కారణం. స్వార్థపరవర్గాలు మరింత బలంగావున్న కొలదీ నీటిని సక్రమంగా వినియోగించటం నుండి ప్రభుత్వం మరింత దూరంగాపోతున్నది.

నీటిని వినియోగించటం, నీటిపారుదల, మురుగునీటి పారుదల, వరదల నివారణ పథకాలను గూర్చి ఇరిగేషన్ కమిషను, అంతకుముందు అనేకమంది ఇంజనీర్లు, వ్యవసాయ నీటిపారుదల నిపుణులు సహేతుకమైన, శాస్త్రీయమైన అనేక సూత్రాలను సూచించారు. అయినా ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యంజేసింది.

## సహేతుకమైన సూత్రాలు

అందువల్ల దిగువచర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నాం.

1. గంగా – కావేరి కాలువవంటి పథకాలను ప్రభుత్వం విరమించుకోవాలి. ఇప్పటికే ప్రారంభమైన ప్రాజెక్టులను పూర్తిచేయటంమీద కేంద్రీకరించాలి.

2. అన్ని రాష్ట్రాలలోనూ నదీలోయ, నీటిపారుదల, వరదల నివారణ, మురుగునీటి పారుదల పథకాలను దర్యాప్తుజేయటం పూర్తిజేసి మంజూరుచేయాలి. తరచు కరువుకాటకాలకు గురయ్యే ప్రాంతాలకు ప్రాధాన్యతనివ్వాలి. ఒకటి రెండు దశాబ్దాలలో వాటిని పూర్తిజేయటానికి ఆర్థిక, సాంకేతిక ఏర్పాట్లుచేయాలి. ప్రతి రాష్ట్రంలోనూ ఏ ప్రాజెక్టు ముందు. ఏది వెనుక అనే విషయం నిర్ణయించాలి. ప్రతి ప్రాజెక్టు పూర్తవటానికి గడువు నిర్ణయించాలి.

3. నదీలోయ పథకాలలో భూగర్భజలం వినియోగానికి యాభైనుండి వంద సంవత్సరాల సగటు ప్రవాహ జలంలో యాభై శాతాన్ని వినియోగించటానికి ఏర్పాటు చేయాలి.

4. నీటిపారుదల సౌకర్యాలకో, మురుగునీటి పారుదలకో, వరదల నివారణకో ఏర్పాటుజేసే సందర్భంగా విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి కూడా యీ పథకాలలో అవకాశం కల్పించాలి. నీటిపారుదల సౌకర్యాలు కల్పించటానికి వీలున్న ప్రవాహాలను కేవలం విద్యుచ్ఛక్తి ఉత్పాదనకే వినియోగించటం జరుగుతున్న సందర్భాలలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి యితర అవకాశాలను వుపయోగించుకొని, ఆ ప్రవాహ జలాన్ని నీటిపారుదల కోసం, సాధారణ నీటి వాడకం కోసం మరలించాలి.

5. (అ) ఒక నదీలోయలో ఒకానొక రాష్ట్రంలోగాని, ప్రాంతంలోగాని చారిత్రకంగా సంక్రమించిన హక్కుగా ప్రస్తుతం వినియోగించబడుతున్న నీటి మొత్తాన్ని గ్యారంటీ చేయాలి. అలా చేస్తూనే మిగతా జలాల పంపిణీ విషయంలో నదీలోయ ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఆయా రాష్ట్రాల జనాభానుబట్టి, విస్తీర్ణాన్ని బట్టి దామాషా పద్ధతిలో మొత్తం నీటిని కేటాయించాలి.

(ఆ) ఒక నదీలోయ ప్రాంతంలో ప్రజల అత్యవసర వినియోగానికి, సంవత్సరానికి ఒక పంట పండించడానికవసరమైన నీటి పారుదల కల్పించటానికి ప్రజలకు అవసరమైన నీరు అందుబాటులో వుంటే మరొక నదీలోయ ప్రాంతం నుండి అచ్చట సాధారణ అవసరాలకు రాష్ట్రమంతటాగాని, నదీలోయలోని ఆ ప్రాంతంలోగాని ఒక పంటపండించడానికి సరిపడినంత నీటిని లోటు లేకుండా మిగిల్చిన తర్వాత మరొక నదీలోయ ప్రాంతంనుండి తరలించవచ్చు.

(ఇ) తన ప్రాంతంలోగల నీటిని తన కిష్టంవచ్చిన అవసరంకోసమైనా తన చిత్తం వచ్చిన విధంగా వుపయోగించుకోగలనని ఏ రాష్ట్రంగాని, ఏ నదీలోయ భాగంగాని ప్రకటించుకొనజాలదు. జలవినియోగంలో ముందు వెనుకలు నిర్ణయించే సందర్భంగా 1. ముందుగా ఆ నదీలోయ ప్రాంతంలోనూ, 2. ఆ తర్వాత మొత్తం దేశమంతటిని దృష్టిలో పెట్టుకొని అత్యవసర వినియోగానికి కనీస నీటి పారుదల అవసరాలకు, కొన్ని అత్యవసర పరిశ్రమల అవసరాలకు ప్రాధాన్యత నివ్వాలి. ఆ తర్వాత రెండు పంటలకు అంతకంటే ఎక్కువపంటలు పండించడానికి ఇరిగేషన్‌కుగాక, ఇతర అవసరాలకు నీటిని అందజేయాలి.

6. పారుగునేవున్న రాష్ట్రం నుండిగాని, పారుగునేవున్న నదీలోయ నుండిగాని నీరు కావాలని కోరేముందు ఏ రాష్ట్రమైనా ముందుగా తనకు అందుబాటులో వున్న నీటిని రాష్ట్రమంతటాగల ప్రజల సాధారణ అవసరాలు తీర్చడానికి కనీసం ఒక్క పంటకైనా నీటిని అందించటానికి ఏర్పాటు చేసుకోవాలి. నీరు దుర్వినియోగమై పోకుండా నివారించాలి. ఏ రాష్ట్రమైనా సరే తన రెండు పంటల ప్రాంతాల అవసరాలు తీర్చడానికి నీటిని అధికంగా ఉపయోగించే పంటల పద్ధతికిగాను అలాంటి సౌకర్యాలనే కోల్పోయి మరొక రాష్ట్రం నుండి తమకు కావాలని కోరటం తగదు.



ఒక నదీలోయ ప్రాంతంయొక్క కనీస అవసరాలు ముందుగా తీరిన తర్వాతనే తనకు లభ్యమయ్యే నీటితో కనీస అవసరాలు తీరని మరొక ప్రాంతం ఆ నీటిని తీసుకోవచ్చు. ఈ ప్రాంతాల కనీస అవసరాలు తీర్చుకొనటానికి కూడా నీరు లభ్యం కానప్పుడు మిగులునీరుగల నదీలోయ ప్రాంతం తనకుగల అవకాశాలను వదులుకొని నీటిని అందించాలి. అలా కాని సందర్భాలలో మిగులునీరుగల నదీలోయ ప్రాంతం లేదా రాష్ట్రం తన మిగులువల్ల కలిగే సదుపాయాలను అనుభవించాలి.

7. నదీజలాల వివాదాలన్నింటినీ పరిష్కరించడం కోసం వివిధ రాష్ట్రాలకు నదీజలాల కేటాయింపుకు పైన పేర్కొన్న సూత్రాల ప్రాతిపదికపై అవసరమైన చర్యలన్నిటినీ కేంద్ర ప్రభుత్వం తక్షణమే తీసుకోవాలి. ప్రాజెక్టులను ప్రారంభించాలి.

8. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యాన ప్రారంభించబడిన పరిశ్రమలకు చేసినట్లుగానే అన్ని రాష్ట్రాలలోను ఇరిగేషన్, వరద నివారణ, మురుగునీటి పారుదల పథకాలన్నింటిని పరిగణించి కేంద్రమే ఆర్థిక బాధ్యత వహించాలి.

9. నీటి వనరులన్నింటినీ వినియోగించుకొనటానికి ఆ విధమైన పథకం వేయడం ద్వారానే జాతీయ జలగ్రిడ్ రూపొందుతుంది. జలాల వినియోగం విషయంలో అనుసరించవలసిన యీ ప్రజాతంత్ర సూత్రాలకు అండగా పెద్ద ప్రజా సమీకరణ జరపాలి. కష్టజీవులైన రైతాంగాన్ని యీ సమస్యలపై భూస్వాములుగాని, పారిశ్రామిక గుత్తాధిపతులుగాని, యితర అభివృద్ధి నిరోధకులుగాని తప్పుదారి పట్టించనివ్వగూడదు. ఇతర ప్రజాతంత్ర శక్తులతోపాటు కష్టజీవులైన రైతాంగాన్ని సమీకరించినప్పుడే నదీజలాల వినియోగం విషయంలో హేతుబద్ధమైన ఈ సూత్రాలు తమ ప్రయోజనాలకనుగుణమైనవని వారికి నచ్చచెప్పినప్పుడే విచ్ఛిన్నకర శక్తులపై పోరాడగలం.

లేకుంటే గంగా – కావేరి కాలువ వంటి పథకాలు గాని, జాతీయ జలగ్రిడ్‌గాని కేవలం దృష్టిని మరలించేవిగా వుండట మాత్రమేగాక ప్రజాతంత్ర ఉద్యమాన్ని, జాతీయ సమగ్రతను, సమైక్యతను సైతం విచ్ఛిన్నం చేసేవిగా తయారౌతాయి.

**- పీపుల్స్ డెమోక్రసీ, మార్చి 1973**

# ఆంధ్రసాహిత్యంలో కొత్త పోకడలు - విమర్శ

(అభ్యుదయ పత్రిక మొదటి సంచికలో ప్రకటించబడిన మద్దుకూరి చంద్రం రాసిన వ్యాసంపై సుందరయ్య విమర్శ ఇది.)

**కా**మ్రేడ్ చంద్రం ఈ వ్యాసాలలో ఆధునిక ఆంధ్ర సాహిత్యాన్ని మార్క్సిస్టు దృక్పథాన్నుండి సింహావలోకనం చేయడానికి ప్రయత్నించాడు. ఆంధ్రదేశంలోని ఆర్థిక జీవితం, ఆర్థిక సంబంధాలు దాని ఫలితంగావచ్చే రాజకీయోద్యమాలు, ఇది మన ఆధునిక సాహిత్యంపైన, రచయితలపైన ఏరీతిగా మార్పుతెచ్చిందీ ఆధునిక రచనలు ప్రజల జీవితాన్ని, ఉద్యమాలను అభ్యుదయ పోకడలనెంతవరకు ప్రతిబింబించి వానిని ముందుకు తీసుకుపోవడానికి తోడ్పడిందీ చూప ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో ఆయన మార్క్సిస్టు దృక్పథాన్ని మెకానికల్‌గాను, కొంత తేల్చివేసి చూపడం జరిగింది.

సారస్వతాన్ని, కళరూపాలనుగూర్చి ఒక మార్క్సిస్టు పరిశీలిస్తున్నప్పుడు ఆ సారస్వతం, కళారూపాలు, ఆ రచయితలు ఏ కాలమందు నివసిస్తూ ఉన్నదీ పరిశీలిస్తారు. ఆకాలంలోని ఆర్థిక విధానమెట్టిది? ఆర్థిక సంబంధాలెట్టివి? ఆర్థిక సంబంధాల వల్ల జరిగే వివిధ వర్గాల మధ్య ఘర్షణను, అభివృద్ధిని పరిశీలిస్తాడు. ఈ ఘర్షణలు ప్రజల జీవితంలో ఎట్టి మార్పులు, ఎట్టి భావాలు కలిగిస్తున్నవో చూస్తాడు. ఉన్నతమయిన కళ, సారస్వతం ఈ ఘర్షణలను ఈ మార్పులను వాస్తవికతతో చిత్రిస్తుంది.

ఆ వాస్తవికతను చిత్రించునప్పుడు రచయిత యొక్క వర్గధోరణి, అతనితత్వ సిద్ధాంతం ఆ వాస్తవికతను చిత్రించడంలో భిన్నమార్గాలను అవలంభిస్తాయి. వాస్తవిక జీవితంలోని వివిధ వర్గాల ఘర్షణ, వివిధ ప్రజల మనోభావాలు, వివిధ రచయితలమీద వేరువేరు ఫలితాలు, మనోభావాలు కలిగిస్తాయి. కొంతమంది రచయితలు అభివృద్ధి వర్గాలను, పోకడలను బలపరుస్తూ తమ రచనలలో వాస్తవికతను చిత్రిస్తారు. కొందరు అభివృద్ధి నిరోధకశక్తులకు దోహదమిస్తూ రచనలు సాగిస్తారు.



కామ్రేడ్ చంద్రం తన వ్యాసంలో ఆధునిక భారతదేశంలోని ఆర్థిక పరిణామం ఆర్థిక సంబంధాలు దాని ఫలితమగు జాతీయోద్యమ దశలు వాని ప్రభావాన్ని సరిగా చూడలేకపోయాడు.

భారతదేశంలో ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల పెత్తనం క్రింద అంతకు ముందుండిన స్వయంపోషక గ్రామ ఆర్థిక విధానం విచ్చిన్నం కాజొచ్చింది. దానితో పాటు తమ పరిపాలననూ, దోపిడీని సాగించడానికి ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు రైల్వేలు నిర్మించసాగారు. కాని నిరాటంకంగా దోపిడీని సాగించడానికి భారతదేశంలో తాము విచ్చిన్నం గావించిన గ్రామ పరిశ్రమలు స్వయంపోషక ఆర్థిక విధానస్థానాన పెద్ద పరిశ్రమలు భారతీయ బూర్జువా ఆర్థిక విధానాన్ని, అభివృద్ధి పరచడానికికూడా పూనుకోక, అట్టి అభివృద్ధికి అన్ని ఆటంకాలూ కల్గిస్తూ వచ్చారు. దీనికోసం భారత దేశంలోని అభివృద్ధి నిరోధక ఆచారాలను, సాంప్రదాయాలను రాజులను, నవాబులను బలపర్చడం. జమీందారీలను తయారుచేసి గ్రామసీమలలో రైతాంగాన్ని అదుపులో వుంచడానికి ప్రయత్నాలు – ఇట్టివే అనేక పద్ధతులను అవలంబించారు.

నాటినుండి భారతీయ ప్రజాజీవితం ఇంగ్లీషు సామ్రాజ్యవాదులకు, భారత ప్రజానీకానికి మధ్య జరిగే పోరాటం ఘర్షణ ప్రధాన సమస్యగా తయారయింది. అభివృద్ధిని, ఈ పోరాటాన్ని బలహీనపరచే శక్తులకు సాంప్రదాయాలకు, భావాలకు వ్యతిరేకంగా విజ్ఞానంలోను, సారస్వతంలోను నూతన శకం ఆరంభమయింది. బెంగాలులో రాజరామమోహన్‌రాయ్, ఆంధ్రలో వీరేశలింగం భారతీయ బూర్జువా యుగప్రారంభాన్ని తెలియజేసే విజ్ఞానానికి శకపురుషులు అయ్యారు. తమ ప్రజలలో నూతన విజ్ఞానాన్ని కలుగజేయడానికి కృషి చేశారు.

కామ్రేడ్ చంద్రం,"ఈ నూతన పరిస్థితులనుండి నూతనాంధ్ర జాతీయ వికాసం ప్రారంభమయింది. పాశ్చాత్య నాగరికతలోను, ఇంగ్లీషు సాహిత్యంలోను ఏర్పడిన సంబంధంవల్ల తెలుగు సాహిత్యంపైన, మన నాగరికతపైన వాటి ఛాయలు పడసాగాయి. వీటిని తీర్చిదిద్ది తెలుగు సాహిత్యానికి కొత్త అలంకారాలు జేకూర్చి మన ప్రజలకు అందజేసి కందుకూరి వీరేశలింగం పంతులుగారు యుగపురుషులయ్యారని" వివరించడం సరియైనదే.

అయితే వీరేశలింగం, గురజాడ "వీరిరువురూ మనలోని లోపాలు దిద్దుకుంటే నిర్మాణాత్మక కార్యక్రమంలో నిమగ్నులయితే, మన అభివృద్ధికి మార్గమనుకొనేవారు" ఆ ధోరణి, ఆ దృక్పధమే వారి రచనలలో కనబడుతుంది. అంతేగాని వారు ఇంగ్లీషు సామ్రాజ్యవాదులలో ఘర్షణనూ, వారిని దేశాన్నుండి తరిమివేయాలనే మిలిటెంటు జాతీయోద్యమాన్ని ప్రతిబింబించరు. కామ్రేడ్ చంద్రం ఈ విషయాన్ని చూపెట్టలేదు.

"పెట్టుబడిదారీ నాగరికతను చూసి ఉత్తేజం పొందిన మన దేశభక్తుల, రచయితల ఆశలు నెరవేరలేదు. మన ఆర్థిక జీవితం పెంపొందలేదు. బ్రిటిషు సామ్రాజ్యవాదుల పోటీకి నిలువలేక పసి ప్రాయంలో వున్న మన పరిశ్రమలు దివాలా తీశాయి. పాశ్చాత్య నాగరికత చూపిన ఆశారేఖలు సన్నగిల్లాయి. ప్రపంచాన్ని యుద్ధమనే మారణహోమంలోకి సామ్రాజ్యవాదులు నెట్టుకుపోయారు. దీనితో మన నాయకుల చూపు మన ప్రాచీన ఔన్నత్యంవైపు మరలింది. మన రచయితలు, బానిసలం కాకముందు మనం బ్రతికివున్న రోజులనుంచే చరిత్ర లోతుల నుండి ఉత్సాహాన్ని పొందసాగారు.

"ఆ కాలంలో పెట్టుబడిదారీ నాగరికత యెడల ఉండే భ్రమలు తొలగి పోతున్నాయి. పరిపాలకులతో పోరాడి దేశ స్వాతంత్ర్యం సాధించాలనే తీవ్ర జాతీయోద్యమం బయలుదేరింది. ఆ సమయంలో పాత చరిత్రనుంచి ఉత్సాహం పొందడం సహజమే." అందుచే రాయప్రోలు 'వేదశాఖలు పెరిగెనిచ్చట' అనే గీతంలోను, విశ్వనాథ సత్యనారాయణ గారి 'ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం'లలోను పాతచరిత్ర నుంచి దేశగర్వం, ఉత్సాహం పెంపొందించే ప్రయత్న ముండుటచే మన లోట్లు సవరించుకొని ముందుకు పోవాలనే మార్గం చూపకపోయినా అభ్యుదయకరమైనవే"నని కామ్రేడ్ చంద్రం వ్రాయడంకూడ సరియైనదే.

కాని చంద్రం ఇచ్చట మన నాయకులు మన ప్రాచీన ఔన్నత్యం వైపుకు చూపు మరల్చడానికి కారణం "పాశ్చాత్య నాగరికత చూపిన ఆశారేఖలు సన్న గిల్లడం, పెట్టుబడిదారీ నాగరికత యెడల ఉండే భ్రమలు తొలగిపోతూ ఉండడం" అని వ్రాయడం సరికాదు. మిలిటెంటు జాతీయోద్యమం, ఇంగ్లీషు సామ్రాజ్యవాదులతో భారత ప్రజలు, భారతీయ పెట్టుబడిదారీ నాయకత్వం క్రింద జరిపిన పోరాటం సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా మన జాతీయాభిమానాన్ని ప్రోత్సహించడానికి మన పాత ఔన్నత్యాన్ని గుర్తుకుతెచ్చే సాహిత్యాన్నిచ్చింది. అంతేగాని పెట్టుబడిదారీ నాగరికతపై మోజుతగ్గి పాతకాలపు పద్ధతులే మార్గమనుకొనికాదు.



మన జాతీయోద్యమంలో గ్రామ పరిశ్రమ పునర్నిర్మాణ కార్యక్రమముతో స్వరాజ్యం సాధించుకోగలమనుకోవడం, పరిశ్రమలకు , పాశ్చాత్యనాగరికతకు గాంధీజీ వ్యతిరేకత – యిటువంటి పోకడలు ఉన్నాయి. ఇవి భారత జాతీయోద్యమంలో పాల్గొనే అనేక మధ్య తరగతి వర్గాలు, తమ పూర్వ స్వయంపోషక గ్రామ అర్థిక విధానం యేరీతిగ విచ్ఛిన్నమవుతుందో చూడలేక, తిరిగి అట్టి గ్రామ ఆర్థిక విధానం తీసుకరావడంవల్ల దేశ సౌభాగ్యానికి మార్గమనుకొనే ఆశలు తప్ప మరేమీ కావు.

ఈ ఆశలు ఆనాటి సారస్వతంలోను రచనలలో వెల్లడి అవుతున్నాయి. కాని కొంతమంది రచయితలు జాతీయోద్యమంలోని అభివృద్ధి పోకడలననుసరించి జాతీయోద్యమాన్ని పెంపొందించడానికి కృషిచేస్తూ, పాతకాలపు అభివృద్ధి నిరోధక చిహ్నాలను వ్యతిరేకిస్తూ ముందుకుపోయారు. మరికొంతమంది రచయితలు పాతసమాజపు నిర్మాణమే ఆశయంగా రచనలు వ్రాస్తూ అభివృద్ధి నిరోధక రచయితలయ్యారు. రాయప్రోలు, విశ్వనాథ సత్యనారాయణగార్లు ఇందుకు ఉదాహరణ. జాతీయోద్యమాన్నుండి గరిమెళ్ళ సత్యనారాయణ 1920, 30, 40లలో కూడా అభివృద్ధిదాయక కవిత్వం రచించడానికి ఉత్సాహం చెందాడు. ఆ జాతీయోద్యమాన్నుండే వేరే ఆదర్శం, అభిప్రాయాలుగల విశ్వనాథ సత్యనారాయణ, రాయప్రోలులు జాతీయోద్యమంలోని అప్రధానమైన అభివృద్ధి నిరోధక హిందూఛాందసత్వాన్ని, సాంప్రదాయాలను పట్టుకొని తప్పుత్రోవలతో ప్రజలకు దూరమయ్యారు. కామ్రేడ్ చంద్రం రచయితల యొక్క వర్గధోరణి, వారికి ప్రపంచం యెడలగల వైఖరి, ఆశయాల పాత్ర తీసుకురాక. "జాతీయోద్యమంలోని ఛాందసచిహ్నాల ఫలితంగా, ఇవి పెరిగి పెద్దవౌటవల్ల తర్వాత రాయప్రోలు, విశ్వనాథంగార్ల జమీందారీ యుగపు ఛాందసాలనన్నిటినీ సమర్థిస్తూ అభ్యుదయాన్నే వ్యతిరేకించే వారుగా తయారయ్యారనీ" వ్రాశాడు.

కామ్రేడ్ చంద్రం జాతీయోద్యమంలోని కొన్ని లోపాలనుచూచి అసలు జాతీయోద్యమం సంస్కారంపట్ల వెనుకచూపు పట్టిందని వ్రాస్తున్నాడు. ఈ వెనుక చూపుపట్టడంవల్ల ఒక్క రాయప్రోలు, విశ్వనాథ సత్యనారాయణలాంటి కవులేగాక ఆరంభం నుండీ అభివృద్ధి సంస్కార ఆశయాలకు కృష్ణశాస్త్రీ, చలంగార్ల రచనలు కూడా నిరాశ, అరాచక ధోరణులు కట్టుటకు కారణమయినట్లు వ్రాస్తున్నాడు.

"కృష్ణశాస్త్రిగారు, బ్రహ్మసమాజకులైన ఆర్. వెంకటరత్నం, వీరేశలింగంగార్లకు శిష్యులు. వారి గురువులూ, వారూ కూడా ఆశించిన నూతనాంధ్రజాతి యింకా రాలేదు. సంస్కారం జాతీయవాదం పేర వెనుకచూపు పట్టింది. కృష్ణ పక్షంలో శాస్త్రిగారేమంటారో చూడండి" అంటూ ఒక విషాద గీతికను ఉదహరిస్తారు – పేజీ 89.

"కాని జాతీయోద్యమం మన సంస్కారాన్ని ముందుకు తీసుకుపోనందునా, వెనుక చూపుకు మరలినందునా యిచట కూడా కొన్ని తిరుగుబాటులు, అరాచక పోకడలు వచ్చాయి.

"ఉదాహరణకు గుడిపాటి వెంకటాచలంగారి రచనలు. వీరు కూడా కృష్ణశాస్త్రిగారివలె బ్రహ్మ సమాజీకులు. వీరేశలింగంగారి శిష్యులు. వీరు చిన్నతనంలో ఆశించిన స్త్రీ స్వాతంత్ర్యం, నూతన సంస్కార వ్యాప్తి చెందలేదు. కృష్ణశాస్త్రిగారి విషాద గీతాలలో నిస్పృహ ద్యోతకమయితే, చలంగారి రచనలలో కేవలం తిరుగుబాటు తత్వం స్పష్టంగా కనిపిస్తుంది.

"జాతీయోద్యమం వెనుకచూపు పట్టిందనీ, నూతన సంస్కారాన్ని వ్యాప్తిజేసి నూతనాంధ్రజాతిని సృష్టించడంలో సాఫల్యం పొందలేదనీ యిదివరకే తెలియజేశాను. ఎప్పుడైతే ప్రధానపోకడ వెనుకచూపు పట్టిందో అప్పుడే పై తిరుగుబాటు కూడా మొలకెత్తింది."

1. కామ్రేడ్ చంద్రం ఈ భావాలను వ్రాసినప్పుడు జాతీయోద్యమం సర్వతోముఖంగా, పాత సాంప్రదాయాలను తుడిచిపెట్టి నూతన విజ్ఞానాన్ని, సంస్కారాన్ని ప్రవేశపెట్టడానికి ఎంత తక్కువగా తోడ్పడిందీ చూడలేకపోతున్నాడు. కుల భేదాలు పోగొట్టడంలో అస్పృశ్యతా నివారణ, విద్యాభివృద్ధి, స్త్రీ స్వాతంత్ర్యాలను జాతీయోద్యమం; వీరేశలింగం బ్రహ్మసమాజాల ప్రాథమిక స్థాయి నుండి ఎంత ముందుకు తీసుకపోయిందీ గమనించడం లేదు. దీనిలోని లోపాలనుచూసి, దాని అభివృద్ధిని గుర్తించలేదు.

2. దేవులపల్లి కృష్ణశాస్త్రి, గుడిపాటి వెంకటచలం ఈ అభివృద్ధిని చూడలేక పోవడానికి కారణం వారు రాజకీయ జాతీయోద్యమం యొక్క ప్రాముఖ్యతను గుర్తించకపోవడమే. దానిలో పాల్గొని దానిని అభివృద్ధి పర్చుటకు పూనుకోలేదు. జాతీయోద్యమానికి దూరంగా ఉన్న ఈ రచయితలు తమకండ్లయెదుట జరుగుతున్న అభివృద్ధిని చూడలేకపోయారు. నిరాశ నిస్పృహలకు, అరాచక సిద్ధాంతాలకు గురి అయ్యారు.



కామ్రేడ్ చంద్రం ఈ రచయితకున్న వైఖరి, జీవితదృక్పథాలను గూర్చి Philosophical make up అని వారి ఆ రచనలకు ఏ రీతిగా దారితీసిందీ, జాతీయోద్యమం లోని అభివృద్ధిని గుర్తించలేక పోవడానికీ ఏ రీతిగా కారణమో చూపెట్టలేదు.

3. జాతీయోద్యమం ముందుకు పోయినపుడు దానిని ప్రతిబింబించే రచయితలు వచ్చారనీ, వెనక్కిపోయినపుడు సాహిత్యంలోకూడా నిస్పృహ నిరాశలు ప్రతిబింబించాయనీ, జాతీయోద్యమంలోని లోపాలు కొంతమంది రచయితలను నిరాశా నిస్పృహలకు, అరాచక తిరుగుబాటులకు దారితీసేట్లు చేసినవనీ చూపెట్టడానికి కామ్రేడ్ చంద్రం ప్రయత్నించాడు. ఇది చాలా సాధారణంగా నిజమేకాని, ప్రతి రచయిత పైనీ అతనివర్గ ధోరణి, జీవితవైఖరి అనుకూల జాతీయోద్యమ ప్రభావం వేరు వేరు విధంగా ఫలితాలు కలుగజేశాయనే విషయం తీసుకురాలేదు. అందుచేతనే కామ్రేడ్ చంద్రం వివరణలో మెకానికల్‌గా సమస్యను చాలావరకు తేల్చివేయడం జరిగింది.

ఈ కవులు, రచయితల రచనలకు జాతీయోద్యమ తాత్కాలిక విఫలత కారణంకాదు. ఈ కవుల, రచయితల వర్గస్వభావాన్ని, వర్గ ఆశయాలను మనం చూడగలిగినపుడే వారి వ్రాతలకు గీటురాయి దొరుకుతుంది. ప్రజల పురోభివృద్ధికి తమ రచనలు తోడ్పడాలనే స్పష్టమయిన ఆశయం లేకపోబట్టీ, పురోభివృద్ధి అంటే ఏమిటో స్పష్టమైన ధోరణి లేకపోబట్టీ వీరి రచనలుకూడ మధ్యతరగతి ప్రజలలో సామాన్యమైన ఊగిసలాటలతో వెనుకముందులకు సాగాయి.

త్రిపురనేని రామస్వామిగారి "శంబుకవధ", ముద్దుకృష్ణగారి "అశోకం" చలంగారి "సావిత్రి" వగైరాల్లో పురాణగాథలనే తీసుకొని వాటిని కొత్తదృక్పథం నుంచి చిత్రించారు. వెనుకటి గాథలను తీసుకొని కొత్తభావాలను ప్రచారంచేయడానికి వినియోగించడం యూరపులో రూసో, విక్టర్‌హ్యూగో లాంటివారుకూడ ప్రారంభంలో చేశారు.

ఖూనీ, శంబుకవధలు ఆ రోజులలోని దురాచారాన్ని ఎత్తి ఖండిస్తూ, నేటి ప్రజలకు మార్గంచూపిస్తూ వ్రాసిన అభ్యుదయ రచనలు. అశోకం, సావిత్రీ రచనలు అలాంటివికావు. ఈ తరహా రచనలు సీత, సావిత్రిలను మనకు ఆదర్శస్త్రీలుగా సృజించి ప్రజలముందు ఉంచాయి. తాను ప్రేమించి చేసుకొన్న వ్యక్తితో ఎన్ని కష్టాలు వచ్చినా లెక్కచేయక, జీవించే

అన్యోన్యదాంపత్య జీవిత కథలవి. కాని ముద్దు కృష్ణగారి అశోకం, చలంగారి సావిత్రి ప్రజల ఈ ఆదర్శాన్నే ఖండించి "స్వేచ్ఛా ప్రేమను" బోధించేవిగా తయారు అయ్యాయి. ప్రజలు ఆదర్శజీవులనుకునే వారిని కూడా స్వేచ్ఛా ప్రేమ జీవులనే పాఠం బోధించేవిగా తయారు చేశారు. వీనిని ఖూనీ, శంబుకవధలతో పోల్చటంగాని, లేక విక్టర్‌హ్యూగో, రూసో రచనలతో పోల్చటంగాని పూర్తిగా పొరపాటు. ఇటువంటి వాఙ్మయం "మన పురాణాలలోని మూఢవిశ్వాసాలను తొలగించటానికి కృషిచేసిన తిరుగుబాటుదారుల కృషి" అనీ, "ప్రజలను కొత్త సంస్కారంవైపు ఆకర్షించడానికి సరియైన మార్గంకాదు." అనీ తేలికగా విమర్శన చేయడం పూర్తి పొరపాటు. ఈ వ్రాతలు మధ్యతరగతి (పెటీబూర్జువా) అరాచక భావాల ప్రతిబింబమే తప్ప మరేమీ కావు.

కామ్రేడ్ చంద్రం సమీక్షలో మరోలోపం : భావానికీ భాషకూ మధ్య మెకానికల్ విభజన చేయటంకూడా జరిగింది. "చలంగారు సజీవమైన వ్యవహారిక భాష వాడుతారు. భాష, రచనా నైపుణ్యం, శిల్పం దృష్టితో చూస్తే చలంగారి రచనలు తెలుగు సాహిత్యంలో కథలను ఒక కొత్తస్థాయికి తీసుకపోయాయి. అదే విధంగా విశ్వనాథ సత్యనారాయణగారిని గూర్చి వ్రాస్తూ "ఆంధ్రభాషా రూపాలన్నింటిలోనూ చేయిదిరిగిన దిట్ట" అని వ్రాశారు. మనం రచనా, రచయిత స్థానాన్ని అభ్యుదయ ప్రపంచంలో, సాహిత్యంలో ఎచ్చట నిర్ణయించాలని చూచినప్పుడు అతనిభాషా శైలినిబట్టికాదు. అతని రచనలు ఎంతవరకు పురోభివృద్ధికి తోడ్పడ్డాయో మొత్తంమీద చూపుతాం. చదువవలసిన పుస్తకమా? లేక తృణీకరించవలసిన పుస్తకమా? అనికూడా అదే దృష్టితో చూస్తాం. భాష బాగుంది కాని, భావం బాగాలేదని చెప్పం. ఎప్పుడైతే భావం బాగాలేదో, అభివృద్ధి శక్తులపై ధ్వజమెత్తిందో అప్పుడు దానిలోని భాషా మాధుర్యాన్ని గూర్చి, మనం పొగడుతూ కూర్చోక అభివృద్ధి నిరోధకమైనప్పుడు దానిలోపాన్ని భాష కప్పిపుచ్చలేదు. భాషాశక్తి ఆ లోపాన్ని, అభివృద్ధి నిరోధకత్వాన్ని మరింత వ్యాపింప చేస్తుందే కాని, మరేమీకాదు. విషయం అభ్యుదయకరమయినపుడు దాని లోపం భాష, శైలి వగైరాలను గూర్చి ఆలోచించి అభివృద్ధి చేయటం వల్ల, ఆ గ్రంథం మరింత పదునై అభివృద్ధికి తోడ్పడుతుంది.



# "మాభూమి" నాటకంపై సుందరయ్య

'మాభూమి' చదివాను. రచయితలకు నా ధన్యవాదాలు. తెలంగాణా ప్రజల వాస్తవిక స్థితిని ఎంతో చక్కగా చిత్రించారు. ఆంధ్రభాషలో ఇది ఉత్తమోత్తమ నాటకంగా వుంటుంది. ఆంధ్ర ప్రజలను ముక్కోటి ఆంధ్రులను ఐక్యపరచే నాటకంగా వుంటుంది. తెలంగాణా ప్రజల పోరాటానికి చేయూత నివ్వడానికి మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రులను ఉద్రూతలూగించే నాటకం. హిందూ ముస్లిం ఐక్యత, ప్రజాపోరాటాల్లో స్త్రీలు ముందంజ వేయడం, సామాన్యజనం – గొల్లయల్లమంద, మంగలి రాముడు నూతన జీవితాన్ని నిర్మించుకోవడానికి ముందుకురావడం – ఇది అంతా కండ్లకు కట్టినట్లు వాస్తవికతను చిత్రించారు. ఇది చదువుతూ ఉన్నప్పుడు సోవియట్ నాటకాలను చదివినప్పుడెంత సంతోషం పొందానో అంతకన్నా ఎక్కువ సంతోషం పొందాను. కడకు మన తెలుగులోకూడా ప్రజల వాస్తవిక జీవితచిత్రాన్ని అచ్చటిలాగానే వ్రాయగలిగినామని సంతృప్తి కలిగింది.

ఇట్టి ఉత్తమ నాటకాన్ని రచించినందులకు రచయితలకు నా ధన్యవాదాలు.

**– ప్రజాశక్తి, 3-8-1947**

# భాషా సమస్యపై

(మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 18 యేండ్లు గడిచినప్పటికీ అధికారంలోవున్న కాంగ్రెసు ప్రభుత్వం ప్రధానజాతీయ సమస్యలలో ఒకటైన భాషా సమస్యను పరిష్కరించలేకపోయినందున దేశంలో ఈ సమస్యపై అత్యంత క్లిష్టపరిస్థితి ఏర్పడింది. తమిళనాడులో ఈ సమస్యపై పెద్ద తిరుగుబాటు జరిగి ప్రాణనష్టం, ఆస్తినష్టం పెద్ద ఎత్తున జరిగిన తరువాతనే కేంద్ర ప్రభుత్వమూ, పాలకవర్గ పార్టీ అయిన కాంగ్రెసు నాయకత్వమూ కదిలింది.

అంతకు పూర్వం కూడా భాషా రాష్ట్రాల సమస్యపై ఆంధ్రలో, మహారాష్ట్రలో, గుజరాత్‌లో పెద్ద ఎత్తున అలజడి ఏర్పడిన తర్వాతనే ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి పూనుకొన్నది.

ఇప్పుడు కూడా తిరుగుబాటు అనంతరం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భాషా సమస్య పరిష్కారానికి అనుసరించదగిన సూత్రాలను గురించి ఒక తీర్మానం చేసింది.

ఆ తీర్మానాన్ని దృష్టిలో వుంచుకుని, భాషా సమస్యకు, జాతులసమస్యకు మధ్యవున్న సంబంధాలపైనా, కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య వుండవలసిన సంబంధాలపైనా, భాషా సమస్య సక్రమ పరిష్కారానికి తీసుకోవలసిన చర్యపైనా వివరంగా కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వైఖరిని గురించి ఈ వ్యాసాన్ని సుందరయ్య గారు రాశారు (ఇది 'పీపుల్స్ డెమోక్రసీ' పత్రికలో ప్రచురించబడింది).

హిందీని బలవంతంగా రుద్దడానికి వ్యతిరేకంగా ఈ సంవత్సరం 1965 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో తమిళనాడులో బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమము పెల్లుబికింది. కేంద్ర ప్రభుత్వం కనీసం భారత రాజ్యాంగ చట్టంలో నిర్దేశించబడిన లక్ష్యాల మేరకైనా ప్రాంతీయ భాషలను వృద్ధిచేయకుండా 1965 జనవరి 26వ తేదీ రిపబ్లిక్ దినము నుంచి కేంద్ర ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాలు హిందీలోనే జరుపబడతాయని ప్రకటించింది. అందుకు తగిన ఏర్పాట్లన్నీ గావించుతున్నది.

ఇది చాలా తొందరపాటు చర్యయని, ఈ నిర్ణయాన్ని అమలు జరపకుండా వాయిదా వేయాలని తమిళనాడు ప్రజలు గావించుకొన్న విజ్ఞప్తులను, చేసిన హెచ్చరికలను కేంద్ర-రాష్ట్ర



ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయి. గత్యంతరం లేక శాంతియుత పద్ధతుల్లోనే తమ అసమ్మతిని తెలియజేయుటకు రిపబ్లిక్ దినోత్సవాన్ని విచారదినంగా జరుపుటకు నల్ల జెండాలు ఎగురవేయుటకు నిశ్చయించుకున్నారు.

ఇది జాతీయ వ్యతిరేక చర్యయని, జాతి విద్రోహకర వైఖరియని ప్రభుత్వం ఆరోపిస్తూ అతి దారుణంగా అణచబూనుకున్నది. ద్రవిడ మున్నేట్ర కజగం నాయకులను, ఇతర ప్రముఖులను వందలకొలది మందిని జనవరి 26కు ముందే భారత రక్షణ నిబంధనల క్రింద డిటెయిన్ చేసింది. పోలీసులను ప్రజలపైకి విచ్చలవిడిగా వదిలింది. లాఠీచార్జీలు, బాష్పవాయు ప్రయోగాలు, కాల్పులు పిచ్చిపిచ్చిగా జరుపబడినాయి. తమిళనాడంతా లేదా ఎక్కువభాగం పోలీసు రాజ్యంగా మార్చివేశారు. సుమారు 49 మంది ప్రాణాలు బలిగొన్నారు. వేలమందిని నిర్బంధించారు. అనేకమందిని క్రూరంగా హింసించారు. అయినా ప్రజలు జంకలేదు. పట్టణ విద్యార్థులు, గ్రామీణ రైతాంగ, కార్మికవర్గం అంతా ఒక్కుమ్మడిగా మహాప్రవాహంలా కదిలారు. భాషావిషయంగా తమకు జరిగే ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా అనేకమంది బహిరంగంగా ప్రజా సమూహం ముందర పెట్రోల్, కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకొని, ద్రావకాలు తాగి ఆత్మబలిదానం గావించుకొన్నారు. పోలీసు రాజ్యం సాగించే కాంగ్రెసువాదులను బయటికి కదలనీయలేదు. కాంగ్రెసు జెండాపట్టుకొనిగాని, కాంగ్రెసు టోపీలు ధరించిగాని తిరిగేస్థితి లేకుండా ప్రజా కదలిక సాగింది. రైలు, బస్సు ప్రయాణాలు సాగకుండా ఆగిపోయాయి. ప్రభుత్వపాలనే చాలా రోజులు స్థంభించింది. మద్రాసు పట్టణంలో సుమారు నెల రోజులు ప్రభుత్వ కార్యకలాపాలు స్థంభించిపోయాయని చెప్పితే అతిశయోక్తి ఏమీకాదు. అందుకే మద్రాసు పట్టణంలో పోలీసులతో సాధ్యంకాక మిలిటరీ సహాయంతో ప్రజా ఉద్యమాన్ని అణచబూనుకుంది.

మరోవైపు ఈ ఉద్యమం కేరళ, మైసూరు, ఆంధ్ర, బెంగాల్, ఒరిస్సా, అస్సాం, త్రిపుర మున్నగు రాష్ట్రాలకు కూడా ప్రాకింది. ముఖ్యంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆంధ్రలో మద్రాసును ఆనుకొనివున్న పరిసర జిల్లాలైన చిత్తూరు, నెల్లూరు, అనంతపురం జిల్లాలల్లోనూ, విశాఖలోను బాగా పాల్గొన్నారు. వారాల తరబడి కళాశాలలు వదిలి సమ్మెలు, ప్రదర్శనలు చేశారు. నెల్లూరులో సామాన్య ప్రజానీకం కూడా చాలా పెద్ద ఎత్తున కదిలి పోలీసులను అడుగడుగునా ప్రతిఘటించారు. అనేక నిర్బంధాలకు, కాల్పులకు గురైనారు. ఇదంతా ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమం. ఈ ప్రభుత్వం అనుసరించే అనేక ప్రజావ్యతిరేక విధానాలవలన ప్రజల అసంతృప్తి పేరుకొని ఈ భాషా సమస్యపై బ్రద్దలయింది, భగ్గున మండింది.

ఇట్టి ప్రజా ఉద్యమాన్ని కొందరు ఇంగ్లీషు అభిమానులు రెచ్చగొట్టిన ఉద్యమమని, మితవాద అభివృద్ధి నిరోధకుల కుట్రయని సంజీవరెడ్డి, కామరాజ్, అతుల్యఘోష్‌ల సిండికేట్

రెచ్చగొట్టిందని, దేశంనుండి తమ రాష్ట్రం విడిచిపోవాలని కోరే ద్రవిడమున్నేత్రకజగం నడుపుతున్నదనీ, ఇది అభివృద్ధినిరోధక ఉద్యమమని, అరాచక ఉద్యమమని రకరకాలుగా నిందించారు. ఇప్పటికీ దూషిస్తూనే వున్నారు.

ఈ సమస్యపై మార్క్సిస్టు పార్టీ ఏ వైఖరి తీసుకోవాలనేది ప్రధాన సమస్యగా మన ముందుకు వచ్చింది.

ఇది కేవలం కేంద్రములో ఏ భాషలో పరిపాలనా వ్యవహారాలు సాగించాలనే పరిమిత సమస్యగాలేదు. రాష్ట్రాల యెడల, రాష్ట్ర భాషల యెడల కేంద్ర ప్రభుత్వం యొక్క మొత్తం పరిపాలనా విధానంతో ముడిబడివున్నది. బడాబూర్జువాజీ నాయకత్వానికి వ్యతిరేకంగా ఇతర జాతుల బూర్జువానికీ కేంద్రానికీ వ్యతిరేకంగా రాష్ట్రాలకు మధ్య వైరుధ్యాలు పెరుగుతాయని మన పార్టీ కార్యక్రమంలో చెప్పాము. కాని వివరంగా వివరించలేకపోయాము.

భారత రాజ్యాంగ చట్టము రూపొందించేటప్పుడు ఫెడరల్ స్టేట్‌గా (రాష్ట్రాల సమాఖ్యగా) ఉండాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలు, అధికారాలు నిర్ణయించారు. ఏఏ సమస్యలు కేంద్రం నిర్వహించాలో, చట్టాలు చేయాలో ఒక జాబితా పెట్టారు. అలాగే రాష్ట్రాలకు మరొక జాబితా పెట్టారు. రాష్ట్రాలకు కేటాయించబడిన సమస్యలను (లిస్టులోనివి) కూడా అత్యవసర పరిస్థితులు వచ్చినపుడుగాని పార్లమెంటులో మూడింట రెండువంతుల మెజార్టీచే నిర్ణయించినపుడుగాని కేంద్రం తీసుకోవచ్చు.

క్లుప్తంగా చెప్పాలంటే వ్యవసాయం, భూమిమీద పన్ను, అమ్మకం పన్నులు వేయడం వరకు రాష్ట్రాలకు అధికారం వుంది. మిగతా అన్ని రకాల పన్నులకు కేంద్రానికే అధికారం. అమ్మకం పన్నులో కూడా అధిక భాగం కేంద్రానిదే అధికారం. పుగాకు మున్నగు వ్యవసాయోత్పత్తులపై కూడా అనగా, ఎక్కువ డబ్బురాగల వ్యాపార పంటలపైగూడ పన్ను వేసే అధికారం కేంద్రానిదే. ఇటు ఆదాయవనరులన్నీ కేంద్రం చేతిలోనే వుంచబడినాయి. చివరకు విద్యా, వైద్యం మీదకూడా కేంద్రానికే అధికారం ఉండేటట్లు ఆలిండియా ఉద్యోగ బృందాన్ని తయారుచేసింది. మొదట ఆలిండియా సివిల్, పోలీసు సర్వీసుల నిర్వహణ కేంద్రానికి ఉండేది. ఇప్పుడు ఇంజనీరింగు, వ్యవసాయం, వైద్యం, అడవులు ఒకటేమిటి ముఖ్యమైన సర్వీసుల నిర్వహణంతా కేంద్రానిదే.

మరో మాటలో చెప్పాలంటే ప్రతి విషయంలోను కేంద్రం రాష్ట్రాలపై జోక్యం చేసుకొని ఇష్టం వచ్చినట్లు చెప్పి చేయిస్తున్నది. (డిక్టేట్ చేస్తున్నది.)

పేరు ఫెడరల్ రాజ్యంగా చెప్పబడుతున్నప్పటికీ వాస్తవంలో రాష్ట్రాలకు నామమాత్రపు అధికారమే వుంది. ఇది మిగతా భాషాజాతుల రాష్ట్రాల అభివృద్ధికి తీవ్ర ఆటంకం.

అందుకే గతమునుండికూడా కేంద్రానికి రాష్ట్రాలకు పన్నులలో తగిన వాటాలు రావటంలేదని, ఆర్థికాభివృద్ధి పథకాలలోను, విద్యానిధుల కేటాయింపులోను ఇలాంటి అనేక



సమస్యలపై తమకు రావలసిన న్యాయమైన వాటా రావటంలేదని ఘర్షణ జరుగుతూనే ఉంది. అన్ని జాతులు సమాన హక్కులు, అధికారాలు కలిగి లేకుండా జాతుల స్వపరిపాలన లేకుండా బడాబూర్జువా నాయకత్వాన వున్న ఈ ప్రభుత్వం చేసింది, చేస్తున్నది.

## భాషా రాష్ట్రాలకై పోరాటం

జాతీయ స్వాతంత్ర్యోద్యమ రోజుల్లో కాంగ్రెసు నాయకత్వం జాతుల స్వపరిపాలన ఉంటుందని, మాతృభాషలోనే విద్యాబోధన ఉంటుందని వాగ్దానం చేసింది. కాని స్వతంత్ర సముపార్జనానంతరం మొండిచేయి చూపింది. ఫలితంగా భాషా రాష్ట్రాలకోసం ఎన్నో పోరాటాలు చేయవలసి వచ్చింది. ఎన్నో త్యాగాలు చేయవలసి వచ్చింది. ఆంధ్రలో ఈ ఉద్యమం బలోపేతంగా పెరిగి ప్రాయోపనాశం పూనిన శ్రీపొట్టి శ్రీరాములుగారి మరణంతో ఉచ్ఛస్థాయి నందుకొని ప్రభుత్వాన్ని స్తంభింపచేసిన తర్వాతనే గత్యంతరంలేక ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పరస్తూ, మొత్తం రాష్ట్రాలు భాషా ప్రయుక్తంగా విభజించుటకు భాషారాష్ట్రాల కమీషన్ను నియమిస్తూ కేంద్రప్రభుత్వం ప్రకటించింది. అప్పటికీ భాషా రాష్ట్రాలపై తనకుండే వ్యతిరేకతను అనేక కుత్సితాలతో బయటపెట్టుకుంది. ప్రత్యేక తెలంగాణా ఉండాలని వాదించారు. గుజరాత్‌ను మహారాష్ట్రలోనే కలిపి ఉంచాలని నిర్ణయించారు. వీటికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు, ఆందోళనలు చేయవలసి వచ్చింది. మహాగుజరాత్, సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో అనేకమంది పోలీసు తుపాకీ గుండ్లకు బలియైన తర్వాత 1960లో సాధించుకోవటం జరిగింది.

జాతుల వికాసానికి ప్రజల కోర్కెలీడేర్చడానికి భాషా రాష్ట్రాలనిర్మాణం ముఖ్యావసరమని కాంగ్రెసు నాయకులు చూడలేదు. చివరకు ఈనాటికి దాదాపుగా అన్ని రాష్ట్రాలకు మధ్య సరిహద్దు తగాదాలను అట్టిపెట్టి ఉంచారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఏ జాతి ప్రజ మెజార్టీ ఉంటే ఆ జాతి రాష్ట్రంలో కలపాలని చేయబడిన ప్రజాతంత్ర సూచనను ఉద్దేశపూర్వకంగానే అమలు జరుప నిరాకరిస్తున్నారు. అందుకే మనపార్టీ కార్యక్రమంలో గ్రామాన్ని యూనిటుగా తీసుకొని సరిహద్దులను పరిష్కరించటంద్వారా భాషారాష్ట్రాల నిర్మాణం పరిపూర్తి గావించాలని చెప్పాము.

## బహుజాతులుగల దేశమిది

ఇండియా బహుజాతులుగల దేశం. అన్ని జాతుల ప్రజల (నేషనాలిటీస్) అభివృద్ధితోనే ఇండియా అభివృద్ధి ముడిపడివుందని కాంగ్రెసు నాయకులు చూడటం లేదు. హిందీ భాషను ఒక్కదానినే ప్రధాన రాజభాషగా, అధికారభాషగా చేయాలని నిర్ణయించారు. తర్వాత ఏమి చేయదలచుకున్నారో తెలియదు. కాని దీనిద్వారా గుత్తపెట్టుబడిదారీ నాయకత్వం

– కేంద్రాధికారం రాష్ట్రాలను మరింత నామమాత్రం చేయటం జరుగుతుంది. ఈ ప్లానులో భాగంగానే హిందీ బలవంతంగా రుద్దబూనుకున్నారు.

సాంకేతిక కారణాలచేత కొన్ని ఏండ్లు దీనిని అమలుజరపకుండావాయిదా వేసినప్పటికీ, తీర్మానాలు ఏమిచేసినప్పటికి వాళ్ళ అవగాహనలో మార్పులేదు. ఇంగ్లీషు స్థానంలో హిందీని ప్రవేశపెట్టాలని ప్లానుతోనేఉన్నారు. కేంద్రపాలన, పార్లమెంటు, సుప్రీంకోర్టు, హైకోర్టులు, రాష్ట్రా విశ్వవిద్యాలయాలు వీటన్నిటిలోనూ హిందీయే ఉండాలని వాళ్ళ ప్లాను. ప్రాంతీయ భాషలను అభివృద్ధి పరచాలని, విశ్వవిద్యాలయాల్లో బోధనా భాషగా, హైకోర్టులోను ప్రభుత్వ పరిపాలనల్లో గూడా ప్రాంతీయ భాషలే ఉండాలని వారి ఉద్దేశంకాదు. పైగా ఇలా చేస్తే దేశం విచ్ఛిన్నమౌతుందని వారి ఉద్దేశం.

1949లో కేంద్రములో అధికారభాషగాహిందీ ఉండాలి అనే నిర్ణయాన్ని రాజ్యాంగ నిర్ణయసభలో కాంగ్రెసుపార్టీ ఒక ఓటు మెజార్టీ నిర్ణయించి, హిందీ భాషను దేశంలోని తదితర భాషారాష్ట్రాలమీద రుద్దటానికి పూనుకున్నారనే విషయం కూడా మనం మరచిపోరాదు.

ఈ విషయం స్పష్టంగా చెప్పకుండా పైకిమాత్రం రాష్ట్ర పరిపాలన, విశ్వవిద్యాలయాల్లో బోధన ప్రాంతీయ భాషల్లోనే జరుపుకొందామని చెపుతారు. కాని అందుకు అవసరమైన విధంగా ప్రాంతీయ భాషల అభివృద్ధికి ఏమీ సహాయము చేయరు. చొరవ తీసుకోరు. పైగా శాస్త్ర, సాంకేతిక పాఠ్యగ్రంథాలు, న్యాయశాస్త్ర చట్టాలు ప్రాంతీయ భాషల్లోకి అనువాదమింకా జరుగలేదు కాబట్టి ఆలస్యమౌతుందని వాదిస్తారు. టైపు రైటర్లకు కమీషన్లు వేశాము అని వాదిస్తారు.

విశ్వవిద్యాలయాల్లో నేడున్నవారిలో అత్యధికభాగం ఇంగ్లీషుఛాందసులు ఉన్నారు. ఇంగ్లీషులోగాక ప్రాంతీయభాషల్లో విద్యాబోధన సాగించితే విద్యాప్రమాణాలు పడిపోతాయని వారు వాదించుతారు. దేశం చిన్నాభిన్నం అవుతుందని వాదిస్తారు. హిందీకి స్థానం వచ్చేదాకా ఇంగ్లీషే వుండాలనికూడా వాదిస్తారు.

ఈ వైఖరి జాతుల అభివృద్ధికి, దేశ ఐక్యతకు హానికరము.

## మద్రాసులోని ఉద్యమం రావడానికి కారణం

హిందీ బలవంతంగా రుద్దటానికి వ్యతిరేకంగా మద్రాసులోనే ఈ ఉద్యమం రావటానికి కారణమేమిటి? అదికూడా పరిశీలించాలి. ఒక జాతి బూర్జువాజీ మిగతా జాతులపై ఆధిపత్యం చెలాయించాలని వాంఛించడం ఆ వర్గ సహజ లక్షణం. హిందీని బలవంతంగా రుద్దాలనేవారిలో ఈ ఉద్దేశమే ఉంది.

భారతదేశంలో బొంబాయి, కలకత్తా నగరాల తర్వాత పారిశ్రామికంగా అభివృద్ధి అయిన రాష్ట్రం మదరాసు. (కలకత్తాలో గూడా మార్వాడి, గుజరాతీ, పార్సీవారి పెట్టుబడులే



ప్రధానం) బడాబూర్జువా వర్గానికి, స్థానిక బూర్జువా వర్గానికి మధ్యనున్న వైరుధ్యాలు మద్రాసులో మరింత ఎక్కువగా బయటపడుతున్నాయి. ఒకవైపున తమిళనాడు కాంగ్రెసునాయకులు బడా బూర్జువా నాయకత్వాన్ని జనరల్‌గా బలపర్చినా, భాషా ఉద్యమాన్ని కాదనలేక పోవటానికి ఇదే కారణం. మదరాసు రాష్ట్ర బూర్జువా వాజీలో ఒక భాగం ద్రవిడమున్నేట్రకజగంలో ఉంది. తమ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరుగుటలేదని, ఉత్తరాదివారే అన్నీ కాజేస్తున్నారని ఆందోళన చేస్తూ ఉంటారు. ఈ వెలుగులో పరిశీలించినపుడు అభివృద్ధి చెందిన తమిళ బూర్జువాజీ కేంద్రాన్ని ఎదుర్కోవటానికి ఈ ఉద్యమాన్ని బలపరుస్తూ ఉందనటం స్పష్టం.

డి.యం.కె. హిందీని బలవతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తూ, అన్ని భాషలు అభివృద్ధి కావాలని కోరితే దానిని దేశవిచ్ఛిన్నతని మితవాద కమ్యూనిస్టులు అంటారు. కాదనీ, అది అభివృద్ధికర ఉద్యమమని మనమంటాము.

కాంగ్రెసుకు వ్యతిరేకంగా జరిగే ఈ ఉద్యమములో డి.యం.కె.తో బాటు మనమూ పాల్గొని ప్రజలను విప్లవ పోరాట పంథాకు మరల్చటమవసరం. అది సరైనది కూడానూ.

కేంద్రంలో పరిపాలనాభాషగా హిందీని బలవంతంగా రుద్దవద్దని దేశంలోని పదునాల్గు ప్రధాన జాతీయ భాషలకు రాష్ట్రాలలోను, కేంద్రములోను సమాన హోదా వుండాలని, పరిపాలనా భాషలుగా వుండాలని కేంద్ర ఉద్యోగాలలో జనాభా ప్రాతిపదిక మీద రాష్ట్రాలకు వాటా వుండాలని, రాష్ట్రాల అభివృద్ధికి అన్నిటిలోను తగిన వాటారావాలని, కేంద్రములో నేడు కేంద్రీకరింపబడుతున్న అధికారాన్ని రాష్ట్రాలకు వికేంద్రీకరణ చేయాలని, కేంద్రంలో విదేశీ వ్యవహారాలు, దేశరక్షణ, కరెన్సీ – ఇలాంటివితప్ప మిగిలిన శాఖలు రాష్ట్రాలకుండాలని, కేంద్రం మిగిలిన విషయాలలో సమన్వయం చేయటానికి కృషిచేయాలని, ఇదే దేశ ఐక్యతకు మార్గమని గుర్తించాలి.

అయితే ఇంగ్లీషు ఉండాలనే సమస్యను ఎందుకు ముందు పెడుతున్నారని అడుగుతారు. తమిళ భాషను తదితర రాష్ట్రభాషలను వెంటనే కేంద్రభాషగాచేయమని అనలేరు. కనుక కేంద్ర పాలనా భాష హిందీగాకుండా ఇప్పటిదాకా అమలులో ఉంటూవున్న, అలవాటు పడియున్న ఇంగ్లీషు ఉండాలని అంటున్నారు. అంతమాత్రాన ఈ ఉద్యమం ఇంగ్లీషు అనుకూల ఉద్యమం అని చిత్రీకరించడం తప్పు. ఎవరైనా కొందరు వ్యక్తులుగా డి.యం.కె. లో, ఇంగ్లీషు అభిమానులుగా ఉన్న రాజాజీలాంటి ఇంగ్లీషు అభిమానులు ఈ ఉద్యమాన్ని బలపర్చినా, ఈ ఉద్యమానికి ఆ ధోరణి – ఇంగ్లీషు అనుకూలత – అంటగట్టడం తప్పు. డి.యం.కె. నాయకులు అన్నాదొరై వగైరాలు 14 భాషలు (అన్ని రాష్ట్రాల భాషలు) కేంద్రపాలనా భాషలుగా ఉండాలని ఘంటాపథంగా చెబుతున్నారు.

## ఆంధ్రలోనే ప్రారంభించవలసింది

ఈ ఉద్యమం కాంగ్రెసు భాషా విధానానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర కోరికపై వచ్చింది. అసలు ఈ సమస్యను ఆంధ్రలో మనమే తీసుకొని ఉద్యమం నిర్మించి వుండాల్సింది. మన మాతృభాషకు ఎంత అన్యాయం జరుగుతున్నా, ఇది సామాన్య ప్రజల జీవితాలపై ఎంతోనష్టాన్ని కలుగజేస్తున్నా మనం కదలలేదు. రాష్ట్రంలోనున్న కేంద్రప్రభుత్వ శాఖలో పనిచేసే వారుకూడా హిందీ నేర్చుకోవాలని ఆర్డరు వుంది. 1962 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ఆర్డరు జారీచేసింది. దాని ప్రకారం ఒక బంట్రోతు ఉద్యోగం చేసే వాడైనాసరే మూడు సంవత్సరాలలో అతను హిందీని విధిగా నేర్చుకోకుంటే ఇంక్రిమెంట్లు ఆపటం జరుగుతున్నది. ఈ ఆర్డరు అమలువల్ల తమ పోలీసు డిపార్టుమెంటులో చిక్కులేర్పడే పరిస్థితి ఉంటుందని ఇనస్పెక్టరు జనరల్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసుకోగా, ఆ డిపార్టుమెంటుకు వర్తింపజేయకుండా రద్దుపరచటం జరిగింది. ఈ ఆర్డరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల గూర్చి చేయబడింది. దీనికి వ్యతిరేకంగా మనం కదలలేదు.

హిందీని హైస్కూళ్ళలో నిర్బంధంగా ప్రవేశ పెట్టినపుడు హిందీలో ప్యాస్ అయితేనే పై తరగతికి పంపుతామని ఎస్.ఎస్.ఎల్.సి.లో 15వ శాతం మార్కులు వస్తేనే కాలేజీలో చదువు కొనసాగడానికి వీలుంటుందని ప్రభుత్వం అమలు జరుపుతున్నా – మన ప్రజల విద్యాభివృద్ధికి యిది పెద్ద ఆటంకమైనా దీనికి వ్యతిరేకంగా కూడా మనము కదలలేదు.

ఇప్పుడు మద్రాసులో జరిగినందుకైనా మనం సంతోషించాలి. ఈ ప్రభావంతోనైనా నెల్లూరు, చిత్తూరు, రాయలసీమ జిల్లాలు కదిలినాయి. త్రిపుర, బెంగాల్, అస్సాం, కేరళ, మైసూరు, మహారాష్ట్రల్లోకూడా వ్యాపించింది. హిందీని బలవంతంగా రుద్దరాదని, మాతృభాషల్లోనే పరిపాలన, విద్యాబోధన జరగాలని కొన్ని రాష్ట్రశాసన సభలుగూడా తీర్మానించాయి దాదాపు హిందీయేతర రాష్ట్రాల ప్రభుత్వ నాయకులు కూడా యిలాంటి ప్రకటనలు చేశారు. ఈ సమస్యపై కేంద్రమంత్రివర్గం సంక్షోభంలో పడింది. ఇద్దరు మంత్రులు రాజీనామాలు కూడా చేశారు. చివరకు ప్రజాభిప్రాయాన్ని పాటిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పుకోవలసి వచ్చింది. తాత్కాలికంగా వెనకడుగు వేశారు.

కాని, దీని పరిష్కారానికి కేంద్రం పూనుకొనేటట్టులేదు ఇటీవలకాంగ్రెస్ కార్యవర్గం చేసిన తీర్మానంకూడా హిందీని బలవంతంగా రుద్దే విధంగా పూర్వపు పంథాలోనే వుంది.

## త్రిభాషా సూత్రం

త్రిభాషా సూత్రం అమలు జరుపుతామంటున్నారు. ఏమిటి ఈ త్రిభాషా సూత్రం? బాలబాలికలకు విద్యాబోధన మాతృభాషలో జరిపినా, ఇంగ్లీషు, హిందీ భాషలనుకూడా స్కూళ్ళలోను, కాలేజీలలోను నిర్బంధంగా నేర్పాలి. దీనివలన, ఒక ప్రక్క మూడు భాషలు



నేర్చుకోవటం పిల్లలకు కష్టంగా వుంటుంది. మరొకప్రక్క ఆచరణలో మాతృభాషకన్నా, హిందీయే ప్రధాన భాషగా ప్రోత్సహింపబడుతుంది. ఈ అవగాహన వుండబట్టే విశ్వవిద్యాలయాల్లో మాతృభాషలో బోధనా ఏర్పాట్లు చేయలేదు. మాతృభాషను 1970 నుండి పరిపాలన భాషగా చేస్తామని, విశ్వవిద్యాలయాల్లో మాతృభాషలో 1966 నుండి బోధించి ఆ ప్యాసైన వారికే ప్రభుత్వవుద్యోగాలుంటాయని ప్రకటిస్తేగాని విశ్వవిద్యాలయాలు కదలవు. ఈ నిర్ణయాలు అమలుకు రావు.

హిందీ రాకుండా కేంద్ర ప్రభుత్వ సర్వీసులు రైల్వేలు, తంతి తపాలా మున్నగునవి ఎట్లా నిర్వహించగలరని మరొక వాదన. ఇది తప్పువాదన. ఈ సర్వీసులలో పనిచేసే ఉద్యోగులు మనరాష్ట్రంలో వుండేవారికి హిందీ అవసరమేముంది? తెలుగు భాషలోనే నిర్వహించవచ్చు. అలాగే అన్ని రాష్ట్రాలలోను చేయవచ్చు.

హిందీ అధికార భాషగా లేనిదే దేశ పరిపాలన సాగదని, అది దేశ విచ్ఛిత్తికి జాతివిచ్ఛిత్తికి దారితీస్తుందని వాదిస్తారు. కేంద్రంలో 14 భాషలు పాలనా భాషలుగా ఉండలేనని, హిందీ మెజారిటీ ప్రజల (20 కోట్ల ప్రజల) భాషయని, కనుక హిందీయే పాలక అధికార భాషగా వుండాలని వాదిస్తారు. దానికి మూలం ఒక్కటే. ఏమంటే బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా ఒకే భారత జాతిగా పోరాడామని దానికి ఒక భాష అందరూ నేర్చుకోవాలని లోగడ చెప్పిన నినాదాన్నే నేటికీ వల్లించడం తప్ప దాని సాధ్యాసాధ్యాలు ఆలోచించడంలేదు. భారతజాతి అనే పదం రాజకీయార్థంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో వాడబడింది. వాస్తవిక అర్థంలో భారతదేశం బహుభాషలు, బహుజాతులుగల దేశం. అందుచే 1951లో మన పార్టీ కార్యక్రమంలో హిందీ రాజభాషగా నిర్బంధంగా ప్రవేశ పెట్టవద్దని, జాతులకు సంపూర్ణ స్వయం నిర్ణయ హక్కు వుండాలని చాలా స్పష్టంగా వ్రాశాము. 1953లో మధురై మహాసభలో కొంత మెతకదనం వహించి, హిందీని లింకుభాషగా ప్రోత్సహించాలన్నాము.

## భాషా కమిషన్‌కు మన పార్టీ నివేదిక

1956 భాషా కమిషన్‌కు మన పార్టీ విధానాన్ని తెలియపర్చుటకు కేంద్ర కమిటీ అనేక చర్చల అనంతరం గావించబడిన తీర్మాణంలో పార్లమెంటులో అన్ని భాషలు వుపయోగించాలని అన్ని భాషల్లో మాట్లాడే హక్కుతోబాటు రిపోర్టులు, సమాధానాలు కూడా అన్ని భాషల్లో ఉండాలని, కేంద్రప్రభుత్వ చట్టాలు అన్ని భాషల్లోను వుండాలని, అలాగే సుప్రీంకోర్టులోకూడా అన్నిభాషల్లో మాట్లాడే హక్కుతోబాటు జడ్జిమెంట్లుకూడా (తర్జుమాలైనా) అన్ని భాషల్లో వుండాలని, రాష్ట్రపాలనా వ్యవహారాలు హైకోర్టుతోసహా అన్ని స్థాయిల్లోనూ విద్యాబోధన విశ్వవిద్యాలయాలతో సహా అన్ని స్థాయిల్లోను ఆ రాష్ట్ర భాషల్లోనే జరగాలని చెప్పడం జరిగింది. దీనితోబాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రజల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు

యితర వ్యవహారాలకు (కరస్పాండెన్సు కోసం) హిందీని లింకు భాషగా ప్రోత్సహించాలని అంతవరదాకా ఇంగ్లీషు కొనసాగాలని కూడా చెప్పాము.

## పార్టీ కార్యక్రమంలో చెప్పిన విషయం

నేటి మన పార్టీ కార్యక్రమంలో ఇలా చెప్పాము :

"ప్రజలకు విద్యాసంస్థలలో తమ తమ మాతృభాషల్లోనే విద్యాబోధన జరిగే హక్కు వుండాలి. ఆయా రాష్ట్రాల్లో ఆయా జాతీయభాషయే ప్రభుత్వసంస్థలలోనూ, పబ్లికు సంస్థలలోనూ భాషగా వుండటమేగాక, పరిపాలనా భాషగావుండాలి. అత్యంత వున్నత తరగతులవరకూ విద్యాలయాల్లో బోధనాభాషగా ఆ ప్రాంతీయ జాతీయభాషే వుండాలి. అవసరమైనచోట్ల ఒక ప్రాంతం యొక్కగాని ఒక అల్పసంఖ్యాక వర్గం యొక్కగాని భాషకూడా ఆ రాష్ట్ర జాతీయ భాషతోపాటు అదనంగా ఉపయోగించబడాలి. అఖిల భారత భాషగా హిందీ వినియోగాన్ని నిర్బంధం చేయరాదు. అయితే వివిధ రాష్ట్రాల ప్రజలమధ్య ఉపయోగం కోసం హిందీని ప్రోత్సహించబడాలి. ఆ రాష్ట్రాల్లో పరిపాలనా భాషగా ఇంగ్లీషు స్థానే ప్రాంతీయ భాషలను, కేంద్రంలో ఇంగ్లీషుస్థానే హిందీని ప్రవేశపెట్టాలనే సూత్రానికి కట్టుబడి వుండాలి. రాష్ట్రాల్లో ఇంగ్లీషు నుండి ప్రాంతీయ భాషలకు మారినప్పుడే కేంద్రంలో ఇంగ్లీషు నుండి హిందీకి మారడం సాధ్యమవుతుంది. ప్రభుత్వ భాషగా ఇంగ్లీషుస్థానే హిందీని ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొనే చర్యలతోపాటు రాష్ట్రాల్లో కూడా ప్రాంతీయ భాషలను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయపడాలి. అదే సమయంలో కేంద్రంలో ఇంగ్లీషు నుండి హిందీకి ఎంతకాలంలో మారాలన్న విషయాన్ని హిందీయేతర భాషలు మాట్లాడే ప్రజల సమ్మతిపైన నిర్ణయించాలి. అంతేకాదు; ఈ పరివర్తన దశలో ఇంగ్లీషుకు తోటిపాలనాభాషహోదాను కల్పించాలి. పార్లమెంటులోనూ, కేంద్ర పరిపాలనా వ్యవహారాల్లోను అన్ని జాతీయ భాషల సమానత్వాన్ని గుర్తించాలి.

"పార్లమెంటు సభ్యులు ఏ జాతీయ భాషలో మాట్లాడటానికైనా హక్కు కలిగి ఉంటారు. వెంటనే వారి ప్రసంగాలను ఇతర భాషల్లో అనువదింప చేయాలి. అన్ని చట్టాలు, ప్రభుత్వ ఆర్డర్లు; తీర్మానాలు అన్ని జాతీయ భాషల్లోనూ ప్రచురించబడాలి. ఉర్దూ భాషకూ, దాని లిపికి రక్షణ యివ్వాలి."

(పార్టీ కార్యక్రమం పేజీ 77, పేరా నెం. 18)

దీని తర్వాత, మద్రాసులో వచ్చిన ఉద్యమం ఫలితంగా ఈ సమస్యపట్ల మన మొత్తం అవగాహనను లోతుగా ఆలోచించడానికి పురిగొలిపింది.

మితవాద కమ్యూనిస్టులు మొదట ఈ ఉద్యమాన్ని వ్యతిరేకించారు. ప్రజాఘాటిని చూచి తరువాత తమ భాషా వైఖరిని కొంతసవరించుకొన్నారు. వాళ్ళ జాతీయ సమితి,



తమిళనాడు రాష్ట్ర కమిటీ చేసిన తీర్మానాల్లో అన్ని భాషలు సమానంగా ఉండాలన్నారు. ఇంగ్లీషు స్థానంలో క్రమంగా హిందీని ప్రవేశపెట్టాలని అంతవరదాకా ఇంగ్లీషు కొనసాగాలని చెప్పారు.

కాని నేడు కాంగ్రెసు వర్కింగు కమిటీ జూన్ నెలలో (1965) చేసిన తీర్మానం దాదాపు సరిగానే ఉందని బలపరుస్తున్నారు. మూడు భాషలను నిర్బంధంగా హైస్కూళ్ళలోనూ, కాలేజీలలోనూ నేర్పాలన్న విషయాన్ని బలపరుస్తున్నారు. కేంద్రంలో అన్ని భాషలకు సమానత కల్గించి ఉపయోగించాలన్న నినాదాన్ని వదులుకున్నారు. హిందీ, ఇంగ్లీషు రెండింటినీ కేంద్రప్రభుత్వ ఉద్యోగస్తులందరూ నేర్చుకొని తీరాలన్న కాంగ్రెసు వర్కింగు కమిటీ నిర్ణయాన్ని కూడా వారుమక్కీకి మక్కీ బలపరుస్తున్నారు. అంటే మరో పర్యాయం పెట్టుబడిదారీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రక్క తాళం వేయడానికి పూనుకొన్నారు.

## కాంగ్రెస్ పాలసీ పరిశీలన

భారతీయ జాతీయ కాంగ్రెస్ కార్యవర్గ తీర్మానంలో :

1. నెహ్రూ హామీలను అమలు జరపడానికి అధికార భాషా చట్టాన్ని సవరించాలన్నారు. హిందీతోబాటు ఇంగ్లీషు ఏయే విషయాలలో పరిపాలన వ్యవహారాలను కేంద్రంలో సాగించాలో ఆ చట్టంలో రూపొందించాలన్నారు.

2. త్రిభాషా సూత్రాన్ని హైస్కూళ్ళలోనేగాక కాలేజీలలో కూడా అమలు జరపాలని.

3. రాష్ట్ర భాషలలోనే విశ్వవిద్యాలయాలలో బోధన, రాష్ట్ర పరిపాలన జరగాలని.

4. యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్షలు అన్నీ రాష్ట్ర భాషలలో జరగాలని కాని జనాభా ప్రాతిపదిక మీద కోటా పద్ధతి సాధ్యంకాదని వదిలి వేశారు. హిందీలోనూ, ఇంగ్లీషులోనూ నిర్బంధ పరీక్షా పత్రాలుంటాయి. హిందీ భాషా ప్రజలకు 8వ షెడ్యూల్‌లోని మరేదయినా భాషలో నిర్బంధ పరీక్షాపత్రముంటుంది.

నెహ్రూ హామీ ఏమిటి? హిందీయేతర రాష్ట్రాలు కోరుకొనేదాకా ఇంగ్లీషు కూడా సహాయక (అసోసియేట్) భాషగా పాలనా వ్యవహారాల్లో ఉంటుందని అన్నారు.

కాంగ్రెసు కార్యవర్గం ఫిబ్రవరి నెలలో చేసిన తీర్మానంలోని "కోటా పద్ధతిని" "యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలు అన్ని భాషల్లో జరగాలని" వున్న అంశాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఇది దేశ విచ్ఛిత్తికి దారితీస్తుందని ఉత్తరాదిలోను, దక్షిణాదిలోను వున్న బడా బూర్జువా పత్రికలు వ్రాశాయి. నేడు కోటా పద్ధతిని మానుకొన్నా, యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్షలు అన్ని రాష్ట్ర భాషలలో జరపాలనేదాన్ని కూడా బడా పెట్టుబడిదారీ పత్రికలు వ్యతిరేకిస్తున్నాయి. స్వతంత్ర పార్టీ కూడా ఈ సమస్యపై రెండు

అభిప్రాయాలు కలిగివుంది. ఉత్తరాదివారు హిందీ వుండాలని, దక్షిణాదివారు ఇంగ్లీషు వుండాలని ప్రకటిస్తున్నారు.

వాస్తవం చెప్పాలంటే ఈ రెండూ అమలుజరిగితే (కోటా పద్ధతి, పబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్షలు అన్ని భాషల్లోను) మాతృ భాషలే ప్రధానమవుతాయి. హిందీ, ఇంగ్లీషు నేర్చుకోకుంటే ఉద్యోగాలు లభించవనే భీతి వుండదు. కనుక వాటిని నేర్చుకోవలసిన అవసరం – ఇష్టపూర్వకంగా కావాలని నేర్చుకొనేవారికి తప్ప – ఉండదు. ఈ విషయాన్ని గమనించే బడాబూర్జువా పత్రికలు దేశం విచ్ఛిన్నమవుతుందని (వారి గుత్తాధిపత్యానికి దెబ్బ వుంటుందని) కాకిగోల చేస్తున్నాయి.

## ప్రమాదకరమైన త్రిభాషా సూత్రం

మనలో కూడా కొందరు "త్రిభాషా" సూత్రాన్ని అంగీకరించాలని అంటున్నారు. ఇది తప్పు. త్రిభాషా సూత్రం ప్రమాదకర సూత్రం. లోగడ యిది స్కూల్ ఫైనల్‌వరకే పరిమిత మొనర్చబడింది. ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లోకూడా అమలు జరపాలని కేంద్రం అంటున్నది. ఇట్లా ఇది మరింత క్లిష్టమొనర్చడం జరుగుతుంది. ఈ సూత్రం మాతృభాషాభివృద్ధికి ఆటంకం, ప్రమాదం కూడానూ.

1. కాంగ్రెసు కార్యవర్గ తీర్మానాలు అమలులోకి వస్తాయా? ఇటీవలనే ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి మాతృభాషల్లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు జరపడానికి 5 ఏండ్లు పడుతుందని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో మాతృభాష బోధనాభాషగా ఎన్ని ఏండ్లు పట్టేది, రాష్ట్ర పరిపాలనను మాతృభాషలలో జరపడానికి ఎన్ని ఏండ్లు పట్టేది చెప్పలేదు. మాతృభాషల్లో విశ్వవిద్యాలయాల్లో కూడా విద్య నేర్చుకోకుండా యూనియన్ పబ్లిక్ సర్వీసు కమీషన్ పరీక్షలల్లో మాతృ భాష వాడటం సాధ్యంకాదు. అదేవిధంగా రాష్ట్ర పరిపాలననుకూడా మాతృ భాషలలో ఆరంభించనంతకాలం, కేంద్ర ఉద్యోగాలకు మాతృభాషలలో పరీక్షలు ఏర్పాటు చేస్తామనడం వట్టి బూటకమవుతుంది. ఇంగ్లీషులోనూ, హిందీలోనూ మాత్రం సాగుతాయి. కళాశాలల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ ఒకేసారి యిది (మాతృభాషగా) అమలుజరపబడాలేగాని ప్రయోగాత్మకంగా ఒకటి రెండు కళాశాలల్లో అమలు జరిపితే లాభంలేదు. ఉదాహరణకు తమిళనాడులో విద్యాశాఖా మంత్రిగా వున్న శ్రీ సుబ్రమణ్యం అన్ని పార్టీలతోనూ ఆలోచించి ఒక సూచన చేశారు. ఆర్ట్సు కళాశాలల్లో సైన్సువదలి మిగతా పాఠ్య అంశాలన్నీ మాతృభాషలో బోధించాలన్నారు. కాని వైస్ ఛాన్సలర్‌గావున్న డా. లక్ష్మణస్వామి మొదలియార్ ఖచ్చితంగా వ్యతిరేకించారు. అయినా ప్రయోగాత్మకంగా ఒకటి రెండు కళాశాలల్లో పెట్టితే విద్యార్థులు పోలేదు. చదువు పూర్తి అయిన తర్వాత ప్రభుత్వం ఉద్యోగాలు, పరిశ్రమలలో, వర్తక కంపెనీలలో ఉద్యోగ అవకాశాలకు ఇంగ్లీషులో



ప్యాసయినవారికే ఉన్నప్పుడు మాతృభాషలలో కొంతమందిని నేర్చుకోమంటే వారెందుకు నేర్చుకొంటారు?

కీలక విషయమేమిటంటే : కేంద్రంలో ఉద్యోగాలు కోటాపద్ధతి ప్రకారం అమలు జరిగేదాకా మాతృభాషలో విద్య నేర్చుకోవటానికి విద్యార్థులు సిద్ధపడరు. అలాగే రాష్ట్రంలో ఉద్యోగాలు మాతృభాషలో విద్యవచ్చినవారికే యిస్తామని ప్రకటించి అమలుపరిచేదాకా మాతృభాషలో విద్యాబోధనకు పూనుకోరు. ఇందుకుగాను వీలైనంత దగ్గరలో ఒక గడువుపెట్టి ఆనాటినుంచి అమలుకు వస్తుందని, మాతృ భాషలో పరీక్షలు, ఉద్యోగాలు ప్రవేశపెడతామని ప్రకటిస్తేనే విద్యార్థులు సిద్ధపడతారు.

త్రిభాషా సూత్రం అమలులోవుంటే ఇది జరుగదు. గత 18 సంవత్సరాల అనుభవం ఇదే రుజువు చేసింది. ఆచార్య కృపలానీ ఒక సందర్భంలో మాట్లాడుతూ, ఈ మంత్రులూ, ఉద్యోగులూ వున్నంతకాలం హిందీభాష రాదని, ఎందుకంటే వారి పిల్లలు కాన్వెంటు స్కూళ్ళలో ఇంగ్లీషు నేర్చుకుని ఉద్యోగాలు పొందుతున్నారని అన్నారు. అందువలన పైన తెలిపిన విధంగా ఉద్యోగాల గ్యారంటీ, కోటాపద్ధతి గ్యారంటీ ఒక సమీపగడువులో (మూడు ఏండ్లలోనో, ఐదేండ్లలోనో అని నిర్ణయించి) అమలు జరుపకుంటే, మాతృభాషలు అభివృద్ధికావు. ఎవరూ నేర్చుకోరు.

## ఇతర భాషల అవసరం హిందీ వారికేముంది?

2. హిందీ రాష్ట్రాలలో త్రిభాషాసూత్రం అమలు జరపడమంటే ఏమిటో ఆలోచించండి. హిందీరాష్ట్రాలలోని ప్రజలు తమకు దైనందిన కార్యకలాపాలలోగాని, లేదా కేంద్ర ఉద్యోగాల బాధ్యతలను కార్యకలాపాలను నిర్వహించడానికిగాని, శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని సముపార్జించడానికిగాని, ఉపయోగంలేని మూడవ భాషను ఎందుకు నిర్బంధంగా నేర్చుకోవాలి? హిందీయేతర రాష్ట్రాలలోనివారు కేంద్ర ఉద్యోగాలు కావాలంటే ఇంగ్లీషుతోపాటు హిందీని నేర్చుకోక తప్పదని, కేంద్ర ప్రభుత్వ కార్యకలాపాలు కొన్ని ఏండ్లపాటు హిందీ, ఇంగ్లీషులలో రెండింటిలో సాగినా, ఆఖరుకు హిందీలోనే సాగిస్తామని, కాంగ్రెసు వర్కింగు కమిటీ నిర్ణయం కాబట్టి, అది కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తుంది. కాబట్టి హిందీ రాకపోతే కేంద్ర ఉద్యోగాలు రావుకాబట్టి వారు నేర్చుకోక తప్పదు. కాని కేంద్ర ప్రభుత్వ కార్యకలాపాలు, ఇతర రాష్ట్ర భాషలలో జరుపనవసరంలేదు, జరుపబడవు. కేంద్రంలో వానికి సమానతలేదు అని ప్రకటించిన తర్వాత హిందీ భాషా ప్రజలు, ఇతర భాషలలో దేనినైనా నేర్చుకోవాలని నిర్బంధించడంలో అర్థమేమిటి?

పబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్షలలో హిందీ, ఇంగ్లీషుగాక 8వ షెడ్యూలులో 14 భాషలలో, మరొక భాషలో పరీక్షాపత్రము వుంటుందని నిర్బంధిస్తున్నారు కాబట్టి ఆ

గండాన్నుండి బయటపడడానికి సంస్కృతాన్నిగాని, లేక ఉర్దూగాని మూడవభాషగా తీసుకొని సర్వీసు కమిషన్ పరీక్షలలో కూర్చుంటే ఈ వర్కింగు కమిటీ నిర్ణయానికి మిగిలిన విలువ ఏమిటి? ఉర్దూ భాషలిపివేరు, పారశీకం, అరబ్బు పదాలు హిందీలోకన్నా ఎక్కువగా ఉంటాయి. ఇది తప్ప మరి పెద్ద భేదం లేనప్పుడు ఉర్దూను నేర్చుకోవడం తేలిక అయినప్పుడు మరో ఆధునిక భారతీయ భాషను వారెందుకు నేర్చుకుంటారు? లేక సంస్కృతాన్ని మూడవ భాషగా నేర్చుకొంటే వారి హిందీ భాషా విజ్ఞానానికి మరింత పునాది కలుగుతుందని దానినే నేర్చుకొన్నా, మూడవ భాషను నిర్బంధం చేయడంలో, వివిధ భాషా జాతులమధ్య అన్యోన్యత, సమాన అవకాశాలు కల్పించాలనే ఆశయం ఎలా నెరవేరుతుంది?

అందుచే కేంద్ర ఉద్యోగాలు సంపాదించుకోవడానికి దానిని మాతృభాషగాక హిందీ, ఇంగ్లీషు లేదా మరేదయినా భాషను, అంటే అదనంగా మరో రెండు భాషలు నేర్చుకోవాలనడం నిర్బంధం చేయడం సమస్యను మరింత క్లిష్టంచేయడం తప్ప పరిష్కారమార్గము కాదు.

మరో 10 లేక 15 ఏండ్లయినా హిందీలోనే కేంద్రవ్యవహారాలన్నీ నడపాలని సూత్రీకరించి, దానిని అమలులో పెట్టడానికి పూనుకున్నప్పుడు తాత్కాలికంగా కొన్ని సదుపాయాలు చేసినా ఆఖరుకు హిందీని, అన్ని భాషా జాతులమీద నిర్బంధంగా అధికార భాషగా, పాలక భాషగా రుద్దడానికి పూనుకునే చర్యకాక మరేమవుతుంది? ఇతర భాషా జాతులను వారి భాషలకు సమాన ప్రతిపత్తి కల్పించకుండా హిందీ భాషనే రుద్దాలనే ప్రయత్నం దేశ ఐక్యతకు తోడ్పడదు. పైగా తమపై అధికారం చలాయించడానికి పూనుకున్న ఒక గ్రూపు యొక్క జాతీయ దురహంకారానికి వ్యతిరేకంగా తదితర భాషా జాతులు ఆందోళనా తిరుగుబాటు కార్యక్రమాలకు ప్రోద్బలమిచ్చి దేశ ఐక్యతకు తీరని హాని కలుగుతోంది.

## నిరుపయోగమైన సూత్రం

3. త్రిభాషా సూత్రం ఎలా నిరుపయోగమో మరో దృక్కోణం నుండి పరిశీలిద్దాం:

5 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాల వయస్సు బాలబాలికలు అనగా మొదటి తరగతి నుండి 7 లేక 8వ తరగతి వరకు ప్రాథమిక విద్య నభ్యసించే యీడుగల పిల్లలకు తమ మాతృభాషగాక, మరొక భాష నేర్చుకోవడం సాధ్యంకాదు. రాష్ట్ర సరిహద్దుల్లో వుండేవారికి ఆ సరిహద్దులలో వాడుకలోనున్న ఆ రెండు రాష్ట్ర భాషల అవసరముంటుంది. వాడుకలోకూడా ఏదోవిధంగా వుంటుంది కనుక ఆరెండవ భాషనుకూడా నేర్చుకోవడం తేలిక అవుతుంది.

మన ఆంధ్రప్రదేశ్‌కు వర్తింపచేసి చూద్దాం. ప్రభుత్వ లెక్కల ప్రకారం మొదటి తరగతి చదివే బాలబాలికల సంఖ్య 10 లక్షలు అయితే 5వ తరగతి చదివే బాలబాలికల సంఖ్య 2 1/2 లక్షలు. అంటే ఐదవ తరగతికి వచ్చే వరకే చదివే పిల్లల సంఖ్య సుమారు



నాల్గవ వంతుకు తగ్గింది. పై తరగతుల కెళుతున్న కొలదీ ఈ సంఖ్య మరింత తగ్గుతోంది. ఆరవ తరగతిలో ఆ సంఖ్య 1 1/2 లక్షలకు పడిపోతూవుంది. దీనిని ఇంకా విడమర్చి చూస్తే 8వ తరగతిలో ఉత్తీర్ణులైన 9వ తరగతికి వచ్చేవరకు 60, 70 వేలు, స్కూల్ ఫైనల్‌కు వచ్చేవరకు 50 వేల వరకు ఉంటున్నారు. అనగా పై తరగతులకు పోతున్న కొద్దీ విద్యావసతులు అందుబాటులో లేక, ఆర్థిక ఇబ్బందులవలన చాలా తగ్గుతూ వస్తున్నారు. కాలేజీల్లో చదువుకుని పట్టభద్రులయ్యేవారి సంఖ్య 10 వేలు మాత్రమే.

7వ తరగతి లేదా 12 ఏండ్ల వయస్సుకు పైబడినవారికి ఐచ్ఛికంగా హిందీగాని, ఇంగ్లీషునుగాని నేర్చుకోవడానికి ప్రతి స్కూలులో ఏర్పాట్లు చేయవచ్చు. ఆలోపు వారికి మరోభాష అనవసరం. స్కూలు ఫైనల్ చదివేవారు ఉన్నత కేంద్రప్రభుత్వ ఉద్యోగాలు ఏమీ చేయలేరు. కనుక వారికికూడా హిందీ నిర్బంధంగా బోధించడం అనవసరం విశ్వవిద్యాలయాల్లోకూడా అందరికీ హిందీగాని, ఇంగ్లీషుగాని నిర్బంధంగా నేర్పడం అనవసరం. సైన్సు సాంకేతికంలాంటి పాఠ్య అంశంగల వారికి ఇంగ్లీషును నిర్బంధం చేయాలనుకున్నా ఆ కొద్దిమందికి ఆ భాషను నిర్బంధం చేయవచ్చు. వారికి అవసరము. నేర్చుకుంటారుకూడాను. ఆ సైన్సు శాఖలను తీసుకున్న వారికి ఇంగ్లీషులో వున్న పుస్తకాలు చదివి అర్థంచేసుకోవడానికి 6 నెలలు ఆ భాష నేర్పి ఆ తరువాత పాఠ్యాంశాలు బోధించవచ్చు. ఈ పద్ధతి తేలికైన పద్ధతి, అంతేగాని, ఎప్పుడూ కళాశాలలో ఉన్నత శాస్త్ర విజ్ఞానానికి ఇంగ్లీషో మరో భాషో అవసరమవుతుందని ప్రాథమిక పాఠశాలల నుండి ఇంగ్లీషును నిర్బంధంగానే నేర్పడం వృథా ప్రయాస. అలాగే కేంద్ర ప్రభుత్వంలో కొంతమందికి ఉద్యోగాలు కావాలి కాబట్టి హిందీ, ఇంగ్లీషులు ప్రాథమిక పాఠశాలల నుండే నిర్బంధంగానే నేర్పడంకూడా శుద్ధ అవివేకం. ఆ ఉద్యోగాన్ని సంపాదించిన తరువాత హిందీని, ఇంగ్లీషును అవసరమైన మేరకు భాషాటెస్టు పెట్టి ప్యాసు కావాలని పెట్టవచ్చు.

ప్రభుత్వ ప్రకటన ప్రకారమే 1980 నాటికి కూడా ఏడవ తరగతి వరకు 12, 14 సంవత్సరాల ఈడుగల బాలబాలికలందరికీ చదువు చెప్పలేమని అంటున్నారు. అటువంటప్పుడు హైస్కూలు వరకుకూడా (వీరిసంఖ్య కొద్దిగానే ఉంటుంది గనుక) త్రిభాషా సూత్రం నిర్బంధం చేయటం అనవసరం. ప్రపంచంలో ఏ దేశంలోనూ నేడు మరో భాషను నిర్బంధం చేయటం జరగడం లేదు.

## కేంద్ర పాలన సమన్వయం

కోటా పద్ధతి ఉండకూడదని యూనియన్ పబ్లిక్ సర్వీసు కమీషన్ పరీక్షలు మాతృభాషలోనే జరిపినా దానిలో ఇంగ్లీషు, హిందీ భాషలలో నిర్బంధంగా పరీక్షా

పత్రాలుంటాయనీ, స్కూళ్ళలోనూ, విశ్వవిద్యాలయాల్లో కూడా త్రిభాషా సూత్రం నిర్బంధంగా అమలు జరపాలని, విధిగా త్రిభాషలు నేర్చుకుంటేనే ఉద్యోగాలిస్తామని అంటే మాతృభాషల అభివృద్ధి గురించి చెప్పే మాటలన్నీ వట్టి బూటకమని చూశాము.

ఇన్ని భాషల వైవిధ్యంతో కేంద్రపాలన సమన్వయం ఎలా జరుగగలదని కొందరు ప్రశ్నిస్తారు. దానికి ఒకటే సమాధానం. అచట అన్ని భాషానువాదాలకు కేంద్రమే తగు ఏర్పాట్లు చేసుకోవాలి.

ఇది ఎలా సాధ్యమంటారా? ప్రపంచానుభవమే సాధ్యమనితెలియజేస్తోంది. బహు చిన్న దేశమైన స్విట్జర్లండును చూద్దాం. అచ్చట జనాభాలో జర్మన్లు 70 శాతం, ఫ్రెంచి 20 శాతం, ఇటాలియన్లు 9 శాతం, రోమను భాష మాట్లాడేవారు ఒక శాతం వున్నారు. ఈ నాలుగు భాషలూ రాజభాషలుగానే వున్నాయి. కేంద్రవ్యవహారాలన్నీ నాలుగు భాషల్లోనూ జరుగుతున్నాయి. అలాగే కెనడాలో ఫ్రెంచి, ఇంగ్లీషు రెండూ రాజభాషలుగానే వున్నాయి. బెల్జియంలో ఫ్రెంచి, ఫ్లెమీష్ భాషలు, ఫిలిప్పైన్స్‌లో గూడా రెండు భాషలూ రాజభాషలుగానే వున్నాయి.

మన దేశంలోని వివిధ జాతులు ఒక్కొక్కటే ఐరోపా ఖండంలోని పెద్ద దేశాలనబడే ఫ్రాన్సు, ఇంగ్లండు, ఇటలీ, జర్మనీలంతటి దేశాలుగా భూభాగంలోనూ, జనాభాలోనూ వున్నాయి. స్వాతంత్ర్యోద్యమ రోజుల్లోకూడా జాతులుసమాన హోదాలో స్వయంపాలన గావించుకునేహక్కు గుర్తించబడింది. భాషా రాష్ట్రాలను గుర్తించింది. కాంగ్రెసు నాయకత్వం వాగ్దానం కూడా చేసింది. ఈ చరిత్రనంతా దృష్టిలో వుంచుకోవాలి. ఈ జాతులన్నిటిని ఐక్యపరచి కలుపుకపోయే విధంగా వుండాలి. లేనిచో బడాబూర్జువాజీ హిందీని బలవంతంగా రుద్దితే దానికి విరుద్ధంగా "నాభాష" "నారాష్ట్రం" అనే సమస్యలే ప్రధానంగా వస్తాయి. దేశం విచ్ఛిన్నానికే దారితీస్తుంది.

## రాష్ట్రాలు కేంద్రం జేబు సంస్థలు కారాదు

అలాగే కేంద్రాధికారాలు తగ్గాలి. ప్రస్తుతం సివిల్‌శాఖ (ఐ.ఎ.యస్.), పోలీసుశాఖ (ఐ.పి.యస్.), వైద్యశాఖ (ఐ.యం.యస్.), వ్యవసాయశాఖ, అటవీశాఖ, ఇంజనీరింగు, విద్యాశాఖల సర్వీసులు కేంద్రం చేతిలో వున్నాయి. మొదటిలో కేంద్రానికి ఈ రెండు (సివిల్, పోలీసు) సర్వీసులు మాత్రమే వుంటే ఇప్పుడు ఇవన్నీ చేతపట్టుకుంది. ఆర్థిక, ఆదాయవనరులు, ఉద్యోగాలు మొత్తంచేత పట్టుకుంది. ఇట్లు రాష్ట్ర పాలనలో వుండే ముఖ్య ఉద్యోగులుకూడా కేంద్రం యిచ్చే ఎక్కువ జీతాలకు క్రమశిక్షణకు విధేయులుగా వుండి రాష్ట్రాలను కేంద్రంయొక్క జేబుసంస్థలుగా చూసే పద్ధతిలో పరిణామం చెందుతోంది. ఈ స్థితి మారాలి.



ఈ సందర్భంలో ఒక విషయాన్ని గమనించాలి. కేంద్రం పాలన, పార్లమెంటు, సుప్రీంకోర్టులలోలాగ హైకోర్టులన్నింటిలోనూ 14 భాషలు వాడవలసిన పని లేదు. ఆయారాష్ట్ర భాషలు ప్రధానంగా వుంటాయి. ముఖ్యమైన జడ్జిమెంటులు ఇతర భాషలలోకి అనువదించవచ్చు.

అనువాదాలు యిబ్బంది వుంటుందని భావిస్తే వివిధ భాషాప్రాంతాల నుండి ఎన్నికైన పార్లమెంటుకువచ్చే సభ్యులు నోరుమూసుకుని చూచుకొంటూ కూర్చుండవలసిందే. అలాగే కోర్టులలో మాతృభాషలు అమలులోవుంటేనే అన్ని చట్టాల తీర్పులు ప్రజలు అర్థం చేసుకుంటారు. తమ తమ కేసుల్లో తగు విధంగా నడుపుకునే ఏర్పాట్లు స్వయంగా చేసుకుంటారు. ఇప్పటిలాగా కేవలం ఒక్కలాయరునుమాత్రమే పెట్టి తన కర్థంకాని భాషలో నడుస్తూవుంటే విచారణలను ఎడ్డివాడి మాదిరిగా నిల్చొని లాయర్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వుండవలసిన పనివుండదు. మార్క్సిస్టులం ఎల్లప్పుడు మరచిపోని విషయమొకటి వుంది. ఒక భాష మరొక భాషపై పెత్తనం చేయటాన్ని వ్యతిరేకిస్తాము. కాని భాషాద్వేషాలకు లోనయ్యేవారము కాము. అన్ని భాషలను సమానంగా గౌరవిస్తాము. అలాగే రేపు అన్ని జాతులవారము ఐక్యంగా కలసివుంటూ తమ సౌలభ్యంకోసం, అవసరం కోసం ఏ భాషనైనా హిందీనైనా నేర్చుకోవచ్చు. నిర్బంధం మాత్రం వుండరాదు. మాతృభాషలు అణచబడరాదు. భవిష్యత్తులో సమన్వయం కోసం ఐచ్ఛికంగా ఏ భాషను పెట్టుకున్నా – హిందీని పెట్టుకున్నా కూడా మనకేమీ అభ్యంతరం వుండదు. అది ఒక భాషను పెట్టుకుంటారా కొన్ని భాషలను పెట్టుకుంటారా, అనేది ఐచ్ఛికంగా కలిసివుండే రోజుల్లో ఆనాటి స్థితినిబట్టి నిర్ణయించుకుంటారు.

దేశ సమైక్యతకు భాషా సమస్య ఒక అంశం (యాస్పెక్టు) మాత్రమే. ఇదివరకు చెప్పినట్లు ఉద్యోగాలు, ఆర్థికవనరులు మున్నగునవి రాష్ట్రాలకే అధికారముండాలి. అయితే కేంద్రానికి ప్రత్యేకాధికారాలుండవచ్చు. ఉండాలికూడా, ఏమిటంటే విదేశాంగశాఖ, దేశ రక్షణశాఖ, నాణెముల తయారీ – ఇలాంటివి కేంద్రానికి ఉండాలి. మిగతావన్నీ రాష్ట్రాలకే వుండాలి.

సిద్ధాంత దృక్కోణంనుండి పరిశీలించినా ఇదేవిధంగా వుంది. కామ్రేడ్ లెనిన్ అధికార భాషపై చాల వ్రాశాడు. ఏ ఒక్క భాష అధికార భాషగా ఉండరాదన్నాడు. రష్యా భాష మెజారిటీ భాషగా వుందికాబట్టి పాలకభాషగా వుంచాలనే వాదనలు ఖండించాడు. ఎక్కువభాషలుంటే సమన్వయం చేయలేమన్న వాదనలు కూడా త్రోసిపుచ్చాడు. సోవియట్ యూనియన్‌లో అన్ని భాషలు రాజభాషలే. 15 యూనియన్ రిపబ్లిక్కులున్నాయి. 15 భాషలు యూనియన్‌లో రాజభాషలే. అలాగే రిపబ్లిక్‌లలో స్వపరిపాలనా ప్రాంతాలున్నాయి. అచ్చట

ఆయా జాతుల భాషలలోనే పరిపాలనా వ్యవహారాలు జరుగుతూ వున్నాయి. ఇన్ని భాషలున్నా సోవియట్ పరిపాలనకు ఎన్నడూ ప్రతిబంధకాలుగా తయారుకాలేదు.

## మన పరిష్కార మార్గం

గనుక భాషా సమస్యకు మన పరిష్కారమార్గం ఇలా వుండాలి :

1. రాష్ట్రంలో పరిపాలన భాషగా, విద్యాలయాల్లో, విశ్వవిద్యాలయాలతో సహా బోధనభాషగా మాతృభాషే వుండాలి.

2. హిందీగాని, ఇంగ్లీషుగాని ప్రాథమిక పాఠశాలలో ఏడు ఎనిమిదవ తరగతులలో ప్రవేశపెట్టరాదు. హైస్కూలులో 8 లేక 9వ తరగతి నుండి (ఆయా రాష్ట్రాలలో హైస్కూలు విద్య ఏ తరగతి నుండి ఆరంభమవుతుందో దానిననుసరించి) హిందీగాని, ఇంగ్లీషుగాని లేదా రెండింటినిగాని ఐచ్ఛికంగానేర్చుకోవడానికి అవకాశాలు ఏర్పరచాలి.

3. విశ్వవిద్యాలయంలో కూడా ఇంగ్లీషు లేక హిందీ లేక రెండూ ఐచ్ఛికంగా నేర్చుకోవడానికి ఏర్పాట్లు చేయాలి. శాస్త్ర పాఠ్యాంశాలు, టెక్నికల్ కోర్సులు లోతుగా అధ్యయనం చేయడానికి అవసరమనుకున్న వారికి ఇంగ్లీషును ఒక పాఠ్యాంశంగా చేర్చాలి. ఆ శాస్త్రాలుకూడా మాతృభాషలలోనే బోధిస్తూ ఇంకాలోతుగా ఆ శాస్త్రాన్ని అధ్యయనం చేయడానికి ఇంగ్లీషును నేర్పాలి. ఆ కోర్సులో ప్రవేశం దొరికిన తరువాత పుస్తకాలు చదివి అర్థం చేసుకోగలిగిన ఇంగ్లీషు భాషాజ్ఞానం రావడానికి ఆరుమాసాలో, సంవత్సరమో నేర్పవచ్చు.

4. కేంద్ర పార్లమెంటువ్యవహారాలు, కేంద్ర పరిపాలనా 14 భాషలలోనూ (ఇంగ్లీషుతోసహా) జరపాలి. 14 భాషలకు సమానహోదా యివ్వాలి. ప్రభుత్వ ప్రకటనలు, గజెట్‌లు, రిపోర్టులు, రూల్సు, జాబితాలు సర్వమూ 14 భాషలలోనూ వుండాలి. సుప్రీం కోర్టులోకూడా ఆయా రాష్ట్ర భాషల్లో, ఆయా క్లయింటు, అడ్వకేటు కోరుకొన్న భాషలో వాదించడానికి, జడ్జిమెంటు పొందడానికి, హక్కులుండాలి, జడ్జీలకు ఆ భాష రాకుంటే వాదనలను, జడ్జిమెంటులను తర్జుమా చేయించడానికి ఏర్పాట్లు చేయాలి.

5. కేంద్ర ఉద్యోగులను తీసుకోడానికి, పరీక్షలు 14 భాషలలోనూ జరపాలి. భాషా రాష్ట్రాలకు జనాభా ప్రాతిపదికమీద కేంద్ర ఉద్యోగాలలో కోటాలు ఏర్పాటుచేయాలి.

6. భాషా రాష్ట్రాలకు గ్రామాలను యూనియటుగా తీసుకొని సమగ్రంగా భాషా రాష్ట్ర సరిహద్దులను ఏర్పరచాలి.



7. కేంద్రానికి అవసరమైన దేశరక్షణ, విదేశీ వ్యవహారాలు, ద్రవ్య నాణెములు (కరెన్సీ) ఇలాంటివే మరో ఒకటి రెండు శాఖలుతప్ప మిగిలిన శాఖలు రాష్ట్రాలకు వికేంద్రీకరణ చేయాలి.

8. కేంద్ర డిపార్టుమెంటులలో, పరిపాలనలో ఫైల్సుమీద నోటింగు వగైరా నిత్యకార్యక్రమాన్ని సాగించడానికి సౌలభ్యంకోసం హిందీ ఐచ్ఛికంగా నేర్చుకోడానికి ప్రోత్సహించవచ్చు. అలా నేర్చుకున్నా తర్జుమా చేయించడానికి పూర్తి ఏర్పాట్లుచేయాలి.

రాష్ట్రాలలో పరిపాలన విశ్వవిద్యాలయాలలో బోధనా భాషగా మాతృభాషలను ప్రవేశపెట్టిన తర్వాతనే, కేంద్ర పరిపాలనలో అన్ని రాష్ట్ర భాషలకు సమానహోదా కలిగించినప్పుడే, కేంద్ర ఉద్యోగాలకు యూనియన్ సర్వీసు కమీషన్ పరీక్షలు అన్ని భాషలలోనూ జరిపినప్పుడే, ఉద్యోగాలు జనాభా ప్రాతిపదికమీద కోటా పద్ధతి ఏర్పరచినప్పుడే, భాషారాష్ట్రాలను పరిపూర్ణంగా ఏర్పరచి, రాష్ట్రాలకు అధికారాలను వికేంద్రీకరణ చేసిన తర్వాతనే, హిందీ ఐచ్ఛికంగా కేంద్ర డిపార్టుమెంటులలోని కార్యక్రమానికి సౌలభ్యం కోసం నేర్చుకొని ఉపయోగించడానికి అంగీకరించడం సాధ్యమవుతుంది.

## భారతదేశ ఐక్యత మన లక్ష్యం

కమ్యూనిస్టుపార్టీ భారతదేశ ఐక్యత కావాలంటుంది. దానికోసం అహర్నిశలు కృషిచేస్తుంది. కాని ఆ ఐక్యత వివిధ జాతులమధ్య ప్రజాతంత్రయుతంగా, సమాన హక్కులు, సమాన బాధ్యతలనాధారంగా జేసుకొని ఏర్పడాల్సివుంటుంది. భారతదేశ ఆర్థిక రాజకీయాభివృద్ధికి కేంద్రీకృత పరిపాలన, ప్లానింగు, కో ఆర్డినేషను అవసరమనికూడా అంగీకరిస్తుంది. కాని ఆ కేంద్రీకృత కార్యకలాపాలలో వివిధ భాషా జాతుల సమాన హక్కులు, బాధ్యతలను పరిపూర్ణ ప్రజాతంత్ర పరిపాలనాధికారంమీద ఆధారపడి వుండాలి. అంతేగాని, ఏదో ఒక జాతియొక్క బడాబూర్జువా భూస్వామ్య వర్గాల కేంద్రీకృత అధికారంద్వారా అవి సాధించబడటం అసంభవం.

# హోమ్‌మంత్రి నందా నిందా ప్రచారానికి జవాబు

1965 జనవరి 1న క్రొత్త సంవత్సరం ప్రారంభదినాన, హోంమంత్రి నందా చేసిన రేడియో ప్రసంగానికి శ్రీయుతులు బసవపున్నయ్య, పి. రామమూర్తి, ఎ. కె. గోపాలన్, హరికిషన్‌సింగ్ సూర్జిత్, నేనూ కలసి కేరళలోని వియ్యూరు సెంట్రల్ జైలునుండి శ్రీ నందాకు సమాధానం ఇచ్చాం. శ్రీ నందా తాను చేసిన రేడియో ప్రసంగంలో మాపై అభాండాలు వేశారు. పచ్చి అబద్ధాలతో కూడిన ఆరోపణలు చేశారు. వాటికి దేశవ్యాప్తంగా బహుళ ప్రచారం జరిగింది. అంచేత మేము మా జవాబుకు కూడా ఆయన ప్రసంగానికి జరిగినంత ప్రచారం జరగాలని శ్రీ నందాను కోరాము. ఆయన మా జవాబును ప్రచురించనే లేదు. పైగా గోబెల్స్ ధోరణిలో మాపై అనేక పచ్చి అబద్ధాలు పదే పదే ప్రచారం చేయడం సాగించాడు.

మాపై "శ్వేతపత్రం" ప్రకటిస్తానని వాగ్దానం చేసిన నందా శ్వేతపత్రానికి బదులు పార్లమెంటులో ఒక ప్రకటన చేశాడు. ఈ ప్రకటనపై లోక్‌సభలోను, రాజ్యసభలోను జరిగిన చర్చల సందర్భంలో ఆయన మరింత పచ్చి అభాండాలు వేశాడు. తాను మాపై విసరిన అభాండాలకు ఎలాంటి సాక్ష్యాధారంగాని, డాక్యుమెంట్లుగాని చూపెట్టకపోగా, పైగా మాపై విషప్రచారం చేశాడు. 1965 ఏప్రియల్ మూడవ వారంలో శ్రీ నందా కలకత్తాలో ప్రసంగిస్తూ మమ్మల్ని "దేశ ద్రోహులని" నిందించాడు.

మమ్మల్ని ఏ న్యాయస్థానం ముందు ప్రవేశ పెట్టడానికి శ్రీ నందాకు దమ్ములులేవు. లేదా ఆయన మాపై మోపిన అభాండాలకు, నిందలకు మేమిచ్చిన సమాధానాలను ప్రజానీకం ముందుంచి ఎవరు దేశద్రోహులో తీర్పివ్వడం కోసం ప్రజలకవకాశమిస్తాడా అంటే అందుకూ ఆయనకు దమ్ముల్లేవు.

నాలుగు నెలలపాటు వేచి చూచాం. కాని ప్రయోజనం లేకపోయింది. అంచేత శ్రీ నందా ఫిబ్రవరి 18న పార్లమెంటులో చేసిన ప్రకటనలోనూ, అటుపిమ్మట ఆయన పార్లమెంటులో చేసిన ప్రసంగాలలోనూ మాపై మోపిన పచ్చి అబద్ధపు ఆరోపణలను తిరస్కరిస్తూ రికార్డు పూర్వకంగా ఉండేందుకై ఈ జవాబివ్వవలసి వచ్చింది.



## నందా ఆరోపణ లేమిటి?

మాపై శ్రీ నందా చేసిన ప్రధానమైన ఆరోపణలేమంటే :

1. భారత – చైనా సరిహద్దు వివాదం విషయంలో కమ్యూనిస్టులమైన మేము భారత ప్రభుత్వాన్ని బలపర్చటం లేదట! ఈ వివాదంలో చైనాను దురాక్రమణదారుగా పేర్కొనడానికి మేము నిరాకరిస్తున్నామట! ఈ సమస్యను శాంతి యుతంగా పరిష్కరించుకోవాలని, ఈ విషయంలో భారత ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని మేము ఎడతెరపు లేకుండా ఆందోళన చేస్తున్నామట!

2. పార్లమెంటరీ, శాంతియుత విధానాలద్వారా సోషలిస్టు సమాజాన్ని సాధించవచ్చన్న విషయంలో మాకు విశ్వాసం లేదట! పైగా మేము "పాలక వర్గాలు తమ అధికారాన్ని ఇచ్ఛాపూర్వకంగా ఎన్నడూ వదులుకోవనీ, ప్రజాభీష్టాన్ని తిరస్కరించడానికి అశాంతి, కల్లోలాలను రెచ్చగొట్టి తద్వారా ప్రజాభీష్టాన్ని తలక్రిందులు చేయాలని పాలకవర్గాలు ప్రయత్నిస్తాయనీ, అందువల్ల ఈ విషయాలను ప్రజలు, విప్లవాత్మక శక్తులూ గుర్తించి అప్రమత్తులై ఏ పరిణామాన్నైనా ఎదుర్కోడానికి తగ్గట్టుగా సంసిద్ధులై ఉండాలని" మేము ఉద్బోధించామట!

ఇలాంటి రాజకీయాభిప్రాయాలను కలిగి ఉన్నంత మాత్రాన మమ్మల్ని అరెస్టుచేసి నిర్బంధించడం న్యాయసమ్మతం కాదన్న విషయమూ, అలాగే అంత మాత్రాన మమ్మల్ని ప్రజల నుండి వేరుచేయజాలడనే విషయమూ శ్రీ నందాకు తెలుసు.

అందువల్ల యీ రెండు సమస్యలపై మా అభిప్రాయాలను వక్రీకరించడంకోసం ఆయన తన శక్తియుక్తులన్నీ వినియోగించి పడరాని పాట్లుపడ్డాడు. మేము ఎల్లప్పుడూ చైనాపట్ల విధేయతను, భక్తిప్రపత్తులను ప్రకటించామని, చైనా ప్రభుత్వ ఆదేశాలపై మేము పనిచేస్తున్నామని, చైనా ఆదేశంపై భారత కమ్యూనిస్టు పార్టీని చీల్చామని, "బహుమానంగా చైనా మా పార్టీకి అనేక గుప్తమార్గాల ద్వారా విరివిగా నిధులిచ్చింద"ని, అందువల్ల మేము తెలంగాణా పోరాటం వంటి సాయుధ పోరాటాలు ప్రారంభించి, భారత ప్రభుత్వాన్ని "అడకత్తెర వ్యూహం''లో బంధించడం కోసం చైనా జరపబోయే దాడికి జోడీ చేయ సమాయత్తమవుతున్నామని – ఇలా మామీద యెన్నెన్నో నీచమైన ఆరోపణలు చేశాడు.

తాను చేసిన యిలాంటి భయానకమైన, తీవ్రమైన ఆరోపణలకు శ్రీ నందా చూపుతున్న ఆధారాలేమిటో చూడండి :

1. ఆయా పార్టీ సమావేశాలలో ఫలానా పార్టీ నాయకుడు యిలా చెప్పాడు.

2. తమవద్ద రహస్య సమాచారం, డాక్యుమెంట్లు వున్నాయని, అయితే వాటిని దేశభద్రత దృష్ట్యా బయటపెట్టడానికి వీల్లేదని.

3. డాంగేయులు మాకు వ్యతిరేకంగా వ్రాసిన వ్రాతలనుండి, రిపోర్టుల నుండి ఉల్లేఖనలు.

4. మా పార్టీ ప్రముఖులో లేక శాఖలో రహస్యంగా ప్రచురించినట్లు చెప్పబడే రహస్య డాక్యుమెంట్ల నుండి ఉల్లేఖనలు, మాపార్టీ ప్రచురించిన డాక్యుమెంట్లలోని కొన్ని విషయాలు.

ఆయా పార్టీ సమావేశాలలో మా పార్టీ నాయకులచే చేయబడ్డట్టు చెప్పబడే ప్రసంగాలను ప్రభుత్వం ఎవరిద్వారా, ఎక్కడనుండి సంపాదించింది? అధికార పూర్వకమైన రికార్డుల నుంచిగాని లేదా అలాంటి సమావేశాల మినిట్స్ నుంచిగాని సేకరించిందా? – లేదు. వాస్తవంగా తన ఏజెంట్లు పంపిన రిపోర్టుల ఆధారంపై యీ నిందలు వేసింది.

## అబద్ధాల పుట్ట

తమ ఏజెంట్ల రిపోర్టులెంత అబద్దమో, ఎంత కుచ్చితమో శ్రీ నందా తన కలకత్తా ఉపన్యాసంలో చెప్పిన మాటలు తెలియజేస్తున్నాయి.

“పార్టీ మహాసభ పూర్తయిన వెంటనే పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ శ్రీ సుందరయ్య, అధికారాన్ని చేజిక్కించుకోవాలంటే విప్లవం తప్పనిసరియని, అందువల్ల అందుకోసం సన్నాహాలు చేయాలని చెప్పారు. ఎన్నికలలో పాల్గొనడం ఎత్తుగడల కోసం మాత్రమేనని చెప్పారు.”

**(నందా ప్రకటన, ఫిబ్రవరి 18, 1965, పేజీ 40)**

ఆ సమావేశంలో నేను చెప్పిన వాస్తవ విషయాలకిది పూర్తిగా వక్ర భాష్యమే. వాస్తవంగా బూటకపు అతివాద నినాదాలకు ఎరగావద్దనీ, అలాగే మనం సాయుధ పోరాటానికి సన్నద్ధమవుతున్నామని, ప్రభుత్వమూ, డాంగేయులు చేస్తున్న నిందలకు గురికావద్దనీ నేను మాపార్టీ కార్యకర్తలకు హెచ్చరిక చేశాను. “ఆయుధాలను చేబట్టడమో, లేదో తేల్చవలసింది ప్రజలు. అత్యధిక సంఖ్యాకులైన ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చే ప్రజాస్వామిక తీర్పును అణచివేయడం కోసం పాలక వర్గాలు దౌర్జన్యకాండకు పూనుకొని పాలకవర్గాలను దించివేయడానికి ప్రజలకున్న ప్రజాస్వామిక సాధనాలన్నింటినీ పాలకవర్గాలు బంద్ చేసినప్పుడు ఏ విధానం అవలంబించాలో నిర్ణయించుకోవలసింది ప్రజలే.



“ప్రభుత్వమూ, మా వ్యతిరేకులూ, మాపై అభాండాలువేసే శక్తులూ నడుపుతున్న అబద్ధాల మిల్లుకు ఇంధనాలుగా ఉపయోగపడే విధంగా కొందరు సాయుధ విప్లవం విషయం లేవనెత్తి దాన్ని గురించి మాట్లాడుతున్నారు. దౌర్జన్య పద్ధతులకు దిగేది ప్రజలూకాదు, మా పార్టీకాదు. అలా దౌర్జన్య పద్ధతులకు ఒడిగట్టేది పాలకవర్గాలే. న్యాయసమ్మతమైన తమ ఆర్థిక, రాజకీయ హక్కులకోసం ప్రజలు సాగించే ఉద్యమాలు బలపడ్డకొద్దీ వీటిని అణచివేయడంకోసం పాలకవర్గాలే దౌర్జన్య పద్ధతులకు పూనుకుంటాయి. ప్రస్తుత పాలక వర్గాలను అధికారం నుంచి దించివేసి, సాంఘిక వ్యవస్థలో తీవ్రమైన మార్పులు తీసుకువచ్చి సోషలిస్టు సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలని ప్రజలలో అత్యధిక భాగం గుర్తించినప్పుడు పాలకవర్గాలు తప్పనిసరిగా దౌర్జన్య చర్యలకు దిగి మెజారిటీ ప్రజల అభిమతాన్ని అణచివేయడం కోసం ప్రజలను రక్తపుటేరులలో ముంచెత్తుతాయని చరిత్ర చాటిచెబుతున్నది.

“తమ అధికారాన్ని నిలబెట్టుకొనడం కోసం ముందుగా దౌర్జన్యకాండకు దిగేది పాలకవర్గాలే. ఇలాంటి పరిస్థితులెదుర్కొన్నప్పుడు మాత్రమే గత్యంతరం లేక తమ రాజకీయ హక్కులను, అధికారాన్ని కాపాడుకొనే నిమిత్తం ప్రజలు పాలకవర్గాల దౌర్జన్యకాండను ప్రతిఘటిస్తారు. చరిత్ర మనకు నేర్పుతున్న పాఠమిదే.”

## ఈనాటి అత్యంత ప్రధానమైన కర్తవ్యం

మాదొక చిన్న పార్టీ. 10శాతం వోటర్లు మాత్రమే మాకున్నారు. అది కూడా కేరళ, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోనే ప్రధానంగా మా అభ్యర్థులకు ఓటు చేస్తున్నారు. మెజారిటీ ప్రజలను మా వైపుకు త్రిప్పుకోవాలంటే మేము ఓర్మితో కృషిచేయాల్సివుంది. అత్యంత ప్రధానమైన ఈ కర్తవ్యం కోసం కేంద్రీకరించి కృషిచేయడానికి బదులుగా ఈ కర్తవ్యాన్ని మరచి, సాయుధ విప్లవమని పలవరించే శత్రువు మాటల్లో బోల్తాపడటం వెర్రితనం.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నదీ, ప్రజాస్వామ్య అభివృద్ధిపథాన్ని నాశనం చేయ ప్రయత్నిస్తున్నదీ శ్రీ నందా, కేంద్ర ప్రభుత్వాలు మాత్రమే. మనం వారితో పోరాడి, వారిని ఓడించి ప్రజల ప్రజాస్వామ్యహక్కులను నిలబెట్టి విస్తరింపజేయాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ఇది మన తక్షణ కర్తవ్యం. విప్లవం అనేది దౌర్జన్య పద్ధతుల ద్వారా సిద్ధిస్తుందా, లేక దౌర్జన్యేతర పద్ధతుల ద్వారా సాధ్యమౌతుందా అన్న అంశంపై కవ్వింపు చర్యలలో దిగబడిపోకూడదు.

మాపై తాను మోపిన ఆరోపణలను కోర్టుల్లోగాని లేదా ప్రజల ముందుగాని రుజువు చేయలేనన్న విషయం శ్రీ నందాకు తెలుసు. ఎందుచేతనంటే, అలా రుజువుచేయాలంటే, ఆయన తన ఏజెంట్లనుగాని లేదా వారి రిపోర్టులనుగాని కోర్టుముందుగాని, ప్రజలముందుగాని

హాజరుపరచాల్సి వుంటుంది. ఆ పరిస్థితిలో వాటినన్నింటినీ తేలికగా సవాలుచేసి, అవన్నీ పనికిమాలిన పచ్చి కట్టుకథలని రుజువుచేయవచ్చు. అందువల్లనే శ్రీ నందా మమ్మల్ని న్యాయస్థానాల ముందుకు తీసుకువెళ్ళడానికి నిరాకరిస్తూ మరోవైపు మాపై అభాండాలను అదేపనిగా మోపుతున్నాడు!

శ్రీ నందా నాపై మోపిన అభాండాలు నిరాధారమైనవి. అలాగే మాపార్టీలోని ప్రముఖ నాయకులపైనా, కార్యకర్తలపైనా మోపిన అభాండాలు కూడా నిరాధారమైనవే.

## నందా సాక్ష్యమిదే!

మద్రాస్‌నుండి నన్నిలం సెల్వన్ (శ్రీ పెరుమాళ్) అనే వ్యక్తి సంపాదకత్వాన వెలువడుతున్న 'షెంగోడి' అనే తమిళ వారపత్రికనుండి శ్రీ నందా కొన్ని విషయాలు తన ప్రకటనలో ఉల్లేఖించారు. నన్నిలం సెల్వన్ అరాచకవాదిగా వ్యవహరిస్తూ అనుమానాస్పదమైన ప్రవర్తన కలిగివుండడంవల్ల కొన్నేండ్ల క్రితం అతన్ని పార్టీ నుండి బహిష్కరించడం జరిగింది. తిరిగి 1963లో తమిళనాడు కమ్యూనిస్టుపార్టీ కార్యవర్గంలో శ్రీ పి. రామమూర్తి సదరు పెరుమాళ్‌తో పార్టీ సభ్యులెవరూ ఎలాంటి సంబంధాలు పెట్టుకోరాదంటూ ప్రతిపాదించిన తీర్మానం ఆమోదించబడింది.

ఈ తమిళ వారపత్రికతో యెలాంటి సంబంధాలు లేవని తెల్పుతూ మాపార్టీ తరఫున 1964 మే లోనే మాపార్టీ నడుపుతున్న అన్ని వారపత్రికలకు సర్క్యులర్ పంపబడింది. 1964 ఆగస్టులో షెంగోడి శ్రీ ఎ.కె. గోపాలన్ తదితర నాయకుల ప్రకటన నుండి ఉల్లేఖించిన తప్పుడు విషయాలను చూచి ఎవ్వరూ మోసపోవద్దని మాపార్టీ కార్యకర్తలను శ్రీ గోపాలన్, ఎం.ఆర్. వెంకట్రామన్‌లు హెచ్చరించారు. అదే సందర్భంలో షెంగోడి వ్రాతలను వారు ఖండించారు. 1964 సెప్టెంబరులో నేను స్వయంగా శ్రీ పెరుమాళ్‌కు ఒక లేఖ వ్రాశాను. మా పార్టీతో మీకు ఎలాంటి సంబంధంలేదు. కాబట్టి మా పార్టీ తెలుగు వారపత్రికయైన జనశక్తిని మీ షెంగోడికి పంపడంలేదని నేనా లేఖలో స్పష్టం చేశాను. శ్రీ పెరుమాళ్, అతని పత్రిక షెంగోడి శుద్ధ తప్పుడు, కవ్వింపు రాతలు రాస్తున్నదని అభిప్రాయపడుతున్నాం. అందువల్ల మా పార్టీని, మా రాజకీయాలను సమర్థించుకొనే విషయంలో మాకు షెంగోడితో ఎలాంటి సంబంధం కూడా లేదు. ఇవన్నీ రికార్డు పూర్వకంగానే వున్నాయి. ప్రభుత్వానికీ విషయం తెలుసుకూడా. అయినప్పటికీ, మమ్మల్ని ఇరుకున పెట్టడానికి, మాకు వ్యతిరేకంగా షెంగోడి చేసిన కొన్ని అబద్ధపు నిందలను రుజువు చేయడానికి ప్రభుత్వం సిగ్గువిడిచి ప్రయత్నించింది.



అదే విధంగా పశ్చిమబెంగాల్‌లో కూడా మా పార్టీ నాయకుల అరెస్టులు జరగబోయేముందు సాయుధ పోరాటాన్ని గూర్చి పలవరించే ఏజెంట్లను, కవ్వింపుదారులను మా మధ్య సృష్టించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు మాకు వార్తలందాయి. అలాంటి వారినందరినీ మా పార్టీ నుంచి ఏరిపారవేయాలనుకొన్నాం. అంచేత అలాంటి దుష్టశక్తుల చర్యలను పరిశీలించడం కోసం మా పార్టీలోని కొంతమంది ముఖ్యులను అందుకు నియోగించాం.

అలా నియోగించబడ్డ మా పార్టీ ముఖ్యులు ఈ పనికి దిగారోలేదో వారినందరినీ ప్రభుత్వం అరెస్టు చేసింది. అటుపిమ్మట కొలది రోజులకు దేశ వ్యాప్తంగా మమ్మల్నందర్నీ ప్రభుత్వం అరెస్టుచేసి నిర్బంధించింది. ప్రభుత్వం మా పార్టీ మధ్య సృష్టించదలచిన అలాంటి దుష్టశక్తుల చర్యలతో మా పార్టీకి ఎలాంటి సంబంధంలేదు. ఈ దుష్టశక్తుల చర్యలు మా పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగానూ, మా పార్టీని దెబ్బతీయాలనే దుర్బుద్ధితోనూ జరపబడుతున్నాయి.

శ్రీ నందా తన సి.ఐ.డి ల ద్వారాగాని లేదా తాము సృష్టించిన ఏజెంట్ల రిపోర్టుల ద్వారా గాని లభించే సమాచారాన్ని ఆధారం చేసుకొని మాపై అదే పనిగా నీచమైన ఆరోపణలు పునశ్చరణ చేస్తున్నాడు. ఐతే ఈ "సాక్ష్యాన్ని" బయటపెట్టడానికి, తన ఈ ఏజెంట్లను ఏ న్యాయస్థానం ముందైనా ప్రవేశ పెట్టడానికి శ్రీ నందా నిరాకరిస్తున్నాడు. అలా వారిని న్యాయస్థానాలలో ప్రవేశపెడితే వారు క్రాస్ పరీక్షకు నిలబడాల్సి వస్తుంది. ఈ క్రాస్ పరీక్షలో వారి నిజస్వరూపమేమిటో వారి రిపోర్టుల, సాక్ష్యాల నైజమేమిటో బట్టబయలవుతుందనేది శ్రీ నందా భయం.

## "చైనా డబ్బు" వస్తున్నదనే నీచమైన నింద

శ్రీ నందా 1965 జనవరి 1న చేసిన రేడియో ప్రసంగంలో మా పార్టీకి చైనా నుంచి "ఇతర రూపాలలో సహాయం" అందుతున్నదని ఆరోపించాడు. అధికార ప్రతినిధుల ప్రోత్సాహంతో వార్తాపత్రికలు మా పార్టీకి చైనా బ్యాంకు ద్వారా ఆర్థిక సహాయం లభిస్తున్నదని కట్టు కథలు ప్రచారంలో పెట్టాయి.

మళ్ళీ 1965 జనవరి మూడోవారంలోనో, నాల్గవవారంలోనో శ్రీ నందా తిరువనంతపురంలో పత్రికాగోష్టి జరిపిన సందర్భంగా, భారత కమ్యూనిస్టులకు చైనా బ్యాంకు ద్వారా 20 కోట్ల రూపాయలు అందినట్లు పత్రికలలో వచ్చిన వార్తలు నిజమేనా అని పత్రికా విలేఖరులు ప్రశ్నించగా, ఆయన చైనా బ్యాంకు తన వ్యాపారాన్ని అమాయకంగా సాగించడం

లేదని వికటంగా జవాబిచ్చాడు. ఆ విధంగా పత్రికలలో వెలువడ్డ వార్తలలో ఏదో కొంత యదార్థం వుందని విలేఖరులు తీర్మానించుకోవడానికి దోహదమిచ్చేలా సూచించాడు.

1965 మార్చి 12న లోక్‌సభలో జరిగిన చర్చలో అతివాద కమ్యూనిస్టులకు హాంకాంగ్ ద్వారా చైనా ఆర్థిక సహాయం అందుతున్నదని జనసంఘం సభ్యుడు చేసిన ఆరోపణను శ్రీ నందా ధృవపరుస్తూ, "నిజమే, అయితే ఎంత మొత్తం అందుతున్నదో నేను ఇప్పటికిప్పుడే చెప్పలేనుగాని మొత్తంమీద చెప్పదగ్గంత సహాయమే లభిస్తున్నదని" ఆరోపించారు. ఈ డబ్బు భారతదేశంలోని చైనా బ్యాంకు ద్వారా ఉత్తర వియత్నాం, ఇండోనేషియాల రాయబారకార్యాలయాలద్వారా అందచేయబడుతున్నదని శ్రీ నందా ఆరోపించారు. అయితే "1961 చివరి ప్రాంతంలో విదేశ మారకద్రవ్య నిబంధనల క్రింద చైనా బ్యాంకు కివ్వబడ్డ లైసెన్సు రద్దుచేయబడిందన్న విషయాన్ని శ్రీ నందా ఒప్పుకొనక తప్పలేదు. అందుచేత ఈ విషయాన్ని అక్కడికాపి, చైనా బ్యాంకుద్వారా నిజంగా ప్రయోజనం పొందిన వ్యక్తులెవరో తేల్చుకోవలసి వుంది.

వియ్యూరు సెంట్రల్ జైలులో నిర్బంధించబడ్డ ఐదుగురు భారత కమ్యూనిస్టు పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులంకలిసి శ్రీ నందా తన రేడియో ప్రసంగంలో మాపై చేసిన ఈ విషపునిందను విస్పష్టంగా నిరాకరిస్తూ 1965 జనవరి 7న శ్రీ నందాకు జవాబిచ్చాం శ్రీయుతులు జ్యోతిబాసు, నంబూద్రిపాద్‌లు ఈ అభాండాన్ని నిరాకరిస్తూ ఇదొక "పచ్చి అబద్ధమని" పదేపదే ప్రకటించారు. చైనా బ్యాంకు వ్యాపార వ్యవహారాలపై ప్రభుత్వం జరిపించిన అధికారయుత నివేదికను ప్రకటించవలసిందిగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా ప్రకటించినట్లయితే చైనా బ్యాంకుతో ఏయే పెద్దమనుష్యులకు సంబంధాలున్నాయో, ఎవరెవరికి ఈ బ్యాంకు అప్పులిచ్చిందో లేదా ఎవరెవరు ఓవర్ డ్రాఫ్టులు తీసుకున్నారో, తాము తీసుకొన్న రుణాలను ఏ పెద్ద మనుష్యులు తిరిగి చెల్లించలేదో, లేదా యీ బ్యాంకు ఎవరెవరి అప్పులను మాఫీ చేసిందో మొదలైన వాస్తవ సమాచారమంతా బయటి ప్రపంచానికి తెలుస్తుంది. పార్లమెంటులో యీ సమస్యపై జరిగిన చర్చలో చైనాబ్యాంకు నుంచి ఆర్థిక సహాయం పొందింది కాంగ్రెస్‌వాదులే గాని కమ్యూనిస్టులు మాత్రం కాదని సవాలు చేయబడింది.

అయినప్పటికీ ప్రభుత్వం తాను జరిపిన అధికార నివేదికను ప్రచురించడానికి నిరాకరిస్తున్నది. మరోవైపు అతివాద కమ్యూనిస్టులే చైనా బ్యాంకు నుండి ఆర్థిక సహాయం పొందుతున్నారని నీలాపనిందని పునశ్చరణ చేస్తోంది. 1964కు పూర్వం చైనాబ్యాంకు అతివాద కమ్యూనిస్టులకు ఆర్థిక సహాయం చేసిందన్న కాలంలో ఆ బ్యాంకు లైసెన్సు రద్దు చేయబడివుంది. 1964కు పూర్వం అతివాద కమ్యూనిస్టులు వేరే పార్టీగా లేరు. అలాంటి పరిస్థితిలో 1961లో



చైనా బ్యాంకు మా పార్టీకి ఆర్థిక సహాయం చేసిందని చెప్పడం హాస్యాస్పదం. 1961కి పూర్వమైనా అతివాద కమ్యూనిస్టులని చెప్పబడే ఏ నాయకుడైనా ఈ బ్యాంకునుండి డబ్బు తీసుకున్నాడేమో తెలుసుకోడానికిగాను అధికార నివేదికను ప్రకటించండయ్యా అంటే, ప్రభుత్వం ఆ పనీ చేయదు. దీన్ని బట్టి చైనానుంచి కమ్యూనిస్టులు ఏనాడూ కనీసం చిల్లిగవ్వైనా డబ్బు తీసుకోలేదనీ, ఈ అభాండానికి యెలాంటి ఆధారంగానీ, ఇందులో ఆవగింజంతైనా నిజంగానీ లేదని రుజువవుతున్నది.

రెండో విషయం : అతివాద కమ్యూనిస్టుపార్టీ నాయకులు "ఆదేశాల కోసమూ, నిధులకోసమూ" దేశంలోని చైనా రాయబార కార్యాలయంతో నిరంతరం సంబంధాలు కలిగివున్నారని శ్రీ నందా ఆరోపించగా, డా॥ రామమనోహర లోహియా అడ్డుతగిలి ఆ విధంగా సంబంధాలు కలిగివున్న ఏ ఒక్క కమ్యూనిస్టునైనా పేరుబెట్టి చూపవలసిందిగా డిమాండ్‌చేశారు. అయితే శ్రీ నందా ఏ ఒక్కరినీ వేలెత్తి చూపలేకపోయాడు.

అలాగే కమ్యూనిస్టులకు ఏ విదేశరాయబార కార్యాలయం ద్వారా డబ్బు పంచబడిందో పేరుబెట్టి చెప్పడానికి కూడా శ్రీ నందా తయారుకాలేదు. అంతేగాదు; ఈ డబ్బు ముట్టినవారినిగాని లేదా చైనా డబ్బునో, మరేదేశం డబ్బునో అందజేశాయని నిందించబడే ఆ విదేశ రాయబార కార్యాలయమేదో దాన్ని కనుక్కొని కోర్టు ముందుకు తీసుకురావడానికిగాని శ్రీ నందా సంసిద్ధం కావడంలేదు.

అయినా శ్రీ నందా చైనా డబ్బు, చైనా డబ్బంటూ మాపై నిందను పారాయణం చేస్తున్నాడు! గౌరవనీయ సదాచారి నందాజీ, ఎంత పతనం!

## "చైనానుంచి రహస్య ఆదేశాలు"

లోక్‌సభలో శ్రీ నందా మార్చి 12న మాట్లాడుతూ, గత సంవత్సరం చివరి భాగంలో కమ్యూనిస్టులకు "ఒక ప్రధానమైన ఏజెన్సీద్వారా" కొన్ని ఆదేశాలు అందాయని ఆరోపించారు. భారత కమ్యూనిస్టులు గెరిల్లా యుద్ధం సాగించడానికి సహాయం చేసేందుకై తెలంగాణా పోరాటకాలంలో భారత సరిహద్దులలో సోషలిస్టు దేశమేదీ లేకపోవడంవల్ల ఆ పోరాటం విఫలమయ్యిందని, అందువల్లనే భారత ప్రభుత్వం తెలంగాణా పోరాటాన్ని అణచివేయగలిగిందని ఈ లేఖలో పేర్కొనబడిందని ఆయన అన్నారు. అయితే "ఈనాడు పరిస్థితి మారిపోయిందని, తెలంగాణా పోరాటంలాంటి పోరాటం జరపడానికి అనువైన వాతావరణం ఏర్పడిందని" ఈ లేఖ పేర్కొన్నట్టు శ్రీ నందా చెప్పారు. చైనా కమ్యూనిస్టు పార్టీ నుంచి భారత అతివాద కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులకు వచ్చిన ఆదేశం ఇదేనని నందా

ఆరోపించాడు. అతివాద కమ్యూనిస్టు పార్టీ ఈ ఆదేశాలను స్వీకరించి, "తమ మనస్సుల్లో వున్న పరిస్థితికి పార్టీ సభ్యులను, నాయకత్వాన్ని సమాయత్తం చేయడానికై" ఈ ఆదేశాలను పార్టీలో "పైనుంచి క్రింది స్థాయివరకూ" అందించిందని నందా ఆరోపించాడు.

**(టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక, 1965 మార్చి 13 సంచిక)**

నేను శ్రీ నందాకు ఒక విషయాన్ని నిర్ద్వంద్వంగా స్పష్టం చేయదలచాను. నందా పేర్కొంటున్న డాక్యుమెంటులాంటి ఏ డాక్యుమెంటు కూడా చైనా పార్టీనుంచి గాని మరే యితర పార్టీలనుంచిగాని, "ప్రధానమైన" లేదా మరే విధమైన ఏజన్సీ ద్వారా కమ్యూనిస్టుపార్టీ అగ్రనాయకులెవరికీ రాలేదు. నందావద్ద అలాంటి డాక్యుమెంటు ఏదైనా ఉండి ఉంటే, అది తన గూఢచారి శాఖవాళ్ళు తయారుచేసిన దొంగ డాక్యుమెంటు అయివుంటుంది. ఆ డాక్యుమెంటును బహిరంగంగా ప్రకటించి, రుజువు చేయవలసిందిగా మేము నందాను సవాలు చేస్తున్నాం.

మేము "ఈ ఆదేశాలను నాయకత్వం స్థాయినుండి క్రింది కార్యకర్త వరకు ప్రచారంలో పెట్టామని" నందా చేసిన ఆరోపణ మరో విషపూరితమైన అబద్ధం. మా పార్టీ మహాసభలో జరిగిన చర్చల వివరాలు, నివేదికలు అన్నీ కూడా మమ్మల్ని అరెస్టు చేసినప్పుడు మా నుంచి లాగుకొన్నారు. అవన్నీ నందా దగ్గరున్నాయి కూడా. మా పార్టీ మహాసభ జరగక పూర్వం మా పార్టీ వివిధ స్థాయిలలో జరిగిన చర్చల డాక్యుమెంట్లుకూడా నందా దగ్గరున్నాయి. కలకత్తాలో జరిగిన మా పార్టీ మహాసభ చేయబోయే నిర్ణయాలపై 1964 నవంబర్, డిసెంబర్‌లలో మేము తయారుచేసిన వివరాల డాక్యుమెంట్లుకూడా ఆయన దగ్గరున్నాయి.

అయినా మేము తెలంగాణా పోరాటంలాంటి సాయుధ పోరాటానికి మా పార్టీ నాయకత్వాన్ని, కార్యకర్తలను తయారుచేస్తున్నట్లు నందా తనవద్ద వున్న మా పార్టీ డాక్యుమెంట్ల నుండి కించిత్తు సమాచారాన్నిగాని లేదా కనీసం అలాంటి సూచననుగాని ఆయన ఎత్తిచూపలేకపోయాడు. అందువల్లనే ఆయన తన గూఢచారిశాఖ ద్వారా ఇలాంటి డాక్యుమెంట్లనూ, అబద్దాలను, సూచనలనూ ఉత్పత్తి చేయడానికి పూనుకొన్నాడు.

అలాగే ఇరుగు పొరుగు దేశాలలో చైనాచే గెరిల్లా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డట్టు శ్రీ నందా చేసే ఆరోపణలు మా పార్టీ కెలాంటి సంబంధం లేదని, శిక్షణ కేంద్రాలని చెప్పబడే అలాంటి కేంద్రాలలో శిక్షణకోసం మా పార్టీ నుండి ఎవ్వరినీ పంపలేదని నేను నందాకు స్పష్టంగా, నిర్ద్వంద్వంగా చెబుతున్నాను.



శ్రీ నందా తాను మాపై చేసిన నిందారోపణల విషయంలో ఎవ్వరినీ, చివరకు పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకులను సైతం ఒప్పించలేకపోతున్నాడు. అందువల్ల ఆయన మరింత పెద్ద పెద్ద అబద్దాలకు దిగాడు! గోబెల్స్ ధోరణిలో కొందరు ప్రజలను కనీసం కొంతకాలంపాటైనా మోసగించాలని నందాజీ ఆశిస్తున్నాడు.

మాపై నిందలు మోపడానికి శ్రీ నందాకు ప్రయోజనకరమైన సాక్ష్యం లేకపోయేసరికి ఆయన ప్రజల మనోభావాలపై ఒక అభిప్రాయం కలిగించడం కోసం తంటాలు పడుతున్నారు : శ్రీ పి. రామమూర్తో లేదా ఎవరో కొందరు బెంగాల్ కామ్రేడ్స్ పంజాబ్‌లోని కులూ లోయకు వెళ్ళారని, ఇదంతా టిబెట్ కాందిశీకులను కలుసుకొని భారత భద్రతను విచ్ఛిన్నం చేయడానికి వేసుకొన్న పథకాలని ఆయన అన్నారు.

వాస్తవ విషయాలేమంటే, 1964 మే, జూన్‌లలో శ్రీ రామమూర్తి భార్యా, పిల్లలు కాంగ్రా జిల్లాలోని తమ స్నేహితుల ఇంటికి వెళ్లి అక్కడ ఆ రెండు నెలలు గడిపారు. ఆ సందర్భంలో శ్రీ రామమూర్తి తన భార్యా పిల్లలను తీసుకురావడం కోసం జూన్‌లో అక్కడికి వెళ్ళి రెండు మూడు రోజులున్నారు.

అలాగే, జలంధర్‌లో మార్చి 31న దేశభక్త మెమోరియల్ హాలుకు ప్రారంభోత్సవం జరిగినప్పుడు శ్రీయుతులు నారాయణరాయ్, గణేష్‌ఘోష్, నిరంజనసేన్‌లు ఆ ఉత్సవానికి వెళ్ళారు. ఆ సందర్భముగా నారాయణరాయ్, గణేష్‌ఘోష్ మరికొందరు కలసి రెండురోజులపాటు కులూలోయ చూడ్డంకోసం వెళ్ళారు. శ్రీ నిరంజన్‌సేన్ కులూలోయకు వెళ్ళనేలేదు. ఆయన జలంధర్ నుంచి సరాసరి ఢిల్లీకి వచ్చేశారు.

అయితే నందా దృష్టిలో ఈ కామ్రేడ్స్ రెండు మూడు రోజులపాటు కులూలోయను చూడటానికి వెళ్ళడం సరిహద్దు ప్రాంతంలో విచ్ఛిన్నకర కార్యకలాపాలను పటిష్టం చేయడం కోసం వెళ్ళినట్లు లెక్కా? శ్రీ నందా, ఆయన గూఢచారిశాఖ ఏజెంట్లు ఒక విషయాన్ని తెలుసుకోవాలి. ఏమిటంటే : ఏదైనా ఒక కొత్త ప్రదేశంలో విచ్ఛిన్నకర చర్యలు చేయటం కోసం ఆ ప్రాంతపు ప్రజల భాష ఓనమాలు కూడా తెలియనివాళ్ళు పంపబడరనే విషయాన్ని శ్రీ నందా, ఆయన గూఢచారిశాఖ ఏజెంట్లు గుర్తించాలి. విచ్ఛిన్న చర్యలేకాదు, ఏ ప్రయోజనకరమైన పనిచేయాలన్నా, లేదా విచ్ఛిన్న చర్యలకు సంబంధించిన పథకం వేయాలన్నా రెండు రోజుల్లో సాధ్యమయ్యే పనికాదన్న విషయాన్ని కూడా వారు గుర్తించాలి.

అలాగే విజయవాడ అగ్ని ప్రమాదాలు "నాయకత్వాన్ని, కార్యకర్తలను ఎవరికి వారు తమవైపు త్రిప్పుకొనడం కోసం జరిగిన తీవ్రపోరాటం ఫలితమే"నని, దాని

పర్యవసానంగా విజయవాడలో అనేక దుష్కృత్యాలు జరిగాయని నందా అభివర్ణిస్తున్నారు. మా పార్టీకి ఆధారమూ, ఆయువుపట్టుల్లాంటివారు పేద జనాంగం. అలాంటి పరిస్థితిలో పార్టీ సభ్యులనూ, ప్రజానీకాన్ని రాబట్టుకొనేందుకు పార్టీకి ఆధారమైనటువంటి పేద జనాంగం తలదాచుకొనే కొంపా-గోడును మూర్ఖుడు సైతం తగలబెట్టడు. విజయవాడ అగ్ని ప్రమాదాలకు అసలు ముద్దాయి కొత్తగా కుబేరుడౌతున్న ఒక కిరాతక కాంగ్రెసువాదే. ఆయన ఒక దెబ్బతో రెండు పిట్టలను పడగొట్టాలనుకొన్నాడు. ఒకటి : కమ్యూనిస్టుపార్టీకి కంచుకోటల్లాంటి ప్రదేశాల్లోని పేద ప్రజలను భయపెట్టి అణచివేయాలనేది ఆయన సంకల్పం. ఎంచేతనంటే, ఆ ప్రజలు ఎన్నికలు జరిగినప్పుడెల్లా కాంగ్రెసుకు వ్యతిరేకంగానూ, కమ్యూనిస్టుపార్టీకి అనుకూలంగానూ ఓటుచేస్తున్నారు. అందుచేత ఆ ప్రజల నివాసాలను అగ్నికాహుతి చేసి వారిని భయభ్రాంతుల్నిచేసి లొంగదీసుకోవాలనేది ఆయన పన్నాగం. రెండు : అదే సమయంలో ఈ నేరాన్ని కమ్యూనిస్టుపార్టీ నాయకత్వానికంటగట్టి పేదప్రజలలో కమ్యూనిస్టుపార్టీకున్న పలుకుబడిని దెబ్బతీసి కమ్యూనిస్టు నాయకులకు దీర్ఘకాల జైలుశిక్ష పడేలా చూడడం.

ప్రభుత్వ పోలీసు యంత్రాంగం, కాంగ్రెస్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అధినేతల ఆదేశాల ప్రకారం కష్టించి పనిచేసి అనేక కుట్రకేసులు పెట్టారు. ఈ కుట్రకేసులన్నీ నిరాధారమైనవని కోర్టులు కొట్టివేశాయి. కాంగ్రెస్ నాయకులు, పోలీసులు మోపిన ఈ ఆరోపణలను ప్రజలు మొదటినుండి కూడా నమ్మలేదు. పైగా వారు ఈ ప్రమాదాలకు మూలకారకుడైన నేరస్థుడెవరైనదీ వేలుబెట్టి చూపుతూనే వచ్చారు.

## మరొక గూఢచారి శాఖ కట్టుకథ

"1964 అక్టోబర్‌లో జరిగిన తిరువనంతపురం జిల్లా కమ్యూనిస్టుపార్టీ మహాసభ సందర్భంగా ఏర్పాటు చేయబడ్డ ఊరేగింపులో "నాల్గునెలలు గడిచాక చైనావాళ్ళు వస్తారు. అప్పుడు మేము దేశానికి పరిపాలకులమై మీపని బడతాం" అని ఒక నినాదమిచ్చినట్టు ఒక ఆరోపణ.

ఏ పార్టీయైనాగాని, లేదా ఏ వ్యక్తి అయినాసరే అలాంటి నినాదాలు ఇచ్చి వుండరని, ఏ వ్యక్తికూడా అలాంటి వెర్రిప్రలాపాలు ప్రేలి ఉండరని ఏమాత్రం తెలివితేటలున్న వ్యక్తియైనా వెంటనే గ్రహించగలుగుతాడు.

1964 అక్టోబర్‌లో అంటే కేరళ ఎన్నికలు ఇంకో నాలుగు నెలలకు జరుగుతాయనగా ఈ నినాదం ఇవ్వబడ్డట్టు ఆరోపించారు. ఆ ఊరేగింపులో మా పార్టీ నాయకులూ, కార్యకర్తలూ ఇచ్చిన నినాదమల్లా "నాలుగు నెలలు గడవనీయండి, అప్పుడు జరగనున్న ఎన్నికలలో మీకు గుణపాఠం నేర్పుతాము" అని మాత్రమే. అలాగే కేరళ ప్రజలు ఎన్నికల్లో శ్రీ నందాకు నిజంగా గుణపాఠం చెప్పారు. ఈ విషయమై కలకత్తానుంచి వెలువడే "స్టేట్స్‌మన్' పత్రిక



ఏమని వ్యాఖ్యానించిందో చూడండి : "నాలుగు నెలలు గడిచాయి. చైనావాళ్ళు రాలేదు. గెరిల్లా పోరాట సంచలనం ఏదీలేదు. కాబట్టి కమ్యూనిస్టు డిటెన్యూలను విడుదల చేయండి." కాని శ్రీ నందా గుడ్డితనం ప్రదర్శిస్తున్నాడు. పోలీస్ శాఖ సమాచారం ఆధారంతో ధనాధిపతుల, వారి విదేశీ సహకారులైన ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను కట్టుదిట్టంగా నెరవేర్చాలని తలతిక్క విధానాన్ని అనుసరిస్తున్నాడు.

1960లో ఉత్తర వియత్నాం ప్రజారిపబ్లిక్ కమ్యూనిస్టుపార్టీ మహాసభకు హాజరైన శ్రీ హరేకృష్ణ కోనార్ అక్కడినుండి పెకింగ్ వెళ్ళాడని, పెకింగ్‌లో ఆయనకు చైనా నాయకులచే క్షుణ్ణంగా తర్ఫీదు యివ్వబడిందని శ్రీ నందా ఆరోపణ.

ఉత్తరవియత్నాం కమ్యూనిస్టుపార్టీ మహాసభకుహాజరైన ప్రతినిధివర్గంలో శ్రీ హరేకృష్ణకోనార్‌తోపాటు కేరళకు చెందిన శ్రీ కె. దామోదరన్ కూడా ఉన్నారన్న విషయాన్ని శ్రీ నందా దాచిపెడుతున్నారు. ఈ ఇద్దరూ ఆనాటిసమైక్య కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ సభ్యులు. ఆ ఇద్దరూ కలసి ఉత్తర వియత్నాంనుండి పెకింగ్ వెళ్ళారు. పెకింగ్‌లో ఇద్దరూ కలసి చైనా నాయకులను కొందరిని కలుసుకొని అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో, విశ్లేషించి సోవియట్, చైనా కమ్యూనిస్టు పార్టీల మధ్య ఏర్పడ్డ తీవ్రమైన విభేదాలను గురించి చర్చించారు.

ఈ విభేదాలపై వారి అభిప్రాయాలను, వాటితోపాటు, చైనాపార్టీపై కృశ్చేవ్ చేసిన విమర్శనలకు వారి సమాధానాలను తెలుసుకొన్నారు. అక్కడినుండి తిరిగి వచ్చిన పిదప ఆ ఇద్దరూ అక్కడ జరిగిన విశేషాలను మా పార్టీ కేంద్ర కమిటీలో సంయుక్తంగా రిపోర్టిచ్చారు.

జరిగిన వాస్తవాలివికాగా చైనావాళ్ళు కోనార్‌కు విడిగా బాగా శిక్షణయిచ్చి సర్వ సమాయత్తం చేసి పంపే సమస్య ఎలా ఉత్పన్నమవుతుంది? అది కేవలం శ్రీ నందా ఊహాగానం తప్పితే.

నందాగారి ఆరోపణలు, నిందలలో ఏదో కొంత నిజముండవచ్చనే అభిప్రాయం ప్రజలలో కలిగించడం కోసం శ్రీ నందా యిలాంటి అబద్ధాలకు, వక్ర భాష్యాలకు దిగాడు.

## మమ్ముల్ని చైనా ఏజెంట్లుగా చిత్రించడానికి డాంగేయుల పాట్లు

చైనా ప్రభుత్వం యొక్కగాని లేదా చైనాపార్టీ యొక్కగాని కోరికపైన లేదా ఆదేశాలపై మేము పనిచేస్తున్నట్లు రుజువు చేయాలనే తాపత్రయంతో శ్రీ నందా డాంగేయుల వ్రాతల నుండి, నివేదికలనుండి, విశేషభాగాలను ఉల్లేఖించాడు.

1955 మొదలుకొని పాల్ఘాట్, అమృతసర్, విజయవాడలో జరిగిన మా పార్టీ మహాసభలలో డాంగేయులనుసరించిన రాజకీయ వైఖరిని మేము వ్యతిరేకిస్తూ ఉన్నాం.

అందుకు కారణం డాంగేయులు మార్క్సిస్టు-లెనినిస్టు శ్రామికవర్గ దృక్పథానికి, విధానాలకూ తిలోదకాలిచ్చి పాలక వర్గంతోనూ, బడా బూర్జువాల నాయకత్వాన గల బూర్జువాలతోనూ, భూస్వాములతోనూ పాలకవర్గాల పార్టీయైన కాంగ్రెస్ పార్టీతోనూ చెట్టపట్టాలుపట్టే వైఖరిని అనుసరించడమే.

డాంగేయులు అలాంటి వైఖరిని అనుసరిస్తూ తమ అన్యవర్గ వైఖరిని వ్యతిరేకించిన పార్టీ నాయకత్వంలో ఒక భాగాన్ని దేశభక్తిరహితులని నిందించే స్థితికి దిగజారిపోయారు.

మరీ ప్రత్యేకించి భారత – చైనా సరిహద్దు వివాదం ప్రారంభమైన తర్వాత, వారు బూర్జువా పత్రికలకు ప్రత్యేకించి "లింకు" పత్రికకు మా పార్టీ కేంద్ర కార్యదర్శి వర్గంలోనూ, కేంద్ర కార్యవర్గంలోనూ జరిగిన చర్చలను వెల్లడిస్తూ అక్కడ జరిగిన చర్చలను వక్రంగా చిత్రిస్తూ తమకు రాజకీయంగా వ్యతిరేకంగా ఉన్న వారిని "దేశభక్తి రహితులనీ", "చైనా ఏజెంట్లనీ" ఇలా ఇంకేమేమో నిందలు వేయడానికి మార్గం చూపారు భారత – చైనా సరిహద్దు వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్న పార్టీ నిర్ణయాలను వారు అమలుజరప నిరాకరించి మరోవైపు భారత ప్రభుత్వం ఈ సమస్యపై ఏమి చెప్పినా, ఏమి చేసినాసరే గుడ్డితనంగా సమర్థించసాగారు.

ప్రభుత్వ విధానాలు మన దేశాన్ని అమెరికన్ సామ్రాజ్యవాద కూటమివైపు ఈడ్చుకుపోతూ దేశానికి, ప్రజల ప్రయోజనాలకు ప్రమాదకరంగా తయారౌతూవుంటే, డాంగేయులు మాపై అభాండాలు మోపుతూ తమ దాడులు ఉధృతం చేశారు. తమ రాజకీయ విధానం, రాజకీయ వైఖరి ఎలా సరైనదో వారు పార్టీ నాయకత్వానికిగాని, అత్యధిక కార్యకర్తలకుగాని నచ్చజెప్పలేకపోయారు. అందుచేత మేము "చైనా ఏజెంట్లు"గా పనిచేస్తున్నామని, చైనావారి కోరికపై దేశ రక్షణను విచ్ఛిన్నం చేయ ప్రయత్నిస్తున్నామని "రుజువు" చేయడానికి వారు పూనుకున్నారు.

మాకు వ్యతిరేకంగా ఇలా నిందా ప్రచారోద్యమం సాగిస్తే తమ రాజకీయ వైఖరిని వ్యతిరేకిస్తున్న మా పార్టీ ప్రధాన నాయకత్వాన్నంతటినీ ప్రభుత్వం అరెస్టుచేసి ప్రజల నుంచి వేరుచేస్తుందని, తద్వారా పార్టీ కార్యకర్తలపైనా, యావత్తు పార్టీపైనా, పార్టీ పత్రికలపైనా సంపూర్ణమైన ఆధిపత్యం తమ చేతుల్లోకి వచ్చిపడుతుందని డాంగేయులు ఆశించారు. 1962లో ప్రభుత్వం మా పార్టీలో అత్యధిక ప్రధాన నాయకత్వాన్ని అరెస్టుచేసి నెలల పర్యంతం నిర్బంధంలో ఉంచింది. డాంగేయులు మా విడుదల కోసం ఈషణ్మాత్రం కూడా పనిచేయలేదు.

డాంగేయులు పత్రికలను, కొన్ని సంస్థలను హస్తగతం చేసుకొనడంలో సఫలీకృతులయ్యారు. అయితే పార్టీ సభ్యులలో అత్యధిక భాగాన్ని, అలాగే ప్రభుత్వంతోనూ, కాంగ్రెస్ పార్టీతోనూ వర్గసంకర కలయిక విధానాన్ననుసరించే తమ పార్టీ విధానాన్ని



వ్యతిరేకించే పార్టీ జనసామాన్యాన్ని తమవైపు త్రిప్పుకోలేకపోయారు. అందుచేత 1963 ఆఖరులోనూ, 1964 మొదట్లోనూ మాలో కొందరిని ప్రభుత్వం విడిచి పెట్టినమీదట పార్టీ ఐక్యతకోసం మేము మరొకసారి ప్రయత్నం చేశాం. పార్టీలో విభేదాలపై చర్చలు జరిపి సమైక్యతను సాధించడం కోసం పార్టీ మహాసభను జరుపుదామని మేము విజ్ఞప్తిచేశాం. అయితే డాంగేయులు ప్రజాస్వామిక పద్ధతుల్లో మహాసభ జరపడానికి నిరాకరించారు. పాత సభ్యత్వంలో 50 వేల మంది సభ్యత్వాన్ని వదలివేసి, తమను బలపరచే 20 వేల మంది కొత్త సభ్యులతో కూడిన తమ సభ్యత్వ జాబితానే పట్టుకొని వ్రేళ్ళాడారు. ఈదశ అంతటాకూడా మమ్ముల్ని "చైనా ఏజంట్లుగా" చిత్రించడం కోసం డాంగేయులు పడరాని పాట్లన్నీపడ్డారు.

డాంగేయులు మాకు వ్యతిరేకంగా వ్రాసిన వ్యాసాలు, నివేదికలు, తీర్మానాలు మొదలైనవన్నీ శ్రీ నందాకు పుష్కలంగా లభించాయి. అందువల్ల ఆయన మాపై అభాండాలను మోపడానికి, మా పార్టీకి చెందిన వెయ్యిమందికిపైగా నాయకులను అరెస్టుచేయడాన్ని సమర్థించుకోవడానికి డాంగేయుల వ్రాతలనుండి విశేషంగా ఉల్లేఖించాడు. అయితే డాంగేయుల అభాండాలు నందా గూఢచారిశాఖ సృష్టించిన కట్టుకథలకంటే, నీలాపనిందలకంటే అతీతమైన వాస్తవాలు ఎలా కాగలుగుతాయి? అందువల్లనే శ్రీ నందాకు తన ప్రభుత్వం నిర్ణయించిన కార్య విధానాన్ని బట్టి పనిచేసే న్యాయస్థానాలలో మమ్ముల్ని విచారించగల సాహసం లేకపోయింది.

డాంగేయులు ఎంతటి నీచానికి దిగారో, ఆచరణలో వారు ప్రభుత్వానికి, దాని పోలీసు బలగానికి ఎలా తోకగా తయారైన పరిస్థితికి దిగజారిపోయారో క్రింది ఉదాహరణ తెలుసుకోవచ్చు.

మేమంతా జైళ్ళల్లో నిర్బంధింపబడి ఉన్నకాలంలో, 1963 ఏప్రియల్‌లో డాంగే ఇలా వ్రాశాడు. "నేఫా సరిహద్దులో తాము ముందుకు త్రోసుకు రావడానికి తోడ్పడ్డంకోసం భారతకమ్యూనిస్టుపార్టీ దేశంలో ఆంతరంగికంగా దాడిచేసి నెహ్రూ ప్రభుత్వాన్ని ఒక విధమైన అడకత్తెర వ్యూహంలో బిగించడానికి సహాయపడాలని చైనా నాయకత్వం కోరింది." ఇది చైనా ప్రభుత్వాన్ని గాని, లేదా చైనా నాయకత్వాన్ని గాని బట్టబయలు చేయాలని చేసిన పనికాదు. భారత కమ్యూనిస్టుపార్టీలో డాంగే రాజకీయ వైఖరిని వ్యతిరేకించే నాయకులను అరెస్టుచేయాలనీ, అలాకానట్లయితే, చైనా దాడికి సహాయపడేందుకై వారు అడకత్తెర ఉద్యమాన్ని నిర్మిస్తారని భారత ప్రభుత్వానికి చెప్పడం కోసమే ఆయన ఇలా వ్రాశాడు.

ఏనాడో 1924 లోనే బ్రిటిష వైస్రాయికి తన సేవలను అంకితం చేయడానికి ముందుకు వచ్చిన డాంగే, ఈనాడు నందా ప్రభుత్వానికి చురుకుగా తన సేవలు అందజేయడంలో ఆశ్చర్యంలేదు; అందువల్లనే జాతీయ వ్యతిరేక చర్యలని చెప్పబడే కమ్యూనిస్టుల చర్యలను రుజువు చేయడం కోసం శ్రీనందా డాంగే అండ్ కంపెనీ వ్రాతల నుంచి, అవే వేద వాక్కులైనట్లు, పదేపదే ఉల్లేఖించాడు.

అయితే డాంగే, డాంగేయుల వ్రాతలు, అభాండాలు మా పార్టీ కార్యకలాపాలను "జాతీయ వ్యతిరేక కార్యకలాపాలు"గా రుజువు చేయడానికి ఎలా వాస్తవమైన ఆధారాలు కాగలుగుతాయని మేము మరొకసారి ప్రశ్నిస్తున్నాం.

రహస్య డాక్యుమెంట్లని చెప్పబడే వాటినుండి ప్రభుత్వం ఉల్లేఖించింది. అవన్నీ మా పార్టీ వెలువరించిందనో లేదా మా పార్టీలోని ప్రముఖులు రహస్యంగా వెలువరించారనో ప్రభుత్వం ఆరోపిస్తోంది. రహస్య డాక్యుమెంట్లని చెప్పబడే ఆ డాక్యుమెంట్లను నేనైతే చూడలేదు; చదవనూలేదు. ఈ డాక్యుమెంట్ల తయారీ, వాటికుండే అధికారిక విలువలు లేదా వాటిలోని విషయాలకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్న విషయాన్నిగాని లేదా డాంగేయులు చెబుతున్న దాన్నిగాని మేము నమ్మం. అందుచేత ఈ డాక్యుమెంట్ల ఆధారంపై మాపై మోపబడ్డ ఆరోపణలకు మేము జవాబివ్వం.

మా డాక్యుమెంట్లు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్నింటి నుంచి ప్రభుత్వం సందర్భశుద్ధి లేకుండానూ, తమ కనుకూలతగానూ ఉల్లేఖించింది. ఈ మా డాక్యుమెంట్ల ఆధారంతో భారత – చైనా సరిహద్దు వివాదం, సోషలిజానికి శాంతియుత పరివర్తన మొదలైన సమస్యలపై మా పార్టీ దృక్పథమూ, వైఖరేమిటో తెలుసుకోవచ్చు. మా పార్టీ మహాసభ మినిట్స్ కూడా ప్రభుత్వం వద్దనేవున్నాయి. త్రిచూర్‌లో మాపార్టీ కేంద్ర కమిటీ సమావేశ సందర్భంగా మమ్మల్ని అరెస్టు చేసినప్పుడు వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నది. అయితే ఆ మినిట్స్ నుంచి మేము దౌర్జన్య పద్ధతులకు అంకితులమైనట్లుగాని, లేదా మేము అజ్ఞాతవాసానికి వెళ్ళి తెలంగాణా పోరాట పద్ధతిపై గెరిల్లా యుద్ధం ప్రారంభించడానికి సమాయత్తమౌతున్నట్లుగాని రుజువు చేయగల దమ్ములు ప్రభుత్వానికి లేకపోయినై.

ఈ సమస్యలపై మా పార్టీ వైఖరేమిటో అర్థం చేసుకొన్నరీతిలో ఈ సమాధానంలో తెలియజేశాను. శ్రీ నందా మాపై మోపిన తీవ్ర నీచారోపణలను బట్టబయలుచేస్తూ, శ్రీ నందా, ఆయన అనుచరులు ధనాఢ్య పత్రికా రంగంద్వారా మాపై నిరవధికంగా సాగిస్తున్న నిందా ప్రచారంవల్ల ప్రజలలో ఏర్పడ్డ గందరగోళాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తా.

"టిబెట్‌లో పరిణామాలపై జాతీయ వ్యతిరేక వైఖరి"ని తీసుకున్నట్టు శ్రీ బి.టి. రణదివె, తదితర కమ్యూనిస్టుపార్టీ నాయకులను శ్రీ నందా నిందిస్తున్నాడు. ఈ టిబెట్ వ్యవహారమే చివరకు భారత – చైనా సరిహద్దు ఘర్షణగా బ్రద్దలయ్యింది. 1959లో మేము తీసుకొన్న వైఖరి, పార్టీ అంతా ఉమ్మడిగా ఉన్నప్పుడు తీసుకున్నదే. టిబెట్‌లో జరిగిన ఘటనలన్నీ సంపూర్ణంగా చైనా ప్రజారిపబ్లిక్ ఆంతరంగిక సమస్యయనీ, ఫ్యూడల్‌శక్తులూ, లామాలు సృష్టించిన తిరుగుబాటును చైనా ప్రభుత్వం అణచివేయడం సంపూర్ణంగా సమర్థనీయమేనని మా పార్టీ జాతీయ సమితి ఆనాడు తన తీర్మానంలో పేర్కొన్నది.

దలైలామాకు రాజరిక సౌకర్యాలు సమకూర్చడం, భారతదేశంలో ఉంటూ, అతడు చైనాకు వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి అనుమతించడం భారత ప్రభుత్వం చేసిన తప్పు.



అలా అనుమతించడం చైనాతో మనదేశానికున్న స్నేహ సంబంధాలకు ప్రబల ఆటంకం. ఆ కాలంలో పార్లమెంటులో మా పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరించిన శ్రీ డాంగే సైతం మా పార్టీ వైఖరిని ఆనాడు లోక్‌సభలో స్పష్టం చేశారు. అయినా శ్రీ నందా 1957లో టిబెట్‌లో జరిగిన పరిణామాలపట్ల మా వైఖరిని ఆధారం చేసుకొని మమ్ములను "జాతీయ వ్యతిరేక చర్యలు" తీసుకొంటున్నట్టు నిందించడానికి ప్రయత్నిస్తూన్నాడు.

## మీరట్ తీర్మానానికే మేము కట్టుబడివున్నాం

భారత – చైనా సరిహద్దు వివాదసమస్యపై 1969 నవంబర్‌లో మీరట్‌లో జరిగిన మా పార్టీ జాతీయసమితి సమావేశంలో ఆమోదించబడ్డ తీర్మానానికే మేము ఈనాటికీ కట్టుబడతాము. ఆ తీర్మానం ఇలా పేర్కొన్నది : ఒకటి : భారత, చైనాల మధ్య సరిహద్దు వివాదాన్ని శాంతియుత సంప్రతింపులద్వారా పరిష్కరించవలసిందే కాని యుద్ధం ద్వారా ఎన్నటికీ పరిష్కరించబడలేదు. ఈ వివాదాన్ని సైనిక మార్గాలద్వారా పరిష్కరించడానికి ఏదైనా ప్రయత్నం జరిగితే, అందువల్ల ఉభయదేశాల ప్రజల ప్రయోజనాలకు ప్రమాదం కలుగుతుంది. అంతేగాదు : అది ఆసియాలో శాంతికి ప్రమాదకరమేగాక, అమెరికన్ సామ్రాజ్యవాదులకు సహాయపడుతుంది. రెండు : పరస్పరదేశాల చారిత్రక, న్యాయశాస్త్ర, లేదా భౌగోళిక హక్కులపై పట్టుబట్టడం ద్వారాగాక, పరిపాలక సంబంధమైన వాస్తవాంశాలను పరిగణనలోకి తీసుకొనడం ద్వారా ఈ సరిహద్దు వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించవచ్చు. మూడు : తూర్పురంగంలో మెక్ మోహన్ రేఖను భారతదేశం, చైనాలకు మధ్య సరిహద్దు రేఖగా ఆమోదించాలి. ఎందువల్లనంటే అనేక సంవత్సరాలుగా భారతసైనిక గస్తీకేంద్రాలు ఈ రేఖపై నెలకొల్పబడివున్నాయి. ఈ రేఖకు దక్షిణంగావున్న భూభాగం భారతప్రభుత్వ అజమాయిషీ క్రింద ఉంది. నాలుగు : లడఖ్ రంగంలో సాంప్రదాయక సరిహద్దురేఖను ఉభయ ప్రభుత్వాలుకూడా తమ సరిహద్దు రేఖయని ప్రకటిస్తున్నాయి గాబట్టి దాని విషయమై పరిష్కరించి, మెక్ మోహన్ రేఖ విషయంలో అనుసరించే సూత్రాల ప్రాతిపదికపైనే ఈ రంగంలో సరిహద్దు రేఖ విషయంలో కూడా ఒప్పందం చేసుకోవాలి.

ఇలా చెప్పడమంటే కారకోరమ్‌పర్వతశ్రేణి కావల ఎక్కడో ఉన్న అక్సాయ్ చిన్ పీఠభూమి చైనాప్రభుత్వం అజమాయిషీ క్రింద ఉందిగాబట్టి ఆ ప్రాంతంలో కొంత భాగాన్ని చైనా భూభాగంగా మనం గుర్తించాలనీ, 1950లో నేఫా ప్రాంతంలో మెక్ మోహన్ రేఖకు దక్షిణంగా ఉన్న ఏ భూభాగాన్నయితే చైనావారు తమదంటున్నారో ఆ భూభాగం భారత ప్రభుత్వ అజమాయిషీ క్రింద ఉన్నదిగాబట్టి దాన్ని భారతదేశ భూభాగంగా గుర్తించాలని చెప్పాం. ఉభయత్రా భారీ ఎత్తున సైనిక చర్యలద్వారా ఈ పరిస్థితి ఈనాడు మార్చడం సాధ్యంకాదు. పోగా మిగిలిన వివేకవంతమైన మార్గమేదయ్యా అంటే, అది రాజకీయ

పరిష్కారమే. ఇటీవల శ్రీజయప్రకాష్‌నారాయణ్ సూచించుతున్నట్లుగా "ఇచ్చిపుచ్చుకునే" పద్ధతిపై రాజకీయ సంప్రతింపులు జరిపి ఈ సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకొనటం ఒక్కటే మార్గాంతరం.

## చైనా కమ్యూనిస్టు దేశమైనందున మేము ఈ సూచన చేయటం లేదు

కమ్యూనిస్టుదేశమైన చైనా ఈవివాదంలో ఇరుక్కొని ఉన్నందువల్ల మేమీ పరిష్కార విధానాన్ని సూచించడంలేదు. మనదేశ ప్రజల, మన దేశం యొక్క ప్రయోజనాలదృష్ట్యా మాత్రమే మేమీ పరిష్కారాన్ని సూచిస్తున్నాం. భారీ ఎత్తున సైనిక చర్యలకూ, యుద్ధానికీ దోహదమిచ్చే ఏ ఇతర మార్గమైనా సరే మనదేశ ప్రజలకు, మనదేశానికి వినాశకరమని మేము గట్టిగా అభిప్రాయపడుతున్నాం. పాకిస్తాన్‌తో మనకున్న వివాదం విషయంలో కూడా మా విధానం ఇదే. దేశ విభజన నాటినుంచి పాకిస్తాన్‌తో మనకు నిరంతర సంఘర్షణలున్నాయి. యుద్ధం కూడా జరిగింది. అందుచేత సరిహద్దు వివాదాలన్నిటినీ సంప్రదింపుల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నదే మా వైఖరి గత 18 సంవత్సరాలలో భారత – పాకిస్తాన్‌ల మధ్య 6,000 తుపాకి కాల్పులు, 60,000 సరిహద్దు ఉల్లంఘనలూ, సంఘర్షణలు జరిగాయని పత్రికలు తెలియజేశాయి.

## పాకిస్తాన్ పట్ల కూడా ఇదే వైఖరి

పాకిస్తాన్ భూస్వాముల, బూర్జువాల పరిపాలన క్రింద ఉన్న దేశం. ఆంగ్లో – అమరికన్ సామ్రాజ్యవాద సైనిక కూటాలైన సియాటో, సెంటోలలో అది సభ్యురాలే. అయినా పాకిస్తాన్‌తో మనకున్న వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మేము లోగడ చెప్పాం ఇప్పుడూ చెబుతున్నాం. దానికి కారణం, మన దేశ ప్రజల యొక్క, దేశం యొక్క ప్రయోజనాలను కాపాడుకోవాలన్న అభిలాషే అందుచేతనే పాకిస్తాన్‌తో ఏదోవిధంగా శాంతియుత పరిష్కారం సాధించాలని, మన రెండు దేశాల మధ్య, రెండు దేశాల ప్రజల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతనూ, సంఘర్షణనూ తగ్గించి, దానిని పూర్తిగా రూపుమాపివేయాలని మేము చెబుతున్నాం. ఈ ఉభయ దేశాల మధ్య, ప్రజల మధ్య ఉద్రిక్తతను, సంఘర్షణను ప్రజ్వలింపజేయాలని కుతూహలపడుతున్న ఆంగ్లో–అమెరికన్ సామ్రాజ్యవాదుల కుటిల పన్నాగాలను ఈ రూపంగా మాత్రమే భగ్నం చేయగలమని, ఈ ఉభయ దేశాలు తమ ఆర్థిక సంపదనూ, సంక్షేమాన్ని పెంపొందించుకొని ఉభయ దేశాల స్వాతంత్ర్యాలను కూడా బలవత్తరం చేసుకోగలవని మేము నమ్ముతున్నాం.



## బాగా ఆలోచించాలి

ఈ సరిహద్దు వివాదాల విషయాలపై మన దేశ ప్రజలు బాగా ఆలోచించాలి. భారత ప్రభుత్వం అనుసరిస్తున్న కార్యవిధానం దేశ ప్రజలను, దేశాన్ని ఎక్కడికి తీసుకుపోతుందో యోచించాలని మేము కోరుతున్నాం. భారతప్రభుత్వం ఈనాడు రక్షణ పద్దు క్రింద ఏటా 1000 కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నది. లోగల ఈ మొత్తం 300 వందల కోట్లు మాత్రమే ఉండేది. భారత ప్రభుత్వం బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదుల సైనిక సహాయంపైనా వారి సైనిక సరఫరా బాగా ఎక్కువగా ఆధారపడుతోంది. బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదుల సైనిక బలగాలతో కలసి మన సరిహద్దులలో సమిష్టి వైమానిక, నౌకా విన్యాసాలు జరుపుతోంది. మలేషియా, దూరప్రాచ్య ప్రాంతాలకు అందగావెళ్ళే బ్రిటిష్ సామ్రాజ్యవాదుల విమానాలకు అండమాన్ – నికోబార్ దీవులలో ఆగి, ఇంధనం పోసుకొని మళ్ళీ ప్రయాణం సాగించడానికి భారత ప్రభుత్వం అంగీకరించింది. వీటన్నింటికిమించి ఈనాడు, భారత దేశానికి ఏదో ఒకరకమైన అణ్వస్త్ర ఛత్రం పట్టవలసిందిగా భారత ప్రధాని ఆంగ్లో – అమెరికన్ సామ్రాజ్యవాదులను వేడుకోవడం, అందుకు వారు ఆనందంగా అంగీకరించడం; హిందూమహాసముద్రంలో తమ అణ్వస్త్ర నౌకా, వైమానిక బలకేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఆంగ్లో – అమెరికన్ సామ్రాజ్యవాదులు నిర్ణయించుకొని అందుకు ప్రయత్నాలు సాగించడం – ఇవన్నీ ఆగ్నేయాసియా రాజ్యాలన్నింటిపైనా చీకటి తెరలు కప్పడం, భారతదేశ స్వేచ్ఛకు నిరంతర ప్రమాదాన్ని తెచ్చిపెట్టే చర్యలు.

## ఇండియాకు సొంత అణ్వాయుధాలు

చైనా జరిపిన అణుబాంబు పాటవ ప్రయోగాన్ని శ్లాఘిస్తూ అదే సమయంలో "భారతదేశం తన సొంత ఆటంబాంబులను తయారు చేసుకోకూడదని" మేము చెప్పినట్లు శ్రీ నందా మమ్మల్ని నిందిస్తూ చేసిన ప్రసంగాన్ని ఇక్కడ మీకు గుర్తు చేయదలచాను. ఇది మరొక పచ్చి అబద్ధం. మా పార్టీ మహాసభలో ఈ సమస్యపై మేము చర్చించి ఎలాంటి తీర్మానం చేయలేదు. అటుపిమ్మట కూడా మా పార్టీ నాయకులను దేశ వ్యాపితంగా అరెస్టు చేయడం వల్ల ఈ సమస్యపై చర్చించడానికి అవకాశమేలేకుండా పోయింది. అయితే శ్రీ నందా మమ్మల్ని నిందించడం కోసం ఈ సమస్యను లేవనెత్తినందువల్ల దీనిపై నా అభిప్రాయం తెలియజేస్తాను.

అణ్వాయుధాలు సామూహిక వినాశనం గావించి అనేక దేశాలను సమూలంగా తుడిచిపెట్టేస్తాయి. చివరికిక్కడ సంవత్సరాలపాటు అణుధూళిని వదిలివేసే ప్రమాదం కూడా వుంది. అందువల్లనే మేము అణ్వాయుధాలను వ్యతిరేకిస్తూన్నాము. వాటిని సంపూర్ణంగా నిషేధించాలనీ, విధ్వంసం చేయాలనీ మేము కోరతాం. అంతేగాదు; అన్నిరకాల అణ్వస్త్ర

పాటవ పరీక్షలను, ఈ అణ్వస్త్ర పరీక్షలవల్ల వాతావరణం, జలం, భూగర్భంలో జరిగే అణుధూళి వ్యాప్తిని కూడా మేము వ్యతిరేకిస్తున్నాం. అందువల్ల మానవజాతికి వర్తమానంలోనేగాక భావితరాలకు కూడా ప్రమాదమని కూడా మేము అభిప్రాయపడుతున్నాం. అయితే ఆటంబాంబులను మొదట సృష్టించి, వాటిని ప్రప్రథమంగా ఆసియా ప్రజలపైనా, జపాన్ నగరాలైన హిరోషిమా, నాగసాకీలపై ప్రయోగించింది అమెరికన్ సామ్రాజ్యవాదులు. మిగతా ప్రపంచాన్నంతటినీ మోసగించి తమ ఆధిపత్యం క్రిందికి తెచ్చుకోవాలనే దురాశతో వారు వాటిని ప్రయోగించారు. బ్రిటన్ కూడా తన సొంత, అణు, హైడ్రోజన్ బాంబులను, మిస్సిలీలను తయారుచేసుకొన్నది. అమెరికా బెదిరింపులనుండి తన్ను తాను కాపాడుకొనడంకోసం సోవియట్ రష్యా అణ్వాయుధాలను తయారుచేసుకొన్నది. బలసంపదలో అమెరికన్ సామ్రాజ్యవాదుల గుత్తాధిపత్యాన్ని బ్రద్దలుకొట్టగలిగినందుకు సోవియట్ రష్యాను ప్రజాస్వామిక ప్రపంచమంతా అభినందించింది.

అయితే అణ్వాయుధశక్తిని పెంచుకొనడం జరిగి దాదాపు ఇరవై సంవత్సరాలు గడిచిన పిమ్మట కూడా అణ్వాయుధ నిషేధాన్ని, వాటి విధ్వంసాన్ని వ్యతిరేకిస్తున్నారు అమెరికన్ సామ్రాజ్యవాదులు. అణ్వాయుధాలను మొట్టమొదటగా తాము ఉపయోగించబోమని ప్రకటించడానికి కూడా వారు నిరాకరిస్తున్నారు. అటు సోవియట్ రష్యా, చివరకు ఆత్మరక్షణకు సైతం అణ్వాయుధాలను ముందుగా ప్రయోగించనని ప్రపంచానికి చాటి ప్రకటించింది. దానికి ముందుగా అమెరికన్ సామ్రాజ్యవాదులు చైనాను, వియత్నామ్‌ను అలాగే తన హుంకారానికి జంకని మరే ఇతర దేశాన్నయినాసరే అణ్వాయుధాలనుచూపి బెదిరిస్తున్నారు.

అలాగే ఫ్రాన్స్ కూడా తన సొంత అణ్వాయుధాలను తయారుచేసుకొన్నది.

ఇప్పటివరకూ జరిగిన సంఘటనలనుబట్టి చూస్తే ఒప్పందమనేది జరగకుండా అణ్వస్త్రాల పరీక్షలనుగాని, అణ్వస్త్రాల వ్యాప్తినిగాని, ఆపడం అసాధ్యమని రుజువయ్యింది. అణ్వాయుధాలను ఉత్పత్తి చేస్తున్నది వాస్తవంగా ఫ్రాన్స్, చైనాలు మాత్రమేగాదని, మరికొన్ని ఇతర దేశాలకు కూడా వాటిని ఉత్పత్తి చేయగల శక్తి ఉండటమేగాక అవి తమ సొంత అణ్వాయుధాలను తయారుచేసుకొనే స్థితిలో ఉన్నాయి కూడా.

అలాంటి పరిస్థితులలో, అమెరికన్ సామ్రాజ్యవాదుల అణ్వస్త్ర బెదిరింపు నుండి జాతీయ స్వాతంత్ర్య పరిరక్షణ, ఆత్మరక్షణల నిమిత్తం అణ్వస్త్రాలతో సహా తన కవసరమని తోస్తే ఏ ఆయుధాలనైనా ఉత్పత్తి చేసుకొనే హక్కు ప్రతి దేశానికీ ఉంది. అమెరికా అణ్వస్త్రాలు చూపి తనను బెదిరించడం రోజు రోజుకూ ఎక్కువౌతున్న కారణంగా తాను అణ్వాయుధాలు తయారుచేసుకోవలసి వచ్చిందని, అణ్వాయుధాలను తాను ముందుగా ఉపయోగించబోనని



కూడా చైనా ప్రభుత్వం ప్రకటించింది. అణ్వాయుధాల నిషేధంపై ఒక ఒప్పందం కుదుర్చుకొనడం కోసం ప్రపంచ దేశాల సభ జరగాలని చైనా విజ్ఞప్తిచేసింది.

అణ్వాయుధాలను ఒక నిర్ణీతకాల వ్యవధిలో నిషేధించి విధ్వంసం చేయడంకోసం భారత ప్రభుత్వం ఇతర ప్రభుత్వాలతోనూ, శక్తులతోనూ చేతులు కలిపి కృషిచేయాలని మేము అభిప్రాయపడుతున్నాం. ఈ కృషిలో మన ప్రభుత్వం విఫలమయ్యేట్లయితే, మన రక్షణకోసం మన సొంత అణ్వాయుధాలను తయారు చేసుకొనడం తప్ప మనకు గత్యంతరంలేదు. ఏ వైపు నుంచైనా సరే మన దేశ స్వాతంత్ర్యానికిగాని, రక్షణకుగాని ప్రమాదం ఏర్పడినట్లు మనం భావిస్తే మన సొంత అణ్వాయుధాలు తయారుచేసుకొనడం ఒక్కటే మనకు మిగిలిన మార్గాంతరం. ఏ దేశమైనాసరే అమెరికా వారి అణ్వస్త్రఛత్రంపైనో లేదా సోవియట్ అణ్వస్త్ర ఛత్రం మీదనో ఆధారపడటంకంటే, స్వేచ్ఛాయుతమైన తన సొంత సైనిక శక్తిని, అవసరమైన అణ్వాయుధాలతో సహా పెంచుకొనడమే సరైన మార్గం.

అందువల్ల భారత ప్రభుత్వం తన సొంత అణ్వాయుధ బలాన్ని పెంచుకొనడాన్ని మేము వ్యతిరేకిస్తున్నట్లు శ్రీ నందా మాపై చేసిన ఆరోపణ తప్పుడు ఆరోపణ అని స్పష్టం చేస్తున్నాం.

# చట్టసభల్లో ప్రసంగాలు



శాసనసభ

## 1957 : రాష్ట్రంలో ఆహార పరిస్థితిపై చర్చలో ప్రసంగం

ఈనాడు ఆహార సమస్య గురించి చాలా మంది సభ్యులు మాట్లాడారు. రైతులు అనే పేరుతో వ్యవసాయ కూలీల తరఫున భూస్వాముల కోసం మాట్లాడినవారు కూడా ఉన్నారు. మా పార్టీకి చెందిన కె.నర్సయ్యగారు మాట్లాడారు. వారు వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందినవారు. అందువల్ల వ్యవసాయ కుటుంబాల వారి కష్టాల గురించి చెప్పారు. శాసనసభలో చర్చలు జరిగేటప్పుడు వివిధ పార్టీల వారికి అవకాశాన్ని బట్టి స్పీకర్ అవకాశం ఇస్తారు. కాంగ్రెస్ పార్టీ తరఫున అందరు రైతులను, భూస్వాములను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవాలనిగానీ, ఇక్కడ మాకు అవకాశం ఇవ్వలేదని చెప్పుకోవడంగానీ ఏ విధంగా సమంజసమో తెలియదు. ఎందుకంటే కాంగ్రెస్‌లో హరిజనులు, వ్యవసాయ కూలీల తరఫున మాట్లాడటానికి ముందుకు వస్తే మేమిక్కడ ఉండి ప్రయోజనం లేదు. మంత్రిగారి ప్రకటన చూస్తే రాష్ట్రంలోని ఆహార సమస్యను వారు గుర్తించలేదని బోధపడుతోంది. ఏదో కొన్ని ప్రాంతాల్లో కొన్ని పంటలు నష్టపోయినవి. అయినప్పటికీ ఐదు లక్షల టన్నుల ఆహారధాన్యాలు అదనంగా ఉండేవి. ఇప్పుడు ఐదు లక్షల టన్నుల ఆహార ధాన్యాలు కూడా లేకుండా పోయాయి. ఆహార పరిస్థితి అంత గడ్డు కాదు అనే రీతిలో ప్రభుత్వం తరఫున మంత్రి చెబుతున్నారు. ఆహార సంక్షోభం తీవ్ర పరిస్థితిని గురించి మంత్రి చాలా తక్కువగా అంచనావేసి మాట్లాడారని చెప్పక తప్పదు. రాష్ట్రంలో ఐదు లక్షల టన్నుల బియ్యం ఏ రీతిగా మిగులుతుందో మంత్రిగారు లెక్కలిచ్చారు. మనిషికి 14 ఔన్సుల చొప్పున లెక్కవేసి ఆంధ్రదేశం చాలా అధిక పంటలు పండిస్తున్నది, ప్రజలకు కావలసినంత తిండికి సరిపోతున్నదన్నది వాస్తవ విరుద్ధం. పోనీ ఇప్పుడున్నటువంటి చేపలు, కోడిగ్రుడ్లు, నూనె గింజలు, వేరుశనగ, చక్కెర లెక్క వేసుకున్నప్పటికీ తలసరి 8 ఔన్సులకన్నా ఎక్కువ లేవు. ప్రతి మనిషికీ 24 ఔన్సుల ఆహారం అవసరం. మంత్రి ఇచ్చిన 14 ఔన్సుల లెక్క సరికాదు. 24 ఔన్సుల ప్రకారం లెక్క కడితే 49 లక్షల టన్నులు సరిపోదు. 75 నుంచి 77 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు మనప్రజలకు కావాల్సి ఉంటుంది. దీని ద్వారా మనకు 25 లక్షల టన్నుల ఆహార ధాన్యాల కొరత ఉందని మంత్రి గుర్తు పెట్టుకోవాలి. అందుకు

ఏమి చేయాలో ఆలోచించాలి. గత 3-4 ఏళ్లుగా ఏ రకంగా 5 లక్షల టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేసుకున్నాం? గత 10 సంవత్సరాలుగా ఎగుమతి చేస్తూ ఉండవచ్చు. ఈ ఏడాది వర్షాలు తక్కువైనా గోదావరి, కృష్ణా, పెన్నా డెల్టాల్లో పంట బాగా పండింది. నీటిపై ఆధారపడే గ్రామాలకు వెళ్ళి చూస్తే వ్యవసాయ కూలీ ప్రజానీకం, ఎకరం లోపు ఉన్న పేద రైతాంగం గ్రామంలో సగం ఉన్నారు. చేతివృత్తులవారు, చేనేత పారిశ్రామికులు, యాదవులు, ఇతర కులస్తులు, పూర్తిగా భూమి లేనటువంటి పేద ప్రజానీకం గ్రామంలో 50 శాతం ఉన్నారు. రాష్ట్రంలో ఒక కోటి 20 లక్షల మంది పేదలే. బాగా పంటలు పండే డెల్టా ప్రాంతంలోని వారు కూడా సంవత్సరానికి 90 రోజులు ఒక పూట మాత్రం గంజి తాగి బ్రతుకుతున్నారు. కొండయ్య చౌదరిగారు తలూపుతున్నారు. గ్రామాల అనుభవం ఉన్నది వారికే కాదు. వారికంటే ఎక్కువ అనుభవం నాకున్నదని చెప్పగలను. వ్యవసాయ కూలీలు ఏడాదికి 90 రోజులు ఒకపూట తిండి తింటున్నారనే సంగతి మరచిపోకూడదు. ప్రజలు ఒకపూట తిండికి కూడా కొరగాక కటకటలాడుతూంటే పండిన ధాన్యంతో ఇక్కడున్న ప్రజలకు తిండి పెట్టలేక, కావలసిన పని చూపలేక, చూపించినా ధాన్యం కొనుక్కునేంతగా కూలీ ఇవ్వలేక, బాగా భూములున్నటువంటి వారి దగ్గర పండిన పంటను ఎక్కువ లాభం కోసం ఇతర రాష్ట్రాలకు అమ్ముకోవడానికీ, ఇతర రకాలుగా అమ్ముకోవడానికీ అవకాశం ఉండబట్టే ఈ రోజు మన ప్రజలకు తిండిలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ రీతిగా ఎగుమతి జరుగుతోందిగానీ, మన ప్రజలకు చాలినంత తిండి పెట్టి అంతా సుఖంగా ఉండి మనం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నాం అనే మాట కల్ల అని మనవి చేస్తున్నాను. ఈనాడు ధరలు 1953లో ఉన్న ధరల కన్నా పెరగలేదు, ఏదో కొద్దిగా తప్పితే ఎక్కువగా పెరగలేదని మంత్రి అంటున్నారు. మంత్రి ఇచ్చిన లెక్కలు సరైనవి కావు. ధరల సూచిక తయారీ లోపభూయిష్టమైనది. ఈ రోజు తెలంగాణా ప్రాంతం ఖమ్మం జిల్లా నుంచి వచ్చిన వ్యక్తులు ప్రశ్నోత్తరాల సందర్భంలో చెప్పారు. ఇదివరకు రూపాయికి ఐదు శేర్లు వచ్చే పచ్చజొన్నలు ఇప్పుడు రెండు శేర్లు, రెండున్నర శేర్లు కంటే ఎక్కువ అమ్మడం లేదంటే ధరలు పెరిగినట్లా, లేనట్లా? డెల్టా ప్రాంతంలోని గ్రామాల్లో బియ్యం రూపాయికి ఒకటిన్నర శేర్లకంటే ఎక్కువ దొరకడం లేదని బాధపడుతున్నారు. ఇంకా ధరలు ఎక్కువ పెరగలేదని చెబితే ఉపయోగమేమిటి? ధరలు పెరిగాయి. ఈ ధరలు పెరగడం వల్ల ఎవరికి లాభం? కూలీలకు తిండి ఉండాలని ఒక ప్రక్క వాదిస్తూ రైతు దివాలా తీయాలని, రైతుకు గిట్టుబాటు కాకపోయినా పేద ప్రజానీకం వెళ్లి దోచుకోమని మేము చెప్పట్లేదు. నిజంగా ధరలు పెరగడం వల్ల రైతుకు లాభం ఉందా?

1957వ సంవత్సరం జనవరిలో మాసూళ్ళలో ధాన్యం బస్తా ధర రూ.20ల కంటే ఎక్కువ అమ్మలేదా? అంటే మనకు బియ్యం రూ.15లు. కానీ జూలై నెల వచ్చేటప్పటికీ బస్తా ధాన్యం రూ.27లు అమ్ముతుంది. చిన్న రైతాంగం, మధ్య తరగతి రైతాంగం పన్ను కట్టుకోవలసి వచ్చీ, అప్పులు చెల్లించవలసి వచ్చీ కళ్ళంలోనే రూ,20లకు అమ్ముకోవడం ఏమిటి? దానిని నిలవ చేసుకుని రూ.28లకు అమ్మడం రైతుకు ఏ రీతిగా లాభం? భూమి ఉన్నవాళ్ళంతా రైతులని మేము ఒప్పుకోము. నాగలి తీసుకుని భూమి దున్ని స్వయంగా



కొడవలితో పనిచేసేటటువంటి రైతులు ఎంత మంది ఉన్నారు? వాళ్ళకు నిజంగా కష్టమైతే ఏ ధర గిట్టుబాటు ధర అవుతుందనే సంగతి చూడవచ్చు. భూమి ఎక్కడుందో తెలుసుకోకుండా, భూమి ముఖం చూడకుండా, ఎప్పుడూ సాగుచేయకుండా, కర్ర పెత్తనం చేస్తూ, కూలీల చేతనో, కౌలుదారు చేతనో వ్యవసాయం చేయించుకుంటూ అనుభవించేటటువంటి భూస్వాములకు లాభాలు చాలలేదంటే వాళ్ళకెప్పుడూ లాభాలు చాలవు. అందుచేత అటువంటి విషయం కాదు. వారందరినీ రైతులనడం పొరపాటు. ఈ సంవత్సరం కూడా ఏమి జరిగింది? జోన్స్ పెట్టిన తరువాత కూడా ధర రూ.25ల కన్నా ఎక్కువ లేదు. కొత్త పంటలు వస్తున్నాయి. మామూలుగా కష్టపడి పని చేసే పేద, మధ్య తరగతి రైతాంగం మాసూళ్ళలో ధాన్యం అమ్ముకోవలసిన పరిస్థితులు ఉన్నప్పుడు వారికి ధరలు తగ్గకుండా కనీస గిట్టుబాటు ధర లభించేటట్లు చూడాలని మేము కోరుతున్నాము. కష్టపడిన రైతుకు మణుగు ధాన్యానికి రూ.15ల కంటే ఎక్కువ ఇవ్వలేరు. కాబట్టి అదే ధర భూస్వాములకు ఇచ్చి, వారి వద్ద ఉన్న ధాన్యం విలువలను సేకరించడానికి ప్రభుత్వం పూనుకోవాలి. మణుగు బియ్యానికి రైతుకు రూ.15లు ఇచ్చి, బయట రూ.16 లేదా 17లకు అమ్మితే ప్రజలకు ఇబ్బంది ఉండదు. రైతులకు నష్టం ఉండదు. గ్రామ సీమల్లోని వ్యవసాయ కూలీలు, పట్టణాలలోని కార్మికులు, పేద ప్రజలు, చేనేత పారిశ్రామికులు మణుగు రూ.16లకు కూడా కొనుక్కునే పరిస్థితిలో లేరు. కావున వారికి ప్రత్యేకంగా చౌక డిపోలు పెట్టాలి. తూకం ప్రకారమైనా ఆ డిపోల్లో రూపాయకు 3 శేర్లు బియ్యం, 4 శేర్లు జొన్నలు చొప్పున, ప్రభుత్వం అమ్మాలి. దాని వల్ల నష్టం వస్తే ఆ నష్టాన్ని ప్రభుత్వమే భరించాలి. అనేక రకాల పన్నులు వేయగలిగినా ఈ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించలేదు. కేంద్ర ప్రభుత్వమే ఈ భారాన్ని భరించాలని వ్యవసాయ మంత్రి చెప్పారు. ఇందుకు మన ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. దానికి మేము ప్రభుత్వంతో పూర్తిగా సహకరిస్తాము. దానిని జయప్రదంగా కొనసాగించమని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం అవసరాలు తీర్చకుండా బియ్యం ఎగుమతి చేయడానికి మేము అంగీకరించం. ఇతర రాష్ట్రాలకు అవసరమైతే విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి చెప్పాలి. అందుకు మేము సహకరిస్తాం. మెట్ట పైర్లు సగానికి సగం నష్టపడ్డాయి. డెల్టాల్లో వర్షాలు లేకపోయినా కాలువలో నీరు పారుతున్నంత మాత్రాన మామూలు పంట పండుతుందనడం సరైనదికాదు. సకాలంలో వర్షం ఉండి, కాలువలో నీరు ఉన్నప్పుడే సరైన పంట పండుతుంది. అలా కానప్పుడు పంట నష్టం ఉంటుంది. 32 లక్షల ఎకరాల్లో వరి సగానికి సగమే పండుతుందని మంత్రి ఒప్పుకున్నారు. సక్రమంగా వర్షాలు పడనందున ఈ పరిస్థితి ఏర్పడిందని దృష్టిలో ఉంచుకుని దాని గురించి ఏ చర్య తీసుకోవాలో ప్రభుత్వం ఆలోచించవలసి ఉంది. లేకపోతే కరువు వచ్చి, తిండి లేక కటకటలాడే పరిస్థితి ఆంధ్ర దేశానికి వస్తుంది. మాసూళ్లు రాబోతున్నాయి. ఈ మాసూళ్ళలో అమ్ముకునే రైతులకు ధరలు పడిపోతాయి. అందుచే మేము కోరిన రీతిగా ధాన్యం జొన్నలకు కనీస ధర నిర్ణయించాలి. అంతకంటే తక్కువ ధరకు అమ్మవలసి వస్తే ప్రభుత్వమే కొని, నిల్వ చేసి ఎక్కడ అవసరమైతే అక్కడ అమ్మడానికి పేద ప్రజలకు చౌక డిపోలు తెరచి ఈ ధాన్యాన్ని అమ్మాలి. ఆహార

ధాన్యాలు తగ్గే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ధరలు విపరీతంగా పెరిగే ప్రమాదముంది. ఏ షావుకారూ, భూస్వామీ మణుగు బియ్యం రూ.17లకు అమ్ముకోడు. అలా అమ్మితే రూ.15లకే వారి నుంచి సేకరిస్తారని ప్రభుత్వం చెప్పవచ్చు. అలా స్వాధీనం చేసుకునే హక్కు నిత్యావసర సేకరణ చట్టం క్రింద రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. ఆ ప్రకారంగా ధరలు నిర్ణయించి సేకరించాలి. అలా చేస్తే తిండి పెట్టలేకపోయినా కనీసం ఉన్నదాంట్లో గంజినీళ్ళు పోసైనా పేద ప్రజలకు బ్రతికించుకునే వీలుంటుంది. కరువు రాబోయే పరిస్థితుల్లో ఏర్పడే గడ్డు పరిస్థితిని మనం ఎదుర్కొనవలసి వస్తుంది. ఆకలి బాధలకు గురికావలసి వస్తుంది. చౌక డిపోలు పెట్టినంత మాత్రాన సమస్య పరిష్కారమౌతుందని అనుకోవడం లేదు. పేదలకు పనులు కల్పించాలి. వారికి కనీసం ఒకపూట అయినా తిండి పెట్టాలి. కరువు భత్యం ఇవ్వాలి. ఈ బాధ్యత కూడా ప్రభుత్వం మీద ఉంది. బయట ఎన్ని భేదాభిప్రాయాలున్నా ఈ విషయంలో మాత్రం అన్ని పార్టీలు కలిసి ఆకలితో మలమల మాడిపోతున్న ప్రజలకు తిండి చూపించవలసి ఉంది. ఈ విషయంలో ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తామని చెబుతున్నాను. మాగాణి ప్రాంతంలో 5 ఎకరాలు, మెట్ట ప్రాంతంలో 25 ఎకరాలు ఉన్న రైతు వ్యవసాయం చేసుకోవడానికి విత్తనాలు, అప్పులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

## 1958-59 : బడ్జెట్‌పై చర్చలో ప్రసంగం

**దే**శంలో తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలను కలిపి విశాలాంధ్ర ఏర్పాటు చేయడం జరిగింది. విశాలాంధ్ర ఏర్పడిన తరువాత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తగిన రీతిగా కృషి చేస్తామని మనం-వారు కలసి హామీ ఇచ్చాము. నిజంగా తెలంగాణాలోవలె వెనుకబడిన ప్రాంతాలు ఆంధ్రలో ఉన్నాయా- లేదా అనేది సమస్య కాదు. విశాలాంధ్రలో 3 కోట్ల 50 లక్షల ఆంధ్రుల కోసం కావలసిన చర్యలు తీసుకుంటామని ఆర్థికంగా వైజ్ఞానికంగా అభివృద్ధి పొందడానికి, వారికి ఉన్న అనుమానాలను తీర్చడానికి హామీ ఇచ్చాం. వాటిని అమలు జరుపుతున్నాం. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. ఒక తెలంగాణా వారి విషయమే కాదు, ఇతర ప్రాంతాల వారు గోల పెట్టిన తరువాత ఆంధ్ర శాసనసభ్యులు ఆలోచించవలసిన సమస్య కాదు. అయ్యపురెడ్డిగారి ఉపన్యాసం ఇక్కడ ఎవరో తరతరాలుగాఉండి తిష్టవేసుకుని తమ హక్కుల కోసం ఏడుస్తారని అన్నట్లుగా ఉంది. అటువంటి మాటలు మాట్లాడుతూ ఉంటే మన సమస్యలు ఏ విధంగా పరిష్కారమవుతాయో తెలియదు. అసలు విషయాలు ఆయన సమగ్రంగా అవగాహన చేసుకున్నారో లేదో తెలియదు. అటువంటి ఉపన్యాసాలు చేయవద్దని వివిధ పార్టీల వారికి విజ్ఞప్తి చేస్తున్నాను. డి.ఎస్.రెడ్డిగారి గురించి ఇది వరకు చర్చించాం. మంత్రివర్గం కొన్ని హామీలు ఇచ్చింది. విశ్వవిద్యాలయ చట్టాన్ని సవరించి దాని ప్రకారం ఉస్మానియా వైస్ ఛాన్సలర్ పదవికి ఎన్నికలు జరిపిస్తామని మంత్రులు



హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకునే సమయం వచ్చింది. అలాంటప్పుడు ఏదో అరవ వారిని పోటీ పెట్టడమనేది ఆంధ్ర తెలంగాణా భేదము చాలక, ఆంధ్ర, తమిళ బేధములు రెచ్చగొట్టడం అవుతుందని చెప్పవలసి వస్తుంది. ఉన్న పరిస్థితిని చెడగొట్టడానికి ఇష్టమొచ్చినట్లు ఉపన్యాసం చేయడం తగిన సమాధానం కాదని అలాంటి ఉపన్యాసాలు నిరుపయోగమని చెబుతున్నాను. వచ్చిన ఆదాయాన్ని ఖర్చు చేయలేకపోతున్నారు. ఐదు నెలలో తెలంగాణా నుంచి కోటీ 70 లక్షల అదనపు ఆదాయం వచ్చింది. తెలంగాణా అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎందుకు ఖర్చు పెట్టలేకపోయింది- దానిలో ఉన్న చిక్కులేమిటి? తెలంగాణా నుంచి వచ్చిన అదనపు ఆదాయాన్ని తెలంగాణా అభివృద్ధి కోసం ఖర్చు పెడతామని చెప్పిన తరువాత ఎందుకు ఖర్చు పెట్టలేదని అడుగుతున్నాను. వెనుకబడిన ప్రాంతాలన్ని అభివృద్ధి చెందిన ప్రాంతాలతో సమానంగా తీసుకుపోవడానికి ఖర్చు పెడతామన్నప్పుడు ఎందుకు ఖర్చు చేయలేదు.? అది ఉద్యోగుల తప్పు కావచ్చు. ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న తప్పు కావచ్చు. తెలంగాణాకు 105 మంది శాసనసభ్యులతో ప్రాంతీయ కమిటీ రాబోతోంది. దాని నుంచి 9 మందితోనో, 11 మందితోనో అన్ని పార్టీలతో బాధ్యతతో కూడిన ఒక చిన్న కమిటీని ఏర్పాటు చేసి వచ్చే సమస్యలన్నింటిని వారు ఆలోచించి తగిన సలహాలు ఇచ్చే వీలుంటుంది. అన్ని పార్టీలతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తే ఆంధ్రా, తెలంగాణా అని భేదాభిప్రాయాలు రాకుండా అందరూ కలసి పని చేయడానికి అవకాశం ఉంటుంది. ఈ విషయం ఆలోచించవలసిందిగా మంత్రి వర్గాన్ని కోరుతున్నాను. ఇక ఉద్యోగుల సమస్య వస్తుంది. దానిలో ఏమీ లేదని మంత్రివర్గం అనుకోవచ్చు. ఏదో ఒక గ్రూపు రెచ్చగొడుతున్నారని- ఆంధ్ర, తెలంగాణా భేదాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అనుకోవచ్చు. నేను పూర్తిగా ఏమీ లేదని అనుకోలేదు. నా దగ్గరకు ఆంధ్ర ప్రాంతం ఆఫీసర్లు వచ్చి, తమకు అన్యాయాలు జరుగుతున్నాయని చెప్పడం, తెలంగాణా ఆఫీసర్లు వచ్చి, తమకు అన్యాయాలు జరుగుతున్నాయని చెప్పడం జరుగుతోంది. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి తగిన విధానం మనం తీసుకోకపోతే ఈ పరిస్థితులు విషమించవచ్చు. 9 మందితో అన్ని పార్టీల బాధ్యత కలిగినటువంటి ఒక చిన్న కమిటీని వేసి, విచారించినట్లైతే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి వీలవుతుంది. హైదరాబాదులో చేయవలసిన వ్యయాన్ని తెలంగాణా వ్యయం క్రింద చూపకూడదు. సిటీ ఆదాయాన్ని రెండు ప్రాంతాలలో కలుపకూడదు. మిగిలిన తెలంగాణా ప్రాంతానికి వచ్చే ఆదాయం లెక్క వేయండి, అదే ప్రకారం ఎంత ఖర్చు పెట్టామో చూపండి. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చెందిన ప్రాంతాలతో సమానంగా తీసుకువచ్చినప్పుడే విశాలాంధ్రకు అర్థం ఉంటుంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన పనులు ఆచరణలో పెట్టకపోతే దానికి ప్రయోజనం ఉండదు. శాసనసభ మర్యాదను, ప్రజాతంత్రాన్ని కాపాడవలసి ఉంటుంది. ఈ సంవత్సరం ఏ పథకాలు అమలు చేయగలమో ఆలోచించి వాటినే బడ్జెట్‌లో చూపించి డబ్బు ఖర్చు చేయాలిగాని ఇష్టం వచ్చినట్లు డబ్బు ఖర్చు చేయడం న్యాయం కాదు. పోతే ఈనాడు మంత్రిగారు పొదుపు ఉద్యమం గురించి చెబుతున్నారు. గ్రామసీమల్లో పేద ప్రజానీకం పొదుపుచేసే డబ్బు మీద మనం ఆధారపడవలసి

ఉంటుందన్నమాట. పొదుపు ఉద్యమం అని పేరు పెట్టి పేదప్రజలను బాధించడం సరైనది కాదు. మేము పొదుపు ఉద్యమం అనేదానిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. పొదుపు ఉద్యమం అన్నది అర్థంలేని నినాదమని చెప్పకతప్పదు. కేంద్ర ప్రభుత్వం మన దగ్గరి నుండి ఎంతో డబ్బు తీసుకుంటుంది గానీ మనం మాత్రం వారి దగ్గర నుండి డబ్బు తీసుకోం. భూస్వాముల మీద ఎక్కువ పన్నులు వెయ్యరు. పేద ప్రజానీకం నుండి మాత్రం పొదుపు ఉద్యమం పేరుతో నిర్బంధంగా డబ్బు వసూలు చేస్తున్నారు. రూపాయి శిస్తు కట్టే వాడి దగ్గర నుంచి ఇంకో రూపాయి నిర్బంధంగా పొదుపు క్రింద తీసుకోవడం అర్థంలేని పని. ఇటువంటి పద్ధతిని వెంటనే అరికట్టక తప్పదు. ఈ విధంగా పేద ప్రజల దగ్గర నుంచి డబ్బులు తీసుకుని పరిశ్రమాభివృద్ధి చేస్తాననుకోవడం పొరపాటు. ప్రజల జీవన స్థాయిని పెంచడానికి ఈ ప్రభుత్వం ఏమీ చేయడం లేదు. ఆర్థిక మంత్రిగారు ఇది మిగులు బడ్జెట్ అని అన్నంత మాత్రాన లాభం లేదు. అందరి కడుపులు కోసి, అందర్నీ పస్తులుంచి ఏ పనులూ చేయకుండా ఉంటే మిగులు బడ్జెట్ తేలికగానే అవుతుంది. బడ్జెట్ ఉపన్యాసం బట్టి చూస్తే ప్రజల జీవిత ప్రమాణాలు సంవత్సరాలు దాటిన కొద్దీ పెరిగేటట్టు కన్పించడం లేదు. అభివృద్ధి కార్యక్రమాల క్రింద ప్రతి సంవత్సరం ఖర్చు చేస్తున్న సొమ్ము రాను రానూ తగ్గిపోతుంది. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఉన్నప్పుడు శాసనసభ్యులు సూచనలు చేస్తే కూడా ఏమాత్రం లక్ష్యం చేయకుండా ప్రభుత్వం పరిపాలిస్తున్నదంటే ఇది ఏవిధంగానూ ప్రజల క్షేమాన్ని కాక్షించేది కాదని చెప్పాల్సి ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం కొంచెం జాగ్రత్తగా ఆలోచించి దేశంలోని పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని శాసనసభ్యులు ఇదివరకు చేసిన సూచనలు ఇప్పుడు ఈ బడ్జెట్ సందర్భంలో చేసే సూచనలు అన్నింటినీ పరిశీలించి దేశాన్ని ముందుకు తీసుకుపోయే రీతిలో ప్రభుత్వ వ్యవహారాలు నడపాలని అలాగాక ఇదే స్థాయిలో ప్రభుత్వం నడిచేటట్లయితే అది ప్రజల క్షేమం దృష్ట్యా మంచిదికాదని చెబుతున్నాను.

## 1960 : ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో ప్రసంగం

### (26 మార్చి 1960)

గత రెండు ప్రణాళికల కాలంలోనూ ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగింది. ఈ నష్టం మన రాష్ట్రానికే పరిమితమైనది కాదు. మూడవ ప్రణాళికలోనైనా జరిగిన నష్టాన్ని పూడ్చే ప్రయత్నం జరగలేదు. రెండవ పంచవర్ష ప్రణాళిక కింద మనం దేశంలో అధిక వ్యవసాయ దిగుబడి సాధించి, దిగుమతులు తగ్గించుకోవలసి ఉంది. అందుకుగాను రైతులకు నీటిపారుదల సదుపాయాలతోపాటు ఎరువులు కూడా సమకూర్చాలి. ఈ లక్ష్య సాధన కోసం రాష్ట్రంలో ఎరువుల కర్మాగారం ఏర్పాటు జరగాల్సి ఉంది. కానీ దానిని నైవేలీలో ఏర్పాటు చేసారు. అక్కడ పెట్టినందుకు బాధలేదు. కానీ, వనరుల లభ్యత, సాంకేతిక క్లిష్టత



మూలంగా 1963-64 దాకా అక్కడ ఉత్పత్తి మొదలుకాదు. ఇప్పటికే కోట్లాదిరూపాయలు ఖర్చు అయింది. రెండవ పంచవర్ష ప్రణాళికలో ఫెర్టిలైజరు ఫ్యాక్టరీలను పూర్తిచేసి కావలసిన పంటలు పండించుకోవాలని లక్ష్యంగా పెట్టి 1963 కో 1964కో గాని తయారుకాని ఫ్యాక్టరీ కోసం అక్కడ డబ్బు ఖర్చు పెట్టడం ఏ రీతిగా భారతదేశం సిరిసంపదలను పెంపొందించడానికి ఉపయోగపడుతుంది? నైవేలీలో కావాలంటే పెట్టవచ్చు. కానీ ఎరువుల ఫ్యాక్టరీకి కేటాయించిన డబ్బు తమిళనాడులోనే ఖర్చుపెట్టారా? లేదు. ఎందుకంటే సాధ్యము కాదు. 1963కో 1964కో సాధ్యమయ్యే పని గురించి 1956 నుంచి 1961 వరకు ఎరువుల ఫ్యాక్టరీ కోసం తమిళనాడులో ఖర్చుపెట్టలేదు. ఆ డబ్బును ఒకరకంగా మురగపెట్టారని చెప్పవలసి వస్తుంది. ఆ డబ్బును ఆంధ్రదేశంలో పెట్టి ఉంటే వెనువెంటనే తయారవుతున్న బొగ్గు ఉంది. దానికి కావలసిన జిప్సం త్వరగా తెచ్చుకోవడానికి అవకాశం ఉంది. నాసిరకమైన బొగ్గును విద్యుత్ క్రింద మార్చి దాని తరువాత చేసుకునేదానికన్నా తయారవుతున్న బొగ్గును విద్యుచ్ఛక్తి క్రింద చేసుకుని కొత్తగూడెంలో వెనువెంటనే 1956లో ఆరంభిస్తే ఆ పాటికి ఆంధ్రదేశంలో ఎరువుల ఫ్యాక్టరీ వచ్చేది. దాంట్లో ఆంధ్రదేశపు రైతాంగానికే గాక ఇతర ప్రాంతాలలో ఎరువుల కొరత ఉన్న రైతాంగానికి సరఫరా చేసి పంటలు పండించడానికి వీలుంటుంది. తరువాత, మూడవ పంచవర్ష ప్రణాళిక వచ్చినప్పుడు నైవేలీలో నాసిరకం బొగ్గు తయారైన తరువాత, దానిని విద్యుచ్ఛక్తి క్రింద మార్చుకొన్న తరువాత వెనువెంటనే ఎరువుల ఫ్యాక్టరీ పెట్టడానికి ఏరకంగానూ అభ్యంతరం ఉండేదికాదు. తమిళనాడుకు నష్టం వచ్చి ఉండేది కాదు. ఆంధ్రదేశానికి నష్టం వచ్చి ఉండేది కాదు. కాబట్టి మొత్తం భారతదేశం కూడా లాభపడేది. కానీ, ఏ కారణంచేతనో ఎవరి యొక్క సలహాల ప్రకారమో అటు తమిళనాడుకు లేదు, మనకు లేదు; కాగితం మీద పెట్టడం, ఏది త్వరగా పూర్తి అవుతుందో దానిని పూర్తి చేసుకోకుండా ఉండే పద్ధతి అవలంబించడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, భారతదేశ ప్రజలకు ఎంతనష్టం కలుగుతుందో చూడవలసి ఉంటుంది.

ఇక చక్కెర ఫ్యాక్టరీల సంగతి. చక్కెర ఫ్యాక్టరీల వల్ల ప్రభుత్వానికి చాలా లాభాలు వస్తున్న సంగతి అందరికీ తెలిసినదే. చక్కెరను ప్రజలకు కావలసినంత సరఫరా చేయడమే కాకుండా ఎక్సైజు పన్నుల వల్లగాని, ఇతర పన్నుల వల్లగాని ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తున్నది. చక్కెర ఫ్యాక్టరీ యజమానులకు వస్తున్న లాభాల మాట వేరే సంగతి. నేను దాని జోలికి వెళ్ళడములేదు. తమిళనాడులోగాని, మన ఆంధ్రప్రదేశ్ ప్రాంతములోగాని పండే చెరకులో ఉత్తర హిందూస్థానం కన్నా, ఇతరప్రాంతాలకన్నా చక్కెర శాతం ఎక్కువ ఉంటుందని, అంతేకాకుండా ఎకరానికి ఎక్కువ టన్నుల చెరకు పండుతుందని స్పష్టముగా అందరూ అంగీకరిస్తున్న విషయమే. మన ఆంధ్ర రాష్ట్రానికి రెండవ పంచవర్ష ప్రణాళిక కాలంలో తొమ్మిది చక్కెర ఫ్యాక్టరీలను ఇస్తామని కేంద్ర ప్రభుత్వము వారు చెప్పారు. సహకార పద్ధతిలో పెట్టుకోండి. కొంత మీ ప్రభుత్వము ఇవ్వండి, కొంత మేము ఇస్తాము అని కేంద్ర ప్రభుత్వము వారు అన్నారు. రైతాంగము కొంత కష్టపడి చక్కెర ఫ్యాక్టరీలను పెట్టడానికి ప్రయత్నం చేస్తే "1961 లోపల మీకు చక్కెర ఫ్యాక్టరీలను ఇవ్వలేము. ఫ్యాక్టరీలకు కావలసిన మారకము

లేదు" అని అన్నారు. ఆ సమస్య ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే ఎందుకు రావలసి వచ్చింది? రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో బొంబాయి రాష్ట్రానికి అనేక ఫ్యాక్టరీలు ఇచ్చారు. ఇతర రాష్ట్రాలకూ ఇచ్చారు. ఆంధ్రదేశంలో పరిశ్రమలు పెట్టమని అడిగేటప్పటికే విదేశమారకము సమస్య వస్తుంది. బిర్లాగాని, టాటాగాని ఏ పరిశ్రమ పెట్టదలచుకున్నా వారికి కావలసిన మారకం దొరుకుతుంది. వారికి విదేశీ మారకము ఉందని ఇస్తూ ఆంధ్రదేశం విషయం వచ్చేటప్పటికి మారకము లేదని మొండిచెయ్యి ఎందుకు చూపించవలసి వస్తున్నదో అర్థం కావడం లేదు. ఈ రోజున ప్రాధాన్యత ఇస్తున్న విషయాలు చూడండి. మన బిడ్డలు చదువుకొని దేశము యొక్క ఔన్నత్యాన్ని పెంపొందించుటకు కాగితము కావాలి. విదేశాల నుంచి కాగితము తెప్పించుకొనడం వల్ల మన పత్రికలను నక్రమముగా నడిపించుకొనలేకపోతున్నాం. ఎక్కువ ఖర్చు అవుతోందని ఒక ప్రక్కన చెపుతూ దీనికి కావలసిన మారకం సరఫరా చేయకుండా రేయాన్ ఫ్యాక్టరీలకు మారకం ఇస్తున్నారు. వాటికి ఇవ్వడానికి ఎక్కడ నుంచి మారకం వచ్చిందో? ఈ విధానం వల్ల మన రాష్ట్రానికి అన్యాయం కలిగింది. ప్రాగాటూల్సును తీసుకొందాం. ప్రాగాటూల్సు రాకముందు బోధన్‌లో న్యూస్‌ప్రింటు ఫ్యాక్టరీ పెట్టే దానికి మనం అడిగాం. అది ఏదో పరిశోధనలో ఉందని, మారకం లేదు- రెండూ చెపుతూ వచ్చారు. రాజమండ్రిలో ఉన్న పేపరుమిల్లును ఈ అయిదేళ్ళ లోపలనే అభివృద్ధి చేసేదానికి రెండు కోట్ల 70 లక్షల రూపాయలో, ఒక కోటీ డెబ్బై లక్షల రూపాయలో సరిగా జ్ఞాపకం లేదు. ఒక కోటి 30 లక్షల రూపాయలు అనుకొంటాను. మనం అడిగింది 50 కోట్ల రూపాయలు కాదు, 100 కోట్ల రూపాయలూ కాదు. దానిని కొంచెం అభివృద్ధి చేసేదానికి ఒక కోటి 70 లక్షల రూపాయలు ఇవ్వమంటే మారకం దొరకదు అని అన్నారు. 80 కోట్ల రూపాయలు కావలివస్తే తమిళనాడుకు దొరికింది. వందలు, వేల కోట్ల రూపాయలు కావాలంటే టాటా, బిర్లాలకు దొరుకుతుంది. ఆంధ్రదేశములో ఉన్న ఈ ఫ్యాక్టరీని అభివృద్ధి చేయుటకు ఒక కోటి 70 లక్షల రూపాయలు కావాలంటే అందులో కోటి రూపాయలు విదేశీ మారకము కాదనుకోండి లేదు పొమ్మన్నారు. పేరుకు మాత్రం రెండవ పంచవర్ష ప్రణాళికలో ఆరంభిస్తామనడం, అసలు రెండవ పంచవర్ష పూర్తికావచ్చేటప్పటికో లేక మూడవ ప్రణాళికలోనో ఆరంభించడం జరుగుతుంది. ప్రాగాటూల్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ పెత్తనం ఉండకూడదని, కేంద్ర ప్రభుత్వం యొక్క పెత్తనము క్రింద ఉన్నట్లయితే చాలా బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. పోనీలే, మనది బీదదేశము, బీద రాష్ట్రం, బీద ప్రభుత్వం. మన ఉద్యోగస్థులకు తక్కువ జీతాలు ఇచ్చుకుని బాధపడుతున్నాం. ఇంకా ఎక్కడ అప్పు తెస్తాము. తీసుకోండి అభివృద్ధి చేస్తే కొంత పని అయినా దొరుకుతుందని చెప్పి వారికి ఇస్తే రెండవ ప్రణాళికా కాలంలో ప్రాగాటూల్స్ గురించి వారు ఏదయినా అదనముగా డబ్బు ఖర్చు చేసారా అంటే అదేమీలేదు. మహాఖర్చు పెడితే ఈ సంవత్సరం ఖర్చుపెడతారు. లేకపోతే మూడవ ప్రణాళికకు నెట్టడము జరుగుతుంది. ఆంధ్రరాష్ట్రములో ఉన్న చిన్న చిన్న ఫ్యాక్టరీలు



అంటే రైసుమిల్లులు, ఆయిలు మిల్లులు కాటన్ జిన్నింగు, ఆజంజాహీ లాంటి కొన్ని టెక్స్‌టైల్ మిల్లులు మొదలైనవాటిలో 1957-58 ఆఖరుకు రెండు లక్షల మంది కార్మికులు మాత్రమే పనిచేస్తున్నారు. బొంబాయి రాష్ట్రంలో భాగముగా ఉన్న మహారాష్ట్రమును తీసుకొన్నట్లయితే, ఉజ్జాయింపుగా ఏడు లక్షల యాభైవేల మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. వాళ్ళ జనాభా చూస్తే మనతో సమానముగా ఉంది. పారిశ్రామికంగా పనిచేసే మన కార్మికులకు మూడున్నర రెట్లు లేక నాలుగు రెట్లు కార్మికులు బొంబాయి రాష్ట్రంలో ఉన్నారు. పశ్చిమబెంగాలు జనాభాకి మూడు కోట్లకన్నా అదనంగా లేదు. అక్కడ కూడా ఫ్యాక్టరీ కార్మికులు ఏడు లక్షల మంది ఉన్నారు. ఆర్థికముగా మన కాళ్ళమీద మనము నిలబడడానికి వీలు అయిన పరిశ్రమలు మన ఆంధ్రదేశములో లేవనే చెప్పవలసి ఉంటుంది. ఇక మద్రాసు చూడండి. అక్కడ మన జనాభా కన్నా తక్కువ ఉంది. 1958 ఆఖరుకు వచ్చిన లెక్కలనుబట్టి అక్కడ మూడు లక్షల 25 వేల మంది ఫ్యాక్టరీ కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. వారికి మనకు ఎంత తారతమ్యం ఉందో దీనివల్ల బోధపడుతుంది. ఒక్క జీతాల విషయం చూద్దాం. రు.200లు జీతము వచ్చేవారి నుంచి రు.40లు వరకు జీతము వచ్చే గుమాస్తాలను, కార్మికులను కలుపుకొంటే సగటున ఒక్కొక్క మనిషికి రు.1.82 నయా పైసలు మాత్రము వస్తోంది. బొంబాయిలో చూస్తే రు.4.54 నయా పైసలు వస్తోంది. మన రాష్ట్రములో ఉన్న కార్మికునికి రు.1.82 నయా పైసలు ఆదాయం వస్తూంటే, బొంబాయి, పశ్చిమబెంగాలులోని కార్మికులకు రు.4లకు పైన జీతము వస్తూ ఉన్నది అంటే పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందిన దగ్గర జీవిత స్థాయి ఏ రీతిగా అదనముగా పెరుగుతుందనేది కనపడుతోంది. మన రాష్ట్రములో పనిచేసే కార్మికులకు ఎనిమిది కోట్ల రూపాయలు జీతాల క్రింద ఇస్తే, గుజరాతు, మహారాష్ట్రాలు కలిసిన బొంబాయి రాష్ట్రములో 117 కోట్లు ఈ ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులకు జీతాల క్రింద ఇస్తున్నట్లు లెక్కలను బట్టి స్పష్టంగా తెలుస్తున్నది. పశ్చిమ బెంగాలులో కూడా రు.67 కోట్లు జీతాల క్రింద రు.200లు జీతాలు తీసుకొనేవారి నుంచి క్రిందివారి వరకూ ఇస్తున్నట్లుగా ఉంది. మద్రాసు వారు కూడా పారిశ్రామికంగా చూసుకొన్నప్పుడు రు.26 కోట్లు ఇస్తున్నారు. పారిశ్రామికంగా మన రాష్ట్రము వెనుకబడి ఉండడం చేత మన జీవిత స్థాయి కూడా తక్కువగా ఉంది అనేది దృష్టిలో ఉంచుకోవాలి. కేంద్ర ప్రభుత్వం మూడవ ప్రణాళికలో ఎంతవరకూ న్యాయం చేస్తుందనే దానిమీద అనుమానాలున్నవి. అయిదవ ఉక్కు కర్మాగారం అయినా మన రాష్ట్రంలో ఉండేటట్లు చూడాలని మంత్రిగారు ఎందుకు అన్నారో నాకు అర్థం కావడం లేదు. మూడు స్టీలు ఫ్యాక్టరీలు ప్రభుత్వ యాజమాన్యము క్రింద ఇదివరకే పెట్టారు. భిలాయ్‌లోను, రూర్కేలాలోను, దుర్గాపూర్‌లోను పెట్టారు. ప్లానింగుకమీషను వారు రెండవ పంచవర్ష ప్రణాళికను తయారు చేసినప్పుడు మూడవ స్టీలు ఫ్యాక్టరీని ఎక్కడపెట్టాలనే విషయం వచ్చింది. అప్పుడు మధ్యప్రదేశ్‌కు, బీహారుకు కుస్తీవస్తే, దెబ్బలాట వస్తే ఇంజనీరు అంతా భిలాయ్‌లో పెడితే చాలా సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. అప్పుడు బీహారు ప్రభుత్వాన్ని

సంతృప్తిపరచేదానికి 'సరేలే ఇక్కడ మూడవ స్టీలు ఫ్యాక్టరీని ఇవ్వక తప్పదు. నాలుగవది మీకు తప్పకుండా ఇస్తామని' హామీ ఇచ్చారు. నాలుగవ ఫ్యాక్టరీని బీహారు రాష్ట్రములోని బొకారాలో పెట్టడానికి వాగ్దానం చేసారు. అది అయిపోయిన తరువాత అయిదవది అయినా మన రాష్ట్రములో పెట్టమని అడుగుతున్నారు. అయిదవదాని కోసం మనం ఎదురుచూస్తూ కూర్చుంటే మూడవ ప్రణాళికలో మనకు రాదు. నాలుగవ ప్రణాళికలో మనకు రాదు. అయిదవ పంచవర్ష ప్రణాళికలోనే అయిదవ ఫ్యాక్టరీ వచ్చే అవకాశాలున్నాయి కానీ లేకపోతే లేదని మంత్రిగారి దృష్టికి తీసుకొని వస్తున్నాను. మనకు అయిదవ ఉక్కు ఫ్యాక్టరీ అయినా ఇవ్వమంటే వారు రెండవ రోజునే గంతువేసి ఒప్పుకొంటారు. ఎందుకంటే అయిదవ ప్రణాళిక వరకూ చేయవలసిన అవసరముండదు. బొకారాలో పెట్టదలచుకొన్న నాలుగవ ఉక్కు ఫ్యాక్టరీ 50 లక్షల టన్నుల ఉక్కును తయారు చేస్తుందని పత్రికలలో చూసాము. భవిష్యత్తులో బిలాయ్, రూర్కేలా, దుర్గాపూర్‌లలో ఉన్న స్టీలు ఫ్యాక్టరీలు 25 లక్షల టన్నుల ఉక్కును తయారు చేస్తాయట. అమెరికా సహాయంతో బొకారాలో నాలుగవ ఉక్కు ఫ్యాక్టరీని పెట్టాలని నిర్ణయం. దానిని కూడా మూడవ ప్రణాళికలో పెట్టేదానికి డబ్బు లేకపోవచ్చు. అభివృద్ధి చేసుకోవాలి. మూడవ ప్రణాళిక పూర్తయ్యే కాలానికి డబ్బు అదనముగా ఉంటే నాలుగవ ఫ్యాక్టరీని పెట్టాలని ప్లానింగు కమిషన్ ఆలోచనలో ఉంది. అయిదవది అయినా ఇవ్వమని మంత్రిగారు అసెంబ్లీలో చెప్పారు. దీనిని ఇవ్వడానికి వారు వెనుకంజ వేయవలసిన అవసరం ఉండదనుకొంటాను. దేశాన్ని తొందరగా అభివృద్ధి చేయాలనుకొంటే దీనిని గురించి వెంటనే చూసుకోవాలి. అయిదవ ఫ్యాక్టరీ అనుకొంటే ఇంకొక 15 సంవత్సరాలదాకా అడగకుండా కూర్చోవడం క్రిందికి వస్తుంది తప్పితే ఇంకొకటి ఏమీ లేదు. ఈ మధ్య మద్రాసు ముఖ్యమంత్రి సుబ్రహ్మణ్యంగారు శాసనసభలో మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రములో ఉన్న వసతులను ఉపయోగించుకొని 20 లక్షల టన్నులు గాని లేక 30 లక్షల టన్నులుగాని ఉక్కును తయారు చేసే ఫ్యాక్టరీని మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో సాధిస్తాం అని చెప్పారు. ఆర్డరు పడి మంజూరు అయి, ప్లానులో చేరిస్తేగాని నూటికి నూరుపాళ్ళు వస్తుందని అనలేం. కానీ దానికి కావలసినది అంతా అయిపోయింది. నూటికి నూరుశాతం ఖాయం అని సుబ్రహ్మణ్యంగారు ఉపన్యాసము చేసినట్లు పత్రికలలో వచ్చింది. అది మనప్రభుత్వం వారు చూసే ఉంటారు. మద్రాసు రాష్ట్రములో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టేదానికి ఉన్న వసతులు ఏమిటి? నాసిరకమైన  నైవేలీ బొగ్గును నూటికి 25 లేక 30 పాళ్ళు ఇనుము ఉన్న సేలములోని నాసి ఖనిజంతో ఉక్కు ఫ్యాక్టరీని పెడతారట. గోదావరి ప్రాంతము అంతాను, ఆదిలాబాద్ ప్రాంతములోను బల్హార్షా సమీపంలోను కావలసినంత మంచిరకము బొగ్గు దొరుకుతోంది. మన బొగ్గు లిగ్నైటు కన్నా చాలా మెరుగు. ఇంకా బయలాజియా కొండలు మన సరిహద్దుకు 50 మైళ్ల దూరంలో ఉన్నవి. ఈ రోజున అవి బస్తర్‌లో ఉన్నాయనుకోండి. బయలాజియాకు, మన సరిహద్దుకు మధ్య ఉన్న జనాభా ఎవరు? ఇవతల మనం కోయలు అంటాం. అవతల వారు గోండ్లు లేక కోయలు అంటారు. వారి భాష వారికి ఉంది. అక్కడి తెగల యొక్క ఐక్యత బయలాజియా వరకూ మన ఆంధ్రదేశములో ఉన్నట్లయితే ఆర్థికముగా వారికి బాగుండి



ఉండేది. బయలాజియా మనకు రావాలా లేదా అనే చర్చ ఇప్పుడు మన శాసనసభలో పెట్టుకోవలసిన అవసరం లేదు. మన సరిహద్దుకు 50 మైళ్ల దూరంలో వున్న ఆ ప్రాంతంలోని ఇనుములో నూటికి 60 లేక 70 పాళ్ళు ఇనుము ఉంది. మనకు బొగ్గు దొరికే ప్రాంతానికి 50 మైళ్ల దూరంలో ఉంది. ఈ రోజున భిలాయ్‌లో ఉన్న ఉక్కు ఫ్యాక్టరీకి కూడా బొగ్గును, ఇనుప ఖనిజాన్ని 50 మైళ్ల దూరం నుంచి తీసుకుని రావాలి. అలాగే రూర్కేలాకు కూడా 50 మైళ్ళ దూరంలో ఉన్న ఒరిస్సా నుంచి తీసుకొని వెడతారు. మనకు బ్రహ్మాండమైన గోదావరినది ఉంది. మన రాష్ట్రంలో బొగ్గు, నీటి, ముడి ఇనుముల యొక్క సదుపాయాలుండగా ఎందుకు మన రాష్ట్రంలో ఉక్కు ఫ్యాక్టరీని పెట్టేదానికి తయారు కావడం లేదు. బయలాజియా నుంచి రాబోయే 15 సంవత్సరాల వరకు సంవత్సరానికి 40 లక్షల టన్నుల ముడి ఇనుమును జపానుకు తమ దేశములో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టుకొనేదాని కోసం సరఫరా చేయడానికి భారతదేశం, జపాన్ ఒక ఒడంబడిక చేసుకొందని పత్రికలలో చూసినాం. ఇక్కడి నుంచి జపాను సుమారు 5 లేక 6 మైళ్ల దూరంలో ఉంది. రైలు మీద, ఓడల మీద వేసుకొనిపోవాలి. అక్కడ వారి ఉక్కు ఫ్యాక్టరీకి కావలసిన ముడి ఇనుమును మన దేశం నుంచి తీసుకొనిపోయేదాని కొరకు, ఆ తయారయిన ఉక్కు మనకు, ఇతరులకు అమ్మేదానికి వీలుగా భారత్, జపాన్ దేశాలు ఒక ఒడంబడికను చేసుకొన్నట్లు చూశాం.

మనవద్ద కావలసినంత ముడి ఇనుము ఉన్నది. దాని మీద లాభం సంపాదించటానికి మన కేంద్ర ప్రభుత్వం వారు దీనిని జపాను దేశమునకు పంపుతున్నారు. మనం ముడి ఇనుమును ఉపయోగించుకొని మనకు కావలసిన వస్తువులను మనమే ఒక కర్మాగారాన్ని స్థాపించుకుని ఎందువల్ల తయారు చేసుకొనకూడదు. మన ముడి ఇనుమును వేరే దేశములకు అంటే జపానుకు పంపి, అక్కడ వాళ్ళు తయారు చేసిన వస్తువులను తిరిగి మనం కొనుక్కునే పరిస్థితి మనం ఎందువల్ల తెచ్చుకోవాలి? మనకు ఇస్తామన్న ఫ్యాక్టరీలను ఎంతవరకు, ఏ విధముగా సంపాదించగలం అనేది బాగా ఆలోచించి ఈ ప్రణాళికలోనే వచ్చేటట్లు చేయాలి. నీటిపారుదల పథకాల క్రింద 200 కోట్లు కావాలన్నారు. వాటిని మనం అందరం కోరాం. అన్ని ఇస్తే అడ్డుపెట్టేవారు ఎవ్వరూ ఉండరు. తరువాత పరిశ్రమలు కూడా కావాలన్నాం. అవి మన రాష్ట్రానికే కావాలన్నారు. అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుందని అనుకోవచ్చు. ముందు కేంద్ర ప్రభుత్వం వద్ద నుంచి మనకు రావలసిన కోటా ఎంత ఉంటుంది? అది ముందు తేల్చాలి. ఈ విషయాన్ని గురించి నేను ఒక్కటే సలహా ఇవ్వదలచుకున్నాను. ప్రైవేటు రంగం కాని, రాష్ట్ర రంగం కాని, కేంద్ర రంగం కానీ ఈ మూడు తీసుకోండి. అవి ఏ ఏ రాష్ట్రాలలో పెట్టటానికి అవకాశములున్నవో గుర్తించి, ఆ అవకాశములున్న చోట ముఖ్యంగా పారిశ్రామికంగా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవటానికి, ఆయా చోట్లలో పెట్టాలంటున్నాను. ఏ ఫ్యాక్టరీ పెట్టినా అది వెనుకబడిన ప్రాంతం అయినా ఖర్చు మరింత ఎక్కువగా చేయవలసిన అవసరం వచ్చినప్పటికీ అక్కడనే పెట్టాలని కోరుతున్నాం. ఇది కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది అనే సిద్ధాంతం మీద మనం వారిని గట్టిగా నిలవేసి

ఆంధ్రప్రదేశ్‌లో మేము ఏర్పాటు చేసుకుంటున్నాం అని చెప్పవచ్చు. అదే విధంగా కేరళ ప్రభుత్వం, మైసూరు ప్రభుత్వం, ఒరిస్సా వారు చెప్పుకుంటారు. ఎవరి విషయం వారు చెప్పుకుని ప్రయత్నిస్తారు. మనం మాత్రం అశ్రద్ధ చేయకూడదు.

ప్రైవేటు, రాష్ట్ర, కేంద్ర రంగాల్లో ఏ రంగం కిందయినా ఒక పరిశ్రమ స్థాపించదలిచినప్పుడు కేంద్ర అనుమతి (లైసెన్స్) అవసరం. అందువల్ల లైసెన్సులు జారీ చేసేటప్పుడు ఆయా రాష్ట్రాల్లో వెనుకబడిన ప్రాంతాలలో కొత్త పరిశ్రమలు వచ్చే విధంగా విధాన నిర్ణయం జరగాలి. రాబోయే ప్రణాళికపై వచ్చే జూన్‌లో గవర్నర్ ప్రసంగం ఉండవచ్చు. ఈలోగా మన రాష్ట్రానికి మరింత అన్యాయం జరగకుండా చూడాలని మనవి. నిధుల కొరత ఉన్నా మనం పోరాడవలసిందే. ఈలోగా మద్రాసు రాష్ట్రం వారు తమకోసం అణువిద్యుత్ ప్రాజెక్టు కోసం ప్రయత్నిస్తున్నారు. అలా అని ఆ రాష్ట్రం బొంబాయి, బెంగాల్ వంటి పారిశ్రామికంగా వెనుకబడిన ప్రాంతం కాదు. ఏ రాష్ట్రమయినా వెనుకబడి ఉన్నప్పుడు దానిని అభివృద్ధి పరచడానికి, కావలసినంత ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంటుంది. ఆ సిద్ధాంతం దృష్టిలో పెట్టుకుని మన ఆంధ్ర రాష్ట్రములో ఉన్న వెనుకబడిన ప్రాంతాలు వెనువెంటనే అభివృద్ధి పరచుకోవడానికి అవకాశములు కలుగచేసుకోవాలి. ఇప్పటికీ పది సంవత్సరములుగా మన ఆంధ్ర ప్రాంతానికి అన్యాయములు జరుగుతున్నప్పటికీ, ఇక ముందు అయినా మన రాష్ట్రంలో ఉన్న వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడానికి మంత్రివర్గం గట్టిగా ప్రయత్నం చేస్తారని నాకు నమ్మకం ఉన్నది. వీటిని సాధించటానికి ముఖ్యమంత్రిగారు ఏఏ చర్యలు అవసరమో, అవి అన్నీ తీసుకోవాలని నా అభిప్రాయం. సరే, మంత్రిగారికి వెనుక కాంగ్రెస్ పార్టీ బలం ఉన్నదని ధైర్యంతోనైనా ప్రయత్నిస్తారని అనుకుంటాను. సరే, కేరళ ప్రభుత్వం అంటే అది కమ్యూనిస్టు ప్రభుత్వం గనుక, దానిని త్రోసివేస్తే త్రోసివేసే ఉండవచ్చు. కానీ మనకు ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నది. దీనిని ఎట్లా త్రోసివేస్తారో చూస్తాం. లేకపోతే ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు అభివృద్ధి జరగాలని ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారని వారు గుర్తిస్తారనుకుంటాను, సుబ్బారెడ్డిగారు కమ్యూనిస్టులలో చేరినారని కేంద్ర ప్రభుత్వం వారు ఈ కోరికలను త్రోసివేస్తే అప్పుడు మనం చేయగలిగినది ఏమీ లేదు. అందువల్ల ఇప్పుడు కాంగ్రెసు పార్టీయే అధికారంలో ఉన్నది గనుక, మన తృతీయ పంచవర్ష ప్రణాళిక ప్రారంభించేలోగా అంటే 1960 సంవత్సరం ఆఖరు అయ్యేలోగా, ఈ ప్రణాళిక స్వరూపం ఎట్టిదో తేల్చాలి. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అని కాకుండా, ఇంత పెద్ద మెజారిటీ ఉన్న కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంగా ఈ పరిశ్రమలు మాకు ఖచ్చితంగా అవసరం అని పట్టుపట్టి కోరుతున్నప్పుడు, బయట ఉన్న ఇతర పార్టీలు కూడా మనకు అన్యాయం జరుగుతున్నదని తెలుసుకున్నప్పుడు, భారతదేశంలో అభివృద్ధి చెందిన ఇతర ప్రాంతాలతోపాటు మన ఆంధ్రప్రదేశ్‌ను కూడా ముందుకు తీసుకొనిపోవటానికి, మనకు కావలసిన పరిశ్రమలన్నీ చేర్చిన ప్రణాళికను రూపొందింపచేయటానికి మంత్రివర్గం గట్టిగా పట్టుబట్టాలి. ఇతర విషయములను గురించి ఎక్కువగా మాట్లాడదలచుకోలేదు.



# రాష్ట్ర సమస్యలు, ఎన్నికలలో అధికార పార్టీ అక్రమాలు

## (22 మార్చి 1962)

**మ**న ప్రాచీన భారతదేశములోని ప్రజాతంత్రము బాగా వేర్లు పాతుకుపోయిందని గవర్నరుగారు చెప్పారు. ఎన్నికల గురించి నా ఉపన్యాసములో వివరణ చెపుతాను. పోయిన ఎన్నికలలో జరిగిన విధానాన్ని బట్టి, దానిలో ప్రభుత్వ జోక్యాన్ని బట్టి చూస్తే ప్రాచీన భారతదేశములో ఉండిన ప్రజాతంత్రానికి కూడా ప్రమాదం ఏర్పడినదని గుర్తించవలసిన సందర్భంలో, పునాదులు ఇంకా గట్టిపడ్డాయని గవర్నరుగారు ఏ రీతిగా చెప్పారో ఆశ్చర్యంగా ఉన్నది. ఏమైనప్పటికీ మరొక ఐదేండ్ల పాటు కాంగ్రెసు అధికారంలో ఉండబోతోంది. ఈ ఎన్నికలు శాంతంగా, సవ్యంగా జరిగాయని, భారతదేశంలో ప్రజాతంత్ర పునాదులు బలపడినాయనే ఆత్మసంతృప్తితో ఈ శాసనసభా వేదికమీద ప్రసంగాలు చెప్పుకుంటే చెప్పుకోవచ్చును గానీ, వాస్తవ పరిస్థితులను కాంగ్రెసు ప్రభుత్వం, కాంగ్రెసు పార్టీ కూడా గుర్తించి, అటువంటి పొరపాట్లు ఇకముందు జరగకుండా జాగ్రత్తగా మెలిగితేనే ప్రజాతంత్రం భారతదేశంలో నిలబడుతుంది. లేకపోతే ప్రమాదం ఏర్పడుతుందని చెప్పవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏయే కార్యక్రమాలు చేయవలసి ఉంటుందనేది ముందు చెప్పి దాని తర్వాత, ఎన్నికల్లోని అక్రమ చర్యల గురించి తీసుకుంటే మంచిదని ఆఖరుకు తీసుకొంటున్నాను. మొదటి సంవత్సరం 48 కోట్ల రూపాయల ప్లానింగ్‌లో ఖర్చు పెట్టామని, చాలా జాగ్రత్తగా దానిని అమలు జరుపుతున్నామని గవర్నరుగారు చెబుతూ అందుకు సంతృప్తిని వెల్లడించారు. గత రెండు పంచవర్ష ప్రణాళికలలో కేంద్రం పరిశ్రమలకు మొత్తం దేశంలో 1128 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టగా, మన ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 11 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. జనాభా దామాషా ప్రకారం చేస్తూ కేంద్రం మన రాష్ట్రంలో పరిశ్రమలకై 114 కోట్లు ఖర్చుపెట్టవలసి ఉండగా, కేవలం 11 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. పాత బకాయి– ఇప్పుడు ఇవ్వవలసింది కలిపి మొత్తం 100 కోట్లు అయినా కేంద్రం మనకు భారీ పరిశ్రమల కొరకు ఖర్చుపెట్టవలసి ఉన్నది. దానిని గురించి గవర్నర్ ఉపన్యాసంలో ఎక్కడా లేదు. కేంద్రం ఇచ్చిన దానితోనే మన ప్రభుత్వం సంతృప్తి పడినట్లు గవర్నర్ ఉపన్యాసం ఉన్నది. మన ప్రణాళిక 305 కోట్ల రూపాయలకున్నది. అందులో కేంద్ర ప్రభుత్వం నుండి 200 కోట్ల రూపాయలు వస్తాయి; మొత్తం సంవత్సరంలో 45 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని గవర్నరుగారు ఎంతో సంతృప్తి వెల్లడించారు. ఈ రెండవ సంవత్సరములో రాష్ట్రం, కేంద్రం కలిపి 53 కోట్లు కేటాయించబోతున్నట్లు పత్రికల ద్వారా తెలుస్తున్నది. అంటే, మొదటి రెండేళ్లలో 100 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టబోతున్నారన్నమాట. మిగిలిన మూడేళ్లలో 200 కోట్లు ఖర్చుపెట్టవలసి ఉంటుంది. మొదటి సంవత్సరాలలో తక్కువ ఖర్చుపెట్టి– నిద్రపోయి– ఆఖరు సంవత్సరాలలో ఎక్కువ ఖర్చుపెట్టినందు వల్ల లాభం లేదు. అసలే మనకు ప్రణాళికలో

తక్కువ కేటాయించడం జరిగింది. మనకు అన్యాయం జరిగిన ప్లానులో కూడా మొదటి రెండు సంవత్సరాలు తక్కువ ఖర్చుపెట్టి, ఆఖరు మూడు సంవత్సరాలలో ఆ మొత్తం డబ్బు అంతా త్వరత్వరగా ఖర్చుపెడతామంటే ఆ పనుల నిర్వహణ సక్రమంగా లేక, చాలా డబ్బు దుర్వినియోగమయ్యేందుకు అవకాశం ఉంటుంది. కాబట్టి మన రాష్ట్రంలో ప్లానింగ్ కింద ఖర్చు పెడుతున్న విధానం సంతృప్తికరంగా లేదని చెప్పవలసి వస్తున్నది. ప్రధాన కార్యదర్శి అధ్యక్షత కింద మదింపు కమిటీ వేశామన్నారు. ప్రభుత్వానికి ఎంతసేపటికీ పాత దృక్పథం తప్పితే కొత్త దృక్పథం లేదు. ప్లాన్ సక్రమంగా నడుపుతున్నదీ లేనిదీ తనిఖీ చేయవలసింది ప్రభుత్వ ఉద్యోగస్తులా? ప్రభుత్వ ఉద్యోగస్తులు సక్రమంగా ప్రణాళికను నడుపుతున్నదీ లేనిదీ తనిఖీ చేయవలసింది శాసనసభ. శాసనసభ తరపున ప్రతినిధులెవరూ అందులో లేకుండా, కేవలం ఉద్యోగస్థులతో కమిటీ వేసి, అది ఒక ఘనకార్యంగా గవర్నర్ చెప్పడంలో అర్థం లేదు. శాసనసభ విధి, శాసనసభ కార్యక్రమాల విషయం చూసినప్పుడు ఈ శాసనసభలో ఏదో 100 రోజులు ఇక్కడ సమావేశం అవడంతో చాలదు. పదిమంది సభ్యులతో ప్రతి డిపార్టుమెంట్‌కు ఒక ఎడ్వయిజరీ కమిటీ (ఆ డిపార్టుమెంట్‌కు సంబంధించిన సమస్యలన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, చర్చించి, తగు సలహాలివ్వడానికి) ఏర్పాటు చేయవలసిందిగా ఈప్రభుత్వానికి మేము గత నాలుగైదేళ్లుగా చెబుతున్నాము. కానీ ప్రభుత్వం ఇంతవరకు దానిని గురించి ఎటువంటి నిర్ణయం చేయలేదు. మన రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో గత ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. ఇదివరకు మంజురు చేసిన పరిశ్రమలు కూడా ఎంతవరకు అమలు జరుగుతాయనే అనుమానం ఉన్నది. “రెండు ఎరువుల ఫ్యాక్టరీలు; మందుల ఫ్యాక్టరీ; హెవీ ఎలక్ట్రికల్స్ మంజూరు చేశాము” అని చెబుతూ, ఇంకా ఏవో చిన్న చిన్న పరిశ్రమలు శాంక్షన్ చేశామని చెప్పి తమ సంతృప్తిని ప్రకటించారు. అవి ఎంతవరకు అమలు జరుపుతారో తెలియదు. వాగ్దానాలు మాత్రం చేస్తారు. అవి అమలు జరపరు. రెండు ఎరువుల ఫ్యాక్టరీలు ఎప్పుడు ఏర్పడతాయి? అవి అసలు ఏర్పడతాయా? వెనక్కు పోతాయా? ఈ ఐదేళ్ల లోపల ఈ హెవీ ఎలక్ట్రికల్స్, డ్రగ్స్ ఫ్యాక్టరీ ఏర్పడతాయా? అవి పూర్తిగా అమలు జరుపుతారా? లేక పునాదులు వేసి, కొంతవరకు పెంచి ఆపుచేస్తారా? ఇప్పుడు అంగీకరించిన పరిశ్రమలను వెంటనే నెలకొల్పటమే గాకుండా, మనకవసరమైన చిన్న, పెద్ద పరిశ్రమలన్నింటినీ కేంద్ర ప్రభుత్వంతో గట్టిగా పోరాడి సాధించవలసి ఉన్నది. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలో ఇనుము-ఉక్కు ఫ్యాక్టరీ స్థాపించాలని కోరుతూ గత పర్యాయమే మన శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానము చేశాము. దానిని ఈ ప్రణాళికలోనే చేర్పించడానికి మనం ప్రయత్నం చేయవలసి ఉంటుంది. చిన్న ప్రాతిపదికపైన అయినా ఐరన్ అండ్ స్టీల్ ఫ్యాక్టరీని మన రాష్ట్రంలో సాధించడానికి ప్రయత్నం చేయాలి. ఐరన్ అండ్ స్టీల్ ఫ్యాక్టరీ కొరకు మద్రాసు రాష్ట్రం తీవ్రంగా కృషి చేస్తోంది. భారీ ఎత్తున ఐరన్ అండ్ స్టీల్ ఫ్యాక్టరీ కాకపోయినప్పటికీ చిన్న ఫ్యాక్టరీని అయినా తర్వాత క్రమేపీ అభివృద్ధి చేసుకొనేదానికి వీలుగా ఇక్కడ ఆరంభించదానికి ప్రభుత్వం గట్టిగా కృషి చేయవలసి ఉన్నది.



రోడ్డు రవాణా, రైల్వేల సమస్య ఉంది. రోడ్డు రవాణా గురించి ఎన్నికల సందర్భంలో అనేక వదంతులు వ్యాపించాయి. బస్సు ట్రాన్సుపోర్టు ఓనర్స్ చాలా పలుకుబడి కలిగిన వ్యక్తులు అవటం చేత బస్సు రవాణా జాతీయం వాయిదా వేయించాలని చూస్తున్నట్టు పత్రికలలో వార్తలు వచ్చాయి. రోడ్డు రవాణాను జాతీయం చేసే కార్యక్రమాన్ని వాయిదా వేయటానికి వీల్లేదు. ఇదివరకు 1965 ఆఖరుకు జాతీయీకరణ కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. రాబోయే రెండేళ్లలోపలే ఆ కార్యక్రమం పూర్తి చేయాలనేది మా డిమాండ్. దాని వల్ల ప్రభుత్వానికి కూడా అధికంగా ఆదాయం వచ్చే అవకాశం కలుగుతుంది. రోడ్డు రవాణా కార్పొరేషన్ నిర్వహణలో అనేక అవకతవకలు జరుగుతున్నవి. ప్రయాణికుల ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి. ఆ లోపాలను సరిచేసుకోవచ్చును. ఆ బస్సు ట్రాన్స్‌పోర్టును త్వరగా జాతీయం చేయడానికి ప్రభుత్వం పూనుకోవాలని కోరుతున్నాను. ఆంధ్రప్రదేశ్ నుంచి పోతున్న రైల్వే మార్గాలన్నింటికీ ఒకే జోన్ ఏర్పాటు చేయాలని మేము పదేపదే కోరుతున్నాము. రైల్వేల నిర్వహణ దృష్ట్యా చూసినా, ప్రయాణికుల సౌకర్యాల దృష్ట్యా చూసినా ఇది చాలా అవసరం. అందుకు ఈ ప్రభుత్వం గట్టిగా కృషి చేసి సాధిస్తుందని ఆశిస్తున్నాను. కొత్త రైలు మార్గాలు వేయవలసిందిగా కోరుతూ మన ప్రభుత్వం గత పది ఏళ్లుగా కేంద్రానికి పిటిషన్లు పెట్టుకుంటున్నప్పటికీ, కేంద్రం మొండి చేయి చూపిస్తున్నది. కనీసం ఒకటి రెండు ముఖ్యమైన రైలు మార్గాలనైనా- ఖాజీపేట నుండి నాగార్జునసాగర్ మీదుగా ఒంగోలుకు గాని, గూడూరుకు గాని ఒక రైలు మార్గము; హైదరాబాదు నుండి కరీంనగర్ మీదుగా రామగుండంకు మరొక రైలు మార్గము, ఈ రెండు మార్గములనైనా-వెనువెంటనే వేయటానికి మన ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి గట్టిగా కృషి చేస్తారని ఆశిస్తున్నాను.

చేనేత పారిశ్రామికుల పని ఎప్పటిలాగే ఉంది. వారికి సహకార సంఘాలు ఏర్పాటు చేసినా, వారి సమస్య పరిష్కారం కావడం లేదు. నూలు ధరలు విపరీతంగా పెరిగిపోతున్నవి. వారికి నూలు ఇంకా చౌక ధరలకు ఇచ్చి వారు తయారు చేసిన వస్త్రాలను ప్రభుత్వమే బాధ్యత తీసుకుని అమ్మేరీతిగా ప్రయత్నం చేయాలి. సహకార సంఘాలకు వదిలేస్తే, వారు అమ్మే స్థితిలో లేరు. చేనేత పారిశ్రామికులంతా నష్టపడుతున్నారు. ఇన్ని గజాలగుడ్డ తయారు చేస్తే ఇంత ఆదాయం వచ్చేలా చూస్తామని వారికి ప్రభుత్వం హామీ ఇవ్వవలసి ఉంటుంది.

లెదరుబోర్డు పెట్టారు. లెదర్‌బోర్డు పెట్టి, కొంతమందికి శిక్షణ ఇచ్చినంత మాత్రాన లాభం లేదు. ట్రయినింగ్ పొందిన వారికి శాశ్వతమైన వృత్తి కల్పించడానికి ప్రయత్నం చేయాలి. అంతేగాని వారికి ట్రయినింగ్ ఇచ్చి తర్వాత మీ గతి మీరు చూసుకోండి అంటే ప్రయోజనం లేదు.

అలాగే గీత పారిశ్రామికులున్నారు. గీత పరిశ్రమకు సంబంధించి తాటిబెల్లం తయారు చేస్తున్నాం, చక్కెర తయారు చేస్తున్నాం అని మాట్లాడుతూ వుంటారు. ఇవి నిరుపయోగమైనవనే విషయం ఎప్పుడో తేలిపోయింది. అంతేగాదు. ఈ రోజున ఆంధ్ర ప్రాంతంలో ఉన్నది చాలక మద్యపాన నిషేధాన్ని తెలంగాణ ప్రాంతానికి కూడా ప్రవేశపెట్టడానికి ఆలోచిస్తున్నట్టు

తెలుస్తున్నది. ఆర్థిక మంత్రి గారు తల ఊపుతున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన విషయమని మనవి జేస్తున్నాను. వారు 'లేదు' అంటున్నారు. అదే వారి హామీ అయితే నేను సంతోషిస్తాను. ఇది చాలా ప్రమాదకరమైన విషయమని మాత్రం మరొకసారి మనవిజేస్తున్నాను. మద్యపాన నిషేధాన్ని రద్దు చేయాలి. లేకపోతే అవినీతిని ప్రోత్సహించడం తప్ప మరొకటి కాదని మనవిజేస్తున్నాను. తప్పతాగి అందరూ చెడిపోవాలని ఏ పార్టీ కూడా చెప్పదు. కాని మద్యపాన నిషేధం వలన ప్రభుత్వం సాధించదలచిన ప్రయోజనం సాధించలేకపోతున్నది. దీని వలన ఇంటింటా సారాబట్టీలు తయారై విప్పసార తయారు చేయడం ఎక్కువైపోయింది. దీని వలన అవినీతి పెరిగిపోతున్నది. ప్రజల ఆరోగ్యం చెడిపోతున్నది. ప్రభుత్వానికి రావలసిన ఆదాయం రాకుండా పోతున్నది. ఒక వైపున అవినీతి పెరిగిపోతూ, మరొకవైపున ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా రాలేకపోతున్నప్పుడు ఇంక దీని వలన ప్రయోజనమేమిటని అడుగుతున్నాను. మద్యపాన నిషేధాన్ని తీసివేస్తే గీత కార్మికులు తమ ఇష్టం వచ్చినట్టు చెట్లు గీసుకుని సారా తయారు చేసి అమ్ముకొని జీవించడానికి అవకాశముంటుంది. అవినీతి తగ్గిపోతుంది, ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. ప్రభుత్వాన్ని ఈ విషయాన్ని కోరుతున్నాను. పార్లమెంట్ స్పీకర్ అయిన శ్రీ అనంతశయనం అయ్యంగారు ప్రతి ఇంట్లోనూ వెలసిన ఈ బట్టీలను పరిస్థితిని గమనించి 'ఎందుకు వచ్చింది, దీనిని రద్దు చేస్తే పోతుంది' అన్నారు. ఇది అవినీతికి దారితీస్తున్నది గనుక దీనిని రద్దు చేయడం చాలామంచిదని చెబుతున్నాను.

ఇంక, నీటిపారుదల, విద్యుచ్ఛక్తికి సంబంధించిన విషయాలున్నాయి. కృష్ణా గోదావరీ నదీజలాల సమస్య ఇంకా తేలలేదు. ముఖ్యమంత్రులు సమావేశమై దీనిని పరిష్కరిస్తారని పత్రికలలో వచ్చింది. వారు ఆ విధంగా పరిష్కరిస్తే నాకు అభ్యంతరం ఏమీ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పనిని ముందే చేసి వుండవలసింది. ఆ విధంగా గాకుండా గుల్హాటీ కమిషన్‌ను నియమించి లేనిపోని రచ్చ సాగించడం తప్ప మరొకటి చేయడం జరగలేదు. ఈ సమస్య తప్పక పరిష్కారం కావాలి.

1951వ సంవత్సరములో జరిగిన ఒడంబడిక పనికిరాదనే వాదన మాత్రం ఏమాత్రం సహించడానికి వీల్లేదు. ఆ ఒడంబడిక ప్రకారం మనకు రావలసిన జలాల భాగంలో ఏమాత్రం తగ్గడానికి వీల్లేదు. నాగార్జునసాగర్ (మొత్తం ప్రాజెక్టు), శ్రీశైలం, పోచంపాడు ఈ మూడు ప్రాజెక్టులు దీనిపై ఆధారపడి వున్నాయి. ఈనాడు ఈ నీటి పంపకంలో తిరిగి ఆ ఒడంబడికను తిరగతోడడం వాటికి ఆటంకమవుతుందని మనవిజేస్తున్నాను. కనుక ప్రభుత్వం మరొకమారు గట్టి కృషి చేయవలసి వుంది. నాగార్జునసాగర్‌ను రెండు దశలుగా నిర్మించడానికి వీల్లేదు. ఒకే దశగా నిర్మించాలి. లేకపోతే డబ్బు వృథా అవుతుంది. ప్రజలలో లేనిపోని అనుమానాలు కూడా కలుగుతాయి. ఒకే దశగా పూర్తి చేయడానికి ప్రయత్నించినట్లయితే పదేళ్లు పట్టవచ్చునని మేము అనుకుంటున్నాము. ఒకే దశగా నిర్మించడం వలన మనకు వెనువెంటనే లాభం ఉంటుంది. ఎక్కడికక్కడ కాల్వలు త్రవ్వకోవడానికి అవకాశం కలుగుతుంది. వెనువెంటనే రెండవ టన్నెల్ ఆరంభించడానికి, సిమెంట్ లైనింగ్ చేయడానికి వీలు కలుగుతుంది. ఇటు



పెన్నా నుండి అటు ఎర్రకాల్వ వరకు ప్రజలే పూనుకుని పనులు చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది. అందువలన దానిని ఒకే దశగా పరిగణించి పని పూర్తి చేయవలసిందిగా కోరుతున్నాను. గత సమావేశంలో ప్లానింగ్ శాఖపై చర్చలో తుంగభద్ర హైలెవెల్ ఛానెల్, వంశధార, పోచంపాడు ఈ మూడింటి గూర్చి చెప్పారు. ప్లాన్‌లో కొంత మొత్తాన్ని మిగిల్చి వీటిపై కేంద్రీకరించమని, పోచంపాడు ఒక మీడియం ప్రాజెక్టుగా ప్రారంభిద్దామని, తుంగభద్ర రెండు దశలను ఈ అయిదేళ్లలోనే పూర్తి చేయాలని కోరుతున్నాను. అందుకు కావాల్సిన డబ్బును కేటాయించమని కోరాము. దానిపై మళ్లీ వత్తిడి చేయక తప్పదని మనవి జేస్తున్నాను. రాయలసీమ ప్రాంతములో కరువు పరిస్థితి చాలా తీవ్ర రూపంలో ఉంది. ప్రభుత్వానికి కూడా ఈ విషయం తెలుసు. ఎన్నికల హడావుడిలో ప్రభుత్వం ఈ విషయం మరచిపోయినప్పటికీ, ఎన్నికలు ముగిసిన తర్వాతనైనా జ్ఞాపకం వస్తుందేమోనని ఆశించాము. కాని గవర్నరు తమ ఉపన్యాసములో తక్కువ వర్షపాతము వలన కొన్ని జిల్లాల్లో తక్కువ పంట పండిందని మాత్రం అన్నారు. కరువు పరిస్థితి ఎంతో తీవ్రంగా ఉన్న ఈ సమయంలోనే వారీ విధంగా చెప్పారంటే వారే ప్రపంచములో ఉన్నారో, వారికి సలహా చెప్పిన ప్రభుత్వం ఏ ప్రపంచములో ఉన్నదో అర్థం కావడం లేదు. ఆ ప్రాంతం నుంచి వచ్చిన మా కార్యకర్తలే కాక, కాంగ్రెస్ శాసనసభ్యులు కూడా దీనిని గూర్చి అనేక విషయాలు చెప్పారు. ఇదివరకు తుంగభద్ర హైలెవల్ కెనాల్‌కు ఎంతమంది వస్తే అంతమందికి పనిచూపుతామన్నారు. కాని ఇప్పుడు మా వద్ద పనిలేదని వెనక్కి పంపుతున్నారు. కరువు పరిస్థితి రోజు రోజుకూ మరింత తీవ్రతరమవుతున్నది. ఈ పరిస్థితిలో 27 లక్షల రూపాయలు కేటాయించామంటూ, అంతటితో తమ బాధ్యత అయిపోయినట్లు చెప్పడం చాలా దురదృష్టకరమైన విషయమని మనవిజేస్తున్నాను. తుంగభద్ర ఎగువస్థాయి కాల్వ రెండు దశలు 1965లోపల పూర్తి చేయడానికి ప్రభుత్వం కృషి చేయవలసి వుంటుందని చెబుతున్నాను. గోదావరిపై డ్యామ్ నిర్మించడానికి 20–25 కోట్లకు మించదు. అది ఇప్పూరు వద్దా; ఇచ్చంపల్లివద్దా; అనేది వేరే విషయము. దీని వలన గోదావరి డెల్టా ప్రాంతంలో రెండవ పంట పండించడానికి వీలు కలుగుతుంది. ఈ అయిదేళ్ల లోపల దీనిని నిర్మించడానికి ప్రయత్నించవలసి వుంటుందని చెబుతున్నాను. తరువాత, ప్రభుత్వం ఇప్పుడు అవలంబిస్తున్న విధానం కూడా మార్చుకొనవలసి ఉంటుందని మనవిజేస్తున్నాను. నాగార్జునసాగర్, శ్రీశైలం, తుంగభద్ర హైలెవెల్ కెనాల్, పోచంపాడు వంటి ప్రాజెక్టులు ఆరంభిస్తున్నామని ప్రజలకు ఆశచూపి మధ్య, చిన్న తరహా చెరువుల, కుంటల–మరమ్మతులు వాయిదా వేస్తూ పోయే విధానం మంచిదికాదని చెబుతున్నాను. ఈ ప్రాజెక్టులు పూర్తి కావడానికి పదిపదిహేనేళ్లు పడుతుంది. అంతవరకు ఈ చిన్న తరహా నీటిపారుదల కార్యక్రమాలు ఇలాగే ఉండిపోవలసిందేనా? మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు వస్తే మీడియం ఇరిగేషన్ కార్యక్రమం నిరుపయోగం అవుతుందన్న వాదన ఒకటి తీసుకువస్తున్నారు. అది ఎంతమాత్రం సరియైన వాదన కాదని మనవిజేస్తున్నాను. ఎందుకంటే ఈ రోజున మనం నీటి వనరులను చూచినట్లయితే, మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టుల వల్ల వచ్చే వాటినంతా పూర్తిగా ఉపయోగించుకుంటే తప్ప ఆంధ్రదేశాన్ని సస్యశ్యామలం చేయడం సాధ్యం కాదు. ఒక

దానికి ఒకటి పోటీ పెట్టకుండా, నాగార్జునసాగర్ పెద్ద ప్రాజెక్టు వస్తోంది కాబట్టి చిన్న చిన్న ప్రాజెక్టులు అవసరం లేదనే రీతిగా కాకుండా, వెనువెంటనే ఉపయోగపడే ప్రాజెక్టుల విషయంలో వెనుకంజవేయకుండా అన్నింటిని ప్రారంభించాలని కోరుతున్నాను. ఈ సందర్భంలో గవర్నరుగారు తమ ఉపన్యాసంలో పొరపాటు సలహా వల్ల ఆత్మసంతృప్తిని వెల్లడించారు. కృష్ణాబ్యారేజీని పూర్తిచేశారని, రోడ్డు రెగ్యులేటరును కట్టారనే సంగతి తెలుసు. ఆర్థిక మంత్రిగారు తల ఊపుతున్నారు. సరాసరిగా కారుమీద ఫిరంగిపురం పోవచ్చు. అది బాగానే ఉంది. కాని దాని క్రింద 120 వేల ఎకరాలు సాగు చేయడానికి ఏర్పాట్లు ఉన్నాయి. ఇందుకు రెండు కోట్ల రూపాయలు పెట్టి కాలువలు తవ్వుతామని ఆయన అయిదు సంవత్సరాల నుంచి చెబుతున్నారు. కాని మూడవ పంచవర్ష ప్రణాళికలో కూడా కాలువలకు రెండు కోట్ల రూపాయలు కేటాయించలేదు. గుంటూరు జిల్లాలో పెదనందిపాడు కాలువకై (దానినే దగ్గుపాడు కాలువ అంటారు) గత 30 సంవత్సరాలుగా ఆందోళన జరుగుతోంది. అది వ్యవసాయానికి కాకుండా త్రాగేనీటికి కూడా అవసరమైన కాలువ. రాయలసీమలో తుంగభద్ర హైలెవెలు ఛానలుకు ఎలాంటి ప్రాధాన్యత ఉందో అలాంటి ప్రాముఖ్యతే దానికి ఇక్కడ ఉంది. దానిని పూర్తి చేయడం లేదు. కృష్ణా బ్యారేజి స్కీము క్రింద పంపింగ్ స్కీమ్ను పెట్టి ఎన్నో ఎకరాలు సాగులోనికి తీసుకురావచ్చు. ఇవన్నీ వాయిదా వేస్తూ ఆత్మసంతృప్తి ఎందుకో అర్థం కావడం లేదు. ఆనకట్ట కట్టినంత మాత్రం చేతనే కృష్ణాబ్యారేజి స్కీము పూర్తి కాదు. కెసి కెనాల్ పూర్తి అయినదని అనకండి అయినా అక్కడ కూడా రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తేనే కాని ఇంతకుముందు ఖర్చు చేసిన నాలుగు కోట్ల రూపాయలు సద్వినియోగం కావు. ఆనకట్టలు కట్టామని, రెగ్యులేటర్లు కట్టామని సంతోషించడం కాదు; సవ్యంగా వ్యవసాయానికి ఉపయోగపడే రీతిగా కావలసిన కాలువలు మొదలైనవి త్రవ్వడానికి కూడా డబ్బును కేటాయించవలసి ఉంటుంది.

ప్రాథమిక పనులు ఆరంభించామని, ఢిల్లీ అనుమతి కోసం చూస్తున్నామని అన్నారు. గవర్నరుగారు ప్రసంగంలో ఈ విధంగా అన్నప్పటికీ అక్కడ ఇచ్చిన కాంట్రాక్టులన్నీ రద్దు చేసి పోచంపాడు పనిని పూర్తిగా ఆపుచేయడం జరిగిందని మాకు వచ్చిన వార్త. మనం అనుకున్న పోచంపాడు ప్రాజెక్టుకు గోదావరి నార్త్ కెనాల్ స్కీము క్రింద 41 టిఎంసిలు ఇదివరకే మంజూరు అయింది. మనకు కావాల్సింది 12 టిఎంసిలు మాత్రమే అందుచేత ఢిల్లీవైపు చూడకుండా ప్రారంభం చేయవచ్చు. కేంద్ర ప్రభుత్వం అడ్డం వచ్చినా ఇదివరకే మంజూరు అయిన ప్రాజెక్టు అనే సమాధానం ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో పిలిచిన టెండర్లను ఎందుకు ఆపుచేశారు? ఢిల్లీవైపు అనుమతి కోసం ఎందుకు ఎదురుచూస్తున్నారో మాకు అర్థం కాకుండా ఉంది. కృష్ణా, గోదావరి నీటి తగాదాతో ముడిపెట్టవలసిన సమస్య కాదిది. ఇది వరకే మంజూరు అయిన ఈ ప్రాజెక్టును ఈ రీతిగా ఎందుకు వాయిదా వేస్తున్నారో ప్రభుత్వం చెప్పాలి. చేసే పని సక్రమంగా చేయక దుర్వినియోగం చేస్తూ కొంత, ఇచ్చే రేటు విపరీతంగా ఉండటం వల్ల కొంత హెచ్చులాభాలు పెద్ద కాంట్రాక్టర్లకు రావడం వల్ల ప్రాజెక్టులు చవగ్గా తయారయ్యే వీలు పోతున్నది. ఈ రోజులలో మంత్రి పదవి కంటే



కూడా కాంట్రాక్టు పని చేసుకుంటే బాగుంటుందనే స్థితి ఉంది. కొంతమంది అట్లా వెడుతున్నారు కూడా, నాకు తెలుసు. కాంట్రాక్టర్లు లాభాలు తగ్గించే పద్ధతి చూసి సవ్యంగా ప్రాజెక్టులను కట్టడానికి ప్రభుత్వం ఆలోచించవలసి ఉంటుంది. వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం అవలంభించే విధానం సరియైనది కాదని మరోసారి చెప్పవలసి ఉంది. అది చాలా డబ్బు దుర్వినియోగం చేసే విధానంగా ఉందని చెప్పక తప్పదు. వ్యవసాయాభివృద్ధి కావాలంటే మొదట గ్యారంటీ ఇవ్వవలసింది నీటిపారుదల సౌకర్యాలు; రెండవది, ఎరువులు; మూడవది, పంటలకు వచ్చే తెగుళ్లు నాశనం చేయడానికి కావలసిన ఏర్పాట్లు– వీటితోపాటు పశుసంపద రక్షించడానికి, పశువ్యాధులు అరికట్టడానికి పశువైద్యశాఖను అభివృద్ధి చేయవలసి ఉంటుంది. వాటికి ముందు ప్రాధాన్యత ఇచ్చి తరువాత వ్యవసాయాభివృద్ధికి ఇతర పనులు చేయవలసి ఉంటుంది. గత ప్లానింగ్‌లో చర్చించినప్పుడు కూడా చెప్పాము– 10 కోట్ల రూపాయల వరకు వ్యవసాయ రంగంలో దుర్వినియోగం జరుగుతున్నది. సరియైన పద్ధతిలో ప్రాధాన్యత ఇచ్చి ఖర్చు చేయాలని చెప్పాము. కానీ ఏమి చర్యలు తీసుకున్నారో తెలియదు.

గిరిజన పాఠశాలలు పెట్టారు. పాఠశాలలు పెట్టినంత మాత్రాన చాలదు. అక్కడ హాస్టళ్లు ఇచ్చి ఉచితంగా చదువు చెప్పే బాధ్యత వహించాలి. అంతేగాని రోడ్లు వేస్తున్నాం. ఫైనాన్స్ కార్పొరేషన్ పెడుతున్నాం అంటే లాభం లేదు. అదేరీతిగా ఆ ప్రాంతాలలో హాస్పిటల్స్, వైద్య సౌకర్యాలు మరీ తక్కువగా ఉన్నాయి. మిగిలిన మైదాన ప్రాంతములో మాదిరిగా ప్రతి 50 వేల మంది జనాభాకు ఒక హాస్పిటల్ పెడితే లాభం లేదు. 50 వేల మందికి మైదాన ప్రాంతంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెడితే గిరిజన ప్రాంతాల్లో 5 వేల మందికి ఒక మెడికల్ అసిస్టెంట్, ఒక మిడ్‌వైఫ్‌ను కనీసం ఏర్పరచాలి. ఇది ఆరంభంగా చేసుకుని రాబోయే 5 ఏళ్లలో ప్రతి రెండు వేల మందికి ఒక మెడికల్ అసిస్టెంట్, ఒక మిడ్‌వైఫ్ ఏర్పాటు చేసినప్పుడు వారికి కాస్త వైద్య సదుపాయం చేసినట్లవుతుంది. ఇక పన్నుల విధానం పరిశీలిద్దాం. పన్నులు ఇవ్వడానికి అభ్యంతరం లేదు. అయితే ఎవరి మీద పన్నులు వేయాలి? బాగా ఉన్నవారి మీద పన్నులు వేయాలి గాని మోసినా మోయకపోయినా బరువు నెత్తిమీద వేద్దామంటే మేము ఎప్పుడూ ఒప్పుకోము. మేము ఇదివరకే చెప్పాము. నెలకు నూరు రూపాయలు ఆదాయం వచ్చేవారి మీద ఇప్పుడున్న పన్నే అదనంగా ఉంది. అంతకంటే పన్ను వేయడానికి వ్యతిరేకిస్తున్నాం. వారి మీద పన్ను తగ్గించి ఎక్కువ ఆదాయాలు వచ్చే వారి మీద పన్నులు వేయండి. ఆదాయము పెరిగేకొద్దీ అదనంగా ఎక్కువ రేటుతో పన్నులు వసూలు చేయండి. వేయి రూపాయలకు మించి ఆదాయం లేకుండా సీలింగు పెట్టి మిగిలిన దానిని స్వాధీనం చేసుకోవడమో పన్నులు వసూలు చేయడమో చేయండి. ఈనాడు నెలకు నూరు రూపాయలు లేకుండా కుటుంబంతో జీవించడం సాధ్యం కాదని ప్రభుత్వం అంగీకరించి ఈ రోజు అదనంగా పన్నులు వేస్తాం అంటే అర్థం లేదు. ఆ రకంగా వేయకూడదని కోరుతున్నాం. ఇక భూ సంస్కరణలు అన్నీ కాగితం మీదనే ఉండిపోయాయి. నిరుపయోగమైన చట్టాలు చేశారు. భూమికి గరిష్ట పరిమితి విషయం తిరిగి ఆలోచించారు. ప్లానింగ్ కమిషన్ కుటుంబానికి 3,600 నికరాదాయము గల భూమికి పరిమితి కావాలంటే 1,40,000

రూపాయల ఫలసాయము, 70 వేల రూపాయల నికరాదాయము పరిమితిగా పెట్టి చట్టం చేశారు. ఇది న్యాయం కాదు తిరిగి ఆలోచించాలి. ఒక కౌలుదారులకు ఉన్న హక్కులను రద్దు చేస్తూ తెచ్చిన బిల్లు సెలక్టు కమిటీకి పోయింది. ఆ బిల్లు పాసు కాలేదు. మరల ఈ పర్యాయం అటువంటి చట్టం చేయకుండా ఉన్న హక్కులతో పాటు అదనపు హక్కులు కౌలుదారులకు వచ్చేరీతిగా తీసుకువస్తారని ఆశిస్తున్నాను.

వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు ఏర్పాటు చేశారు. దానిని అమలు జరిపేందుకు ఎలాంటి చట్టము చేయలేదు. ఏర్పాటు చేసిన వేతనాలు కూడా చాలా తక్కువగా ఏర్పాటు చేశారు. దానిని పునరాలోచించాలని కోరుతున్నాను. 70 లక్షల ఎకరాలు అంటే 40 లక్షల ఎకరాలు బంజరు భూములు, సాగుభూములు, 8 లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చాము అని చెప్పారు. గొప్పలు చెప్పుకుంటే లాభము లేదు. ఇప్పుడు సాగు చేసుకుంటున్న వారిని తొలగించకుండా జాగ్రత్త తీసుకోవాలి. అస్పృశ్యతా నివారణకు చట్టాలు ఉన్నాయి. ఈ చట్టాలు అమలులో ఉన్నవా అని మంత్రులను, కాంగ్రెసు సభ్యులను అడుగుతున్నాను. చట్టాలు చేసినంత మాత్రాన ఉపయోగము ఏమిటి అని అడుగుతున్నాను. వారికి ఉద్యోగ అవకాశాలు, వృత్తులు కల్పించి ఇతర పై కులాల వారితోపాటు జీవించడానికి అవకాశాలు కల్పించాలి. ఈ లోపల సాంఘికంగా బహిష్కరించే వారిమీద గట్టి చర్యలు తీసుకోవాలి.

ఇక ఎన్.జి.ఓ సమస్య ఉంది. టీచర్ల సమస్య ఉంది. వివిధ పారిశ్రామిక కార్మికుల సమస్య ఉంది. వాటిని గురించి ప్రభుత్వం తగిన చర్య తీసుకుని సానుభూతితో పరిష్కరించాలని కోరుతున్నాను. కార్మికుల కనీస అవసరాలను భారత కార్మిక మహాసభ అంగీకరించి వుంది. దానిని ఆధారము చేసుకుని అయినా కనీస వేతనాలను నిర్ణయం చేయాలని అని కోరుతున్నాను. 10 సంవత్సరాల నుంచి పని చేస్తున్నప్పటికీ వారిని ఎందుకు పర్మినెంట్ చేయడము లేదు? రైల్వే డిపార్టుమెంటులో అంగీకరించారు. 3 సంవత్సరాలు పనిలో ఉన్నట్లయితే పర్మినెంట్ చేస్తామని అన్నారు. రకరకాల పేర్లతో వేలకొలది ఉద్యోగస్తులను పర్మినెంట్ చేయకుండా వారందరికీ ఎలాంటి సౌకర్యాలు లేకుండా సాగిస్తున్నారు. ఒక సంవత్సరం సర్వీసు పూర్తిచేసిన వారందరినీ పర్మినెంటు చేయాలి. ఈ 5 సంవత్సరాల లోపల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న జీతాలనయినా కనీసము మన ఉద్యోగులకు కూడా ఇచ్చేందుకు కృషి చేయాలి. ఈ మధ్య కరువు భత్యాన్ని జీతంతో కలిపినప్పుడు కనీసము 5 రూపాయలయినా పెరిగేటట్టు, లేకపోతే ఒక ఇంక్రిమెంట్ అయినా ఇవ్వమని, తరువాత పరిస్థితులను బట్టి చూసుకోవచ్చునని వారు కోరారు. అది న్యాయమైన కోరిక. దానిని అమలు జరుపుతారని ఆశిస్తున్నాను. ప్రాథమిక ఉపాధ్యాయులలో అనేక గ్రేడులు పెట్టి, తక్కువ గ్రేడులో ఎక్కువ ఉద్యోగాలు పెట్టి అర్హతలను బట్టి జీతాలు ఇవ్వాలి. కార్మిక సంఘాల విషయంలో పక్షపాత వైఖరిని ప్రభుత్వం అవలంబిస్తున్నది. స్వతంత్రముగా నిలబడిన యూనియన్నను అన్నింటిని గుర్తిస్తూ ఏ యూనియన్ ద్వారా అగ్రిమెంట్‌కు ఒప్పుకుంటే దానిని అమలు జరిపే రీతిగా రహస్య బ్యాలెట్ పద్ధతిని ఓటు తీసుకుని వ్యవహరించాలని మనవి చేస్తున్నాను. ఇక విద్యా విధానము గురించి



గవర్నరు గారు తమ ప్రసంగంలో సంతృప్తి వెల్లడించారు. కొన్ని కాలేజీలు, హైస్కూళ్లు, యూనివర్సిటీలు పెట్టామని చెప్పారు. తెలుగును గురించి చాలా శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఇంతవరకు తెలుగు టైపురైటర్స్ లేవు. పరిపాలన తెలుగులో జరపలేము. శాసనసభ వ్యవహారాలు తెలుగులో జరపలేము అంటున్నారు. ప్రభుత్వము దగ్గర డబ్బు లేదని అంటున్నారు. కేంద్ర ప్రభుత్వానికి హిందీ మీద ఉన్నంత మోజు ప్రాంతీయ భాషల మీద లేదు. హిందీ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నారు. పరిపాలనా భాషగాను, యూనివర్సిటీల్లో బోధనా భాషగాను ప్రాంతీయ భాషను ప్రవేశపెట్టడానికి ఏ మాత్రం ఖర్చు పెట్టడము లేదు. వివిధ రాష్ట్రాలలో వున్న భాషలకు సముచిత స్థానాన్ని ఇచ్చినప్పుడే హిందీని ఇతర రాష్ట్రాల ప్రజలు ఆమోదిస్తారు. పరిపాలనా వ్యవహారాలకు, యూనివర్సిటీలకు బోధనా భాషగాను హిందీనే రుద్దారంటే అనవసరముగా లేనిపోని సమస్యలను తెచ్చిన వారు అవుతారు. హిందీని నేర్చుకొనవలసినదే. వివిధ రాష్ట్రాలలోని భాషలకు ఉచిత స్థానము ఇచ్చినప్పుడే అది సాధ్యమవుతుంది. దానికి కావలసిన శ్రద్ధ తీసుకోవాలి. కావలసిన డబ్బు కేటాయించాలి. కాని కాంగ్రెస్ ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరిస్తోంది. ఉర్దూను ప్రాంతీయ భాషగా అంగీకరించారు. ప్రతి ఉద్యోగస్థుడు హిందీగాని, ఉర్దూను గానీ నేర్చుకోవాలని అన్నారు. ముస్లిములు నూటికి పది శాతం గాని అంతకంటే ఎక్కువగాని ఉన్నప్పుడు పరిపాలనా వ్యవహారాలు ఉర్దూలో జరపడానికి అభ్యంతరం లేదు. ఉర్దూలోనే ఉన్నత విద్యను నేర్పించడానికి కాలేజీలను ఏర్పాటు చేయడాన్ని మా పార్టీ బలపరుస్తున్నది.

ఇక ఆరోగ్యం గురించి కొన్ని విషయాలను మనవి చేస్తాను. ఏవో ఎనిమిది జనరల్ హాస్పిటల్స్ పెట్టారు. ప్రైమరీ హెల్త్ సెంటర్స్ పెడుతున్నారు. బాగానే ఉంది. కాని అవి చాలవు. ప్రతి అయిదు వేల జనాభాకు ఒక గ్రామీణ డిస్పెన్సరీ ఉండేటట్టు చూడాలి. వాటికి అవసరమైన మెడికల్ అసిస్టెంట్స్‌ను తయారు చేయాలి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడిసిన్ చెప్పినట్టుగా ఆరు సంవత్సరముల కోర్సు పూర్తి చేస్తే తప్ప డాక్టర్‌గా పనిచేయడానికి వీలులేదనే పనికిమాలిన సిద్ధాంతాన్ని ఎంత త్వరగా బుట్టదాఖలు చేస్తే అంత మంచిది. గ్రామ వైద్యులు ఉన్నారు. వారికి సర్టిఫికెట్స్ ఇస్తున్నారు. వారికి ఎక్కువ తర్ఫీదు లేకపోయినా వైద్యం చేయడానికి అవకాశం ఇస్తున్నారు. అవసరమైతే వారికి ఆరు మాసములలో, ఒక సంవత్సరమో కోర్సు పెట్టి మామూలుగా వచ్చే వ్యాధులకైనా ఆ డిస్పెన్సరీలలో మందులు ఇచ్చే అవకాశం కలుగజేయవచ్చు. మూడు సంవత్సరముల షార్ట్‌కోర్సు పెట్టి ఆధునిక వైద్యాన్ని నేర్పితే బాగుంటుంది. మైసూరు ప్రభుత్వం ఇదివరకే దీనిని ప్రారంభించింది. మన ప్రభుత్వం కూడా ధైర్యంగా ఆ ఆధునిక వైద్యాన్ని నేర్పడానికి తరగతులు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలి. మంత్రసానులు ప్రస్తుతం ప్రతి మూడు వేల జనాభాకు, వచ్చే ఐదు సంవత్సరాలలో ప్రతి రెండు వేల జనాభాకు తప్పనిసరిగా ఉండేటట్లు అన్ని గ్రామాలలో ఏర్పాటు చేయాలి.

ఇక, ముస్లిమ్ మైనారిటీల గురించి ఇది వరకే చెప్పాము. వారు ఈ రోజు భయోత్పాతం చెంది ఉన్నారు అని చెప్పక తప్పదు. ఆ భయం వారికి పోవాలంటే వారి మతానికి, వారి

సంస్కృతికి, వారు నివసించే విధానానికి హామీ ఇవ్వాలి. కేవలం ఉపన్యాసాల ద్వారా హామీలు ఇవ్వడం కాక ఆచరణలో చూపించాలి. మైనారిటీలుగా ఉన్న ముస్లిమ్‌లు ఉద్యోగాలకు గ్యారంటీ ఇవ్వాలి. మేము మైనారిటీగా వున్నాము. కాబట్టి ఈ దేశములో మాకు భవిష్యత్తు లేదనే అభిప్రాయం వారిలో ఉంది. దానిని పోగొట్టి వారికి రక్షణ కలిగించాలని మనవి చేస్తున్నాను. నేను ఇక ఎన్నికల విషయం గురించి మాట్లాడబోతున్నాను. కనుక ఆవేశపడకుండా వినవలసిందిగా ప్రార్థిస్తున్నాను. ఎన్నికలలో కాంగ్రెసు వారు అన్యాయాలు చేసి గెలిచారు. కనుక వారిని ఖాళీ చేయమని మేము చెప్పడం లేదు. మేము చెప్పినా వారు చేయరు. అట్లా మేము అడగటంలో కూడా సబబు లేదని మాకు తెలుసు. ఏదో విధంగా గెలిచారు కాని మొన్న జరిగిన విధానమే ఇక ముందు కూడా జరగనిస్తే ప్రజలకు ఎన్నికలపై నమ్మకం పోతుంది. అలా చేస్తే అది ప్రజాస్వామ్యం అనిపించుకుంటుందా అని ఆలోచించాలి. ఈ రోజు భారతదేశంలో ప్రజాతంత్రానికి ప్రమాదం ఏర్పడే రీతిగా ఎన్నికలు జరుగుతున్నాయి, అదే విధంగా జరిగాయి. ఇక ముందు అదే విధంగా జరిగితే మాత్రం భారతదేశంలో ప్రజాతంత్రం మనదు అని కాంగ్రెస్ నాయకులు గుర్తించి దానిని గురించి సీరియస్‌గా ఆలోచించి, దానికి అవసరమైన పథకాలు వేయాలని చెబుతున్నాను.

ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయపరిమితి ప్రకారం ఖర్చు ఏడు వేల రూపాయలని ఒక పనికిమాలిన లెక్క పంపిస్తే ఎవరికీ దానిమీద గౌరవం లేదని అందరకూ తెలుసు. లక్షల కొలదీ డబ్బు ఖర్చు పెట్టారు. మద్యపాన నిషేధం ఉన్నా సారాయి విచ్చలవిడిగా పీపాలకు పీపాలు ఖాళీ అయ్యాయన్న సంగతి అందరికీ తెలుసు. అవన్నీ మామూలు అయిపోయాయి. డబ్బు వుంది కాబట్టి ఓటర్లకు ఆశ చూపించడం, వత్తిడి చేయడం, దౌర్జన్యాలు జరపడం, పోలింగ్ దగ్గరకు ఏజెంట్లు రాకుండా చేయడం మొదలైనవన్నీ చేశారు. ప్రతిపక్ష పార్టీల జెండాలు పీకించడం, అసభ్యంగా తిట్టించడం మామూలే అయ్యాయి. వాటిని గురించి ఏఏ నియోజకవర్గాలలో ఎట్లా జరిగింది ఉదాహరణలు ఇవ్వాలంటే ఈ సమయం చాలదు. ఈ రోజు అందరం కూర్చుని ఎన్నికల నియమావళి చేసుకొన్నాము. కాని దానిలో ఒక్క అక్షరాన్ని కూడా పాటించలేదు. వాటిని అధికార పార్టీలో వున్న కాంగ్రెస్ వారు భగ్నం చేశారని నేను చెప్పక తప్పదు. అవన్నీ సహించాము. వాటిని ఎదుర్కోగలము కూడా. ఎదుర్కొన్నంత వరకే ప్రజాతంత్రం ఉంటుందని అందరకూ తెలుసు. అంతేగాక పట్వారీలు, పటేలులు, పెత్తందార్లు తమ అధికారం ఉపయోగించి ప్రజల మీద తెచ్చిన ఒత్తిడి గురించి కూడా చెప్పదలచుకోలేదు. తమకు అనుకూలంగా పనిచేయని టీచర్లను బదిలీ చేయడం గురించి కూడా చెప్పదలచుకోలేదు. అలా చెప్పాలంటే లెక్కలేనన్ని ఉదాహరణలు చెప్పవచ్చు. ఇక, భూస్వాములు తుపాకులు చూపించి ప్రజలను బెదిరించిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈనాడు కూడా భూస్వాములు అదేవిధంగా చేస్తున్నారు. అది న్యాయం కాదు, ప్రజాతంత్రం కాదు. ఇవన్నీ చేసి ఎన్నికలలో గెలిస్తే అది ఒక గెలుపు కాదు. ఈ వేళ ఆ విధంగా గెలవవచ్చు. అధికారం తమ చేతిలో పెట్టుకోవచ్చు. అయితే ఈ రీతిగా చేస్తే భారతదేశంలో ప్రజాతంత్రం ఉండదనే సంగతి చెబుతున్నారు. ఇక ప్రభుత్వ యంత్రం చూడండి. అంటే ఇక్కడ పోలీసుల, ఉద్యోగస్తుల



విషయం చెబుతున్నాను. మిగిలిన వాళ్ల విషయం అటువుంచండి. ఉపాధ్యాయులు మొదలైన వారికి ఎన్నికలు వచ్చినప్పుడు ఏవేవో ఆశలు చూపించవచ్చును. నాకు ఓటు ఇస్తే మీ కొడుకులకు ఉద్యోగమిస్తానని, ఇంకా ఏదో చేస్తానని చెప్పవచ్చు. లేకపోతే మంత్రులు వెళ్లినప్పుడు అప్పటికప్పుడు ఆర్డర్లు వేయించినట్లుగా నటించవచ్చు. కొన్ని నియోజకవర్గాలలో ప్రభుత్వోద్యోగస్తులు జోక్యం చేసుకున్నారు. ఈ రీతిగా జరిగితే ఎన్నికల వల్ల లాభం లేదు. ఈ పద్ధతులన్నీ కూడా పనికిమాలిన పద్ధతులు. ఏమైనప్పటికీ అయ్యా మీరు డబ్బు చూపిస్తామంటే, డబ్బుతో కుస్తీపడతాము. దౌర్జన్యము చూపిస్తే దౌర్జన్యంతో కుస్తీపడతాము. మీ ఉద్యోగస్తులు పక్షపాతముతో వ్యవహరిస్తే దానికి కూడా మేము తట్టుకుంటాము. కాని గ్రామాలలో కాస్త ప్రచారము చేసుకొంటాము అంటే దానికి కూడా పోలీసులు తలలు బద్దలు కొట్టి మాపై కేసులు పెడుతూ వుంటే, ఇక ఎన్నికలంటే అర్థమేమిటి? ఈ ఘటనలన్నీ జరిగినాయని చెబుతూ వుంటే, సంజీవరెడ్డి గారు ఆ విధంగా ఏమీ జరగలేదని పార్టీలో మాట్లాడుతూ చెప్పినట్టు పత్రికలలో పడింది. కాంగ్రెసు పక్షము అంటే అభిమానం గల పత్రికలలో అనుకుంటాను. వారు ఈ రోజున శాసనసభలో అదే రకంగా చెప్పితే చెప్పవచ్చు. కాని మేము సీరియస్‌గా చెబుతున్న విషయాల గురించి ఇదివరకే వినతిపత్రాలు ఇచ్చాము. వాటిని సీరియస్‌గా ఆలోచించండని చెబుతున్నాను. ఇదేరీతిగా గనుక జరిగినట్లయితే భవిష్యత్తులో మాత్రము మనకు చాలా నష్టం కలుగజేస్తుంది. ఆ విధంగా భవిష్యత్తులో జరగకుండా చేయమని నా కోరిక. రెండవది ఏదో ఎన్నికలలో చేస్తే చేశారు. కాని ఈ రోజు కూడా కక్ష సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎక్కడెక్కడయితే, కాంగ్రెసుకు వ్యతిరేకంగా, కమ్యూనిస్టులకు, కమ్యూనిస్టులు బలపరిచిన వారికి ఓటు వేశారో, అక్కడ వారిపైన కక్ష సాధించడానికి ఈ నాటికీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది ఆపు చేయాలి లేకుంటే ఆ ప్రాంతంలో శాంతి భద్రతలు కూడా కాపాడటానికి సాధ్యం కాదు. కమ్యూనిస్టులను అరెస్టు చేయవచ్చు. జైళ్లలో పెట్టవచ్చు. కాని ఆ పద్ధతి మాత్రం సరైన పద్ధతి కాదు. ఎన్నికలలో చేసినది తప్పని గుర్తించండి, కనీసం భవిష్యత్తులోనైనా ఆ విధంగా చేయకుండా ఆలోచనలు వేసుకోండని వారికి చెబుతున్నాను. హైదరాబాదు సంగతి, ఇక్కడ ఇత్తేహాదుల్ ముస్లిమీన్లను ఓడించారన్నారు. సంతోషమే, కాని ఆ ఎన్నికలలో ఏ విధంగా ప్రవర్తించారు? ముస్లిం స్త్రీలు రిక్షాలలో బుర్ఖాలు వేసుకొని ఓటు వేయడానికి పోతూ ఉంటే ఆ బుర్ఖాలను లాగిపారేసి, ఆ స్త్రీల మీద ఉమ్మేసి, వారిని ఓటింగ్‌కు పోకుండా చేయడం జరిగింది. ఇది నేను చాలా బాధతో చెబుతున్నాను.

## రాజ్యసభ

# 1952 : కేంద్ర బడ్జెట్‌పై ప్రసంగం

## (1952 మే 28)

**సుందరయ్య:** బడ్జెట్‌పై చర్చకు హెచ్చుకాలాన్ని కేటాయించడం అవసరం. అందునా ప్రభుత్వ పార్టీ సభ్యులకంటే ప్రతిపక్షం వారికి మరింత కాలాన్ని ఇవ్వాలి. ఎందువల్లనంటే ప్రభుత్వ విధానాలను విమర్శించడమేగాక, నిర్మాణాత్మకమైన ప్రతిపాదనలను చేసి, ప్రభుత్వానికి సహాయపడవలసిన బాధ్యత మాపై ఉన్నది. మీరిచ్చే పది పదిహేను నిముషాల వ్యవధిలో మాకది సాధ్యపడదు. బడ్జెట్‌పై చర్చను మరో రోజు పొడిగించాలి. లేదా కాంగ్రెస్ పక్షం వారు కొంతకాలాన్ని తగ్గించుకొని, మాకు మాట్లాడేందుకు ఎక్కువ టైమ్ ఇవ్వాలి.

× × ×

కొంతమంది సభ్యులు ప్రసంగించిన తరువాత సుందరయ్యగారు మాట్లాడుతూ ఇలా చెప్పారు:

కొంతమంది సభ్యులు ప్రతిపక్షంలో వున్న మాపై కొన్ని చౌకబారు విమర్శలు చేశారు. అది వారి బలహీనతకు చిహ్నం. వారికి సమాధానమిచ్చి, కాలాన్ని నేను వృథా చేయదలచుకోలేదు. ఇంక బడ్జెట్‌ను గురించి మాట్లాడాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం తన ఆశలన్నింటినీ తాము రూపొందించిన జాతీయ ప్రణాళికపై పెట్టుకొన్నారు. బడ్జెట్ ప్రణాళిక అమలుకు సాధనం కావాలి. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రే తన ప్రసంగాల్లో చెప్పారు. మరి ఇప్పుడు ఆయన ప్రతిపాదించిన ఈ బడ్జెట్ ప్రణాళిక అమలుకు సాధనం కాగలదా? లేదని నేను చెప్పదలచాను. ఎందువల్లనంటే ఈ బడ్జెట్ నిర్దిష్టంగా లేదు. నాలుగు నెలల క్రిందట 19 కోట్ల రూపాయలు మిగులు వుండగలదని చెప్పారు. కాని ఇప్పుడు దాన్ని నాలుగు కోట్లకు దిగజార్చారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టేముందు మార్చి మాసంలో ఎగుమతి సుంకం ఒక మేరకు రాగలదని అంచనా వేశారు. కాని రెండు నెలల్లోనే ఆ ఎగుమతి సుంకాన్ని 25 కోట్ల రూపాయల వరకూ తగ్గించవలసి వచ్చింది. ఇలా జరగడానికి కారణం మీ ఆర్థిక



విధానంపై మీకు కంట్రోలు లేకపోవడమే. మన ఆర్థిక వ్యవస్థను ఆంగ్లో–అమెరికన్ సామ్రాజ్యవాదుల ఆర్థిక వ్యవస్థతో ముడిపెట్టారు. అందువల్లనే బ్రిటన్‌లోగాని, అమెరికాలోగాని ఆర్థిక మాంద్యం ఏర్పడితే దాని ప్రభావం మన దేశంపై పడుతుంది. ఆ విధంగా మనం నిస్సహాయులమవుతున్నాం. జాతీయ ప్రణాళికను రూపొందించుకొనే సందర్భంలో మనం కొన్ని సూత్రాలను పాటించవలసి వుంటుంది. ఒక ప్రణాళికను రూపొందించుకోవాలంటే మన విదేశాంగ వ్యాపారంపై పూర్తి కంట్రోలు ప్రభుత్వానికి ఉండాలి. వ్యక్తులకు, ప్రయివేటు కంపెనీలకు వదిలి వేయరాదు.

విదేశీ వ్యాపారం ప్రయివేటు సంస్థల చేతుల్లో ఉండడం మూలంగా మనం ఏమీ చేయలేకపోతున్నట్లు ఇప్పుడు ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో వివరించారు. అయితే తమ వద్ద లైసెన్సులు ఇచ్చే అధికారాలున్నాయనీ, కంట్రోళ్లు వున్నాయని, దిగుమతులు ఎగుమతులపై సీలింగు పెట్టగలమని ఏవేవో చెప్పారు. ఈ స్కీములన్నీ కాగితాలపై మాత్రమే వుంటాయి. కొరియా యుద్ధంతో ధరలు పెరిగాయి. బట్టల ధరలు పెరుగుతాయి. ప్రభుత్వం ఓపెన్ లైసెన్సులను ఇస్తుంది. ఫలితంగా అమెరికా నుండి ఒక పది లక్షల బేళ్లు దిగుమతి అవుతాయి. అందుకు వంద కోట్ల రూపాయలు ఖర్చు పెడతారు. అప్పుడేమవుతుంది? మార్కెట్టులో అవసరమైన దానికంటే హెచ్చు బట్ట వుంటుంది. జౌళి పరిశ్రమ కూడా దాన్ని డెలివరీ చేసుకోజాలదు. కనుక ఇది కాదు అనుసరించవలసిన పద్ధతి కాదు. రెండో ముఖ్యమైన విషయమేమంటే ఉత్పత్తిపై ప్రభుత్వానికి పూర్తి కంట్రోలు వుండాలి. ఉత్పత్తి ఎంత వుండాలో మీరు నిర్ణయించగలగాలి. ప్రభుత్వ పరిశ్రమ ప్రధాన శక్తిగా లేకపోతే ప్రజల అవసరాలను తీర్చడం సాధ్యం కాదు. ఇప్పుడేమో అంతా వ్యక్తులకు వదిలిపెడుతున్నారు. మన పరిశ్రమల్లో 66 శాతం బ్రిటిష్ పెట్టుబడిదారుల ఆధిపత్యం క్రింద వుంది. ఇప్పటికీ మన పరిశ్రమలపై వారి ఆధిపత్యాన్ని కొనసాగనిస్తున్నారు. మీ ప్లానింగ్ ప్రజల అవసరాలను, స్వదేశంలోని మార్కెట్టును దృష్టిలో వుంచుకోవాలి. అలా కాకుండా విదేశాలకు ఎగుమతి చేసి హెచ్చు లాభాలను గడించాలన్న దృష్టి వుండకూడదు. ప్రభుత్వం ఆ విధంగా వ్యవహరించడం లేదని స్పష్టమవుతున్నది. ఇటీవల వేరుశనగ, నూనెలు, మధ్యరకపు బట్టలు, పంచదార మొదలుగాగల అనేక నిత్యావసర సరకుల ఎగుమతులపై కంట్రోళ్లను ఎత్తివేశారు. మన ఉత్పత్తి లక్ష్యం ఏమిటి? మన జాతీయ ప్రణాళిక ఆశయం ఏమిటి? మన ప్రజల అవసరాలను తీర్చడానికి కాదా? మన దేశంలోని ప్రజలకు సరిపడబట్టలున్నాయా? అలాగే ఆకలితో మలమలమాడే ప్రజలందరికీ అవసరమైన ఆహార ధాన్యాలున్నాయా? మన దేశ అవసరాలను త్రోసిపుచ్చి విదేశాలకు ఎగుమతులు చేసి లాభాలను సంపాదించుకోవడానికి ప్రయివేటు వ్యక్తులకు అవకాశాన్ని కల్పించడమా?

మరో విషయం– ఏడాదికి 26 కోట్ల వరకు అదనంగా వుంటుందని అంచనాగా మన ప్రణాళిక వుంది. కాని తీరా చూస్తే అదనంగా ఉన్నది 26 కోట్లుగాక, మూడు కోట్లు మాత్రమే. మన ప్లానింగు అంతా అమెరికా ఇచ్చే అప్పులపైనా, విదేశాల సహాయంపైనా ఆధారపడి వుంది. మన జాతీయ ప్రణాళిక పూర్తిగా విదేశీ సహాయాలపై ఆధారపడి వుండటం ఘోరమైన విషయం. భారత ప్రభుత్వం నేడు చేస్తున్నది ఇదే. మేము విదేశ సహాయాన్ని తీసుకోవడానికి వ్యతిరేకమనే విమర్శ వుంది. వాస్తవానికి విదేశీ సహాయం తీసుకోవడానికి మేము వ్యతిరేకం కాదు. మన పట్ల అమెరికా ప్రభుత్వం అనుసరించుతున్న వైఖరికే మేము వ్యతిరేకం. ఆర్థిక మంత్రి ప్రసంగం నుండి ఒక వాక్యాన్ని చదివి మీకు వినిపించుతాను.

"భారత్–అమెరికా ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించుతాయి. మూడు నెలలకు, సంవత్సరానికి ఆ నిధులను వివిధ స్కీములకు ఎలా ఉపయోగించినదీ నివేదికలు తయారు చేయబడతాయి."

అమెరికా పెట్టుబడి వున్న కమ్యూనిటీ ప్రాజెక్టులను, ఇతర ప్రాజెక్టులను ఆచరణలో నిర్వహించుతున్నది అమెరికా ప్రభుత్వమేనన్నది నాకు స్పష్టంగా కనిపించుతున్నది. ఇందుకే మేము అభ్యంతరం చెబుతున్నది. ప్రభుత్వం ఏది చేసినా కమ్యూనిస్టులు విమర్శించుతారనే అభిప్రాయం మీకున్నది. ఇది చాలా పొరపాటు అభిప్రాయం. ప్రభుత్వం గౌరవించే ఆర్థిక శాస్త్రవేత్తలే ప్రభుత్వ నడకపట్ల అసంతృప్తిని వెల్లడించుతున్నారు. మన జాతీయ ప్రణాళిక జయప్రదం కావాలంటే, మన దేశం స్వయం పోషకం కావాలంటే, మనం వ్యవసాయం మీదనే గాక, భారీ పరిశ్రమలను నెలకొల్పుకోవడంపైనా, నదీ జలాల ప్రాజెక్టులను నిర్మించుకోవడంపైనా ప్రభుత్వం కేంద్రీకరించడం అవసరం.

ఇప్పుడు మరో కోణం నుండి మాట్లాడుతాను. మన ప్రజల అవసరాలను తీర్చాలంటే, మన పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే, మన దేశం స్వయంపోషకం కావాలంటే, మొట్టమొదట మనం చేయవలసింది మన దేశంలో వున్న అశేష ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలి. ఇందుకు ఉన్నది ఒకే ఒక మార్గం. భూస్వామ్య విధానాన్ని రద్దు చేసి, సాగుచేసే వారికి ఉచితంగా భూములను పంచాలి. దాన్ని గురించి ప్రభుత్వం ఏమి చేస్తున్నది? గత అయిదేండ్ల కాలంలో ప్రభుత్వం ఇందుకు కొన్ని శాసనాలను చేసింది. కాని వాటి ఫలితమేమిటి? ఆ శాసనాల వలన పేద రైతాంగానికి భూమి లభించలేదు.

బేగం అయిజాజ్ రసూల్ (ఉత్తరప్రదేశ్)ః మీరు ఉత్తరప్రదేశ్ జమీందారీ రద్దు చట్టాన్ని చదివారా? దాని వలన రైతాంగానికి భూములు లభించాయి కదా!

**సుందరయ్య:** ఆ చట్టాలను నేను చదివాను. వారు జమీందార్లకు అయిదు వందల కోట్ల రూపాయలను ఇచ్చారుగాని, కర్షకులకు భూమి మాత్రం ఇవ్వలేదు. ఆ రాష్ట్రంలో అనేక రకాల జమీందార్లు ఉన్నారు. వారి పేరిట భూముల పట్టాలున్నాయిగాని, వారు భూములను సాగుచేయరు. అందువలన భూస్వామిక విధానాన్ని రద్దు చేయకుండా,



రైతాంగానికి భూములనివ్వకుండా ఆహారం విషయంలో మన దేశం స్వయం సమృద్ధిని సాధించజాలదు. చైనా ఏమి చేసిందో చూడండి. రెండు సంవత్సరాల కాలంలోనే ఆ దేశం ఆహారం విషయంలో స్వయం సమృద్ధిని సాధించుకోగలిగింది. ఇందుకు కారణం దున్నేవాడికి భూమినివ్వడమే. మరి ఇక్కడ ఏమి జరుగుతున్నది? ఇక్కడ ప్రజలకు కనీసం కావలసిన ఆహార పదార్థాలను కొనుక్కోవడానికి కూడా స్థోమతులేదు. హెచ్చు ధర పెట్టి ప్రభుత్వం ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకొంటోంది. ఆ ధాన్యాలను ప్రజలు కొనుగోలు చేయగల స్థితిలో లేరు.

**ఛైర్మన్:** సభ్యుడు తన ప్రసంగాన్ని ముగించుతారా?

**సుందరయ్య:** ఇంకనేను ఒకటి రెండు విషయాలను చెప్పదలచుకొన్నాను.

ఉత్పత్తి పెరిగినదని ఇప్పుడు ప్రభుత్వం చెపుతున్నది. అది సరికాదు. ప్రభుత్వం ప్రచురించే "ఇండస్ట్రీ అండ్ ట్రేడ్" అనే మాసపత్రికలోనే అన్ని ముఖ్యమైన పరిశ్రమల్లోనూ, వ్యవసాయరంగంలోనూ ఉత్పత్తి పడిపోయినట్లు రాశారు. ఉత్పత్తి పడిపోవడంతో నిరుద్యోగం పెరుగుతున్నది. ఈ పరిస్థితి ప్లానింగ్‌ను తెలుపదు. అరాచకాన్ని తెలుపుతుంది.

**వి.జి.గోపాల్ (బీహార్):** ఉక్కు ఉత్పత్తి ఖచ్చితంగా పెరిగింది.

**ఛైర్మన్:** ఉక్కు, సిమెంటుల ఉత్పత్తి పెరిగినప్పటికీ అదే అంతా ఉత్పత్తి పెరిగినట్లు కాదనేది ఆయన అభిప్రాయం.

**సుందరయ్య:** ఇంక ఇప్పుడు బడ్జెట్ అంకెలను గురించి మాట్లాడుతాను. 400 కోట్ల రూపాయలలోనూ 20 కోట్ల వరకు రక్షణ వ్యవస్థ పైననే ఖర్చుపెట్టాలని ప్రభుత్వం భావించుతున్నది. మరో 55 కోట్లు వివిధ రకాల పరిపాలనా వ్యవహారాలకు, సంస్థానాధిపతులకు ఖర్చు పెడుతున్నది. కాని విద్యకోసం, శాస్త్ర విభాగానికి, ఆరోగ్యానికి, కార్మికుల సంక్షేమానికి 16 కోట్లు మాత్రమే ఖర్చు పెడుతున్నది. అదే విధంగా వ్యవసాయానికి, పరిశ్రమల సహాయానికి 14 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టదలచారు. రాష్ట్రాలకు, గిరిజన ప్రాంతాలకు 30 కోట్ల వరకూ సబ్సిడీలు ఇవ్వడానికి, ఆహార సబ్సిడీపై 25 కోట్లు మాత్రం, నిర్వాసితుల పునరావాసానికి 10 కోట్లు ఖర్చు పెట్టదలచారు. అంటే దాని అర్థం ఏమిటి? మొత్తం బడ్జెట్‌లో 62.1/2 శాతం సాధారణ పరిపాలనా వ్యవహారాలకు, రక్షణకు వెచ్చించుతున్నారు. 4 శాతం మాత్రమే విద్యకు ఇతర సాంఘిక కార్యకలాపాలకు ఖర్చు పెడుతున్నారు. ఇంక తతిమ్మా మొత్తం ఇతర పద్దులకు కేటాయించారు. మేము చెప్పదలచిన దేమిటంటే నిజమైన ప్లానింగు అంటే ప్రజల అవసరాలను తీర్చేదిగా వుండాలి. రక్షణ, సాధారణ పరిపాలనా వ్యవహారాల పద్దులకు బడ్జెట్‌లో మూడోవంతు మాత్రమే ఖర్చు పెట్టాలి.

**కె.ఎస్. హెగ్డే:** అప్పుడు రష్యా మన దేశాన్ని ఆక్రమించుకోవడానికి అవకాశం కలుగుతుంది.

**సుందరయ్య:** మూడో వంతు సాంఘిక అభివృద్ధి పథకాలకు, మరో మూడో వంతు జాతీయ నిర్మాణ కార్యకలాపాలకు ఖర్చు పెట్టాలి. ఇతర పద్దులకు కోత పెడుతున్నామని మేము అంటున్నామంటే రష్యా మనపై దాడి చేయడానికి ఇలా చెపుతున్నామని చెప్పడం తేలికే. రష్యా అంటే ఇలాంటి వారికెప్పుడూ అయిష్టమే. కాని రష్యా మన మిత్రదేశమని గుర్తించాలి.

**కె.ఎస్. హెగ్డే:** అమెరికా కూడా మన మిత్రమే.

**సుందరయ్య:** అమెరికా కూడా మన మిత్రమేనని మీరు అంటున్నారు. అయితే అప్పుడు రక్షణ కోసం 200 కోట్లను ఖర్చు పెట్టవలసిన అవసరం లేదు.

**ఛైర్మన్:** టైమ్ అయిపోయింది. ఇప్పటికే మీరు చాలా వ్యవధి తీసుకొన్నారు.

సుందరయ్య : మేము చెప్పేదానితో ప్రభుత్వం అంగీకరించకపోవచ్చు. అన్ని పార్టీల సహకారం ప్రభుత్వానికి అవసరమని ప్రధానమంత్రి మొన్న లోక్‌సభలో చెప్పారు. మీకు తెలుసు తీవ్రమైన చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొనజాలదని మీకు తెలుసు.

బాధపడుతున్న జన సామాన్యం కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలను తీసుకొంటుందా? ఉదాహరణకు వెంటనే రైతుల శిస్తులను 50 శాతం తగ్గించి వారి బాధలను కొంత వరకు నివారించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలను జారీ చేయగలదా? కార్మిక రక్షణ చట్టాలను సాంఘిక బీమా చట్టాలను చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను కోరగలదా? కార్మిక వ్యతిరేక శాసనాలన్నింటినీ ఉపసంహరించి, రాజకీయ డిటెన్యూలను, ట్రేడ్ యూనియన్, కిసాన్ సభ కార్యకర్తలను విడుదల చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతుందా? ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం చేయడానికి సిద్ధపడితే, ప్రభుత్వం నిర్వహించే సహాయ కార్యక్రమాలన్నింటికీ మా సహకారం, తోడ్పాటు తప్పకుండా ఉంటుంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిటిష్ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమూ, ఈ దేశంలో భూస్వాముల ప్రయోజనాలకు ఉపయోగపడుతూ వుంటే మేము ఈ ప్రభుత్వంతో సహకరించబోము.

ఇంతకుముందు రోజున రక్షణ మంత్రి మమ్ములను అడవి మనుషులమని ఎగతాళి చేశారు. అయ్యా అడవుల్లో వుండటం మాకేమీ సంతోషకరమైన విషయమేమీ కాదు. ప్రజలకు సేవ చేయకుండా ప్రభుత్వం మమ్ములను అడవులకు తరిమేసింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు, భారత గుత్త పెట్టుబడిదారులకు భూస్వాములకూ మీలాగా సేవలు చేసే బదులు అడవుల్లో వుండి అక్కడి గిరిజనులకు సేవ చేయడానికే ఇష్టపడతాము. ఇంక దీనితో నా ప్రసంగాన్ని ముగించుతున్నాను.



# ఆంధ్రరాష్ట్రంపై అనధికార తీర్మానంపై

## (1952 జులై 16)

**మ**న దేశంలోని రాష్ట్రాలను భాషా ప్రయుక్తంగా పునర్విభజించాలనీ, ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరచాలనే డిమాండ్ గత 40 ఏండ్లుగా ఉన్నది. ఇందుకు కాంగ్రెసు వారు కూడా అంగీకరించారు. కాని ఆచరణలోకి వచ్చేప్పటికీ ఆ డిమాండ్‌ను కాంగ్రెస్ తిరస్కరించుతున్నది. ఈ వేళ జరిగిన చర్చలో భాషా ప్రయుక్త రాష్ట్రాలను గురించీ, ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రాన్ని గురించి కొందరి నుండి విచిత్రమైన వాదనలను విన్నాను. భాషా రాష్ట్రం ఏర్పడాలన్న డిమాండ్ జన బాహుళ్యం హృదయాల నుండి వస్తున్నదన్న విషయాన్ని నేను సభ్యులకు చెప్పదలచాను. తమ విద్య తమ మాతృభాషలోనే బోధించాలనేది వారి అభిమతం. అలాగే తమకు తెలిసిన భాషలోనే పరిపాలనా వ్యవహారాలు జరగాలనేది వారి కోర్కె. ఇవి రెండూ జరగకుండా ప్రజాతంత్ర ప్రభుత్వమంటూ వుండజాలదు. అలాగే ప్రజల ఐక్యత కూడా మనజాలదు.

ఇక్కడ ప్రధానమంత్రి లాంటి ప్రముఖుడి నుండే మాటి మాటికీ వింత వాదనలు వస్తున్నాయి. భాషా రాష్ట్రాలు ఏర్పడటం అంటే విచ్ఛిన్నతట! భారతదేశం పాకిస్తాన్‌లాగా విడిపోవడమట! ఇది చాలా తప్పుడు పోలికనీ, పూర్తిగా తప్పుడు వాదననీ నేను వారికి మనవి చేయదలచాను. ప్రజల మనస్సులను పొరపాటు ధోరణికి మళ్ళించడానికే ఈ వాదనలు చేస్తున్నారు. మరి అలా అయితే గత 30 ఏండ్లుగా మన దేశంలో భాషా రాష్ట్రాలు ఏర్పడాలని కాంగ్రెసు నాయకులు ఎందుకు చెపుతూ వచ్చారు? ఆంధ్రులమైన మేము భారత దేశాన్నుండి విడిపోతామని ఎన్నడూ చెప్పివుండలేదు. పైపెచ్చు భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్రులు ముందు పీటిన నిలబడ్డారు. మేమంతా భారతదేశ ఐక్యతను వాంఛించుతున్నాం. ఇప్పుడున్న గందరగోళపు కలగూరపు రాష్ట్రాలకంటే రాష్ట్రాలు భాషా ప్రయుక్త పునర్విభజించబడినప్పుడే మన దేశం మరింత ఐక్యంగా వుండగలదని మేము విశ్వసించుతున్నాం. బ్రిటిష్ వారూ, వారి తొత్తులు మాత్రమే ఇండియాను విభజించారు. భాషా ప్రాతిపదికపై ప్రజలందరికీ తమ తమ భాషల్లోనే విద్యాబోధన జరిగేలా, తమ తమ భాషల్లోనే పరిపాలన జరిగేలా దేశాన్ని ఐక్యంగా ఉంచాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని మేము కోరుతున్నాం. ఇంతటి అతి సవ్యమైన డిమాండ్‌నే వారు దేశాన్ని విచ్ఛిన్నం చేసేదిగానూ, దేశాన్ని విభజించేదిగానూ ప్రచారం చేస్తున్నారు. ఈ న్యాయమైన, సహేతుకమైన డిమాండ్‌ను

నిరాకరించడం ద్వారా లేదా ఏదో ఒక సాకుతో వాయిదా వేయడం వలన మీరు అనైక్యతను సృష్టించుచుతున్నారు. ప్రజలకు బాధ కలిగేలా చేస్తున్నారు. ఈ కోర్కెను మీరు నెరవేర్చకపోయినట్లయితే మన దేశ ప్రజలను ఐక్యం చేయలేకపోగా, పరిస్థితిని మరింత అధ్వాన్నం చేసిన వారవుతారు.

ఉదాహరణకు భాషా సమస్యనే తీసుకోండి. భారతదేశంలో విభిన్నమైన భాషలున్నాయి. రెండు కోట్లు, మూడు కోట్లు అంతకంటే హెచ్చుమంది మాట్లాడే భాషలున్నాయి. వాటన్నింటినీ ప్రధానమైన భాషలుగా భారత రాజ్యాంగం గుర్తించింది. ఇంక ఇప్పుడు ఒక ఉమ్మడి భాషను హిందీని అభివృద్ధి చేయాలని మీరనుకొంటున్నారు. హిందీని అభివృద్ధి చేయడమంటే ఇతర భాషలను అణచివేయడం కాదు. ఆయా ప్రాంతాల్లో తమ భాషల్లో విద్యనార్జించే హక్కును నిరాకరించడం కాదు. కాని నేడు యూనివర్శిటీలలో ప్రజల భాషలో విద్యనేర్పడం లేదు. అది బోధనా భాషగా ఉండటం లేదు. పై పెచ్చు హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని మూడు ప్రధాన భాషలను, ఉర్దూనుగాక హిందీ బోధనా భాష యూనివర్శిటీగా మార్చాలనే ప్రతిపాదన ఉంది. ఆ విధంగా ఇతర భాషలపై హిందీని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నించుచుతున్నారు. ఇలాంటి విషయాలే ఘర్షణకు కారణాలవుతాయి. ఉమ్మడి భాష ఒకటి వుండాలని కోరుకోవడంలో తప్పు లేదు. కాని యూనివర్శిటీల్లో తమ మాతృభాషే బోధనా భాషగా వుండాలని కోరుకోవడం సహజము, న్యాయమూ కూడా. మాకు స్వంత రాష్ట్రం వుంటేనే అది సాధ్యమవుతుంది. ఉత్తరప్రదేశ్‌లో, మధ్యప్రదేశ్‌లో హిందీని ప్రవేశపెట్టారు. అది మంచిదే. అటువంటి అవకాశం ఆ రాష్ట్రాలకున్నది. అలాంటి అవకాశాన్ని ఇతర భాషల వారికి ఎందుకు నిరాకరించుచుతున్నారు?

ఆంధ్ర రాష్ట్రం విషయంలో మాకు న్యాయం జరగడం లేదన్న అభిప్రాయం వుంది. మా న్యాయమైన, సహేతుకమైన కోర్కెను ఎందుకు నిరాకరించుచుతున్నారన్న తీవ్రమైన అసంతృప్తి వుంది. ఉదాహరణకు ఆహార సమస్యనే తీసుకోండి. ఆంధ్రలో పండిన ధాన్యాన్ని కొరతగా వున్న రాయలసీమ జిల్లాలకు సరఫరా చేయకుండా ఎవరికో ఎందుకు తరలించాలి? ఇలాంటివి జరుగుతున్నందునే అసంతృప్తి, విచ్ఛిన్నకరణ ధోరణులు పెరుగుతున్నాయి.

అంతేకాదు, ప్రాజెక్టుల విషయంలో కూడా ఇదే జరుగుతున్నది. కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టు జలాలను కరువుతో బాధపడే రాయలసీమ జిల్లాలకు కాక తమిళనాడుకు పంపాలనే ప్రతిపాదన వుంది. ఇది విచిత్రమైన విషయం కాదా? అది అంతర్జాతీయ సూత్రాలకే కాదు. ఇంగితజ్ఞానానికి కూడా విరుద్ధమైన ప్రతిపాదన. ఈ రకమైన చర్యల వలన వివిధ భాషల ప్రజల్లో అనవసరమైన అపోహలు, కలతలు ఏర్పడవా?

రాజాజీ ఇప్పుడు మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రి. 1937లో కూడా ముఖ్యమంత్రే. ఆంధ్ర రాష్ట్రాన్ని వేరుగా చేయాలన్న డిమాండ్‌ను అంగీకరించితే మద్రాసువీధుల్లో రక్తప్రవాహం ఏర్పడగలదని ఆయన బ్రిటన్‌లోని ఇండియా సెక్రటరీకి రాశారు. ఇదేమీ రూమర్ కాదు.



ఇ.రాఘవేంద్రరావు లాంటి ప్రముఖ వ్యక్తి ఈ విషయాన్ని బయటపెట్టారు. ఈనాడు కూడా ఆయన ఆంధ్ర రాష్ట్రాన్ని గురించి ప్రధాన మంత్రికి ఆ విధంగానే జాబు రాసినట్లు తెలుస్తున్నది. తాను ప్రధానమంత్రికి రాసిన జాబులోని విషయాలను వెల్లడించవలసిందిగా మద్రాసు శాసనసభలో కోరగా అది రెండు ప్రభుత్వాల మధ్య ప్రయివేటు విషయమని చెప్పి వెల్లడించ నిరాకరించారు. ఎందుకీ రహస్యం? ఆంధ్ర రాష్ట్రం రాకుండా రాజాజీ అడ్డుపడుతున్నారని వున్న అపవాదును తొలగించుకోవడానికి తాను ఏమి రాసింది, బయటపెట్టవచ్చు గదా! త్వరలోనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలను తీసుకోవచ్చును కదా!

**సభా నాయకుడు శ్రీ ఎన్.గోపాలస్వామి:-** అయ్యా నేను జోక్యం కల్పించుకోవడానికి అనుమతివ్వండి. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి రాజగోపాలాచారి నిజంగానే వ్యతిరేకమనే నిందను గౌరవనీయుడైన సభ్యుడు వేయవచ్చునా!

**సుందరయ్య:** ఏది ఏమైనా ఆయనపై అనుమానం వుంది. ఆ అనుమానాన్ని ఎందుకు కొనసాగనివ్వాలి?

**ఎన్.గోపాలస్వామి:** మీరు ప్రతివారినీ అనుమానించితే మేము చేసేదేమీ లేదు. నాకు యదార్థ విషయం కావాలి.

**సుందరయ్య :** ఇంక ఆ విషయాల్లోకి నేను వెళ్లదలచలేదు. అసలు విషయానికే వస్తాను. ఏకాభిప్రాయం వుంటే ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును గురించి ఆలోచించుతామని ప్రధానమంత్రి కూడా అంటున్నారు. ఇది బ్రిటిష్ సామ్రాజ్యవాదులు చెప్పిన సాకును పోలివుంది. మీరు ముందు అంతా ఐక్యం కండి. ఆ తరువాత స్వతంత్రం కావాలని అడగండి అని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అనడం మన ఎరుగుదుం. అనైక్యతను సృష్టించేవారు ప్రభుత్వంలోనే వుండగా ఏకాభిప్రాయం ఎలా వుండగలదు?

ఉదాహరణకు ఆంధ్ర ప్రాంతాన్ని ఆంధ్ర-రాయలసీమగా పరిపాలనా వ్యవహారాలన్నింటా వేరుగా చూపించవలసిన అవసరం మద్రాసు ప్రభుత్వానికి ఎందుకు ఏర్పడినట్లు? విద్యా మంత్రిత్వ శాఖను అలాగే విభజించారు. ఈ విధంగా విభజించుతూ ఏకాభిప్రాయం వుండాలంటే అది ఎలా సాధ్యం కాగలదు? మద్రాసు నగరాన్ని ఒక వివాదాస్పదమైన సమస్యగా ముందుకు తెచ్చారు. ఈ సమస్యపైన మా పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ గత 15 ఏండ్లుగా ఒక వైఖరిని తీసుకొన్నది. వున్న యధార్థ పరిస్థితులను బట్టి మద్రాసు నగరంలో అత్యధిక సంఖ్యలో వున్నవారు తమిళులు. వారు తమిళభాషను మాట్లాడతారు. మనం చరిత్రలోకి వెళ్లడం లేదు. మద్రాసు నగరం ఎలా ఏర్పడిందీ ఎలా అభివృద్ధి చెందినదనే వివరాలకు మేము పోదలచలేదు. మేమీనాడు ఆంధ్ర సామ్రాజ్యాన్ని కోరడం లేదు. అలాంటివన్నీ కాలదోషం పట్టిన విషయాలు. ప్రస్తుత జనాభా పరిస్థితి ఏమిటి? ఏ భాషను మాట్లాడుతున్నారు అన్న విషయాలను ఆధారం చేసుకొని మాత్రమే మేము

రాష్ట్రాన్ని కోరుతున్నాం. ఆ రకమైన భాషా రాష్ట్ర దృష్ట్యా చూస్తే మద్రాసు రాష్ట్రం తమిళనాడుకు చెందాలి. ఆంధ్రలోని కొన్ని పార్టీలు, కొందరు వ్యక్తులు మద్రాసును కమీషనర్ రాష్ట్రంగా చేయాలని కోరుతూ వుంటే, దానిని బట్టే ఏకాభిప్రాయం లేదనే సాకును ఎందుకు చెప్పాలి? ఈ సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చేయలేకపోతే, అక్కడి ప్రజల్లో ప్లెబిసైట్ తీసుకొని నిర్ణయించవచ్చు కదా! పెద్ద నగరాలను కమిషనర్ రాష్ట్రాలుగా చేయాలన్న నినాదం అత్యంత అభివృద్ధి నిరోధకమైన ప్రతిపాదన, అది అప్రజాస్వామిక నినాదం. పెద్ద నగరాలను వాటికి సంబంధించిన ప్రాంతాల నుండి ఎందుకు విడదీయాలి? కృత్రిమ రాష్ట్రాలను ఎందుకు సృష్టించాలి? ఇది పూర్తిగా అభివృద్ధి నిరోధకమైన భావన. ఇందుకు మేము పూర్తిగా వ్యతిరేకం. అదే భాషను మాట్లాడే రాష్ట్రాలతోనే పెద్ద నగరాలు వుండాలి. పెద్ద నగరాలను వాటికి సంబంధించిన భాషా రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా కమిషనర్ రాష్ట్రాలుగా చేయాలన్న ప్రయత్నాన్ని మేము పూర్తిగా ఎదుర్కొంటాం.

ఇలాగే ఆంధ్రను విడదీస్తే దానికి ఆర్థిక స్థిరత్వం వుండబోదనే మరో వాదనను తెస్తున్నారు. 1949లో మద్రాసు శాసనసభ ఏర్పాటు చేసిన విభజన ఏమిటి ఒక కోటి రూపాయల వరకూ లోటు వుండగలదని తెలిపింది. కొద్దిపాటి సర్దుబాటుతో ఆ లోటును సరిచేసుకోవచ్చు.

ఇదిగాక మాకు రాజధాని ఎక్కడ అనేప్రశ్నలను లేవదీస్తున్నారు. రాజధానిని మీరు ఎక్కడ నిర్మించుకొంటారు? ఇలాంటి విషయాలను సాకుగా చూపుతున్నారు. 1949లో నాలుగు నెలలపాటు ఆంధ్ర రాజధానిని మద్రాసులో వుంచుకోవడానికి కూడా తమిళ నాయకులు అంగీకరించలేదు. ఆంధ్ర రాష్ట్రాన్ని నిరాకరించడానికి దానినొక సాకుగా చూపుతున్నారు.

ఇలాంటి సాకులన్నింటికీ పరిష్కారం కావాలంటే నేనొక్కటే చెప్పదలచాను. కృత్రిమంగా ఏర్పడిన రాష్ట్రాలన్నింటినీ రద్దు చేసి, భాషా ప్రయుక్త రాష్ట్రాలను దేశమంతటా ఏర్పరచండి. అప్పుడు ఆంధ్రకు హైదరాబాద్ రాజధాని కాగలదు. మలబార్‌ను కేరళతో కలపండి. అదొక రాష్ట్రం కాగలదు. హేతుబద్ధంగా ఆలోచించితే అన్నీ పరిష్కారం కాగలవు. ఇప్పటికే మైసూరు రాష్ట్రం ఏర్పడివుంది. దానికి హైదరాబాద్‌లోనూ, బొంబాయి రాష్ట్రంలోనూ వున్న కన్నడ ప్రాంతాలను కలపండి. ఈ విధంగా హేతుబద్ధంగా ఆలోచించి భాషా ప్రయుక్తంగా రాష్ట్రాలను ఏర్పరచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అనవసరమైన సాకులన్నింటినీ చూపుతోంది. మేము భాషా రాష్ట్రాలకు వ్యతిరేకం కాదని ప్రధానమంత్రి అంటే సరిపోదు. ఎంత త్వరగా ఏర్పాటు చేసి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తారనేదే మా ప్రశ్న. మీరు ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినంత మాత్రాన ఆంధ్రులు అంతటితో సంతృప్తిపడి వూరుకోరు. గౌరవనీయుడైన మా మిత్రుడు కోటంరాజు రామారావుగారు చెప్పినట్లుగా హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్ర



ఏర్పడకుండా ఏ శక్తీ వారిని ఆపలేదు. రామారావుగారు ఆశించినట్లుగా మూడు సంవత్సరాల లోపునే విశాలాంధ్ర ఏర్పడి తీరుతుంది.

**వి.కె.ధగే (హైదరాబాద్) :** ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ప్రధానమంత్రి అంగీకరించారు. అయితే ఏర్పడబోయే ఆంధ్ర రాష్ట్రానికి తమ ప్రాంతాన్ని కూడా కలపవలసిందిగా హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణా ప్రజల కోర్కెను ప్రధాన మంత్రి అంగీకరిస్తారా?

**జవహర్‌లాల్ నెహ్రూ :** లేదు. ఎంత మాత్రం అంగీకరించబోము.

**శ్రీ వి.కె.ధగేః** ఎందువలన?

సభలో కలవరం ఏర్పడటంతో డిప్యూటీ ఛైర్మన్ సర్దుబాటు చేశారు.

**సుందరయ్య:** ప్రభుత్వం ఉద్దేశ్యం ప్రకారం ఇప్పటి నుండి ఎంత కాలంలో ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తారు? ఒక సంవత్సరంలో చేస్తారా! అందుకు ఇప్పటినుండే అవసరమైన చర్యలు తీసుకుంటారా?

**జవహర్‌లాల్ నెహ్రూ:** చర్యలను నేను తీసుకునే సమస్య లేదు. రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సు ఏర్పాటు చేయవలసిందిగా గౌరవనీయుడైన సభ్యుడు సూచించారు. కాని రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ వల్లనే పని జరుగుతుందని నేను అనుకోవడం లేదు. ఏమి చేయాలన్న విషయంపై నేను ఉత్తర ప్రత్యుత్తరాలను కొనసాగించుతున్నాను. అందుకు రంగం సిద్ధం చేయడానికి అదొక్కటే మార్గం. దానిపై బహిరంగ ప్రకటనలు చేయడం వలన ఉపయోగం లేదు.

**హెచ్.డి.రాజాః** మీరు జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలను సభ వారికి సమర్పించుతారా?

**నెహ్రూ :** పని ఎలా జరగాలన్న విషయమై గౌరవనీయుడైన సభ్యునికి విచిత్రమైన అభిప్రాయాలు వున్నట్లు ఉంది.

**సి.జి.కె.రెడ్డిః** 1949లో రాయలసీమ నుండి ఒక ప్రతినిధి వర్గం ప్రధానమంత్రిని కలుసుకొన్నదని చెప్పారు. ఆ ప్రతినిధి వర్గంలో ఉన్న వారి అర్హతలేమిటో తెలుపుతారా?

**నెహ్రూః** రాయలసీమను గురించి ఇప్పుడు నేను లేవదీయదలచలేదు. 1949లోనే కాదు. 1952 మేలో కూడా వారు మాట్లాడారు.

**సుందరయ్యః** ఇంతకీ ఆంధ్ర రాష్ట్రం ఎప్పుడు ఏర్పడుతుంది? ఒక సంవత్సరంలోనా లేక ఎన్ని సంవత్సరాల్లో?

**నెహ్రూః** నేనేమీ చెప్పజాలను.

# కేంద్ర మంత్రులకు జీతాలు, ఇతర అలవెన్సులపై

## (1952 ఆగస్టు 5)

**మం**త్రులకు, డిప్యూటీ మంత్రులకు ఈ బిల్లులో సూచించబడిన జీతాల స్కేళ్ళకు మేము ఆమోదించజాలం. ఈ జీతాలను సమర్థించుతూ సభా నాయకుడు చాలా వాదనలను తెచ్చారు. మంత్రులు ప్రజాహిత చర్యలకు బాధ్యతవహించుతున్నారనీ; వారికి అందువలన ఎలాంటి ఇబ్బందులు వుండరాదనేది ఆ వాదనల్లో ప్రధానమైంది. చక్కటి ప్రమాణం గల జీవనం కలిగి వుండటానికి వారికి తగిన డబ్బు వుండాలన్నారు. ఆ సూత్రంతో నాకు ఎలాంటి అభిప్రాయభేదం లేదు. ఈ జీతాల స్కేళ్ళు సబబుగా ఉన్నాయా లేదా అన్న సమస్యను మన దేశంలో నేడున్న జీవన ప్రమాణాలను దృష్టిలో వుంచుకొని పరిశీలించవలసి వుంటుంది. మనదేశం కంటే ధనిక దేశాలతో పోల్చి చూస్తే నెలకు 2,250 రూపాయల జీతంతోపాటు ఇతర అలవెన్సులు సమకూర్చబడుతున్న తదితర సౌకర్యాలు, ఉచితంగా అన్ని సదుపాయాలు గల గృహ వసతి, ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించటం తక్కువగానే కనిపించవచ్చు. బ్రిటిష్ వారు పరిపాలించిన కాలంలో వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్‌కు ఏడాదికి 80 వేల రూపాయలు జీతం ఇస్తూ వుండేవారు. దానితో పోల్చి చూస్తే నెలకు 2,250 రూపాయలు చాలా తక్కువగదా అని మంత్రి నచ్చజెప్ప చూస్తున్నారు. బ్రిటిష్ వారి కాలంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ల జీతాలతో నేడు మనం పోల్చి చూసుకోవడం సరికాదు. ఎందుకంటే వారు మన ప్రజలను దోచుకోవడానికే ఇక్కడ పరిపాలన సాగించారు. కనుక ఇప్పుడు మన దేశంలో వున్న జీవన ప్రమాణాన్ని దృష్టిలోకి తీసుకుని మంత్రులకు ఇస్తున్న ఈ జీతాలు, ఇతర అలవెన్సులు కల్పించుతున్న ఇతర సౌకర్యాలు సమర్థనీయమా లేదా అని మనం ఆలోచించవలసి వుంటుంది.

ఇప్పుడు నెలకు ఇచ్చే 2250 రూపాయలతోపాటు 500 అలవెన్సులు, ఉచితంగా అన్ని సదుపాయాలు కలిగిన గృహ వసతి, ఉచిత వైద్య సౌకర్యాలు ఇవన్నీ డబ్బు రూపేణా చూస్తే 4000 రూపాయలకుపైగా అవుతుంది. కనుక మన దేశంలో నేడున్న జీవన ప్రమాణాలతో పోల్చి చూస్తే నెలకు 4000 రూపాయలు చాలా ఎక్కువే అని భావించవచ్చు. మామూలు వ్యక్తికి వచ్చే ఆదాయం కంటే ఇది 20 రెట్లు హెచ్చు. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే బంట్రోతు జీతం, ఇతర అలవెన్సులు కలిపి నెలకు 75 రూపాయలు వుంది. ఈ విధంగా మామూలు బంట్రోతు కంటే మంత్రికి 50 రెట్లు ఎక్కువ జీతం వస్తుంది. మూడో డివిజన్ గుమస్తాకు 55 రూపాయలు జీతం. మరో 55 రూపాయల కరువు భత్యం, మరికొన్ని అలవెన్సులు కలిపి మొత్తం 130 రూపాయలు వస్తుంది.

మంత్రిగారు తెచ్చిన మరో వాదన ఏమిటంటే ఇక్కడ మంత్రి పదవుల్లో అత్యధికులు ఢిల్లీకి వెలుపల నుండే వస్తారు. కాబట్టి వారు రెండు కాపురాలను భరించవలసి వస్తుంది.



వారి పిల్లలకు చదువులు చెప్పించాలి. వారి కుమార్తెలకు పెండ్లిండ్లు చేయాలి. మరి ఇలాంటి బాధ్యతలు మంత్రులకు మాత్రమే ఉంటాయా? గుమస్తాలకు, ఇతర సాధారణ ప్రజలకు మాత్రం వారి పిల్లలకు చదువులు చెప్పించుకోవడం, వగైరాలు వుండవా? ఇందుకోసం ఇతరులకంటే 200 రెట్లు జీతనాతాలు మంత్రులకు చెల్లించడం న్యాయబద్ధం కాగలదా? ఇలాంటి వాదన మంత్రి తీసుకొని రాకుండా వుంటే బాగుండేది. ఇంక ఇంటి అలవెన్సుల సంగతి. నాకు అందిన సమాచారాన్ని బట్టి గృహ వసతి కాకుండా ఇంకా వెయిటింగ్ లిస్టులో 50 వేల వరకూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. తమ ఉద్యోగులకే గృహ వసతి కల్పించలేని కేంద్ర ప్రభుత్వం అన్ని ఆధునిక వసతులు గల గృహాలను మంత్రులకు కేటాయించడం ఏమి ధర్మం! నాలుగు గదులు కంటే ఎక్కువ వసతి గల గృహం మంత్రికి అవసరం లేదని నా అభిప్రాయం. ఆయన నివసించడానికి అధ్యయనానికి అది సరిపోతుంది.

మంత్రులకు వైద్య సహాయం కల్పించవలసిందే. మంత్రులకే కాదు ప్రభుత్వంలో పనిచేసే ఉద్యోగులందరికీ మొత్తం జనాభాకు ఇప్పుడే కాకపోయినా ఆ తరువాత అయినా వైద్య సౌకర్యాల్ని కల్పించడం అవసరం. అవన్నీ అలా వుంచండి. సభా నాయకునిగా బ్రిటిష్ పరిపాలనా కాలం నాటి జీతాలతో పోల్చి, మన మంత్రుల జీతాలు ఎంత తక్కువగా వున్నాయో పోల్చి చెప్పారు.

అంతెందుకు ఇటీవలనే మన పొరుగుదేశమైన చైనాకు మన ప్రభుత్వంచే పంపించబడిన సుహృద్భావ ప్రతినిధి వర్గాలు అక్కడ వున్న పరిస్థితులను గురించి మనకు తెలిపాయి. అక్కడ మంత్రులకు మన డబ్బుతో మార్చి చూస్తే నెలకు 500 రూపాయల జీతం వస్తుంది. చైనా ప్రభుత్వంలో అందరికంటే తక్కువ ఉద్యోగికి వంద రూపాయలు వస్తుంది. చైనా ప్రభుత్వ నాయకులు, వారి ఉద్యోగులు ఈపాటి జీతాలతో సమర్థవంతంగా పరిపాలనా బాధ్యతలను నిర్వర్తించుతూ వుండగా మనం ఆ విధంగా వ్యవహరించలేమా? అక్కడ జీతాల వ్యత్యాసం నిష్పత్తి 1-5గా వుంటే ఇక్కడ మన దేశంలో 40-50 రెట్లుగా వుంది. నేను ఇస్తున్న ఈ వివరాలను మంత్రులు వింటున్నట్లు లేదు.

**ఛైర్మన్‌ః** గౌరవనీయుడైన సభ్యుడు చెబుతున్న విషయాలను మంత్రులు వినాలి.

**సుందరయ్య:** చైనా ఉదాహరణ మన ముందున్నది. అక్కడ తక్కువ ఉద్యోగికి అత్యంత హెచ్చు జీతం ఉన్న వానికి మధ్య అయిదు రెట్లు తేడా మాత్రమే వుంది. కనుక మా పార్టీ ప్రతిపాదించిన సవరణలు మీ ముందున్నాయి. మంత్రికి వెయ్యి రూపాయలూ, డిప్యూటీ మంత్రికి 750 రూపాయలు, అందరికీ మూడు నాలుగు గదులుగల అన్ని వసతులుగల గృహ సదుపాయం వుంటే సరిపోతుంది. ఈ సవరణలను ప్రభుత్వం ఆమోదించితే మంత్రులు ఇతరులకు ఆదర్శవంతులవుతారు.

# ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంపై

## (1952 ఆగస్టు 8)

(1950 సంవత్సరపు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని సవరించుతూ ఒక బిల్లు లోక్‌సభలో ఆమోదించబడింది. దాన్ని రాజ్యసభ ఆమోదానికి ప్రవేశపెట్టిన సందర్భంగా చేసిన ప్రసంగం)

అసలు ఈ బిల్లును ప్రవేశపెట్టడంపైనే నా వ్యతిరేకతను వెల్లడించుతున్నాను. ఈ చట్టంపట్ల లక్షలాది ప్రజలకు గల వ్యతిరేకతను, ఆగ్రహాన్ని నేను సరిగ్గా వ్యక్తం చేయగలనో లేదో తెలియదు. ఇది విషపూరితమైన ప్రజా వ్యతిరేక నిరంకుశ చట్టం. ఈ చట్టానికి తేనెపూసి మనలను ఒప్పించడానికి, దాన్ని మనచేత మ్రింగించడానికి హోమ్ మంత్రి ప్రయత్నించుతున్నారు. ఈ పంచదార పూతలు మనలను మోసగించజాలవు. నిజానికి ఆయనకే దానిపై నమ్మకం లేదు. అందుకనే ఆ చట్టాన్ని మెరుగుపరచడానికి ఈ సవరణ బిల్లును తెచ్చామని చెప్పారు. లోక్‌సభలో నా సహచరుడు కామ్రేడ్ ఎ.కె.గోపాలన్ ప్రసంగిస్తూ ఈ బిల్లు ద్వారా ప్రభుత్వం ప్రజలపై యుద్ధాన్ని ప్రకటించిందని అన్నారు. అందుకు ప్రధానమంత్రి, ఆ సభలో కాంగ్రెసు సభ్యుల ఆగ్రహాన్ని వెల్లడించారు. గోపాలన్ అలా మాట్లాడటం సరికాదని పత్రికలు కూడా అభిప్రాయపడ్డాయి. ఈ సభలో ప్రవేశపెట్టిన బిల్లు ప్రజలపై యుద్ధం ప్రకటించడం కంటే మరేమిటని నేను ప్రశ్నించుతున్నాను. గత అయిదేండ్లుగా ప్రభుత్వం ప్రజలపై సాగించుతున్న యుద్ధానికి ఇది కొనసాగింపే. కాంగ్రెస్ రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం ద్వారానూ, మిలటరీ పరిపాలన ద్వారానూ ప్రజలపై సాగించుతున్న యుద్ధాన్ని అనేక ఉదాహరణలతో, యదార్థమైన ఘటనలతోనూ నేను రుజువు చేస్తాను. ముందుగా 1947 జనవరి మాసాన్ని తీసుకొంటాను. మా ఆఫీసుల్లో మేము పని చేసుకొంటున్నాం. అకస్మాత్తుగా మద్రాసు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సలహా సంప్రదింపులతో పబ్లిక్ సేఫ్టీ ఆర్డినెన్స్‌ను జారీచేసి, కమ్యూనిస్టులందరినీ 'ట్రేడ్' యూనియన్, కిసాన్ ఉద్యమాలకు చెందిన నాయకులందరినీ మూకుమ్మడిగా అరెస్టు చేసి బందిఖానాల్లో పడవేసింది.

మేము ఎలాంటి చట్ట విరుద్ధమైన చర్యల్లోను పాల్గొనలేదు. మేము ప్రజలలో, కార్మిక కర్షకులలో పనిచేస్తూ, వారి కష్టాలను గురించి ప్రభుత్వానికి తెలియజేస్తూ, వారి న్యాయమైన కోర్కెల కోసం సాగే పోరాటాలకు నాయకత్వం వహించుతున్నాం. వారి న్యాయమైన డిమాండ్లను అంగీకరించడానికి బదులుగా పబ్లిక్ సేఫ్టీ ఆర్డినెన్స్ జారీ చేసి, వారికి నాయకత్వం వహించే



వారందరినీ అక్రమంగా అరెస్టు చేసి జైళ్ళలో బంధించారు. ఈ విధంగా ప్రజల కోసం పనిచేసే నాయకులను నిర్బంధించి, తమ దుష్పరిపాలనను నిరాటంకంగా కొనసాగించదలచారు. మరో ఉదాహరణను ఇస్తాను. కృష్ణా జిల్లాలో గాజుల్లంక అనే గ్రామం వుంది. అక్కడ చల్లపల్లి రాజాకు 17000 ఎకరాల భూమి వుంది. అవన్నీ ప్రజల నుండి ఆక్రమించినవే. అక్కడ లొంగిపోవడానికి రైతాంగం నిరాకరించగా ఉభయుల మధ్య పోరాటం సాగుతున్నది. ఆ పోరాటాన్ని అణచివేయడానికి ఈ చట్టాలను వినియోగించుతున్నారు. వారిని బెదిరించడానికి, జమీందారుకు లొంగిపోయేటట్లు చేయడానికి కాల్పులు జరిపారు. ఆ విధంగా గాజుల్లంకలో ఒక స్త్రీతో సహా అనేక మందిని కాల్చి చంపివేశారు. మునగాల విషయంలో కూడా ఇదే విధంగా జరిగింది. మునగాల జమీందారుకు 3000 ఎకరాలు ఉన్నాయి. ఆయనకు 300 గ్రామాలు కూడా వున్నాయి. ఆ భూములన్నింటినీ రైతాంగం నుండి ఆక్రమించుకొన్నవే. అధికారానికి రాక ముందు కాంగ్రెస్ వారు కూడా ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని చెప్పినవారే. ఆ విధంగా జమీందారుకు రైతులకు మధ్య ఒక ఒడంబడిక జరిగింది కూడా. అది అమలు జరక్కపోవడంతో రైతాంగం తీవ్ర దుస్థితిలో పడింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆర్డినెన్స్‌ను జారీ చేసి, నాయకులందరినీ అరెస్టు చేసింది. అలాగే బుచ్చంపేటలో కోయ ప్రజలున్నారు. వారి భూములన్నింటినీ జమీందారు ఆక్రమించాడు. మా భూములను మాకివ్వాలని కోయ ప్రజలు పట్టుబట్టారు. దీనితో ప్రభుత్వం పోలీసులను పంపి కోయ ప్రజలపై కాల్పులు జరిపించింది. నాకు జ్ఞాపకం వున్నంతవరకూ ఆ కాల్పుల్లో అక్కడికక్కడే అయిదుగురు చనిపోయారు. ఈ విధంగా వరుసగా కాంగ్రెస్ పాలకుల అత్యాచారాలను గురించి అనేక ఉదాహరణలను ఇవ్వగలను. ఒక్క ఆంధ్రాలోనే కాదు, మలబార్‌లో– మొత్తం మద్రాసు రాష్ట్రంలో ఇలాంటి అనేక ఉదంతాలు ఉన్నాయి. నాకు తెలుసు. అరెస్టు చేయబడిన మలబార్ రైతు నాయకులు. అక్కడ రైతాంగం చెప్పిందల్లా మా వద్ద కౌలు చెల్లించేందుకు డబ్బు లేదు. మేము ధాన్యాన్ని సహకార సంఘాలకు అమ్మి, అవి ఆ తరువాత వచ్చిన డబ్బును భూస్వాములకు చెల్లించుతామన్నారు. వారు చేసిన పాపం ఇది.

**ఒక సభ్యుడు:** ఆయనను మాట్లాడనీయండి. అడ్డుపడవద్దు.

**సుందరయ్య:** వారు చెప్పిందల్లా భూస్వాములకు ధాన్యం ఇవ్వబోమని మాత్రమే. వారు చౌక ధరలకు తీసుకొని ఆ తరువాత హెచ్చు ధరలకు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకొంటారు. కనుకనే వారు సహకార సంఘాలకు తమ ధాన్యాన్ని ఇచ్చి ప్రభుత్వం ప్రకటించిన రేట్ల ప్రకారం డబ్బు తీసుకొని జమీందార్లకు శిస్తు వగైరాలను చెల్లించుతామన్నారు. ఈ మాత్రానికే వారిపై నిర్బంధ విధానాన్ని ప్రవేశపెట్టారు. పబ్లిక్ సేఫ్టీ ఆర్డినెన్స్ ద్వారా వారిని అణచివేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంది.

1947లో సమ్మెలు జరిగాయి. దక్షిణ భారత రైల్వేలో కూడా సమ్మె జరిగింది. కార్మికులకు సమ్మె చేసే హక్కు ఉంది. అనేకసార్లు విన్నపాలు పంపినా వారి కష్టాలు తీర్చకపోగా కనీసం సానుభూతిని కూడా వెల్లడించనప్పుడు కార్మికులు సమ్మె చేయక ఇంకా ఏమి చేయాలి? ఈ మాత్రానికే ప్రభుత్వం పోలీసులచే అమానుషంగా కాల్పులను జరిపించి గోల్డెన్ రాక్‌లో అయిదుగురిని అక్కడికక్కడే తన పొట్టన పెట్టుకుంది. రైల్వే కార్మికుల సంఘ కార్యాలయాన్ని పూర్తిగా ధ్వంసం చేసేలా ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఇదీ.

ఆ తరువాత 1947 మౌంట్‌బాటన్ అవార్డు వచ్చింది. దానితో మొత్తం మీద దేశంలోనే జాతీయ స్వాతంత్ర్యం రావడానికి ఇదొక చర్యగా భావించబడింది. మేము కూడా అలా భావించిన వారమే. ప్రభుత్వం అలాంటి అభిప్రాయాన్ని వ్యాపింపజేయడమేగాక జైళ్ళల్లో వున్న టిడెన్యూలను విడుదల చేయడానికి ఆర్డర్లను జారీ చేసింది. కాని మళ్ళీ జనవరి 1వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం మరొకసారి మద్రాసు రాష్ట్రం మంతటా ప్రజాతంత్ర శక్తులపై దాడి చేసింది. 1948 జనవరి 31వ తేదీ ఆంధ్రాలో ప్రారంభమైన ఈ దాడి వరుసగా ఒక్కొక్క రాష్ట్రంలో 1948 మార్చిలో కమ్యూనిస్టులపై దాడిచేసి, వారిని అరెస్టు చేయడం జరిగింది. ఆ కాలంలో ప్రజలను రెచ్చగొట్టే తీవ్రమైన ప్రసంగాలుగాని దౌర్జన్యపూరితమైన చర్యలుగాని లేనేలేవు. అంతేకాదు కార్మిక-కర్షక పోరాటాలు కూడా లేవు. జరిగినదేమంటే కమ్యూనిస్టు పార్టీ మహాసభ కలకత్తాలో జరిగింది. ఆ మహాసభలో మౌంట్‌బాటన్ అవార్డు వలన మన దేశానికి స్వాతంత్ర్యం రాలేదని, అది బ్రిటిష్ వారి ప్రయోజనాలనూ, మహారాజుల, జమీందార్ల, భూస్వాముల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను రక్షించేందుకు కాంగ్రెసుకు, బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు మధ్య జరిగిన ఒడంబడిక మాత్రమేనని ఆ మహాసభలో మా పార్టీ అభిప్రాయపడింది. ఆగస్టు స్వాతంత్ర్యం అన్న పేరుతో ప్రకటించబడిన ఈ మౌంట్‌బాటన్ అవార్డు నిజస్వరూపాన్ని మేము ప్రజలకు చెప్పదలచాం. ఈ కారణంగానే ప్రభుత్వం మాపై విరుచుకుపడింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో మా పార్టీ నాయకులను, కార్మిక, కర్షక ఉద్యమాల నాయకులను విచ్చలవిడిగా అరెస్టు చేసి జైళ్లలో కుక్కారు. ఇంత జరిగినా మాలో చాలా మంది బయటనే వున్నారు అని మంత్రి చెపుతున్నారు. కాని మేము అరెస్టులను తప్పించుకొని అజ్ఞాతవాసంలోకి వెళ్ళాం. ప్రజలకు సేవ చేసేందుకు మేము రహస్య జీవితాన్ని గడిపినందుకు గర్వపడుతున్నాం. ప్రజల కోసం సంవత్సరాల తరబడి అనేక కష్టాలకు, నష్టాలకు ఓర్చి అజ్ఞాతవాసంలో వుండి ప్రజలకు సేవ చేయవలసి వచ్చింది. ఈ తీవ్ర నిర్బంధకాండ 1948 నుండి 1951 వరకూ కొనసాగింది. మా కార్యకలాపాలను పరిమితం చేస్తుందనే ఉద్దేశ్యంతోనే మేము ప్రివెంటివ్ డెటెన్షన్ చట్టాన్ని వ్యతిరేకించుతున్నామని చాలా మంది అనుకొంటున్నారు. అది అర్ధ సత్యం మాత్రమే. డిటెన్షన్ చట్టం మాకు ఆటంకాలను



కల్పించుతుందనే ఉద్దేశ్యంతోనే గాక, అది ప్రజల ప్రజాతంత్ర ఉద్యమాలను మన దేశంలో అణచివేస్తుందనే ఉద్దేశ్యంతోనే మేము ప్రధానంగా దాన్ని వ్యతిరేకించుతున్నాం.

ప్రభుత్వం కేవలం ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం మీదనే ఆధారపడటం లేదని మా అనుభవం చెపుతున్నది. దానికి మిలిటరీ వుంది; పోలీసు బలగమూ వుంది. ప్రజలను దయాదాక్షిణ్యం లేకుండా కాల్చివేయడానికి, గ్రామాలకు గ్రామాలను ధ్వంసం చేయడానికి వీటిని ప్రభుత్వం దారుణంగా ఉపయోగించిన ఉదాహరణలున్నాయి. వీటన్నింటినీ సభ వారి దృష్టికి తీసుకొని రావడంలో నా ఉద్దేశ్యమేమంటే, ప్రజలను, ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి ఒక్క ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్నేగాక, తమ న్యాయ సూత్రాలనే త్రోసిపుచ్చి తనకు అపారంగా ఉన్న మిలిటరీని కూడా ఉపయోగించుతున్నదని చెప్పడానికే. కనుకనే ఈ ప్రభుత్వానికి విచారణ లేకుండా వ్యక్తులను డిటెయిన్ చేసే అధికారాలనివ్వరాదు. ఈ ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు అనుకూలంగా ఉన్నది గాబట్టి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నుండి మన దేశాన్ని బ్రిటిష్ కామన్‌వెల్తులో వుంచుతున్నది. బడాగుత్త పెట్టుబడిదారులకు, భూస్వాములకు ప్రాతినిధ్యం వహించే ఈ ప్రభుత్వానికి నిర్బంధశాసనాలను అమలు జరిపే అధికారాలను ఇవ్వరాదు. బెంగాల్‌లో, కేరళలో తమిళనాడులో, ఉత్తరప్రదేశ్‌లో, ఇలా అన్ని రాష్ట్రాల్లోనూ ప్రజల హక్కులను అణచివేయడానికి డిటెన్షన్ చట్టమే కాదు, పోలీసులను, మిలటరీని ఈ ప్రభుత్వం వినియోగించుతున్నది. అందువలన వివరాల్లోకి నేను వెళ్లడం లేదు. మేము ప్రసంగించడానికి అవకాశం వచ్చినప్పుడు వివిధ రాష్ట్రాలకు చెందిన మా సహచరులు వివరాలను తెలుపగలరు. ఆ రాష్ట్రాల పరిస్థితిని చెప్పడానికి వారే అర్హులు. అందువలన నాకు బాగా పరిచయం గల మద్రాసు, హైద్రాబాద్ రాష్ట్రాల్లోని తెలుగు భాషా ప్రాంతాలకే నేను పరిమితమవుతాను. మేము దౌర్జన్య చర్యలను జరుపుతామని హత్యలు చేస్తామని, దోపిడీలు చేస్తామని కాంగ్రెసు సభ్యులు, మంత్రులు మా మీద అదే పనిగా నిందా ప్రచారాన్ని సాగించుతూ వుంటారు. హోంమంత్రి డాక్టర్ కట్జు ఇప్పుడే హైద్రాబాద్ ప్రత్యేక పరిస్థితుల్లో వుందని చెప్పారు. విశాలాంధ్ర ప్రాంతంలో వాస్తవంగా ఏమి జరిగిందో నేను వివరించుతాను.

**ఒక సభ్యుడుః** గౌరవనీయుడైన మంత్రి మీరు చెపుతున్నది వినడం లేదు.

**ఛైర్మన్ః** ప్రతిపక్ష నాయకుడి ప్రసంగాన్ని మంత్రి సరిగా విన్నప్పుడే ఆయన ఆ తరువాత సమాధానం చెప్పగలుగుతారనేది సభ్యుని భావం. సుందరయ్యగారూ మీరు కూడా క్లుప్తంగా చెప్పండి.

**సుందరయ్యః** జరిగిన ఘోరాలన్నింటినీ ఈ సభ వారి దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తీసుకొనివస్తే ఇక ముందు అలాంటివి జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశం

ఉంటుంది. ఒక్క విశాలాంధ్ర ప్రాంతంలో జరిగిన ఘోరాలను 4 వేల వరకూ నేను ఉదహరించగలను. కాని మంత్రులు వాస్తవాన్ని తెలుసుకొనేందుకు కొన్ని ఘటనలను మాత్రమే తెలుపుతాను. ఇతర ఉదాహరణలకు ముందు ఉత్తరప్రదేశ్‌లోనే తీసుకుందాం. మా నాయకుల్లో ఒకరైన కామ్రేడ్ భరద్వాజ్ 1943 నుండి 47 వరకూ క్షయ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన శానిటోరియంలో, ఆ తరువాత డెహ్రాడూన్‌లోనూ వున్నారు. ఆయన 104 డిగ్రీల జ్వరంతో వున్నారు. 1948 మార్చి, ఏప్రిల్ మాసాల్లో పోలీసులు అకస్మాత్తుగా ఆయన వుంటున్న ఇంటిలో ప్రవేశించి, తీవ్ర జ్వరంతో వున్న ఆయనను మంచం మీద నుండి బయటకు లాగి జైలులో డిటెయిన్ చేశారు. ఆ తరువాత కొద్ది రోజులకే ఆయన మరణించారు. మా మరో నాయకుడు కామ్రేడ్ డాంగే బొంబాయిలో శాసనసభ సమావేశానికి వెడుతుండగా అరెస్టు చేసి డిటెన్షన్‌కు పంపించారు. ఈ రెండు ఉదాహరణల అనంతరం విశాలాంధ్రకు వస్తాను. మేము దౌర్జన్యకారులమనీ, అదే మా వృత్తి అనీ, అందువల్లనే మమ్ములను డిటెయిన్ చేస్తున్నామని ప్రభుత్వం మాపై నిందారోపణ చేస్తున్నది. గత నాలుగు సంవత్సరాలుగా ఆంధ్రలో తాము జరుపుతున్న నిర్బంధకాండను సమర్థించుకుంటూ ఈ డిటెన్షన్ చట్టాన్ని అమలు జరుపుతున్నామని అంటున్నారు. మేము దౌర్జన్యకారులం కాదు. మేము శాంతిని కోరేవారం. శాంతిగా జీవించాలని వాంఛించుతున్నాం. కాని అక్కడ దౌర్జన్య చర్యలకు హింసాకాండకు పెట్టుబడిదారులు, భూస్వాములు, దొంగవ్యాపారులు– వారికి అండగా వుండే ఈ ప్రభుత్వానిదే బాధ్యత. తమ దోపిడీని, పీడనను సాగించుకునేందుకు వారు హింసాత్మక చర్యలకు పాల్పడుతూ వుంటే విధిలేక ప్రజలు తిరుగుబాటు చేయవలసి వస్తోంది. కనుక నిందను మాపై వేసి ప్రయోజనం లేదు.

బెజవాడలోనే 1948 మే మాసంలో పోలీసులు చూస్తూ ఉండగానే కాంగ్రెసు వారు తమ గూండాలతో దాడిచేసి ఇద్దరు కమ్యూనిస్టు కార్యకర్తలను మరుపిళ్ళ అప్పారావు, సన్యాసి కనకయ్యగార్లను చంపి వేశారు. కాని నిందితులను స్వేచ్ఛగా తిరగనిచ్చారు పోలీసులు.

అదే కాలంలో ఒక్క ఆంధ్రలోనే నాలుగు జిల్లాల్లో వెయ్యి గ్రామాలపై కాంగ్రెస్ పాలనలో ఫాసిస్టు మిలటరీ దాడి చేశారు. కేవలం వ్యవసాయ కార్మికులు తమ వేతనాలను పెంచాలన్న దానికే వాళ్ల నోళ్ళు నొక్కి వేయడానికి ఈ దాడులు చేశారు. తమకు రోజు పనికి 8 అణాలు, ఏడాదికి 15 బస్తాలు ధాన్యం చాలని ఒప్పుకొనేంత వరకూ పేదలను చితకబాదారు. ఆంధ్రాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఇదే. పదివేల మంది వరకూ అరెస్టు చేయబడి, పది, పదిహేను రోజుల వరకూ పోలీసు క్యాంపుల్లోనూ, సబ్ జైళ్ళలోనూ బంధించారు. చివరికి వారిపై ఎలాంటి ఆరోపణలు లేకుండా వదిలిపెట్టవలసి వచ్చింది. ఎలాంటి ఆరోపణలు లేకుండా పది వేల మంది వరకూ హింసించిన ఆఫీసర్లపై ప్రభుత్వం ఏమి చర్య తీసుకున్నదని ప్రశ్నించుతున్నాను.



**హోంమంత్రి డాక్టర్ కట్జూ:** ఏ సంవత్సరంలో అది జరిగింది?

**సుందరయ్య:** 1948లో

**ఒక సభ్యుడు:** ఎక్కడ?

**సుందరయ్య:** గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అనేక ఇండ్లను ధ్వంసం చేశారు. కమ్యూనిస్టులైనవారు తమ పొలాలను సాగు చేసుకోకుండా అడ్డుపడ్డారు. అనేక ఇండ్లపై దాడులు జరిపి, అక్కడున్న సామాగ్రిని ధ్వంసం చేయడమేగాక, బియ్యాన్ని, పప్పులను, పచ్చళ్లను కలిపివేసి, వాటిపై మూత్ర విసర్జన చేశారు. అంటే స్త్రీలపై బాధ్యతగల ఆఫీసర్లే అత్యాచారాలు జరిపిన అనేక ఉదాహరణలున్నాయి. మంగళాపురంలో ఒక పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ అనే ఆమెను దారుణంగా మానభంగం చేయగా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చినా చర్యను తీసుకోలేదు. రాజమండ్రిలో లక్ష్మారెడ్డి శ్రీనివాసరావు అనే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇలాంటి అత్యాచారాలకు పేరుమోశారు. స్త్రీలపై అత్యాచారాలు జరిపిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. అతని అమానుష చర్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చినా పట్టించుకొన్న వారు లేరు. థామస్ అనే మరో డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ వున్నాడు....

**క్వాజా ఇనాయత్ వుల్లా (బీహార్):** వారు ఎంత మందిని చంపివేశారు.

**సుందరయ్య:** మూడు వందల మందిని కాల్చి చంపివేశారు. వాళ్లంతా ఘర్షణల్లో చనిపోయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అది శుద్ధ అబద్ధం.

**జి.రాజగోపాలన్ (మద్రాసు):** మీతో విభేదించిన సాహసానికి గాను వారిని మీరు చంపారు.

**ఛైర్మన్:** ఆర్డర్, ఆర్డర్, గౌరవనీయుడైన సభ్యుని ప్రసంగానికి దయచేసి అడ్డుపడవలదు. మీరు మాట్లాడినప్పటికి కూడా ఎవరూ అడ్డుపడకుండా వుండాలికదా.

**సుందరయ్య:** ఇందుకు నేను అనేక ఉదాహరణలను ఇవ్వగలను. మా కామ్రేడ్ చింతపల్లి పాపారావును పళయప్పన్ సూరంపల్లి గ్రామంలో అరెస్టుచేసి, దారుణంగా కాల్చి చంపాడు. అలాగే రాజమండ్రిలో కామ్రేడ్ మృత్యుంజయుడని అరెస్టు చేసి, రెండు రోజులపాటు చిత్రహింసలకు గురిచేసి సారంగధర మెట్ట వద్దకు తీసుకొని వెళ్ళి కాల్చి చంపివేశారు. నేను చెప్పిన దానిని ఇక్కడున్న కాంగ్రెసు సభ్యుడు కొమ్మారెడ్డి సూర్యనారాయణగారు ధృవపరచగలరు. ఆ తరువాత....

**దివాన్‌ఛమన్‌లాల్ (పంజాబు):** అయ్యా, ఒక పాయింటు ఆఫ్ ఆర్డర్. ఈ ఘటనలన్నింటినీ ఇక్కడ ప్రస్తావించడం రాజ్యాంగరీత్యా సరైనదేనా అని నేను తెలుసుకోగోరుతున్నాను. ఇవన్నీ కూడా ఆయా రాష్ట్రాలకు సంబంధించినవి. ఇలాంటి రెండు

మూడు ఘటనలను గురించి హోంమంత్రి ఎందుకు ప్రస్తావించారో నాకు తెలియడం లేదు. ఆయన ఇక్కడ ప్రస్తావించి వుండవలసింది కాదు. అయినప్పటికీ ఈ సభకు అధికారంలేని వాటిని గురించి మనం ఇక్కడ ఎందుకు మాట్లాడాలి!

**భూపేష్ గుప్తా:** ఈ పాయింట్ ఆఫ్ ఆర్డర్‌లో అర్థం లేదు. అసలు ఈ బిల్లును తీసుకొని వచ్చిన కారణాలకు మేము ప్రశ్నించుచున్నాం. కనుక దానికి సంబంధించిన ఘటనలను సభ వారిదృష్టికి తీసుకొని రావడం అనివార్యం. గతంలో ఈ శాసనం ఏవిధంగా దుర్వినియోగ పరచబడిందో చూపడానికే సుందరయ్యగారు వాటిని పేర్కొంటున్నారు.

**డాక్టర్ కట్జూ:** ఎవరినైనా కాల్చి చంపడానికి ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టానికి సంబంధం ఏమిటి?

**సుందరయ్య:** కాని ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఏ శాసనం కింద వారిని కాల్చి చంపారో నాకు అర్థం కావడం లేదు. వారిని డిటెన్షన్‌లో బంధించడానికని పట్టుకొన్న తరువాత వారిని కాల్చి చంపివేశారు. అలా జరిగిన వాటినే ఇక్కడ నేను పేర్కొన్నాను.

**బి.బి.శర్మ( ఉత్తరప్రదేశ్):** ఎవరినీ కాల్చి చంపడానికి ఈ బిల్లులో అవకాశం లేదు.

**సుందరయ్య:** సెలెక్టు కమిటీలో వుండటానికి మేము అంగీకరించినపుడు అసలు ఈ శాసనాన్ని ఏ సూత్రంపై ప్రవేశపెట్టారో ప్రశ్నించే హక్కు మాకు కలదని చెప్పాను.

**ఛైర్మన్:** దానిని నేను కాదనను.

**సుందరయ్య:** ఇలాంటి ఘోరాలు జరిపిన ప్రభుత్వానికిగాని, ప్రభుత్వ అధికారులకుగాని అలాంటి అధికారాలను ఇవ్వరాదనేదే నా ఉద్దేశ్యం.

విద్యార్థి ఉద్యమ కార్యకర్త కాంచనరావు ఉదంతాన్ని ఈ సందర్భంగా నేను ఉదహరించదలచాను. పరీక్షా పత్రాలు రాసి కాలేజి నుండి ఇంటికి వస్తున్న ఆయనను పోలీసులు పట్టుకొని ఎక్కడికో తీసుకొని వెళ్ళి కాల్చి చంపివేశారు. ఆయనను ఏమి చేశారని పదే పదే ప్రభుత్వాన్ని అడిగినా ఆ యువకుడిని గురించి ప్రభుత్వం మాకు చెప్పనందునే కాల్చి చంపివేశారని భావించుతున్నాం.

ఈ సందర్భంగా మల్లిఖార్జున శర్మను గురించి కూడా చెబుతాను.

**ఛైర్మన్:** సుందరయ్యగారూ! ఇంక ఇలాంటి ఘటనలను గురించి వరుసగా మీరు చెప్పనవసరం లేదు.

**సుందరయ్య:** అత్యంత ఘోరమైన ఉదంతాలను గురించి మాత్రమే నేను చెపుతున్నాను.

**క్వాజా ఇనాయత్ వుల్లా:** అవన్నీ కథలేగాని జరిగిన ఘటనలు కాదు.



**సుందరయ్య:** మల్లిఖార్జున శర్మ నిజానికి పోలీసులకు లొంగిపోయాడు. అయినప్పటికీ ఆయనను చిత్రహింసలకు గురిచేసి చివరికి చంపివేశారు. ఆయన ఆత్మహత్య చేసుకొన్నట్లు పోలీసులు చెప్పారు.

**ఛైర్మన్:** ఏమి జరిగిందో మీకు ఎలా తెలుసు?

**సుందరయ్య:** నేను సంపూర్ణమైన బాధ్యతతో ఈ విషయాన్ని చెపుతున్నాను. ఈ సంఘటనపై దర్యాప్తు జరిపించితే, నేను చెప్పినదాన్ని రుజువు చేయగలను. నేను చెప్పినది నిజమేనని ఈ సభలో వున్న ఆంధ్రపత్రిక సంపాదకుడు శంభుప్రసాద్ గారికి తెలుసు.

ఆ తరువాత కందికొట్ల నాగభూషణంను యానాంలో అరెస్టు చేసి, ఆ తరువాత కాల్చి చంపివేశారు. ఆంధ్రలో జరిగిన ఘోరాలను ఎన్ని అయినా ఇలా చెప్పగలను.

ఇంతకీ ఇక్కడున్న ప్రధాన సమస్య ఏమంటే, ప్రభుత్వం చేతుల్లో వున్న ఈ అధికార దుర్వినియోగాన్ని ఎలా నివారించడమన్నదే. హోంమంత్రిగారు జిల్లా మేజిస్ట్రేట్‌ల సుగుణాలను గురించి వారి శక్తి సామర్థ్యాలను గురించి వారి నిష్పాక్షికతను గురించి పెద్దగా శ్లాఘించుతూ చెప్పారు. కాటూరు, యలమర్రు గ్రామాలను పోలీసులు చుట్టుముట్టి పురుషులందరి గుడ్డలను తొలగించి, నగ్నంగా వూరేగించి మహాత్మాగాంధీ విగ్రహం ముందు నిలబెట్టిన ఘోరం జరిగినప్పుడు అందుకు సంబంధించిన జిల్లా మేజిస్ట్రేట్ ఏమి చేశారని నేను ప్రశ్నించుతున్నాను. అయ్యా! కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఇది!

ఇంకా తెలంగాణాను గురించి మాట్లాడతాను. ఆ ప్రాంతానికి సంబంధించి ప్రభుత్వం మాపై ఎన్నో ఆరోపణలను చేసింది. తెలంగాణాలో మేము ఎన్నో హత్యలను చేశామనీ మరెన్నో అత్యాచారాలను జరిపించామనీ ఈ నాటికి మాపై నిందారోపణలను చేస్తూ, వాటిని ఎదుర్కొనేందుకు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం అవసరమని వాదించుతున్నారు. ఈ నాటికీ కమ్యూనిస్టుల వద్ద ఆయుధాలున్నాయనీ, వాటిని అప్పగించడానికి వారు సంసిద్ధంగా లేరనీ అంటున్నారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం మాటిమాటికీ చేస్తున్నది. తమ దుష్ట చట్టాన్ని సమర్థించుకొనేందుకే ప్రభుత్వం ఈ ఆరోపణలను తెస్తున్నది. అందువలన అసలు యదార్థమేమిటో చెప్పడం అవసరమని భావించుతున్నాను.

హత్యలకు, లూటీలకు కమ్యూనిస్టులు కారణమన్న విషయం పచ్చి అబద్ధమని, అవి కేవలం కట్టు కథలని నేను మొట్టమొదటనే స్పష్టం చేయదలచాను. 1946లో తెలంగాణాలోని జమీందార్లు లేదా దేశముఖులు ప్రజలను దోచుకుంటూ తెగబలిసి తమకెవరూ అడ్డులేరని ఆ యేడాది జూలైలో గూండాలతో మా ఆఫీసుపై దాడి చేయించారు. అందుకు దొడ్డి కొమరయ్య బలయ్యారు. అయినా పోలీసులు రైతుల సహాయం కోసం రాలేదు. ఆనాడు అక్కడ నైజాం ప్రభుత్వం వుంది. తెలంగాణా ప్రజలను అణచివేయడానికి అది పోలీసులను, రజాకార్లను పంపించింది. ఇంక ఆ పరిస్థితుల్లో తెలంగాణా ప్రజలు ఏమి చేయాలి. రజాకార్లు గ్రామాలపై

దాడులు చేసి వంద గ్రామాలకుపైగా తగులబెట్టారు. 2500 మంది కిసాన్, ఆంధ్ర మహాసభ కార్యకర్తలను చంపివేశారు. మూడు వేల మంది స్త్రీలను చెరచారు. ఇవన్నీ నైజాం నవాబు సైనికులు, రజాకార్లు జరిపిన ఘోరాలే.

**ఛైర్మన్:** సుందరయ్యగారూ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం అమల్లోకి వచ్చింది 1950లో

**సుందరయ్య:** అవును; తెలంగాణాలో జరిగిన సంఘటనలను సమర్థించుకోవడానికి ఈ చట్టాన్ని సమర్థించుకొంటున్నారు.

**ఛైర్మన్:** అంతకు ముందు దాన్ని గురించి కాదు, 1950 తరువాత వున్న చట్టాన్ని వాళ్ళు సమర్థించుతున్నారు.

**సుందరయ్య:** అలా అయితే, 1950 తరువాత జరిగిన సంఘటనలను గురించే మాట్లాడతాను. తెలంగాణా ప్రజలు ఆత్మ రక్షణ కోసం పోరాడవలసి వచ్చింది. ఈనాడు వారిలో రెండు వందల మందికి రజాకార్లపై పోరాడినందుకు శిక్షలు విధించారు. ఇంకా అంతకంటే హెచ్చు మందిని రజాకార్లను ఎదుర్కొన్న పాపానికి విచారణ లేకుండా డిటెన్షన్‌లో వుంచారు. అందుకు వారు ఏమి చెప్పినా, జరిగింది రజాకార్లను ఎదుర్కొన్నందుకే.

రజాకార్లను అణచివేయడానికన్న పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తన సైన్యాలను తెలంగాణాకు పంపించింది. కాని ఆచరణలో జరిగిందేమిటి? పారిపోయిన భూస్వాములను తిరిగి తీసుకొనివచ్చి, రైతుల నుండి భూములను లాక్కొని, వాటిని భూస్వాములకు అప్పగించారు. మొదట మూడు వారాలు లేదా మొదటి ఒకటి రెండు మాసాల వరకూ ఎలాంటి సంఘటనలు జరగలేదు. సైన్యంపైగానీ, జమీందార్లపైగాని రైతులు దాడి చేయలేదు. కాంగ్రెస్ సైన్యాలు భూస్వాములను, దేశముఖులను తిరిగి రప్పించి, వారితో అత్యాచారాలను సాగించిన తరువాతనే తిరిగి కల్లోల పరిస్థితి ప్రారంభమైంది. గత మూడు సంవత్సరాలుగా తెలంగాణాలో కాంగ్రెస్ వారు ఎంతటి బీభత్స చర్యలను జరిపారో అనేక ఉదాహరణలను ఇవ్వగలను. వారు 7000 గ్రామాలపై క్రూరంగా దాడులు చేశారు. 15 లక్షల మందిని చితకబాదారు. అనేక మందిని వివిధ రకాల చిత్రహింసలకు గురిచేశారు. 1500 మందికిపైగా మా కామ్రేడ్స్‌ను, కిసాన్ కార్యకర్తలను వారు తుపాకులతో కాల్చి చంపారు. రెండు లక్షల మంది గిరిజనులను అడవుల్లోని వారి నివాసాల నుండి బలవంతంగా తొలగించి అడవుల బయట పోలీసుల కాపలాతో కాన్సంట్రేషన్ క్యాంపుల్లో పెట్టారు. వారికి తినడానికి తిండిగాని, వుండటానికి, తలదాచుకోవడానికి కనీసం గుడిసెలైనా లేకపోయేటప్పటికీ పదివేల మందికిపైగా చనిపోయారు. జైళ్ళలో వున్న డిటెన్యూలను, తీసుకొని వెళ్ళి దారుణంగా కాల్చి చంపివేశారు. రంగాచారి, వెదిరి రాజీవరెడ్డి గార్ల కేసులున్నాయి. అన్ని కేసులకు మేము సుప్రీమ్ కోర్టుకు



వెళ్లలేము. కాని వారి కేసు మాత్రమే సుప్రీమ్‌కోర్టు ముందుకు వచ్చాము. వారి విషయమేమిటంటే ప్రభుత్వం చెప్పిన సమాధానమిది: మేము వారిని మిలిటరీకి అప్పజెప్పాం. వారు కస్టడీలో నుండి తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నించగా, వారిని మిలిటరీ కాల్చి చంపవలసి వచ్చింది అని సంజాయిషీ చెప్పారు. అలాగే రామచంద్రారెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి కేసులు కూడా వున్నాయి. వారిని అరెస్టు చేసి ఒకనెల రోజులపాటు టెన్షన్లో వుంచారు. వారి విడుదల విషయమై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయబడింది. ఇంతలోనే వారిని జైలు నుండి బయటకు తీసుకొని వెళ్లి కాల్చి చంపారు. అందుకు వారు చెప్పిన సాకు ఏమంటే, వారిని గెరిల్లాలే చంపివేశారని, ఆ తరువాత జగన్నాధాచారి కేసు కూడా వుంది. ఆయనను అరెస్టు చేసి కాల్చి చంపివేశారు. ఆ కేసు ఇప్పుడు సుప్రీమ్ కోర్టు ముందు వుంది. దానిపై నేనేమీ వ్యాఖ్యానించడం లేదు. ఇప్పటి వరకూ జరిగిన దానిని తెలుపుతున్నాను. ఆయన్ను కోర్టులో హాజరుపరచవలసిందిగా మద్రాసు హైకోర్టును హైద్రాబాద్ కోర్టును అనేకసార్లు కోరింది. తాము ఆయనను మద్రాసు ప్రభుత్వానికి అప్పజెప్పామని హైద్రాబాద్ ప్రభుత్వం చెపుతుంది. ఇవన్నీ విన్న తరువాత మొన్నీ మధ్య న్యాయమూర్తి మహాజన్ ఇలా వ్యాఖ్యానించారు : "నేను ఈ కథలనన్నింటినీ నమ్మను. ఆయనను మీరు అంతమొందించి వుంటారు. ఆయన్ను కోర్టులో హాజరుపరచండి లేదా నేను తీర్పు ఇచ్చి వేస్తాను. ఈ విషయంలో నేను నిస్సహాయుడిని." జరుగుతున్న విషయాలు ఇలా వున్నాయి. డిటెన్యూలను జైళ్ల నుండి బయటకు తీసుకొని వెళ్ళి ఈ విధంగా కాల్చి చంపివేస్తున్నారు. సుంకాల పద్మారెడ్డిని ఇప్పుడు లోక్‌సభ సభ్యుడుగా వున్న బద్దం ఎల్లారెడ్డిగారు ప్రత్యక్షంగా చూస్తున్నప్పుడే బయటకు తీసుకొని వెళ్ళి చంపివేశారు. ఇలాంటి అఘాయిత్యాలకు సంబంధించిన ఉదాహరణలను ఎన్ని అయినా నేను మీకు చెప్పగలను. మేము భటిండా వెళ్ళి గెరిల్లాలతో మాట్లాడి వస్తామని హోంమంత్రి అంటారు. గెరిల్లా అన్న పదమే వారికికంటగింపుగా వున్నట్లున్నది. ప్రజలను అణచివేసినప్పుడు, వారు సంఘటితపడి తమ గృహాలను, తమ స్త్రీల గౌరవాన్ని, తమ ప్రాణాలనే రక్షించుకొనేందుకు పోరాడి తీరుతారు. ఈ అత్యాచారాలనూ, దోపిడీని మీరు ఆపివేయకపోతే, తమను అణచివేసే వారికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడితీరుతారు. కనుక దాన్ని గురించి కంగారుపడవలసిన పనిలేదు. గెరిల్లా పదాన్ని వినగానే ఎందుకు కంగారు.

**డాక్టర్ కట్జూ(హోంమంత్రి):** 'గెరిల్లా' అనే పదాన్ని అక్కడ చేసిన ప్రసంగాల్లో వాడారు.

**సుందరయ్య:** హోంమంత్రిగారు ఆ పదం విని అలా కంగారు పడితే, ఆయన అడ్మిరల్ ఫ్లెచర్‌లా తయారయ్యే ప్రమాదం వుంది. అలా కాకూడదని నేను కోరుకొంటున్నాను.

**డాక్టర్ కట్జూ:** లేదు.

**ఛైర్మన్:** ఆయన ఆ మార్గంలో వెళ్లరులే.

**సుందరయ్య:** మేము రైళ్లపై విధ్వంసకాండను జరిపామని నిందించారు. సూళ్లూరుపేట సమీపంలో ఇటీవల రైలుపట్టాలు తప్పి జరిగిన ప్రమాదంలో 19 మంది చనిపోయారు. కమ్యూనిస్టు పార్టీ అలాంటి విధ్వంసక చర్యలకు ఎన్నడూ పూనుకొని వుండలేదు. ప్రభుత్వమే మనరైలు పట్టాలకు సరిపడని ఇంజన్లను కొని ఇందుకు కారకురాలవుతున్నది. ఇది మన ప్రభుత్వాల అసమర్థతకు తార్కాణం. ఆ రైలు 50-60 మైళ్ల వేగంతో వెడుతూ వుండగా ఈ ప్రమాదం జరిగింది.

**జి.రాజగోపాలన్:** ఇంజన్లు ఫిష్‌ప్లేట్లను తొలగించవు.

**సుందరయ్య:** అవును. ఇలాంటివన్నీ కమ్యూనిస్టు పార్టీపై రుద్ది మాపై దుష్ప్రచారాన్ని సాగిస్తున్నారు. వారు అలా చేసినా, ప్రజలు ఈ కాకమ్మ కథలను నమ్మే స్థితిలో లేరు. అలాగే, ఇటీవల రైల్వే పై విధ్వంసకాండను జరపడాన్ని నేరారోపణతో అమృత్‌సర్‌లో ఒకరిని అరెస్టు చేశారు. ఆ సందర్భంగా పదివేల రూపాయలు బహుమతిని కూడా ప్రకటించారు. మేము తరచు పంజాబులోని అమృతసర్, భటిండా లాంటి ప్రదేశాలకు వెళ్ళి ప్రసంగాలు చేస్తాం గాబట్టి, మా ఉపన్యాసాల కారణంగా ఇలాంటివి జరుగుతున్నట్లు దుష్ప్రచారాన్ని చేస్తున్నారు. అందుకు బాధ్యులెవరో తెలుసుకోలేని అసమర్థత వల్లనే ఆ బాధ్యతను మాపై రుద్ది తమ అసమర్థతను కప్పి పుచ్చుకోవాలని చూస్తున్నది. అక్కడక్కడ ప్రజలు ఉద్రేకపడి కొన్ని చర్యలను జరిపి వుండవచ్చు. అచ్చంపేట సబ్ ఇన్‌స్పెక్టర్ భార్యను చంపివేశారు. ఇలాంటివేవో ఎప్పుడో జరిగిన వాటిని పేర్కొంటారు. కాని ప్రభుత్వమూ, దాని పోలీసులు పనిగట్టుకొని జరిపిన హత్యలు, అత్యాచారాలతో ఇవి పోల్చదగినవా? కొన్ని సంఘటనలకు ప్రజలు ఉద్రేకపడి కొన్ని చర్యలు జరిపినంత మాత్రాన వాటినే సాకుగా తీసుకొని రాక్షస చట్టమైన ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని అమలు జరపడం, పోలీసు క్యాంపులను నెలకొల్పి ప్రజలను హింసించడం సబబుకాగలదా? మనం ముందుకు వెళ్లడానికి ఇది మార్గం కాదు.

**క్వాజా ఇనాయత్ వుల్లా:** రష్యా నుండి కొన్ని పద్ధతులు తీసుకొని రండి.

**ఛైర్మన్:** ఇక్కడ ఇతర దేశాల ప్రస్తావన తీసుకొని రావద్దు.

**సుందరయ్య:** మన ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ ఇటీవల మాట్లాడుతూ, యుద్ధమో, లేదా అంతర్యుద్ధాన్నో పోలిన పరిస్థితులు అక్కడ వున్నాయని చెప్పారు. నిజమే అక్కడ యుద్ధం లాంటిది జరుగుతున్న మాట నిజమే. అయితే అది అంతర్యుద్ధమూ కాదు, యుద్ధమూ కాదు. కాని నిరాయుధులైన ప్రజలపై ప్రభుత్వం సాయుధ దళాలతో సాగించుతున్న యుద్ధం. అయ్యా! అక్కడ ప్రజలను అరెస్టు చేసి కాల్చి చంపుతున్నారు. యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను కూడా అలా కాల్చి చంపరు. మరి అది యుద్ధం కాదంటారా? అయితే; మీ న్యాయశాస్త్ర శాసనాల ద్వారానే, వారిని కోర్టులో విచారించి, వారు దోషులని నిర్ధారణ అయితే, వారిపై



ఉరిశిక్ష విధించవచ్చు. కాని మీరు ఆ పద్ధతిని అనుసరించడం లేదు. మీ కిష్టమైన వారిని అరెస్టు చేసి కాల్చి చంపుతారా? అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం యుద్ధ నేరస్థుల పట్ల కూడా అలా వ్యవహరించరు. మా వద్ద నున్న ఆయుధాలను అప్పగించడానికి నిరాకరించుతున్నామని కూడా ప్రధానమంత్రి ఆరోపించుతున్నారు. ఇది ఏమాత్రం నిజం కాదు. గత తొమ్మిది మాసాలుగా మా వద్ద నున్న ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించుతామని చెపుతూనే వస్తున్నాం.

**క్వాజా ఇనాయత్ వుల్లా:** అది నిజమేనా?

**సుందరయ్య:** అవును నిజమే. మా వద్దనున్న ఆయుధాలను అప్పగించగలమని పదే పదే చెపుతూ వచ్చాము. ఇందుకు మంత్రుల వద్దకు కూడా వెళ్లాం.

**జి.రాజగోపాలన్:** ఆ ఆయుధాలు మీకు ఎక్కడ నుండి వచ్చాయి?

**సుందరయ్య:** రజాకార్లతో పోరాడిన సందర్భంగా వాటిని స్వాధీనపరచుకొన్నాం.

**బి.థరధ్ (ఒరిస్సా):** కాంగ్రెసు వారు పోరాడటానికి సిద్ధపడని రజాకార్ల నుండి (సభలో కలకలం)

**ఛైర్మన్:** ఎందుకిదంతా. ఏదో విధంగా వారి వద్ద ఆయుధాలున్నాయి. వాటిని అప్పగించుతామని చెపుతున్నారు. ఆ విషయాలు ప్రభుత్వ మంత్రులకే స్వయంగా వారు చెప్పి వున్నారు.

**సుందరయ్య:** ఆ ఆయుధాలు మాకిప్పుడు అవసరం లేదు. వాటిని ఇచ్చి వేయడానికి మేము సిద్ధమే. మావద్ద నున్న ఆయుధాల జాబితాను హైద్రాబాద్ ముఖ్యమంత్రికి ఇస్తాం. ఆయుధాలు వున్న వారినందరినీ ఆయుధాలను అప్పగించమని మేము సలహాఇస్తాం. అయితే అలా అప్పగించినప్పుడు వారిని పోలీసులు అరెస్టు చేయరాదు. అలా ఆయుధాలను వున్నందుకు వారిని అరెస్టు చేసి సంవత్సరాల తరబడి డిటెన్షన్‌లో వుంచరాదు. కాని ఆ విషయమై హామీ నివ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. అయితే, నాపైనా, రావి నారాయణరెడ్డి, బసవపున్నయ్య లాంటి వారిపై అరెస్టు వారంట్లు రద్దు చేశారనుకోండి; కాని....

**ఆర్.పి.యన్.సిన్హా (బీహార్):** అవి మీ శాంతి షరతులన్నమాట?

**సుందరయ్య:** అదేమీ కాదు; అది మా అభ్యర్థన. మాది సమాంతర ప్రభుత్వం అయి వుంటే మేము మరో విధమైన భాషలో మాట్లాడి వుండేవారం. మేము అక్కడ పోటీ ప్రభుత్వాన్ని నెలకొల్పుతున్నామన్న మాటలన్నీ తాము నిర్బంధవిధానాన్ని కొనసాగించేందుకు కేవలం సాకులు మాత్రమే. మా వద్ద ఆ ఆయుధాలు రజాకార్లపై పోరాడేందుకే వున్నాయి.

**శ్రీ గోవిందరెడ్డి:** మీరేమీ ప్రభుత్వం కాదు; మీరు న్యూసెన్సు.

**ఛైర్మన్:** మీరు ఇంక చట్టంపై ప్రసంగించండి.

**సుందరయ్య:** ఇంకా చట్టాన్ని గురించి మాట్లాడాలంటే ఎల్లకాలం తమ డిటెన్షన్ చట్టాన్ని కొనసాగించేందుకు సాకుగా మాపై ఇలాంటి ఆరోపణలను ప్రభుత్వం చేస్తున్నది. ఈ ఆరోపణలను నేను నిరాకరించుతున్నాను. అసలు ఈ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టానికి అవసరమే లేదు.

**ఛైర్మన్:** మీ ప్రసంగాన్ని కొనసాగించండి.

**సుందరయ్య:** ఇంతకీ మేము అడిగిందేమిటి? నాయకులపై గల అరెస్టు వారంట్లను మీరు ఉపసంహరించుకొన్నారు. కాని స్థానికంగా వున్న నాయకులపై వారంట్లను ఉపసంహరించడానికి మీరు సిద్ధంగా లేరు. వారిని వేటాడి, అరెస్టు చేసి, డిటెన్షన్‌లో వుంచుదామనేది మీ ఉద్దేశ్యం. ఈ పరిస్థితుల్లో మేము వారికి ఎలా చెప్పగలం? "మీకు ఏమీ జరగదు. మా మాట నమ్మండి, మీ వద్ద ఆయుధాలను అప్పగించి లొంగిపొండి" అని చెప్పాలి కదా. మేము విడుదలయ్యాం. వారు మమ్ములను ప్రశ్నించగలరు. "మీరేమో విడుదల చేయబడి స్వేచ్ఛగా వున్నారు. మమ్ములను మాత్రం మీ వద్ద నున్న ఆయుధాలను అప్పగించమంటున్నారు. మమ్ములను అరెస్టు చేసి జైళ్లలో కుక్కబోరని హామీ ఏముంది? మమ్ములను నానారకాలుగా చిత్రహింసలు పెట్టి బాధించబోరని గ్యారంటీ వుందా?"

మరలా మీకు అదేపనిగా చెపుతున్నాం. ఆయుధాలను అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నాం. అయితే, గతంలో లాగా వారిని అరెస్టు చేసి, చిత్రహింసలు జరిపి, జైళ్లలో కాలపరిమితి లేకుండా పెట్టరని వారికి నమ్మకం కలిగించండి. ఆ విధంగా ప్రజాతంత్ర జీవితాన్ని గడిపేందుకు అవకాశాన్ని కలిగించండి. కాని మీరు అలా హామీ నివ్వడానికి నిరాకరించుతున్నారు. అందువలన వారు ఆయుధాలను అప్పగించి లొంగిపోవడానికి సిద్ధపడటం లేదు. అలాంటి హామీ లేకుండా లొంగిపొమ్మనమని మేము కూడా వారికి సలహానివ్వజాలం. ఈ విధంగానే వారు అడవుల్లో వుంటూ కొంతకాలానికి చనిపోవడానికైనా సిద్ధపడతారు గాని ఈవిధంగా అరెస్టు కాబడి కాంగ్రెసు జైళ్లలోనూ, క్యాంపుల్లోనూ చిత్రహింసలకు గురికావడానికి సిద్ధపడరు.

**ఆర్.పి.యన్.సిన్హా:** వారు లొంగిపోయేటట్లు మేము చేస్తాం.

**సుందరయ్య:** వారు లొంగిపోయేటట్లు మీరు చేయలేరు. మీరు అనేక ఇబ్బందులను కల్పించుతున్నారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కూడా మంత్రులను మేము కలుసుకొని మాట్లాడాం. కాని మా వద్ద 140 ఆయుధాలు మాత్రమే వున్నాయంటే హైద్రాబాద్ ముఖ్యమంత్రి మా వద్ద 1400 ఆయుధాలు ఉన్నాయంటారు. మరొక రోజున కేంద్ర హోంమంత్రిని కలుసుకొన్నాం. ఆయన మావద్ద 14000 ఆయుధాలున్నాయంటారు. ఈ విధంగా



1400-14000 ఆయుధాలను ఎక్కడి నుండి తీసుకొని ఇవ్వమంటారు! మా వద్దనున్న ఆయుధాలన్నింటినీ అప్పగించామని ప్రభుత్వాన్ని ఎలా నమ్మించగలం! ఈ విధంగా ఒకవైపున ఇబ్బందులను పెడుతూ మా వాళ్లు లొంగిపోలేదనే సాకుతో నిర్బంధవిధానాన్ని ప్రభుత్వం కొనసాగించడానికి పూనుకొన్నది. ఏ రోజునైనా ఆయుధాలను అప్పగించడానికి మేము సిద్ధంగా వున్నాం. వారిని అరెస్టు చేయబోమనీ, వారిని డిటెన్షన్‌లో పెట్టబోమని హామీ నివ్వండి. అప్పుడు ఆయుధాలను అప్పగించవలసిందిగా వారికి సలహా నివ్వగలం.

**క్వాజా ఇనాయత్ వుల్లా:** ఖూనీకోరులను హంతకులను వురితీయకూడదని మీ ఉద్దేశ్యమా?

**సుందరయ్య:** వారు హంతకులు కాదు. దేశభక్తులు. (సభలో అదేపనిగా అడ్డు సవాళ్లు)

**ఛైర్మన్:** ఆర్డర్, ఆర్డర్

**బి.కె.ముఖర్జీ (ఉత్తరప్రదేశ్):** నాకొక సమాచారం కావాలి. ఇప్పుడు ప్రసంగించుతున్న గౌరవనీయులైన సభ్యుడు ఈ చట్టం చేయడానికి అంగీకరించుతున్నారా? లేక దాన్ని వ్యతిరేకిస్తున్నారా? ఆయన ఈ శాసనాన్ని వ్యతిరేకించుతున్నారు. మరొకవైపున బలపరుస్తున్నట్లు నాకు అనిపించుతున్నది. ఎందువల్లనంటే హామీ ఇవ్వనందునే ఆయుధాలను అప్పగించడం లేదని చెపుతున్నారు.

**ఛైర్మన్:** ఇలాంటి అనుమానాల వల్లనే ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని తీసుకొని వస్తున్నారని చెప్పడానికి ఆయన ప్రయత్నించుతున్నారు. అలాంటి అనుమానాలు ప్రభుత్వానికి లేనిపక్షంలో ఈ చట్టాన్ని తీసుకొని రావలసిన అవసరం లేదని ఆయన అంటున్నారు.

**ఆర్.పి.యన్.సిన్హా:** గౌరవనీయుడైన సభ్యుడు దొంగల తరఫున, బ్లాక్ మార్కెటర్ల తరపున మాట్లాడుతున్నారా అని నేను తెలుసుకోగోరుతున్నాను.

**సుందరయ్య:** నేను ప్రజల తరపున మాట్లాడుతున్నాను. దొంగనిల్వలు చేసి అధిక లాభాలను సంపాదించే వారి తరపున, దొంగ వ్యాపారం చేసే వారి తరపున మాట్లాడేవారు అవతల వైపున (అధికారపక్షం) కూర్చున్నారు.

ఇంతకీ తెలంగాణాలో ప్రభుత్వ పాలసీ ఏమిటి? భూస్వాములకు కాంగ్రెసు వారు ఆయుధాలను సమకూరుస్తున్నారు. 3550 ఆయుధాలకు లైసెన్సు వున్నదని ఇటీవల హైద్రాబాద్ అసెంబ్లీలో చెప్పి వున్నారు. లైసెన్సులు లేకుండా 1776 ఆయుధాలు ప్రజల వద్ద వున్నట్లు చెపుతున్నారు. భూస్వాములకు ఈ విధంగా ఆయుధాలను ఇస్తున్నారు. వాటితో వారు ఏమైనాచేయవచ్చు. ఉప ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ విధంగా ఆయుధాలను వుంచుకోవడానికి వారికి లైసెన్సులను ఇచ్చారు. కాని తెలంగాణా ప్రజల తీర్పు– జనరల్ ఎన్నికల్లో ఆంధ్ర ప్రజల తీర్పు స్పష్టంగానే ఉంది.

**బి.బి.శర్మ:** తెలంగాణా ప్రాంతంలో ఇంకా భూస్వాములూ, కేపిటలిస్టులూ మిగిలివున్నారా?

**సుందరయ్య:** ఉన్నారు. దురదృష్టవశాత్తూ, చాలా మంది వున్నారు. ఇంకా ఉప ఎన్నికల సంగతికి వస్తే తనకు ప్రజల మద్దతు వున్నదని కాంగ్రెస్ చెప్పుకొంటున్నది. గత జనరల్ ఎన్నికల్లో వారు మొత్తంగా ఓడిపోయారు. మొత్తం ఆంధ్రా జిల్లాల్లో విశాఖ నుండి పెన్నానది వరకూ తూర్పు కోస్తా నుండి హైదరాబాద్ సరిహద్దు నుండి ఆదిలాబాద్ వరకూ ఒక్క కాంగ్రెస్ అభ్యర్థి కూడా ఎన్నికల్లో నెగ్గలేదు. అందువలన వచ్చే ఉప ఎన్నికల్లో తాము గెలిచేందుకు ఇప్పటికే భయపెడుతున్నారు. అక్కడ కాంగ్రెస్ వారు ఎలాంటి బీభత్స చర్యలకు పూనుకొన్నారో తెలపడానికి పత్రికల్లో ప్రచురించబడిన వార్తలను సభవారి ముందు వుంచుతున్నాను. ఇంక నేను చాలా విషయాలు చెప్పవలసి వుంది. వ్యవధి మాత్రం లేదు. వాటినన్నింటినీ మీకు చదివి వినిపించలేను. అందువలన వాటిని సభకు సమర్పించుతున్నాను. అక్కడ జరుగుతున్న అత్యాచారాలను గురించి అధికారుల దృష్టికి తీసుకొని వచ్చాము. వాటిపై చర్యలు తీసుకొంటారని ఆశించుతున్నాను. ఇదిగో పేపర్ కటింగ్స్ మీ కిస్తున్నాను.

**ఛైర్మన్:** మంత్రి వాటిని చూస్తారు.

**సుందరయ్య:** అయ్యా, ఇప్పుడు జైళ్లలో వున్న డిటెన్యూల పట్ల ఎలా వ్యవహరించుతున్నారో వివరించుతున్నాను. అవతల సభలో తమ ప్రవర్తను గురించి మంత్రి గొప్పగా చెప్పుకొన్నారు. హైదరాబాద్‌లో గత మూడు సంవత్సరాల కాలంలో 175 మంది డిటెన్యూలు చనిపోయారు. మరల చెబుతున్నా, చనిపోయిన వారు 175 మంది. ఇది ఒకప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం ఇచ్చిన సంఖ్యే. వారి చేతులకు బేడీలు వేసి, తాళ్ళతో నేలమీద వారిని ఈడ్చుతున్నారు. ఇది యదార్థమేనని మంత్రి ఒప్పుకున్నారు. అంతేకాదు, ప్రజాభద్రత కోసం ఇది ఇలాగే కొనసాగాలని కూడా ఆయన అన్నారు. క్షయవ్యాధితో బాధపడుతూ ఆస్పత్రికి తీసుకు వెడుతున్నప్పుడు కూడా వారి చేతులకు బేడీలు వేస్తున్నారు. మంచాలకు వారిని తాళ్లతో కట్టివేస్తున్నారు. వారికి మామూలు నేరస్తులకు ఇస్తున్నట్లు 16 అణాలు మాత్రమే ఇస్తున్నారు. డిటెన్యూల పరిస్థితి ఇలా వుంది. ఒకరు కాదు, ఆరువందలు, ఏడువందల మంది ఒకేసారి వున్న పరిస్థితి వుంది. వారికి కుటుంబ అలవెన్సు చెల్లించడమంటూ లేదు. జవ్వాది రజ్వీ, ఎస్.వి.కె. ప్రసాద్‌లాంటి వారిని అరెస్టు చేసిన తరువాత ఒక నెలరోజుల పాటు పోలీసు లాకప్‌లో వుంచి చిత్రహింసలకు గురిచేసిన తరువాత మాత్రమే డిటెన్షన్ వారెంటును సృష్టించారు. వారిని సుప్రీమ్ కోర్టు ముందుకు తీసుకొని వస్తే డిటెన్షన్ ఆర్డరు వున్నందున తామేమీ చేయలేమని సుప్రీం కోర్డు తెలియజేసింది.

గౌరవనీయుడైన సభ్యుడు దివాన్ చమన్‌లాల్ సెలక్టు కమిటీకి తాను సమర్పించిన నోట్‌లో ఇలా పేర్కొన్నారు.



"ఈ ప్రభుత్వాలను సృష్టించింది ప్రజల అభీష్టమే. అందువలన ఈ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వుండటం స్వాతంత్ర్యానికి ముందు రోజుల్లో వలె ఇంకెంత మాత్రం దేశభక్తియుతమైన కర్తవ్యం కాజాలదు. పైపెచ్చు అది దేశాలపట్ల అవిధేయత, దేశం పట్ల విద్రోహంగా ఎంచబడాలి."

ఈ బిల్లును సమర్థించుతూ ఆయన చెప్పిన మాటలివి. ఆయన సహచరుడు అనంతశయనం అయ్యంగార్ చమన్‌లాల్ కంటే సత్యానికి కొంచెం దగ్గరగా వున్నారు. ఇంతకు ముందు రోజున ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ప్రభుత్వమూ హింసమీదనే ఆధారపడి వుంటుందని చెప్పారు. అది నిజమే. అయితే, దానికి మరో చిన్న వాక్యాన్ని చేర్చదలిచాను. ప్రతి ప్రభుత్వమూ ఒకానొక దశలో ఒకానొక వర్గ ప్రయోజనాల కోసం హింసను ప్రయోగించుతుంది. ఒకానొక సమాజంలో ఏ వర్గమైతే ఆర్థికంగా ఆధిక్యత కలిగి వుంటుందో ఆ వర్గం యొక్క ప్రయోజనాల కోసం ప్రభుత్వం హింసను ప్రయోగించుతుంది. రాజ్యాంగ యంత్రం దౌర్జన్యాలపైనే ఆధారపడి పనిచేస్తుంది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హింసపైననే ఆధారపడి వున్నదని మేము భావించుతాం. అయితే అది బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం, గుత్త పెట్టుబడిదారుల, బడా భూస్వాముల, దేశముఖుల ప్రయోజనాల కోసం, అంతేకాని అసంఖ్యాకంగా ఉన్న సామాన్య ప్రజల ప్రయోజనాల కొరకు కానేకాదు. ఈ డిటెన్షన్ చట్టం రెండు సంవత్సరాలు మాత్రమే కాదు, అవసరమైతే 200 సంవత్సరాల వరకూ అమల్లో ఉండాలని అనంతశయనం అయ్యంగార్ అంటున్నారు. అయ్యా, ఒక్క విషయం చెప్పదలచా. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు వందల సంవత్సరాల వరకూ వుండబోదు. ఈ ప్రభుత్వం అంతకాలం మనగలిగితే  ఒక ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం కాదు, వందలాది ప్రివెంటివ్ చట్టాలు అవసరమవుతాయి. కొద్ది మంది మిత్రులను జైళ్లలో పెట్టినంత మాత్రాన నష్టమేమీ లేదు. వారిని చంపివేయడం లేదు కదా అని అనంతశయనం అయ్యంగార్ అంటున్నారు. వారికేమీ అపకారం జరగడం లేదుకదా అంటున్నారు. వారికి అపకారం జరగడమే కాదు, వారిని జైళ్లలోనూ, వెలుపలా కాల్చి చంపివేసిన ఉదాహరణలను నేను ఇవ్వగలను.

అయ్యా! మేము శాంతిగా జీవించదలిచాం. అందరితో పరస్పర సహకారంతో మేము వుండదలిచాం. అలాగే పరస్పరం సేవ చేయదలచుకొన్నాం. అయితే ఇందుకు పెద్ద అడ్డంకిగా వున్నదేమంటే నేడున్న దోపిడీ దార్లే, భూస్వాములే, బడా పెట్టుబడిదారులే. అధిక లాభాపేక్షతో దొంగ వ్యాపారాలు చేసేవారే. ఒక్క విషయం స్పష్టం చేయదలచాను. పీడకులకు, దోపిడీదారులకు వ్యతిరేకంగా తమను తాము రక్షించుకొనే హక్కును ప్రజలు ఎన్నటికీ వదలుకోరు. ఈ నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే హక్కు వారికి సహజంగానే ఉంది. ఇందుకు ఎలాంటి చట్టాలున్నా, ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలున్నా అవి వారిని ఆపజాలవు.

మా మీద మరో నిందారోపణ చేయడం ఈ పాలకులకు మామూలైంది. మేము విదేశీ ఏజెంట్లమట. మాటిమాటికీ ఈ ఆరోపణను మాపై తెస్తున్నారు. అందువలన దాన్ని

గురించి కూడా క్లుప్తంగా చెప్పదలచాను. మమ్ములను డిటెయిన్ చేయడానికి గల కారణాల్లో దాన్ని కూడా పేర్కొంటున్నారు. విదేశీ ప్రభుత్వంతో సంబంధమున్న వారి నెవరినైనా మంత్రిగారి చిత్తమైతే చాలా ఎలాంటి కారణాలు, సందర్భమూ లేకుండా డిటెయిన్ చేయవచ్చు. అన్ని దేశాలతో సమానమైన ప్రాతిపదికపై ఈ ప్రభుత్వం స్నేహ సంబంధాలను నెలకొల్పుకోవడం లేదని మేము పదేపదే ప్రభుత్వ దృష్టికి తీసుకొని వచ్చాము. దోపిడీలను గురించి, హత్యలను గురించి, అశ్లీలాలను గురించి వర్ణించి రకరకాల అమెరికా సారస్వతాన్ని మాత్రం మన దేశంలోకి స్వేచ్ఛగా రానిస్తారు. కాని సోవియట్ పుస్తకాలను మాత్రం రైల్వే పుస్తకాల షాపుల్లో వుండడానికి అనుమతినివ్వరు. మళ్ళీ తాము సోవియట్ పట్ల స్నేహభావంతో వున్నామని ప్రకటించుకొంటారు. కాని వారి చర్యలు అందుకు పూర్తిగా విరుద్ధంగా వున్నాయి. నేను ఒక లేఖను చదివి వినిపించి, సభకు సమర్పించుతాను.

విదేశాల నుండి మనదేశంలో ఏదైనా సభకు ఆహ్వానించే విషయంలో భారత ప్రభుత్వ డిప్యూటీ కార్యదర్శి ఒక సర్క్యులర్‌ను జారీ చేశాడు. అమెరికా, బ్రిటన్‌ల నుండి ఎవరినైనా, ఎంతమందినైనా ఆహ్వానించడానికి ఎలాంటి అభ్యంతరం లేదు అని ఆ సర్క్యులర్‌లో స్పష్టంగా పేర్కొన్నాడు. కాని సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ ప్రజాతంత్ర దేశాల నుండి, చివరికి చైనా నుండి ఆహ్వానించవలసి వస్తే ఏమీ చేయాలో ఆయన ఇలా పేర్కొన్నాడు. ఆ సర్క్యులర్‌లో

"సోవియట్ యూనియన్‌కు చెందిన వారినెవరినైనా, లేదా ఆ దేశ ఉపగ్రహరాజ్యాల నుండి, లేదా చైనా నుండి ఆహ్వానించవలసి వస్తే ఈ మంత్రిత్వ శాఖను సంప్రదించవలసి వుంటుంది."

ఆ సర్క్యులర్ మొత్తం పాఠాన్ని సభ ముందు వుంచుతున్నాను. ఆ సర్క్యులర్ నెంబర్, అది జారీ చేయబడిన తేదీ కూడా ఇక్కడ వుంది. అలాంటిదేమీ లేదని గౌరవనీయుడైన మంత్రి చెప్పదలచుకొంటే చెప్పవచ్చు. ఆ సర్క్యులర్ ఫతేసింగ్ డిప్యూటీ సెక్రటరీ, భారత ప్రభుత్వం అని వుంది. అది జారీ చేయబడిన తేదీ 1951 డిసెంబర్ 15.

భారత్ ప్రభుత్వం వైఖరి ఎలా వుందో తెలిపేందుకే ఆ సర్క్యులర్‌ను ఇక్కడ చదివి వినిపిస్తున్నాను. డిటెన్షన్ చట్టాన్ని ఎలా వర్తింప చేస్తున్నారో మనకు తెలుసు. అమెరికా, బ్రిటిష్ సామ్రాజ్య వాదులతో సంబంధాలూ వాంఛించుతాం గాబట్టి మేము డిటెన్షన్ చట్టం పరిధిలోకి వస్తాం. కాంగ్రెస్ పార్టీ సభ్యుల దృష్టిలో "ఇతర దేశాలు" (సోషలిస్టు దేశాలు) ప్రజాతంత్ర రాజ్యాలు కావు. ఎందువల్లనంటే అక్కడ భూస్వాములు, ఇతర దోపిడీ దారులు వుండరు. భూస్వాములు, ఇతర దోపిడీదారులు లేని దేశాలు ప్రజాతంత్ర దేశాలు కావని వారంటే మరి ప్రజాస్వామ్యం అంటే వారి నిర్వచనం ఏమిటో నాకు అర్థం కావడం లేదు.

అందువల్లనే విదేశీ రాజ్యాలతో సంబంధాలు అన్న క్లాజును నేను వ్యతిరేకించుతున్నాను. ఎవరైనా విదేశీ ఏజెంటని రుజువైతే అతణ్ణి కోర్టులో విచారించి వురి



తీయవచ్చు. అందుకు మాకు సమ్మతమే. విదేశీ గూఢచారులను మన దేశంలో సహించరాదనేదే మా అభిప్రాయం. అయితే మేము దేశభక్తులమని స్పష్టం చేయదలచాము. సోవియట్ యూనియన్‌లోనూ, చైనాలోనూ కూడా అన్ని రకాల దోపిడీని రద్దు చేశారు. అందువల్లనే అక్కడ వారు చేసిన దాన్ని మేము శ్లాఘించుతున్నాం. అయితే మన దేశాన్ని మేము ప్రేమించుతాం.

**అబిద్ ఆలీ(బొంబాయి):** మేము దాన్ని ప్రశ్నించుతున్నాం.

**సుందరయ్య:** మీరు మా దేశభక్తి గురించి ప్రశ్నించుతారు. మీ నిజాయితీని గురించి కూడా మేము ప్రశ్నించుతాం. ఎవరి కంటే కూడా ఎక్కువగా మా దేశాన్ని మేము ఎక్కువగా ప్రేమించుతాం. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకూ వ్యాపించివున్న దేశాన్ని మేము ప్రేమించుతాం.

**టి.పాండే(ఉత్తరప్రదేశ్):** 1942లో మీ దేశభక్తిని మేము చూశాం.

**సుందరయ్య:** మా దేశభక్తిని మీరు చూడలేదు.

**ఛైర్మన్:** ఆర్డర్! ఆర్డర్! గౌరవనీయుడైన సభ్యుని ప్రసంగాన్ని పూర్తి చేయనీయండి.

**సుందరయ్య:** మనదేశాన్ని మేము ప్రేమించుతాం! దేశ విభజన జరిగినప్పుడు మేము చాలా బాధపడ్డాం. మా హృదయాలు చలించాయి. (అడ్డు సవాళ్లు) కాంగ్రెస్ పార్టీకి చెందిన మీరే ఈ దేశ విభజనకు కారకులు. అయినప్పటికీ అందుకు మమ్ములను నిందిస్తున్నారు. అయినప్పటికీ పాకిస్తాన్, ఇండియా, నేపాల్, సింహళం-ఇవన్నీ కలసి స్వచ్ఛందంగా ఒక ఫెడరేషన్‌గా ఏర్పడే రోజు రాకతప్పదని మేము విశ్వసించుతున్నాం. ఆ విధంగా మొత్తం భారత ఉపఖండం ఐక్యతను సాధించగలం.

**ఒక సభ్యుడు:** మరి రష్యాతో ఐక్యత సంగతి ఏమిటి?

**భూపేష్ గుప్తా:** మీ అవగాహనకు అంతుపట్టని విషయమిది లెండి.

**సుందరయ్య:** మా దేశాన్ని మేము ప్రేమించుతాం. ఈ దేశాన్ని గురించి గర్వపడతాం. అయిదువేల సంవత్సరాలకు పైగా మహోన్నతమైన నాగరికతను కలిగివున్న ఇండియాను గురించి మేము గర్వపడతాం. మా దేశాన్ని మేము ప్రేమించుతాం (అడ్డు సవాళ్లు).

**ఛైర్మన్:** ఆర్డర్! ఆర్డర్! గౌరవనీయుడైన సభ్యుడు కొన్ని మంచి మాటలు చెపుతున్నప్పుడు అడ్డుకోకుండా ఆయన ప్రసంగాన్ని కొనసాగనీయండి.

**సుందరయ్య:** సముద్ర గుప్తుడు, చంద్రగుప్తుడు లాంటి మహావీరుల దేశమైన ఈ భూమిని మేము ప్రేమించుతాం. కళలకు, సంస్కృతులకు నిలయమైన ఈ దేశాన్ని మేము ప్రేమించుతాం. అజంతా, ఎల్లోరా లాంటి కళలకు పుట్టినిల్లుగా ఉన్న ఈ గడ్డను మేము ప్రేమించుతాం. తాజ్‌మహల్ గల ఈ దేశాన్ని ప్రేమించుతాం.

వాల్మీకి, కాళిదాస్, తులసీదాస్, కంబర్, వేమన, నన్నయ్యలాంటి కవులకు జన్మనిచ్చిన ఈ దేశాన్ని ప్రేమించుతాం. (కాంగ్రెసు వారి అడ్డు సవాళ్లు) వారికి మన దేశ గత చరిత్రను గురించి తెలిసినట్లు లేదు. మన గత చరిత్ర గొప్పతనాన్ని గురించి మేము ఉదహరించితే వారికి ఎందుకు కోపం వస్తున్నదో తెలియడం లేదు. రవీంద్రనాథ్ టాగూర్ ఆంధ్రా మహాకవి గురజాడ అప్పారావు లాంటి వారు ఈ దేశంలో జన్మించి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గురించి కవితలల్లి గానం చేశారు. అలాంటి వారికి చెందిన ఈ గడ్డను మేము ప్రేమించుతున్నాం. ఈ దేశం కోసం ఎంతటి త్యాగాలు చేయడానికైనా మేము సిద్ధంగా వున్నాం. మేము మా దేశాన్ని ప్రేమించుతున్నామంటే మన గతాన్ని గురించి గర్వపడుతున్నామన్నమాట. గతం గతించింది. మనమిప్పుడు వర్తమానంలో వున్నాం. భవిష్యత్తు కోసం కృషి చేస్తాం. మన దేశాన్ని మేము ప్రేమించుతున్నామంటే మన మహా కవి గురజాడ నుడివినట్లు దేశమంటే మట్టికాదు, ప్రజలు అని అర్థం చేసుకోవాలి. ప్రజాసేవలో సర్వం త్యాగం చేయడానికి మేము సంసిద్ధులమే.

**ఛైర్మన్:** దేశ భక్తిని గురించి మీరు చెప్పింది సరిపోతుంది.

**సుందరయ్య:** నా ప్రసంగాన్ని ముగించుతున్నాను. ఇంక రెండే వాక్యాలు చెప్పవలసి వుంది.

**ఛైర్మన్:** అలాగే కానీయండి. రెండే రెండు వాక్యాలతో ముగించండి.

**సుందరయ్య:** అయ్యా మేము కమ్యూనిజాన్ని స్వీకరించినప్పుడు అదొక్కటే మన దేశం ఎదుర్కొంటున్న సమస్యలకన్నింటికీ పరిష్కార మార్గమని మేము భావించాం. కాంగ్రెసు పార్టీ మౌలికమైన సంస్కరణలను తీసుకొని రాలేదని మాకు తెలుసు. మేము నేడిక్కడ పార్లమెంటులో వున్నాం. ప్రభుత్వం అవకాశం ఇచ్చినంత కాలం ఇక్కడ ఉండితీరుతాం. నేడు మన దేశంలో ఎలాంటి పరిస్థితులున్నాయో మనం చూస్తున్నాం. ప్రజలు దారిద్ర్యంతో అవస్థలు పడుతున్నారు. తిండిలేక, పనుల్లేక, వుండటానికి గూడులేక బాధలుపడుతున్నారు. ఈ పరిస్థితిని గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకొనివస్తే కనీసం ఆ విధంగానైనా మన ప్రజలకు కనీసం కొంతవరకైనా ఉపయోగం జరుగుతుందని మేము భావించుతున్నాం. తీవ్రమైన సంస్కరణల సంగతి, సాంఘిక విప్లవం లాంటి విషయాలను వదిలి వేయండి, అవస్థలతో బాధపడుతున్న మన ప్రజలకు ఏ మాత్రం సహాయాన్ని సాధించగలిగినా, ఇక్కడ మేమున్నందుకు కొంత సార్థకత వుంటుంది. నెహ్రూ దృక్పథంతో ప్రభుత్వం వ్యవహరించగలదన్న ఆశతో మేము ఇక్కడికి వచ్చాము. అయితే నేటి నెహ్రూ విధానం కాదు. 1936లో నెహ్రూ విధానమని మా భావన. ఆనాడు ఆయన ప్రివెంటివ్ డిటెన్షన్ పేరుతో జరిగిన ఘోరమైన చర్యలను తీవ్రంగా ఖండించి ప్రజల మనస్సులను ఆకట్టుకోగలిగారు. ఆ పాత నెహ్రూ విధానాలలో ఏవైనా వున్నాయా చూడటానికి మేము ప్రయత్నించుతున్నాం. నేడు ప్రజలను అధ్వాన్నమైన ఈ నికృష్ట పరిస్థితుల నుండి విముక్తి చేయడానికి ప్రభుత్వం ఏమైనా చేయగలదా అని



అడుగుతున్నాం. లేదా పటేల్, రాజాజీ విధానాల వైపుకు ప్రభుత్వం వెడుతున్నదా! అయ్యా! నా ప్రసంగాన్ని ముగించవలసి వుంది. క్లాజువారీగా నేను మాట్లాడదలచలేదు. ఆ చర్చ వచ్చినప్పుడు పంచదార పూతలతో వున్న అనేక క్లాజుల నిజ స్వరూపాన్ని ఎత్తి చూపుతాను. ప్రజల కష్టాలను కొంత వరకైనా తగ్గించేందుకు ప్రయత్నించేందుకే మేమిక్కడ పార్లమెంటులో వున్నాం. మేము పార్లమెంటులో వుండరాదని ప్రభుత్వం భావించితే ఇంక ఈ చట్టాన్నుండి పార్లమెంట్ సభ్యులను కూడా మినహాయించరు. తమ వంట ఇంటిలోకి చిట్టెలుకల్లా మేము ప్రవేశించినట్లు ప్రభుత్వం భావించుతున్నట్లున్నది. కనుకనే ఈ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం ద్వారా ఒక వంట కత్తిని ఉపయోగించి మమ్ములను ఒదిలించుకొందామని యత్నించుతున్నట్లు కనిపించుతున్నది. ఈ విధంగా ప్రతిపక్షాన్ని అణచివేయాలని ప్రభుత్వం భావించుతున్న పక్షంలో అది చాలా పొరపాటని నేను హెచ్చరిక చేయదలచాను. మీరు మాలో కొంత మందిని అరెస్టు చేయవచ్చు. చాలా మందిని అరెస్టు చేసి డిటెన్షన్‌లో వుంచవచ్చు. కాని మమ్ముల్నందరినీ మీరు అరెస్టు చేయజాలరు. ఈ విషపూరితమైన డిటెన్షన్ చట్టం మన ప్రజాస్వామ్యపునాదులనే పెకలించి వేస్తుంది. అందువల్లనే ఈ చట్టాన్ని నేను వ్యతిరేకించుతున్నాను. ఈ చట్టాన్ని పూర్తిగా త్రోసిపుచ్చవలసిందిగా సభ వారిని నేను కోరుతున్నాను.

**ఛైర్మన్:** ఈ విషయమై గట్టి అభిప్రాయాలు మీకు గలవని నాకు కనిపించుతున్నది. నిందారోపణలు చేయడం ఏ ఒక్కరి సొత్తుకాదు. గౌతమ బుద్ధుని కథ నుండి ఒక ఉదాహరణను ఈ సందర్భంగా మీ అందరి దృష్టికి తీసుకొని రాదలచాను. ఒకసారి బుద్ధుడు మామూలుగా భిక్షాటనకు వెళ్లినప్పుడు భిక్షం కోసం అభ్యర్థించినప్పుడు ఆయనను నిందించడం సంభవించింది. అప్పుడు బుద్ధుడు ఆయనతో ఇలా అన్నాడు. "మీరు నాకు డబ్బు ఇస్తే, దాన్ని స్వీకరించడానికి నిరాకరించితే ఏమి జరుగుతుంది?" అప్పుడు ఆయనకు ఇలా సమాధానమిచ్చాడు. "ఆ డబ్బు నా వద్దకే తిరిగి వస్తుంది. అప్పుడు బుద్ధుడు ఇలా అన్నాడు. అలాగే మీ నిందను నేను స్వీకరించి నిరాకరించితే అది మీకే చెందుతుంది. ఆ విధంగా మీరు నిందలు వేస్తే ఆ నిందలు వేసే వారికే అవి తిరిగి వస్తాయి."

అందువలన గౌరవనీయులైన సభ్యులు మాట్లాడుతున్నప్పుడు ఎలాంటి అవరోధాన్ని కల్పించకుండా వారిని మాట్లాడనీయండి. మీ వంతు వచ్చినప్పుడు మీరు చెప్పదలచుకొన్న దానికి సంపూర్ణమైన అవకాశం వుంటుంది. అప్పుడు మీరు సమాధానాలను ఇవ్వవచ్చు. రెండు పక్షాల వారికీ అలాంటి అవకాశమూ, శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. అందువలన ఇక్కడ సంపూర్ణమైన వాక్ స్వాతంత్ర్యం వుండాలని నేను కోరుతున్నాను.

**శ్రీ గోవిందరెడ్డి:** మీ హితోపదేశానికి మేమంతా ఎంతో కృతజ్ఞులం.

# ప్రథమ పంచవర్ష ప్రణాళికపై ప్రసంగం

## (1952 డిసెంబర్ 16)

ప్రధానమంత్రే స్వయంగా లోక్‌సభలో పేర్కొన్నట్లుగా ఒక ఆర్థిక జాతీయ ప్రణాళిక వుండాలనే భావం ప్రతి దేశాన్ని ఆకర్షించుతోంది. అయిదేండ్ల అనంతరం మన ప్రభుత్వం కూడా ఈ పంచవర్ష ప్రణాళికతో ముందుకొచ్చింది. ఇంక ఇప్పుడు ఈ తొలి పంచవర్ష ప్రణాళిక మన ప్రజల ముఖ్యమైన అవసరాలను తీర్చగలదో లేదో పరిశీలించడం మన కర్తవ్యం. పనిచేసే హక్కు, తగినంత ఆదాయాన్ని పొందే హక్కు, విద్యాభ్యాస హక్కు, వృద్ధాప్యంలో, జబ్బు పడినప్పుడు, ఇతర విధాలుగా పనిచేయలేని పరిస్థితులు ఏర్పడినప్పుడు సహాయం పొందే హక్కు వీటన్నింటినీ ప్రణాళిక గుర్తించింది.

మొదటి పంచవర్ష ప్రణాళిక సాధించ తలపెట్టిన లక్ష్యాలు, వాటిని ప్రభుత్వం ఎంత వరకు అమలు జరిపి, ప్రజల కోర్కెలను ఎంత వరకు నెరవేరుస్తుందనే విషయాన్ని ఇప్పుడు పరిశీలించుదాం. ముందుగా అన్నింటికంటే అతి ముఖ్యమైన ఆహారం విషయమే తీసుకొందాం. మనకిచ్చిన రిపోర్టును బట్టి ఆహారాన్ని పొందవలసిన 36 కోట్ల మంది ప్రజలున్నారు.మనం ఉత్పత్తి చేసే తిండి గింజలతో పాటు 30 లక్షల టన్నులను దిగుమతి చేసుకొంటున్నాం. సగటున ఒక్కో వ్యక్తి రోజుకు 13.17 ఔన్సులను, రెండు ఔన్సుల పప్పులను, అర ఔన్సు ఆయిల్‌ను వాడుతున్నాడు. ప్రణాళికా సంఘం పోషణాహార కమిటీ రిపోర్టును ఉదాహరించింది. దాని ప్రకారం ప్రతీ ఒక్క వ్యక్తికి, 14 ఔన్సుల తిండి గింజలు, మూడు ఔన్సుల పప్పులు, రెండు ఔన్సుల ఆయిల్, అయిదు ఔన్సుల మాంసం, చేపలు, గుడ్లు ఇంతేగాక 16 ఔన్సుల కూరగాయలు పండ్లు, పది ఔన్సుల పాలు అవసరమవుతుంది. ఇది ప్రతి వ్యక్తికీ అవసరమైన కనీస ఆహారం. మరిప్పుడు ప్రభుత్వ ప్రణాళిక ఏమి చెపుతున్నది? 1955 కల్లా తిండి గింజలను, పప్పులను 75 లక్షలకు పెంచగలమని ప్రభుత్వం ఆశించుతున్నది. అప్పుడు ప్రతి మనిషికి 14 ఔన్సులను సరఫరా చేయగలమని భావించుతున్నది. ఇంక పప్పుల విషయంలో అప్పుడు కూడా రెండు ఔన్సులనే సరఫరా చేయగలం. పోషకాహార కమిటీ నిర్ణయించిన ప్రమాణాలను బట్టి 1955 నాటికి ఒక ఔన్సు తక్కువ పప్పులను వినియోగించుతాం. ఆయిల్‌కు సంబంధించి అర ఔన్సు మాత్రమే ఉపయోగిస్తున్నారు. కాని రెండు ఔన్సులు అవసరమవుతుంది. ప్రస్తుతం -50 లక్షల టన్నుల నూనెగింజలను మనదేశంలో ఉత్పత్తి చేయగలుగుతున్నాం. 1955 నాటికి కూడా ఆచరణలో అంతే ఉత్పత్తి కాగలదు. కనుక అయిదేండ్ల తరువాత కూడా మాంసకృత్తుల విషయంలో ఏ మాత్రం మెరుగైన స్థితిలో వుండబోము. పోషకాహార కమిటీ సూచించిన ప్రమాణాలను 1936లో జైలులో మాకు ఇచ్చిన రేషన్‌తో పోల్చుదాం. ఆనాడు జైలు మాన్యువల్‌లో 20 ఔన్సుల తిండి గింజలు, నాలుగు ఔన్సుల పప్పులు, రెండు ఔన్సుల ఆయిల్, రెండు ఔన్సుల పంచదార



వగైరాలుండేవి. అంటే పది సంవత్సరాల కాంగ్రెసు పరిపాలన తరువాత కూడా 1930-36లో జైలులో ఇవ్వ నిర్ణయించిన రేషన్ల ప్రకారం ప్రతి ఒక్కరికీ 20 ఔన్సుల చొప్పున తిండి గింజలను ఇచ్చినా, మనకు కావలసింది 53 మిలియన్ల టన్నులు కాదు; 76 మిలియన్ టన్నులు అవసరమవుతుంది. ఇంక పప్పులు 80 లక్షల టన్నులు కాక, 160 టన్నులు కావలసి వుంటుంది. అలాగే నూనె గింజలు 50 లక్షల టన్నులు గాక, 200 టన్నులు కావలసి వుంటుంది. ఆహారం విషయంలో ప్రభుత్వం మన ముందు వుంచిన లక్ష్యం ఇదే.

ఆ తరువాత కట్టుకొనే బట్టల విషయం పరిశీలించుదాం. యుద్ధానికి ముందు మన వినియోగం 16 గజాలనేది అందరికీ తెలిసిందే. ప్రణాళికా సంఘం నివేదిక ప్రకారం ఇప్పుడు మనం 33000 లక్షల గజాల గుడ్డను వాడుతున్నాం. అంటే ప్రతి ఒక్కరికీ 9 నుండి పది గజాలన్నమాట. 1955 నాటికి మిల్లు బట్ట 47000 లక్షల గజాలను ఉత్పత్తి చేయగలమని ప్రభుత్వం అంచనా వేసింది. 17000 లక్షల చేనేత వస్త్రాలను అంటే ఇప్పటికంటే రెట్టింపును ఉత్పత్తి చేయగలమంటున్నారు. ఏ ప్రాతిపదికపై ప్రభుత్వమూ, ప్రణాళికా సంఘమూ ఈ ఉత్పత్తి లక్ష్యాలకు వచ్చాయో నాకు అర్థం కావడం లేదు. మనందరికి తెలుసు నేడు చేనేత పరిశ్రమలో గల సంక్షోభం. పైపెచ్చు 10,000 లక్షల గజాలను ఎగుమతి చేద్దామని ప్రభుత్వం అనుకొంటున్నది. అలాంటప్పుడు ప్రభుత్వం ప్రణాళిక జయప్రదమైనప్పటికీ 1953లో ప్రతి ఒక్క వ్యక్తికీ 14 గజాల గుడ్డ లభ్యమవుతుంది. అంటే యుద్ధానికి ముందు కంటే తక్కువ గుడ్డనే మనం వాడుకోగలమని స్పష్టమవుతున్నది.

ఇంక ఇప్పుడు పాదరక్షల విషయాన్ని తీసుకొందాం. 1950లో మన ఉత్పత్తి 850 లక్షల జతలను ఉత్పత్తి చేయగలమని ప్రభుత్వం చెపుతున్నది. మన జనాభా 36 కోట్లు అంటే నలుగురికి ఒక జత లభించుతుందన్నమాట. 1955 నాటికి 190 లక్షల జతలను ఉత్పత్తి చేయగలమని ప్రభుత్వం ప్లాను వేస్తున్నది. ప్రభుత్వం అంచనా ప్రకారమే చూసినా అప్పటికి మన జనాభా 38 కోట్లకు పెరుగుతుంది గాబట్టి అప్పుడు కూడా నలుగురికి ఒక జతకంటే తక్కువే లభ్యమవుతుంది. ఆహారం, బట్టలు, పాదరక్షలకు సంబంధించి ఇదీ పరిస్థితి. ఇంక గృహవసతికి సంబంధించి ప్రభుత్వం పారిశ్రామిక కార్మికులను మాత్రమే కొంత వరకు పట్టించుకొన్నదిగాని, మొత్తం దేశంలోని ప్రజలకు గృహవసతిని కల్పించే విషయాన్ని పరిగణనలోకి తీసుకొనలేదు.

ఇంక ఇప్పుడు విద్య విషయానికి వద్దాం. దాన్ని గురించి ప్రభుత్వం ఏమి చెపుతున్నది? 6-14 ఏండ్ల వయస్సు గల పిల్లలకు పదేండ్ల లోపున విద్య గడపాలని మన రాజ్యాంగం నిర్దేశించింది. పోతే విద్యకు ఐదవ తరగతిని ప్రామాణికంగా తీసుకుంటే 40 శాతం నేడు స్కూళ్లకు వెడుతున్నట్లు ప్రభుత్వం చెపుతున్నది. కాని అందులో 40 శాతం మాత్రమే నాలుగవ తరగతి వరకూ చేరుకోగలుగుతున్నారు. తక్కిన 60 శాతం పిల్లలు 4వ తరగతికి చేరుకొనే ముందే చదువులు మానివేస్తున్నారు. ఒకటి రెండు తరగతుల్లో వారు నేర్చుకొన్నది ఆ తరువాత మరచిపోతున్నారు. రాజ్యాంగం నిర్దేశించిన విధంగా 5-14 ఏండ్ల బాలబాలికలకు విద్య గరపాలన్నా, అందుకు అవసరమైన ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలన్నా దాదాపు 400 కోట్ల రూపాయలను ఖర్చు పెట్టవలసి వస్తుంది. కాని ప్రభుత్వం మన పిల్లల విద్య కోసం వంద కోట్లను మాత్రమే ఖర్చు చేయాలని భావించుతున్నది. దీని ఫలితంగా మన పిల్లలు

విద్యావంతులు కాకుండా నిరక్షరాస్యులుగానే వుండిపోతారు. ఈ విధంగా ఎన్ని సంవత్సరాలు, ఎన్ని దశాబ్దాలు మన పిల్లలు విద్యకు నోచుకోనివారుగా ఉండిపోవాలో మనకు తెలియడం లేదు.

ఇంక ఆసుపత్రులు, వైద్య సదుపాయాన్ని తీసుకుందాం. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతి 63000 మందికి ఒక డాక్టరు చొప్పున నేడున్నారు. వచ్చే అయిదేండ్లలో 12 వేల నుండి 15 వేల వరకు అదనంగా డాక్టర్లకు శిక్షణ ఇస్తారు. ప్రస్తుతం మనకు 60 వేల డాక్టర్లు మాత్రమే ఉన్నారు. మనకు అవసరమైన మరో మూడు లక్షల మందికి శిక్షణ ఇవ్వాలంటే కనీసం ఒక శతాబ్ద కాలం పడుతుంది. ఇంక నర్సులు, మంత్రసానుల పరిస్థితి కూడా మరింత అధ్వాన్నంగా వుంది. నేడు 60 వేల మందికి ఒక మంత్రసాని చొప్పున వున్నారు. కాని నాగరికత అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి 400 మందికి ఒక మంత్రసాని చొప్పున వున్నారు. ఇలా అయితే మనకు అవసరమైనంత మంది మంత్రసానులను తయారు చేసుకోవాలంటే మరో శతాబ్దన్నరకాలం పట్టవచ్చు.

మనం పెట్టుకొన్న లక్ష్యాలు ఈ విధంగా వున్నాయి. అయిదు సంవత్సరాల అనంతరం రెండు వేల 69 కోట్ల రూపాయలను ఖర్చు పెట్టిన తరువాత కూడా ఇప్పుడున్నట్లే ఆకలి దప్పులతో అత్యధిక ప్రజానీకం బాధలు పడటం, చాలా తక్కువ బట్టలతో సరిపెట్టుకోవడం, బిడ్డలకు చదువుల్లేక పోవడం, వైద్య సౌకర్యాలు లేకపోవడం మనదేశంలో వుండవలసి వస్తోంది.

ఈ వేళ ప్రధాన మంత్రి సభలో మాట్లాడుతూ ఈ ప్రణాళిక మన అవసరాలను తీర్చగలదా అన్న పరిశీలనతో చూడరాదన్నారు. నేడు మనకున్న వనరులను బట్టి ఇంతకన్నా ఎక్కువేమీ చేయలేము అన్నారు. ఉన్నంతలో ఇది ఉత్తమమైన ప్రణాళికని ఆయన చెప్పారు. పోనీ ఆయన నుడివినట్లు ఆశించిన లక్ష్యాలను మనం సాధించగలమా? సాధించజాలమని నేను చెప్పుతున్నాను. ఎందువల్లనంటే ఈ లక్ష్యాలు సాధించడమనేది ఫ్యాక్టరీలలో ఉత్పత్తి చేయబడే వస్తువుల వినిమయాలపై ఆధారపడి వుంటుంది. ఉదాహరణకు మన జౌళిమిల్లులు ఇప్పటికే 54000 లక్షల గజాల వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నాయి. కాని ఆ వస్త్రాలను మనదేశంలో అమ్ముకోలేక విదేశాలకు ఎగుమతి చేసుకోవలసి వస్తున్నది. లేదా మిల్లులను మూసివేసుకోవలసి వస్తున్నది. ఇందుకు కారణం మనదేశంలోని ప్రజలకు అవసరమైన కొనుగోలు శక్తి లేకపోవడమే. పంచదార విషయాన్ని తీసుకుంటే 14 లక్షల టన్నుల వరకూ మనం ఉత్పత్తి చేస్తున్నాం. కాని 4 లక్షల టన్నులు ఖర్చు కాకుండా నిల్వ ఉండిపోతున్నది. అందువలన దాన్ని ఎగుమతి చేసుకోవాలని ప్రభుత్వం తీవ్రంగా యత్నించుతున్నది. ఇదీ మన పంచదార పరిశ్రమ పరిస్థితి! ఆహారం విషయం తీసుకొందాం. మన దేశంలో ఆహారం కొరత ఉన్నదని మనకు తెలుసు. ఆకలితో అల్లాడిపోతున్న వారు వున్నారు. ప్రభుత్వం ఏమి చెపుతున్నది? నేడున్న స్థితి ఆహారధాన్యాల నిల్వలేక కాదు, వున్న ఆహార పదార్థాలను కొనడానికి ప్రజలకు కొనుగోలు శక్తి కొరవడింది. ఆ కారణంగానే రాయలసీమలో, మైసూరులో, తమిళనాడులో తదితర ప్రదేశాల్లో ప్రజలు ఆకలితో అలమటించుతున్నారు. ఆంధ్రాలో గల మిగులు జిల్లాలో కూడా కొన్ని గ్రామ సీమల్లో వ్యవసాయ కార్మికులు తదితర నిరుపేదలు కొన్ని నెలలపాటు ఆహారం లేక అల్లాడిపోతున్నారు. ఇందుకు కారణం కంట్రోళ్లు తీసివేసిన తరువాత అంతకు



ముందున్న ధరలు రెట్టింపు పెరిగాయి. కంట్రోళ్లను తీసివేయడమంటే కొరత ప్రాంతాల్లోనూ, మిగులు ప్రాంతాల్లో కూడా ప్రజలు బ్లాక్ మార్కెటు రేట్లకు కొనుక్కోవలసి వస్తున్నది. మిగులు ప్రాంతాల్లోని వాస్తవిక పరిస్థితులను మొన్న ఆహారమంత్రి చెప్పడం మానివేశారు. కొరత ప్రాంతాల విషయమే చెప్పి వూరుకున్నారు. ధరలు తగ్గుతున్నాయని ఆయన చెప్పారు గాని వాస్తవంలో మిగులు ప్రాంతాల్లో కూడా బ్లాక్ మార్కెటు రేట్లకు అమ్ముతున్నారు. ఇంతకీ నిజమేమిటి? మన ప్రజల కొనుగోలు శక్తి ఎంత హీనంగా వున్నదంటే మన ఉత్పత్తి ఇంత తక్కువగా వున్నప్పటికీ మన ప్రజలు దాన్ని అనుభవించగల స్థితిలో లేరు. ఆహార ఉత్పత్తిలో మనం పెట్టుకుని లక్ష్యాలు తక్కువే అయినప్పటికీ, ఆ పెరిగిన పంటను ఎలా పారిశ్రామికవేత్తలు, ధాన్యం పండించే రైతాంగం ఉత్పత్తి పెంచడానికి ముందుకు రారు. ఆ విధంగా ఈ ప్రణాళికలో నిర్దేశించబడిన లక్ష్యాలు ఎంత తక్కువగా ఉన్నప్పటికీ వాటిని కూడా సాధించుకోజాలమన్న విషయం గుర్తించడం అవసరం. మన పారిశ్రామిక సంస్థలు, వ్యవసాయదారులు ఉత్పత్తి చేసే సరుకులు ప్రజలకు అందాలంటే మన ప్రజలపైన ఉన్న భారాలను తగ్గించాలి. కాని ప్రభుత్వం వారికి అవసరమైన కనీస వేతనాలను సహితం గ్యారంటీ చేయలేకపోతున్నది. రైతాంగాన్ని అప్పుల నుండి, విపరీతమైన శిస్తుల, పన్నుల భారం నుండి విముక్తి కలుగజేయనిదే వారి కొనుగోలు శక్తి పెరగదు.

**డిప్యూటీ ఛైర్మన్ః** మీటైమ్ అయిపోయింది.

**సుందరయ్యః** ఇంకా చెప్పవలసిన వివరాలను పూర్తి చేస్తాను. అయితే, ఇప్పుడు మార్గమేమిటి? జాతీయ ప్రణాళికా కావలసిందే. మన ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలని మనం కోరుకొంటున్నాం. ఇందుకు మార్గం నిర్ణయించిన గరిష్ట పరిమితికి మించిన భూమిని పేదలకు పంచాలి. రుణాలను తగ్గించాలి. రైతులకు గిట్టుబాటు ధరలను నిర్ణయించాలి. అప్పుడు రైతులు భారాల నుండి విముక్తి పొంది వ్యవసాయాభివృద్ధికి ఉత్సాహంగా కృషి చేస్తారు.

ఇంక పరిశ్రమలను గురించి చెప్పాలంటే పెట్టుబడి దారులకు లభించుతున్న లాభాలను పరిమితం చేయాలి. పెట్టుబడిదారులకు వచ్చే లాభాలను తిరిగి పరిశ్రమలను స్థాపించేందుకు మరల్చాలి. అప్పుడు మనకు అవసరమైన పెట్టుబడులు లభించుతాయి. అయితే వేతనాలను తగ్గించే ప్రయత్నాన్ని అరికట్టాలి. కార్మికులకు న్యాయమైన వేతనాలను చెల్లించాలి. జీతాలతో పాటు, వారి ఉద్యోగాలను కూడా గ్యారంటీ చేయాలి. అప్పుడు మీ నివేదికలో కోరినట్లు పారిశ్రామిక రంగంలో శాంతియుత సంబంధాలు ఏర్పడతాయి. ఈ విధంగా ఇప్పుడున్న దానికి పూర్తిగా విభిన్నమైన సామాజిక లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో సాహసోపేతమైన చర్యలను ఇటు వ్యవసాయరంగంలోనూ, అటు పారిశ్రామిక రంగంలోనూ తీసుకోవాలి. అప్పుడే ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థ జయప్రదం కాగలదు. కాని మీరు ఆ విధంగా చేయ నిరాకరించడం వల్ల నేను సవరణను ప్రతిపాదించవలసి వచ్చింది. లక్ష్యాలను సాధించేందుకు నేను సూచించిన ప్రతిపాదనలు అమలు జరగకపోతే మన ప్రజల పరిస్థితి ఆర్థికంగాగాని, సాంఘిక, సాంస్కృతికంగా ఏ మాత్రం మారబోదు.

# ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం బిల్లుపై

## (సెప్టెంబరు 2, 1953)

**సుందరయ్య:** అధ్యక్షా! ఎట్టకేలకు ఈ సభ ఆమోదానికై ప్రవేశపెట్టబడిన ఆంధ్ర రాష్ట్ర బిల్లును మేము ఆహ్వానించుతున్నాం. ఎంతగానో జాప్యం జరిగిన తరువాత బిల్లులో ఎన్నో లోపాలు వున్నప్పటికీ ఈ బిల్లును నేను ఆహ్వానించుతున్నాను.

ఈ బిల్లులోని వివిధ అంశాలను గురించి హోంమంత్రి ప్రసంగాన్ని గురించి ప్రస్తావించే ముందు ఇప్పుడే పూర్తి చేయబడిన డాక్టర్ అంబేద్కర్ ప్రసంగాన్ని గురించి నేను కొంత చెప్పదలచాను. ఆయన భాషా రాష్ట్రాల నిర్మాణానికి వ్యతిరేకంగా మాట్లాడారు. కులతత్వమనే పాత వాదనే ఆయన ప్రసంగానికి ప్రాతిపదిక. ఇందుకు ఆయన ఆంధ్ర రాష్ట్రాన్నే ఉదాహరణగా తీసుకొని వచ్చారు. భాషా రాష్ట్రాలు ఏర్పడితే ఒక కులం మరో కులంపై ఆధిపత్యం వహించగలదని అందువలన భాషా రాష్ట్రాలను తాను వ్యతిరేకించుతున్నామని చెప్పారు. ఆంధ్రలో రెడ్లు, కమ్మవారు, కాపులు ఆధిపత్యం వహించే కులాలని ఆయన చెపుతున్నారు. భూములన్నీ వారి స్వాధీనంలో వుంటాయని, హరిజనులు లేదా అస్పృశ్యులు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారని ఆయన చెప్పారు. ఆంధ్రాకు సంబంధించిన విషయాలు డాక్టర్ అంబేద్కర్ కంటే మాకే ఎక్కువ తెలుసు. నిజమే హరిజనులు అంతులేని ఇబ్బందులను ఒక్క ఆంధ్రలోనే కాదు, దేశంలో ఇతర ప్రాంతాలలో కూడా గురవుతున్నారు. అయితే, వారి ఇబ్బందులను తొలగించడానికి ఒక కులానికి వ్యతిరేకంగా మరో కులాన్ని నిలబెట్టడం పరిష్కార మార్గం కాజాలదు. రెడ్లు అందరికీ భూములుండవని డాక్టర్ అంబేద్కర్ తెలుసుకోవాలి. అలాగే కమ్మ కులస్తులందరికీ భూములుండవు. కాపుల విషయం కూడా అంతే. గత 20 సంవత్సరాలు అంతకుపైగా మేము ఆంధ్రలో రెడ్డి, కమ్మ తదితర కులాలకు చెందిన పేదల మధ్య పనిచేస్తున్నాం. దోపిడీకి గురవుతున్న వివిధ కులాలకు చెందిన జనాన్ని మేము ఐక్యం చేయగలుగుతున్నాం. ఈ రకం కృషి చేసినందుకే ప్రజలు మాకు ఓటు చేసి ఇక్కడికి పంపించారు. కులతత్వాన్ని ప్రచారం చేసినందుకు, లేదా ఒక కులానికి వ్యతిరేకంగా మరో కులాన్ని పోటీ పెట్టినందుకు మమ్ములను ఎన్నుకొని ఇక్కడికి ప్రజలు పంపించలేదు.

డాక్టర్ అంబేద్కర్ నేడిక్కడ హరిజనుల తరపున మాట్లాడుతున్నట్లు చెప్పుకున్నారు. 1947 నుండి 1951 వరకూ ఆయన కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా వున్నారు. ఆయన మంత్రిగా వున్న ఆ ప్రభుత్వమే ఆంధ్రలోనూ, తెలంగాణాలోనూ భూస్వాముల నుండి భూములను స్వాధీనం చేసుకుని, పేదలకు పంచాలని ఆందోళన చేసిన వారిని కాల్చి చంపింది.



ఒక గ్రామంలో ఒకానొక రెడ్డికి 1400 ఎకరాలు వున్నాయని ఆయన చెప్పారు. మరి ఆయన, ఆయన అనుచరులూ ఆ భూమిని స్వాధీనం చేసుకుని భూమి లేని నిరుపేదలకు– వారు ఏ కులానికి చెందిన వారైనప్పటికీ పంచాలని మాతో పాటు ఆందోళనలో పాల్గొంటారా అని నేను ప్రశ్నించుతున్నాను. లేదు. ఆయన అలా చేయరు. ఆయన కేంద్ర మంత్రివర్గంలో వున్నప్పుడు ఆ పని ఆయన చేయలేదు. ఈ రోజు ఇక్కడికి వచ్చి తాను కిరాయి మనిషిని తప్ప మరొకటి కాదని చెప్పుకొంటున్నారు.

**పి.వి.నారాయణ (మద్రాసు):** రేపు ఆయన మరొకటి చెపుతారు.

**సుందరయ్య:** ఆయన మాటలను సీరియస్‌గా పరిశీలించవలసిందిగా సభావారిని నేను కోరుతున్నాను. ఈ రోజు వచ్చి తాను కిరాయి మనిషినని చెప్పుకొంటున్నారు.

**పి.వి.నారాయణ(మద్రాసు):** ఇప్పుడు మంత్రివర్గంలో లేరు కదా.

**సుందరయ్య:** సరే ఇంక ఈ విషయాన్ని వదిలేసి అసలు సమస్యకు వద్దాం. ఈనాడు భాషా రాష్ట్రాలు ఏర్పడబోతున్నాయి. ఇప్పటికైనా తన మనస్సు మార్చుకోవలసిందిగా డాక్టర్ అంబేద్కర్‌కు విజ్ఞప్తి చేస్తున్నాను. ఆయన తన జీవితాన్నంతటినీ కులరాజకీయాల్లోనే గడిపారు. హరిజనులు నేడు అనుభవిస్తున్న ఈ హీనమైన పరిస్థితులు మేము బాధ్యులం కాదు. మొత్తం ఈ సామాజిక వ్యవస్థే బాధ్యత వహించాలి. సమానమన్న నూతన ప్రాతిపదికపై సమాజాన్ని పునర్నిర్మించడానికి, ఈనాడు దోపిడీకి గురవుతున్న వారంతా, ఆ పరిస్థితి నుండి విముక్తి చెంది, నవజీవనాన్ని పొందేందుకు వీలుగా మన సమాజ నిర్మాణ స్థాపనకై మాతో పాటు పోరాడేందుకు కలిసి రావలసిందిగా ఆయనను కోరుతున్నాను. ఈ విభేదాలను గురించి, కులాల మధ్య తేడాలను గురించి ఎల్లప్పుడూ మాట్లాడే ఈ పెద్ద మనిషి ఐక్య భారతాన్ని వాంఛించే మొనగాడుగా ఇక్కడ ప్రసంగించారు. స్వార్థపర వర్గాల ఆస్తుల రక్షణకు గ్యారంటీ ఇచ్చిన మన రాజ్యాంగంలోని అభివృద్ధి నిరోధక క్లాజులను ప్రవేశపెట్టడానికి ఈయనే కారకుడు. ఇప్పుడు వచ్చి తాను స్వార్థపర వర్గాలకు కిరాయి వ్యక్తిగా పనిచేసినట్లు చెప్పుకొంటున్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు కుల రాజకీయాలకు మరో రూపమని వాదించే వారు అభివృద్ధి నిరోధకులు తప్ప మరొకరు కాదు.

ఇంక హోంమంత్రి డాక్టర్ కట్జు ప్రసంగం చూస్తే ఆయన బిల్లులో "భాషాపరమైన" అన్న మాటను వాడకుండా జాగ్రత్తపడ్డారు. ఒక విషయాన్ని ఆయనకు చెప్పదలచాను. తమ భాషలోనే పరిపాలనా వ్యవహారాలను నిర్వహించేందుకు గాను ఆంధ్ర ప్రజలు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని కోరుకొన్నందుకే అది ఏర్పడబోతున్నది. కాంగ్రెస్ నాయకత్వంలోనూ, మరి కొన్ని ఇతర పార్టీలోనూ 30 ఏండ్ల అనుభవం అనంతరం కూడా భాషా రాష్ట్రాల ఏర్పాటును అడ్డుకొని చరిత్ర గతిని వెనక్కి తిప్పాలని ఆలోచించేవారు ఇంకా లేకపోలేదు. వారి వూహాల్లో వుండదలస్తే వుండనీయండి కాని చరిత్ర మాత్రం ఆగదు. ప్రజలు వూరుకోరు. వారు తమ భాషా రాష్ట్రాలను సాధించుకొని తీరుతారు. కాంగ్రెస్ వారు గత 30 ఏండ్లుగా భాషా

రాష్ట్రాలు మనదేశంలో ఏర్పడాలని చెపుతూ వచ్చారు. పొట్టి శ్రీరాములు గారి ఆత్మహుతి అనంతరం, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు సాగిన మహోన్నతమైన ఆందోళన తదనంతరమైనా కాంగ్రెసు ప్రభుత్వం ముందుకొచ్చి తమంతట తాముగానే "భారతదేశంలోని రాష్ట్రాలను భాషా ప్రయుక్తంగా పునర్విభజించబోతున్నామని" చెప్పి, అలా చేసి వుంటే ఎంతో ఘనంగా వుండేది. ఎందువల్లనంటే భాష విస్మరించదగినది కాదు. ప్రజల మధ్య సంబంధాలను సన్నిహితం చేసే గొప్ప సాధనమది.

ఇప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాల పునర్విభజన కోసం ఉత్నతాధికారులు గల ఒక కమీషన్ నియమించుతానని చెబుతున్నది. కమిషన్‌ల కమిటీల నియామకాలతో అంతా విసిగి వేసారిపోయారు. ప్రజల అభీష్టాన్ని అనుసరించి మనదేశంలో రాష్ట్రాలను ఏ విధంగా పునర్విభజించాలన్న విషయాలు 30 ఏండ్ల తరువాత కూడా నిర్ధిష్ట అభిప్రాయం ఏర్పడకపోవడం దురదృష్టకరం. ఈ పునర్విభజనకై కమీషన్ నియామకం అనవసరం. థార్ కమీషన్ మనముందున్నది. పండిత మోతీలాల్ నెహ్రూ కమిటీ నుండి జె.వి.పి. రిపోర్టు వరకూ అనేక కమిటీలు, నివేదికలు మనముందున్నాయి. కనుక రాష్ట్రాల పునర్విభజన ఏ సూత్రాలపై జరగాలని ఇప్పుడు విచారించవలసిన అవసరం లేదు. ఇప్పుడు జరగవలసినదేమిటంటే అక్టోబరు, ఒకటవతేదీ కల్లా ఆంధ్ర రాష్ట్రం అవతరించుతుందని ప్రకటించడమే. దానితోపాటు ఆంధ్ర, కర్నాటక, కేరళ, మహారాష్ట్రలు, పంజాబీ భాషా రాష్ట్రాలను ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని ప్రభుత్వం ప్రకటించాలి. ఈ ప్రకటన 1953 అక్టోబరు ఒకటవ తేదీన ప్రకటించిన తరువాత వివిధ భాషా రాష్ట్రాలను భాషను ఆధారం చేసుకొని సరిహద్దులను నిర్ణయించేందుకు సరిహద్దు కమీషన్లను వేస్తే సరిపోతుంది. ఇది సులభంగా జరిగిపోయే క్రమం. తిరువాన్కూర్- కొచ్చిన్ రాష్ట్రం ఇప్పటికే ఏర్పడి వుంది. దానికి నేడు మద్రాసు రాష్ట్రంలో వున్న మలబార్‌ను కలిపి వేయండి. ఆ రాష్ట్రంలో తమిళభాషను మాట్లాడే ప్రాంతాలను తమిళనాడులో జేర్చండి. దీనితో కేరళ రాష్ట్రం ఏర్పడుతుంది. అలాగే హైద్రాబాద్‌లోనూ, బొంబాయి రాష్ట్రంలోనూ వున్న కన్నడ భాషా ప్రాంతాలను మైసూరు రాష్ట్రంలో కలిపి వేయండి. వాటిల్లో వున్న తెలుగు ప్రాంతాలను మినహాయించి అదే విధంగా బొంబాయి రాష్ట్రానికి హైద్రాబాద్, మధ్యప్రదేశ్‌లలోని మరాఠి ప్రాంతాలను కలిపి, అందులో నుండి గుజరాతీ ప్రాంతాలను మినహాయించితే మహారాష్ట్ర ఏర్పడుతుంది. అందువలన ఇదేమీ కష్టమైన పనేమీ కాదు. అయితే ప్రభుత్వం అందుకు నిశ్చయించుకోవాలి. ప్రభుత్వం వూగిసలాట వైఖరిని అవలంభించి కాలయాపన చేయరాదు. భాషా రాష్ట్రాలు ఏర్పడితే దేశ సమైక్యతకు విఘాతం ఏర్పడుతుందని వాదన పచ్చి నిందా ప్రచారం మాత్రమే. అది కేవలం సాకు మాత్రమే. ఈ సందర్భంలో భారతదేశ ఐక్యతను కోరుతున్నామనే వారికి నేనొక విషయాన్ని చెప్పదలచాను. వారికి నిజంగా భారత సమైక్యత పట్ల అంతగా శ్రద్ధాశక్తులుంటే, భారతదేశ భద్రతను నిజంగా వాంఛించుతున్న వారైతే, ముందుగా వారు హైద్రాబాద్ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయాలి.



భారతదేశ అనైక్యతకు, భద్రతా రాహిత్యానికి అది మూలంగా వుంది. అది గత రెండు శతాబ్దాల కాలంగా తెలుగు, కన్నడ, మహారాష్ట్ర ప్రజలకు బందిఖానాగా వుంటూ వచ్చింది. హైదరాబాద్‌ను ఒక స్వతంత్ర రాజ్యంగా చేయాలని బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో మంతనాలు చేసింది నైజాం నవాబేనని ఈ సందర్భంగా మీకు జ్ఞప్తికి తెస్తున్నాను. అంతేకాదు; పాకిస్తాన్ ప్రభుత్వంతో రాయబారులు జరిపింది కూడా నైజాం నవాబే. పాకిస్తాన్‌లో తమ ఏజెంట్లను కూడా వుంచారు. తమ సర్వస్వతంత్ర హోదాకు చిహ్నంగా హైద్రాబాద్ సమస్య నేటికీ ఐరాస ఎజెండాలో వున్న విషయాన్ని మరచిపోరాదు. ఈ విషయాలనన్నింటినీ మనం మరచిపోరాదు. అందువలన భారతదేశ సమైక్యతను, భద్రతను గురించి హెచ్చుగా మాట్లాడుతున్న వారు హైద్రాబాద్ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసి సమగ్రమైన ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్రలు ఏర్పడేందుకు పూనుకోవాలి. ప్రజాస్వామ్య ప్రియులంతా హైద్రాబాద్ రాష్ట్రాన్ని రద్దు చేయడానికి ప్రయత్నించాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఎందువల్లనంటే హైద్రాబాద్ సంస్థానం అనేక సంవత్సరాలుగా వివిధ జాతుల ప్రజలకు బందిఖానాగా వుంది.

అనేక లోపాలతో ఈ బిల్లు తేబడింది. హోమ్‌శాఖా మంత్రి డాక్టర్ కట్జూ ఈ బిల్లుకు సారధ్యం వహించినవారు. ఆయన ఆంధ్ర రాష్ట్రాన్ని గురించి తేలిగ్గా మాట్లాడారు. సరిహద్దు సమస్యపై కర్నాటక - ఆంధ్ర ప్రజల మధ్య, తమిళ- తెలుగు ప్రజల మధ్య విభేదాలు ఏర్పడగలవని ఆయన ఆలోచించుతున్నట్లు కనిపించుతున్నది. హైకోర్టు సమస్యను గురించి కూడా ఆయన తేలిగ్గా మాట్లాడారు. ఒక బాధ్యతాయుతమైన మంత్రి ఇలాంటి ముఖ్యమైన బిల్లును గురించి ఈ విధంగా వ్యవహరించడం ఏ మాత్రం సరికాదు. ఈ రకమైన విభేదాలను సాకుగా తీసుకొని అసలు భాషా ప్రయుక్త రాష్ట్రాల భావనే సరియైనది కాదని రుజువు చేయడానికి ఆయన ప్రయత్నించుతున్నట్లు కనిపించుతున్నది. రాజధాని ఎక్కడుండాలన్న సమస్యను నిర్ణయించుకోవలసింది ఆంధ్ర ప్రజలే. కాని ఈ రాజధాని సమస్యను వారు క్లిష్టం చేయదలచినట్లు నాకు అర్థమవుతుంది. అలాంటి దురుద్దేశ్యం లేనిపక్షంలో హైదరాబాద్ సంస్థానాన్ని రద్దు చేస్తే హైదరాబాదే మాకు రాజధానిగా చేయవచ్చు కదా. అలా కాకుండా దక్కన్ సంస్కృతి అనే పేరిట హైదరాబాద్ రాష్ట్రాన్ని యథాతథంగా వుంచాలనే ప్రయత్నం జరుగుతున్నది. నిజానికి అలాంటి దక్కన్ సంస్కృతి అనేది లేనేలేదు. హైదరాబాద్ విశాలాంధ్రకు సహజమైన రాజధాని. ప్రస్తుతానికి తాత్కాలికంగానైనా హైదరాబాద్‌ను ఆంధ్ర రాజధానిగా ప్రకటించవచ్చు. వారు చెపుతున్న తీరును బట్టి ఇప్పుడు కాకపోయినా రేపయినా హైదరాబాద్ రాష్ట్రాన్ని రద్దు చేయవలసిందే కదా. అప్పుడు ఆంధ్రకు హైదరాబాద్ రాజధాని అవుతుంది కదా. అలాంటప్పుడు కర్నూలును రాజధానిగా ఎందుకు నిర్ణయించినట్లు! కర్నూలు ఆంధ్రపట్టణమే. అయితే ఆంధ్ర ప్రజలంతా కమ్యూనిస్టు పార్టీయే కాదు. కృషీకార్‌లోక్ పార్టీ తదితర పార్టీలు చివరికి కాంగ్రెసు పార్టీలో అత్యధికులు కూడా విజయవాడ-గుంటూరు ప్రాంతంలో రాజధానిని నెలకొల్పాలని అభిప్రాయపడుతున్నారు. ఆ రకమైన ప్రజల అభిమతాన్ని

అనుసరించే విజయవాడ రాజధానిగా వుండాలని మేము కోరాము. అది అన్ని ప్రాంతాలకు కేంద్రంగా వున్న పట్టణం. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల వారికి అందుబాటులో ఉండే పట్టణమది. రాజకీయంగా, వాణిజ్యపరంగా, ఆర్థికంగా పంటలకు నిలయంగా వుండే ఆంధ్ర రాష్ట్రానికి కేంద్రంగా వున్న విజయవాడ- గుంటూరు ప్రాంతాన్ని వదిలివేసి ఒక మూలనున్న కర్నూలును రాజధానిగా ఎంపిక చేశారు. దీనంతటికీ బాధ్యత కాంగ్రెసు పార్టీదిగాక మరెవరిది కాదు.

ఇందుకు కారణం ఆంధ్రులంతా ఐక్యంగా ఉండటం ఇష్టం లేకనే. ఆంధ్రులు పరస్పరం కొట్లాడుకోవాలనేది వారి ఉద్దేశ్యం. కాంగ్రెసు పార్టీ ఆదేశం ఇచ్చినందుకు కొంతమంది ఆంధ్ర శాసనసభ్యులు కర్నూలుకు ఓటు చేశారు. కాని ప్రజాభిప్రాయం అందుకు వ్యతిరేకంగా వున్నదని స్పష్టపడటంతో జూలై 25వ తేదీన మద్రాసు శాసనసభలో కర్నూలుకు వ్యతిరేకంగా నిర్ణయించారు. విజయవాడ-గుంటూరు ప్రాంతం ఆంధ్రకు రాజధానిగా వుండాలని వారు కోరారు. ఆంధ్ర శాసనసభ్యులలో 62 మంది విజయవాడకు ఓటు చేయగా, 58 మంది అందుకు వ్యతిరేకంగా ఓటు చేశారు. కాంగ్రెసు ఆదేశం ఇచ్చినందున 12 మంది కాంగ్రెసు శాసనసభ్యులు విజయవాడకు ఓటు చేయకుండా తటస్థంగా ఉండిపోయారు. 138 మందిలో 72 మంది ప్రధానమంత్రికి లిఖితపూర్వకంగా రాయడమో లేక ఓటు చేయడం ద్వారానో విజయవాడ-గుంటూరు ఆంధ్రకు సహజమైన రాజధాని అనే అభిప్రాయాన్ని తెలిపారు. మళ్ళీ నేను కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయదలచాను. ఒకటి రెండు సంవత్సరాల్లో హైదరాబాద్ రాష్ట్రాన్ని రద్దు చేసి విశాలాంధ్ర నెలకొల్పదలిస్తే హైదరాబాద్ మా రాజధానిగా వుంటుంది. కర్నూలుగాని, మరో పట్టణంగాని "తాత్కాలిక" రాజధానిగా వుంటుంది. రాజధాని విషయంలో ఆంధ్రలో భేదాభిప్రాయాలున్నాయని ప్రచారం జరుగుతున్నది. దీనంతటికీ కారణం కాంగ్రెసు పార్టీయే.

ఇంక ఇప్పుడు సరిహద్దుల సమస్యను తీసుకొని వచ్చారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినప్పుడు మేము భాషా సూత్రానికి కట్టుబడ్డాం. తెలుగు ప్రజలు అత్యధిక సంఖ్యలో వున్న ప్రాంతాలతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలనేది మా సూత్రం. ఎందువల్లనంటే మైనార్టీ భాషలవారు ఎంత తక్కువ మంది వుంటే పరిపాలన రీత్యా విద్యాబోధనాపరంగా రాష్ట్ర వ్యవహారాలు అంత సజావుగా సాగడానికి సులభమవుతుంది. అందువల్లనే మా పార్టీ మొట్టమొదట నుండి మద్రాసు నగరాన్ని ఆంధ్ర రాష్ట్రంలో చేర్చడానికి వ్యతిరేకం. ఆ నగరంలో 75 శాతం ఆంధ్రేతరులు- ముఖ్యంగా తమిళులు. మద్రాసు ఆంధ్రకు రావాలని తగాదా పడుతున్నది కాంగ్రెసు పార్టీయే. మద్రాసు తమిళనాడుకు చెందాలనేది మా పార్టీ వైఖరి. ఇక సరిహద్దు విషయం. ఈ సందర్భంగా సరిహద్దుల్లో రెండు భాషలు మాట్లాడేవారుంటారు. మైనార్టీ భాషల వారికి తమ స్వభాషలో విద్యాబోధన, పరిపాలనా అవకాశాలను కల్పించగలిగితే, అప్పుడు అనవసర తగాదాలుగాని, అసంతృప్తికాని వుండదు.



ఆ తరువాత హైకోర్టు సమస్య వుంది. రాజధాని కంటే హైకోర్టు ముఖ్యమని న్యాయశాఖా మంత్రి అంటున్నారు. సాధ్యమైనంత త్వరలో ఆంధ్రకు ప్రత్యేక హైకోర్టు ఏర్పడాలనేది మా అభిప్రాయం. అప్పుడు కోర్టు వ్యవహారాలు ప్రజల భాషలో నిర్వహించుకోవడానికి వీలవుతుంది. ఇంక ఆస్తులు, అప్పుల విభజన విషయంలో జనాభా ప్రాతిపదిక ననుసరించి జరగాలనేది మా పార్టీ అభిప్రాయం.

ఈ బిల్లులో అనేక లోపాలు ఉన్నప్పటికీ ఎలాంటి జాప్యం లేకుండా అక్టోబరు ఒకటికల్లా ఆంధ్ర రాష్ట్రానికి ప్రారంభోత్సవం జరపాలని నేను కోరుతున్నాను. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పడదంటే అందుకు కారణం కాంగ్రెసు పార్టీదే. ఏదో విధంగా అధికారాన్ని అంటి పెట్టుకోవాలనేదే కాంగ్రెసు ఉద్దేశ్యంలా ఉంది. రాజధాని సమస్య, ఆఫీసర్ల విభజన, ఇంకా ఇతర సమస్యలను గురించి నిర్ణయాలను తీసుకొనేందుకు స్పెషల్ ఆఫీసర్ ఒక సలహా సంఘాన్ని ఏర్పాటు చేశారు. అందులో పి.యస్.పి.కి., కె.యల్.పి.కి, కాంగ్రెసుకు ప్రాతినిధ్యం కల్పించినప్పటికీ అసోసియేట్ సభ్యులతో కలిసి కమ్యూనిస్టు పార్టీలో 50 మంది సభ్యులున్నప్పటికీ ఆ సలహా సంఘాలలో మా పార్టీకి ప్రాతినిధ్యం కల్పించదలచలేదు. రాజ్యాంగాన్ని సస్పెండ్ చేసి, గవర్నర్ పరిపాలననైనా ఏర్పరచదలచుకున్నారుగాని, కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వాన్ని నెలకొల్పదలచలేదు. ఆంధ్రలో నేడు అన్ని పార్టీల కంటే పెద్ద పార్టీగా వున్న కమ్యూనిస్టు పార్టీని నిర్లక్ష్యం చేస్తున్న దానిని బట్టి కాంగ్రెస్ పార్టీ వైఖరిని అనుమానించవలసి వస్తున్నది.

ఆంధ్రలో కాంగ్రెసు పార్టీ సుస్థిర ప్రభుత్వాన్ని నెలకొల్పగల స్థితిలో లేదు. భాషా ప్రయుక్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినందున ఆంధ్రలో సుస్థిర ప్రభుత్వాన్ని నెలకొల్పడం సాధ్యం కాలేదనే సాకును కూడా చూపెడతారు. ఇది కేంద్రంలోనూ, ఇక్కడ వున్న కాంగ్రెసు వారి దివాళాకోరుతనం తప్ప మరొకటేమీ కాదు.

# విదేశాంగ విధానంపై

## (1954 ఆగస్టు 26)

**భా**రత ప్రభుత్వం నేడు అనుసరించుతున్న విదేశాంగ విధానం పూర్తిగా బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై ఆధారపడి కొనసాగుతున్నది. ఇది చాలదన్నట్లు మన ప్రభుత్వం అమెరికాకు కూడా పూర్తిగా లొంగిపోయే విధానాన్ని అనుసరించాలని డాక్టర్ అంబేద్కర్ కోరుతున్నారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్రభావం క్రింద మన ప్రభుత్వం వున్నదనడానికి గోవా విషయంలో మనం అనుసరించుతున్న పాలసీనే ఉదాహరణగా తీసుకోవచ్చు. మనదేశ స్వాతంత్ర్యాన్ని సంరక్షించి, దాన్ని బలపరచుకోవడమేగాక, ఆసియా, ఆఫ్రికాలలో సామ్రాజ్యవాదుల బానిసత్వంలో వున్న దేశాల ప్రజలు తమ విముక్తి కోసం సాగించుతున్న పోరాటాలకు మద్దతుగా అదే సందర్భంగా ప్రపంచ శాంతిని కాపాడేదిగా మన విదేశాంగ విధానం వుండాలి. భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, చైనా ప్రధాని చౌ ఎన్ లైలు రూపొందించిన పంచశీల సూత్రాలను పాటించినప్పుడే మన స్వాతంత్ర్య సమర సత్సంప్రదాయాలనూ, సామ్రాజ్యవాదవ్యతిరేక పాలసీలనూ ముందుకు తీసుకొని వెళ్లిన వారమవుతాం. ఇదే దృక్పథంతో మనం నేడు ఇండో-చైనాతో మనపొత్తును నిర్వహించుతున్నాం. ఆ కమీషన్‌కు అధ్యక్ష పదవిని ఇండియా అంగీకరించింది. ఈ కమీషన్ అక్కడ శాంతిని సాధించడమే గాక, కడకు ఇండో-చైనా దేశాలలో ప్రజా ప్రభుత్వాలను ఏర్పరచేందుకు దోహదపడాలి. అయితే కొరియాలో అనుసరించిన బలహీనమైన విధానాన్ని ఇక్కడ విడనాడాలి. ఇక్కడ కూడా అమెరికా సామ్రాజ్యవాదులు తమ బ్రిటిష్ సహచరులతో కలసి ఇండో-చైనా ఒడంబడికను విచ్ఛిన్నం చేసే ప్రమాదం లేకపోలేదు. వారు ఇప్పటికే భారత ప్రభుత్వంపైనా, అక్కడ మన ఆఫీసర్లపైనా అనేక రీతుల్లో వొత్తిడులను తీసుకొని వస్తున్నారు. సియాటో ఒప్పందం పరిధిలోకి లావోస్‌ను, కంబోడియాను, దక్షిణ వియత్నాంను లాగడానికి, చైనా వొడంబడిక సక్రమంగా అమలు జరగకుండా అనేక అవరోధాలను కల్పించుతున్నారు. ఈ విషయంలో భారత ప్రభుత్వం దృఢమైన వైఖరిని తీసుకోవాలని నేను కోరుతున్నాను. బ్రిటిష్ వారి సహాయంతో అమెరికా సామ్రాజ్యవాదులు జెనీవా ఒప్పందాన్ని ధ్వంసం చేయకుండా తగు జాగరూకతను ప్రదర్శించాలి. అమెరికా వారు, వారి జూనియర్ భాగస్వాములైన బ్రిటిష్ వారు కలిసి ఏర్పాటు చేస్తున్న సియాటో ప్రపంచశాంతిని రక్షించలేదని మన ప్రధాన మంత్రి భావించడం సరిగానే వుంది. సియాటో ప్రపంచ శాంతినే కాదు, ఆసియా శాంతినీ కాపాడలేదు. అది యుద్ధాన్ని అసియా గడ్డపైకి తీసుకొని వస్తుంది. అందువల్లనే ఇండియా సియాటో ఒప్పందంలో చేరబోదని ప్రధానమంత్రి స్పష్టంగా ప్రకటించడం హర్షించదగిన విషయం.



అంతవరకూ బాగానే వుంది. అయితే ఆర్థికంగా కూడా మనదేశం సియాటోతో ఎలాంటి సంబంధాన్ని పెంచుకోబోదని ప్రధాని ప్రకటించాలి. సియాటోతో కలసి వుండటం వలన ఆగ్నేయాసియాలో ఆర్థికాభివృద్ధి అవకాశాలు వుండగలవని వారు చెపుతున్నారు. ఈ విధంగానే వారు పశ్చిమ యూరప్‌లో మార్షల్ సహాయ కార్యక్రమాన్ని ప్రారంభించి చివరికి నాటో ఒప్పందంలో ఆదేశాలనన్నింటినీ జేర్చిన విషయం మనకు తెలుసు. నాటో శాంతికిగాక దురాక్రమణ కుట్రలకే ఉపయోగపడుతుందనే విషయం ప్రధానమంత్రికి కూడా తెలిసిన సంగతే. అందువలన సియాటో మనదేశాన్ని ఆర్థికంగా లంకెవేయడానికి జరిపే పన్నాగాలను గురించి భారత ప్రభుత్వం జాగ్రత్తవహించాలని నేను కోరుతున్నాను.

జపాన్, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, పాకిస్తాన్‌లు ఒక సైనిక ఒడంబడిక చేసుకొన్నాయి. ఆ దేశాలు అమెరికా సామ్రాజ్యవాదులను తమ గడ్డపై సైనిక కేంద్రాలను నెలకొల్పుకోవడానికి అనుమతినిచ్చాయి. అయితే అవన్నీ ఆసియాదేశాలే. ఆసియా దేశాల సమావేశాలలో మన దేశం కూడా పాల్గొనడం అవసరం. అయితే అమెరికా సామ్రాజ్యవాదులకు తమ దేశాల్లో సైనిక కేంద్రాలను నెలకొల్పుకోవడానికి అనుమతినివ్వడం ఎంత ప్రమాదకరమో వారికి ఇండియా నచ్చజెప్పేందుకు యత్నించాలి. అలా వారిని చొరబడనివ్వడమంటే మరలా ఆ దేశాలు బానిసత్వంలోకి వెళ్లడమేనన్న విషయాన్ని విశదీకరించాలి. ఇది ఆదేశాలకేకాక ఆగ్నేయాసియా దేశాలన్నింటికీ ఆంగ్లో-అమెరికా సామ్రాజ్యవాదుల ఆధీనంలోకి తీసుకొని వెళ్లడానికి దోహదపడుతుందని చెప్పాలి. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నేటికీ హాంకాంగ్‌లోనూ, మలయాలోనూ, తిష్టవేసి వున్నారు. దురదృష్టకరవశాత్తూ మన ప్రభుత్వం కూడా నికోబార్ దీవులను ఆర్.ఎ.ఎఫ్. విమాన కేంద్రానికి కౌలుకిచ్చింది. ఆసియా దేశాల సమావేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకేగాక, ఫ్రెంచి సామ్రాజ్యవాదులకు కూడా స్థానం వుండరాదు. అదేవిధంగా మూడో ప్రపంచ యుద్ధానికి తయారవుతున్న అమెరికా సామ్రాజ్యవాదులను కూడా ఆ దరికి చేరనీయరాదు. సమావేశం కేవలం ఆసియా దేశాలకు మాత్రమే పరిమితం కావాలి. ఆ విధంగా ఆసియాలో శాంతిని నెలకొల్పడం ద్వారా మొత్తం ప్రపంచంలో శాంతి స్థాపనకు మనం దోహదపడాలి. అమెరికా సామ్రాజ్యవాదులు- వారి జూనియర్ భాగస్వాములైన బ్రిటిష్ వారి పన్నాగాలను సాగనీయరాదు.

**ఒక సభ్యుడు:** మరి రష్యన్ సామ్రాజ్యవాదం సంగతేమిటి?

**సుందరయ్య:** ఇంతకుముందే నేను చెప్పినట్లు మన విదేశాంగ విధానంలోని ముఖ్యమైన బలహీనత ఏమంటే మన ప్రభుత్వం బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై ఆధారపడటమే. మలయా విషయంలో మన ప్రభుత్వం ఎందుకు మౌనం వహించాలి? గూర్ఖా సైనికులను రిక్రూట్ చేయడానికి మనం ఎందుకు అంగీకరించాలి? మలయా, హాంకాంగ్‌లలో గూర్ఖా సైనికులను, నేపాల్ సైనికులను బ్రిటిష్ వారి యుద్ధాలకు ఎందుకు సహాయపడనివ్వాలి? మన ఆసియా ప్రజలనే వూచకోతకోయడానికి ఎందుకు అవకాశం కల్పించాలి? ప్రధానమంత్రి ఎప్పుడు మాట్లాడినా ఆసియా ప్రజల సంఘీభావాన్ని గురించి చెపుతారు. ఇందుకు ప్రతి భారతీయుడు

ప్రధానమంత్రిని సమర్ధించవలసిందే. అయితే గూర్ఖా సైనికులను, నేపాల్ సైనికులను బ్రిటిష్ వారు రిక్రూట్ చెయ్యడానికి ఎందుకు అనుమతినివ్వాలని మన ప్రధానమంత్రిని అడగాలి. వారు మలయా ప్రజలను పూచకోత కోస్తుంటే మన ప్రభుత్వం ఎందుకు మౌనం వహించాలి. ఆ హత్యాకాండను నిలుపుదల చేయడానికి మన ప్రభుత్వం గట్టి చర్యలను ఎందుకు తీసుకోరాదు?

ఆఫ్రికాలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మారణ హోమాన్ని సాగించుతున్నారు. మన పట్ల వారు ఎలా వ్యవహరిస్తున్నారో జ్ఞప్తికి తెచ్చుకోండి. కాశ్మీర్ సమస్యపై వారు పాకిస్తాన్‌ను సమర్ధించుతున్నారు. ఆఫ్రికాలో తెల్లవారిని కమ్మేసుకోవడం మనం చూస్తున్నాం. అమెరికా-పాకిస్తాన్ సైనిక కూటమిని వారు బలపరుస్తున్నారు. ఇప్పుడేమో గోవా విముక్తి కోసం మనం సాయుధ జోక్యం కల్పించుకోరాదని ఈ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మనలను నేడు హెచ్చరించుతున్నారు. ఇదంతా మనకు ఏమి తెలుపుతున్నది? సభలోను వెలుపలా కూడా ప్రధానమంత్రి నాటో ఒడంబడిక మన దేశంలోని పోర్చుగీస్ ప్రాంతానికి వర్తించదని చెప్పుతారు. ప్రధానిమంత్రి ఏమి చెబుతున్నప్పటికీ నాటో రాజ్యాలు మనదేశంలో జోక్యం చేసుకుంటున్నాయి. తాము ఇండియాను విడిచి పెట్టినట్లే పోర్చుగీస్ వారు కూడా ఇండియా నుండి వైదొలగాలని బ్రిటిష్ వారు ఎందుకు అనడం లేదు? పై పెచ్చు పోర్చుగీస్ సామ్రాజ్యవాదుల పట్ల మనం ఎలా వ్యవహరించాలో మనకు వారు సుద్దులు చెపుతున్నారు. పోర్చుగీస్ వారి ఆక్రమణలో వున్న మూడు ప్రాంతాల వారు మాత్రమే వాటి విముక్తి పోరాటంలో పాల్గొనేందుకు అర్హులట. తతిమ్మా భారతీయులు గోవాలో ప్రవేశించి పోరాటంలో పాల్గొనరాదట. గోవాలోకి తతిమ్మా భారతీయులు వెళ్లకుండా అడ్డుకొన్నది పోర్చుగీస్ సైనికులు కాదు. భారతీయ పోలీసులే. గోవా, డామన్ దయ్యూలలో సోదర భారతీయుల సహాయానికి వెళ్లే వారిని భారత పోలీసులు అడ్డుకోవడం కంటే సిగ్గుచేటైన విషయం మరొకటి వుండగలదా? గోవన్లు ప్రత్యేక జాతివారని, వారి విముక్తి పోరాటంలో భారతీయులు పాల్గొనరాదని ప్రధాన మంత్రి ఎప్పటినుండి అనుకుంటున్నారు? గోవన్లు భారతదేశంలో ఒక భాగం. అందువలన గోవన్లు భారతీయులే. అందువలన దాన్ని గురించి ప్రశ్నించే సమస్యే లేదు.

**జవహర్‌లాల్ నెహ్రూ:** గత ఆరున్నర సంవత్సరాల నుండి ఇదే మన విధానం. పుదుచ్చేరి గురించీ, గోవాను గురించీ ఇదే విషయాన్ని అదే పనిగా ప్రకటించుతూ వస్తున్నాం.

**సుందరయ్య:** అదే మన పాలసీ అయివుంటే మనవాళ్ళు గోవా, డామన్, దయ్యూల విముక్తి పోరాటానికి సహాయపడుతున్నప్పుడు భారతీయ పోలీసులు ఎందుకు జోక్యం చేసుకొంటున్నారు? బ్రిటిష్ వారు ఇతర ప్రాంతాల విషయంలో కాకుండా గోవా విషయంలో నోట్ పంపించడమే కారణం కాదా? ఏడేండ్ల నుండి ఇదే మన విధానమని ప్రధానమంత్రి చెప్పుతున్నారు. కాని ఇతర ప్రాంతాల విషయంలో అనుసరించనిది గోవా విషయంలోనే ఎందుకు అనుసరించుతున్నట్లు?



# ఆంధ్రరాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధింపుపై

## (29-11-1954)

**ఆం**ధ్రరాష్ట్ర పరిపాలనా బాధ్యతలను తాను కైవశం చేసుకొంటూ రాష్ట్రపతి చేసిన ప్రకటనను నేను వ్యతిరేకిస్తున్నాను. రాష్ట్రపతి తీసుకున్న ఈచర్యను సమర్ధించుతూ హోంశాఖ మంత్రి డాక్టర్ కట్జూ కొన్ని లెక్కల వివరాలను, మరికొన్ని విషయాలను ఇప్పుడే తెలిపారు. ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తనకు గల హక్కును ప్రతిపక్ష నాయకుడుగా వున్న కమ్యూనిస్టు పార్టీ నాయకుడు డిమాండ్ చేయగా అవహేళన చేస్తూ డాక్టర్ కట్జూ మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ అంటే కాంగ్రెస్‌కూ, డాక్టర్ కట్జూకూ సహజంగానే గిట్టదు.

అధికార పదవులను కైవసం చేసుకోవాలనే ఆరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకుడు వున్నాడంటూ డాక్టర్ కట్జూ లోక్‌సభలో మరీ దుందుడుకు ధోరణిలో మాట్లాడారు. విశ్వాసరాహిత్య తీర్మానం ఫలితంగా ఓడిపోయిన కాంగ్రెస్ మంత్రివర్గం స్థానంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి ప్రతిపక్షనాయకుడుగా తనకు అనుమతివ్వమని మా పార్టీ నాయకుడు కోరిన పాపానికి డాక్టర్ కట్జూ తెలివి తక్కువగానూ, అవినీతికరంగానూ, రాజ్యాంగాన్ని అవమాన పరచేవిధంగానూ, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నట్లుగానూ ఇలా ఏవేవో మాటలంటూ నోరుపారేసుకున్నారు. ఈ సందర్భంగా ఎవరు తెలివి తక్కువగానూ, అవినీతికరంగానూ ప్రవర్తిస్తున్నారో, ఎవరు రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నారో, ఎవరు రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారో డాక్టర్ కట్జూతో సహా యావత్తు ప్రపంచమూ తెలుసుకోవాలని నేను కోరుతున్నాను. కాంగ్రెస్ పార్టీయే తెలివి తక్కువగానూ, అవినీతికరంగానూ, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే పద్ధతిలోనూ వ్యవహరించుతున్నదని నేను స్పష్టం చేయదలచాను.

### 1952 ఎన్నికల అనంతరం పరిస్థితి

అసలు పరిస్థితి ఏమిటో సరిగ్గా అవగాహన చేసుకోవలసిందిగా గౌరవనీయులైన సభ్యులను నేను కోరుతున్నాను. డాక్టర్ కట్జూ తెలిపిన విధానానికి నేను వాస్తవమైన లెక్కలను తెలుపుతాను. 1952 ఫిబ్రవరిలో జరిగిన జనరల్ ఎన్నికల అనంతరం ఆంధ్ర శాసనసభలో ఏర్పడిన పరిస్థితి ఈ విధంగా ఉంది. కమ్యూనిస్టు పార్టీ 42 స్థానాలను గెలుచుకున్నది. 41 స్థానాలు మొదట జరిగిన ఎన్నికల్లోనూ ఆ తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో మరొక దానిని. కమ్యూనిస్టుల పూర్తి సహాయ సహకారంతో మరో ఎనిమిది స్థానాల్లో ఇండిపెండెంట్స్

గెలుచుకొన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పరచే పక్షంలో మేము పెట్టిన షరతులకు కట్టుబడి మాతోనే వుంటామని వారు సంతకాలు చేసి మాకు పత్రాలను ఇచ్చారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విషయంలో కాంగ్రెస్‌తో మాత్రం తాము ఎన్నటికీ చేరబోమని కూడా వారు స్పష్టంగా ప్రకటించారు. ఆ విధమైన అవగాహనతోనే ఆ ఎనిమిది మంది ఇండిపెండెంట్లూ శాసనసభకు ఎన్నికయ్యారు. కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ 20 సీట్లను గెలుచుకున్నది. కాంగ్రెస్ పార్టీ కుళ్ళిపోయిందని, దాన్నుండి పురుగులు బయటకు వస్తున్నాయని ఆ పార్టీ నాయకుడైన శ్రీ టంగుటూరు ప్రకాశం గారు బహిరంగంగానే చెప్పారు. కాంగ్రెస్‌ను ఆ విధంగా వర్ణించిన వ్యక్తినే కాంగ్రెస్ పార్టీ ఆ తరువాత తమ పార్టీలో చేర్చుకొని, ఆయన్నే ముఖ్యమంత్రిగా చేసింది. దానిని బట్టే కాంగ్రెస్ పార్టీ నీతి ఏమిటో తెలుసుకోగోరుతున్నాను. ఆనాడు ప్రకాశం గారు ప్రజలకు చెప్పినదేమిటి? కాంగ్రెస్‌తో తన కెలాంటి సంబంధం లేదన్నారు. అంతేకాదు, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తాను పోరాడతానన్నారు. ఇతర అభ్యుదయ పార్టీలతో కలిసి తాను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. అంతకు ముందు మూడు సంవత్సరాలుగా ఆంధ్ర ప్రజలపై అనేక రకాలుగా అత్యాచారాలు జరిపిన దుష్ట కాంగ్రెస్ నాయకులను ఓడించడమే తన ధ్యేయమని అనేక ప్రదేశాల్లో జరిగిన బహిరంగసభల్లో ప్రకాశం గారు చెప్పారు.

ఇంతేకాదు, ఆనాటి ఎన్నికల్లో వ్యక్తిగత ప్రాతిపదికపై మరో 15 సీట్లు కమ్యూనిస్టుల సహాయంతో కైవసం చేసుకోబడినాయి. ఈ లెక్కలన్నీ బహిరంగమే. ఎవరైనా తనిఖీ చేసుకోవచ్చు. దీనిని బట్టి నేటి పరిస్థితి ఏమిటి? 140 మంది సభ్యులలోనూ కమ్యూనిస్టులుగాని, వారి సహాయ సహకారాలతో గాని గెలిచిన వారు మొత్తం 65 మంది వున్నారు. మరొక ఆరుగురు సోషలిస్టు పార్టీ టిక్కెట్టుపై గెలిచిన వారున్నారు. మొత్తం 140 సీట్లలోనూ కాంగ్రెస్‌కు 40 సీట్లు మాత్రమే వున్నాయి. గెలిచిన ఇండిపెండెంట్లు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోటీచేసి ఎన్నికైన వారేగానీ కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా పోటీచేసి గెలిచినవారు కాదు. అలాగే వీరంతా కృషి కార్‌లోక్ పార్టీకిగాని, ప్రజాపార్టీకిగాని వ్యతిరేకంగా నిలబడి గెలిచిన వారు కాదు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోటీచేసి ఎన్నికైన వారే.

అంటే ఏమిటి? కాంగ్రెస్ పతనం చెందుతున్న పార్టీ అని వారంతా ప్రజలకు చెప్పి గెలుపొందారు. కాంగ్రెస్ అభివృద్ధి నిరోధక పార్టీ అనీ, ప్రజలు కాంగ్రెస్ పార్టీపై పెట్టుకొన్న విశ్వాసానికి అది ద్రోహం చేసిందని, లోగడ అది ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ భంగపరిచిందనీ, అందువలన కాంగ్రెస్‌ను ఎన్నుకోవద్దని, వారు ప్రజలకు చెప్పారు. ఇతర పార్టీలు చేసిన వాగ్దానాలను, చెప్పిన మాటలను ఆధారం చేసుకొనే ప్రజలు వారిని ఎన్నుకొన్నారు. కాని ఆ తరువాత ఏమి జరిగిందో మీకు తెలిసిన విషయమే. 1952లో మద్రాసు రాష్ట్రంలో ఆంధ్ర అంతర్భాగంగా వున్న ఆనాడు ఈ కాంగ్రెస్ వారు ఏమి చేశారో నేనిప్పుడు చెప్పదలచుకోలేదు. అలా చెప్పవలసి వస్తే అదొక సుదీర్ఘమైన గాథకాగలదు.

అందువలన నేను ఆంధ్ర రాష్ట్రానికి ఆ రాష్ట్ర శాసనసభలో వున్న 140 మందికి కాంగ్రెస్ పార్టీకి గల 40 మంది సభ్యులను గురించి మాత్రమే పరిమితమై మాట్లాడుతారు.



40 మంది వుండగా, ఆ పార్టీనే మంత్రి వర్గాన్నేర్పాటు చేయమని కోరడం ఎలా జరిగింది? డాక్టర్ కట్జూ పదే పదే చెపుతున్న బోగస్ మెజారిటీ దానికి ఎలా వచ్చింది? మొట్టమొదటి విషయం ఈ రాష్ట్రానికి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన గవర్నర్ ఒక సివిలియన్ ఆఫీసర్. ఆయనకు సివిల్ ఆఫీసర్‌గా అనుభవం మినహా రాజకీయ జీవితం ఏ మాత్రం లేదు. అందువలన మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేయవలసిందిగా కాంగ్రెస్ పార్టీ నాయకులను కోరడమే తప్ప డ్యూటీగా ఆయన భావించారు.

ఇక్కడొక విషయాన్ని సభ వారి దృష్టికి తీసుకొని రాదలచాను. ఆనాడు మద్రాస్ ఉమ్మడి రాష్ట్రంలో 166 మంది సభ్యులతో ప్రతిపక్షాల కూటమి ఒకటి ఏర్పడింది. శాసనసభ్యుల్లో తనకు మెజార్టీ వుంది గాబట్టి మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వమని గవర్నర్‌ను ఆ కూటమి కోరింది. ఆనాడు కాంగ్రెస్ నాయకుడు శ్రీ ప్రకాష్ మద్రాస్ గవర్నర్‌గా వున్నారు. ఆయన చెప్పినదేమిటి? "అనేక పార్టీలు, గ్రూపులు కలిసివున్న కూటమిని నేను గుర్తించదలచలేదు. మెజార్టీ పార్టీ లేనప్పుడు ఉన్నవాటిలో అన్నిటికంటే పెద్ద పార్టీని మాత్రమే మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయవలసిందిగా నేను ఆహ్వానించుతాను" అని అన్నారు.

ఆనాడు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 155 మంది సభ్యులు వున్నారు. తాను పైన చెప్పిన సూత్రం ప్రకారమే అంతకు ముందు గవర్నర్ జనరల్‌గా వుండి రిటైర్ అయిన శ్రీ సి.రాజగోపాలాచారిని మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేయవలసిందిగా గవర్నర్ కోరారు. రాజాజీ శాసనసభకు ఎన్నికైన సభ్యుడు కాదు. ఆయనను లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు నామినేట్ చేసి మరీ ఆహ్వానించారు.

మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేయమని తనను గవర్నరు ఆహ్వానించడంతో రాజాజీ, ఇతరత్రా గల గ్రూపులను కూడగట్టి మద్రాసు మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేయగలిగారు. మరి అలాంటి సూత్రానే ఇప్పుడు ఆంధ్రరాష్ట్రంలో ఎందుకు అనుసరించడం లేదు? ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు వున్న పార్టీల్లోకెల్లా కమ్యూనిస్టు పార్టీయే పెద్ద పార్టీ. దానికి 42 మంది సభ్యులతోపాటు, తన సహాయంతో గెలిచి, తనకే మద్దతు నిస్తానని మాట ఇచ్చిన ఎనిమిది మంది స్వతంత్ర సభ్యులున్నారు. ఆ మాటను వారు బహిరంగంగానే ఇచ్చారు. కమ్యూనిస్టు పార్టీ మంత్రివర్గాన్ని ఏర్పరిచే పక్షంలో దానితోనే వుంటామని.

**కాంగ్రెస్ "మెజార్టీ" ఎలా తెచ్చుకోగలిగింది?**

తానేదైతే ప్రజాతంత్ర సూత్రమంటూ అప్పటి వరకూ చెపుతూ వచ్చిందో, ఆ సూత్రం కాంగ్రెస్ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడానికి అనుకూలం కానందునే ఆంధ్రరాష్ట్రంలో ఆ సూత్రాన్ని కేంద్ర ప్రభుత్వం పాటించ నిరాకరించింది. అది కొత్త సూత్రాన్ని అనుసరించింది. దాని ప్రకారం కమ్యూనిస్టులకు 42 సీట్లే వుండగా, కాంగ్రెస్‌కు 51 సీట్లున్నట్లు చెప్పింది. దానికి 51 సీట్లు ఎలా వచ్చాయి? తాము కమ్యూనిస్టులతోనే వుంటామని ప్రజల ముందు ప్రతిజ్ఞ చేసి గెలిచిన ఎనిమిది మంది ఇండిపెండెంట్లను అది తనతో కలుపుకోగలిగింది.

రాయలసీమ నుండి విశాఖ నుండి గెలుపొందిన ఈ శాసనసభ్యులు తాము కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడుతామని ఎన్నికల ముందు ప్రజలకు చెప్పి ఎన్నికయ్యారు. కాని ఎన్నికల అనంతరం పదవుల కోసం వారు కాంగ్రెస్‌తో చేరిపోయారు. ఆ విధంగా కాంగ్రెస్ పార్టీకి మంత్రివర్గం ఏర్పాటుకు 51 మంది సభ్యులు ఉన్నారు.

ఈ పద్ధతి సమర్థనీయమా? ఇది నీతా? ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఒక సూత్రాన్ని అనుసరించింది. దాని ప్రకారం ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుచుకున్న పార్టీని మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించాలి. కాని ఆంధ్ర రాష్ట్రానికి వచ్చేప్పటికి తనకు 40 సీట్లే వుండగా కమ్యూనిస్టులకు 50 సీట్లున్నాయి. అందువలన ఇండిపెండెంట్లకు ఆశలు చూపి తనలో కలుపుకొన్నది. ఎన్నికలకు ముందు ఓటర్ల ఎదుట తాము కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వుంటామని ప్రతిజ్ఞ చేసినా దానిని కాంగ్రెస్ పట్టించుకోలేదు. ఇప్పుడేమో వారికి కాంగ్రెస్ సభ్యత్వాన్ని ఇచ్చి, వారి బంధువులకు పదవులు, ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసి వారిని తమలో కలుపుకొని మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసింది. ఏమిటి నీతి? ఎవరు అపసవ్యంగా వ్యవహరించారు? ఎవరు అవినీతికి పాల్పడ్డారు? అసందర్భంగా మోసపూరితంగా వ్యవహరించింది కాంగ్రెస్ పార్టీయేగాని కమ్యూనిస్టు పార్టీ కాదుకదా!

ఎన్నికల్లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోతే, వివిధపార్టీలు, గ్రూపులు కలిసి అంగీకరించిన ఒక ఉమ్మడి కార్యక్రమంపై ఒక ఐక్య సంఘటనగా ఏర్పడటాన్ని నేను అర్థం చేసుకోగలను. అలాగే ఆ కార్యక్రమానికి కట్టుబడి, దాన్ని అమలు పరచే ధ్యేయంతో మంత్రివర్గాన్ని ఏర్పరచడానికి సిద్ధపడటం సవ్యంగా వుంటుంది. కాని కాంగ్రెస్ చేసింది అదికాదు. తన చేతుల్లో అధికారాన్ని వుంచుకోవాలనే తాపత్రయంతో ఆ విధమైన ఒక సంఘటనను అది ఏర్పరచలేదు. తనను ప్రజల ముందు వ్యతిరేకించిన వారినే తనలో అధికారం కోసం చేర్చుకొన్నది. ఇంతకంటే అవినీతి ఏముంటుంది? ఇంతకంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం కంటే మరే ముంటుంది?

డాక్టర్ కట్జూ ప్రజా సోషలిస్టు పార్టీని పొగిడారు. అవును దాన్ని తనవైపుకు తిప్పుకొనేందుకు దానిపై ప్రశంసలను కురిపించారు. ఆయన్ని అలా చేయనీయండి, మాకేమాత్రం అభ్యంతరం లేదు. కాని ప్రజా సోషలిస్టు పార్టీ నాయకుడైన అశోక్ మెహతా ఆ సభలో (లోక్‌సభ) మాట్లాడుతూ కాంగ్రెస్ అనుసరించిన ఎత్తుగడలు ప్రజాతంత్ర వ్యతిరేక రాజకీయానికి చెందినవేగాక అది రాజకీయ బందిపోటని ఆక్షేపించారని డాక్టర్ కట్జూకు నేను జ్ఞాపకం చేయదలచాను. మైనార్టీ పార్టీగా కాంగ్రెస్ ప్రజా సోషలిస్టు పార్టీ సహకారాన్ని కోరలేదు. అలాగే కృషికార్ లోక్ పార్టీని కూడా అడిగి వాటితో కలిసి మిశ్రమ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించలేదు. ఆ నీతి దానికి లేకపోయింది. కనీసం దానికి ఆ మర్యాద కూడా లేకపోయింది. అంగీకృతమైన ఒక కార్యక్రమ ప్రాతిపదికపై వాటితో కలసి అది ఒక సంఘటనగా ఏర్పడలేదు.



కొద్ది రోజుల క్రిందటనే కాంగ్రెస్ కుళ్లిపోయిన పేడముద్దగా తయారైనదనీ, దాని నుండి పురుగులు బయటకు వస్తున్నాయంటూ కాంగ్రెస్‌ను అభివర్ణించిన ప్రకాశంగారినే ముఖ్యమంత్రి పదవి ఆశజూపి, ప్రజా సోషలిస్టు పార్టీ నుండి బయటకు లాగి ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టారు. ఇదీ కాంగ్రెస్ అనుసరించిన నీతి నియమాలు. ఆయనతోపాటు ప్రజా సోషలిస్టు పార్టీకిచెందిన మరికొంత మంది కాంగ్రెస్‌లో చేరారు. ఆ విధంగా ప్రజా సోషలిస్టు పార్టీ చీలిపోయింది. అందులో ఒక భాగం తెన్నేటి విశ్వనాథంగారి నాయకత్వంలోకి వచ్చి ప్రజా పార్టీగా ఏర్పడింది. తతిమ్మా భాగం ప్రజా సోషలిస్టు పార్టీగానే కొనసాగింది. అందులోనే మరో భాగం కాంగ్రెస్ పార్టీ అనుబంధ సభ్యులుగా చేరారు. ప్రజా సోషలిస్టు పార్టీతోనే ఇది ఆగలేదు.

కృషీకార్‌లోక్ పార్టీ వద్దకు కాంగ్రెస్ వెళ్ళి మనం మిశ్రమ ప్రభుత్వాన్ని నెలకొల్పుదామని చెప్పింది. కృషీకార్‌లోక్ పార్టీ నాయకులు కాంగ్రెస్ మాటలను నమ్మారు. కాంగ్రెస్ నీతిపై వారు పెట్టుకున్న నమ్మకం వలన ఏర్పడిన దుష్ఫలితాన్ని వారు ఇప్పుడు అనుభవించుతున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తాము పోరాడుతామని చెప్పారు. వాళ్ళ వూగిసలాట మూలంగానే మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలో రాజాజీ మంత్రివర్గాన్ని ఏర్పరచగలిగారు. అలాంటి కె.ఎల్.పి. నాయకులే ఇప్పుడు, మీ మాటలను నమ్ముతున్నాం. మీతో చేతులు కలుపుతాం, అని చెప్పి ఆ విధంగా వారు కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సభ్యులుగా చేరారు. కాని ఈ లొంగుబాటుతనం కూడా కాంగ్రెస్‌ను సంతృప్తి పరచలేదు. కె.ఎల్.పి.ని రద్దు చేసుకోవాలని అది కోరింది. తీరా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసే సమయం వచ్చేప్పటికి తమ తరఫున మంత్రిగా కె.ఎల్.పి. గౌతు లచ్చన్న గారి పేరును సూచించింది. కాని కాంగ్రెస్‌కు ఈ సూచన మింగుడు పడలేదు. కొన్ని విషయాల్లోనైనా లచ్చన్నగారు తమతో విభేదించవచ్చునన్న అనుమానం వారికుంది. అందువలన తిమ్మారెడ్డి గారిని మంత్రివర్గంలోకి తీసుకొంటామని చెప్పారు. ఈ సమస్యపై కె.ఎల్.పి. చీలిపోయింది. ఒక భాగం కాంగ్రెస్‌లో కలిసిపోయింది. ఇదీ కాంగ్రెస్ నీతి! ఇదీ కాంగ్రెసు అనుసరించే ప్రజాస్వామ్యం!!

కాంగ్రెస్ వారు ముఖ్యమంత్రి పదవిని ప్రకాశంగారికి కట్టబెట్టి తిమ్మారెడ్డి గారికి మంత్రి పదవిని ఇచ్చి, ఆ విధంగా రెండు పార్టీలను చీల్చడానికి కారణభూతులయ్యారు. అలాగే విశాఖ జిల్లా నుండి ఇండిపెండెంట్ సభ్యుడుగా శాసనసభకు ఎన్నికైన రొక్కం నరసింహారావుగారికి నలుగురైదుగురు అనుచరులున్నారు. ప్రమోట్ చేయబడవలసిన సీనియర్ ఇంజనీర్ అయిన ఎస్.రామోజీరావును త్రోసిపుచ్చి, రొక్కం నరసింహారావు సోదరుడైన రామమోహన్‌రావును హైవేస్ ఛీఫ్ ఇంజనీర్‌గా నియమించడం ద్వారా రొక్కం నరసింహారావును ఆయనకు గల చిన్న గ్రూపును తమవైపుకు కాంగ్రెస్ తిప్పుకున్నది. కాంగ్రెస్ అనుసరించిన నీతి ఈ విధంగా వుంది! (సభలో కలవరం)

గవర్నర్ల పదవులను, ఇతర ముఖ్యమైన ఉద్యోగాలను కూడా ఇచ్చి కాంగ్రెస్ అనేక మందిని లోబరుచుకుంటున్నది. అది వేరే విషయమనుకోండి. ఆ విధంగా ఆంధ్రలో కాంగ్రెస్

మంత్రివర్గం ఏర్పడింది. అయినప్పటికీ దానికి మెజార్టీ లేకపోయింది. అందుకని ఆంధ్ర ప్రజల ఐక్యతను సహితం భగ్నం చేయడానికి అత్యంత దుష్ట రాజకీయాలకు దిగజారడానికి సహితం కాంగ్రెస్ వెనుకాడలేదు. ప్రాంతీయతత్వాలను తెచ్చి ఒక ప్రాంతం వారిని మరో ప్రాంతం వారిపైకి రెచ్చగొట్టడం ప్రారంభించింది. ఏ మాత్రం రాజకీయ నిజాయితీ వున్నవారైనా అప్పుడే అవతరించిన నూతన ఆంధ్ర రాష్ట్రం సవ్యంగా పనిచేసుకొనేటట్లు ప్రయత్నిస్తారు.

### రాజధాని సమస్య

నూతనంగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని నిర్మించవలసి వచ్చినప్పుడు ఏ మాత్రం ఇంగితజ్ఞానం ఉన్నవాడైనా దాదాపు అన్ని ప్రాంతాలకు అనుకూలమైన పట్టణాన్ని సూచించడానికి ఇష్టపడతాడు. కాని కాంగ్రెస్ పార్టీ వారికి ఆంధ్ర ప్రజల అభివృద్ధి పట్ల ఏమాత్రం శ్రద్ధ లేదు. అంతేకాదు, భారతదేశ ఐక్యతే వారికి పట్టదం లేదు.

రాజధాని స్థాపన విషయమై ప్రాంతీయ తత్వాలను వారు రెచ్చగొట్టారు. అందుకే రాయలసీమలో వున్న కర్నూలును రాజధాని నెలకొల్పుతామని ఆశ చూపి రాయలసీమ కాంగ్రెస్ వారి మద్దతును సంపాదించదలచారు. ఆ విధంగా వారు రాయలసీమ ప్రజలను కోస్తా ప్రాంతాల ప్రజలకు, మొత్తం ఆంధ్ర ప్రజలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడానికి సిద్ధపడ్డారు. రాయలసీమలో 50 లక్షల మంది ప్రజలను రాష్ట్రంలో వున్న తతిమ్మా 150 లక్షల మంది ప్రజలకు వ్యతిరేకంగా తిప్పాలనేది వారి లక్ష్యం.

రెడ్డి– కమ్మ అనే కులతత్వాన్ని కూడా కాంగ్రెస్ వారు లేవనెత్తారు. కర్నూలు నుండి రాజధానిని రాష్ట్రానికి మధ్యస్థంగా ఉండే ప్రాంతానికి మారిస్తే కమ్మవారి పెత్తనం ఏర్పడుతుందనీ, రెడ్ల ఆధిపత్యం పోతుందనీ వారు ప్రచారం చేశారు. నేను చెపుతున్న ఈ విషయాలన్నీ వాస్తవాలు. ఆంధ్ర రాష్ట్రాన్ని గురించి ఏమాత్రం తెలిసినవారైనా వారా విధంగా కులతత్వాన్ని రెచ్చగొట్టిన విషయాన్ని కాదనజాలరు. కాంగ్రెస్ వారు కర్నూలును రాజధానిగా నిర్ణయించారు. ఇందుకు మొత్తం ప్రజలంతా వ్యతిరేకమే. చివరికి కాంగ్రెస్ పత్రికలు కూడా వారి నిర్ణయాన్ని ప్రతిఘటించాయి. వారి నిర్ణయం జాతీయ వ్యతిరేకమైనదేగాక, ఐక్యతను విచ్ఛిన్నం చేసేదిగా వున్నదని అందరూ ఆక్షేపించారు. అయినా కాంగ్రెస్ తన హితులతో సహా అందరి మాటను పెడచెవిని పెట్టి తన సంకుచిత రాజకీయ స్వార్థం కోసం కర్నూలునే రాష్ట్ర రాజధానిగా చేయడానికే ముందుకు సాగిపోయింది.

ఆంధ్ర రాష్ట్ర రాజధాని ఎక్కడ నెలకొల్పాలో నిర్ణయించడానికి శాసనసభ సమావేశం కాగానే కాంగ్రెస్ విభిన్నమైన ఎత్తుగడలను చేబట్టింది. కర్నూలు రాజధానిగా తాత్కాలికం మాత్రమేననీ, ఆ తరువాత అక్టోబరు ఒకటవ తేదీ కల్లా విశాఖ పట్టణానికి రాజధాని మార్చగలమని చెప్పారు. ఎందుకని ఇలా విశాఖ అన్నారు? విశాఖ జిల్లాలో వున్న ఇండిపెండెంటు శాసనసభ్యుల మద్దతు వారికి కావలసి వుంది. రాయలసీమ ప్రజల మద్దతును సంపాదించుకోడానికి అది మొట్టమొదట రాజధానిగా కర్నూలు ప్రతిపాదనను బలపరచింది.



ఆ ప్రతిపాదన ఓడిపోయే ప్రమాదం ఎదురుకాగానే తతిమ్మా ఓట్లను చీల్చడానికి మరో ఎత్తుగడ పన్నింది. 1955 తరువాత రాజధానిని కర్నూలు నుండి విశాఖకు మారుస్తామని కాంగ్రెస్ చెప్పగా పాపం విశాఖ జిల్లా శాసనసభ్యులు కాంగ్రెస్ ప్రతిపాదనకు ఓటు చేశారు.

ఈ సమస్య ముందుకొచ్చి ఓటు చేయవలసిన సమయమాసన్నమైనప్పుడు కమ్యూనిస్టులూ, ఇతరులు కూడా "ఇది ఆంధ్రుల ఐక్యతను విచ్ఛిన్నం చేసేదిగా వుందని" చెప్పారు. విజయవాడ లేదా గుంటూరు లాంటి కేంద్ర పట్టణం రాజధానిగా నిర్ణయించడం అవసరమని చెప్పారు. ఆంధ్రలోని ఒక మూల నుండి మరొక మూలకు రాజధానిని మార్చవలసిన అవసరం ఏమున్నదని వారు ప్రశ్నించారు. రాజధాని స్థాపనా సమస్యను పరిష్కరించడానికి ఇది పద్ధతి కాదు. ఇలా మేము అన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహించింది. దానిని మీరు అర్థం చేసుకోగలరా! రాజధాని సమస్యపై కాంగ్రెస్ చేసిన పని ఇదీ! ఆ తరువాత హైకోర్టు ఎక్కడ వుండాలన్న సమస్య ముందుకు వచ్చింది. విశాలాంధ్ర ఏర్పడే వరకూ కర్నూలు తాత్కాలిక రాజధానిగా వుంటుందని కాంగ్రెస్ అప్పటికే నిర్ణయించింది గాబట్టి గుంటూరు కేంద్ర స్థానంగా వుందిగాబట్టి అక్కడ హైకోర్టు పెట్టవలసి వుంది. కాని కాంగ్రెస్‌కు ఆ ప్రతిపాదన గిట్టలేదు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన శాసనసభ్యులను అది తృప్తిపరచవలసి వుంది. ఆ రెండు జిల్లాల్లో ఇరవై పాతిక మంది శాసనసభ్యులున్నారు. అందువలన హైకోర్టును విశాఖ పట్టణానికి తీసుకొని వెడతామని కాంగ్రెస్ అన్నది.

అంతేకాదు. ఇంక ఇప్పుడు విశ్వవిద్యాలయం సంగతి చూద్దాం. ఇప్పటికే ఆంధ్ర యూనివర్సిటీ వుంది. కాంగ్రెస్ పత్రికలతో సహా, మేధావులంతా మొత్తం యావదాంధ్ర మన రాష్ట్రానికి సంబంధించిన విద్యా వ్యవహారాలన్నీ అక్కడే కేంద్రీకరించడం సముచితంగా వుంటుందని అభిప్రాయపడ్డారు. ఇంకా ఎక్కువ కాలేజీలు అవసరమనుకుంటే మరికొన్ని నెలకొల్పుదాం. రకరకాల విద్యల కోసం రెసిడెంటల్ యూనివర్శిటీలు కావాలంటే కూడా మనకు అభ్యంతరం వుండనవసరం లేదు. కాని విద్యా విషయాలను చీల్చవద్దు. ఆంధ్రాలో మేధావులను చీల్చవద్దు. విద్యార్థులను రాయలసీమ, సర్కారు జిల్లాల వారని చీల్చరాదని మేము చెప్పాం.

ఈ విషయాన్ని కూడా మరల కాంగ్రెస్ తిరస్కరించింది. రాయలసీమ జిల్లాలకు, నెల్లూరు జిల్లాకు పరిమితమయ్యే యూనివర్శిటీ ఒక దానిని తిరుపతిలో నెలకొల్పాలని, నిర్ణయించింది. ఆ జిల్లాల్లోని కాలేజీలన్నింటినీ వేరుగా తిరుపతి యూనివర్శిటీకి అనుబంధించాలని నిర్ణయించింది. ఈ విధంగా కాంగ్రెస్ పార్టీ ఆంధ్రాలోని మేధావులను, విద్యార్థులను చీల్చడానికి సిద్ధపడింది. ఆంధ్ర సాంఘిక జీవితాన్నే చీల్చే దుష్ట చర్యకు తలపడింది. ఇందుకు కాంగ్రెస్ సభ్యులు కూడా తిరుగుబాటు చేయగా రెండు సంవత్సరాల వరకూ తిరుపతి యూనివర్శిటీ రెసిడెన్షియల్ యూనివర్శిటీగా వుండగలదనీ, ఆ తరువాత మరల ఆ సమస్యను గురించి చర్చించుకొందామని చెప్పింది. ఇలాంటి కుతంత్రాలతో అధికారంలో వుండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యత్నించింది.

## మద్యపాన నిషేధం సమస్య

ఇంక ఇప్పుడు నేను మద్యపాన నిషేధ సమస్యకు వస్తాను. మద్యపాన నిషేధం సమస్యపైననే ప్రభుత్వం ఓడిపోయినట్లుగా డాక్టర్ కట్జూ అదేపనిగా ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. కమ్యూనిస్టులూ, తదితరులూ మద్యపానాన్ని ప్రోత్సహించుతున్నారనీ, ఆంధ్రజాతిని త్రాగుబోతులుగా మార్చడానికి వారు పూనుకొన్నారని ఆయన అవాకులు చెవాకులు పలికారు. అలాంటి తప్పుడు భావాన్నే ఆయన ప్రచారం చేయదలచుకొంటే ఆయన పొరపాటు అంచనాలో వున్నట్లు చెప్పవలసి వస్తుంది. మద్యపాన నిషేధాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు జరుపుతున్న రీతిలో కొనసాగిస్తే అది ఈ దేశంలో ఎన్నటికీ జయప్రదం కాజాలదు.

రామమూర్తి కమ్యూనిస్టు కాదు. రామమూర్తి కమిటీలో వున్న మరో సభ్యుడైన పత్తి సత్యనారాయణ కూడా కమ్యూనిస్టు కాదు. ఆయన రిటైర్ అయిన న్యాయమూర్తి. వారు అన్ని ప్రదేశాలకు వెళ్ళి, కాంగ్రెస్ వారిని, మేధావులను తదితరులను కలసికొని వారి అభిప్రాయాలను తెలుసుకొన్నారు. ఆ తరువాత వారు వచ్చిన నిర్ణయమేమిటి? మద్యపాన నిషేధం జయప్రదం కాకపోగా ప్రతి ఒక్క గ్రామంలోనూ, ప్రతిపట్టణంలోనూ లెక్కకు మించి కాపు సారా బట్టీలు వెలుస్తున్నాయి. ఈ సారాయి వ్యాపారం చాలా లాభదాయకంగా తయారైంది. ఈ వ్యాపారానికి భూస్వాముల అండదండలూ, కొంత మంది కాంగ్రెస్ వారి సహాయ సహకారాలు పుష్కలంగా లభించుతున్నాయి. ఇందులో కొంతమంది ప్రభుత్వ అధికారులకు కూడా క్రింది నుండిపై వరకూ వాటాలున్నాయి. ఈ లంచగొండితనాన్ని, విచ్చలవిడిగా సాగుతున్న అవినీతిని అరికట్టడం అవసరం. తానేదో మద్యపాన నిషేధ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తున్నానని ప్రభుత్వం భావించనవసరం లేదు.

మద్యపాన నిషేధాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా వాంఛించుతున్న పక్షంలో అది ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలను తీసుకోవడం అవసరం. అప్పుడు ప్రజలు ఈ తాగుడు మాని, ఇంతకంటే మంచివైన, ఆరోగ్యకరమైన పానీయాలను తీసుకొంటారు. ఆ పని చేయకుండా మద్యపాన నిషేధాన్ని ప్రవేశపెట్టడమంటే అది పూర్తిగా విఫలమవడమేగాక, 20–30 లక్షలుగా వున్న కల్లుగీత వారిలో నిరుద్యోగం ఏర్పడుతుంది. గత ఏడు సంవత్సరాలుగా నిరుద్యోగం వుంది. ఈ ఏడు సంవత్సరాలుగా వారికి ఉపాధులను కల్పించగలమని కాంగ్రెస్ వాగ్దానాలను చేస్తూనే వుంది. కాని ఆచరణలో చేసిందేమీ లేదు.

గాంధీ సిద్ధాంతాన్ని అనుసరించాలని ఇంక ఇప్పుడు కాంగ్రెసు విజ్ఞప్తులు చేస్తున్నది. గాంధీజీ పేరు ఎత్తడానికి కాంగ్రెసు పార్టీ సిగ్గుపడాలని నేను భావించుతున్నాను. ప్రభుత్వం ఎప్పుడు ఇబ్బందిలో పడినా గాంధీ పేరును ఉపసంహరించుకోవడం సరికాదు. గాంధీజీని వారు నిజంగానే గౌరవించదలిస్తే, గాంధీజీ వ్యక్తిగత జీవితాన్ని ఆదర్శంగా చూపెట్టదలిస్తే,



ఇలాంటి తప్పుడు వ్యవహారాల్లో ఆయన పేరును తీసుకొని రావద్దని నేను కాంగ్రెసు వారికి మనవి చేస్తున్నాను. గాంధీజీ మద్యపానానికి వ్యతిరేకమే. అయితే ఈ ప్రభుత్వం దాన్ని అమలు జరుపుతున్న పద్ధతిలో మాత్రం కాదు.

ప్రజా సోషలిస్టు పార్టీని తన వైపుకు తిప్పుకోవడానికి, కాంగ్రెసు గాంధీజీ సిద్ధాంతాలను ప్రస్తావించుతోంది. "మీరు కూడా గాంధీజీని ప్రశంసించుతారు. మీరు కూడా గాంధీజీ భావాలను అనుసరించుతారు. మరి అలాంటప్పుడు కాంగ్రెసు ప్రభుత్వాన్ని నాశనం చేయతలపెట్టినవారినీ, ఇక్కడ ఆంధ్రాలో అధికారంలో వున్న ఈ కాంగ్రెసు ప్రభుత్వాన్ని వ్యతిరేకించే ఈ కమ్యూనిస్టులతో ఎందుకు చేతులు కలుపుతారు?" అని వారిని ప్రశ్నించుతారు. నిజంగానే ఇది విచిత్రమైన వాదన!

1954 జనవరిలో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత మూడు మాసాలకే బడ్జెట్‌పై శాసనసభలో చర్చ జరిగిన సందర్భంగా "ఎక్సైజు" మీద కోత తీర్మానం ప్రతిపాదించబడింది. అయితే, అప్పుడు కాంగ్రెసు ప్రభుత్వం ఓటమి నుండి తప్పించుకొనేందుకుగాను ఈ విషయమై మేము ఒక కమీషన్‌ను నియమించుతున్నాం" అని వాగ్దానం చేశారు. దీనితో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమస్యపై ఓటు చేద్దామనుకొన్న కొంత మంది సభ్యులు తమ మనస్సును మార్చుకొన్నారు. మళ్లీ 1951 జనవరిలో కాంగ్రెసు మరల "మేమొక దర్యాప్తు కమీషన్‌ను నియమించుతున్నాం. అది ఏ సిఫార్సులు చేసినా అమలు పరుస్తాం" అని కాంగ్రెసు ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఇది శాసనసభా ముఖంగా నమ్మకంగా చేసిన వాగ్దానం. కాని అది తన మాటను నిలుపుకోలేకపోయింది. దర్యాప్తు కమీషన్‌ను నియమించారు. అది మద్యపాన నిషేధ చట్టాన్ని తీసివేయాలని ఏకగ్రీవంగా సిఫార్సు చేసింది.

శాసనసభ మద్యపానం నిషేధాన్ని గురించి చర్చించడానికి మరల సమావేశమైంది. ఈ సమస్యపై చర్చించేందుకు ఒక తీర్మానాన్ని ప్రతిపాదించగలనని కాంగ్రెసు ప్రభుత్వం వాగ్దానం చేసింది. కాని అలా చేయలేదు. కాంగ్రెసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా విశ్వాసరాహిత్య తీర్మానం ప్రతిపాదించబడింది. అప్పుడు దానిని చర్చించుదాం అని చెప్పింది. ఆ సమస్య చర్చకు వచ్చినప్పుడు అది అధికార తీర్మానాలను చర్చించే రోజు. అనధికార రోజు కాదు. తీర్మానాన్ని ప్రతిపాదించినది అనధికార సభ్యుడు. కాని శ్రీ ప్రకాశం గారు ప్రభుత్వం తరపున మాట్లాడుతూ "ఈ తీర్మానాన్ని అధికార కార్యకలాపాలకు కేటాయించిన రోజునే చర్చకు తీసుకొందాం. ఎందువల్లనంటే దాని విషయమై ప్రభుత్వానికి కూడా ఆసక్తి వుంది" అన్నారు. చర్చ కొనసాగింది. తీర్మానంపై ఓటు తీసుకోబడింది. రామమూర్తి కమీషన్ సిఫార్సులను అమలు జరిపాలని శాసనసభలో అత్యధిక సభ్యులు కోరారు. దీనిపై ఓటు తీసుకోవాలని ప్రభుత్వం కోరలేదు. ఓటు తీసుకోకుండానే ప్రభుత్వం తీర్మానాన్ని ఆమోదించింది.

రామమూర్తి కమిటీ ప్రతిపాదనలను అమలు జరపాలని మొత్తం శాసనసభ ఆమోదించింది. కాని అసెంబ్లీ సమావేశం ముగిసే ముందు, కాంగ్రెసు పార్టీ నాయకుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి అయిన శ్రీ నీలం సంజీవరెడ్డి లేచి "అసెంబ్లీ తీర్మానాన్ని నేను అమలు జరపబోవడం లేదని" ప్రకటించారు. మరి ఎవరు రాజ్యాంగాన్ని అవమానపరిచారు? ఎవరు రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు? కాంగ్రెసు పార్టీ నాయకుడైన సంజీవరెడ్డిగారా? లేక కమ్యూనిస్టులా?

రామమూర్తి కమిటీ సిఫార్సులను అమలు పరుస్తానని ప్రభుత్వం శాసనసభా ముఖంగా ప్రకటించింది. ఆ సిఫార్సులను అసెంబ్లీ అధికార కార్యక్రమాల రోజునే, అధికారయుత ఎజెండాలో భాగంగానే చర్చకు తీసుకొన్నది. కాంగ్రెసు వారితో సహా అత్యధిక సభ్యులు ఆ సిఫార్సులను అమలు జరపాలని ఓటు చేశారు. ఈ తీర్మానంపై ఓటు తీసుకోవాలని కూడా ప్రభుత్వం తరఫున కోరలేదు. కాని ఆ తరువాత వెంటనే శాసనసభా సమావేశం ముగియగానే అసెంబ్లీ నిర్ణయాన్ని తాము అమలు జరపబోమని కాంగ్రెసు నాయకులు చెప్పడం ప్రారంభించారు. ఈ విషయాన్ని ఆంధ్ర శాసనసభ్యులకే ఆంధ్ర ప్రజల ముందే చెప్పారు. ఇలా చెపుతూ "మీకు మెజార్టీ ఉంటే మా మంత్రివర్గంపై విశ్వాస రాహిత్య తీర్మానాన్ని తీసుకొని రండి. అంతేకాని మా నిర్ణయాన్ని మేము మార్చుకోదలచలేదు" అని శ్రీ నీలం సంజీవరెడ్డి ప్రతిపక్షాన్ని సవాలు చేశారు. ఇదీ కాంగ్రెసు నీతి! రాజ్యాంగాన్ని అర్థం చేసుకొని అమలు పరిచే పద్ధతి ఇదేనా?

**రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్న దెవరు?**

అయిదుసార్లు, అయిదు సమస్యలపై ప్రభుత్వం శాసనసభలో ఓడిపోయింది. వీటన్నింటికీ నీలం సంజీవరెడ్డి సమాధానం ఒక్కటే! "మేము ప్రభుత్వాన్నుండి బయటకు వెళ్ళి పోవాలని మీకుంటే విశ్వాస రాహిత్య తీర్మానాన్ని తీసుకొని రండి. అలా కాకుండా మీరు ఏమి చెప్పినా, ఏ నిర్ణయం చేసినా మేము అమలు జరిపే సమస్యలేదు" అని. మరి రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్నదెవరు? రాజ్యాంగాన్ని ఖచ్చితంగా అమలు పరుస్తున్నామని చెప్పుకొనే డాక్టర్ కట్జూని ఈ ప్రశ్నకు జవాబు చెప్పవలసిందిగా కోరుతున్నాను. ఎవరు రాజ్యాంగాన్ని ఉల్లంఘించుతున్నదీ, ఎవరు అవమానపరుస్తున్నదీ స్పష్టం కావడం లేదా?

ఈ విధంగా మాటిమాటికీ అసెంబ్లీలో ఓడిపోతున్న ఈ ప్రభుత్వంపై ఆంధ్ర ప్రజా ప్రతినిధుల అభిప్రాయాన్ని మాట మాటికి ధిక్కరించుతున్న ఈ ప్రభుత్వాన్ని సవాలు చేయడం మినహా మరో మార్గం లేకపోయింది. అందువల్లనే ఈ ప్రభుత్వంపై విశ్వాసరాహిత్య తీర్మానాన్ని ప్రతిపాదించవలసి వచ్చింది. ఒక్క ఓటు తేడాతో తీర్మానం నెగ్గింది. నిజానికి ఈ కాంగ్రెసు



ప్రభుత్వం ఈ 13 నెలలు కూడా నిలువ గలిగేది కాదు. "మీరు గనుక మా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు చేస్తే అసెంబ్లీని రద్దు చేసి, గవర్నరు పాలనను నెలకొల్పుతామని" ఎప్పుడూ బెదిరించుతూ వుండేవారు. ఈ బెదిరింపు మూలంగానే స్వార్థంతో కాంగ్రెసు పార్టీకి మద్దతునిస్తున్న ఇండిపెండెంటు సభ్యులు భయపడుతూ వుండేవారు. ఎన్నికల నాడు తాము కాంగ్రెసుకు వ్యతిరేకమని ప్రజలకు చెప్పి గెలుపొందారు. కాని ఆ తరువాత ప్రజలకిచ్చిన వాగ్దానాలను దిగమ్రింగి కాంగ్రెసుతో చేతులు కలిపారు. మరల ఎన్నికలు జరిపితే తాము జరిపిన విద్రోహానికి ప్రజలు బుద్ధి చెపుతారన్న భయంతో కాంగ్రెసుతోనే వుండి ఈ ప్రభుత్వాన్ని కాపాడుకొని, తమ సభ్యత్వాన్ని వారు నిలుపుకోదలచారు. వారికి గల ఈ బలహీనతను దృష్టిలో వుంచుకొనే వారిని సంజీవరెడ్డి "మీరు మాతో వుంటారా? లేకపోతే శాసన సభను రద్దు చేయించుతాను" అని సదా బెదిరించుతూ వచ్చారు. అలాంటి భయం వారిని వెంటాడుతున్నప్పటికీ ప్రభుత్వం ఓడిపోవడానికి ఓటు చేశారంటే దాని ప్రాధాన్యతను మీరు గుర్తించాలి. కాంగ్రెసు పార్టీ నగ్నంగా రాజ్యాంగాన్ని అవమానపరచడం పట్ల, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటం పట్ల ప్రజల్లో విపరీతమైన ఏహ్యాభావం కలగడం వల్లనే ఎన్నికలంటే భయపడే వారు సహితం కాంగ్రెసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు చేశారు.

బంజరు భూములను పంచే సమస్య విషయంలో కూడా కాంగ్రెసు ప్రభుత్వం తన నిరంకుశ ధోరణిలోనే వ్యవహరించింది. బంజరు భూములను పంచడం పట్ల కూడా ప్రభుత్వం తన వ్యతిరేకతను వెల్లడించింది. ఈ సమస్యపై రెండు సమావేశాల్లో మేము ఓడిపోయాం. మళ్ళీ మూడోసారి ఈ సమస్యపై తీర్మానాన్ని ప్రవేశపెట్టగా దానికి శాసనసభలో అత్యధిక మెజార్టీ లభించింది. ఆ కారణంగా బంజర్లను పేదలకు పంచడానికి ప్రభుత్వం అంగీకరించింది. కాని ఆచరణలో అమలు జరపవలసి వచ్చినప్పుడు అందులో సగభాగాన్ని మినహాయించింది. కాని మిగిలిన సగభాగం కూడా పేదలకు పంచి పెడుతున్నామని చెప్పి పేదలుగా వున్న రాజకీయ బాధితులకు పంపిణీ చేసింది. రాజకీయ బాధితులకు భూములివ్వడం పట్ల మాకు అభ్యంతరం లేదు. కాని పేద రాజకీయ బాధితుల పేరుతో కాంగ్రెసు భూస్వాములకు బంజర్లను కేటాయించడం జరిగింది. కాంగ్రెసు ప్రభుత్వం నిర్వహించుతున్న పరిపాలనా పద్ధతి ఈ విధంగా వుంది!

సరే ఇప్పుడు మంత్రివర్గం ఓడిపోయింది. ప్రతిపక్ష నాయకుడు–42 మంది పార్టీ సభ్యులకు తోడు మరో ఎనిమిది మంది ఇండిపెండెంటు సభ్యుల తోడ్పాటు గలిగిన ప్రతిపక్ష నాయకుడు మంత్రివర్గం ఏర్పాటుకు తనకు అవకాశాన్ని ఇవ్వాలని కోరడంలో తప్పేముంది? ఇందులో ప్రజాస్వామ్య పద్ధతికి విరుద్ధమైనదేముంది! ఇది రాజ్యాంగాన్ని అవమానపరచడం, అపహాస్యం చేయడం ఎలా అవుతుంది? మన దేశం అనుసరించుతున్న బ్రిటిష్ పార్లమెంటులో ఇలాంటి పరిస్థితుల్లో అనుసరించుతున్న మార్గమేమిటి!

ఆ మార్గాలన్నీ డాక్టర్ కట్జూకు అనుకూలంగా లేవు కాబట్టి వాటిని ఉదహరించడం నిరుపయోగం. అందువల్లనే మన రాజ్యాంగంలోని 356 ఆర్టికల్‌ను ప్రాతిపదిక చేసుకొని, మనం వాదించుకొందాం. 356 ఆర్టికల్ ప్రకారం రాజ్యాంగబద్ధంగా ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేయడం వీలు పడదా? వీలు పడదన్న డాక్టర్ కట్జూ మాటను నేను అంగీకరించను. (సభలో కలవరం) కాంగ్రెసు మంత్రివర్గాన్ని నెలకొల్పడానికి, నిర్వహించడానికి ఎన్నో అవినీతి చర్యలకు ఒడిగట్టారు. వాటన్నింటి వివరాల్లోకి నేను వెళ్లదలచలేదు. అలా అని చెప్పవలసి వస్తే మరో అరగంటగాక, మరో అర రోజును నేను తీసుకోవలసి వస్తుంది. మరీ నగ్నంగా కనబడే ఒకే ఉదాహరణను చెపుతాను. మరో రెడ్డిగారు – సంజీవరెడ్డిగారు కూడా రెడ్డే. లంచగొండితనంపై విచారించడానికి ఒక ట్రిబ్యునల్ నియమించారు. ఆ ట్రిబ్యునల్ రికార్డులను తాను చూస్తానని చెప్పారు. కాని ఆ రికార్డులను చూసే సందర్భంగా అందులో కొన్ని రికార్డులను ధ్వంసం చేశారు. అలా చేస్తున్న సందర్భంగా ఆయన పట్టుబడ్డారు. (సభలో అలజడి)

కానీ నేనీ విషయాన్ని ఎందుకు చెప్పవలసి వచ్చినదంటే ప్రతిపక్షాన్ని మీరు లంచగొండులుగా, అవినీతిపరులుగా ఆరోపించారు. ప్రతిపక్షం వారు లంచగొండులు కాదు. డాక్టర్ కట్జూ ప్రాతినిధ్యం వహించుతున్న కాంగ్రెసులోనే లంచగొండులు, అవినీతిపరులూ వున్నారు. కాని ప్రతిపక్షాలపై ఇలాంటి తప్పుడు ఆరోపణ పనిచేయడానికి డాక్టర్ కట్జూ సాహసించడం శోచనీయం. లంచగొండితనానికి ఒడిగట్టిన ఆ సభ్యులు ఇక్కడ హాజరై వుంటే బాగుండేది. (అలజడి)

నేను పేర్లను ఉదహరించడం లేదు. కాని డాక్టర్ కట్జూ నేను చెప్పేది అబద్ధమని సవాలు చేసే పక్షంలో పేర్లు కూడా ఉదహరించగలను. అవన్నీ ఇక్కడ నా రికార్డులోనే వున్నాయి. కాంగ్రెసు మంత్రివర్గమే లంచగొండితనానికీ, మోసాలకు, కులతత్వానికి, ప్రాంతీయతత్వానికీ దిగజారి ఆంధ్ర ప్రజల యావజ్జీవనాన్ని విచ్ఛిన్న పరచింది.

### డాక్టర్ కట్జూ 'లెక్కల' బూటకం

ఇంక ఇప్పుడు నేను డాక్టర్ కట్జూ చెప్పిన బూటకపు లెక్కల సంగతి ప్రస్తావిస్తాను. ప్రభుత్వాన్ని కూలద్రోయగలిగిన మెజార్టీని డాక్టర్ కట్జూ లెక్కలు ఎలా మైనార్టీగా మార్చిందో వివరిస్తాను. కమ్యూనిస్టు పార్టీ సభ్యుల సంఖ్య 42. ఇందుకు తోడు కమ్యూనిస్టు పార్టీ టిక్కెట్టుపై ఎన్నికైన సభ్యులు అయిదుగురున్నారు. వారు ఆ తరువాత యునైటెడ్ పీపుల్స్ మూవ్‌మెంటుగా ఏర్పడి, కమ్యూనిస్టు పార్టీని బలపరచగలమని ప్రకటించారు. డాక్టర్ కట్జూ అందులో ఒక సభ్యుడైన సి.వి.కె.రావు ప్రకటనను ఉదహరించారు. ప్రభుత్వం పతనమైనది గాబట్టి, ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పడవలసి వుంది. కనుక అసెంబ్లీని రద్దు చేయడమే ఉత్తమ మార్గమని ఆయన అన్న మాటను డాక్టర్ కట్జూ తన వాదనకు ఉపయోగించుకొన్నారు. అయిదుగురు సభ్యుల కూటమిలోనే కట్జూ మరో సభ్యుడుగా వున్న రొక్కం నరసింహారావు



ప్రతిపక్షానికి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసే అవకాశమివ్వాలని కోరారు. తనకు అనుకూలంగా వున్న ప్రకటననే డాక్టర్ కట్జూ ఉదహరించారు.

ఆంధ్రలోని ప్రతిపక్ష నాయకుడు ఇలా చెప్పారుః "ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసిందిగా నన్ను ఆహ్వానించండి. అసెంబ్లీ సమావేశాన్ని ఇప్పటికే రద్దు చేశారు. మళ్ళీ సమావేశపరచండి. మూడు రోజుల్లో నా మంత్రుల జాబితాతో అసెంబ్లీలో విశ్వాసాన్ని పొందగలను." శాసనసభలో ప్రతిపక్షానికి మెజార్టీ వున్నదో లేదో గవర్నరు ఎందుకు పరిశీలించకూడదు? ప్రతిపక్షానికి మెజార్టీ శక్తి వున్నదో లేదో తీర్పు చెప్పే అహంకారానికి గవర్నరు ఎందుకు పాల్పడుతున్నట్లు? అప్పుడు తెలిసేది కదా అయిదుగురితో వున్న గ్రూపు ప్రతిపక్షంతో ఓటు చేసేదీ లేనిదీ తెలిసేది కదా! కొన్ని చిన్న చిన్న సమస్యలపై మాతో వారికి ఎలాంటి భేదాభిప్రాయాలు వున్నప్పటికీ వారు మాతోనే పూర్తిగా వుంటారని మాకు విశ్వాసం వుంది.

విశ్వాస రాహిత్య తీర్మానానికి వ్యతిరేకంగా ప్రభుత్వంతో పాటు ఓటు చేసిన అయిదుగురు సభ్యుల గ్రూపు నాయకుడు రొక్కం నరసింహారావు మంత్రి వర్గం ఓడిపోయిన తరువాత తాను ఎలాంటి మిశ్రమ ప్రభుత్వాన్ని అయినా బలపరచడానికి సిద్ధంగా వున్నానని ప్రకటించారు. ఆంధ్రా గవర్నరు శ్రీ త్రివేది ఈ విషయాన్ని ఎందుకు తన గమనంలోకి తీసుకోవడం లేదు? డాక్టర్ కట్జూ దీనిని ఎందుకు గుర్తించడం లేదు. ఆయనకు లెక్కల్లో తీసివేతలు తప్ప కూడికలు తెలియవని నేను అనుకోవలసి వస్తుంది. ఆ విధంగా చూస్తే మా తరఫున 53 మంది సభ్యులున్నారు. ఇందుకు తోడు మా మద్దతుతో గెలిచి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు చేసిన ఇద్దరు ఇండిపెండెంట్లు రాయలసీమకు చెందిన వారున్నారు. వారు ఇప్పటికీ మాతోనే వున్నారు. వారితో కలసి మా సంఖ్య 55కి చేరుకొంటుంది. ఇంక ప్రజా సోషలిస్టు పార్టీ వుంది. వారిలో మా సహాయంతో గెలుపొందిన పి.సూర్యచంద్రరావు, సుబ్బరాజు తాతగార్లు మాకు వ్యతిరేకంగా ఓటు చేయజాలరు. అలాగే మరో పి.యస్.పి. సభ్యులైన యమ్.వి. సుబ్బారెడ్డి, సిద్దన్నగార్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు చేసి వున్నారు. వారు మాకు వ్యతిరేకంగా ఉండరు. ఇంకా ప్రజాపార్టీ సభ్యులున్నారు. వారు కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు చేసిన వారు. వారు ఖచ్చితంగా మాతోనే వున్నారు.

140 మంది సభ్యులతో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడానికి 65 మంది చాలకపోతే, ప్రజా సోషలిస్టు పార్టీ నాయకుడు పి.వి.జి.రాజు చేసిన ప్రకటనను డాక్టర్ కట్జూ దృష్టికి తీసుకొనిరాదలచాను. పి.వి.జి.రాజును ఏదో విధంగా తమవైపునకు లాగాలని ప్రయత్నించి, ఇప్పుడు కూడా తన ప్రయత్నాలను కొనసాగించుతున్న హోంమంత్రి పి.వి.జి.రాజు శాసనసభా ముఖంగానే చేసిన ప్రకటనను గమనించగోరతాను. "ఇప్పటివరకూ కాంగ్రెసు ప్రభుత్వాన్ని సహించినట్లే కమ్యూనిస్టు ప్రభుత్వం కూడా సోషలిస్టు కార్యక్రమాన్ని కొనసాగించినంతకాలం సహించుతాం. దానికి మేము వ్యతిరేకంగా ఓటు చేయం." ఆయన అన్న మాటలనే నేను ఉదహరించడం లేదుకాని, ఆయన చెప్పినదాని సారాంశం మాత్రం ఇదే.

అంతేకాదు; మంత్రివర్గం 6వ తేదీన ఓడిపోయింది. ఓటింగ్ జరిగింది. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు, 7వ తేదీ ఉదయం గవర్నరు వద్దకు వెళ్ళే ముందు ఆయన తాను తీసుకొన్న వైఖరికే కట్టుబడి వుంటానని మాకు మాట ఇచ్చారు. తాను మంత్రివర్గంలో చేరబోననీ, కాని మంత్రివర్గానికి వ్యతిరేకంగా తాను ఓటు చేయబోనని చెప్పారు. మంత్రివర్గ చర్యలను దృష్టిలో వుంచుకొనే తాను ఏదైనా చేస్తానన్నారు కూడా. ప్రజా సోషలిస్టు నాయకులు అటు కాంగ్రెసుకు ఇటు కమ్యూనిస్టు పార్టీకి సమానం దూరంలో వుండాలనే సిద్ధాంతంతో – అది అసందర్భమైన అర్థం లేనిదైనప్పటికీ – వారు అందుకే కట్టుబడి వుంటారు. వారు మంత్రివర్గం అనుసరించే కార్యక్రమాన్ని చూసే ఓటు చేస్తారు. అలాంటప్పుడు ఆ ఏడెనిమిది పియస్‌పి ఓట్లు మాకు వ్యతిరేకంగా కాంగ్రెసుకే వుంటాయని ఎందుకు అనుకోవాలి? కనీసం వారు తటస్థంగానైనా వుంటారని అనుకోవాలి.

ఇంక కృషీకార్‌లోక్ పార్టీ (కె.యల్.పి.) నాయకుడు శ్రీ గౌతులచ్చన్న సంగతి చూద్దాం. ఆయనను గురించి గవర్నరు త్రివేది ఇలా చెప్పారు. "ఆయన మంత్రివర్గంలో చేరడానికి సిద్ధంగా లేరు. అయితే ఆయన కమ్యూనిస్టు పార్టీని వ్యతిరేకించబోతున్నారు." గవర్నరు చెప్పిన దానిని బట్టి చూసినా మంత్రివర్గంలో చేరాలా లేదా అని ఇంకా లచ్చన్నగారు నిశ్చయించుకోలేదు. అసెంబ్లీని రద్దు చేయాలని ఆయన కోరలేదు. రాష్ట్ర పాలనను అధ్యక్షుడు కైవసం చేసుకొంటున్నాడని పత్రికల్లో చదివినప్పుడు ఆయన ఆ ప్రకటన చేశారు. "ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం తప్ప మరొకటి కాదు" అని ఆయన తన ప్రకటనలో వ్యాఖ్యానించారు. కాబట్టి అవి 65 దానికితోడు ఎనిమిది కలిస్తే 73 అవుతుంది. అప్పుడు 139లో 73 ఓట్లు మెజారిటీకి సరిపోవా? ఇది వున్న వాస్తవిక పరిస్థితి.

సభ వారికి ఒక విషయాన్ని దృష్టిలోకి తీసుకొని రాదలచాను. పి.వి.జి.రాజు గవర్నరును కలుసుకోకముందు పూర్తిగా భిన్నమైన వైఖరిని తీసుకొన్నారు. 7వ తేదీ సాయంత్రం ఆయన గవర్నరును కలుసుకొన్న తరువాతనే శాసనసభను రద్దు చేసి నూతనంగా ఎన్నికలను జరపాలని ప్రకటన చేశారు. అందువల్లనే గవర్నరు నిష్పక్షపాతంగా వ్యవహరించకపోవడమేగాక, కాంగ్రెసు పార్టీకి పూర్తిగా అనుకూలంగా వ్యవహరించి, ప్రతిపక్షం మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడానికి అవకాశం లేకుండా ప్రయత్నం చేశారు. అవకాశం ఇచ్చి వుంటే మేము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగి ఉండేవారం.

1952 ఎన్నికల ఫలితాలను బట్టేగాక, నవంబరు 6, 7 తేదీల్లో వివిధ పార్టీల నాయకులు, వివిధ వ్యక్తులు చేసిన ప్రకటనలను బట్టి కూడా మాకు పూర్తి మెజార్టీ వుందని నేను చెప్పదలచాను. మమ్ములను ఆహ్వానించి వుంటే, అంతకు ముందు కంటే కూడా ఆంధ్రలో మరింత సుస్థిర ప్రభుత్వాన్ని నెలకొల్పి వుండగలిగి వుండేవారం.

ఒక ఉమ్మడి కార్యక్రమం ఉండే పక్షంలో వివిధ గ్రూపులతో కూడిన సుస్థిర ప్రభుత్వాన్ని నెలకొల్పవచ్చు. పి.యస్.పి., కె.యల్.పి. కమ్యూనిస్టు పార్టీల మధ్య ఒక ఉమ్మడి సిద్ధాంతం లేదన్న విషయాన్ని నేను ఒప్పుకొంటాను. "మీకు ఉమ్మడి సిద్ధాంతం ఎక్కడున్నదని" ఎవరో



ఒకరు ప్రశ్నించారు. కాంగ్రెసుకు పి.యస్.పి.తో, కె.ఎల్.పి.తో, ఇతర గ్రూపులతో కలసి ఒక ఉమ్మడి సిద్ధాంతం ఉన్నట్లు? గత మూడు సంవత్సరాలుగా కాంగ్రెసుకు, ఇతర గ్రూపులకు మధ్య గల ఉమ్మడి సిద్ధాంతమేమంటే అధికార పదవులు, ఇతర స్వప్రయోజనాలు మాత్రమే.

దీన్నలా వుంచి మాట్లాడతాను. మిశ్రమ ప్రభుత్వాల వలన చేకూరే నష్టమేమిటి? ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అంగీకృతమైన ఒక ఉమ్మడి కార్యక్రమంతో కలసి పనిచేసే దాన్ని అమలు జరిపితే తప్పేమిటి? అదేమన్నా అధికార పదవులను పంచుకోవడమా? డాక్టర్ కట్జూగారి రాజ్యాంగం ప్రకారం, ఆయన రాజకీయ సిద్ధాంతం ప్రకారం మిశ్రమ ప్రభుత్వాలన్నీ పనికిమాలినవి, నిషిద్ధమైనవా? అదే అయితే నేనొక సూటి ప్రశ్నను అడగదలచాను. 118 మంది సభ్యులున్న తిరువాన్కూరు–కొచ్చిన్ రాష్ట్రంలో 19 మంది సభ్యులు మాత్రమే గల పి.యస్.పి.కి మంత్రివర్గం ఏర్పాటు చేసే బాధ్యతను ఎలా అప్పగించారు? నిజమే! అది ముసుగును తొడుక్కొన్న మిశ్రమ ప్రభుత్వం! ప్రజల ముందు కనబడేది అధికారంలో పి.యస్.పి. కాని దాని వెనుకనున్నది కాంగ్రెస్ బలగం!

అలాంటి రకం మిశ్రమ మంత్రివర్గాలు మాకు అక్కర్లేదు. "ఇక్కడ వివిధ కార్యక్రమాలున్నాయి. ఇందులో ఫలాని విషయమై మేము అంగీకారానికి వచ్చాం. వాటిని అమలు పరుస్తామని చెప్పి శాసనసభ ముందుకు మేము వస్తాం" అని బహిరంగంగా మేము చెపుతాం.

ఆంధ్ర అసెంబ్లీలో వున్న అన్ని పార్టీల కంటే పెద్ద పార్టీని ఆహ్వానించి ప్రత్యామ్నాయ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించాలన్న రాజ్యాంగంలోని అంశాన్ని గవర్నరు ఎందుకు పాటించడం లేదు? ఈ సందర్భంగా నేను వివరాల్లోకి వెళ్లదలచాను. బ్రిటిష్ రాజ్యాంగాన్ని గురించి ఇక్కడ ఉదహరించారు. పొదుగాటి అనుకూల ఉటంకింపులను, ప్రతికూల ఉటంకింపులను ఆ సభలో (లోక్‌సభ) ఉదహరించిన విషయం మనందరికీ తెలిసిందే. బ్రిటిష్ వారి సంప్రదాయాలనే మనం ఎందుకు అనుసరించాలి? మన ఆచరణను మనం అనుసరించుదాం" అని డాక్టర్ కట్జూ సరిగానే చెప్పారు. మాటిమాటికీ బ్రిటిష్ రాజ్యాంగ సంప్రదాయాలనే వేదంలా వల్లించుతూ వుంటారు. ఇందుకు కారణం మన పార్లమెంటు ఉభయ సభల విషయంలో కూడా బ్రిటిష్ వారు అనుసరించుతున్న హక్కులను, అవకాశాలనే మన రాజ్యాంగంలో కూడా నిజానికి చెప్పి వుండటమే.

సరే, బ్రిటిష్ వారి సంప్రదాయాలు మనకు వద్దనుకొంటే, ఫ్రెంచి సంప్రదాయాలేమిటో చూద్దాం. అది కూడా పాశ్చాత్య ప్రజాస్వామికమేగాని, ప్రాచ్య ప్రజాస్వామికంగాని, జనతా ప్రజాస్వామికంగాని కాదు. అది ఫ్రెంచి మహా ప్రజల బూర్జువా ప్రజాస్వామికం. ఫ్రాన్సులో అనేకసార్లు మిశ్రమ ప్రభుత్వాలు ఏర్పడి పని చేశాయి. మిశ్రమ ప్రభుత్వం చాలాకాలం కొనసాగకపోవచ్చునని డాక్టర్ కట్జూ చెపుతున్నారు. హెచ్చుకాలం కొనసాగకపోవచ్చు. ఒకానొక మిశ్రమ ప్రభుత్వం ప్రజలకు సంతృప్తినిచ్చే కార్యక్రమాన్ని అమలు జరపలేకపోతే అందులోని

కొన్ని గ్రూపులు విడిపోవచ్చు. వారు మరొక రకమైన గ్రూపుగా ఏర్పడి కార్యక్రమాన్ని కొనసాగిస్తారు. ఫ్రెంచి రాజ్యాంగంలో ఇలా వుంది: ఎన్నికైన అసెంబ్లీని 18 మాసాలు లేదా రెండు సంవత్సరాల్లోపున రద్దు చేయరాదు. ప్రభుత్వాన్ని రెండుసార్లు ఓడించవచ్చు. మూడోసారి ప్రభుత్వాన్ని ఎవరూ ఏర్పర్చలేకపోతే అప్పుడు కూడా అసెంబ్లీని రద్దు చేసే అవకాశం అధ్యక్షునికి మాత్రమే వుంటుంది.

అలాకాని పక్షంలో తమ అభిమతానుసారం ప్రభుత్వాన్ని కొనసాగించలేమని తలచినప్పుడల్లా అసెంబ్లీ ప్రాణం మీద కత్తివేటు వేస్తుంది. "మేము అసెంబ్లీని రద్దు చేస్తున్నాం. మళ్ళీ ప్రజల తీర్పును పొందండి" అంటారు. మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుకూలంగా వారికి డబ్బు సంచులు బాగా వున్నాయి. మాటిమాటికీ మమ్ములను ఎన్నికలకు గురి చేయడం వారికి సులభం. అవతల వారికి డబ్బు సంచులు అపారంగా ఉన్నంత మాత్రాన ఎన్నికలకు మేము భయపడే సమస్య లేదు. మేము ఎక్కడున్నామో కాంగ్రెసు ఎక్కడున్నదో ఆంధ్ర ఎన్నికలు చూపెడతాయి. ఆ విషయాన్ని ఇప్పుడు తీసుకొని రానవసరం లేదు. కాని ఎన్నికైన అసెంబ్లీని రద్దు చేసే ఈ అధికారాన్ని ఒక వ్యక్తి చేతిలో వుంచడం పూర్తిగా అప్రజాస్వామికం. ఎన్నికల్లో పూర్తి మెజారిటీ రాకపోతే, ఏ పార్టీకి మంత్రివర్గం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వరాదనే గీటురాయి పెడితే అది ఒక నూతన సూత్రాన్ని జనంపై రుద్దడమే కాజాలదా?

## కొత్త సూత్రం

మద్రాసు అసెంబ్లీలో కాంగ్రెసు అనుసరించింది ఈ సూత్రం కాదు. 1952 లేదా 1954లో తిరువాన్కూరు–కొచ్చిన్‌లలో అనుసరించినది కూడా ఈ సూత్రం కాదు. 1954లో ఆంధ్రలో కూడా ఈ సూత్రానికి కట్టుబడి వుండలేదు. మరి అలాంటప్పుడు ఈ సూత్రాన్ని ఇప్పుడు ఎందుకు వర్తింపజేస్తున్నట్లు? ప్రజలు ఏ పార్టీని మెజార్టీ సీట్లలో గెలిపించలేకపోతే, ఆ పార్టీకి ఇతర గ్రూపులతో కలసి మిశ్రమ మంత్రివర్గాన్ని ఏర్పరచే హక్కును నిరాకరించే పక్షంలో ఇంక అప్పుడు కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర కాంగ్రెసు ప్రభుత్వానికి సహితం వుండే హక్కు లేదు. మీ స్వంత సూత్రం ప్రకారమే ఇది రాజ్యాంగ విరుద్ధం.

మనదేశ రాజ్యాంగ నిర్ణయ సభలో రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు ఒక్క కాంగ్రెసు పార్టీయే వుండటం దురదృష్టకరమైన విషయం. ఆ పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని రూపొందించడం, ఒక తాత్కాలిక పార్లమెంటు ఏర్పడటమూ, అందులో చేయబడిన ఎన్నికల శాసనంలో దామాషా ఎన్నిక పద్ధతికి స్వస్తి చెప్పడం జరిగింది. ఆ కారణంగా ఒక మైనార్టీ పార్టీ లోక్‌సభలోగాని, రాష్ట్ర శాసనసభలోగాని మైనార్టీ ఓట్లతో అత్యధిక మెజార్టీ సీట్లను కైవసం చేసుకొనే అవకాశం ఏర్పడింది. అందువల్లనే కేంద్ర శాసనసభలో ఈ పార్లమెంటులో కాంగ్రెసు పార్టీకి 44



శాతం ఓట్లు మాత్రమే రాగా దానిలో 75 శాతం సీట్లను గడించుకోగలిగింది. కాని ఇప్పుడు ఒక పార్టీకి పూర్తి మెజార్టీ వుంటేనేగాని దానికి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసే హక్కులేదని చెప్పడం సాహసమైన విషయం.

అలాగే, తిరువాన్కూరు–కొచ్చిన్‌లోనూ, ఆంధ్రలోనూ కాంగ్రెసు పూర్తి మైనార్టీ పార్టీయే. దానికి 30 శాతం అంతకంటే తక్కువే ఓట్లు వచ్చాయి. కాని కమ్యూనిస్టు పార్టీ ఇతర పార్టీల సహకారంతో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడానికి సంసిద్ధపడితే, రాజ్యాంగాన్ని మా మొఖం మీద కొట్టి మేము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల స్థితిలో లేమని చెప్పివేశారు. ఈ రకమైన వాదన ఎవ్వరినీ మోసగించజాలదు. ఆంధ్రలో ఏర్పడిన సంక్షోభం రాజ్యాంగానికి సంబంధించిన సంక్షోభం కాదు. ఆంధ్రలో ఏర్పడిన సంక్షోభం కాంగ్రెసుపార్టీకి సంబంధించిన సంక్షోభం. దాని దుష్ఫలితం ఆంధ్రలోని కాంగ్రెసుకేగాక, మొత్తం అఖిల భారత కాంగ్రెసుకే చుట్టుకొన్నది. అందువల్లనే అసెంబ్లీని రద్దు చేయాలని కాంగ్రెసు కోరుతున్నది. కాని ఒక విషయం చెప్పుతాను. కాంగ్రెసుకు సీట్లలోగాని, ఓట్లలోగాని పూర్తి మెజార్టీ రాదు.

కాంగ్రెసు అవినీతిని, లంచగొండితనాన్ని చేబట్టి రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నది. అయితే అది అంతటితోనే ఆగిపోదు. మంత్రి వర్గం రాజీనామా చేసినా, మరికొంత కాలం దాన్నే కొనసాగించవలసిందిగా గవర్నరు కాంగ్రెసును కోరారు. డాక్టర్ కట్జూ దానిని మంచి సంప్రదాయమంటారు. తిరువాన్కూరు–కొచ్చిన్‌లో లాగా ఇక్కడ ఆపద్ధర్మ ప్రభుత్వం ఏర్పడలేదు. ఎందువల్లనంటే దాన్ని ప్రజలు అపార్థం చేసుకొనే అవకాశం వుంది. మరో రకంగా చెప్పాలంటే దాని ప్రభావం ఎన్నికలపై పడుతుంది. ఆంధ్రలో ఆపద్ధర్మ ప్రభుత్వం లేదు. ఇది మంచి సంప్రదాయమే.

కాని నేను ఒక ప్రశ్న అడుగుతాను. కాంగ్రెసు మంత్రి వర్గానికి, ఆపద్ధర్మ ప్రభుత్వానికి మధ్య భేదమేమిటి? అలాగే కాంగ్రెసు గవర్నరుకు, కేంద్ర కాంగ్రెసుకు మధ్య భేదమేమిటి? కాంగ్రెసు ప్రభుత్వం వున్నా, కాంగ్రెసు గవర్నరు వున్నా అంతా ఒకటే. కేంద్రంలో కాంగ్రెసు ప్రభుత్వం ఉండనే ఉన్నది. అలాంటపుడు ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయని చెపితే ఎవరూ మోసపోరు. రెండింటికీ భేదమేమిటి? దొందుదొందే. పై పెచ్చు ఎన్నికలు చాలా న్యాయంగా జరుపుతామని చెపుతున్నారు. అదేమిటో ఫలితాలే తెలుపుతాయి.

## ఎన్నికలను తమకనుకూలంగా మార్చుకొనేందుకు యత్నాలు

గతవారమంతా అధికారంలో వుండేందుకు మంత్రి వర్గానికి గవర్నరు అవకాశాన్ని కలుగజేశారు. ఈలోపున ఎన్నికల్లో గెలిచేందుకు అవకాశంగా వారు చేసిన తీర్మానాలేమిటో మీకు తెలుసునా? ప్రభుత్వానికి సంబంధించిన నిబంధనలన్నింటినీ త్రోసిపుచ్చి, ఉద్యోగులకు సంబంధించి పాటించవలసిన సూత్రాలనన్నింటినీ ఉల్లంఘించి, రోడ్డు రవాణా ఆఫీసర్లను,

డెవలప్‌మెంటు ఆఫీసర్లను మూకుమ్మడిగా తమ కిష్టమొచ్చినట్లు నియమించడం, బదిలీలు చేయడం జరిగింది. అంతటితో ఆగారా? లేదు. అనేక కొత్త ఉద్యోగాలను సృష్టించి, వాటిని సర్వీసు రూల్సుకు భిన్నంగా భర్తీ చేశారు. అలాంటి ఉద్యోగాల జాబితా అంతా నా వద్ద ఇప్పుడున్నది.

ఒక్కొక్క రోడ్డు రూటును ఉపయోగించుకొనే అవకాశాన్ని కల్పించేందుకు 40 వేల రూపాయల చొప్పున తీసుకొన్నారు. అలాగే ఆంధ్రలో ఒక్కో రోడ్డు రవాణా ఆఫీసరు విలువ ఎంతో గౌరవనీయులైన సభ్యులు తమంతట తామే అంచనా వేసుకోవచ్చు. ఆంధ్రలో ఈ రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్లు, ఈ డెవలప్‌మెంటు ఆఫీసర్లు చాలరా అన్నట్లు, కొత్త పంచాయితీలను ఏర్పాటు చేయాలన్న సాకుతో మరో 27 మంది డిప్యూటీ పంచాయితీ ఆఫీసర్లను నియమించడం జరిగింది. మంత్రివర్గమే రాజీనామా చేసిన తరువాత ఇలాంటి ఆర్డర్లను జారీ చేసేందుకూ, కొత్తగా ఆఫీసర్లను నియమించేందుకూ దానికి హక్కు ఎక్కడిది?

ఇంక మద్యపాన నిషేధాన్ని గురించి గొప్పగా ప్రచారం చేస్తూ తాము మహాత్మాగాంధీ శిష్యులమని చాటుకొనే ఈ కాంగ్రెసు నాయకులు ఎన్నికల కోసం ఏమి చేశారో చూడండి! మద్యపాన నిషేధాన్ని గురించిన కొన్ని రూల్సును ప్రకటించారు. నిషేధాన్ని అమలు పరచే విషయంలో కొన్ని వెసులుబాట్లను కల్పించారు. విదేశీ మద్యపానం ఉపయోగించదలచిన వారికి డాక్టరు సర్టిఫికెట్ వుండనవసరం లేదు. కేవలం దరఖాస్తు చేసుకొంటే చాలు మంజూరు చేస్తారట. విదేశీ మద్యాన్ని స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చునని గాంధీజీ ఎప్పుడు చెప్పారో మరి? విదేశీ మద్యానికి మెడికల్ సర్టిఫికెట్ అవసరం లేదట! భారతదేశంలో తయారయ్యే మద్యానికేనట ఈ నిషేధాలు!!

మద్యపాన నిషేధాన్ని గురించి ఈ కబుర్లు ఎవరినీ మోసగించజాలవు. ధనవంతులకు తమకిష్టమొచ్చిన వాటినన్నింటినీ స్వేచ్ఛగా కొనుక్కొని త్రాగుడుకు, డాన్సులకు విచ్చలవిడిగా అవకాశం కల్పించుతారు. వారు ఏదైనా చేయవచ్చు. వారికి మెడికల్ సర్టిఫికెట్లు అవసరం లేదు కదా! కాని పేద ప్రజలు ఏదో కష్టాల్లో ఉన్నప్పుడు కొంత సేద తీర్చుకోవడానికి మాత్రం ఈ సర్టిఫికెట్లు అవసరం! మద్యపానం పాపమనీ, అది గాంధీజీ ఉపదేశాలకు వ్యతిరేకమైనదనీ, కాంగ్రెసు సిద్ధాంతానికి ప్రతికూలమైనదనీ, అది మానవత్వ విలువలన్నింటికీ విరుద్ధమైనదనీ నీతులు వల్లించుతూ వుంటారు. ఇలాంటి కాంగ్రెసు నీతులను దయచేసి ప్రజలకు చెప్పవద్దు. ఇలాంటి కల్లిబొల్లి కబుర్లతో మీరు ప్రజలను మోసగించలేరు. కాని ఎన్నికలు వస్తున్నాయి కదా అందువలన కాంగ్రెసు ఆంధ్ర ప్రజలను మోసగించాలని ప్రయత్నించుతూ వుంది.

గత రెండు సంవత్సరాలుగా నందికొండ ప్రాజెక్టుకు పోటీగా తుంగభద్ర హైలెవల్ కెనాలును పెడుతున్నది కాంగ్రెసు. నందికొండ ప్రాజెక్టు వలన 40 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి. ఇందుకోసమే ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనడానికి ప్రాతిపదిక కూడా అదే. ఈ కాంగ్రెసు వారు తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం నందికొండ ప్రాజెక్టుకు



పోటీగా తుంగభద్ర హైలెవల్ ఛానల్‌ను ముందుకు తెస్తున్నారు. దీని వలన సాగులోకి వచ్చేది దాదాపు అయిదు లక్షల ఎకరాలు మాత్రమే. ఇది చాలా చిన్న పథకం. దానిని మనం కరువు నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే డబ్బుతోనూ, మైసూరు ప్రభుత్వాన్నుండి వచ్చే సొమ్ముతోనూ నిర్మించుకోవచ్చు. కాని వారు ఆచరణలో చేసేదేమీలేదు. నందికొండ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వానికి తాము సిఫార్సు చేసినట్లు చెపుతారు. కాని కేంద్ర ప్రభుత్వం “లేదు” అని సమాధానమిస్తుంది.

ఇక్కడ ఇరిగేషన్ విద్యుత్ శాఖల డిప్యూటీ మంత్రి జైసుఖ్‌లాల్ హాథీ వున్నారు. నందికొండ ప్రాజెక్టు కావాలని కోరుతూ మాకు రిపోర్టు రానేరాలేదని ఆయన చెపుతారు. మరొక మంత్రి ఇక్కడికి వచ్చి, తాము రిపోర్టును పంపామనీ, కాని ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షునికి నందికొండ ప్రాజెక్టు ఇష్టం లేనందున అడ్డుపడుతున్నాడని చెపుతారు. ఈ బూటకానికి మించి మరో విషయం వుంది. అదేమంటే; ఆంధ్ర మంత్రివర్గం అలాంటి రిపోర్టు ఏమీ పంపలేదని కాంగ్రెసు గవర్నరు చెపుతారు. రిపోర్టు పంపినట్లు చెప్పేవన్నీ సరికాదనీ, మొత్తం విషయమంతా ఇంకా పరిశీలనలోనే ఉన్నదని ఆయనంటారు. ఈ విధమైన ధోరణితో కాంగ్రెసు వ్యవహరించుతున్నది. ఇప్పుడు నేను డాక్టర్ కట్జూను అడగదలిచాను. ఎవరు మోసం చేస్తున్నారు? ఎవరు అవినీతికి పాల్పడుతున్నారు. ఎవరు రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారు?

### రాజ్యాంగాన్ని ఉల్లంఘించుతున్న కాంగ్రెసు

కాంగ్రెసు ప్రభుత్వం వ్యవహరించుతున్న తీరు ఈ విధంగా ఉంది. తనే రూపొందించిన రాజ్యాంగాన్ని ఆది నుండి ఆఖరు వరకూ ఉల్లంఘించి, తన స్వప్రయోజనాలను సాధించుకొనేందుకు అపమార్గాలను పడుతోంది. ఈ రాజ్యాంగం వల్లనే కాంగ్రెసుకు పెద్ద మెజార్టీ వచ్చినా, దాన్ని తన అవసరాల కోసం వక్రీకరించడానికి పూనుకొన్నది. అంటే, మోసం చేసిగాని, మరొకటి చేసిగాని కేంద్రంలోనూ, అన్ని రాష్ట్రాల్లోనూ తానే అధికారంలో వుండేందుకు కాంగ్రెసు యత్నించుతుంది. ఈ విధంగా అది బ్రిటిష్ తరహా పార్లమెంటరీ ప్రజాస్వామికాన్ని, ఫ్రెంచి తరహా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని వమ్ము చేస్తున్నది.

ఇంత జరుగుతున్నా కాంగ్రెసు ప్రజాస్వామికానికి మనమంతా కట్టుబడి వుండాలని చెపుతారు. ఈ కాంగ్రెసు తరహా ప్రజాస్వామ్యాన్ని మేము అంగీకరించే సమస్య లేదు. “ప్రతిపక్షాలను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని ఆహ్వానించండి. లేదా అసెంబ్లీని రద్దు చేయండి” అని ప్రతిపక్షాలు అంటున్నట్లు హోంమంత్రి డాక్టర్ కట్జూ చెపుతున్నారు. మేము అలా ఎన్నడూ చెప్పలేదు. అసెంబ్లీని రద్దు చేయాలని నిర్ణయించినప్పుడు మేము ఇచ్చిన నినాదమిదిః– “మేము ప్రజల వద్దకు వెళ్ళి ఇలా చెపుతాం. “క్రితంసారి మీరు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఓటు చేశారు. 140 సీట్లలో కాంగ్రెసుకు వచ్చింది 40 మాత్రమే.” (కాంగ్రెసు నుండి అడ్డుసవాళ్ళు)

భారత ప్రజాస్వామికానికి మేము కట్టుబడి ఉండాలని డాక్టర్ కట్జు అంటున్నారు. నిజమే ఖచ్చితంగా మేము భారత ప్రజాస్వామికానికే కట్టుబడి వుంటాంగాని కాంగ్రెసు ప్రచారంలో పెడుతున్న ప్రజాస్వామికానికి మాత్రం కాదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మమ్ములను ఆహ్వానించనైనా ఆహ్వానించండి; లేదా శాసనసభను రద్దు చేయండని మేము ఎన్నడూ అనలేదు. మొట్టమొదటి నుండీ మేము చెపుతున్నది ఒకటే. ఒకసారి మంత్రివర్గం ఓడిపోతే, ప్రతిపక్ష నాయకుణ్ణి, అసెంబ్లీలో అన్నింటికంటే పెద్ద పార్టీగా వున్న దానిని ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని గవర్నరు కోరాలని మాత్రమే. అంతేకాదు, మాకు అలాంటి అవకాశం ఇస్తే, మూడు రోజుల్లోనే శాసనసభను సమావేశపరచి, మెజార్టీని నిరూపించుకొంటామని తెలిపాం. (అడ్డు సవాళ్ళు)

**ఆపద్ధర్మ ప్రభుత్వం ఆవశ్యకతకే**

ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ పాలనా బాధ్యతను రాష్ట్రపతి తీసుకోవాలని నిర్ణయించినప్పుడు, న్యాయంగానూ, స్వేచ్ఛగానూ ఎన్నికలు జరగాలంటే ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని నెలకొల్పాలనే నినాదాన్ని మేము ఇచ్చాం. ఇంక ఇప్పుడు డాక్టర్ కట్జూ వచ్చి ఇలా అంటున్నారుః "ఆపద్ధర్మ ప్రభుత్వం ఎలా వుండగలదని" ప్రశ్నించుతున్నారు. కాంగ్రెసు– కమ్యూనిస్టు పార్టీలలో ఒకటంటే మరొకటి గిట్టదు. వారుభయులు ఒకే మంత్రివర్గంలో వుండటానికి సంసిద్ధపడరు. పి.ఎస్.పి. కమ్యూనిస్టు పార్టీల మధ్య స్నేహభావం లేదు. ఆ రెండు పార్టీల సిద్ధాంతాలే విభిన్నమైనవి. అలాంటప్పుడు అంగీకారం ఎలా వుండగలదు? ఆపద్ధర్మ ప్రభుత్వంలో వుండాలా లేదా అన్న విషయమై కె.ఎల్.పి. ఒక అభిప్రాయానికి రాలేకపోతున్నది". అయితే, ఈ రోజున గవర్నరు ముందు కె.ఎల్.పి. నాయకుడు చేసిన ప్రకటనను హోంమంత్రి చదివి వినిపించారనుకోండి. కాని కె.ఎల్.పి. ప్రతినిధి ఆ ప్రకటన సరికాదని చెపుతున్నారు. ఇందుకు ఆయన సమాధానమిస్తారు. ఈ డాక్యుమెంట్లన్నీ ఎక్కడ నుండి వస్తున్నాయో తెలియడం లేదు.

అన్ని పార్టీలు ఆపద్ధర్మ ప్రభుత్వంలో చేరడానికి సిద్ధపడతాయో లేదో అది వేరే విషయం. ఇప్పుడేమో నూతన సంప్రదాయాన్ని నెలకొల్పడానికి యత్నించుతున్నారు. ఒక మంత్రివర్గం ఓటమి చెందితే, మళ్ళీ ఎన్నికలు జరిగేంత వరకూ ఆపద్ధర్మ ప్రభుత్వం ఉండాలనే సంప్రదాయం ఒకటున్నది. సరే ఒప్పుకొందాం. అయితే, గవర్నరును ఒక నియంతగా ఎందుకు చేయదలచారు? ఆపద్ధర్మ ప్రభుత్వం కిందకంటే ఒక వ్యక్తి యాజమాన్యంలో ఎన్నికలు న్యాయంగా జరుగుతాయనే హామీ ఎక్కడున్నది? ఏ ఒక్క నూతన పాలసీని రూపొందించి అమలు జరపకుండా ఎన్నికలు జరిగేంత వరకూ అన్ని పార్టీలతో కూడిన ఒక తాత్కాలిక ప్రభుత్వం వుంటుంది. కనీసం న్యాయంగానూ, స్వేచ్ఛగానూ ఎన్నికలు జరిగేటట్లు చూడటానికి ఆ ప్రభుత్వం ఉంటుంది. అసెంబ్లీలో వున్న అన్ని పార్టీలకు ఆ ప్రభుత్వంలో ప్రాతినిధ్యం వుంటుంది. అలాంటి ఆపద్ధర్మ ప్రభుత్వం ఎందుకుండరాదు? కనీసం అలాంటి ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి ప్రయత్నమైనా జరిగిందా? లేదు. కనీసం అందుకు ప్రయత్నం కూడా



చేయలేదు. అలాంటి ప్రయత్నం జరిగితే, కొన్ని పార్టీలు చేరబోమంటే, చేరకపోనివ్వండి. కాంగ్రెసు పార్టీకి అలాంటి మంత్రివర్గంలో వుండటానికి ఇష్టం లేకపోవచ్చు. అంత మాత్రాన ఏమైపోతుంది? వాళ్ళకు వాళ్ళ గవర్నరున్నాడు. పైన కేంద్రంలో వారి ప్రభుత్వమే వుంది.

ఆపద్ధర్మ ప్రభుత్వం ఉండటం తప్పనిసరిగా వుండాలని నేను ఎందుకు చెపుతున్నాను? అసెంబ్లీ రద్దు చేయబడిన తరువాత మంత్రివర్గం ఓడిపోయిన తరువాత ఎన్నికలు న్యాయసమ్మతంగా జరగాలంటేనూ, ఎన్నికలు నిజంగా స్వేచ్ఛగా జరుగుతాయన్న హామీ ప్రజలకు కల్పించాలంటే ఏదో ఒక్క పార్టీకి అన్యాయం జరగరాదనుకొంటే కనీసం ఒక ఆపద్ధర్మ ప్రభుత్వం వుండటం కనీస హామీగా వుండగలదు. ఈ విషయాన్ని గురించి కనీసం పరిశీలించనైనా లేదు. డాక్టర్ కట్జూ ఆ సభలో (లోక్‌సభ) మాట్లాడుతూ "ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతాయనీ, న్యాయంగా జరుగుతాయనీ, సాధ్యమైనంత త్వరలో జరుపుతామని" చెప్పారు.

ఆయన ఇచ్చిన ఈ హామీకి ఎంత విలువ ఉన్నదో ఆలోచించుకోవచ్చు. ఆంధ్రలో ఎలాంటి పరిస్థితులు వున్నాయంటే కాంగ్రెసు పత్రికలు ఇప్పటికే దౌర్జన్య చర్యలను రెచ్చగొట్టడం జరుగుతోంది. ఈ సందర్భంగా ఈ సభా వేదిక ముఖంగానే ఒక విషయాన్ని చెప్పదలచాను. ఈ ప్రభుత్వం పరాజయం పొందడానికి ఆరు నెలల ముందుగానే సంజీవరెడ్డి, గోపాలరెడ్డి గార్లు రాష్ట్ర వ్యాపితంగా జరిపిన కాంగ్రెసు కార్యకర్తల సమావేశాల్లో ఇలా చెప్పడం జరిగింది– "మీరు ఎందుకు భయపడతారు? కమ్యూనిస్టులను చితకబాదండి. పోలీసులు మనతోనే ఉన్నారు. ప్రభుత్వమూ మనతోనే వుంది."

ఇప్పుడేమో కాంగ్రెసు కమ్యూనిస్టులు దౌర్జన్య చర్యలను సాగిస్తున్నారనే ప్రచారం చేసి వాటిని అరికట్టడానికి చర్యలను తీసుకోబోతున్నారు. గత ఆరు మాసాలుగా కాంగ్రెసు నాయకులు ఇచ్చిన ఈ సలహాలను భూస్వాములు తీసుకొని, అప్పుడే మా కామ్రేడ్స్‌లో ముగ్గురిని హత్య చేశారు. మేము భూస్వాములం కాదు కదా! మా వద్ద గూండాలు వుండరు కదా. మా వద్ద సైన్యం లేదు కదా. మాకు అండగా పోలీసులు లేరు కదా. అందువలన సహజంగానే ఈ విధంగా మేము బాధలు పడవలసిందే కాని స్వేచ్ఛగానూ, న్యాయంగానూ ఎన్నికలు జరపాలని మాత్రమే నేను కోరుతున్నాను. అలాంటి దౌర్జన్య చర్యలకు దిగరాదని మాత్రమే నేను చెపుతున్నాను.